మతసమాజాలు : మహిళలు

రచన :

మల్లాది సుబ్బమ్మ

మల్లాది పబ్లికేషన్సు
9, ఎమ్. ఐ. జి. హెచ్. కాలనీ,
మెహిదీపట్నం,
హైదరాబాద్ - 500 028

మల్లాది పబ్లికేషన్సు నెం. 2

మతసమాజాలు : మహిళలు

1987 జనవరి

పబ్లిషర్సు : మల్లాది పబ్లికేషన్సు,
9, ఎమ్. ఐ. జి. హెచ్. కాలనీ,
మెహిదీపట్నం,
హైదరాబాద్ - 500 028


సోల్ డిస్ట్రిబ్యూటర్సు :
వికాసం
9, ఎమ్. ఐ. జి. హెచ్. కాలనీ,
మెహిదీపట్నం - 500 028
ఫోన్ : 35429

వెల : రు. 60.

ముద్రణ :
లిబర్టీ ప్రింటర్సు, చీరాల
తెలుగునాడు ప్రింటర్సు, చీరాల.

జ్ఞాపకార్థం

అపి మరపురాని స్మృతులు. ఆ రోజులు వేరు. ఆ ప్రేమలు వేరు. అది నలభై ఏళ్ళ అనుబంధం. నా శ్రేయస్సు కోరిన వాత్సల్య బంధం. నన్ను ఇంతగా తీర్చిదిద్దిన భవ బంధం.





శ్రీ మల్లాది సోమసుందరం   శ్రీమతి మల్లాది కామేశ్వరమ్మ

ఆదొక విధమైన సహజీవనం. అందులో కష్టసుఖాలెన్నో ఉన్నాయి. మరచిపోలేని ఘట్టాలెన్నో జరిగిపోయాయి. 13 ఏళ్ళ వయస్సులో వారియింట అడుగుపెట్టాను. కూతురుగా అభిమానించారు. కోడలుగా మలుచుకున్నారు. వారు సనాతనులు. మహా నిష్ఠా గరిష్ఠులు. ఉద్యోగ నిర్వహణలో, జీవిత విధానంలో ఆత్మాభిమానం, ధర్మ నిబద్ధత, ఉత్కృష్ట కార్యాచరణ వారికి పెట్టని కోటలు. వారిలో మానవత తొణికిసలాడేది. మా సిద్ధాంతాలు వేరయినా నా శ్రేయస్సును కాంక్షించి నా భవిష్యత్తుకు బాటలు వేసిన మాననీయులు, అసాధారణ వ్యక్తులు అయిన నా అత్తమామలకు కృతజ్ఞతా గౌరవాలతో ఉడతా భక్తిగా ఈ గ్రంథాన్ని సమర్పించు కుంటున్నాను.

అవగాహన

ఏ పరిశోధనా గ్రంథం వ్రాయాలన్నా, ఏచరిత్ర పరిశీలించాలన్నా, ఏ వ్యవస్థను వివరించాలన్నా సమాజంలో సగభాగమైన స్త్రీల పరిస్థితి గురించి ముందుగా సమాచారం సేకరించాలి అది ఆర్ధిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో పెనవేసుకొని ఉంటుంది. దానిని విడదీసి ముందుగా అధ్యయనం చేయాలి. సామాజిక, మతపరమైన లక్షణాలను విశ్లేషించాలి. ఒక లక్ష్యసిద్ధితో ఆనాటి పరిస్థితులను ఆకలింపుచేసుకోవాలి. అవి ఈనాటికి ఎందుకు పనికిమాలినవి అయ్యాయో వివరించ గలగాలి.

అది బృహత్తర ప్రణాళిక. ఎంత చేసినా ఇంకా కొంత మిగిలి పోతుంది. కనుక కష్టసాధ్యం. అంతేగాదు మరొక అంశం గమనించతగినది. విషయ సేకరణలోగాని, రచనలోగాని, ప్రజలకు అందించే సందేశముల్లో కాని అసలు విషయానికి (సబ్జక్టుకు) న్యాయం చేయాలి. ఏ పరిస్థితుల్లోను పక్షపాత వైఖరి పనికిరాదు చరిత్రను వక్రీకరించటానికి ఏ రచయితకూ అధికారం లేదు. ఇలా అన్నంత మాత్రాన తన అభిప్రాయ ప్రకటనకు రచయితకు స్వాతంత్ర్యం లేదని భావించరాదు. వ్యాఖ్యానం చేయటం, భాష్యం చెప్పటం అతని లేక ఆమె హక్కు. ఈ అంశంపై రాజీ లేదు. తను నమ్మిన భావాన్ని నిర్భయంగా, నిర్మొగమాటంగా, నిస్సంకోచంగా తెలియజెప్పటం రచయిత విధి; కర్తవ్యంకూడాను.

భారతదేశంలోని ముఖ్యమైన మూడు మతాలు హైందవం, ఇస్లాం, క్రైస్తవం, స్త్రీల పట్ల ఎలాప్రవర్తిస్తున్నాయో వివరించటానికి అవతరించింది ఈ గ్రంథం. స్త్రీల యెడ వైఖరి విషయంగా ఈ మతాలన్నింటిలో సామ్యాలు, పోలికలు ఎక్కువగా కన్పడుతున్నాయి. పురుషాధిక్య సమాజాన్ని కొనసాగించటానికీ, స్థిరపరచటానికిఇవి ఉపకరిస్తూనే ఉన్నాయి. ఈనాటి సమాజానికి, అనువుగాలేవు ఈమతధర్మసూత్రాలు. కనుక వాటినిమౌలికంగా మార్చవలసిన ఆవశ్యకతఉదయించింది. దానిని విశదీకరించటమే ఈ గ్రంథం యొక్క ముఖ్యోద్దేశ్యం.

రచయిత :

మల్లాది సుబ్బమ్మ.

హైందవం : స్త్రీలు

ఈ పుస్తకంలో ఇదీ వరస

1.	నా సాహితీ యాత్ర గురించి	...	5
2.	ఆలోచన	...	9
3.	ఎందుకీ గ్రంథం, ఎవరికోసం ఈ రచన?	...	13
4.	స్త్రీ మూర్తిత్వం	...	21
5.	జననం, బాల్యం, విద్య	...	44
6	వివాహం	...	59
7.	వైవాహిక జీవితం	...	82
8	వైధవ్యం	...	112
9.	విడాకులు : పునర్వివాహం	...	127
10.	జారత్వం, వేశ్యలు, దేవదాసీలు	...	131
11.	ఆస్తిహక్కు	...	145
12	మనవర్తి, దత్తత	...	163
13.	మైనారిటీ, సంరక్షకత్వం	...	168
14	భ్రష్టలు, బందీలు	...	171
15.	ఆర్థిక, రాజకీయాలు	...	177
16.	హైందవ విశిష్టత	...	183
17	అధునిక వైజ్ఞానిక దృక్పథం	...	192
18.	హిందూ శాసనాలు	...	204
19	మదింపు, ముగింపు	...	223
20.	పరిశీలించిన గ్రంథాలు	...	224

పారిపోలేని ఖైదీల లాంటి మన స్త్రీల ఈ పరిస్థితికి మూలకారణమేమిటి
అని ప్రశ్నిస్తే-

స్త్రీల ఈ భావనకు ప్రాతిపదిక ఈ నాటిది కాదు. తర తరాలుగా యుగ యుగాలుగా 'తాను తక్కువ పురుషుడెక్కువ' అనే భావం స్త్రీ పురుషులిద్దరిలో జీర్ణించి పోయింది. అందుకే ఇరవై ఏళ్ళ అమ్మాయి. కూడా పదమూడు ఏళ్ళ అబ్బాయిని తన వెంట తోడు తీసుకొని వెళుతుంది. బలాత్కరిస్తుంటే తాను అబలనని, బలహీనురాలనని తలంచి మిన్నకుంటుంది ఎన్ని డిగ్రీలున్నా భర్త తల వంచి మెళ్ళో తాడు కట్టించుకుంటుంది. భర్త కన్నా పెద్ద చదువు, ఉద్యోగం కోదుకోదు. ఆస్తులన్నీ భర్త పేరనే పెట్టిస్తుంది ఇంటి చాకిరీకి, పిల్లల పెంపకానికీ ఇష్టపడుతుంది. ఈ అస్తిత్వానికి బీజాలు రుగ్వేదం లోనే పడ్డాయి. "ఓ దేవా! నాకు మగ బిడ్డను ప్రసాదించుము." అనే రుక్కు రుగ్వేదంలో దర్శనమిస్తుంది. క్రమేపి ఇంకా మారుతూ స్త్రీల స్థితి ఇతిహాసాల నాటికి శోచనీయంగా దిగజారి పోయింది. ఉదాహరణలు కోకొల్లలు భర్త గ్రుడ్డి వాడయితే గాంధారి కళ్ళకు గుడ్డకట్టుకుంది. భర్త ఆజ్ఞ ప్రకారం కుంతి పరాయి పురుషులకు బిడ్డల్ని కన్నది. ద్రౌపది అత్తగారి ఆదేశం ప్రకారం పాంచాలి అయింది. చంద్రమతి అమ్ముడు పోయింది. సీత అగ్ని ప్రవేశం చేసింది. అసలు తప్పు ఇంద్రుడిది అయినా శాపం వల్ల అహల్య రాయిగా మారింది. తండ్రి ఉత్తరువు మేరకు తన తల్లిని నరికి వేశాడు పరశురాముడు కామించిన శూర్పణఖను నేరస్తురాలిగా నిరూపించి ఆమె ముక్కు చెవులు కోయటం న్యాయమన్నారు. భర్త కోరిక మేరకు సుమతి మగనిని వేశ్యకు అర్పించింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఇలాంటివి ఎన్నో మరెన్నో ఉన్నాయి

మను ధర్మ శాస్త్రం, కుమారీ శతకం ఆంధ్ర హిందూ స్త్రీలకు శిరోధార్యాలయినాయి. భారత దేశ సంస్కృతి సింహళ దేశానికి వ్యాపించింది. మనకందరికి తెలుసు. ఒక సనాతన సింహళ బ్రాహ్మణుడు తన కుమార్తె వివాహ సమాయాన అమెకు చేసిన హిత బోధ 15 వ శతాబ్దపు 'కావ్య శేఖర' అనే కావ్యంలో పద్య రూపకంగా పొందు పరచడం జరిగింది. ఆ పద్యాలలో కొన్నింటిని తొమ్మిదవ తరగతి బాలికల పాఠ్య పుస్తకాలలో చేర్చారు. ఆ హిత బోధ ఇలా సాగింది :-

'నీ భర్త అనుమతి లేకుండా నీవు ఇల్లు విడిచి పోరాదు. వీధిలో నడిచేటప్పుడు చేక చకా అడుగులు వేయవద్దు. ఆ పాద మస్తకం నిండుగా ఉచిత రీతిలో వస్త్ర ధారణ చేయాలి. నీ భర్తకు, అత్త మామలకు, అతని బంధువు

కుల దాసిలా సేవ చేయుము. చంచల చిత్తలైన వేశ్యలతో, దొంగలతో, దాసీ జనంతో, నటీ సమూహంతో, నాట్య గత్తెలతో, పుష్ప లావికలతో, రజక స్త్రీలతో చెలిమి చేయవద్దు. నీ ఇంటిని, తోటను ప్రతి దినము ఊడ్చి శుభ్రంగా ఉంచుము. ఉదయం, సాయంత్రం సంధ్యా కాలంలో దేవునికి దీపారాధన చేసి తదుపరి భుజించుము. నీ భర్త ఊరి నుండి తిరిగి వచ్చినప్పుడు అతనికి సంతోషంతో స్వాగతమిమ్ము. అతనికి పాద ప్రక్షాళన చెయ్యి; ఆ పనిని దాస దాసీ జనాలకు అప్పగించవద్దు.

వీధివాకిట నిలబడికాని, తోటలలో విహరిస్తూ కాని, ఇంటి పనులను పోమరితనంతో నిర్లక్ష్యం చేస్తూ కాని కాలాన్ని వృధా చెయ్యకు. నీ ఇంటి సామానులు భద్రంగా కాపాడుము. నీ భర్త అనుమతి లేనిదే ఏ వస్తువులను ఎవ్వరికీ - కనీసం నీ సంతానానికి కూడా - ఇవ్వతగదు. ఒకవేళ నీ భర్త తన ప్రేమను ఒరులపై ప్రసరింప జేసినచో ఆయనతో ఈ సంగతి ప్రస్తావించ వద్దు. నీ చింతకు ప్రతీకగా నీ కన్నీటి ధార మాత్రమే మిగిలిపోవాలి.

ఆహార విషయంగా నీ భర్త ఇష్టాయిష్టాలను గమనించుము. ఆయన తృప్తి చెందేటట్లు ఆహారం పెట్టి అతనిని తల్లిలా పోషించుము. నీవు రంగు రంగుల పట్టు వస్త్రములు ధరించి, సొమ్ములు పెట్టుకొని, అలంకరించుకొని, సుగంధ ద్రవ్యాలు మేన నలముకొని దేవతా స్త్రీ వలె సౌందర్యంతో విలసిల్లుతూ భర్త దరి చేరవలెను. ఇంట్లో అందరికన్నా చివరి మనిషిగా నిద్రించుము; అందరికన్నా ముందుగా మేల్కొనుము. భర్త నిద్ర లేచే టప్పటికి నీవు అతని చెంత వుండవలెను. నీ భర్త నీపై ఆగ్రహించినా, ఉదాసీనత ప్రదర్శించినా, దయను, క్షమను ప్రదర్శించాలి గాని అతనితో పరుషంగా మాట్లాడకు: నీ సుఖం కోసం నీ భర్తను గాక మరెవ్వరినీ ఆశ్రయించవద్దు.

ఈ నీతులతో వారి వారి సంప్రదాయాలను బట్టి కొద్ది తేడాలతో అన్ని కాలాలలో ఆడవారికి 'బ్రెయిన్ వాష్' వేయబడింది. క్రమేపీ ఆ సనాతన భావాలను జీర్ణించుకున్న మన మహిళలు అవి తమ సంస్కృతికి చిహ్నాలుగా, ఉన్నతాశయాలుగా భావించి తమకు తామే ఆమోదించి ఆచరిస్తున్నారు. ఇదీ భారతనారి చరిత్ర. అందువల్లే సహగమనాలు, బాల్యవివాహాలు, వరకట్న మరణాల లాంటివి ఇంకా జరుగుతూనే ఉన్నాయి. భర్త లేని స్త్రీకి ఆనాడు సహగమనం ధర్మ సమ్మతమయితే నేడు కూడా ఆమెను చిన్నచూపు చూస్తున్నారు. అక్కడక్కడా ఇంకా వితంతువును కురూపిని చేసి ఆనం దిస్తున్నారు. మారుతున్న నాగరికత, శాస్త్ర విజ్ఞానాలతో పాటు మహిళల మనస్తత్వాలు కాని పురుషుల పైఖరి కాని మారలేక పోతున్నాయని తేలుతున్నది.

ఈ మానసిక దాస్యానికి మూలం పురాతన సంస్కృతి అని చెప్పక తప్పద హైందవ సంస్కృతిలో స్త్రీ స్థానాన్ని, స్థాయిని గుర్తించి ఆనాటి సంస్కృతి స్పష్టంగా, సాధికారికంగా వివరించటానికే ఇంత ప్రయత్నం చేయాలి వచ్చింది. అంత గాఢంగా మన మనస్సులలో ముద్రలు వేసుకున్న ఆనా ధర్మశాస్త్రాల సారం, సంప్రదాయాల బలం ఒక్కసారిగా పోదు. అది చా సంక్లిష్టమైన పని. ఆ చిలుమును వదిలించటానికి ఒక సంస్కర్త గాని ఒక సంస్కారి గాని చాలరు; ఒక దశాబ్దం చాలదు. మహిళాభ్యుదయ గాముల అందరూ ఐక్యతతో ఎలుగెత్తి చాటాలి. సంఘాలుగా ఏర్పడాలి. పోరాటాల సలపాలి. త్యాగాలకు సిద్ధపడాలి. ఎడతెగని పోరాటం సాగించాలి. ప్రత్యా ఘాత శక్తులు వినాశానికైనా ఇష్టపడతాయి గాని గద్దె దిగవు. అయినా పట్టు విడువని రీతిలో ఉద్యమాన్ని నడపాలి. బాధితులు అగ్రభాగాన నిలిచి సర్వశక్తులూ వినియోగించాలి. ఇది స్త్రీల విముక్తి ఉద్యమంగా తయారయితేనే విజయాన్ని సాధించగలం. పాత ఆచారాలను ధ్వంసం చేయడం ఎంత కష్టమో ఆధునిక భావాలను జొప్పించటం అంతకన్నా కష్టతరం. అయినా ఎప్పుడో ఒకప్పుడు ఆ పని జరగాలి కదా! అందుకే ఈ గ్రంథరచన చేయాల్సి వచ్చింది.

ధన్యవాదాలు :-

హైందవ సంస్కృతి మారాలని, హిందూమత భావాలు ఈనాటి సమాజాభివృద్ధికి గొడ్డలి పెట్టనే ఉద్దేశ్యంతో ఈ గ్రంధ రచనకు నన్ను పురి కొల్పింది నా సహజీవన కార్యకర్త, అఖిల భారత హ్యూమనిస్టు సంఘానికి, ఇండియన్ రేషనలిస్టు సంఘానికి అధ్యక్షులుగా ఉన్న ఎం. వి. రామమూర్తి గారు. "ఇంతకు ముందు 'ఇస్లాం : స్త్రీలు', 'క్రైస్తవం : స్త్రీలు' వ్రాశావు. 'హైందవం : స్త్రీలు' వ్రాయకపోతే అది లోపభూయిష్టం, అసంపూర్ణం అవుతుంది" అనే భావాన్ని వెలిబుచ్చి ఆయన తన సహాయ సహకారాలను అందించారు. నేను ఆయనకు అందుకు ఋణపడి ఉన్నాను.

ఈ పుస్తకం నా గ్రంథ పరంపరలో 31 వది. వరుసగా, అవిచ్ఛిన్నంగా గ్రంధ ప్రచురణ చేయటానికి నాకు ఎంతో చేయూతను ఇచ్చిన నా బిడ్డలు కె. ఆర్. మల్లాది, ఎం. జి. కె. మూర్తి, వి. మల్లాది, పర్సా విజయలక్షిలను అభినందించకుండా ఉండలేను.

ముద్రణా వ్యవహార భారాన్ని మోసిన మిత్రులు రాజారెడ్డిగారికీ, అమూల్య గ్రంధాలను సేకరించి అందించిన అనేకమంది హితులకు నా ధన్యవాదాలు.

రచయిత

ఆలోచన

మానవజాతి శైశవాన్ని దాటింది. బాల్యావస్థను అధిగమించింది. యౌవనదశలో ప్రవేశించింది. దాని శక్తియుక్తులు వికసించాయి. గ్రహాంతర యానాన్ని సాధించింది. దూరశ్రవణ, దూరదర్శనాది సాధన సంపత్తులను చేకూర్చుకుంది. సూక్ష్మదర్శనాన్ని తన స్వంతం చేసుకుంది. మానవ దేహ విభాగాలకు ప్రత్యామ్నాయాలను సంతరించుకుంది. వాటికి విడిభాగాలను సరఫరా చేసుకుంటున్నది. జీవోత్పత్తి క్రమాన్ని సూత్రప్రాయంగా తెలుసుకున్నది. స్త్రీ పురుష సంయోగంతో నిమిత్తం లేకుండా పిండోత్పత్తికి బాటవేసింది. కృత్రిమ గర్భధారణను సుగమం చేసింది. మానవ బుద్ధి చేసే పనులలో కొన్నింటిని యంత్రాల సాయంతో నెరవేరుస్తున్నది. అంటే ఆలోచనాక్రమంలో కొంతభాగాన్ని యంత్రాలకు కట్టబెట్టింది. ఒకనాడు చేతులతో, కాళ్ళతో చేసేపనులను యంత్రాలద్వారా చేయగల్గిన మానవజాతి ఈనాడు మెదడుతో చేసే కార్యాలను యంత్రాలద్వారా సాధించగలుగుతున్నది. ఈ ప్రగతిని మంచికి వినియోగిస్తుందా? లేక చెడును సాధ్యం చేయటానికి వాడుతుందా? అనేది వేరేప్రశ్న. అది మానవజాతి సంస్కృతీ స్థాయిపై ఆధార పడుతుంది.

ఈ దశలో స్త్రీ పురుషుల సంబంధాలు ఎలా ఉండాలనేది విచారణీయాంశం. ఈ సమస్యకు సమాధానం మన విజ్ఞానంపై ఆధారపడుతుంది. శారీరక విషయంగా కొద్దిపాటి మార్పు తప్ప స్త్రీ పురుషులలో తేడా లేదు. మెదడుయొక్క నిర్మాణంలో హెచ్చులొచ్చులు లేవు. జ్ఞాపకశక్తిలో, ఆలోచనలో, ఊహలో స్త్రీ పురుషునికి తీసిపోదు.

ఈనాటి సామాజిక స్థితిని గమనిస్తే పురుషుడుచేసే ప్రతి పనినీ స్త్రీ చేయగలదని తేటతెల్లమయింది. స్త్రీ కూడా గ్రహాంతర యాత్రచేసి తిరిగి వచ్చింది. స్త్రీలు శాస్త్రజ్ఞులుగా విలసిల్లుతున్నారు. రాజ్య పరిపాలకులుగా భాసిల్లుతున్నారు. సాహితీ పరులుగా, కళాకారులుగా పేరు తెచ్చుకుంటున్నారు. వారు ప్రవేశించని సామాజికరంగం లేదు.

ఇది బుద్ధికి ప్రాధాన్యత ఇచ్చేకాలం. బుద్ధి కుశలతకు పెద్ద పీటనే రోజులివి. కండబలానికి విలువ తగ్గింది. ఈనాడు పది పన్నెండుమ సంతానాన్ని కనే స్త్రీ బలహీనురాలవుతుందని, వారిని పెంచి పోషించడం ఆమె ఎక్కువ కాలాన్ని అంటే 20 లేక 24 ఏండ్లు అందుకు వినియోగిం లని పూర్వం తలచేవారు. పరిస్థితులు మారాయి. అసలు అంతమ పిల్లల్ని కనవలసిన అవసరంలేదు. పైగా అది ప్రపంచానికే ప్రమాదకర ఇక వ్యక్తిగతంగా స్త్రీ విషయం వేరే చెప్పనక్కరలేదు. ఆమె జీవితకా అంతా పిల్లలను కనిపెంచటంతో సరిపోతుంది. ఆమె ఎంతసేపూ ఇతర కోసం జీవించటమే కాని తనకొరకు జీవించటానికి ఆస్కారం లేదు. ఆ సంతానోత్పాదన యంత్రమవుతుంది. ఆ స్థితిని ఆమె ఇపుడు ఆమోదించే లేదు. తనకు ఇష్టమయితే ఆమె ఒకబిడ్డకో లేక ఇరువురికో జన్మను ఇస్తుం ఆమెకు ఆ విషయంలో సర్వాధికారం, తన దేహంపై తనకు పెత్తన కావాలని ఆమె కోరుతున్నది. అది సహజమైన కోరిక; న్యాయమైనమా

ఒకరినో, ఇద్దరినో పిల్లలను కనే స్త్రీ బలహీనురాలు కానేరదు ప్రసవంవల్ల ఆమె బాధపడదు. శరీరారోగ్యాన్ని కాపాడుకునే శక్తి స్త్రీ పురుషునికన్నా 10 శాతం ఎక్కువయని అధునిక విజ్ఞానం చెపుతున్నది కనుక ఎట్టి పరిస్థితులలోను పురుషుడు స్త్రీ కన్నా బలవంతుడుగా చలామ కాపటానికి వీలులేదు. మరోవిషయం గుర్తుంచుకోవాలి. స్త్రీ [illegible] బిడ్డల్ని కనగలరు. సత్యమే. కాని బిడ్డలను పెంచటం తల్లితో చేయనక్క లేదు. తల్లిదండ్రులిరువురూ ఆ విషయంలో సమర్థులు. తండ్రి కూడా పి లను పెంచగలడు. ఈ సత్యాన్ని స్వీడను దేశం గుర్తించింది, పిల్ల కలుగగానే తల్లిదండ్రులు ఇరువురుకలసి 180 రోజులు సెలవు తీసుకోవచ్చు నని నిబంధనను ఆమోదించారు. ఎవరు ఎన్నిరోజులు సెలవు తీసుకోవాలో వారిలోవారు తేల్చుకుంటారు. అదిగాక భార్య ప్రసవకాలంలో భర్తకు 10 రోజులు జీతంమీద సెలవుఇస్తారు. ప్రతి పిల్ల పుట్టినప్పటినుండి బడికి వెళ్ళే వయస్సు వచ్చేవరకు, ఈ కాలంలో, అదనంగా తల్లిదండ్రులు పిల్ల లను పెంచే నిమిత్తం 180 రోజులు జీతంతో సెలవు తీసుకోవచ్చును. అదీ గాక తల్లిదండ్రులలో ఎవరో ఒకరు అనారోగ్యంగా ఉన్న బిడ్డను చూచు కోవటానికి 60 రోజులు జీతంతో సెలవు ఇస్తుంది యాజమాన్యం. అంటే

తల్లికిగాని, తండ్రికిగాని బిడ్డ బిడికి వెళ్ళలోపల 360 రోజుల సెలవు ఉంటున్నదన్నమాట. పిల్లలను పెంచే బాధ్యతను తండ్రి స్వీకరించాలని ఈ నియమాల భావం. ఇలా బిడ్డను కనడంవేరు, బిడ్డలను పెంచడం వేరు అని తేలిపోయింది.

ఇలా వస్తున్న మార్పులకు, ఆలోచనలలో, భావాలలో వస్తున్న పరిణామానికి సమాజం స్పందించవలసి వుంటుంది. కాని అలా జరగటంలేదు. పాతకాలపు అభిప్రాయాలే ఇంకా అనేక దేశాల్లో చెల్లుబాటు అవుతున్నాయి. మనదేశం ఈ సూత్రానికి మినహాయింపుకాదు. మనదేశంలో హిందూ సమాజం రెండువేల ఏండ్లనాటి భావాలతో మసుగడ సాగిస్తున్నది. ఈ మార్పును అంగీకరించక పోవటానికి రెండు కారణాలు కన్పడతాయి, ఒకటి పురుషజాతి స్వార్థం. అది అమలు, లేకపోతే పాతభావాల ప్రాబల్యం. ఇది రెండవ అంశం, పాత భావాలు మతంపై ఆధారపడుతున్నాయి. మతం ఆయా సామాజిక పరిస్థితులనుబట్టి రూపొందటం జరిగింది. దేశ, కాలాలు సామాజిక స్థితిని నిర్ణయిస్తాయి. ఆయా కాలపు జ్ఞానం, ఆ ప్రజానీకపు సంస్కృతి, మత రూపురేఖలను, తీర్చిదిద్దుతాయి. పాతభావాలను ఈనాటితో పోలిస్తే అనేక విషయాలలో అజ్ఞానాన్ని ప్రాతిపదికగా కలిగి ఉంటాయి. పురుషాధిక్యతాభావం అలాంటిదే. దానికి మత ప్రామాణ్యతను సంతరించి పెట్టారు. ఆ మతాన్ని ఈనాడూ అనుసరిస్తూ, స్త్రీ పురుష సమానత్వానికి దానిని అడ్డుగా చూపిస్తున్నారు. ఇలా స్వార్థపరులు కొందరూ, అజ్ఞానంతో కొట్టుమిట్టాడేవారు మరి కొందరు మహిళా పురోగతికి అడ్డుకట్ట వేయాలని ప్రయత్నిస్తున్నారు. మనదేశంలోని అత్యధికులదైన హిందూమతం అందుకు ఉపయోగపడుతున్నది అలాంటి వారికి. హిందూ సమాజపు పాత కాలపు ఆచారాలను, సంప్రదాయాలను పట్టుకొని వ్రేళ్ళాడాలని వారిసంకల్పం.

హిందూ సమాజం ఎలా ఉద్భవించిందో, ఎలా పెరిగి పెద్దదయిందో, ఎలా పరిణామం చెందిందో, ఎలా ఈనాటికి ఈరూపం తాల్చిందో తెలియ జెప్పటానికి మల్లాది సుబ్బమ్మ యీ చిన్ని పొత్తంలో వీలయినంత విస్తృతంగా వివరంగా విశదీకరించారు. ఈ చారిత్రాత్మక పరిశీలన ఉపయోగకరం. దీనివలన అన్నిమతాలకు ఉన్నసామ్యం వెలికి వస్తుంది. పోలికలు.

బయటపడతాయి. మగదేవుళ్ళ ఉనికి, వారి ప్రవక్తల బోధల వెనుకన ఉన్న కర్కశ సత్యాలు గోచరమవుతాయి. ఆయా మత సమాజాల ఋషులు, ధర్మ శాస్త్రవిదులు, స్మృతికర్తలు, ధర్మకోశ రచయితలు వీరి ఆలోచనా ప్రవంతి వెనుక దాగియున్న పురుషాహంకార ధోరణి, పురుషాధిపత్య భావనదర్శనం ఇస్తాయి. దీంతో బండారం బయట పడ్తుంది. హైందవం యొక్క విశిష్టత ప్రత్యేకంగా ఏమీలేదని, అదీ అన్నిమత సమాజాల వంటిదేనని తెలుస్తుంది. ఈ విషయాన్ని హైందవ సమాజంలోని స్త్రీలు గ్రహించడానికి ఈ పుస్తకం తోడ్పడగలదన్న ఆశించడంలో అత్యాశలేదు. అలా జరిగిననాడు గ్రంథకర్త శ్రమ సఫలీకృతమయినట్లుగా భావించవచ్చు.

ఎం. వి. రామమూర్తి,

హైదరాబాద్. అధ్యక్షుడు, భారత హేతువాద సంఘం.

ఉపోద్ఘాతం

ఎందుకీ గ్రంథం? ఎవరికోసం ఈ రచన?

ముమ్ముందుగా ఈ గ్రంథ రచనకు ఎందుకు పూనుకున్నదీ కొంత వివరించవలసి వుంటుంది! హైందవం: స్త్రీలు, అనే విషయంపై ఇతరుల గ్రంథాలు కొన్ని వున్నాయి. మరో గ్రంథం ఎలా అవశ్యకత మవుతుంది? ఈ ప్రశ్నకు సమాధానం తప్పనిసరిగా ఇవ్వాలికదా!

ఇంతక్రితం "ఇస్లాం: స్త్రీలు" "క్రైస్తవం: స్త్రీలు" అనే పుస్తకాలు వ్రాశాను. స్త్రీ జనాభ్యుదయం సమాజ పురోగతికి అత్యావసరమని విశ్వసించే మహిళలు మతసమాజాలలో స్త్రీల స్థితిని గమనించి, పరిశీలించి ఆ సమాజాలను సంస్కరించటానికి పూనుకోవడం వారి కర్తవ్యం. ఆ విధి నిర్వహణలో భాగంగా ఈ పరిశోధనకు పూనుకోవడం జరిగింది. మతాల మనుగడ మానవ సమాజ జీవితంలోనే సాగుతున్నది. సామాజిక ధర్మాలను నిర్వచించడానికి, వాటిని వర్తింపచేయడానికి మతాలు కొన్ని విలువలను ప్రతిపాదిస్తాయి. ఆ విలువల ఆధారంగా ఆచారాలు, సంప్రదాయాలు ఉద్భవిల్లుతాయి. అంటే మత విలువలు ఆచరణలోకి వస్తాయన్నమాట. ఆచరణ నుండి మరల ఆలోచన ఉద్భవిస్తుంది. మార్పు అవసరంగా కన్పడుతుంది. మార్పును సూచించే ప్రవక్తలు, ధర్మశాస్త్రి కోవిదులు ముందుకు వస్తారు. వారికి వ్యతిరేకంగా పాత ఆచారాన్ని సమర్థించేవారు మరికొందరు మేధావులు రంగంలోకి దిగుతారు. భావాలపరంగా సంఘర్షణ సాగుతుంది. సమాజాలలో ఇరువర్గాలకు అనుచర బృందాలు ఏర్పడుతాయి. ఎడతెగని వైరుధ్యం విజృంభిస్తుంది. మరల తగాదా అంశాలను సమన్వయం చేసే మహా పురుషులు ఆవిర్భవిస్తారు. ఇలా సాగుతుంది నిరంతర భావ సంఘర్షణ. అలాగే సాగుతుంది నిరంతర సామాజిక చలనం. మతాలు ఆయా సామాజిక దశలనుబట్టి పుట్టాయని తేలుతుంది. అయితే సామాజిక పరిస్థితులలో ముఖ్యమైన అంశాలు ఉదాహరణకు-ఆర్థిక, రాజకీయ భాగాలు మారినా భావసౌధం

వెంటనే మారదు. భావాల మార్పుకు చాలా వ్యవధి పట్టుంది. అలాగే ఏ పరిస్థితులలో ఒక మతం పుట్టిందో ఆ పరిస్థితులు మారినా ఆ మతభావాలు వెంటనే నశింపుకావు.

మరొక అంశాన్నికూడా మనస్సులో ఉంచుకోవాలి, మతం సమాజంపై ఎంతో ప్రభావం చూపుతున్నది. అలాగే సామాజిక నిర్మాణం ఆ మతాన్ని పెంపుచేయడమో బలహీన పరచడమో చేస్తుంది. అంటే బానిసత్వ సమాజంలో పుట్టిన మతాన్ని సమాజపు జమీందారీ దశ బలహీన పరుస్తుంది. కాని దానిని పూర్తిగా చంపలేదు. పరిస్థితులు మారాయి. వాటి కనుగుణంగా నూతన భావసౌధం అవసరమవుతుంది. దానిలో భాగమైన తాత్విక ధోరణి అవతరిస్తుంది. అది మతపరం కావచ్చు లేక మత వ్యతిరేకమైనది కావచ్చు. ఏమైనా సమాజ పరిస్థితులకు అనుగుణమైన తాత్విక ధోరణి వెంటనే ప్రబలం కాకపోవచ్చును. అంతేకాదు పాత ఆలోచనా సరళి సమాజ విధానాన్నికూడ శాసించ ప్రయత్నించవచ్చు. సమాజం పాటించే ఆచారాలకు సంప్రదాయాలకు పాత ఆలోచనా ధోరణి సమర్థనను కల్పించటమేకాక ప్రజల మనస్సుపై రాజ్యం చేస్తుంది. ఈ వికటాట్టహాసాన్ని మనం గమనిస్తున్నాం. ఉదాహరణకు-ఋగ్వేదకాలంనాటి సమాజంలో పుట్టిన ఆలోచనా ధోరణి ఈనాటికీ హిందువుల జీవితాలను శాసిస్తున్నది. ఋగ్వేద కాలపు సమాజం ఈనాడు లేదు, అయినా ఆ కాలపు భావాలు ఈనాటికీ పెత్తనం చేసున్నాయి.

ఇంతకూ చెప్పదలిచిందేమంటే, మతంకూడా సమాజంలోనేపుట్టుందని పెరుగుతుందని, మారుతుందని, ఒక్కొక్కప్పుడు పెరుగుదల క్రమాన్ని స్తంభింపచేసుకొని సమాజాన్ని వెనుకకు నడిపించాలని ప్రయత్నిసుందని. కనుక మతాన్ని అన్నిదశలలో అధ్యయనం చేయవలసి ఉంటుంది. అయితే చారిత్రక దృక్పథంతో పరిశీలించ వలసి ఉంటుంది.

భారతదేశంలో అత్యధిక సంఖ్యాకులు హిందువులు. కనుక వారి సమాజాన్ని శోధించాలి. స్త్రీల అభ్యున్నతికి హిందూ సమాజపు ఆచారాలు,

సంప్రదాయాలు మతభావనలు, ధర్మశాస్త్రాలు ఎంతవరకు ఉపకరించాయో లేక నష్టదాయక మయినాయో పరిశోధన చేయాలి.

ఒక అంశాన్ని ప్రస్తావించక తప్పదు. సమాజ జీవితాన్ని నియంత్రణం చేయపూనే ప్రతిభావం లేక భావ సముదాయం సామాజిక శాంతిని కాంక్షించకతప్పదు. కాకపోతే ఆ శాంతిస్మశాన శాంతియా? లేక సమాజం లోని సభ్యుల ఇచ్ఛాపూర్వక శాంతియా?అనేది మీమాంస. సమాజపు ఉనికి కొంతగా కొంత సామరస్యంపై ఆధారపడుతుంది. కాకపోతే సంఘర్షణకు దారితీసే అంశాలు, అవకాశం కల్పించే విషయాలు ఉనికి కలిగి ఉండవచ్చు. సంఘర్షణకూడ జరుగవచ్చు. కాని తదుపరి మరల సామరస్యం నెల కొంటుంది. ఇలా సామాజిక సామరస్యానికి ఎప్పుడో ఒకప్పుడు దోహదం చేసే భావ సముదాయంలో కొంతగా కొంత శాశ్వత విలువలు చోటుచేసు కుంటాయి. అలాగే ప్రతి మతంలోను కొన్ని శాశ్వత విలువలు ఉంటాయి. అందువల్ల మతంలో లోపాలను బహిర్గతం చేసినంత మాత్రాన వాటిలోని ప్రయోజనకర అంశాలను కాదనడం కాదు. ఈ సిద్ధాంతం ప్రతి మతానికీ వర్తింస్తుది; అలాగే హిందూమతానికీ వర్తిస్తుంది.

ఇకపోతే హిందూమత విలువలల్లో అన్నీ చెడ్డవని చెప్పటం నా ఉద్దేశంకాదు. కాగా విలువైన వాటిని ఉటంకించటం నా ప్రసుత కర్తవ్యానికి అనవసరం. స్త్రీని హిందూ సమాజ ఆచారాలు, సంప్రదాయాలు ఎలా అభ్యుదయ మార్గాన సంచరించనీయటం లేదో వివరించదలచిన నాకు ఆ సమాజపు ప్రయోజనకర అంశాలను ప్రస్తావించటం అనుచితం. ఈ అంశాన్ని గమనించకుండా చదివితే హిందూ సమాజపు లోపాలు కన్పడి, రచయితకు దృష్టిదోషం ఉన్నదా అనే సందేహం రావచ్చు. కొందరు తొందరపడి నిందకు పూనుకోవచ్చు. మిస్ మేయో 'మదర్ ఇండియా' లాగా, మురుగుకాల్వల ఇనస్పెక్టరు రిపోర్టు అని మహాత్మాగాంధి అన్నట్లు వర్ణించవచ్చును. ఆ ప్రమాదం లేకపోలేదు. కాని ఆ విషయం తెలిసికూడా హిందూ సమాజపు లోటుపాట్లను వివరించటానికే ఉద్యమిస్తున్నాను. అలాకాక మంచి చెడ్డలను రెంటిని విశదీకరించుకుంటూపోతే గ్రంధం పెరుగుతుంది. అదీ గాక నా ఉద్దేశ్యము కుంటుపడుతుంది. ఆధునికతకు అనుపుగా హిందూ

సమాజాన్ని పరిద్దుటయే భారతస్త్రీల కర్తవ్యమని నా భావం. ఆ అంశాన్ని సూటిగా, గట్టిగా వారి దృష్టికి తేవడమే నా సంకల్పము. అందుకే ఈ గ్రంధం వ్రాయడం జరిగింది.

మతం సామాజిక ఆచార సంప్రదాయాలను మలుస్తుందనే అంశాన్ని ఇదివరకే గుర్తించాము. మతాలకు ప్రామాణిక గ్రంధాలుంటాయి. కొన్ని మతాలకు ఒక గ్రంధం ఉంటే మరికొన్ని మతాలకు అనేకం ఉంటాయి. హిందూమతానికి అనేక ప్రామాణిక గ్రంధాలున్నాయి. శ్రుతులు, స్మృతులు, ధర్మసూత్రాలు, ధర్మశాస్త్రాలు, వాటికి భాష్యాలు, మరల వాటికి అన్వయ గ్రంధాలు ఇలా ఎన్నో మరెన్నో వున్నాయి. హిందూమత చరిత్ర నాలుగువేల ఏళ్ళపైగా ఉంది. కనుక ఇంత శాస్త్ర సంచయం ఉండడంలో ఆశ్చర్యంలేదు. వీటి పరిశీలనకూడా తప్పనిసరిగా జరగవలసిన పని.

హిందూస్త్రీలయెడ సమాజ వైఖరిని తెలుసుకోవటానికి రెండు పద్ధతులల్లో అధ్యయనం సాగించవచ్చును. సమాజ దశలలో ఒక్కొక్క దానిని తీసుకొని ఆ దశలో స్త్రీయెడ ప్రదర్శింపబడిన వైఖరిని సవిస్తారంగా తెలుసుకోవడం ఒక పద్ధతి. ఉదాహరణకు, ఋగ్వేదకాలంలో స్త్రీ హోదా, పుట్టుక, బాల్యం, విద్య, వివాహం, దాంపత్య జీవితం, వైధవ్యం, స్త్రీధనం, మాతృత్వం, సామాజిక జీవితంలో స్థానం, ఇలా వీటిని గురించి విడివిడిగా వివరించటం అలాంటిది. అలాగే బౌద్ధయుగంలో, లేక ముసల్మాను యుగంలో స్థితిగతులను అర్థంచేసుకోవడానికి పరిశీలించవచ్చు. అలాగాక స్త్రీ జీవితంలో దశలను పేర్కొని దశలవారీగా అన్ని కాలాల్లోను స్త్రీయొక్క పరిస్థితిని తెలియచెప్పడం రెండవపద్ధతి. ఉదాహరణకు-ఆడపిల్ల పుట్టినపుడు ఋగ్వేదకాలంనుండి ఈనాటివరకు ఎలా ప్రజలు భావిస్తూ వచ్చారనే అంశం కూలంకషంగా చర్చించటం అలాంటిది. ఈ పుస్తకంలో రెండవపద్ధతిని అనుసరిస్తున్నాము. ఈ రకపు రచనవల్ల ఉపయోగం చాల వుంటుంది. ఏమంటే ఏయే రంగంలో హిందూ సమాజం కుంటినడక నడుస్తున్నదో, అపమార్గాన పయనిస్తున్నదో, ఎక్కడ దృష్టిదోషానికి పాల్పడుతున్నదో స్పష్టపడుతుంది. కనుక సంస్కర్తలకు ముఖ్యాంశాలు కొట్టవచ్చినట్లు కన్పడతాయి. వారిదృష్టిలో సంస్కరణ రంగాలు ప్రస్ఫుటంగా ఉంటాయి.

ఈనాటి ఆచారాలకు, సం|ప్రదాయాలకు, మూలాధారాలైన భావాలు ఏ వేదంలో వున్నాయో, ఏ స్మృతిలో ఉటంకించబడినాయో, ఏ ధర్మ శాస్త్రాలలో పేర్కొనబడినాయో, ఏ భాష్యంలో వివరించబడిందో అంతా వ్రాయాలంటే బృహత్ గ్రంథమవుతుంది. గ్రంథ విస్తరణ భీతివల్ల ఆ కృషికి పూనుకోవటంలేదు. కాగా మౌలికాధారాలను పేర్కొనటం మాత్రం చేస్తున్నాను.

ఇక గ్రంథ నామాన్ని గురించి ముచ్చటించవలసి వున్నది.

"హైందవం" అనే పదానికి రెండు అర్థాలు చెప్పుకోవచ్చును. హిందూమతం అని ఒక అర్థం. హిందూసమాజం అని రెండవ అర్థం. హిందూమతం అనే అర్థంలో సనాతనులు వాడుతున్నారు. వర్ణాశ్రమ ధర్మాలు, వేదప్రామాణ్యత, స్త్రీ పాతివ్రత్యం ముఖ్యలక్షణాలుగా ఉండి దైవంలో విశ్వాసాన్ని ఆధారంగా కలది హిందూమతమని వారు బాహాటంగా ప్రకటిస్తున్నారు. రెండవ అర్థాన్ని నేటి కాలపు శాసనాలు, ఉదాహరణకు హిందూవివాహ శాసనం ప్రతిపాదిస్తున్నది. భారతదేశంలో జన్మించి లేక భారతదేశంలో స్థిరనివాసం ఏర్పరచుకొన్న యూదు, జొరాస్ట్రియను మతాలను క్రైస్తవ, ఇస్లాంలను అనుసరించకుండా ఉండే వ్యక్తి హిందువు. ఇది శంకరాద్వైత తత్వశాస్త్రపు పోకడను పోలి ఉన్నది. "బ్రహ్మం" ఏదంటే ఇది అని స్పష్టముగా చెప్పలేక "నేతి, నేతి" (అంటే ఇదికాదు ఇదికాదు) అని చెప్పినట్లు హిందువు అంటే ఇలాగని చెప్పటం కుదరక చేసిన నిర్వచన ప్రక్రియ అది.

కొంత చారిత్రక పరిశీలన చేస్తే విషయం సుస్పష్టమవుతుంది. భారత దేశానికి ఆర్యులు రాకముందు మహోన్నతమయిన నాగరికత హరప్పా, మహెంజొదారో వగయిరా ప్రదేశాలలో విలసిల్లింది. అది ప్రధానంగా నగర జీవితానికి సంబంధించిన నాగరికత. తరువాత ఆర్యులు తండోప తండాలుగా భారతదేశంలోకి చొచ్చుకొని వచ్చారు. వారు ఒక్కసారిగా రాలేదు. అనేక పర్యాయాలుగా వచ్చారు. మొదటిజట్టు క్రీ. పూ. 2500 ప్రాంతంలో వచ్చి అచ్చటి స్థానికులను ఓడించి ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు.

సింధునది, దాని ఉపనదులు ప్రవహించే ప్రాంతమది. దానిని సప్తసింధు ప్రాంతమనేవారు. అందులో ఒక నది "సరస్వతి" ప్రస్తుతం అంతర్వాహిని అయినదని ప్రతీతి. అప్పటికదే ఆర్యులు సంచరించే ప్రాంతం. దానిని ఆనాడు ఆర్యావర్తమనేవారు. తరువాత వీరు తూర్పుదిశగా వలసవెళ్ళి గంగా యమునా మైదాన ప్రాంతాన్ని ఆక్రమించారు. స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వీరి ఉద్గ్రంథం ఋగ్వేదం. ఇంతలో మరో విడత మరోజట్టు ఆర్యులు ప్రస్తుతపు ఇరాన్ ప్రాంతంనుండి వలసవచ్చి సింధునదీ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరు తమతోపాటు అధర్వ వేదాన్ని తెచ్చారు. అప్పటికి వేదాలు వ్రాయబడలేదు. నోటిమాటద్వారానే వాటి ఉనికిని కాపాడడం జరిగింది. భారతదేశంలో ఉండే అనార్యులతో మొదట వచ్చిన ఆర్యులు, తరువాత వచ్చినవారూ అందరూ వివాహాది సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకున్నారు. ఈ సమ్మేళనం వలన ఉద్భవించిన సమాజం మహాభారతంలో కన్పిస్తుంది. రెండు సంస్కృతుల - ఆర్య అనార్య సంస్కృతుల - సమ్మేళనం జరుగనారంభించింది. అనార్యుల దేవతలను ఆర్యులు స్వీకరించారు. ఆర్యుల సంప్రదాయాలను అనార్యులు చేపట్టారు. గ్రీకు యోధుడు అలెగ్జాండరు భారతదేశ భూభాగంపై దండెత్తి వచ్చాడు. క్రీ. పూ 326 లో వాయవ్యదిశనున్న ప్రాంతాన్ని ఆతడు జయించటం, అతని తరపున సెల్యూకస్‌ను రాజప్రతినిధిగా నిలిపి వెళ్ళడం తటస్థించింది. గ్రీకులను యవనులని ఆర్యులు పిలిచేవారు. గ్రీకులు ఆర్యులను సింధుతీర వాసులు కనుక సింధీయులు అని, హిందువులని పిలచేవారు. కొంతకాలానికి ఇక్కడ నివాసమేర్పరచుకున్న యవనులనూ హిందూసమాజంలో చేర్చు కోవడం జరిగింది. దాంతో హిమాలయాలు ఉత్తరంగా, వింధ్య పర్వతాలు దక్షిణంగా, సముద్రాలు తూర్పు పడమరగా ఎల్లలుగా కల ప్రాంతం ఆర్యావర్తమయింది. ఎందరో భారతదేశంపై దండెత్తి వచ్చారు. కుషానులు, శకులు ఆ కోవకు చెందినవారు. వీరంతా హిందూసమాజంలో కలసిపోయారు. తరువాత ఆర్యసంస్కృతి దక్షిణాపథానికి ప్రాకింది. ఆర్యసంస్కృతియే హిందూ సంస్కృతిగా చలామణీ అయింది.

మొదట్లో ఆర్యమతం కేవలం బ్రాహ్మణమతం. ఆనాటి తొలి ఆర్యులలో మూడు వర్ణాలుండేవి. బహుశః వృత్తి నిబట్టి ఆ వర్ణవిభజన

ఆనాడు అలా జరిగి యుండవచ్చు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల పేరులో ఆ వర్ణాలు పిలువబడినవి. విద్య, పాండిత్యం, పౌరోహిత్యం, కర్మలు చేయించుట బ్రాహ్మణ ధర్మాలు. సమాజ రక్షణ క్షత్రియధర్మం. వ్యవసాయమూ, పశుపాలన వైశ్యుల కర్తవ్యం. కాగా తరువాత తామాక్రమించి గెలుచుకున్న ప్రాంతాల ప్రజలలోని కష్టజీవులను (దస్యులని పిలువబడ్డే వారిని) లొంగదీసుకొని సేవలు పొందుతూ వారిని శూద్రులుగా నామకరణం చేయటం జరిగింది. ఇలా నాలుగవ వర్ణాన్ని సృష్టించటం జరిగింది. ఏదైనా బ్రాహ్మణ ప్రాధాన్యతతో భాసిల్లింది ఆ సమాజం. దానికి ఎదురు దెబ్బలు తగలకపోలేదు. బానిసత్వాన్నుండి విముక్తి పొందాలనే తహతహతో అనేకమంది బానిసలు సమాజంనుండి పారిపోయారు. అడవులలో తిరగడం ఆరంభించారు. అలాంటివారి సంఖ్య వేలకు మించిపోయింది. వారు బ్రాహ్మణ మతాన్ని చీల్చిచండాడారు. ఇంతలో క్షత్రియులూ తిరుగుబాటు మనసత్త్వాన్ని ప్రదర్శించారు. నూతన మతాల సృష్టి జరిగింది. వాటిని వారు ఆహ్వానించి బలపరిచారు. ఆ మతాలే జైన బౌద్ధాలు. ఇదంతా క్రీ: పూ 600-500 నాటి మాట. అశోకుని కాలంలో బౌద్ధం ఇతర ప్రాంతాలకు, దేశాలకు విస్తరించింది. మళ్ళీ గుప్తరాజుల కాలంలో బ్రాహ్మణమతం కొంత పుంజుకున్నది. ఈనాటి కేరళలో పుట్టిన శంకరాచార్యులు మత జైత్ర యాత్రచేసి హిందూమతాన్ని, అంటే బ్రాహ్మణ మతాన్ని మరల కట్టుదిట్టం చేశాడు. (క్రీ. శ. 787-820) ముసల్మానుల దండయాత్రలు 11 వ శతాబ్దిలో ఆరంభమయ్యాయి. హిందూసైన్యాలు వెనుకంజ వేయక తప్పలేదు. తర్వాత ఐరోపియనులు వ్యాపారం నిమిత్తం రావడం మెల్లమెల్లగా రాజ్యాలు ఏర్పరచుకోవడం మనకు తెలిసినదే. పోర్చుగీసువారు, డచ్చివారు, ఫ్రెంచివారు, ఆంగ్లేయులు అలా వచ్చినవారే. చివరకు బ్రిటిషువారు నిలద్రొక్కుకొని తమ రాజ్యస్థాపన చేయటం, క్రైస్తవమత ప్రాబల్యాన్ని పెంచటం జరిగింది. 1947 లో స్వరాజ్యం వచ్చింది. బ్రిటిషువారి పాలనలో హిందూ ఆచారాలను మారుస్తూ కొన్ని శాసనాలు వచ్చినా స్వాతంత్ర్యానంతరం ఎక్కువగా హిందూ శాసనానికి సవరణలు విరివిగా వచ్చాయి. అవి చాల మౌలిక మార్పులను చేశాయి. ఇక్కడ గమనించవలసిన ముఖ్యాంశం ఏమంటే హిందూ మతం క్రైస్తవ, ముసల్మాను మతాలను తనలోఇముడ్చుకోలేక పోయింది. దానికి కారణాలు

అనేకం. ఆ మతాల ఆవిర్భావం మరో దేశాలలో కావటం, ఆ మత ఆచార వ్యవహారాలు హిందూమతానికి సంపూర్ణంగా భిన్నం కావటం ముఖ్య కారణం. ఏమైనా ఈనాడు భారతదేశంలో క్రైస్తవ, ముసల్మాను మతాలను అనుసరించేవారు హిందూసమాజానికి వేరుగా ఉంటున్నారనేది, పచ్చినిజం.

హైందవం అనే దానిని మతపరంగా నిర్వచించడం ఒక పద్ధతి. అయితే జాతి (RACE) పరంగా వివరించపూనడం మరియొకటి. అయితే ఈ రెండవ విధానంలో కొన్ని చిక్కులు వస్తున్నాయి. ప్రపంచంలో ఈనాడు ఏ జాతీ మరో జాతితో సంకరం కానిదిలేదు. ఆర్యావర్తమే తీసుకోండి. యవనులను, హూణులను, శకులను, ఆమాటకువస్తే మొదట్లో దస్యులను లేక రాక్షసులను, కిన్నరులను, గంధర్వులను ఇలా ఎందరినో ఆర్యులు తమ సంఘంలో కలుపుకున్నారు. ఎవరు ఆర్యులో, ఎవరు అనార్యులో తెలియని స్థితిలో ఈనాడు ఉన్నాం. కనుక జాతిపరమైన నిర్వచనకు ఆస్కారం లేదు.

కాగా రాష్ట్రీయ స్వయం సేవక సంఘంవారు మరో నిర్వచనాన్ని ప్రచారం చేయాలని 1940 నుండి ఎంతగానో శ్రమిస్తున్నారు. హిందూ సంస్కృతికి, హిందూ పరంపరాగత విశ్వాసాలకు, మనోగతభావాలకు వారు ప్రాముఖ్యతను ఇస్తున్నారు. ఇక్కడకూడా మరోచిక్కు ఉదయిస్తున్నది. హిందువుల సామాజిక రీతులు, ఆచార వ్యవహారాలు, ఆలోచనా ధోరణులు మారుతూ వచ్చాయి. ఋగ్వేదకాలపు భావాలు అన్నీ ఈనాడు లేవు. ఆనాటి ఆచారాలు ఈనాడు ఆమోదయోగ్యం కావటంలేదు, స్మృతులు, ధర్మ సూత్రాలు, గృహ్యసూత్రాలు, వీటిపై భాష్యాలు, కారికలు, అన్వయ గ్రంథాలు ఇలా ఎన్నో వందకుపైగా ఉన్నాయి. ఇవన్నీ ఏక కాలములో వచ్చినవి కావు. ఆయా కాలాల పరిస్థితులకు అనుగుణంగా ఉద్భవించాయి. పరస్పర విరుద్ధ అంశాలు లేకపోలేదు, ఏ సమాజానికి అయినా మార్పు సహజం, మరి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం వారు ఈ పరంపరలో దేనిని స్వీకరిస్తారు, దేనిని పరిహరిస్తారు? పోనీ మారనివి ఉన్నాయా అంటే కొన్నిఅంశాలు ఉన్నాయి. జన్మపై ఆధారపడే వర్ణధర్మం, పురుషాధిక్యత, స్త్రీని అస్వతంత్రను చేయటం ఇవి మారలేదు. ఈ పరంపరాగత హిందూమతాన్ని అంగీకరిస్తారా సంఘంవారు? తేల్చి చెప్పవలసిన తరుణం ఆసన్నమయింది.

హిందూత్వం లేక హైందవం నిర్వచనకు అందకుండా జారిపోయే బ్రహ్మపదార్థంలాగా తయారు అయింది. అది యేదో స్పష్టంగా చెప్పలేక పోయినా దాని కొన్నిలక్షణాలు స్పష్టంగా గోచరిస్తున్నాయి. వాటిని బట్టి దానిని గుర్తుపట్టవచ్చును.

హిందూసంస్కృతిలో ముఖ్యమయినది స్త్రీ పట్ల దాని వైఖరి. ఋగ్వేదకాలంలో స్త్రీకి సంపూర్ణస్వేచ్ఛ, పురుషులతోపాటు సమానత్వం ఉన్నాయని కొందరు బహు గొప్పగా చెప్పకుంటారు. పరిశీలన చేస్తే ఆ స్వేచ్ఛ పరిమితిని, ఆ సమానత్వం కొంత వరకేనని తెలుతుంది. తరువాత అంతా స్త్రీ పతనమే. కాగా బౌద్ధయుగంలో సుమారు వెయ్యి సంవత్సరాలు స్త్రీ గాలిపీల్చుకుంది. కొన్ని వెసులుబాట్లు వచ్చాయి. శంకరాచార్యుల రాకతో, హిందూమత పునరుద్ధానంతో స్త్రీ జాతి మరల కష్టాలపాలయింది. ఈ ఆరోపణలు ఎంతవరకు ఆధారయుతాలో ముస్ముందు వచ్చే అధ్యాయాలలో తెలుసుకోచేయవచ్చు.

హిందూ వివాహ శాసనం (1955) ప్రకారం ఇవ్వబడిన నిర్వచనాన్ని బట్టి లేక హిందూ సంస్కృతి ఆధారంగా హిందూ సమాజాన్ని రూపు తేల్చవచ్చును. హిందూసమాజంలోని స్త్రీపట్ల ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, అభిప్రాయాలు వాటిని మలిచిన శ్రుతి, స్మృతి, ధర్మసూత్ర, ఇత్యాది మతగ్రంథాల సూక్తులు ఇందుకు ఉపకరిస్తాయి.

హైందవం అంటే హిందూసమాజం అని అర్థం చెప్పకొని సాగి పోవడం యుక్తియుక్తం.

అధ్యాయం

1 స్త్రీ మూర్తిత్వం

కార్యేషుదాసీ, కరణేషుమంత్రీ రూపేషులక్ష్మీ క్షమయాధరిత్రీ
భోజ్యేషుమాతా శయనేషురంభా షట్కర్మ నిష్ఠా కులధర్మ పత్నీ॥
(పద్మపురాణం అధ్యాయం 47_55)

ఈ శ్లోక రచయిత వంశప్రసక్తి ఎక్కడా కానరాదు. కాని ఈ శ్లోకం హిందూ సమాజంలో బహుళ ప్రచారాన్ని సంతరించుకుంది.

పనిపాటలు చేయటంలో దాసిలాగా, ఆలోచన చెప్పేటప్పుడు మంత్రి వలె, ఓర్మిలో భూమిని పోలి, భర్తకు ఆహారం పెట్టేటప్పుడు తల్లితో సమానంగా, శయనంలో రంభకు దీటుగా, షట్కర్మలను చేస్తూ కులధర్మపత్ని సంచరించవలెనని తాత్పర్యం.

స్థూలంగా చూస్తే ఇలాంటి కోరిక మగవానికి ఉండటంలో తప్పేమిటని పురుషులందరికీ అనిపిస్తుంది. ఈనాటి హిందూ సమాజంలోని పెక్కుమంది స్త్రీలు కూడా 'పోనీ! పాపం! మగవాడు ఆ మాత్రం ఆశపడకూడదా?' అని సమర్థిస్తారు. ఏదైనా ఆశించటం మానవధర్మం. అయితే కేవలం స్వార్థ దృష్టి ఆ ఆశలో ద్యోతకమవుతున్నదా లేక మానవ సమాజ సంక్షేమ కాంక్ష ఆ భావంలో వెలువడిందా అనేది మీ మీమాంస. ఈ శ్లోకంలోని భావం అంతా పురుషుడు కేంద్రంగా స్త్రీ అతని చుట్టూ నడయాడే రీతిగా ఉన్నది. ఎంతసేపూ తన విషయమే ఆలోచించాడు హిందూ పురుషుడు. ఇలాంటి వాక్యం స్త్రీకి అనుకూలంగా ఎవరికైనా, ఎక్కడైనా తటస్థించిందా? దివిటీలు వేసి వెతికినా కన్పించదు. కారణం ఒకటే ఒకటి. పురుష ప్రాధాన్యత కల సమాజాన్ని హిందూ సంప్రదాయాలు, ఆచారాలు, హిందూ సంస్కృతి ఊహించాయి; పోషిస్తున్నాయి.హిందూ సమాజం మాతృత్వాన్ని ఉగ్గడించింది. స్త్రీ సౌందర్యవతిగా వుండాలని ఆమె అలంకరణాదులతో తన అందాన్ని పోషించుకోవాలని అభిలషించింది. కాని ఆ మాతృత్వమే ఆమెకు శాపమయింది. ఆ అందమే

ఆమెను పురుషునికి పాదాక్రాంతను చేసింది. ఇలా అంటే చాలమంది హిందువులకు కోపం వస్తుంది. సహజమే! ఆత్మస్వరూపదర్శనం ఒక్కొక్కప్పుడు బాధాకరం. మానవుడు ఊహలలో విహరిస్తాడు; ఆలోచనలలో తేలియాడ్తాడు. భావనా స్రవంతిలో మునిగిపోతాడు; తన్మయుడవుతాడు. వాస్తవాలను పరికించటమంటే ఉలిక్కిపడతాడు. హిందూ పురుషుడు ఇందుకు భిన్నంగా సంచరించలేడు. తను స్త్రీని అణచివేసి, ఆమె వ్యక్తిత్వాన్ని చిదిమివేసి ఆమెను తన స్వంత వస్తువుగా మలుచుకుంటున్నాడనే అంశాన్ని గుర్తించ నిరాకరిస్తున్నాడు. అందుకే కన్నులు మూసుకుంటున్నాడు. ఏమీ అన్యాయం జరగనట్లు సంచరిస్తాడు. ఇది అంతా చైతన్య స్థాయిలో పూర్తిగా మోసపూరితంగా జరిగే చర్య కూడా కాదు. తన ప్రగాఢ వాంఛలకు అనుగుణ్యంగా అచేతనంలో జరిగే ప్రక్రియ ఇది. కాగా చైతన్యపు మట్టంలో బహిర్గత రూపం తాలుస్తుంది.

హిందూమతం మాతృత్వాన్ని కొనియాడింది. తల్లిని గౌరవించింది. కాని మాతృత్వ విధ్యుక్త ధర్మ నిర్వహణ పేర స్త్రీని ఇంటికి పరిమితం చేసింది. సౌందర్యం స్త్రీని దోపిడీకి గురిచేసింది.[1] తల్లి అయిన స్త్రీ తన శిశువును పోషించాలి; పెంచాలి, సాకాలి; వారి మంచి చెడ్డలు చూడాలి. నలుగురు బిడ్డల తల్లికి అది ఒక మనిషి పెట్టు పని. పదిమంది బిడ్డలున్న స్త్రీ విషయం మరి చెప్పనక్కరలేదు. పదిమంది పిల్లల్ని కనమని పూర్వం నూతన వధువులను దీవించేవారు. అంటే అలాంటి తల్లి నలుగురు మనుష్యులకు దీటుగా పని చేయాల్సి వస్తుంది. ఆ పని అంతా ఇంట్లోనే జరుగుతుంది కదా! దాంతో ఆమె ఇల్లుదాటి అడుగు పెట్టటానికి ఆస్కారం ఉండదు. కుటుంబమే ఆమెకు ఇహమూ పరమూనూ. అందువలన ఆమె సాంస్కృతిక జీవితం కుంటుపడుతున్నది. సామాజిక వ్యవహారాలలో ఆమె కలుగజేసుకోవటానికి అవకాశం మృగ్యమవుతోంది. ఇక రాజకీయాలను గురించి వేరే చెప్పనక్కరలేదు. ఆమెకు ఇంచుమించుగా ప్రవేశము లేదు. ఒకరిద్దరు స్త్రీల పేర్లు ఉటంకించి దీనికి పూర్వ పక్షం చేయ ప్రయత్నించటం వృధాప్రయాస. దరహం మీద పరిశీలన చేయాలి. అలాంటి అధ్యయన ఫలితమే ఈ వ్యాఖ్యలు.

క్రీ. పూ. 300 సం॥ నాటికి స్త్రీలకు వివాహమువేది తప్పని సరియైన సంస్కారమయింది. వేదకాలంలో ఉన్న ఉపనయనాది సంస్కారాలు ఆమెకు

కాకుండా పోయాయి. వివాహం స్త్రీ యొక్క విధ్యుక్త ధర్మమయింది. ఆమె బాల్యం, ఆమె విద్య, అన్నీ ఆమెను పెండ్లికి తయారు చేసాయి. అణగి మణిగి ఉండడం, విధేయత, సర్దుకుపోవటం ఆమెకు ఉగ్గుపాలతో నేర్పింది. హిందూసమాజం. ఆమె జీవితం వివాహంతో, దాంపత్యంతో, భర్తతో ముడి వేశారు. ఈ వివాహ బంధం స్త్రీని బానిస బంధంలోకి నెట్టనూవచ్చు లేక ఆమె వక్తిత్వాన్ని పెంచనూవచ్చు. కాని హిందూ వైవాహిక జీవితంలో స్త్రీ బానిసత్వంలోకి దిగజారింది. ఆమె బందీ అయింది. మనదేశంలో పది కాలాలపాటు నివాసం ఉండి చివరకు 'హిందు స్త్రీ' అనే గ్రంథం వ్రాసిన మహిళ ఎలా వివరించిందో గమనిద్దాం. "వివాహం వంశం కొనసాగించ డానికి సాధనం. వంశానికి ప్రాధాన్యత ఏర్పడింది....వంశానికి స్త్రీ రాణి, బానిస రెండూను. ఆమె కుటుంబం వల్ల జీవితాన్ని పొందుతున్నది. కుటుంబ కొసం జీవిస్తుంది. కనుక ఆమెయే కుటుంబం; కుటుంబమే ఆమె. ఆమె ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కోరదు. దానికోసం ఆరాటపడదు....భర్తయే దైవం, గురువు. కుటుంబం కోసం ఆత్మార్పణ చేసుకుంటుంది."2 ధర్మశాస్త్రజ్ఞులు ఆమెకు పతివ్రతా ధర్మాన్ని నిర్దేశించారు. ఆ ధర్మ నిర్వచనం ఎంతవరకు వెళ్ళిందో, ఎంత వెర్రితలలు వేసిందో గమనించటం అవసరం.

"విశీలః కామవృత్తోవా గుణైర్వా పరివర్జితః
ఉప చర్యః స్త్రియా స్వాధ్వా సతతం దేవత్పతిః"3

భర్త యెంత శీలరహితుడయినను, కామప్రవృత్తి కలవాడయినను, ఏ సద్గుణములు లేనివాడయినను భార్య అతనిని దేవునిగా భావించి, పూజించ వలెనని దీని తాత్పర్యం. ఇది ఎవరో చెప్పినమాటకాదు. ఈనాటికి హిందూ సమాజానికి శిరోధార్యంగా ఉన్న సూక్తులను ప్రవచించిన మనువు చెప్పిన మాట. మరి భార్య శీలరహితయైతే దండనాది శిక్షలు నిర్ణయించిందే ఈ సమాజం. పాతివ్రత్యం విధించపడిందికాని 'పత్నీవ్రతం' అంటూ పత్నియెడ భర్తయే ఉనికికల్గి యున్నాడు. భార్య అతనికోసం జీవించాలి. ఆమెకు అతడుతప్పా మరియొకటి లేదు. ఆమెకు వేరే వ్యక్తిత్వం లేదు. ఉన్నా ఆమె వ్యక్తిత్వం అతని వ్యక్తిత్వంలో లీనం అయిపోవాలి. వేరే వికసనాన్ని అభిల షించటం ధర్మ విరుద్ధం.

సీత, సావిత్రి, పార్వతి ఆదర్శమూర్తులుగా స్త్రీలోకానికి ప్రదర్శిత మయ్యారు. సీత రామునికోసం ఎన్నో కష్టాలకు లోనయ్యింది. తన ధర్మ నిర్వహణకు ప్రాధాన్యత ఇచ్చే భర్తకోసం ఎన్నో ఇడుమలలలో చిక్కింది. కాని ఏనాడూ రాముని నిందించలేదు. సావిత్రి భర్తకోసం యముడినే ఎదు ర్కొన్నది. పార్వతి శివునిభార్య. జన్మ జన్మలకూ శివుడినే పతిగా పడయ కోరింది. దక్షునికూతురుగా పతినింద భరించలేక సతి అయి ప్రాణత్యాగం చేసింది. హిమవంతుని కూతురుగా, పార్వతిగా పుట్టింది. తపస్సు చేయటంవలన —శంకరుని భర్తగాకోరి — ఉమ అయింది ఆకులుకూడా భుజింపకుండా తపస్సుచేసినందుకు అపర్ణగా పేరుపొందింది. శారీరక సౌందర్యాన్ని ప్రద ర్శించి శంకరుని ఆమె భర్తగా పొందలేదు. ఆమె కష్ట సహిష్ణతను, పట్టు దలను చూపించి శంకరుని మెప్పుపొంది అతనిని భర్తగా పొందగలిగింది. ఈ ముగ్గురు స్త్రీలు భర్తకోసం కష్టాలుపడినవారే. అందులో దాక్షాయణిగా పార్వతి ప్రాణత్యాగం చేసిన స్త్రీ, వీరిని ఉదాహరణలుగా, ఆదర్శమూర్తులుగా, చూపటంలో ఆంతర్యం ఏమంటే భార్య భర్తకోసమే జీవించాలనే పరమార్థం స్త్రీలకు బోధించడమే.

హిందూ స్త్రీకి వ్యక్తిత్వం ఉందా ?

"స్త్రీ భర్తలో ఐక్యమవుతుంది. ఆమె వ్యక్తిత్వం అతని వ్యక్తిత్వంలో లీనమవుతుంది. — ఆమె తనకుగాను హక్కులను కోరదు. అంటే ఆమెలో స్వతంత్రాలోచనాశక్తి, సృజనాత్మకతలేదనికాదు. భర్తతో పోటీపడదు. అంతే."[4] ఈ సందర్భంగా బోధాయన గృహ్య సూత్రం ఏమి చెప్పిందో చూద్దాము.

"అథాస్యా ఉపోత్థాయ, దక్షిణేన హస్తేన,

....

....

మయి సర్వాణి భూతాని, మయి ప్రజ్ఞాన మస్తుతే."

బో. గృ. సూ 1-4.

(వరుడు కుడిచేతితో వధువుయొక్క దక్షిణాంసమును గూర్చి బాహువునెత్తి, హృదయదేశమును స్పృశించి యిట్లు చెప్పుచున్నాడు. 'నా హృదయమందు నీ హృదయముండుగాక. నా చిత్తమందు నీ చిత్తముండుగాక. నా వాక్కు

ఏక మనస్కవై వినుము. నన్ననుసరించియే వ్రతము కలదానవగుము. నాతో సహచర్యవగుము. 'ఆమె కుడిచెవిలో ఇట్లు జపించుచున్నాడు. నీ మనస్సు నన్ను ప్రవేశించుగాక. నీ నేత్రము, భగము నన్ను ప్రవేశించుగాక. నీకు నాయందే సర్వభూతములు గన్పట్టుగాక. నాయందే నీకు ప్రజ్ఞానముండుగాక')

"శారీరకముగ రెండు వ్యక్తులైన స్త్రీ పురుషులు మానసికముగ నొకే వ్యక్తియగుటయే హిందూ దాంపత్య లక్షణం. జీవితకాలముననే కాక, మరణానంతరమున గూడ నిట్టి యైకమతో నుండుటయే ఆర్య దాంపత్య విశేషము"5 ఇది సనాతన అభిప్రాయమని త్రోసిపుచ్చవచ్చును. ఆధునిక కాలపువారు చెప్పిన విషయాలు ఇందుకు భిన్నం కావు. మహాకళా తపస్వి ఆనంద కుమారస్వామి ఈ విషయంలో ఏమన్నారో గమనిద్దాం.

"హిందూ సామాజిక శాస్త్రజ్ఞుల అభిప్రాయం ప్రకారం వివాహం సామాజిక సంబంధం; అలాగే నైతిక సంబంధం కూడాను. సంతానాన్ని కనటం ఋణాన్ని తీర్చటం. స్త్రీ పురుషుల ప్రతి కలయిక సాపేక్షతను తిరస్కరించటమే; కనుక శృంగార ప్రేమ సమాజవ్యతిరేకం.....హిందూ వివాహంలో విధ్యుక్త ధర్మ నిర్వాహణవల్ల ఆనందం ఉద్భవిస్తుంది. ప్రాచ్య వివాహం సంప్రదాయబద్ధ ఏర్పాటుపై ఆధారపడుతుంది. అది యాదృచ్ఛికమైన స్పందన ప్రతి స్పందనలపై ఆధారపడదు. రామునివలె ప్రవర్తించుట, సీత వలె నడచుకొనుట లక్ష్యాలు. అంతేకాని 'వ్యక్తిత్వ వికాసం' లక్ష్యం కాదు. నియమం అంతకుముందే నిర్ణయించబడింది. భార్యాభర్తలు యథోచిత పాత్రలను నిర్వహించవలసిన వారు. అంతే. ఆ దృష్టిలో మనువు శాసనాలను మనం పరిశీలిస్తేనే వాటి అంతరార్థం మనకు గోచరిస్తుంది. భర్త యొక్క గుణాగుణాలతో భార్యకు ప్రసక్తి లేదు. ఆమె అతనిని దేవునిలాగా పరిగణించాలి. భర్తలో అనేక లోపాలున్నాయనే భావంతో భార్య అతనిని చిన్న చూపు చూడటం అంటే ఆదర్శమైన స్త్రీత్వాన్ని కాదని ఆమె తననే కించపరుచుకుంటున్నదన్నమాట. తన హోదాను తగ్గించుకుంటున్నదన్నమాట. పురుషుడు పరిశ్రుతుల శాశ్వత లీలాన్ని స్త్రీ అపేక్షించటం భర్త కొరకు మాత్రమేకాదు. ఆమె తనకోసమే అలా ఆశించాలి; అంతేకాదు, సమాజంకోసం దానిని కోరాలి. హిందూ సమాజం సమిష్టి నీతిపై ఆధారపడి వుంటుంది. ధర్మనిర్వాహణా భావం శాశ్వతం కల్గది.......అందుకే హిందూవివాహం అవిచ్ఛేద్యమయింది.

ప్రథమ కళత్రం వలన సంతానాన్ని పొందలేకపోతే మరో స్త్రీని వివాహమాడ మనటం తర్కబద్ధమైన ఆలోచన. హిందూ స్త్రీ కోరవలసింది స్వయం వ్యక్తీకరణకాదు. స్వస్వరూపదర్శనం. ఆ అవకాశాన్ని హిందూ సమాజం ఆమెకు ఇచ్చింది. 'స్త్రీత్వ' ప్రదర్శనకు సమాజం ఆమెకు వెసులుబాటు కల్పించింది.........జాతి జీవనాన్ని కొనసాగించటానికి స్త్రీ వాహిక; ప్రతీక కూడాను. జాతి వీరత్వాన్ని పోగొట్టకుండా శక్తిని విడదీయలేము; ప్రక్కదారి పట్టించలేము. ఆ శక్తినే స్త్రీ కొనసాగిస్తున్నది. వైశ్యుడు క్షత్రియుడనని అభివర్ణించుకోలేనట్లు, క్షత్రియుడు బ్రాహ్మణునిగా తనను చిత్రించుకోలేనట్లు స్త్రీ స్త్రీగా కాక మరో రకంగా సంచరించలేదు.........స్వేచ్ఛ అంటే స్వీయ వ్యక్తిత్వాన్ని నిర్ధారించుకోవటం కాదు........స్త్రీగా మనుగడ సాగించటానికి ప్రాచ్యదేశసామాజిక మత సంస్కృతి ఆమెకు అవకాశం ఇస్తున్నందు వలననే ఆమె ఈనాడు ఇలా (ఇంతగొప్పగా అని అర్థం॥ రచయిత) ఉన్నది. భారతీయుల ఆదర్శం కేవలం ఒక జాతికో లేక ఒక కాలానికో పరిమితం మయినది కాదు. ఎక్కడయితే స్త్రీ తనుగా స్త్రీగా వాస్తవానికి స్వేచ్ఛ పొంద గలదో అక్కడ ఆ ఆదర్శం సాక్షాత్కరిస్తుంది. ఎక్కడయితే తగినంత వీర ప్రధానమయిన మతమూ, కళ తమ సంస్కృతి ద్వారా ఆమెకు అవసరమైన రక్షణ ఇస్తాయో అక్కడ అది దర్శనమిస్తుంది.

.... ఏ మేరకు అయితే స్త్రీత్వం అనే ఆదర్శాన్ని ఆమె కాదని తన స్వభావానికి భిన్నంగా ఎపుడు స్త్రీ సంచరించ పూనుకుంటుందో ఆమె తన శక్తిని కోల్పోతుంది.

తను కొన్ని ప్రత్యేక లక్షణాలను సంతరించుకున్నందువల్ల స్త్రీ తను పొందే శక్తికన్న తను ఆశించిన లక్షణాలను గుణాలను కలిగిన సంతానాన్ని నిరంతరంగా సృజించగలిగే శక్తి ఎంతో గొప్పది." 6

ఇవి ఉదాత్త ప్రవచనాలుగా కన్పించ వచ్చును. కానీ పూత మెరు గులు తొలగిస్తే తేలే అంశం ఒకటే ఒకటి. సంతానాన్ని కనడానికి స్త్రీ ఉద్దే శింపబడింది. ఆమె అందుకే తన జీవితాన్ని ధారపోయాలి. అదే ఆమె జీవితానికి సార్ధకమూ సాఫల్యమూనూ. ఆమె కడుపు పండటమే ఆమె జీవి తానికి వరప్రసాదం. ఇది వ్యక్తిత్వ వికాసంకన్న గొప్పది. ఇది కేవలం ఆత్మ సాక్షాత్కారం. ఈ పొగడ్తల వెనుక ఉన్న పురుషాధిక్యతా భావం ఎంత కప్పిపుచ్చుకున్నా ఉబికి, పొంగి, పొరలి పైకి వస్తున్నది. మొదటి

భార్యకు సంతానం కలుగకపోతే పురుషుడు ద్వితీయ వివాహం చేసుకోవచ్చునట. మరి స్త్రీ .... కేవలం సంతానం కోసమే సుమండీ .... మరొక పురుషుని వివాహమాడవచ్చునా ?

ఈ ప్రశ్నను, ఏ స్త్రీ అయినా, వేస్తే అగ్నిపర్వతం బ్రద్దలయినంత ఆర్భాటం చేస్తారు పురుషపుంగవులు. స్త్రీ, పురుషులలో ఎవరి లోపం వలననైనా సంతానం కలుగకపోవచ్చని ఆధునిక విజ్ఞానం చెప్తున్నది. ఆ విషయం తెలియక మాట్లాడుతున్నారా కశాతపస్సులు. లేక తెలిసి ఇలా వ్రాస్తున్నారా తత్వవేత్తలు. ఇది మీమాంసంగా వదలివేద్దాము. సమాజ శ్రేయస్సు కోసం, జాతి వీరత్వాన్ని కొనసాగించే నిమిత్తం, మానవ సమాజపు మనుగడ కోసం భర్తను వదలి మారుమనువు చేసుకుంటానని ఏ స్త్రీ అయినా అంటే అమోదించగలదా పురుషలోకం. అపుడు ఆమెకు బోధింపబడిన "స్త్రీత్వం" అనే ఆదర్శం ఆమె వల్లిస్తే ఏమవుతుంది ?

ఇంతకూ యిక్కడ మరో తాత్వికాంశం ఉధయిస్తుంది. పైన ఉటంకించబడిన "ఆత్మ సాక్షాత్కారం" వ్యక్తి వికాసంలో భాగంకాదా ? వ్యక్తి వికాశం శారీరక మనో వ్యాపారాల ద్వారా "ఆధ్యాత్మికం" **(SPIRITUAL)** ద్వారా జరుగదా ? సంతానం కనటం కూడా స్త్రీ యొక్క వ్యక్తి వికాసంలో భాగమే. కాగా కొందరు స్త్రీలు ఒక అంశానికి మాత్రమే ప్రాధాన్యత యిస్తే మరికొందరు మరొక అంశానికి ప్రాముఖ్యతను అపాదిస్తారు. అది వారి ప్రతిభావ్యుత్పత్తులను బట్టి, ఇష్టాయిష్టాలను బట్టి ఉంటుంది. దానిని శాశ్వత విలువగా, శాశ్వత సత్యంగా ప్రతిపాదించనక్కరలేదు.

ఆనందకుమారస్వామి వెలిబుచ్చిన అభిప్రాయంలో ఒక అంశం గమనార్హం: భారతీయుల ఆదర్శం ఒక కాలానికి, ఒక 'ప్రాంతానికి పరిమితమయింది మాత్రం కాదు' అనే అభిప్రాయం సరియైనదే. కాని ఇంచుమించుగా ఒకే సామాజిక పరిస్థితులు ఉన్నప్పుడు కొద్దిపాటి తరతమ భేదాలతో ఇంచుమించుగా ఒకేతరహా సంస్కృతి, భావాలు విలసిల్లుతాయి. అందువలననే ప్రాచ్యదేశాలను గురించిన సర్వసామాన్య ధర్మంగా స్త్రీల "స్త్రీత్వాన్ని" గురించి నొక్కి పెట్టి ప్రసంగించడం జరుగుతున్నది.

స్త్రీలకు వ్యక్తిత్వం ఉంది కాని అది వారి "స్త్రీత్వం" ముందు తల వొగ్గాలని హిందూ సంస్కృతిని బలపరిచే వారి వాదన. అయితే స్త్రీకి ఆత్మ

గౌరవం ఉందా ? లేదని అంటే ఆమెను మనిషిగా చూడటం లేదన్నమాట. కనుక ఉందంటారు. అయితే అది ఎలా ప్రదర్శితమవుతుంది ? విధి నిర్వహణలో. భార్యగా విధుల నిర్వహణలో, పాతివ్రత్యపాలనలో, తల్లిగా బహు సంతానవతియై జాతిని పెంచడంలో. భారతస్త్రీకి విదేశీ వనితలకులేని భద్రత, ఆశ్రయం, రక్షణ ఉన్నాయని ఆమోదయుతంగా హర్షంవెలిబుచ్చిన మార్గరేట్ కార్‌మాచ్ ఏమన్నదో గమనించండి. "స్త్రీకి ఆత్మగౌరవం లేదని కాదు. ఆమె ఆత్మగౌరవం కుటుంబంతో తాదాత్మ్యం చెందడం వలన వస్తున్నది. పరస్పర ఆధారం' **(Matul Dependence)** వల్ల ఆమె ఆత్మగౌరవం ఉత్పన్నమవుతున్నది"7 మంటల సొగసు ముసుగు తొలగిస్తే ఆమె ఆత్మగౌరవం భర్తవల్ల, కుటుంబంవల్ల పుడ్తుందని తెలుసుంది. భర్త లేని స్త్రీ, సంతానంలేని స్త్రీ నిరర్ధకజీవి అన్నమాట.

ఇటీవల కొందరు హిందూ స్త్రీలు ప్రతిభావ్యుత్పత్తులను వెలరారుస్తున్నారు కదా. మరి ఇదంతా పైన చెప్పినదానికి విప్రతిపత్తి కదా అని ఎవరైనా అనవచ్చు. "కొందరు స్త్రీలు వ్యక్తులుగా తయారవుతున్నారు. అయినా చాలావరకు సమాజం నిర్ణయించిన పరిధిలోనే వారి వ్యక్తిత్వాలు వికసిస్తున్నాయి."8 ఇక్కడ ఒక సంఘటన గుర్తుకువస్తున్నది. ఒక ప్రముఖ మహిళ తన స్వభావాన్ని నిర్వచనంచేస్తూ 'నేను స్త్రీ విమోచనోద్యమకారిని కాదు. మానవవాదిని **(HUMANIST)**, అని చెప్పింది. ఈ మాటలు పై సూత్రాన్ని బలపరుస్తున్నాయేమో! భారతదేశంలో హిందూసమాజపు పరిధిని మించి మహిళ పురోగమించ వీలులేదా ? పరస్పర ఆధారం, సమిష్టి శ్రేయస్సు సమాజ పురోగతి ఇవి అన్ని స్త్రీకి శిరోధార్య మూలసూత్రాలని చెప్పబడినాయి. స్థూలంగా వీటిని ఎవరూ కాదనటానికి వీలులేదు. కాని వీటి వెనుక పురుషాధికారం, పురుషాధిక్యత తొంగిచూస్తున్నాయి. అక్కడే వస్తున్నది అసలు చిక్కు. స్త్రీని అస్వతంత్రగా చిత్రించాడు మనువు. ఆమెది సర్వదా పరాధీనపు బ్రతుకేనట.

" పితా రక్షతి కౌమారే భర్తారక్షతి యౌవ్వనే,
రక్షాన్తివార్ధక్యే పుత్రాన స్త్రీ స్వాతంత్ర్య మర్హతి." (మను 9-3

బాల్యమున తండ్రియు, యౌవనమున భర్తయు, వార్ధక్యమున, భర్త వానప్రస్థుడైనచో, పుత్రుడును రక్షింపవలెను. ఇది లౌకిక వ్యవహార కావచ్చును. ధర్మ నిర్వహణలో స్వతంత్రం ఉన్నదేమో ,

" అస్వతంత్రా ధర్మే స్త్రీ." (గౌతమ ధర్మ సూత్రం 18-1)
ధర్మంలో స్త్రీకి స్వాతంత్ర్యమే లేదు.

" భర్త అనుమతిలేనిదే స్త్రీ ఏ ధర్మము చేయుటకు వీలులేదు. ఉపవాసం, వ్రతం మున్నగునవి కూడ భర్త అనుమతితోనే జరుగవలయును. భర్త అనుజ్ఞలేకుండా చేయబడు వ్రతములు రాక్షసులకు చేరునని స్మృతులు చెప్పుచున్నవి."9

ఇది సనాతన పండితుల వాక్యం. వ్యక్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని, స్వేచ్ఛను బాగా కుంచింపచేసినా స్త్రీలు — మనుషులు కాబట్టి — ఎదురు తిరుగుతారేమోనని భయపడినారేమో ధర్మశాస్త్రజ్ఞులు, 'నీతికోవిదులు' స్త్రీని దుర్మార్గంగా, అక్రమంగా, నీచంగా నిందిందించారు. ఆ నిందా వాక్యాలను కొన్నింటిని ఇచ్చట పొందుపరచటం జరుగుతున్నది.

"స్త్రీలు చంచల చిత్తలు" ఋగ్వేదం (X 95-15)
ఊర్వశి వదలివెళ్తే పురూరవుడు చేసిన వ్యాఖ్య.

" స్త్రీ అసత్యానికి మారుపేరు" మైత్రాయణ సంహిత (I-10, 11)

" స్త్రీలు అసత్యం యొక్క అవతారమూర్తి" (రామాయణం)

సీత రాముని రక్షణార్థం పొమ్మంటే, అనవసరమని లక్ష్మణుడంటే, 'రాముడు చనిపోతే నీవు నన్ను పొందాలని చూస్తున్నావు' అని సీత అతనిపై నిందవేస్తే లక్ష్మణుడు కటకటపడి పలికినవి ఈ మాటలు. (III-45)

"స్త్రీలు క్రూరులు స్వార్థపరులు" రామాయణంలో కైకేయిని నిందిస్తూ ఆ సందర్భంలో ఉన్నది. (II 12-19)

" స్త్రీలలో మెరుపు యొక్క చంచలత్వం, ఆయుధం (కత్తి) యొక్క పదును, దేగయొక్క వేగం అన్నీ కలిసి ఉన్నాయి. (రామాయణంలో అగస్త్యుని పలుకులు((II-13-67)

సీతకు ఈ లోపాలు లేవని చెప్పాడని ఆల్టేకరు భావం. ఎదో ఒక సందర్భంలో వెలిబుచ్చిన అభిప్రాయాలనీ, నిరాశా నిస్పృహలకు లోనైన పురుషులు ఉద్రేకపూరితులై వాడిన పదాలను నిక్కచ్చిగా, తీసుకోరాదని. ఆల్టేకర్ అభిప్రాయం వెల్లిబుచ్చారు.10

స్త్రీలను గురించి వెలువరించిన చెడు అభిప్రాయాలను కొన్నింటిని ఎగతాళిగా, తేలికగా అనేవారట. ఆ మాటలు మనస్సులోనుంచి రాలేదట.[11] వాటికుదాహరణలు :-

"సుందరాకారుడై, సంగీత నాట్య శాస్త్రాలలో ప్రవీణుడైన పురుషుడు స్త్రీని తేలికగా లోబరుచుకోవచ్చును." (శతపథ బ్రాహ్మణం III 2, 3, 6)

" స్త్రీలు మనస్సులను అదుపులో పెట్టుకోలేరు "
(ఋగ్వేదం (III 33-17) ఇది ఇంద్రుని మాట.

ఇలా సర్దుదామని ప్రయత్నించిన ఆల్టేకర్‌కు కొన్ని వాక్యాలు చిక్కులను కలిగించాయి. స్త్రీల స్వభావాన్ని చెడుగా చిత్రించాలని ఉద్దేశపూర్వకంగా క్రీస్తు తరువాత స్త్రీలను గురించి వ్యాఖ్యానాలు చేసినట్లు ఆల్టేకరు అంగీకరించక తప్పలేదు."[12]

" స్త్రీ జీవితపరమార్థం ఇంద్రియ సుఖమే (మహాభారతం IV 39, 78)

" అనువైన ప్రదేశమూ, అవకాశమూ, ఆశ్రయమూ లేనందువలన మాత్రమే స్త్రీ గుణవంతురాలుగా ఉంటున్నది." పద్మపురాణం, సృష్టికాండం)

" స్త్రీల దుర్గుణాలను, లోపాలను వర్ణించాలంటే నూరు నాలుకలు కల మనిషికయినా నూరేండ్ల కాలం చాలదు" (మహాభారతం XIII 74, 78, 8)

" స్త్రీలతో చెలిమి అనేది లేదు. వారి హృదయాలు క్రూరమైనవి." (శతపథ బ్రాహ్మణం IX 5.1.9)

" స్త్రీలు దస్యుల సైన్యమూ ఆయుధాలు." (ఋగ్వేదం V 30-9)

" స్త్రీ, శూద్రుడు, శునకం, కాకి, అసత్యానికి, పాపానికి, అంధకారానికి మారుపేర్లు." (శతపథ బ్రాహ్మణం)

" స్త్రీలను ఆధారపడేవారుగా చేశాడు దేవుడు. అందువలన వారు పురుషునిపై ఆధారపడుతారు" (శతపథ బ్రాహ్మణం)

" ఇదంతా పురుషులలో నిరాశావాదులు అన్ని దేశాలలో అన్ని కాలాలలో అన్న మాటలే"[13] కానే 'ధర్మశాస్త్రాల చరిత్ర'లో అంటారు.

" స్త్రీయే పాపానికి మూలం." అని భీష్ముడు యుధిష్ఠిరునితో చెప్పాడు." (మహాభారతం అనుశాసనపర్వం 40:4)

" స్త్రీలు అసత్య స్వరూపులు." మహాభారతం, అనుశాసనపర్వం 19.6)

" స్త్రీలకన్న దుర్మార్గమయినది మరేదిలేదు. కత్తిమొన, విషం, పాము, అగ్ని అన్నీ కలిస్తే స్త్రీ అవుతుంది. (మ. భా. అనుశాసనపర్వం 32-12, 29)

" లక్షమంది స్త్రీలలో ఒక్క పతివ్రత ఉంటుంది." (మ. భా. అనుశాసనపర్వం 19, 93)

" స్త్రీలను అదుపులో పెట్టలేము. పురుషులు వారివెంట పడటం లేదు కనుకను, తరువాత చుట్టూ పరిచారకులచేత పరివేష్టింపబడి యుండటం వలనను వారు భర్తలకు కట్టుపడి ఉంటున్నారు. (మ. భా. అ. ప. 38:16) రామాయణం ఈ విషయంలో తీసిపోలేదు.

" స్త్రీలు ధర్మంనుండి వెనుదిరిగినవారు, చంచల మనస్కులు క్రూరులు; విద్వేషం కలిగిస్తారు" (రామాయణం-అరణ్యకాండం 45.29.30)

" స్త్రీలకు శయనంమీద, పదవిమీద, ఆభరణాలమీద, అపరిశుద్ధ కాంక్షలమీద మోజు జాస్తి. వారు క్రోధాన్ని, నిజాయితీ లేమిని, దుష్ట ప్రవృత్తిని, దుర్మార్గపు నడతను కలిగిఉంటారు." (మనుధర్మశాస్త్రం-XI-17)

" మద్యపానం, దుష్ట సాంగత్యం, భర్తకు దూరంగా ఉండటం, తిరుగు మోతు తనం, పగలు నిద్రించుట, పరాయివారి ఇంట్లో ఉండటం ఇవి స్త్రీల నాశనానికి కారణాలు." (మనువు IX-13)

" స్త్రీలు భోగలాలసులు, చపలచిత్తులు, ప్రేమ రహితులు, పర పురుషుడు అందగాడైనా అనాకారియైనా వారికి బాధలేదు. పురుషుడైతే చాలు. భర్తను ద్వేషించి అతని వంచన జేరతారు." (మనువు-IX 14, 15)

" మగవానిని ప్రలోభపరచుటయే స్త్రీ నైజం. పండితుడయినా పామరుడయినా మగవానిని ప్రక్కదారిన పట్టిస్తారు పడతులు. అందుకే వివేకులు స్త్రీలపట్ల అజాగ్రత్తగా ప్రవర్తించరు." (మను IX 213, 214 : మహా భార. అ. ప. 48.37, 38)

" స్త్రీలకు ఉద్రేకం మగవానికన్న ఎనిమిది రెట్లు."14 (బృహత్ పరాశర)

ఈ నిందలను వ్యతిరేకించినవారు కాళిదాసు, బాణుడు, భ వ భూ తి, వరాహమిహిరుడు. కానీ వారి అసమ్మతికి విలువలేకుండా పోయింది. జాతక కథలలో ఒకదానిలో బోధిసత్వుడు ఇలా అంటాడు. "స్త్రీ చేత పరిపాలింప బడే దేశానికి అపకీర్తి సంభవిస్తుంది. స్త్రీ ఆధిపత్యానికి లొంగే పురుషులు అప్రతిష్ఠ పాలవుతారు."[15]

" స్త్రీలకు త్వరగా కోపం వస్తుంది; వారు ఉద్రేకపరులు, అసూయా పరులు. వారు మందబుద్ధులు." (సుల్ల వగ్గ —1.6)[16]

మనువు, శుక్రుడు, చాణుక్యుడు, యాజ్ఞవల్క్యుడు స్త్రీని తక్కువచూపు చూచారు.

కేవలం పురుష ధర్మశాస్త్రాలు స్త్రీని నిందిస్తే బాగుండదేమో! స్త్రీలచేత స్త్రీలను నిందింపచేశారు.

పరపురుషుని చూడనంతవరకే స్త్రీ పతివ్రతగా ఉంటుందని శివపురాణంలో అరుంధతిచేత అనిపించారు.

మహాభారతంలో నారద పంచచూడుల సంవాదం గమనార్హం. పంచ చూడ గంధర్వ స్త్రీ. "స్త్రీని సర్వదుర్గుణాలతో దేవుడు సృష్టిచేశాడు. వాళ్ళను మించిన పాపకర్ములు లేరు. మరణం, నరకం వగయిరాలన్నింటితో స్త్రీ సరితూగగలదు. అసత్యంయొక్క అవతారమూర్తి ఆమె. శాస్త్రజ్ఞానం లేక, ఇంద్రియనిగ్రహంలేక స్త్రీలు ఎల్లప్పుడూ ఆభరణాలు, దుస్తులు, ఆహార, పానీయాలను గురించి ఆలోచిస్తుంటారు." (మ. భా. అ. ప. 30)

స్త్రీలు చంచలచిత్తులనీ, అవిశ్వాసులనీ ఒక స్త్రీ చెపుతుంది. (మ. భా. XIII 73.8)

"స్త్రీల కాముకత్వం తీవ్రమయినది. కామతృప్తితో వారు ఎంత నికృష్ట పురుషునితోనయినా సంగమిస్తారు." (మ. భా- XIII.73:17)

" వారు వావి వరుసలను, వివిధ నిషేధాలను పాటించరు. వారికి కావలసింది కామతృష్ణ తీరటమే" ఇలా సాగింది నింద.

దేవీ భాగవతంలోని ఈ దిగువ సూక్తులను మనం గుర్తించాలి. ఎందుకంటే ఒక స్త్రీని దేవతామూర్తిగా చిత్రించిన గ్రంథమది.

" స్త్రీలు స్నేహితులు కారు, శత్రువులూ కారు."

" స్త్రీ ప్రేమలో నిజాయితీ లేదు."

" స్త్రీలు జలగలు "

పురుషుల కసికి ఇవి పరాకాష్ఠ వ్యాకాలు. దీనికంతా ఒక వివరణ యిచ్చారు కానే పండితులు. స్త్రీలనింద అంతా స్త్రీలవల్ల నష్టపోయిన వారి నుండి, స్త్రీలపై కోపం ఉన్నవారినుండి వచ్చిందట. స్త్రీలను నిందించడానికి ఇలా వ్రాయలేదు. పాతివ్రత్యాన్ని, విధేయతను స్త్రీలలో వ్యాప్తిచేయటానికి ఇలా చేశారట.17 కానే పండితుని సంజాయిషీ యుక్తియుక్తంగా లేదు. ధర్మాలు చెప్పటానికి పూనుకున్న వ్యాసుడు, న్యాయసూత్రానుసారంగా ధర్మాన్ని వివరించడానికి పట్టంకట్టుకున్నామనే మన్వాదులు ఎందుకు ఈ దుశ్చర్యకు గడంగారు ? పురుష ప్రాధాన్యతకల సమాజంలో మగవారి పెత్తనాన్ని సుస్థిరం చేయటానికి చేసిన ప్రయత్నమిది. లేక మరోరకంగా ఆలోచిస్తే కుటుంబములో ఉండే స్త్రీలను నిందించి, బెదిరించి, అదిరించి లొంగ దీసుకుంటే తప్ప పురుషాధిక్యత నిలబడదని గ్రహించి చేసిన నిర్ణయం అది.

వైరాగ్య జీవితాన్ని ఆశించినవారు ఈ నిందకు పూనుకున్నారని చెప్పి తప్పించుకోవటానికి వీలులేదు. మహాభారత కాలానికి శ్రమణకుల ప్రభావం తగ్గింది. బౌద్ధం, జైనం తగ్గుముఖం పట్టాయి మనుధర్మశాస్త్రం పుట్టేనాటికి. వైదికధర్మాన్ని ప్రతిపాదించినవారు గార్హస్థ్య జీవితాన్ని నిరసించలేదు. కనుక స్త్రీని ప్రత్యేకంగా నిందించవలసిన పనిలేదు. అసలు సంగతి అది పురుషాధిక్య సమాజపు లక్షణం.

స్త్రీలు తమమీదినిందను పదేపదే విని అమాయకంగా అదంతా నిజమని నమ్మారు. అనాటికి స్త్రీకి ఉపనయనాదులు పోయాయి. చదువుకునే అవకాశాలు సన్నగిల్లాయి. పెండ్లికోసం జీవించటం మాత్రమే ఆశయమయింది. దానితో అజ్ఞానం ఉదయించింది. అజ్ఞానం వల్ల ఉదయించే మనోరుగ్మతలు వారికి కలిగాయి. వారికి ఆత్మ న్యూనతాభావం ఏర్పడింది. తమపై తమకే ఏహ్యభావం కలుగసాగింది. పురుష ప్రపంచపు భావాలను యథాతథంగా స్వీకరించారు. పురుషులు ప్రవచించిన విలువలను తమవిగా చేసుకున్నారు ఆ సంస్కృతీ భావాలు వారి మనస్సులలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నాయి.

పతివ్రతా ధర్మాలను స్త్రీల చేతనే చెప్పించారు నేర్పుగా 'ధర్మవిదులు.' శంకరుని కోరికపై ఉమ పతివ్రతా ధర్మాలను వివరించింది. తన భర్తలపై తనకు గల ప్రాబల్యానికి కారణాలను ద్రౌపది సత్యభామకు విశదపరచింది. వాట్ని తరువాత వచ్చే అధ్యాయాలలో లోతుగా విచారించవచ్చును. తేలిన దేమంటే, జైళ్ళలో బందీలను కాపలాకాయటానికి బందీలను నియమిస్తారు. అలాగే ఒక దేశం మరో దేశాన్ని పాలిస్తుంటే విదేశస్థులు స్వదేశస్థులను పోలీసులుగా, సిపాయిలుగా వాడుకుంటారు. అదే పద్ధతిలో, స్త్రీలకు పాతివ్రత్యాన్ని ఉపదేశించి, వీరిలో సహజంగా ఉండే స్వేచ్ఛా ప్రియత్వాన్ని అణచి వేయటానికి స్త్రీలనే వినియోగించారు. స్త్రీలు తమ కాళ్ళకు తాము బంధాలు తగిలించుకోవటమేగాక తమ మనస్సులనుకూడ బందీకృతం చేసుకున్నారు. అలాంటి స్త్రీలు ఉపదేశికలై పురుష ధర్మశాస్త్రజ్ఞుల మెప్పును, పొగడ్తను పొందారు. 'పతివ్రత' అనే బిరుదును పొందారు. అమాయకంగా, అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతూ పురుషాధిక్య సమాజాన్ని అంటిపెట్టుకొని జీవయాత్ర చేస్తున్నారు.

ఎంతగా "డూడూబసవన్నా" అనటం నేర్పినా, క్రూరంగా దారుణంగా హింసిస్తే జంతువు అయినా ఎదురు తిరుగుతుంది. ఇక మనిషి సంగతి వేరే చెప్పనక్కరలేదు. మచ్చికయిన గొడ్డుకు కూడా పచ్చగడ్డి వేస్తేనే మంచిగా, దండిగా పాలు యిస్తుంది. ఈ సత్యాన్ని పశు పాలకులయిన ఆర్యులు గ్రహించకపోలేదు. అందుకనే స్త్రీలను గురించి కొన్ని అనునయ వాక్యాలు పలికారు.

" యత్ర నార్యాస్తు పూజ్యన్తే రమన్తే తత్ర దేవతా :
యత్రైతాస్తు నపూజ్యన్తే సర్వాస్తత్రా ఫలాక్రియా :" (మను 3-56)

'స్త్రీలు ఏ గృహంలో పూజింపబడుచున్నారో అచట దేవతలు క్రీడించుచున్నారు. స్త్రీలు ఏ గృహానందు పూజింపబడుటలేదో ఆ గృహమున చేయబడు సత్కర్మలన్నియు నిష్ఫలములు,' అని శ్లోకానికి అర్థం

" స్త్రీలనగా గృహమును ప్రకాశింపజేయు దీపములనియు, వారు సాక్షాత్తుగా లక్ష్మీదేవులే యనియు కూడా మనుస్మృతి చెప్పుచున్నది. (మను 9-27) కావున హిందూమతములో స్త్రీలకు గొప్ప గౌరవస్థానం కలదని చెప్పవలసి యున్నది', అని ఇటూవ్లలభుల పురుషోత్తంగారిలాంటి సనాతనుల అభిప్రాయం.18

మనుధర్మశాస్త్రం ప్రకారం స్త్రీలను పూజించటమంటే ఏమిటి ?

ఏ స్త్రీ అయితే పతివ్రతా లక్షణాలను తనవిగా చేసుకుంటుదో, ఏ స్త్రీ అయితే పురుషాధిపత్య సమాజాన్ని యథాతథంగా స్వీకరిస్తుందో, ఆ స్త్రీకి అన్నపానీయాదులకు ధన కనక వస్తువాహనాదులకు లోటురాకుండా చూడటం ఆ పనిని హిందూ పురుషులు ఈనాటికీ నెరవేరుస్తున్నారు. అలా దయతో, భూతదయతో ప్రవర్తిస్తున్నారు.

సనాతనుల బోధ గమనింపండి. "ప్రతి పురుషుడును స్త్రీకి కూడ కష్టసుఖములు కలవని గుర్తించి" 'దయాసర్వభూతేషు' అను ప్రధమాత్మ గుణమును స్త్రీపట్ల ముందుగ ఆచరణ యందుంచుట అత్యవసరము. భార్యను క్రూరముగ చూచుచు లోకమునంతను దయతో చూచినను భగవంతుడు హర్షింపడు, మీదుమిక్కిలి భార్యను ప్రేమతో చూచువానిని దేవతలాశీర్వదింతురని మన శాస్త్రములు చెప్పుచున్నవి.

" దేవదత్తాం ప్రియాస్వే భార్యాం విందం తేచ్ఛయాత్మనః
తాం సాధ్వీంబిభృయాన్నిత్యం దేవానాం ప్రియమాచరన్"

(మను 9-95)

ప్రియురాలైన భార్యను దేవతలు పురుషునికి యిచ్చారు. అతడు ఆమెను తన యిచ్ఛచే వివాహమాడటం లేదు. దేవతలకు ప్రియమాచరించుచున్నవాడయి అట్టి సాధ్విని ఎల్లప్పుడు భరింపవలయును, అని తాత్పర్యం.19

సాధ్వియైన భార్యను పరిత్యజించిన వానికి ఘోరమైన ప్రాయశ్చిత్తములు విధింపబడినవి;

" సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యాతథైవచ
యస్మిన్నేవ కులేనిత్యం కళ్యాణం తత్రవైధ్రువం" (మను 3-60)

(ఏ గృహంలో భార్యతో భర్తయు, భర్తతో భార్యయు నిత్యము సంతుష్టులై యుందురో, ఆ గృహము నిత్యకళ్యాణముగా నుండుట నిశ్చయము).20

అలా యింటిలో శాంతి కోసం హిందూశాస్త్రజ్ఞులు జాగ్రత్తపడ్డారు.

భార్యను సరిగ్గాచూస్తే ఈ అధ్యాయం మొదట్లో చెప్పినట్లు ఆమె శక్తి వంచవలేకుండా 'ఆత్మ సంతృప్తితో చాకిరీ చేస్తుంది; హిందూ పురుషునికి

సుఖానికి సుఖం, భోగానికి భోగం దక్కుతాయి. ఆమెకు చీరెలు, నగలు యిచ్చి, ఆమెచేత వ్రతాలు చేయించి (తన ఆయురారోగ్యాభివృద్ధి కోసం) ఆమెకు "గృహలక్ష్మి" అనే బిరుద ప్రదానంచేసి పబ్బం గడుపుకున్నారు హిందూ పురుషపుంగవులు.

హిందూ నాగరికతలో హిందూస్త్రీ స్థానాన్ని హిందూ సంస్కృతిపట్ల ఎంతో సానుభూతితో పరిశీలించిన ఆల్టేకరు చెప్పిన మాట :—

"స్త్రీల స్థితి గత రెండు వేల సంవత్సరాల నుండి దిగజారిపోయింది"[21]

" మధ్యయుగంలో ఆస్తిహక్కు విషయంలో స్త్రీ పరిస్థితి మెరుగయింది. మతం మొదలగు విషయాలలో స్త్రీ స్థితి హీనమయింది. శూద్రుల స్థితితో ఆమె స్థితి సమతుల్యమయింది."[22]

తరువాత బ్రిటిష్ యుగం సంగలోపడేవరకు స్త్రీల స్థితి అలాగే ఉంది.

వేదకాలంలో స్త్రీల పరిస్థితి మెరుగుగా ఉండి తరువాత బౌద్ధకాలంలో పతనమయిందని త్రిప్పికొట్టాడు అంబేత్కరు.[23]

ధర్మశాస్త్రాలు, పురాణాలు స్త్రీలకు ద్వితీయ స్థానం ఇచ్చాయి. భర్త నీడలో బ్రతికే మనిషిగా భార్యను మలిచాయి. కాగా ధర్మశాస్త్రాలలో అచ్చటచ్చట కనుపించే స్త్రీలకు అనుకూలమయిన మాటలు ప్రక్షిప్తాలు.[24]

ఎవరో కొద్దిమంది ఉదార స్వభావులు తప్ప తతిమ్మా సంహితకర్తలు, ధర్మశాస్త్ర రచయితలు, టీకాకారులు, భాష్యకారులు వీరంతా స్త్రీని నిరాదరణ చేసినవారే. కాగా, క్రీ. పూ. 2500 నాడు స్త్రీకి మతపరంగా, విద్యపరంగా, వివాహపరంగా కొంత స్వతంత్రత ఉండేది. అది పూర్తిగా నశించిపోయింది సనాతన హిందూ సమాజంలో. అయితే నాలుగువేల అయిదు వందల సంవత్సరాల మీద ఏమీ మార్పురాలేదా అంటే, మార్పు జరిగింది. అది మౌలికం కాదు. మెయిన్ అన్నట్లు, "హిందూమత, వ్యవహార సూత్రాలు శతాబ్దాల తరబడి మార్పుచెందుతూ వచ్చాయి. కొన్ని అంశాలలో అభివృద్ధి, కొన్నింట్లో పతనం బ్రాహ్మణుల భాష్యంవల్ల సంభవించింది. స్త్రీల శాసన సంబంధమైన ప్రతిపత్తికి భంగంకలిగే విధంగా సూత్రాలు — మరేయితర సూత్రాలు ఇలా మారలేదు — ఘోరంగా నష్టదాయకంగా మార్చబడినాయి."[25]

ఇంతవరకూ ప్రస్తావించబడిన హిందూ సమాజం బ్రిటిషువారు శాసనం ద్వారా ఐక్యం కలిగించుకోవడం ప్రారంభించేవరకు పరిణామం చెందిన సమాజం అని మనం గమనంలో ఉంచుకోవాలి. ఈ పరిణామానికి ఋగ్వేదం, అథర్వవేదం, శ్రౌత సూత్రాలు, గృహ సూత్రాలు, ధర్మసూత్రాలు, స్మృతులు, ధర్మశాస్త్రాలు వాటి వివరణలు, భాష్యాలు ఈ గ్రంథాలూ; ఇండోయిరాని యనుల వలస, హూణుల, శకుల దండయాత్రలు, ముసల్మానుల దాడులు, ముసల్మాను రాజ్యస్థాపన, పాశ్చాత్యుల దేశ ప్రవేశం ఇవన్నీకూడ హిందూ సమాజంపై ప్రభావం చూపాయి. అంతేగాక బౌద్ధ, జైన మతాలు దూడ కొంతలో కొంత హిందూ సమాజాన్ని మలిచాయి. చివరకు అవి హిందూ సమాజంలో భాగాలుగా మిగిలిపోయాయి.

హిందూ స్త్రీ మూర్తిత్వం యొక్క పరిణామాన్ని చారిత్రికంగా గమనించాలి. కేవలం ముమ్ముందుగా నిర్ణయించుకున్న సిద్ధాంతాలను బట్టి మదింపు వేసుకుంటే పూర్తి సత్యం బోధపడకపోవచ్చును. ఏదైనా స్త్రీ యొక్క వ్యక్తిత్వాన్ని గురించి రెండు రకాల అభిప్రాయాలు; దృక్కోణాలు ఉన్నాయి. స్త్రీ మానవిగా తన వ్యక్తిత్వ వికాసం కొరకు కృషి చేయవలసి యున్నది. అందులో భాగమే ఆమె తల్లిఅవడం. కాని, తల్లికావడమే ఆమె జీవిత పరమార్థం కాదు. అది ఆమె జీవితంలో ఒక అంశం. ఇది ఒక ఆలోచనా రీతి. మరొకటి మరో రకంగా ఉన్నది. స్త్రీ గాని, పురుషుడు గానిస మాజ శ్రేయస్సుకోసం తమ వ్యక్తిగత ఆకాంక్షలను సరిదిద్దుకోవాలి. సమాజం' మానవ సమాజం కొనసాగాలి. దానికి సంతానోత్పత్తి అవసరం. స్త్రీ మాత్రమే సంతానాన్ని కనగలదు. ఆమె మాత్రమే మానవజాతిని కొనసాగించగలదు. కనుక ఆమె అందుకోసం తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాలి. విశిష్టమైన శక్తియుక్తులను వాడాలి. అంటే ఆమె తన స్త్రీత్వంపై నొక్కిపెట్టాలి. ఈ సందర్భంగా ఆమె పురుషుని సహకారం తీసుకోవాలి. అంతేకాదు స్త్రీత్వ సాక్షాత్కారాన్ని పొందాలి. అలా పొందటానికి ఆమె సంతానాన్ని కనడమే కాక, పెంచి పోషించాలి. అంటే అందుకు అవసరంగా - తప్పనిసరిగా - ఆమె ఇంటికి అంకితమయిపోవాలి. గృహిణిగా మారాలి. భర్తను గృహ యజమానునిగా చేసుకోవాలి. భర్తను - పోషణకర్త కనుక - పాతివ్రత్య ధర్మాన్ని నెరవేస్తూ పూజించాలి. చివరకు భర్తతోడిదే ఆమెకు లోకం కావాలి. భర్త ద్వారానే ఆమె తన వ్యక్తిత్వాన్ని వికసన చేసుకోవాలి. భర్త వ్యక్తిత్వంలో

తన వ్యక్తిత్వాన్ని సమ్మిళితం చేసుకోవాలి. అంటే చివరకు తనదంటూ వేరే వ్యక్తిత్వాన్ని ఆమె మిగుల్చుకోరాదు. ఈ ఆలోచనా స్రవంతిని హిందూ సమాజం ఆమోదించింది. దీనిని ఆచారాలతో సంప్రదాయాలతో బలపరుస్తున్నది. మత ప్రవచనాలతో గట్టి చేస్తున్నది.

మొదటి ఆలోచనా పద్ధతి ఆధునికమయినది. కనుక మొదటిది కావాలో, లేక రెండవదైన హిందూ సమాజ ఆలోచనా రీతి కావాలో భారతదేశ స్త్రీలు తేల్చుకోవలసిన సమయం ఆసన్నమయింది.

స్త్రీ యొక్క వివిధ దశలలో ఈ హిందూ సంస్కృతి ఎలా పని చేస్తున్నదో మున్ముందు నిశితంగా, గాఢంగా పరిశీలిద్దాం.

అధ్యాయం 1

పాదదీపికలు

1) ఉపోద్ఘాతం : భారతీయ స్త్రీలు, సం॥ దేవకీజైన్
2) హిందూ స్త్రీ : మార్గరెట్ కార్‌మాచ్ (ఏషియా పబ్లిషింగ్ హౌస్ 1961)
3) మనుధర్మ శాస్త్రం 5 - 154
4) హిందూ స్త్రీ : మార్గరేట్ కార్‌మాచ్ - పుట 191 (ఏషియా పబ్లిషింగ్ హౌస్ 1961)
5) హిందూమతం : జటావల్లభుల పురుషోత్తం.
(పబ్లిషరు : జే. గోపాలం. కాకినాడ 1947) పు. 147, 148.
6) శివుని లాస్యం (The DANCE OF SIVA)
ఆనందకుమారస్వామి - పుట 86
(మార్గరేట్ కార్‌మాచ్ పుస్తకం పుట 137లో వుంది)
7) అదే పుస్తకం : పుట 178
8) ,,

9 హిందూమతం : పుట 143
10) హిందూ నాగరికతలో స్త్రీల స్థానం : ఆల్టేకర్
The Position of Women in Hindu Civilisation: Dr. A. S ALTEKAR MOTILAL BANARSIDASS, Delhi. Second Edition, Reprinted 1978 Page 319,
10) డిటో. పుట 320
12) డిటో. పుట 320
13) ధర్మశాస్త్రాల చరిత్ర : పి. వి. కానే
History of Dharma Sastras: P. V. KANE, (BHANDARKAR, ORIENTAL Research Institute. PUNE 1941 VOL 2, PART-I పుట 576.
14) డిటో పుట 578
15) అశోకరుద్ర వ్యాసం.
'CULTURE OF RELIGIOUS Influenc ASHOK RUDRA In "Indian Women" Devaki Jain, Publications Division 1975 Page 43)
16) డిటో పుట 43
17) కానే ధర్మశాస్త్రాల చరిత్ర వాల్యూమ్ 2 పార్టు 1 పుట. 581
18) హిందూమతం, జటావల్లభుల - పుట 157
19) డిటో : పుట - 149
20) డిటో : పుట - 151
21) ఆల్టేకరు - పుట 359
22) కానే ధర్మశాస్త్రాల చరిత్ర - పుట 582
23) హిందూ స్త్రీ ఉచ్ఛ్రదశ, పతనం
The Rise and Fall of Hindu Women:
Dr. B. R. AMBEDKAR, Bheem Patrika Publishers (1977)
24) యుగయుగాల్లో భారతీయ మహిళలు
P. Thomas, Indian Women Through The Ages (ASIA Publishing House (1964)
అధ్యాయం : అంధకార యుగం.
25) సంస్థల చరిత్ర : మెయిన్
LECTURES ON EARLY HISTORY OF INSTITUTIONS: MAIN, 1914) పుట 326.

కాలజ్ఞాన పట్టిక

క్రీ. పూ 3000 సం॥ : సింధు నాగరికత

క్రీ. పూ. 2500 : ఋగ్వేదం
అధర్వవేదం

క్రీ, పూ. 1000 : మహాభారత కధా కాలం
రామాయణ కధ

క్రీ. పూ. 2500 నుండి క్రీ. పూ. వెయ్యి వరకు :
వేద సంహితలు, బ్రాహ్మణములు, ఉపనిషత్తులు

క్రీ. పూ, 1500 : కురల్

క్రీ. పూ. 800 నుండి క్రీ. పూ. 400 వరకు : శ్రౌత సూత్రాలు :-
ఆపస్తంబ, అశ్వలాయన, బౌద్ధాయన, కాత్యాయన, సాంఖ్యాయన వగైరాలు.
గృహ్యసూత్రాలు : అశ్వలాయన, ఆపస్తంబ వగైరా.

క్రీ. పూ. 600 - క్రీ. పూ. 300 : ధర్మసూత్రాలు, వశిష్ఠ, గౌతమ ఇత్యాది (కానే)

క్రీ. పూ. 800 - 700 : జైనమత స్థాపన

క్రీ: పూ. 600-500 : బౌద్ధం, మహావీరుడు

క్రీ; పూ. 5 శతాబ్దం : బౌద్ధాయనుడు

క్రీ. పూ.500 క్రీ. త. 500 : సూత్రాలు, ఇతిహాసాలు, తొలిస్మృతులు

క్రీ, పూ. 400 - 300 : కౌటిల్యుని అర్థశాస్త్రం)ఆల్టేకర్)

క్రీ, పూ. 300 - క్రీ. త. 100 : ,, ,, (కానే)

క్రీ. పూ. 326 : అలెగ్జాండరు దండయాత్ర

క్రీ. పూ. 400 - క్రీ. త. 100 : ధర్మసూత్రాలు

క్రీ. పూ. 2వ శతాబ్దం : మౌర్యను సామ్రాజ్య పతనం.

క్రీ. పూ. 200 క్రీ. త. 300 : విదేశీయుల దండయాత్రలు

క్రీ. పూ. 200 - క్రీ. త. 200 : మనుధర్మశాస్త్రం, మనుస్మృతి

క్రీ. త. 1, 2, శతాబ్దాలు : వాత్స్యాయన కామసూత్రాలు; శూద్రకుని మృచ్ఛకటికం

క్రీ. త. 200 - 1200 : ధర్మశాస్త్రాలు

క్రీ. త. 100 - 300 : యాజ్ఞవల్క్యస్మృతి

క్రీ. త. 100 - 400 : నారద స్మృతి

క్రీ. త. 200 - 500 : వైఖానస స్మార్త సూత్రం

క్రీ. త. 300 - 500 : బృహస్పతి స్మృతి

క్రీ. త. 300 - 600 : పురాణాలు :- వాయు, విష్ణు, మార్కండేయ, కూర్మ, మత్స్య ఇత్యాది.

క్రీ. త. 400- 600 : కాత్యాయన స్మృతి

క్రీ. త. 500 - 587 : వరాహమిహిరుడు (బృహత్ సంహిత రచయిత)

క్రీ. త. 650 నుండి 755 : తంత్రవార్తిక : కుమారుడు

క్రీ. త. 7వ శతాబ్దం : బాణుడు

క్రీ. త. 600 - 900 : ఇతర స్మృతులు, కొన్ని పురాణాలు (కానే)

క్రీ. త. 500 - 1000 : ఇతర స్మృతులు (ఆల్టేకరు)

క్రీ. త. 7 నుండి 12వ శతాబ్దం : అంధకార యుగం. (ఆల్టేకరు)

క్రీ. త. 300 - క్రీ. త. 1200 వరకు : సంస్కృత నాటకాలు

క్రీ. త. 500 - 1800 వరకు : తరువాతి స్మృతులు, భాష్యాలు, వ్యాఖ్యానాలు, ధర్మకోశాలు ((ఆల్టేకరు)

క్రీ. త. 8వ శతాబ్దం : భవభూతి-మాలతీ మాధవం

క్రీ. త. 788 - 820 : శంకరాచార్యులు

క్రీ. త. 800 - 850 : విశ్వరూప (యజ్ఞవల్క్య స్మృతిపై భాష్యం)
క్రీ. త. 700 - 1150 : రాజతరంగిణి (కాశ్మీర చరిత్ర)
క్రీ. త. 900 : మేధాతిథి, మనుస్మృతిపై భాష్యం
క్రీ. త. 1100 : విజ్ఞానేశ్వరుని మితాక్షర.
(యాజ్ఞవల్క్య స్మృతిపై భాష్యం)
క్రీ. త. 11వ శతాబ్దం : మహమ్మద్ గజనీ దండయాత్ర.
క్రీ. త. 11వ శతాబ్దం : మహమ్మదుగజనీ దండయాత్ర
క్రీ. త. 1125 : అపరార్క : యాజ్ఞవల్క్యస్మృతిపై భాష్యం
క్రీ. త. 1192 : మహమ్మదు ఘోరీ
క్రీ. త. 1525 : తొలి ముస్లిం పాలన ముగియుట.
క్రీ. త. 1200 - 1800 : మధ్యయుగపు తరువాతి దశ.

అధ్యాయం

2 జననం, బాల్యం, విద్య

జననం :- శిశువు జన్మించినదనే వార్త వినగానే ప్రసవించిన తల్లి విన్నదనంతో క్రుంగిపోతుంది. తండ్రి చింతాక్రాంతుడవుతాడు, తాత ముత్తవ్వలు తల్లడిల్లిపోతారు. ఇది దరహంమీద జరిగే సంగతి. ఏదో కొలది కుటుంబాలలో తద్వ్యతిరేకంగా జరుగవచ్చును. కాని సర్వసాధారణంగా ఈ నాడు కూడ హిందూసమాజంలో ఈ భేదం కన్పిస్తూనే ఉంది. పరాయి ఇంటికి వెళ్ళే పిల్ల అని, పెండ్లి సందర్భంగా కట్నం కానుకలను, ఇతరమైన విందులు వినోదాలకు ఎక్కువగా ధనం వ్యయం చేయవలసి వస్తుందని కుటుంబాలు భయపడటం తటస్థిస్తున్నది. అదే మగసంతానమయితే హర్షామోదాలు వెల్లివిరుస్తాయి. అందరి ముఖాలు కళకళలాడతాయి. కాటికి కాలు జాచి కూర్చున్న నాయనమ్మనుండి ఇంట్లో తిరుగాడే కుమార్తెవరకు అందరూ సంతోష స్వాంతలవుతారు దానికి కారణాలు అనేకం. తలకు కొరివిపెట్టి, శ్రాద్ధాదులు నెరవేర్చేవాడని కొందరు, వంశోద్ధారకుడని మరికొందరు, సంపాదించి కుటుంబభారాన్ని మోస్తాడని తదితరులు ఇలా అందరూ తలా ఒక కారణాన్ని పురస్కరించుకొని ఆనంద సముద్రంలో తేలియాడతారు. చివరకు పురుడుపోసే మంత్రసాని పొందే బహుమతిలో కూడా తేడా ఉంటుంది. మగపిల్లవాడు కలిగితే ఆమెకు వచ్చే కట్నం (బొడ్డుకోసినందుకు వచ్చేది) లో ఆడపిల్ల కలిగినపుడు సగమే వస్తుంది. ఇలా పురుష సంతానాన్ని ఆహ్వానించటము, స్త్రీ సంతానాన్ని అభిలషించక పోవటం ఈనాటికి ఆచారంగా వస్తున్నది. దీనికి పూర్వకాలంలో పునాదులున్నాయా లేదా అని విచారించడం అవసరం.

ఋగ్వేదకాలంలో స్త్రీ శిశు జనాన్ని దురదృష్టంగా భావించినట్లు దాఖలాలు లేవు. కాగా పురుష సంతానం కావాలని అనేక ఋక్కులున్నవి. "ఓయగ్నీ! క్రొత్తది గాయత్రీ చందస్సుగలది యగు నీ సూక్తములో స్తుతింపబడిన వాడవై మాకు ధనమును శూరులుగల యన్నమును (కొడుకులు మనుమలుననితాత్పర్యము.) సంపాదింపుము"[1]

ఋగ్వేదంలో పలుసార్లు పురుషసంతానం కావాలనే ఆకాంక్ష వ్యక్తం చేయబడింది.[2] దీనిని బట్టి బాలిక యొక్క హోదా మరీ హీనమైనది కాదని తేలుతుంది. కాని బాలుని హోదాతో మాత్రం సమానం కాదు.[3]

అధర్వవేదంలో బాలిక పుట్టరాదని ఋక్కులున్నాయి. "ప్రజాపతి, అనుమతి, సినీవాలి గర్భమును రూపొందించావు. ఇంకొకచోట (ఇంకొక గర్భములో) స్త్రీ శిశువును ఉంచుము."[4]

"ఓ పింగ : ప్రసవంలో శిశువును రక్షించు. పురుషుని స్త్రీగా మార్చనీయవద్దు." (అధర్వవేదం II-3, 23) అధర్వవేదంలో మంత్ర తంత్రాలకు ప్రాముఖ్యత ఇచ్చారు. గొడ్రాలితనం రాకుండా తాయత్తు (III-23,), పురుష సంతానం కలగటానికి ప్రార్ధన (VI-11) ఆడపిల్ల వద్దని ఆ ఋక్కులోనే అభ్యర్ధన, ఇవన్నీ అధర్వవేదంలో ఉన్నాయి.

బ్రాహ్మణాల కాలం సుమారు క్రీ. పూ 600 వరకు సాగింది. యజ్ఞయాగాదులపై బ్రాహ్మణాలు దృష్టి నిలిపాయి. అప్పటికి మతమూ సామాజిక జీవితమూ బాగా పెనవేసుకొని పోయాయి. కుమారునికి విలువ పెరిగింది. "కుమారుడు మోక్షసాధనం." (ఐతరేయ బ్రాహ్మణం VII 13-16) భవిష్యత్‌ను సాధించుకోవటానికి, అంటే శాశ్వతత్వాన్ని పొందడానికి కుమారుడు అవసరమయినాడు. కుమార్తెలు బరువుగా ఎంచబడినారు. బాలిక జననం అక్కరలేదని క్రతువులు చేయసాగారు. అమావాస్యనాడు, పూర్ణిమనాడు అందుకొరకు చేయవలసిన క్రతువులను తైత్తిరీయ సంహిత నిర్దేశించింది. ఈ తంతు అధర్వవేదములలోని తంతును పోలియున్నది. శునశ్శేపుని కధలో నారదుడు హరిశ్చంద్రునితో ఇలా అంటాడు.

"భార్య సహచరి. కుమార్తె దుఃఖభాజనురాలు. కుమారుడు ఉన్నతోన్నత స్వర్గంలో దీపం." (ఐతరేయ బ్రాహ్మణం VII-13). అమావాస్య అధిష్ఠాన దేవత అయిన సినీవాలిని గర్భంలోని ఆడపిల్లను మగపిల్లవాడిగా మార్చమనే అభ్యర్ధన ఉన్నది.

ఉపనిషత్తుల కాలంలో ఆడపిల్ల కలగాలని కోరుకుంటూ దానికి కొన్ని క్రతువులను నిర్దేశించారు. బృహదారణ్యకోపనిషత్తు (11, 4, 18)

గృహ్యసూత్రాలు గృహమునకు సంబంధించిన సంస్కారాలను ఎలా

చేయాలో నిర్దేశిస్తాయి. గృహం అంటే భార్య అని, ఇల్లు అని రెండు అర్థాలు. ప్రతి వేదానికి సంబంధించి గృహ్యసూత్రం తయారు చేయబడింది. అలా అశ్వలాయన గృహ్యసూత్రం, శాంఖాయన గృహ్యసూత్రం ఋగ్వేదానికి సంబంధించినవి.....బౌద్ధాయన గృహ్యసూత్రం, ఆపస్తంభ గృహ్యసూత్రం కృష్ణ యజుర్వేదానికి సంబంధించినవి. గృహ్య సూత్రకారులలో పాతవాడు బౌద్ధాయనుడు. భరద్వాజుడు, ఆపస్తంబుడు, హిరణ్యకేసిన్ తరువాతవారు. ఆంధ్రదేశంలో అశ్వలాయన గృహ్యసూత్రం అమలులో ఉంది.[5] శాంఖాయన గృహ్య సూత్రాలలో పురుషసంతానం కోసం గర్భాదానం శీమంతోన్నయనం అనే రెండు సంస్కారాలు పేర్కొనబడినాయి.[6] గోభిల గృహ్య సూత్రం సామవేదానుసారం తయారయినది. వివాహమయిన తరువాత నూతన వధువు అత్తవారింటికి వస్తుంది. బ్రాహ్మణ స్త్రీలు ఆహ్వానిస్తారు. ఆమెను కూర్చోపెట్టి ఆమె ఒడిలో బాలుని పెడతారు. బహుశః ఆమె బాలుని కనవలెనని ఆకాంక్షకు అది ప్రతీక కాబోలు.[7]

గర్భాదానం అనే సంస్కారము గర్భానికి సంస్కారమా, లేక స్త్రీకి సంస్కారమా అని మీమాంస వచ్చింది. స్త్రీకి సంస్కారమని యాజ్ఞవల్క్య స్మృతి వ్యాఖ్య మితాక్షర చెపితే గర్భానికి సంస్కారమని విశ్వరూప వ్యాఖ్య ప్రకటించింది. ఏయే దినాలలో భార్యాభర్తలు సంగమిస్తే పురుష సంతానం కలుగుతుందో ఆపస్తంభ యాజ్ఞవల్క్య మన్వాదులు తెలియజెప్పారు. పుంసవనం అనే సంస్కారం పురుష సంతానాన్ని కనడానికి ఉద్దేశించబడినది.[8] క్రతువులు చేయుటకు కుమారుడు అర్హుడు. కనుక పురుష సంతానాన్ని కాంక్షిస్తున్నారు. స్త్రీ జాతిపై ఆర్యులకు ద్వేషము లేదని ఆల్టేకర్ మహాశయుడు చెపుతూ ఆమె సుఖకరమైన, ఆనందప్రదమైన జీవితాన్ని గడపాలనే కోరికతోనే - కాదు ఆదుర్దాతోనే - ఆడపిల్ల పుట్టుకను వద్దనుకోవటం జరిగిందని వివరించారు.[9] ఈ వాదన సమర్థనీయం కాదు. మతభావన పెల్లుబికి, శ్రాద్ధకర్మలకు, పితృఋణం తీర్చుకోవటానికి తాపత్రయం హెచ్చి కుమారులు కావాలని దేవతలను తెగ ప్రార్థించారంటే కొంతవరకు యుక్తియుక్తంగా ఉంటుందేమో!

పుట్టిన ఆడపిల్లను చంపినట్లు ఋగ్వేదంలో అధర్వవేదంలో లేదు. అలాంటిది లేదు.బ్రాహ్మణాలలో మొదటిసారిగా ఈఆచారం కనిపిస్తుంది.[10] సోమయజ్ఞంలో కొన్ని క్రతువులు ఉన్నాయి. పురుష శిశువును తిసుకొనివచ్చి స్త్రీ శిశువును వదలి వేసారట. "చివరి స్నానానికి వెళ్తారు. కుండలను అక్కడ ఉంచి

వాయుదేవుని నిమిత్తం వాటిని ఎత్తుతారు. అందువలన కుమార్తెను పుట్టగానే వదలివేసి కుమారుని ఎత్తుకుంటారు."11 ఈ సంగతి మైత్రాయణి సంహితలో కథక సంహితలో ఉటంకించబడింది. ఇది స్త్రీ శిశుమరణాలకు సంబంధించినదని కొందరు పండితులు అంటున్నారు. ఆల్టేకరు మాత్రం ఇది ప్రసవసమయంలో మంత్రసాని చర్యకు సంబంధించినదని అంటున్నారు. మగపిల్లవాడు పుడితే మంత్రసాని పైకి ఎత్తుతుందట. ఆడపిల్లపుడితే నేలమీద పడుకోపెడుతుందట. ఈ వివరణను అంగీకరించినా, స్త్రీ శిశుమరణం రుజువు కాకపోయినా స్త్రీ పురుష వివక్ష రుజువవుతున్నది.

ఆడపిల్లలను పుట్టగానే చంపడం స్త్రీల గౌరవాన్ని కాపాడే నిమిత్తం తీసుకునే చర్య అని మన్‌మోహన్ కౌర్ అభిప్రాయం. ఈ దురాచారం ఉత్తర భారతంలో పలు ప్రాంతాలలో 1857-1900 మధ్య ఆచరణలో ఉంది. 'ఉన్నత' వంశస్తులు 'తక్కువ' కులస్తులకు పిల్లనివ్వటానికి అవకాశం ఆనాడు లేనందువలన కూడా ఈ ఆచారానికి బలం చేకూరుతుంది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లలో ప్రబలంగా ఉండేది. ఇంచుమించుగా అన్ని వర్గాలలోను ఈ సామాజిక జాడ్యం ఉండేది. మొగలు చక్రవర్తి జహంగీరు ఈ ఆచారాన్ని పసిగట్టాడు. 17 వ శతాబ్దంలో దీనిని నిరోధించ జూచాడు. రాజస్థాన్‌లోని జయపూర్ రాజు 1755 లో దీనిని ఆపించ ప్రయత్నించాడు. బ్రిటిషువారు దీనిని అరికట్టడానికి 1795 లోను (రెగ్యులేషను 21), 1804 లోను (రెగ్యులేషను 3) పూనుకున్నారు. 1836 నాటికి మాళ్వా రాజపుటానాలో ఏటా 20, 000 మంది స్త్రీ శిశువులను హతమారుస్తున్నట్లు లెక్కలు వచ్చాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లో 1869 సం॥లో పదిగ్రామాలలో 104 మంది బాలురు, ఒక బాలిక మాత్రం ఉన్నారట. మరో 27 గ్రామాలలో 284 మంది బాలురు 23 బాలికలు ఉన్నారట. 1970 లో (3 వ శాసనం) వచ్చిన శాసనం వల్ల కొంత తగ్గింది ఈ చెడ్డఅలవాటు.13 వేదకాలంనుంచి స్త్రీ పట్ల వివక్ష వల్లనే ఈ దుర్మార్గం సంభవించింది.

కుమార్తెలను ఋగ్వేదకాలంలో ముద్దుగా ప్రేమగా పెంచేవారు. ఆమెను 'దుహితృ' అనేవారు. ఆవు పాలు పిండుట, నెయ్యి చేయుట, పెరుగు చేయుట ఆమె ముఖ్యవిధులు. బట్టలు నేయుట, కుట్టుట, నీరు నింపుట, పైరులకు కాపలా కాయుట ఆమె చేసే ఇతరపనులు. ఆమె సోదరుడు

ఆమెకు రక్షకుడు. అందువల్ల తండ్రి తరువాత తండ్రి అంతవాడు. పోషణకు ఆమెకు తండ్రి ఆస్తిపై హక్కు ఉండేది. 14

ఋగ్వేదకాలంలో కన్య స్వేచ్ఛ కలిగి ఉండేది. వినోదప్రదర్శనలకు పండుగలకు ఆమె రాత్రిళ్లు వెళ్ళటానికి అవకాశమున్నది. ఉత్సవం పేరు 'సమన'. తెల్లవారిందాకా ఉత్సవం సాగేది. స్త్రీ పురుషులు స్వేచ్ఛగా తిరిగే వారు. ఒండొరులు కలసికొని స్వేచ్ఛగా మాట్లాడుకునేవారు. పురుషులనుండి స్త్రీలు దూరంగా వెళ్ళటం, వేర్పాటు లేవు. చిరునవ్వులు ఒలికిస్తూ కన్యలూ యువకులు తిరిగేవారు. ఆనాటి కన్య సిగ్గుతో కుంచించుకొని పోయేదికాదు. భయపడే వ్యక్తి కాదు. ప్రియుని సంకేత స్థలంలో కలసికోవడానికి వెను దీయదు ఆమె. బలహీనురాలుకాదు. సాహసి, స్వేచ్ఛాజీవి. ఆమెకు వ్యక్తిత్వం ఉండేది.14 అథర్వ వేదకాలంలో కూడ కన్యలు 'సమన' కు హాజరయ్యేవారు. ఆ రోజుల్లో కన్యకు 16 సం౹౹ నిండేవరకు వివాహమయ్యేది కాదు. దరిమిలా 8 సంవత్సరాల ఈడుకల పిల్లలకు పెళ్ళి చేయటం, తరువాత ముస్లిం దండ యాత్రలు, వీటివల్ల కన్యల స్వేచ్ఛ కుంటుపడింది. అయినా మతసంబంధ మైన ఉత్సవాలలో, జాతరలలో, ఊరేగింపులలో స్త్రీలు పాల్గొనటం జరుగుతూ వుండేది. అయితే ఇక్కడ ఒక అంశాన్ని విస్మరించరాదు. హిందూ సమాజం అనేక వర్గాలతో, వర్ణాలతో, కులాలతో కూడి వుండడం వలన ఆచారాలు సంప్రదాయాలు విభేదిస్తున్నాయి. ఆర్యులమని భావించే ద్విజుల పద్ధతి ఒకటిగా ఉంటే, తదితరుల ఆచారాలు వేరుగా ఉంటున్నాయి. అలాగే ధనవంతుల ఆచార వ్యవహారాలు ఒక కోవకు చెందుతాయి. శ్రామికుల అలవాట్లు మరో రకపువి. అయితే ఈ దేశ దౌర్భాగ్యం వల్ల శ్రామికులు, 'దిగువ' కులాలవారు వీరననుసరించే సామాజిక ఆచరణలను గురించి తగినంతగా పరిశోధన జరగ లేదు. కావ్యాలు ఎంత సేపూ నాగరికుల జీవితాలనే చిత్రించాయి. ధర్మశాస్త్రాలు 'కులీనుల' ను గురించి శ్రద్ధ వహించాయి. ఒక్క విషయం చెప్పి ఈ సంగతి (అంశాన్ని) ముగించవచ్చు. వేదకాలంలో కన్యకున్న స్వేచ్ఛ తరువాత తగ్గిపోయినదనేది వచ్చినిజం. విస్మరించరాని విశేషం.

విద్య :-

ఈనాటి హిందూ సమాజపు విద్యా రంగాన్ని తీసుకొని హైందవాన్ని మదింపు చేయటానికి వీలులేదు. ఎందుకంటే బ్రిటీషు పరిపాలనతోపాటు

వచ్చిన ఉదార వాద భావాలను త్వరగా గ్రహించి స్వంతం చేసుకున్నవారు హిందువులు. స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యం తర్వాత అనేక పర్యాయాలు తమ వ్యవహార సూత్రాలను, కాండను శాసనాల ద్వారా ఎంత గానో మార్చుకున్నారు. స్త్రీ శిశు మరణ నిషేధంతో 18వ శతాబ్దంలో వారి ఆచార వ్యవహారాలలో ప్రభుత్వ జోక్యం మొదలయింది. దాంతో బ్రిటిష వారి రాక తర్వాత వారు ఎంతగానో పురోగమించారు. అన్ని రకాలయిన విద్యను అభ్యసిస్తున్నారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన వెసులుబాటును వినియోగించుకుంటున్నారు. ఈ దిగువ ఇచ్చిన పట్టికలు యీ వాదాన్ని సమర్థిస్తాయి.

సం.	మద్రాసు	విద్యార్థులు	విద్యార్థినులు
1826		1,57,664	1623

1882 సం॥లో మద్రాసులో స్త్రీలలో అక్షరాస్యుల శాతం 0.5% కు తక్కువ. 1850 నాటికి స్త్రీల అక్షరాస్యత అత్యంత క్షీణస్థితికి వచ్చింది.15

(దీని కంటినూ స్టేట్ మెంట్)

అక్షరాస్యత : 1901 - 1071[16]

సం॥.	అక్షరాస్యులయిన పురుషుల సంఖ్య	పురుషుల మొత్తం జనాభాలో అక్షరాస్యుల శాతం	అక్షరాస్యులయిన స్త్రీల సంఖ్య	స్త్రీల మొత్తం జనాభాలో అక్షరాస్యుల శాతం	అక్షరాస్యుల్లో 1000 మంది పురుషులకు స్త్రీల సంఖ్య
1901	14, 690080	9. 83	996341	0. 69	68
1911	16, 938815	10. 56	1, 600763	1. 05	94
1921	19, 841438	12. 21	2, 782213	1. 81	140
1931	23, 969751	15. 59	4, 169105	2. 93	132
1951	45, 610143	24. 95	13, 650683	7. 93	299
1961	77, 939833	34. 44	27, 578928	12. 95	354
1971	111, 911000	39. 51	48, 699191	18. 44	435

1981 లో పురుషులలో అక్షరాస్యుల శాతం : స్త్రీల శాతం :

ఈ లెక్కలు భారత ప్రజలందరికీ వర్తిస్తాయి. హిందువులు జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్నారు కనుక, ఇంచుమించుగా వీటిని హిందువులకు సంబంధించిన లెక్కగా పరిగణించవచ్చును. మతాలవారీ లెక్కలను ప్రభుత్వం తయారు చేయటం లేదు. ఈ సందర్భంగా ఒక్క అంశాన్ని విస్మరించరాదు. పట్టణాలలో అక్షరాస్యత ఎక్కువ, అలాగే శ్రామికవర్గంకన్న తదితర వర్గాలలో ఎక్కువ. ఇవి దరహంమీద లెక్కలు. అయినా కొంతగా కొంత పరిస్థితిని విశదం చేస్తాయి. వీటిని దిక్సూచి క్రింద పరిగణించవచ్చు: పురోగతి ఎలా, ఎంత వేగంగా ఉందో కొంతవరకు తెలియజేస్తున్నాయి ఈ లెక్కలు.

స్త్రీలలో ఒకరు హైకోర్టు న్యాయమూర్తి, మరొకరు రాష్ట్రప్రభుత్వ మంత్రి, వేరొకరు కేంద్రప్రభుత్వమంత్రి అయినంత మాత్రాన ప్రగతి చాలదు. ఒక రాష్ట్రప్రభుత్వ కార్యదర్శి, మరొక కేంద్రప్రభుత్వ కార్యదర్శి, ఒక శాఖాధిపతి, ఒక శాస్త్రజ్ఞురాలు, ఒక పండితురాలు- వీరినిచూచి మురిసిపోతే లాభంలేదు. జనాభాలో సగం మంది స్త్రీలుంటే, 100కి ఒకరిద్దరిని చూచి భ్రమించటం పొరపాటు. అయితే 1850 తో పోలిస్తే ప్రగతిపథంలో మనం చాల పయనించినట్లు. అందులో హిందువుల స్త్రీల వాటా ఎంతో ఉంది. కాగా 1850 వరకు సాగిన హైందవం యొక్క చరిత్ర పరిశీలన ఈ సందర్భంగా చేస్తేనే హిందూ సమాజంలో నిండినిబిడీకృతమైన భావాలు ఎలాంటివి ఉన్నాయో తేలుతుంది. ఇప్పటికీ స్త్రీ విద్యపట్ల, ముఖ్యంగా శ్రామికవర్గాలలో, 'దిగువ' కులాలలో ఉన్న వైముఖ్యానికి కారణాలు ద్యోతకమవుతాయి. సమస్య అవగాహన అవుతుంది. కనుక వెనుకకు మళ్ళి చూడటం అవశ్యకర్తవ్యం.

ఋగ్వేదకాలంలో ప్రకృతిని గురించి గానంచేసేవారు. కవులు, ఋషులు సంఖ్యలో బాగా వృద్ధిచెందారు. ఆనాడు లిపిలేదు. వల్లెవేయటం ద్వారా సాహిత్యాన్ని భద్రపరుచుకున్నారు. బోధకూడా అలాగే సాగేది. స్త్రీ విద్య ఆ సమాజానికి అవసరం అయింది. వారు పరాయి దేశానికి వలస వచ్చారు. స్థానికులతో యుద్ధాలు, కొట్లాటలు జరిగాయి. వారు అరణ్యాలను దాటిపోయి జనపదాలను నిర్మించుకోవాల్సి వచ్చింది. అందువల్ల స్త్రీ పురుషులు పరస్పరం సాయం చేసుకోవాల్సిన పరిస్థితి కలిగింది. అందుచేత స్త్రీ

విద్యకు ప్రాధాన్యత వచ్చింది.

"విద్యావతియైన అవివాహిత కుమార్తెను పండితుడైన పురుషునికి ఇచ్చి వివాహం చేయవలెను. బాల్యంలో ఆమెకు వివాహం చేయాలని ఆలోచించ వలదు." (రుగ్వేదం III. 55,16)

" బ్రహ్మచర్యం పాటించి చదువు పూర్తి చేసిన యువతిని పండితుడైన పురుషునికి ఇచ్చి వివాహం చేయవలెను." (రుగ్వేదం VIII-1)

బ్రహ్మచర్యం అంటే అధ్యయనం చేస్తానని ప్రమాణం చేయటం, దానిని పాటించటం. పెండ్లికి ముందుగా విధిగా జరిగేది విద్యాసముపార్జన. క్షత్రియ స్త్రీలు ఆయుధ విద్యను, యుద్ధవిద్యను నేర్చుకునేవారు. భాష, సాహిత్యం, లలిత కళలన్నీ స్త్రీలకు అందుబాటులో ఉండేవి. స్త్రీలు కవులుగా. రుషులుగా పేరుపొందారు. ఘోష, లోపాముద్ర, ఆపాల, రోమశ, సూర్య వీరు గణనీయులు. స్త్రీలు సంగీతాన్ని అభ్యసించేవారు. సోమరసాన్ని పిండేటప్పుడు పాటలు పాడేవారు. (రుగ్వేదం IX 66, 8). పాటతో పదం కలపటం ప్రేణఖం (రుగ్వేదం VII 87, 5; 88; 3). నృత్యం వృత్తిగా స్వీకరించిన వారున్నారు. ఆచ్ఛాదనలేని వక్షస్థలంతో నాట్యంచేసేది నాట్యగత్తె. (రుగ్వేదం I 92,4). యుద్ధాలలో స్త్రీలు పాల్గొనేవారు. ఖేలుని భార్య విస్పల యుద్ధంలో కాలు పోగొట్టుకున్నది. ముద్గలుని భార్య ముద్గలాని శత్రువులను తరిమికొట్టింది. ఆర్యులు వచ్చేనాటికి దేశవాసులుగా ఉన్న దస్యులు స్త్రీలను యుద్ధరంగంలోకి తెచ్చేవారు. ఇంద్రుడు (ఆనాడు ఆర్యుల నాయకుడు) వృత్రాసురుని తల్లిని చంపాడు. (రుగ్వేదం V 30, 9).

"విదథ" అనేది శిష్టుల సభ. పద్యపఠనం, రుక్కులగానం, పురాణ కథా, శ్రవణం, యజ్ఞయాగాది క్రతువులపై ప్రసంగాలు జరిగేవి. వివాహ మప్పుడు పెండ్లికుమార్తె విదథలో ప్రసంగించేది. (రుగ్వే. X 85, 26)

స్త్రీ ఆనాడు దివ్యగాయనిగా, ప్రతిభావంతురాలయిన రుషిగా, విద్యనార్జించి 'అధికారి'గా తయారయ్యేది.

రుగ్వేదంలో కొన్ని రుక్కులను స్త్రీలు వ్రాశారని చెప్పబడుచున్నది. అవి వలుర్వకాలు.

(i) పూర్తిగా. స్త్రీలచే సృజింపబడినవి.

(ii). కొంత భాగం స్త్రీలవని చెప్పబడినవి.

(iii) స్త్రీ రుషులు వ్రాశారని చెప్పబడినా ఎవరివి అనే విషయంపై అనుమానం ఉన్నవి.

అపాల ఇందుడ్రిని కొనియాడుతూ రుక్కు చెప్పింది. విశ్వావర అగ్నిని స్తోత్రం చేసింది. లోపాముద్ర, శశియాసి రెండవ కోవకు చెందినవారు. ఘోష, కక్షీవతి, సూర్యసావిత్రి, ఇంద్రాణి, శ్రద్ధ, కామాయని, శచిపౌలోమి, సర్పరాణి, ఊర్వశి వీరు మూడవ కోవకు చెందినవారు. ఘోష తప్ప అందరూ దేవతా స్త్రీలే.18

స్త్రీలకు ఉపనయనం ఉండేది. ఆ కర్మలో ఆమె నడుముకు పలుపు (యోక్త్ర) కట్టేవారు. కర్మలలో పాల్గొనడానికి ఆమెకు ప్రవేశం కల్పించటానికి అది చిహ్నమట. ఉపనిషత్తుల కాలంలో బ్రహ్మజ్ఞాన సముపార్జన విషయంలో పురుషులతో సమదీటుగా ఉన్న స్త్రీలు గార్గి, మైత్రేయి, వదవ ప్రాథితేయి. విద్యార్థినులు రెండు రకాలు. జీవితాంతం మతశాస్త్రాన్ని అధ్యయనం చేసేవారు 'బ్రహ్మవాదినులు'. వివాహమయ్యేవరకు విద్యను ఆర్జించేవారు సద్యోద్వాహులు.

కాశకృత్స్నవ మీ మాంసపై ఉద్గ్రంథం వ్రాసింది. ఆమెను అనుసరించిన పండిత స్త్రీలను కాశకృత్స్నలు అని పిలిచేవారు.

ఆత్రేయ వేదాంతాన్ని అధ్యయనం చేసిన పండితురాలు. వాల్మీకి, అగస్త్యుడు వీరి వద్ద ఆమె విద్యను ఆర్జించింది. తరువాత బౌద్ధంలో అనేక మంది స్త్రీలు సంఘంలోచేరి సన్యాస జీవితాన్ని గడిపారు. 'తేరీగాథ' అనే గ్రంథాన్ని అలాంటి స్త్రీలు రచించారు. అందులో 32 మంది అవివాహితులై సంఘంలో చేరినవారు. 10 మంది వైవాహిక జీవితాన్ని గడిపి విసిగి వేసారి సంఘంలో చేరినవారు, చాలా మంది స్త్రీలు ఉపాధ్యాయవృత్తి చేపట్టారు. వారిని 'ఉపాధ్యాయలు' అని పిలిచేవారు. భాగవత పురాణంలో దాక్షాయణులు కుమార్తెలు మతశాస్త్రంలో తత్వశాస్త్రంలో, పండితులని వ్రాయబడినది.1 క్రీ. పూ. 300 వరకు స్త్రీ విద్య విషయంలో హిందూ సమాజం శ్రద్ధ వహించింది. గాధా సప్తశతిలో అనేకమంది కవయిత్రుల పేర్లు కానవస్తాయి. రేవ, రోహ, మాధవి, అనులక్ష్మి మొదలగువారు అలాంటివారు. సంస్కృత కవుల చరిత్రలలో పెక్కుమంది స్త్రీల పేర్లు ఉటంకించబడినాయి. మారుల, మోరికా, సుభద్రా ఆకోవకు చెందినవారు. ప్రియదర్శిని, శకుంతలా, కాదంబరిలాంటి కావ్యాలలో నాయికులు లలితకళలలో ప్రవీణలు. అయితే వారు ఎక్కువగా

రాజవంశీకులు. శాతవాహనుల కాలపు నాయనికా (క్రీ, పూ. 2వ శతాబ్దం) ప్రభావతీగుప్త 'వాకాటక వంశం' : (క్రీ. త. 4వ శతాబ్దం), చాళుక్యవంశపు విజయభట్టారిక (క్రీ. త. 7వ శ.), కాశ్మీర్‌కు చెందిన సుగంధ, దిద్దా (క్రీ.త. 10వ శతాబ్దం) పరిపాలనా దక్షులు. క్షత్రియ కుటుంబాలలో శస్త్రవిద్య నేర్పేవారు. కాకతీయ రుద్రమదేవి ఇందుకు తార్కాణము. కర్నాటకలో, రాజపుత్ర స్థానంలో, మరాటా దేశంలో ఇట్టివారు, తటస్థిస్తారు. వయసు వచ్చిన ఆడపిల్లలు గృహ నిర్వహణలో ఎక్కువ బాధ్యత తీసుకునేవారు. శకుంత, కుంతి అలా విధి నిర్వహణచేసి అతిధి అభ్యాగతులను ఆదరించారు.

వేదకాలంలో, పురాణ కాలంలో స్త్రీలు కందుకక్రీడలో పాల్గొనేవారు. బంతి ఆటద్వారా తగినంత శరీరవ్యాయామాన్ని పొందేవారు (మహాభారతం V 93, 63; III, 112,16). ఈ ఆటలు రామాయణంలో, 'కామసూత్రం'లో అభివర్ణితమయినయి.[20]

సహవిద్య :- సర్వసామాన్యంగా వేదకాలంలో ఆడపిల్లలు ఇంట్లో పెద్దలవద్ద విద్యను అభ్యసించేవారు. అన్నలు, తమ్ములు, అక్కలు, చెల్లెళ్లు కలసి చదువుకునేవారు. ఉపాధ్యాయులు తక్కువ సంఖ్యలో ఉన్నందున ప్రత్యేక శిక్షణ కావలసివచ్చినపుడు పురుష ఉపాధ్యాయులవద్ద విద్యార్థులు, విద్యార్థినులు కలసి విద్యార్జన చేసేవారు। రాముని కుమారులు లవకుశలతో పాటుగా ఆత్రేయి చదువుకున్నట్లు భవభూతి విరచితమైన ఉత్తరరామ చరితంలో ఉన్నది. కహాడ సుజాతలు, రురుప్రమద్వరలు; సహాధ్యాయులు, తక్షశిలకు విద్యార్థినులు వెళ్ళి చదువుకున్నట్లు జాతక కధలలో లేదు. అంటే ఎక్కువ దూరం వెళ్ళి స్త్రీలు విద్యాభ్యాసం చేయలేదని తెలుస్తుంది. కామందకి, భూరివసు, దేవరాతలతో కలసి చదువుకున్నట్లు భవభూతి రచించిన మాలతీ మాధవం చెప్పుచున్నది. ఏదయినా ఉన్నతవిద్య 'ఉన్నత' కుల సంజాతులకు సంపన్నులకు మాత్రమే పరిమితమయినదని చెప్పవచ్చును.[21]

స్త్రీ పురుషుల ఆటపాటలు :-

వేదకాలంలో కన్య సామాజిక ఉత్సవాలన్నింటిలో పాల్గొనేది. భర్తను వెతుక్కోవటానికి ఆమె 'సమన'కు వెళ్ళేది. (ఋగ్వే - VII 2,5), తల్లులు, కుమార్తెలను అలంకరించి పంపేవారు. అచ్చట వరులు తమకు కాబోయే భార్యల అభిమానాన్ని చూరగొనడానికి ప్రయత్నిచేవారు. (ఋగ్వే IV 58,

8: ఋగ్వే VII 2, 5). 'సమనలు' సాధారణంగా వసంత ఋతువులలో ఏర్పాటయ్యేవి. తాళధ్వనులు చెలరేగేవి. యువతీయువకులు చెట్టాపట్టాలు వేసుకొని నృత్యం చేసేవారు. పగలు గుర్రపు పందెములు, రధాల పోటీలు జరిగేవి. రాత్రివేళ ఇతర వినోదాలు-నృత్యగాన విశేషాలు సాగేవి.

భారతకాలంనాటికి స్త్రీ పురుషులు కలసి ఆడటం ఆగిపోయింది. క్రీ.శ. 1, 2 శతాబ్దాల కాలంనాటి కామశాస్త్రంలో నాగరికుల జీవిత సరళి విశదీకరించబడింది. నాగరికుల గృహాన్ని రెండు భాగాలు చేస్తారు. అంతఃపురం లాంటి దానిలో భార్యలు నివశిస్తారు. ముందుభాగమందున్న ఇల్లు పురుషుని ఆధీనంలో ఉంటుంది. దానిలోకి భార్యలకు ప్రవేశం లేదు. యజమాని ప్రియురాండ్రయిన నాయికలకు మాత్రమే ప్రవే శం వుండేది. గణిక సామాన్యంగా నాయికగా ఉంటుంది. నాగరికుడు నెలకొకసారి 'గోష్టి సమవాయం' ను సమావేశ పరుస్తాడు. దానికి నాగరికులు తమ ప్రియురాండ్రతో విచ్చేస్తారు. అక్కడ శృంగార కవిత్వ పఠనం మొదలయినవి సాగుతాయి. నెలకు రెండు సార్లు 'సమపానకం' జరుగుతుంది. అచ్చట చేరిన, స్త్రీ పురుషులు మత్తుపానీయాలను సేవిస్తారు. ఈ రెండుగాక నాగరికులువారి ప్రియురాండ్రయిన గణికలు విహారాలకు వినోదాలకు ఇతర ప్రదేశాలకు వనాలకు, ఉద్యానవనాలకు వెళ్తారు. కనుక స్త్రీ పురుషులు కలసి తిరగడమనేది గణికలకు మాత్రమే సాధ్యం చేయబడిందని గ్రహించాలి. శూద్రకుని మృచ్ఛకటికంలో కొన్ని విషయాలు వెలికివస్తున్నాయి. ఈ గ్రంథం కూడా క్రీ. శ. 1, 2 శతాబ్దాల నాటిది. గృహిణులకు ఉండే గౌరవ మర్యాదలను చూచి వేశ్యలు అసూయ పడేవారు, వేశ్యల స్వేచ్ఛను, వైభవాన్ని చూచి గృహిణులు ఈర్ష్యాళువులయ్యేవారు.

ధర్మశాస్త్రయుగం, పురాణకాలం స్త్రీకి అంధకార యుగాలని చెప్పవచ్చును. స్త్రీని చూస్తే భయం, స్త్రీని నిరసించడం, ఆమె స్వేచ్ఛను అరికట్టడం, ఆమెను విద్యాజ్ఞానాలకు దూరంగా ఉంచటం, ఆమె పురుషుని అంటిపెట్టుకొని బ్రతికేలాగు చేయడం ఇవి ఆనాటి పురుషుల చర్యలు.22 ఇట్టి పరిస్థితులలో వివాహితులు కలసి మెలసి తిరగడమనేది జరగడం అసంభవం.

ముస్లింయుగంలో పర్దా అవతరించింది. భార్యలను రక్షించుకోవడమే పురుషుని కర్తవ్యంగా పరిణమించింది. విందులు, వినోదాలకు స్త్రీ దూర మయింది.

ఆధునిక కాలంలోకూడ కొండజాతులలో, కొన్ని ప్రాంతాలలో ఆది వాసులలో తప్ప మరెచ్చటా స్త్రీ పురుషుల నాట్యాలు సంగీతాలు లేవు. నగర వాసులలో ఐరోపియను సంస్కృతిని సంతరించుకున్న వర్గాలలో తప్ప మరె చ్చటా కానరావు. సినిమాలలో ప్రదర్శితమయ్యే దృశ్యాలు వాస్తవ జీవితాలలో కానరావు. బహుశః అందుకనే కాబోలు పెండ్లికాని యువతీ యువకులు కలసి మెలసి ఆడిపాడుతుంటే సామాన్య ప్రజానీకం మహా ఆసక్తితో తిలకిం చడం జరుగుతున్నది. స్త్రీ పురుషులు పాల్గొనే సభలు, సమావేశాలలో కూడ వారిరువురు విడివిడిగా కూర్చొనడం మాట్లాడుకోవటం జరుగుతున్నది. ఇది అంతా క్రీ. పూ 300 కాలం నుండి జరిగిన స్త్రీ పతన ఫలితమే.

సెక్సు పరిజ్ఞానం :- సెక్సు పరిజ్ఞానాన్ని కన్యలకు అందించే ప్రత్యేక కృషి జరిగినట్లు నిదర్శనాలు లేవు, కాగా వాత్స్యాయనుని కాలానికి వేశ్యా సంగమం ప్రతిష్టాకరం అయింది. దానిలో కామశాస్త్రం తతిమ్మా శాస్త్రాల వలె అధ్యయన విషయమయింది. మరల 10, 12 శతాబ్దాలలో నిర్మించబడిన దేవాలయాలలో—ముఖ్యంగా సూర్యదేవుని పరంగా వచ్చిన దేవాలయాలలో—స్త్రీ పురుష శృంగార ఘట్టాలు చిత్రితమయినాయి. ఇవి తాంత్రిక మత ప్రభావ ఫలితాలా? లేక సెక్సు పరిజ్ఞానాన్ని అందించడానికి వాహికలా అనేది మీ మాంస.

ధర్మశాస్త్రాలను పరికిస్తే 16 సంస్కారాలను ద్విజులకు విధిక్స్రతం చేశారు. అందులో కొన్ని సెక్సు సంబంధమైనవే. స్త్రీని కేవలం భార్యగా, తల్లిగా చూడటంతో ఒకరంగా ఆమె జీవితంలో సెక్సుకు ప్రాధాన్యత ఇచ్చినట్లే. వివాహం స్త్రీకి తప్పనిసరియైన సంస్కారమయింది వేదకాలం అంతరించే నాటికి. రజస్వలానంతరం 'వివాహాలలో గర్భాదానం చతుర్థికర్మ. అంటే పెండ్లిలో నాలుగవనాడు జరిగే కర్మ. రజస్వల కాకముందు పెండ్లి అమలులోకి వచ్చిన తరువాత ఇది వేరే ప్రత్యేకంగా ఒక సంస్కారమయింది. ఏదైనా గర్భాదానపు మంత్రాలు సంస్కృతం తెలిసిన స్త్రీలకు సెక్సు పరిజ్ఞానాన్ని కొంత అందిస్తాయి. ఈనాడు వాటిని తెలుగులో వ్రాస్తే భారతీయ

సంస్కృతిని ఆరాధించే పెద్దలే అశ్లీలమని, అసభ్యమని గగ్గోలు పెట్టగలరు. అసలు స్త్రీ జీవితం కొందరి దృష్టిలో రజోదర్శనంతోనే ప్రారంభమవుతుంది. రజస్వల అయితే ఉత్సవాలు, విందులు, వినోదాలు ఈ అంశాన్ని రుజువు చేస్తున్నాయి. వైఖానస స్మార్తసూత్రాలలో పేర్కొనబడిన గర్భాదానం, పుంసవనం, గర్భరక్షణ. సీమంతోనయనం[23] ఇవన్నీ సెక్సుకు సంబంధించిన సంస్కారాలే.

ఆదిమ సమాజాలలో రజోరక్తం అంటే భయం ఉండేది. అది కొన్ని సమాజాలలో వెర్రితలలు వేసింది. హిందూ సమాజంలో అస్పృశ్యతకు దారి తీసింది. బహిష్టు అయిన స్త్రీ 4 మూరల దూరంలోను, ప్రసవించిన స్త్రీ 8 మూరల దూరంలోను ఉండవలెనని బృహస్పతి నిర్దేశించాడు.[24] ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి భావాలు ఎన్నో దర్శనం ఇస్తాయి ధర్మశాస్త్రిలలో. ముస్ముందు వివాహం అనే అధ్యాయంలో దీనిని గురించి సవివరంగా చర్చించవచ్చు. ఆధునిక విజ్ఞానానికి ఈ భావాలు దూరమని తెలియజెప్పడానికే దీనిని ఉటంకించడమైనది.

అధ్యాయం 2

పాదదీపికలు

1. ఋగ్వేదము : మం 1 అనువాకం 4. సూక్తం 12
   ఋక్కు 121.
   ఆంధ్రవేదములు - ఋగ్వేదము ప్రథమ సంపుటము
   (వినయాశ్రమము 1940) పుట 25.
2. ఋగ్వేదం **I - 91, 20; 92, 13**
   III 1, 23; X 85, 25; 41, 42, 45
3. వేదకాలంలో స్త్రీలు : శంకుతలా రావు శాస్త్రి
   Women in the vedic Age : Sakuutala Rao Sasty. (Bheratiya vidada Bhavan 1952)
   పుట 2

4. అధర్వవేదం VI 11, 3
5. వేదకాలంలో స్త్రీలు : శకుంతలరావు శాస్త్రి; పుటలు 116, 117
6. డిటో పుట 132
7. డిటో పుట 168
8. ధర్మశాస్త్రాల చరిత్ర : కానే, పుట. 218
9. హిందూ నాగరికతలో స్త్రీల స్థానం : ఆల్టేకర్; పుట 6
10: వేదకాలంలో స్త్రీలు : శకుంతలరావు శాస్త్రి; పుట 42
11. తైత్తిరీయ సంహిత VI 5, 10; మైత్రాయిణ సంహిత IV 6, 4
12. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో స్త్రీలు : మన్‌మోహన్ కౌర్
(Women in India's freedom struggle)
: MANMOHAN KAUR
Sterling Publishers Delhi-1985)
పుట 1.
13. డిటో పుటలు 7 - 11
14. ఋగ్వేదకాలంలో స్త్రీలు : ఉపాధ్యాయ
Women in Rigveda : UPADHYAYA (1932)
అధ్యాయం - 2
15. ఆల్టేకరు పుటలు 24, 25
16. స్టేటస్ కమిటీ రిపోర్టు : పుట 265
'Towards Equality' (Report of the committee of status of women in India) : Govt of India, social welfare Dec 1974.
17. ఉపాధ్యాయ : పుట 189.
18. వేదకాలపు స్త్రీలు : శకుంతలారావు శాస్త్రి : పుట 29.
19. డిటో పుట 79.
20. ఆల్టేకరు పుటలు 11-13
21. ఆల్టేకరు 1 వ అధ్యాయము
22. యుగయుగాలలో భారతీయ మహిళలు : పి. థామసు
అధ్యాయం 8
23. ధర్మశాస్త్రాల చరిత్ర : కానే పుటలు 195-197
24. డిటో డిటో - 174

అధ్యాయం

3 వివాహం

మానవ సమాజపు తొలిదశలో వివాహవ్యవస్థ ఏర్పడలేదు. తరువాత గుంపు పెళ్ళిళ్ళు అమలులోకి వచ్చాయని మార్గన్ చెప్పాడు. అలాకాక ఏక భర్తృత్వ, ఏక భార్యాత్వ సంబంధాలుండేవని వెస్టర్‌మార్క్ మరో భావాన్ని ప్రతిపాదించాడు. కాని ఈ రెండో వాదనకు తగిన ఆధారాలు లేవు. మొదట్లో స్వైరవిహారం ఉండేదని నిర్ణయించుకోవచ్చు. పెండ్లి శారీరక వాంఛలను, మానసిక అవసరాలను తీర్చేదని డి. యన్. మజుందార్ అనే సామాజిక మానవ శాస్త్రజ్ఞుడు అంటాడు. "ఒక పురుషుడు లేక అనేకమంది పురుషులు ఒక స్త్రీ లేక అనేకమంది స్త్రీలతో పెట్టుకున్న సంబంధాన్ని సంఘాచారము లేక శాసనం గుర్తించాలి. ఆ సంబంధం ఏర్పరచుకున్న వ్యక్తులకు, అంతే కాక, వారి పిల్లలకు కూడా హక్కులను, బాధ్యతలను నిర్ణయించేదిగా ఉండాలి" అ సంబంధాన్ని వివాహమనవచ్చునని వెస్టర్ మార్క్ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.1 మొదట్లో మాతృస్వామ్యం ఉండేది. తల్లిద్వారా సంతానాన్ని గుర్తించడం, తల్లియే కుటుంబానికి కుదురు కావటం దానికి లక్షణాలు. ఈ వ్యవస్థలో తల్లికి, మేనమామకు ప్రాముఖ్యత ఉంటుంది. ఈ వ్యవస్థ దక్షిణాదిన మళయాళ దేశంలో పూర్వం నాయర్లలోను, ఉత్తరాదిన ఖాసీలు ఈశాన్యాన ఖాసాలు మొదలయినవారిలోను ఉండేది. పురుషుని ఆధీనంలోకి స్త్రీ వచ్చిన తరువాత పితృస్వామ్య వ్యవస్థ వచ్చింది. తండ్రికి ప్రాధాన్యత పెరిగింది తండ్రిద్వారా ఆస్తి సంక్రమణం జరిగింది.

ఆర్యులు వచ్చేనాటికి దేశంలో అనార్యులు నివాసమున్నారు. వారిలో వివాహ సంబంధం కేవలం లౌకికం. తమిళులు అనార్యులు. వారి ప్రాచీన గ్రంధాలయిన 'తొల్కాపియం', 'సిలప్పానికరం' లలో సంతానప్రాప్తి కోసం పురుషునితో సంబంధం పెట్టుకునేవారు. అది ప్రేమ వివాహం. అది స్త్రీల స్వంత విషయం. పురుషునికి బిడ్డలయెడ ఆర్థిక పరమైన బాధ్యతలు లేవు. ఆర్యను దండయాత్రలను ఆపినవారు అసురులు, రాక్షసులు. వారిలో బలి, బాణుడు ముఖ్యులు. హిడింబి, ఉలూపి వివాహమాడినా పుట్టింటనే ఉన్నారు.

అది మాతృస్వామ్య లక్షణం. అనార్యులలో స్త్రీలకు ఎక్కువ స్వేచ్ఛ ఉండేది. నీలగిరి తోడాలలో బహు భర్తృత్వం ఉన్నది. సంతానానికి తండ్రి ఎవరో తల్లి 7 వ మాసపు గర్భిణీగా ఉండగా నిర్ణయిస్తారు. అంటే తండ్రికి, బిడ్డకు కేవలం ఆర్థికపరమైన సంబధమేకాని శారీరకసంబంధం లేదన్నమాట.

మానవ నాగరికత పురోగమించిన దశలో సంస్కృతీ ప్రభావం వలన కుటుంబ వ్యవస్థ ఉద్భవించిందని ఋగ్వేదకాలపు స్త్రీలను గురించి పరిశోధన చేసిన ఉపాధ్యాయ అంటారు. వివాహ వ్యవస్థ పుట్టుక, పరిణామాలను గురించిన కథలు మహాభారతంలో ఉన్నాయి. దీనిని గురించి వివరించుకునే ముందుగా కుటుంబ వ్యవస్థ ఎలా అవసరమయిందో పరిశీలించాలి. ఋగ్వేద కాలానికి పూర్వం, శర్మిష్ట యయాతితో చెప్పినమాట గమనార్హం. తన స్నేహితురాలి భర్త తనకూ భర్తేనని శర్మిష్ఠ యయాతితో అంటుంది. అంటే వివాహం అనే వ్యవస్థ అప్పటికి స్థిరపడలేదన్నమాట.

కుటుంబ ఆవసరానికి కారణాలు :-

I) ఆర్యులకు చుట్టూ శత్రువులు. వారి సంఖ్య హెచ్చుగా ఉండేది. అందువల్ల ప్రతి ఆర్యుడు పదిమంది సంతానాన్ని కాంక్షించేవాడు.

II) ఆర్య రక్తం యొక్క పవిత్రతను నిలబెట్టాలని తాపత్రయం.

III) పితృరుణం తీర్చుకోవటానికి సంతానం అవసరం.

IV) సంచార పద్ధతిని దాటి ఆర్యులు స్థిరపడ్డారు.

కుటుంబాన్ని చక్కదిద్దటానికి ఇల్లాలు కావాల్సివచ్చింది. భార్య తనఅత్త మామలకు, ఆడబిడ్డలకు పశువశాదులకు సామ్రాజ్ఞి. (ఋగ్వే.X-10,85) కనుక తాత్కాలిక సంబంధంవల్ల వచ్చిన స్త్రీ కాక కుటుంబంతో మమేకమయ్యే భార్య కావాలి. వివాహం సామాజిక, ఆర్థిక అవసరమయింది.2

తొలిదశలోని ఆర్య స్త్రీలలో వివాహిత స్త్రీకి కూడా కొంత లైంగిక స్వేచ్ఛ ఉండేది. అతిథిని ఆమె తన లైంగిక సంబంధంతో తృప్తిపరచవలసి ఉండేది. అలా చేయబోయిన తల్లిని చూచి కటకటపడి శ్వేతకేతు అనే ఋషి ఆ ఆచారాన్ని ఖండించాడు. దీర్ఘతమస్సు గ్రుడ్డివాడు; వివాహితుడు.

భార్యను పరపురుషులతో సంపర్కం పెట్టుకొని ధనార్జన చేయనిచ్చేవాడు. అలా కొంతకాలం సాగింది. ఆమె అప్రతిష్ఠ పాలయింది. ఆ జీవితానికి ఇక స్వస్తి చెపుతానని పట్టుపట్టింది. కాదు కూడదన్నాడు భర్త. దాంతో తల్లి కుమారులు కలిసి అతనిని కట్టి పడవేసి నదిలో పారవేశారు. తరువాత అతడు బయటపడి, బ్రతికి, వివాహిత స్త్రీలకు పరపురుష సాంగత్యం కూడదని కట్టడి చేశాడు. ఇలా ఉద్దాలకుడు, శ్వేతకేతువు, దీర్ఘతమస్సుడు అనే ఋషులు వివాహిత స్త్రీల లైంగిక సాంగత్యాన్ని భర్తలకే పరిమితం చేశారు. వరుణ ప్రఘాన యజ్ఞంలో భార్యాభర్తలిరువురూ పాల్గొంటారు. భర్త భార్యను ఇలా అడుగుతాడు "నీ ప్రియుల పేర్లు చెప్పుము". ఆమె ఆ పేర్లను చెప్పగానే ఆమె పరిశుద్ధ అవుతుందట. దీనినిబట్టి ఒకనాడు జారత్వం ఉండేదని తెలుతుంది.

ఋగ్వేదకాలంలో రాజకీయ కారణాల వలన వివాహ వ్యవస్థ ఏర్పడితే తరువాత పితృరుణం తీర్చుకోవడానికి మగ సంతతి కావలసి వచ్చి వివాహం యొక్క అవసరం అలా అన్వయం చేసి చెప్పుకున్నారు. అన్ని సంస్కారాల లోకి ముఖ్యమైనదిగా స్త్రీలకు వివాహం నిర్దేశింపబడింది. పదాలకు అర్థాలను మనం గమనిస్తే వివాహ వ్యవస్థ లక్షణాలు గోచరమవుతాయి. ఉద్వాహం అంటే తల్లి దండ్రుల ఇంటినుండి వధువును తీసుకొని వెళ్ళుట. వివాహమంటే భార్యగా చేసుకొనుటకు తీసుకోని వెళ్ళుట. పాణిగ్రహణం అంటే వధువు యొక్క చేతిని వరుడు గ్రహించుట. దేవతలకు బలులు ఇవ్వడానికి, సంతానం కోసం, గృహస్థ ధర్మ నిర్వహణ కొరకు ఇల్లాలు అవసరమట.

ఎన్నిరకాల వివాహాలు? :- బ్రాహ్మం, గాంధర్వం. రాక్షసం, అసురం, ప్రాజాపత్యం, ఒప్పందపు పెళ్ళి ఋగ్వేదకాలంలో అమలులో ఉన్నట్లు తెలుతుంది. కన్య ఎంపిక చేసిన వరునికే ఇచ్చి సాదారణముగా వివాహం చేసేవారు తల్లి దండ్రులు. ప్రాజాపత్య వివాహం ప్రబలంగా ఉండేది. ఇది సాలంకృత కన్యాదానం. పెండ్లికుమార్తెకు తల్లి దండ్రులు కట్నం (Dowry) ఇచ్చేవారు. అంతేకాని పిల్లను అమ్మే ప్రసక్తి లేదు. వధువుకు మంచం, పెట్టె, నిత్యావసర వస్తు సామాగ్రి ఇచ్చేవారు.ఇ ది ఆమె స్త్రీ ధనం. దీనినే కట్నం అనేవారు. పిల్ల సమ్మతితో నిమిత్తం లేకుండా వరుడు ఆమె బందుగులకు బహుమతులను ఇచ్చి వివాహమాడటం అసుర బ్రాహ్మం అని

అని చెప్పేవారు కన్య బంధుగులకు బహుమతులు ముట్టాయి కనుక అసురం. తల్లి దండ్రులు వివాహం చేశారు కనుక బ్రాహ్మం. ఇతర దేశాలలో కన్యను కొనడం ఉండేది. మనదేశంలో ఆర్యులు వివాహకాలమందు కన్యకు కట్నం ఇస్తారు. ఒక గాంధర్వం తప్ప ఏరకపు పెండ్లి అయినా వివాహ క్రతువు ప్రాజాపత్యం పద్ధతిలో జరగవలసినదే. ఒక పందెంలో గెలిచినవానిని వరించు స్వయంవర పద్ధతి. అశ్వినులు పందెంలో గెలిచి 'సూర్య'కు భర్తలయినట్లు కథ ఉన్నది. గాంధర్వ వివాహం పేరు ప్రత్యేకంగా చెప్పలేదు. కాని ఒక కథను బట్టి అలాంటి వివాహ విధానం ఉన్నట్లు తేలుతుంది. విమద బ్రాహ్మణ రుషి. కామద్యు రాజన్య స్త్రీ. వారి వివాహానికి తల్లిదండ్రులు అంగీకరించలేదు. అంత ప్రేమికులు పారిపోయి కాపురం చేయసాగారు. దానిని తల్లిదండ్రులు తరువాత ఆమోదించారు. పురుమిత్ర రాజకుమార్తె కామద్యును అశ్వినులు ఎత్తుకొనిపోయి విమదునికి వివాహం చేసినట్లు ఒక కథ వున్నది. పురూరవుడు ఊర్వశి వీరి పెళ్ళి ఒప్పందపు పెళ్ళి. ఇది సాహచర్య దాంపత్యం. ఉషస్సు సూర్యుల మాట చెప్పి అదే అని మాక్సుముల్లరు వ్యాఖ్య. ఏమయినా ఒప్పందపు వివాహం అమలులో ఉన్నట్లు ఇది నిదర్శనము. గృహ్యసూత్రాలలో ఆశ్వలాయన గృహ్యసూత్రం రుగ్వేదానికి సంబంధించినది. దానిలో అష్టవిధ వివాహాలు పేర్కొనబడినాయి. బ్రాహ్మ, దైవ, ప్రాజాపత్య, ఆర్ష, గాంధర్వ, అసుర, పైశాచ, రాక్షసాలు అవి. సాలంకృత కన్యాదానం బ్రాహ్మం. శ్రౌతాగ్నులలో యజ్ఞము చేయించే రుత్విజునికి ఇచ్చి వివాహం చేస్తే అది దైవం. స్త్రీ పురుషులు ఇరువురు ధర్మనిర్వహణార్థం జరిగే పెండ్లి ప్రాజాపత్యం. ఆర్షవివాహంలో కన్య తండ్రికి ఒక గోవును ఒక వృషభాన్ని వరుడు ఇస్తాడు. ఇవి ఉన్నత మైన వివాహాలట. బ్రాహ్మ వివాహం వల్ల జన్మించిన కుమారుడు 12 తరాలవరకు పితరులకు సద్గతులు కలిగిస్తాడట. దైవ వివాహం వల్ల కలిగిన కుమారుడు 10 తరాలకు, ప్రాజాపత్య వివాహఫలమైన కుమారుడు 8 సంవత్స రాలవరకు, ఆర్ష వివాహపు సంతానమైన పురుషుడు 7 తరాలవరకు పితరులను తరింపచేస్తారట.[3] తతిమ్మా నాలుగు రకాల వివాహాలు చెల్లుతాయి కాని అంతగా గౌరవ ప్రదమైనవి కావు. ఇరువురి ఒప్పందంపై జరిగేవి గాంధర్వ వివాహం. కన్యతండ్రికి ధనం ఇచ్చి కన్యను వివాహమాడేది అసురం. కన్య బంధువులు నిద్రపోవుచున్నపుడో లేక శ్రద్ధ వహించనపుడో కన్యను దొంగలించుకొని పోయేది పైశాచం. కన్య బంధువులను చంపి లేక వారి తలలను చీల్చి

కన్య యున్నూ వారున్నూ దుఃఖించుచుండగా కన్యను బలవంతాన ఎత్తుకొని పోవటం రాక్షసం.

అర్థశాస్త్ర కాలంనాటికి పైశాచం యొక్క అర్థం కొద్దిగా మారింది. స్త్రీ నిద్రిస్తున్నపుడో స్త్రీ మతి లేకయున్నపుడో (చిత్తచాంచల్యం) సంగమించిన పురుషునితో వివాహంగా చెప్పబడింది. అర్షంలో తండ్రికి కొంత లాభం రెండు ఆవులు వస్తాయి. అసుర వివాహంలో ధనం వస్తుంది. కనుక ఆ వివాహాన్ని తండ్రి జరిపించినా అది అధార్మికం. అర్థశాస్త్రంలో ప్రాజాపత్యం రెండవదిగాను, దైవం నాల్గవదిగాను, గాంధర్వం అయిదవదిగాను, అసురం 6 వదిగాను చెప్పబడింది. ఆర్ష, రాక్షస పైశాచాలు వరుసగా 3, 7, 8 వవి. బ్రాహ్మనిది మొదటిస్థానం. మనుధర్మశాస్త్రంలో వరుసక్రమం మారింది. 1, 3, 7, 8 స్థానాల విషయంలో మార్పులేదు. కాగా దైవం 2 వదిగాను, ప్రాజాపత్యం 4 వదిగాను, అసురం 5 వదిగాను, గాంధర్వం 6 వదిగాను పేర్కొనబడినది. మనుధర్మశాస్త్రం అర్థశాస్త్రం కన్న తరువాతది అని గుర్తు ఉంచుకుంటే ఈ మార్పుకు కారణం ద్యోతకమవుతుంది. కౌటిల్యుడు ధార్మ్య వివాహాలపై దృష్టి సారించాడు. లౌకిక వివాహాలను కాదనలేదు. మనువు వివాహానికి ధర్మాన్ని జోడించాడు. మొదటి నాలుగు వివాహాలను పవిత్రం చేశాడు.

మహా భారత కాలంలో అష్టవిధ వివాహాలే గాక స్వయంవరం కూడా ఉండేది. కాని అది క్షత్రియులకు పరిమితం. అవి మూడు తెరగులవి. కేవలం వరపరీక్షకు సంబంధించినది మొదటిది. మత్స్యయంత్రాన్ని కొట్టాలనే నియమం అలాంటిది. ద్రౌపది స్వయంవరం దానికి నమూనా. స్త్రీ తన ఇచ్ఛ వచ్చిన పురుషుని ఎన్నుకోనుటకు వీలు కల్పించేది రెండవది. దమయంతీ స్వయంవరం దానికి మచ్చుతునక. ప్రకటింపబడిన స్వయం వరంలో అచ్చటికి చేరిన రాజులను జయించి కన్యను తెచ్చుకొనుట మూడవది. కళింగ రాజకుమార్తెను స్వయంవరంలో దుర్యోధనుడు తతిమ్మా రాజులతో పోరాడి తెచ్చుకొనుట దీనికి ఉదాహరణ. సుభద్రార్జునుల వివాహం రాక్షస వివాహం. ఈ పద్ధతి వివాహంలో వరుడే యుద్ధం చేయనక్కరలేదు. అతని తరఫున మరెవరైనా పోరాడవచ్చును. సూనుడు దేవకిని తెచ్చి వసుదేవునకు వివాహం చేసాడు. భీష్ముడు అంబిక, అంబాలికలను తెచ్చి విచిత్రవీర్యునకు

వివాహం చేసాడు. ఈ విధానంలో ఒక నియమం పాటించాలి. ప్రదాన మయిన స్త్రీని చెరపట్టరాదు. అంబ సాళ్వరాజుకు నిశ్చితమయిన స్త్రీ. అందు వలన భీష్ముడు ఆ విషయం తెలియగానే వదలివేశాడు. యుద్ధంలో ఓడి పోయిన స్త్రీలను చెరపట్టటం రాక్షసమే కృష్ణుడు అలా 16 వేలమంది స్త్రీలను సంపాదించాడు. గంగా శంతనులది ఒప్పందపు పెండ్లి. పరాశర మత్స్య గంధులది, శంతన సత్యవతులది, యయాతి దేవయానులది, శకుంతలా దుష్యంతులది గాంధర్వ వివాహాలు. అసుర వివాహం కొన్ని ఆర్యుల తెగలలో ఉండేది. కాని మొత్తంమీద నిరసించినట్లు కన్పడుతుంది. భీష్ముడు శుల్కం ఇచ్చి మాద్రిని పాండురాజుకు భార్యగా కొన్నాడు. సావిత్రి తనే భర్తను వెదకికొన్న స్త్రీ. ఇలా జరగటం చాల అరుదు. ఈ కథ కల్పితం కావచ్చును.4

స్మృతులను పరిశీలిద్దాం. దైవం బ్రాహ్మణులకు మాత్రమే వర్తిస్తుంది. ఋషులు పైశాచాన్ని, రాక్షసాన్ని క్రమబద్ధం చేశారు. అయితే పైశాచాన్ని ఖండించారు, ఆడపిల్ల క్షేమంకోసం పైశాచానికి గురి అయిన అమ్మాయికి మరల పెళ్ళి చేయవచ్చని వశిష్టుల చెప్పాడు. బౌద్ధాయనుడు బ్రాహ్మ, దైవ, ఆర్ష, ప్రాజాపత్య వివాహాలు బ్రాహ్మణులకు పనికివస్తాయని అన్నాడు. మనువు లెక్కవేప. అసురం వైశ్యులకు, శూద్రులకు వర్తిస్తుంది. క్షత్రియు లకు గాంధర్వం, రాక్షసం ఆమోదయోగ్యాలు. పైశాచం ఏ వర్ణస్థులకూ పనికిరాదు.

శాసనాలవల్ల పరిస్థితి మారిందాకా బ్రాహ్మ, అసురాలు మాత్రం చెల్లే వివాహ రీతులు. 1961 లో వరట్న నిషేధశాసనం వచ్చింది. బాలికల విక్రయం అంతకు క్రితమే నిషేధించబడింది. కాగా 'ఓలి' పేరుతో లాంచన ప్రాయమైన శుల్కం ఆచారంగా కొన్ని కులాలలో సాగుతున్నది. కన్యాదానం, పాణిగ్రహణం, సప్తపది ఒకనాడు వివాహానికి - వైదిక కర్మ ప్రకారం జరిగే వివాహానికి తప్పనిసరిగా అవసరమయ్యేవి. ఈనాడు హిందువుల వివాహ శాసనం ప్రకారం వధూవరులలో ఏ ఒకరి ఆచారం ప్రకారము వివాహం జరిగినా చెల్లుతుంది.

పెండ్లిని ఎవరు కుదురుస్తారు ?

వేదకాలంలో సాధారణంగా కన్య తన వరుని తానే ఎంపిక చేసుకోవ టానికి వీలు కలిగేది. కాగా తల్లిదండ్రుల సలహాకు ఆమె నిర్ణయంలోబడి ఉండేది. ఆమె సోదరునికి ఆమె అలవాట్లపై కొంచెం అదుపు ఉండటం కలదు. అతడు తన చెల్లెలు పెడత్రోవన పోకుండా గమనిస్తుండేవాడు సోదరుడు, తండ్రి లేని కన్య తానే స్వతంత్రించేది. తల్లిదండ్రులు బ్రతికి ఉంటే వారి సమ్మతి విధిగా కావాలి. కాని సర్వసాధారణంగా ఆమె కోరికను వారు మన్నించేవారు. శావశ్వ పురోహితుని కుమారుడు. అతడు రాజకన్యను వివాహమాడకోరాడు. తల్లిదండ్రులు అతడు బీదవాడనే కారణంతో అంగీకరించలేదు. పెండ్లి అప్పటికి ఆగిపోయింది. (రుగ్వే VI 61, 52; VI 61, 81, 82). శశియాసి ఆనే రాజకన్యకు అతడు వరుని కుదిర్చాడు. ఆమె అతనికి సంపద ఇచ్చింది. ఆ సంపదను చూపి శావశ్వుడు రాజకన్యను, ఆమె తల్లిని అంగీకరింపచేసి వివాహం చేసుకున్నాడు. తల్లిదండ్రులు కన్యను వివాహ విషయంలో సరియయిన మార్గాన నడిపేవారు. కాని ముఖ్యపాత్ర కన్యదే (అధర్వ. VI 61, 1). తల్లిదండ్రులు యువకులను ఇంటికి విందుకు పిలిచి తమకు ఇష్టమైన స్త్రీ ప్రేమను సంపాదించుకోమనేవారు. అక్కడ చేరిన పురుషులలో కన్య తన వరుని ఎన్నుకునేది. (రుగ్వేదం X 27, 12). తల్లిదండ్రులు మధ్యవర్తులు మాత్రమే. (రుగ్వే. X 78, 4; 85, 15, 23)[5]. వేదకాలంలో కన్యకు షుమారు పదునారేండ్లు వచ్చినపుడే వివాహప్రసక్తి వచ్చేది. ఈలోగా ఆమె విద్యను అభ్యసించేది. కనుక కొంత ఇంగిత జ్ఞానం ఆమెకు ఉంటుందని తలపోసినట్లు తెలుస్తున్నది.

ఎప్పుడయితే రజస్వలాత్పూర్వ వివాహాలు అమలులోకి వచ్చాయో, లేక రజస్వల కాగానే వివాహం చేయడం ఆరంభించారో కన్యయొక్క జోక్యం తగ్గిపోయింది. తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలకే ప్రాముఖ్యత వచ్చింది.

ఈ నాటికి హిందూ సమాజంలో 100 కి 95 వివాహాలు తల్లిదండ్రుల ఎంపికతోనే జరుగుతున్నవి. ఉన్నతస్థాయి పట్టభద్రులైన స్త్రీలకు, ముప్పది సంవత్సరాల వయస్సు వచ్చిన కన్యలకు తండ్రులు సంబంధాలకోసం సంవత్సరాల తరబడి అన్వేషించటం చూస్తున్నాం. కాగా ప్రేమవివాహాలు లేకపోలేదు. వాటి సంఖ్య బహుస్వల్పం.

వివాహ వయఃపరిమితి :- ఈనాడు శాసనం వివాహమాడేటప్పటికి
కన్యకు 18 సం॥ నిండాలని అంటున్నది. 1929 లో శాసనం రూపేణ
బాల్య వివాహ నిరోధం వచ్చినపుడు కన్యకు 14 సం॥ నిండాలని నియమం
విధించారు. క్రమేపి వయస్సును పెంచుకుంటూ వచ్చారు. ఇటీవల శాసనం
కొద్దిగా మారేవరకు శాసనానికి బలంలేదు. కేవలం వ్యక్తిగతమైన ఫిర్యాదు
మీదనే ఆధారపడవలసి వచ్చేది. ఏదయినా శాసనాన్ని ఖాతరు చేయని
వర్గాలు చాల అధికంగా ఉన్నాయి. సనాతన బ్రాహ్మణులు, గ్రామాలలో
నివసించే కొన్ని కులాలవారు ఇంకా బాల్యవివాహాలు చేస్తున్నారు. ఆడపిల్ల
రజస్వల కాకముందే, పెళ్ళిళ్ళు చేస్తున్నారు. శూద్రులని పిలువబడేవారిలో
ఎక్కువమంది మొదటినుండి రజస్వలానంతర వివాహాలు చేసేవారు. కాగా
కొందరు మాత్రం బాల్యవివాహ దురాచారాన్ని అనుసరిస్తున్నారు. ఇది
'సంస్కృతీ కరణ' ప్రభావమా, మరొకటియా అనే దానికి ఇంకా పరిశోధన
చేయవలసి వుంటుంది. బ్రాహ్మణులవలె సంచరించవలెననే ఆకాంక్షతో కొన్ని
కులాలవారు బ్రాహ్మణుల ఆచారాలను అనుసరించ ప్రారంభించారు. దాంతో
బ్రాహ్మణులు అలవాటుగా పాటించే దురవాట్లు తదితరులకు సంక్రమించాయి.
ఇది శోచనీయ పరిణామం. తెలంగాణాలో 'శూద్ర' వర్ణంలో కొన్ని కులాలు
ఇప్పటికీ బాల్య వివాహాలు చేస్తున్నారు. పదిసంవత్సరాలలోపు వయస్సుగల
పిల్లల మెడలలో మంగళ సూత్రాలు కనిపిస్తున్నాయి. ఈ భావాన్ని వదిలించ
డానికి మున్ముందుగా ఈ భావం ఎలా పుట్టిందో, ఎలా పరిణామం చెందిందో
తెలిసికోవాల్సిన పరిస్థితి వుంది.

వేదకాలంలో వివాహాలు రజస్వల అయినతరువాత జరిగినవే. కన్యకు
ప్రేమ అంటే ఏమిటో అవగాహన అయ్యేది. క్రతువుల అర్థం తెలిసేది;
పరిజ్ఞానం ఉండేది. కన్య బాగా ఎదిగి శోభనానికి, గర్భధారణకు తగిఉండేది.
(రుగ్వే. X 25; 41, 42, 43, 45, 46.) దీర్ఘమైన వివాహ క్రతువులో
శోభనం ముఖ్యభాగం (రుగ్వే. X 85). ఆమె ఎదిగిన స్త్రీ అనే భావంలోనే
వివాహ తంతు ఉండేది. (రుగ్వే. VII 55, 8), కన్యా, కనా, కానీనక,
కన్యానా ఇవి అవివాహిత స్త్రీలకు పేర్లు. జవ్వని అంటే యువతి. ప్రియునితో
కలవగల స్త్రీ; మరియు వయస్సు వచ్చిన అవివాహిత స్త్రీ. యోష,
యోషన్, యోషణ, యోహిత్ ఇవి వివాహానికి తగిన వయస్సువచ్చిన స్త్రీ
పేర్లు కాబట్టి రజస్వలానంతర వివాహాలు మాత్రమే ఉండేవని తెలుతుంది.

బాల్య వివాహాల ప్రసక్తి లేనేలేదు. 'విశ్వావసు' కథవల్ల కూడా ఇది రుజువు అవుతుంది. స్త్రీకి మానవభర్త ఆయిదవవాడు. మొదటి నలుగురు దేవతలు. మొదటి భర్త వరుణుడు. ఆమె పసితనంలో రక్షకుడు. రెండవభర్త సోముడు ఆమె కన్యత్వ సిద్ధికి కారకుడు. రజస్వల కావటం అతని ఆధ్వర్యంలోనే. మూడవభర్త ఆమెలో సంతాన వాంఛను ప్రేరేపించేవాడు. విశ్వావసు నాలుగవ భర్త. ఇతడు గంధర్వుడు. కామానికి అధిష్ఠాన దేవత. విశ్వావసు రూపును పెళ్ళి పాన్పుమీద ఉంచుతారు. పెళ్ళికుమారుడు గంధర్వుని వెళ్ళి పొమ్మని ప్రార్థిస్తాడు. వేదకాలంలో ప్రకృతి శక్తులను ఆరాధించటం విరివిగా జరిగేది. అందుచేత స్త్రీ యొక్క శారీరకాభివృద్ధిని కాపాడే దేవతలను ఊహించారు. దీనినిబట్టి ఆ కాలపు పెళ్ళి ఈడేరిన ఆడపిల్లలకే జరిగేదని నిర్ణయమవుతుంది.[6] ఈనాటికి గర్భాదానపు మంత్రాలలో ఈ నలుగురు భర్తల స్ఫురణ ఉన్నది. 'అష్టవర్షాత్ భవేత్కన్య' అంటూ పెండ్లి నాలుగవ రోజు చదివే గర్భాదానం మంత్రాలలో ఈ ప్రస్తావన చేస్తారు. ఆచారం పేర ఎంత అసంబద్ధపు పనులు జనులు చేస్తారో ఊహించలేము.

క్రీ. పూ. 4 వ శతాబ్దం నుండి కన్యలకు చిన్నవయస్సులో వివాహం చేయాలనే వాదన ప్రారంభమయింది. అనేకమంది యువతులు పెండ్లి చేసుకోకుండా జైనమతంలో చేరడం, సన్యాసినులు కావడం, బౌద్ధ సంఘాలలో చేరడం హిందూ సమాజ నాయకులకు కలవరం కలిగించి ఉండవచ్చును. అందువలన ఈ అభిప్రాయాన్ని ప్రచారం చేశారు. ఉపనయన సంస్కారం స్త్రీకి తీసివేసి వివాహమొక్కటే ఆమె విధిగా పాటించవలసిన సంస్కారంగా చెయాలని ప్రయత్నించారు. మనువు బాల్య వివాహాలను ప్రోత్సహించినా సరియైన సంబంధం దొరకకపోతే జీవితాంతం స్త్రీని కన్యగా ఉండవచ్చని చెప్పాడు (మను IX 89). క్రీ॥ త॥ 100 సంవత్సరాలవరకు రజస్వలా త్పూర్వ వివాహాలు, మంచివా, కావా అనే చర్చ సాగింది. క్రీ.త. 200 నుండి రజస్వల కాకముందే వివాహం చేయాలనే భావం ప్రబలమయింది.[7] రజస్వల కాకముందు వివాహం చేయకపోతే కన్య తల్లిదండ్రులు నరకానికి పోతారని యాజ్ఞవల్క్యుడు అన్నాడు. ఆ సందర్భంలో తల్లికి, తండ్రికి, సోదరునికి ముగ్గురికి నరకం చెప్పాడు యముడు. పన్నెండవయేడు రాగానే పిల్లకు తండ్రి పెళ్ళి చేయకపోతే పితృదేవతలు ఆమె బహిష్టు రక్తాన్ని త్రాగుతారని పరాశరుడు అన్నాడు. ఇవన్నీ బ్రాహ్మణులకే వర్తించే సూత్రాలు. బాలికలకు 4 సం॥ నుండి 10 సం॥ లోపల వివాహం చేయమని బ్రహ్మపురాణం ఆదేశించింది.[8]

ఇదంతా ఎందుకు జరిగింది? ఆనందమయ జీవితం గడపటానికి వివాహమనే అంశాన్ని వెలికితోసి కేవలం పితృదేవతల రుణం తీర్చుకోవటానికి సంతానం, అందులో పురుష సంతానం ఎలా కలుగుతుందనే విషయంపై అశాస్త్రీయ ఆలోచలు, సంతానం త్వరగా కలగాలని ఆదుర్దా ఇవన్నీ రజస్వల అయ్యి కాకముందే వివాహం జరిపించాలనే భావానికి ప్రోదిచేశాయి. స్త్రీ రుతుమతియైన తదుపరి 4 నుండి 16 వ రోజు వరకు పురుష సంతానం కనడానికి ఆస్కారం ఉన్న దినాలు అని నమ్మేరోజులు అవి. అందులో అమావాస్య, పౌర్ణమి, చతుర్దశి నిషేధాలు. స్త్రీకి రజోదర్శనమయిన తరువాత సరిసంఖ్య కల దినాలలో పురుష సంతానం కలుగుతుందని ఆపస్తంభుడు, మనువు, యాజ్ఞవల్క్యుడు చెప్పారు.9 రుతుకాలంలో స్త్రీ తలంచిన పురుషుని రూపంలో సంతానాన్ని పొందును. రుతుస్నాతయైన స్త్రీ భర్తను మాత్రమే చూడవలెనని శాసిస్తుంది. అలాకాక ఆమె పరాయి పురుషుని చూస్తే ఆ పురుషునిలాంటి సంతానాన్ని కనే ప్రమాదం ఉందని వైఖానసస్మార్త సూత్రం చెపుతుంది. **ఇవన్నీ అశాస్త్రీయ భావనలు.**

రజస్వల అయినవెంటనే ఆమె గర్భధారణ శారీరకంగా బాగా తగ్గి ఉంటుందనేది మరో పొరపాటు అభిప్రాయం రజస్వల అయిన తరువాత కూడ స్త్రీలు శారీరకంగా, మానసికంగా ఎదుగుతారు. రజస్వల అయిన స్త్రీకి తదుపరి గర్భధారణకు అవకాశం ఉన్నా, ఆ సంతానం బలిష్టంగా ఉండాలంటే ఆమెకు ఇంకా కొంత వయస్సు రావాలి. సంతానం కోసం పడే తహతహలో పూర్వీకులు ఈ విషయాన్ని మరచిపోయాడు. అందుకని ఆమె రుతుమతి అవదమే తరువాయి ఆమెకు పెండ్లి చేసి శోభనం చేయించి అత్తింటికి పంపేవారు. స్త్రీ యొక్క రుతువు ఒక్కటి కూడా నష్టం కారాదని భావం. అందుకే కొన్ని ఏర్పాట్లు చేశారు. కన్య రజస్వల అయిన తరువాత 3 సంవత్సరాలలోపల ఆమెకు తండ్రి పెళ్ళిచేయకపోతే, ఆమె తనే స్వతంత్రించి వివాహమాడవచ్చును. (వశిష్టుని ధర్మశాస్త్రం 17. 67 - 68; మనుధర్మ శాస్త్రం IX-90; బౌద్ధాయనుని ధర్మశాస్త్రం IV 1-13) ఆ గడువును మూడు నెలలకు కుదించాడు గౌతముడు. (గౌతమ ధర్మసూత్రం 18-20). అదే విషయాన్ని విష్ణుధర్మ సూత్రం 25-40, 41 చెప్పింది.10

ఇంగ్లీషువారు భారతదేశంలో పరిపాలన ప్రారంభించేనాటికి హిందూ స్త్రీలకు 8 లేక 9 సం॥ వయస్సులో పెళ్ళిళ్ళు అయ్యేవి. బాల్యవివాహాల వలన స్త్రీలు త్వరగా తల్లులు కావటం వలన శారీక పెరుగుదల వుండదు. అవయవాలు పెరుగుదల తగ్గటం వలన అవి కావాల్సినంతగా విప్పారని కారణంగా తల్లులు ప్రసవాల సందర్భంగా మరణాల పాలయ్యేవారు. అలాగే శిశుమరణాల సంఖ్య ఎక్కువగా ఉండేది. భార్యలకు చదువుకోవటానికి ఆస్కారం లేనందున వారి గోష్టి, సాంగత్యం భర్తలకు నచ్చక వారు వేశ్యా గమనానికి ఉత్సాహం చూపేవారు. అలా ఒకటేమిటి, అనేక అనర్ధాలు సంభవించాయి; సంభవిస్తున్నాయి బాల్యవివాహాలవల్ల.

వధూవరుల లక్షణాలు :-

వేదకాలంలో కన్య విద్యావతి. వివాహమాడతలచుకున్న కన్యలను సద్యోవధువులనేవారు. కనుక ప్రజ్ఞా పాటవాలు కలిగిన స్త్రీని ఆశించటం కద్దు. పెండ్లి మంత్రాలలో "నీవు ఈ ఇంటికి సామ్రాజ్ఞివి. నీ అత్తమామలు నీ చెప్పుచేతలలో ఉంటారు" అనేవి ఉన్నాయి. దీనినిబట్టి గృహనిర్మాణ విద్య ఆమెకు తెలిసివుండాలని తేలుతుంది. భర్తయొక్క పశుపక్ష్యాదులపైన బానిసలపైన ఆమెకు పెత్తనం ఇచ్చేవారు. అంటే ఈ ఆధిపత్యాన్ని నిర్వహించగల నేర్పును ఆమె తన పుట్టినింట నేర్చుకొని వుండాలన్నమాట.

భార్యను 'జాయ' అంటారు. అంటే ఆమెలో భర్త తిరిగి పుడతాడు. కనుక భార్య కాబోయే స్త్రీ శుభలక్షణాలు కలిగి ఉండాలని. వంశం, శుభలక్షణాలు, విద్య, ఆరోగ్యం చూడాలని ఆపస్తంబ గృహ్యసూత్ర వాక్యం. అప్పటిదాకా బ్రహ్మచారిగానే వుండాలని బౌద్ధాయన ఉవాచ, మంచి వంశం, మంచి శీలం. దేహ సౌందర్యం, పేరు; పాండిత్యం, సంపద, బంధువర్గం ఉండాలని యముడు చెప్పాడు. కులం. పాండిత్యం, బలం, యవ్వనం, ఆరోగ్యం, అండదండలు, అర్ధితం (కోరబడినది) సంపద అవసరమని బృహత్ పరాశరలో ఎనిమిది లక్షణాలు పేర్కొనబడినాయి. సద్వంశంపై నొక్కి పెట్టాడు మనువు. పురుష సంతానం లేని వంశంలో పిల్ల వద్దన్నాడు. ఇంతా చెప్పి వంశం చెడ్డదైనా, అప్రతిష్టాకరమైనా ఆడపిల్ల రత్నం లాంటిదయితే అభిలషణీయమన్నాడు మనువు. సంపద, పాండిత్యాలను సమతూకంగా చూసింది మహాభారతం. తెలివి తేటలు, అందం, మంచి శీలం, శుభ

లక్షణాలు, ఆరోగ్యం వీటిపై నొక్కి పెట్టాడు అశ్వలాయన గృహ్యసూత్రంలో. బాహ్య అభ్యంతర లక్షణాలు శుభప్రదంగా ఉండటం మంచిదని మనువు అభిప్రాయం. అతిగా మాట్లాడే కన్య వద్దని హితవు చెప్పాడు మనువు. సంపద, అందం, తెలివితేటలు, కుటుంబం ఎన్నదగిన అంశాలుగా నిర్ణయించింది భారద్వాజ గృహ్య సూత్రం. వంశం, తెలివితేటలు ఉంటే తతిమ్మావి వదలివేయవచ్చనే భావం ప్రకటన చేయబడింది. విద్య, పాండిత్యం, ప్రజ్ఞ (తెలివితేటలు) ఇవి ముఖ్యమని మానవ గృహ్య సూత్రం తెలియజెప్పింది. వధూవరులు ఒకే కులానికి చెంది వుండాలని గౌతముడు, మనువు శాసించారు. వధువుకు సోదరుడు తప్పని సరిగా ఉండాలని మానవ గృహ్యసూత్రం విశదీకరించింది. 'సోదరుడు లేని స్త్రీ లాగా కళా కాంతులు పోయి' (అధర్వ I - 17 - 1) అనటంతో అదేభావం కన్పడుతుంది. పుత్రికా పుత్రుడు మాతా మహునికి పింద ప్రదానం చేయాలి. తండ్రికి పిండప్రదానం చేయడు. కనుక వద్దన్నారు.11

ఎంపికలో విధి నిషేధాలు :-

ఒకే కులంతో వివాహమాడవలెనని లేక ఒకే జాతిలో వివాహమాడవలెనని ఒక సూత్రం. ఒక గుంపును దాటి మరియొక గుంపులో వివాహమాడవలెనని మరియొక సూత్రం. ఈ రెంటికీ సమన్వయం జరిగింది హిందూ సమాజంలో. సగోత్ర సపిండులతో వివాహం పనికిరాదన్నారు. కాని మానవ సమాజంలో మొదటినుండి ఈ ఏర్పాటు లేదు. సోదరీ సోదరుల వివాహాలు ఈజిప్టులో జరిగేవి. బ్రహ్మ తనకుమార్తె సరస్వతిని చేసుకున్నాడు. యముడు యమిని వివాహమాడాడు. ఇది పాతచరిత్ర. కాగా వేదకాలంలో గోత్రం అంటే గోశాల అని అర్థం. ఆనాడు ఒకే గోశాలలో కట్టివేసుకునే వారి వంశాల మధ్య వివాహం పనికిరాదని నియమం ఉన్నట్లు సాక్ష్యాధారాలు లేవు. క్రీ. పూ 600 సం॥ నికి పూర్వం ఈ రకపు నిషేధాలు లేవు. సగోత్ర వివాహాల నిషేధం అనార్య జాతుల ఆచారమై ఆర్యుల ఆమోదాన్ని పొంది ఉండవచ్చును.12 అనార్యులలో ప్రతి గుంపుకు ఒక జంతువు చిహ్నంగా ఉంటుంది, కనుక ఆ జంతువు చిహ్నంగాకల గుంపులో వివాహమాడేవారు కాదు. గోత్రం అనేది ఋషుల పేర్లమీదుగా వచ్చినదని అల్టేకర్ అంగీకరించాడు. బ్రాహ్మణులకు గోత్రాలు ఉన్నాయి. తతిమ్మా వర్ణాలవారు పురోహితులైన బ్రాహ్మణుల గోత్రాల పేరును వాడేవారు.

ఏదైనా గోత్రాలకు చెందినవారు విపరీతంగా పెరిగిపోయిన ఈ రోజుల్లో సగోత్ర వివాహాల పట్ల పట్టుపట్టటం పొరపాటు అభిప్రాయం. సగోత్ర, సప్రవర (రుషుల పేర్లు ఉంటాయి) వివాహాలు చెల్లుతాయని శాసనం బ్రిటిషు వారి హయాంలో వచ్చింది.

సపిండ వివాహాలు నింద్యం. పిండం అంటే దేహంలో అణువు అని అర్ధం. ఒక పూర్వీకుని నుండి వచ్చిన స్త్రీ పురుషులలో వివాహ సంబంధాలను నిషేధిస్తుంది ఈ సూత్రం. ఉదాహరణకు మేనత్త మేనమామల సంతానం వివాహమాడరాదు అని ఆపస్తంభుడు అంటే, దక్షిణాదికి చెందిన బౌద్ధాయనుడు ఆమోదించాడు. వాసుదేవ కృష్ణుని రుక్మిణి, అర్జునుడు సుభద్ర ఇలాంటి సంబంధాలు. ఇవిగాక విరుద్ధ సంబంధాలను కూడదన్నారు. ఉదాహరణకు భార్య సోదరి కుమార్తెను వివాహమాడరాదు. ఆమె తన కూతురితో సమానం వరుసకు. కూతురును వివాహమాడరాదు కనుక, పనికిరాదు. ఆరోగ్య సూత్రాలు, సామాజిక సామరస్య సూత్రాలు పాటించవలసినదే. ఆస్తులు నిలువుకోవటానికి, దగ్గర సంబంధాలు కలుపుకోవటానికి ఆరోగ్యసూత్రాలను పాటించక పోవటం అవివేకం.

<u>వర్ణాంతర వివాహాలు</u> :- వర్ణం వేరు. కులం వేరు. వేదకాలంలో కులాలు లేవు. వర్ణాలున్నాయి. వైదిక వాఙ్మయంలో వర్ణాంతర వివాహాలు కన్పడతాయి. చ్యవనుడు సుకన్య (క్షత్రియ స్త్రీ) ని వివావామాడినట్లు శత పథ బ్రాహ్మణంలో ఉంది. అలాగే రాజు వైశ్యస్త్రీని పెండ్లాడినట్లు శ్యావస్వుడు (బ్రాహ్మణ) రధావీతి దార్భ్యను పెండ్లాడినట్లు వరుసగా శతపథ బ్రాహ్మణంలో, రుగ్వేదంలో కధలు ఉన్నాయి. ఆపస్తంబ ధర్మసూత్రం అదే వర్ణంలో వివాహం చేసుకోమని హితవు చెప్పింది.

వేదకాలంనాటికి బ్రాహ్మణ రాజన్య వర్ణాలు ఏర్పడ్డాయి. సామాన్యులను 'విశ' అని పిలిచేవారు. వారే వైశ్యులయినారు. ఎక్కువమంది రుషులు బ్రాహ్మణులనుండి వచ్చారు. వర్ణవ్యవస్థ ముదురు పాకాన పడలేదు. కలసి భోజనం చేయటం, అంతర్వర్ణ వివాహాలు ఉండేవి. అనులోమ ప్రతిలోమ వివాహాలు జరిగేవి. కాకపోతే ప్రతిలోమ వివాహాలు తక్కువ. కక్షివాన్, విమద వీరంతా బ్రాహ్మణ రుషులు. వీరు రాజన్య స్త్రీలను వివాహమాడారు.

తతిమ్మా వర్ణాలవారికి బ్రాహ్మణ పురుషుడు తగినభర్త అని అధర్వవేదం చెపుతుంది. (అధర్వ IV 17, 8, 9) అంగీరస రుషి కుమార్తె శాశ్వతి అనంగుడనే రాజును భర్తగా పొందింది. అంగీరసుని కుటుంబపు బ్రాహ్మణస్త్రీ శ్వణయరాజును పెండ్లి చేసుకున్నది. దేవయాని యయాతిని పతిగా స్వీకరించింది. ఇవి ప్రతిలోమ వివాహాలకు నిదర్శనాలు. ఆర్యగృహిణి తన వెంట అత్తవారింటికి బానిస స్త్రీలను తెచ్చేది. వారిని యజమాని లైంగికంగా వాడుకొనేవాడు. అలా కలిగిన సంతానం దాసీపుత్రులు. ఈ బానిస స్త్రీలు ఆర్యులు జయించిన అనార్యుల స్త్రీలు. ఓడిపోయిన అనార్యులను దాసులని పిలిచేవారు. వర్ణాంతర వివాహానికి కారణాలు :- 1) ప్రేమ స్వేచ్ఛా యుతమగుట 2) భాగస్వామిని తామే ఎన్నుకొనుట హక్కు కలిగి యుండుట. యజుర్వేదంలో శూద్రులకు ఆర్యులకు గల వివాహ సంబంధ ప్రసక్తి ఉంది. అధర్వ వేదంలో బానిస పురుషుడు తన భార్యను- అంటే ఆర్యగృహిణి ప్రేమనుపొ-ందకుండా మంత్ర తంత్రాలున్నాయి. కుటుంబపు బానిస పురుషుడు యజమాని విధవరాలిని హక్కుగా పెండ్లాడవచ్చనే పురాతన సంప్రదాయాన్ని అశ్వలాయన శ్రౌత సూత్రం (IV 2, 18) పేర్కొన్నది. రక్తపు పవిత్రతను ఎంత పదిలపర్చాలన్నా గౌతముడు వర్ణాంతర వివాహ సంతానం యొక్క పేర్లు ఉటంకించాడు.13 అర్థశాస్త్ర కాలానికి వర్ణవ్యవస్థ ఇంకా బిగవలేదు. కాగా బ్రాహ్మణ వర్ణానికి ఆధిక్యత ఉంది. మనుధర్మ శాస్త్ర కాలానికి బ్రాహ్మణ్య శ్రేష్ఠత మరింత గట్టిపడింది. తమ వర్గ రక్షణ చేసుకున్నారు పకడ్బందీగా. బ్రాహ్మణ వర్ణంలోనుండి ఆస్తి జారిపోకుండా ఏర్పాట్లు జరిగాయి. బ్రాహ్మణ భార్య సంతానానికి ఇల్లు, సేద్యపు పనిముట్లు ఇతోధిక సౌకర్యాలు. జన్మవల్ల, విజ్ఞానంవల్ల భాష్యం చెప్పే అధికారం సంపాదించిన బ్రాహ్మణులు తమకు అనుకూలమైన జీవిత విధానాన్ని తదితరులపై రుద్దారు. అందుకు అనువైన ఆచారాలను, వ్యవస్థలను సృష్టించారు.14 బ్రాహ్మణుడు బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య శూద్ర వైశ్య స్త్రీలను వివాహమాడవచ్చని, క్షత్రియుడు క్షత్రియ వైశ్య శూద్ర స్త్రీలను పెండ్లాడ వచ్చని, వైశ్యుడు వైశ్య శూద్ర స్త్రీలను ఉద్వాహమాడగలడని, శూద్రుడు శూద్రస్త్రీని పరిణయమాడవచ్చని మనువు చెప్పాడు యాజ్ఞవల్క్యుడు ఒక వర్ణపు పురుషుడు 'దిగువన' ఒక వర్ణము స్త్రీని పెండ్లి యాడవచ్చని చెప్పాడు. కాని ద్విజుడు శూద్రస్త్రీని ఎట్టి పరిస్థితులలోను

భార్యగా స్వీకరించరాదన్నాడు. 'ఉన్నత' వర్ణపు పురుషుడు 'నీచ' జాతి స్త్రీని స్వీకరించటం అనులోమ పద్ధతి. అలాకాక 'ఉన్నత' వర్ణపు స్త్రీ 'నీచ' జాతి పురుషుని భర్తగా పడయుట ప్రతిలోమ విధానం. క్రీ. శ. 10 వ శతాబ్దం వరకు వర్ణాంతర వివాహాలు జరిగాయి. అప్పటివరకు ద్విజులలో పెద్దగా సాంస్కృతిక తేడాలు లేకపోయినందున అలాంటి వివాహాలు సాగాయని ఆల్టేకరు భావం. తరువాత సాంస్కృతిక విభేదాలు పెరిగినందున నిషేధం వచ్చిందని ఆయన అభిప్రాయం.

బ్రిటిషువారు వచ్చిన తరువాత ప్రతిలోమ వివాహాలు చెల్లవని, అనులోమ వివాహాలు చెల్లుతాయని తీర్పులు వచ్చాయి. దరిమిలా వర్ణాంతర వివాహాలను చట్టబద్ధం చేస్తూ శాసనం వచ్చింది. 1955 హిందూ వివాహ శాసనం ప్రకారం వర్ణం, కులం, పట్టింపు కాదు; దానికి అడ్డంకులుండరాదు.

వరకట్నం, కన్యాశుల్కం :-

వరుడు ఆడబిడ్డ తండ్రికి లేక సంరక్షకునికి కొంత ధనమిచ్చి ఆడ పిల్లను పెళ్ళిచేసుకోవటం అసుర వివాహ పద్ధతి. తండ్రికి లేక సంరక్షకునికి ఇవ్వబడిన పైకాన్ని శుల్కం అంటారు. అసుర వివాహాన్ని శాస్త్రకారులు గర్హించారు. ఆడపిల్లను అమ్మటం మహా దురాచారంగా అభివర్ణించారు. వేదకాలంలో పిల్లను అమ్మే ప్రసక్తి లేదు. బౌద్ధకాలంలోని సన్యాసినులు వ్రాసిన 'తేరీగాధ'లో ఇసిదాసి అనే అమె తండ్రి శుల్కం తీసుకున్నట్లు ఆమె చెప్పింది. మహాభారతంలో శల్యుడు మాద్రిని పాండురాజుకు వివాహం చేయటానికి శుల్కం తీసుకున్నాడు. ధర్మశాస్త్రకర్తలు ఈ ఆచారాన్ని నిశితంగా ఖండించారు. ఆడపిల్లలను అమ్మిన వారి సంరక్షకులు ఘోరమైన నరకానికి పోతారని బౌద్ధాయనుడు ప్రకటించాడు. ఆ స్త్రీ అతని భార్య కాబోదని శాసించాడు (బౌద్ధాయన I, 11, 20 - 1). ఆమె తండ్రి గోత్రంలోనే ఉంటుందని, ఆమె కుమారులు తండ్రి పితరులకు తర్పణాలు విడవడానికి హక్కులేదని అత్రి చెప్పాడు (అత్రి 384). అలా ఆడపిల్లను విక్రయించిన వాని ముఖం చూడరాదని పద్మపురాణం శాసించింది. (పద్మ, బ్రహ్మకాండ 24, 26). ఈ దురాచారాన్ని రూపుమాపాలని తంజావూరు 15 వ శతాబ్దంలో ఒకంబడిక చేసుకున్నారట.15 20 వ శతాబ్దంలో కూడ ఆంధ్ర బ్రాహ్మణులు ఈ ఆచారాన్ని పాటించారు. కనుకనే గురజాడవారి

'కన్యాశుల్కం' నాటకం వెలిసింది. అంతేకాదు ఆంధ్రబ్రాహ్మణులు కేరళ నుండి బ్రాహ్మణ కన్యలను కొనుగోలు చేసి తెచ్చి భార్యలనుగా చేసుకునేవారు. అట్టివారిని సమాజం వెలివేయలేదు. వారు పురోహితులుగా కూడ వ్యవహరించిన సందర్భాలున్నాయి. ఇప్పుడు ఈ ఆచారం బ్రాహ్మణులలో అంతరించింది. కాగా శూద్రులలో 'ఓలి' అనే పేరుతో సాగుతున్నది. ఆమె మారుమనువు చేసుకోవాలంటే ఓలిని మొదటి భర్తకు తిరిగి ఇచ్చివేయాలి. శాసనాలు ఎలా ఉన్నా ఈ ఆచారం సాగుతున్నది. కాగా ఓలి లాంఛనం క్రింద పరిణమించింది కాని స్త్రీ యొక్క బజారు ధరకాదు. ఇది గ్రుడ్డిలో మెల్ల క్రింద లెక్క. స్త్రీని విక్రయించిన అలవాటుయొక్క అవశేషము ఓలి. ఇది అనార్యుల ఆచారమని చెప్పవచ్చును.

వరకట్నం :-

ఈనాడు వరకట్నపు చావులు స్త్రీలలో ఎక్కువవుతున్నాయి. వరకట్నం చాలదని, ఇంకా తెమ్మని బాధించే అత్తమామలు, భర్తల పెట్టే బాధలు భరించలేక స్త్రీలు ప్రాణత్యాగానికయినా ఒడికట్టున్నారు లేక అత్తమామల చేత, భర్తలచేత చంపబడుతున్నారు. వరకట్న నిషేధ శాసనం 1961 లో ఆమోదింపబడినా, ఇటీవల సవరింపబడినా పరిస్థితులలో మార్పులేదు. ఇది హిందూ సమాజానికి పెద్దమచ్చ.

వేదకాలంలో పరిస్థితిని గమనిద్దాం. శారీరక సౌందర్యం, లలిత కళలలో కృషి ఉన్న కన్యలకు పెళ్ళి తేలికగా జరిగేది. ఆమెకు సంపద ఉంటే భర్త దొరకడం సుగమం. (ఋగ్వే X 27, 12). ఆమెకు కొంచెం సౌందర్యలోపం ఉంటే అది ఆమె తెచ్చే కట్నంతో సరిపోయేది. కాపున ఋగ్వేదకాలంలో కట్నం అంటే తల్లిదండ్రులు కుమార్తెకు ఇచ్చే ధన, కనక, వస్తు, వాహనాదులు అన్నమాట. అంతేగాక వరునికి ఇచ్చేది కాదు. ప్రాచీన హిందువులలో వరకట్నం లేదు. ద్రౌపది, సుభద్ర, ఉత్తర తమతోపాటు అత్తవారింటికి గుర్రాలను, ఏనుగులను, సొమ్ములను తెచ్చారట. విశాఖ అనే వ్యాపారస్తుని కుమార్తెను అత్తవారింటికి పంపినపుడు వరునికి విలువగల బహుమతులను పిల్లతండ్రి పంపినట్లు జాతక కథలలో ఉంది. రాజకుమారుల వివాహ సమయంలో బహుమతులు ఇచ్చినట్లు శాసనాలు ఉన్నాయి, రఘువంశంలో దీని ప్రసక్తి ఉన్నది. వీటిని వరకట్నం

అని పిలవటానికి ఆల్టేకరు సమ్మతించడంలేదు. స్మృతులలో వరకట్నాన్ని గురించి ఒప్పందాలు కనపడవు. కన్యను దానంచేసేటప్పుడు దక్షిణ ఇవ్వాలి కనుక కొద్దిపాటి పైకం వరునికి ఇచ్చేవారు. క్రీ. శ. 13, 14 వ శతాబ్దం నాటికి రాజస్తాన్‌లోని రాజపుత్రులలో వరకట్నం ఘోరంగా పెరిగిపోయింది. 19 వ శతాబ్దం మధ్య కాలంనుండి వరకట్నం దారుణరూపం తాల్చింది. శాసనం వచ్చేవరకు పళ్ళెంలో రూపాయల రూపంలో వరకట్నం పోసి వరునికి సమర్పించేవారు. ఇపుడూ ఆచారం ఉందికాని రహస్యంగా సాగుతున్నది. అయితే బహిరంగ రహస్యం. ఎవరూ కేసుపెట్టరు; ఎవరూ సాక్ష్యం చెప్పరు. దీని పునాది స్త్రీ పురుషుల అసమానత్వంలో ఉంది. స్త్రీ ఆర్థికంగా బలపడి, మానసికంగా స్థయిర్యం సంపాదించుకొని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకున్ననాడు గాని ఈ దురాచారం హిందూసమాజాన్ని వదలదు.

వృద్ధకన్య (అవివాహిత స్త్రీ) :-

వేదకాలంలో స్త్రీకి ఉపనయనం, వివాహం రెండు ముఖ్య సంస్కారాలు ఉంచే ఉపనయనాన్ని తీసివేసి వివాహాన్ని తప్పనిసరి సంస్కారంగా చేశారు. తరువాత వివాహం కాని స్త్రీలకు సామాజికంగా గౌరవం తగ్గింది. స్వాతంత్ర్యానంతరం స్త్రీల వివాహ వయః పరిమితి పెంచడం, వారు విద్యకు ఎక్కువ ప్రాముఖ్యతను ఇవ్వడం, ఉద్యోగాలపట్ల శ్రద్ధ వహించడం, ఉన్నత విద్యను అభ్యసించేనాటికి వయస్సు చాల మళ్ళటం, ఆ స్థితిలో 'గంతకు తగిన బొంత' యని ఎవరినో ఒకరిని వివాహమాడ నొల్లకపోవటం వీటివల్ల సమాజంలో___ హిందూ సమాజంలో అవివాహిత స్త్రీల సంఖ్య పెరుగుతున్నది. దాంతో వారి తాలూకు అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీరు మాతలవటానికి సమాజం అనుమతిస్తుందా లేదా అనేది మీమాంసగా తయారయింది. ఒంటరిగా జీవితం గడపవలసిన వీరికి సమాజంలో భద్రత ఎంతవరకు ఉంటుంది. గౌరవం ఎంతవరకు లభిస్తుంది. అనేవి చర్చనీయాంశాలు అయినాయి. వీరికి సాంస్కృతిక సామాజిక జీవితం అందుబాటులో ఉంటుందా లేదా అనేది సందేహాస్పదమయింది. వేదకాలంలో అసలు ఈ వర్గం ఉన్నదా? ఇలాంటి వారు వేదకాలంలో కనిపిస్తే వారు ఎలాంటి జీవితం గడిపారు? ఈ ప్రశ్నకు సమాధానాలు ఆసక్తిదాయకాలు.

వృద్ధకన్యలు తండ్రి ఇంట్లో నివసించేవారు (రుగ్వే I 117, 7; X 39, 3; X 40, 5). వృద్ధులు అయిన తరువాత కూడా వివాహమాడేవారు. 'కక్షివాన్' 'ఘోషా' అనే రాజకన్యను వివాహమాడాడు. ఆమెకూడా వృద్ధురాలే (రుగ్వే I 117, 7; I 2, 17, 7; I 10, 39, 3; I 40, 5). ఆనాడు 'పరివెట్టా' అనే ఆచారం ఉండేది. పెద్దవాళ్ళ తర్వాత చిన్నవాళ్ళు వివాహమాడాలి. అవివాహిత మాతలు సంఘబహిష్కారానికి భయపడి పిల్లలను చీమల పుట్టలపై పారేశారు. (రుగ్వే IV 19, 9).

జాతకాలు :- గృహ్యసూత్రాలు, ధర్మసూత్రాల రోజుల్లో జాతకాలను చూచేవారుకాదు. క్రీ. శ. 400 వరకు వాటిని గట్టిగా పట్టించుకునేవారు కాదు. పెళ్ళి ముహూర్తాలకు నక్షత్రాలను మాత్రం చూచేవారు. క్రీ॥ శ 400-900 మధ్య జ్యోతిష్యం బలపడింది. అప్పుడు జాతకాలు పెళ్ళిళ్ళలో పాత్ర వహించటం ప్రారంభించాయి. సంబంధాలను కలపటమో లేక చెడగొట్టటమో వాటివని. క్రీ. శ 700 లోని దశకుమారచరిత్రంతో జ్యోతిష్యాన్ని సంప్రదించి నట్లు ఉన్నది.16

ఈ జాతకాలపై వ్యామోహం విపరీతంగా పెరిగింది. ఇంచుమించుగా అన్ని దినపత్రికలూ, వారపత్రికలూ వారఫలాల జోస్యాలను వేయటం చూస్తున్నాము. ఇతరత్రా అన్నిలక్షణాలు బాగున్నా జాతకాలు కుదరలేదని పెండ్లి సంబంధాలను తమ కుమార్తెలకు పోగొట్టుకున్నవారిని చూస్తున్నాం. జాతకాలు కుదిరాయన్న నంబరంతో చేసిన పెండ్లిండ్లలో వరుడు సంవత్సరం నిండకముందే చనిపోతే బాలవిధవను ఇంటిలో కుంపటిలాగా పెట్టుకొని కాలక్షేపం చేస్తున్న తల్లిదండ్రులు కోకోల్లలు. పట్టాభిషేకానికని పెట్టిన లగ్నం సీతారాముల వనవాసానికి ఎందుకు దారితీసింది? అన్న ప్రశ్నకు సమాధానం దొరకదు. జ్యోతిషము మానవ జీవితంతో చెలగాటమాడుతున్నది. దీనిని ప్రపంచంలోని సుమారు నూటపదిమంది మేధావులు నిరుపయోగమని ప్రకటించారు. తెలిసినవారు దీనిని వ్యతిరేకిస్తున్నారు. దాని మంచి చెడ్డలను విచారించడానికి అందరు ప్రజలకు తీరిక, అవకాశం, తగిన ఓపిక లేవు. దాంతో సంప్రదాయకంగా దానిని తమ జీవితాలలో పాటించేవారు అధిక సంఖ్యలోనే ఉన్నారు. ఖగోళశాస్త్రజ్ఞానము, జ్యోతిర్గణితము సరియైనవే. జ్యోతిష్యం వేరు జ్యోతిర్గణితం వేరు. సూర్య, చంద్ర గ్రహణాల కాలాన్ని

లెక్కకట్టి కలిగినంత మాత్రాన సూర్య, చంద్రాదులు ప్రతి ఒక్క మానవ జీవితాన్ని శాసిస్తాయనడం ఎంతవరకు సబబు? అలా జరిగితే మానవ సంకల్పానికి శక్తిలేకుండా పోదా? మానవ జీవితం ముమ్ముందుగా నిశ్చయింప బడినదై మానవ పురుషప్రయత్నాన్ని వమ్ము చేయదా? అపుడు 'కర్మ' సిద్ధాంతం ఏమవుతుంది? ఏదయినా ఈ విషయాన్ని హిందూ సమాజం పట్టించుకోవలసిన అగత్యం ఉంది.

పెండ్లితంతు :-

ఈనాడు పెండ్లితంతు వివిధ ప్రాంతాలలో, వివిధ కులాలలో వేరువేరు రకాలుగా దర్శనమిస్తోంది. వాటికి హిందూ వివాహ శాసనం (1955) ఆమోద ముద్రవేసింది. వధూవరులలో ఏ ఒకరి ఆచారం ప్రకారం జరిగినా వివాహం సక్రమంగా ఉన్నట్లే. బౌద్ధుల ఆచారం వేరు. జైనుల పద్ధతి వేరు, అలాగే బ్రాహ్మణ వర్ణస్థుల విధానం వేరు. శూద్రుల సంప్రదాయం వేరు. వడియ రాజ కులపు పెండ్లికి, ముదిరాజుల ఇంట జరిగే పెండ్లికి మార్పు కనిపిస్తుంది. సప్తపదిని అందరూ పాటించాలని లేదు. పాటిస్తే ఏడడుగులు వేయాలని మాత్రమే నిబంధన. ఇంత వెసులుబాటు శాసనంద్వారా కల్పింపబడినా బ్రాహ్మణ పౌరోహితుని ఆధ్వర్యంలో అర్థంకాని భాషలో—సంస్కృతంలో— వివాహాలు జరుగుతున్నాయి. అందుచేత పెళ్ళిమంత్రాల అర్థాలు కనీసం వధూవరులకు అర్థం కాకుండా పోతున్నది. పెళ్ళిలో చేసే ప్రమాణాలు కేవలం మంత్రాలుగా మిగిలిపోతున్నాయి. ఈ పద్ధతికి నిరసనగా ఎన్నో సంస్కరణోద్యమాలు వచ్చాయి. బ్రాహ్మణ పౌరోహితునికి బదులు అబ్రాహ్మణ పౌరోహితుడి ఆధర్వం, సంస్కృతంలో బదులు తెలుగులాంటి ప్రాంతీయ భాషలలో పెండ్లి, పురుషునికి ప్రత్యామ్నాయంగా స్త్రీ పౌరోహిత్యం చేయడం, ఈనాటికి పనికిరాని భావాలను వెలివేసి కేవలం వస్తుప్రధానమైన ఒడంబడికలు ప్రమాణాలు రంగం మీదికి వచ్చాయి. ఇంతగా మార్పు వస్తున్నా అధిక సంఖ్యాకులు పౌరోహితుల ఆధ్వర్యంలోనే వివాహాలు జరిపిస్తున్నారు. ముఖ్యంగా రెండు సందర్భాలలో వివాహం, మరణం ఈ రెంటికి సంబంధించిన కర్మ కాండలో హిందూ సమాజం మతగురువులను మించిపోలేక పోతున్నది.

పెండ్లితంతులో స్త్రీకి సంబంధించిన ముఖ్య ఘట్టాలను మాత్రమే పరిశీలించపూనటం సరియైన చర్య. లేకపోతే గ్రంథం పెరుగుతుంది. కార్యసిద్ధి నెరవేరదు.

ఋగ్వేదకాలంలో పాణిగ్రహణం, ఊరేగింపు, గృహప్రవేశం మాత్రం ఉండేవి. కన్యాత్వ రాక్షసుని వదిలించేవారు. ఆమె పెండ్లి సమయంలో కట్టిన వసనాన్ని పురోహితునకు దానం ఇచ్చేవారు. అత్తింటికి పోయే త్రోవలో ఆటంకాలు రాకూడదని ప్రార్థనలు సాగేవి. అందరినీ వచ్చి పిల్లలను చూడమని అభ్యర్థనలు ఉండేవి. (ఋగ్వే X-33) దీనిని 'సుమంగళి' అనేవారు సంతానం ఇమ్మని పురోహితులు అగ్నిని ప్రార్థించేవారు. 'నీవు నాతో కలసి వృద్ధాప్యాన్ని చేరుకొనుము' అని వరుడు వధువును కోరేవాడు. అశుభంకాని సమయంలో భర్త యింటిలో వధువు ప్రవేశిస్తుంది. "నీ భర్త తండ్రిపైన, నీ భర్త తల్లిపైన, అధికారం చలాయించుము. నీ భర్త అక్కచెల్లెళ్ళ మీద, తమ్ముళ్ళమీద నీదే సర్వాధికారం (ఋగ్వే X 36) అని పురోహితుడు చెప్తాడు. తరువాత వధూవరులిరువురు కలసి దేవతలను ప్రార్థిస్తారు 'మన హృదయాలను కలపాలని' వాటి తాత్పర్యం. ఆమె పశువులను తాకుతుంది. ప్రేమతో గృహయాజమాన్యాన్ని స్వీకరించటానికి ఇదిగుర్తు. తరువాత ఆమెను ఆవరించి ఉన్న వరుణుని, సోముని, అగ్నిని. గంధర్వుని మంత్రాలతో ప్రార్థించి పంపివేసిన తదుపరి, భార్యాభర్తలు దాంపత్య జీవితాన్ని ఆరంభిస్తారు. వేదకాలంలో మంగళసూత్ర ధారణ లేదు.

అథర్వ వేదకాలానికి స్త్రీలస్థితి దిగజారింది. స్త్రీకి వివాహం విధి అని భావించే స్థితి వచ్చింది. వృద్ధ కన్యల జీవితం కష్టతరమయింది ఋగ్వేదపు చివరికాలంలోనే. వారిని నరకానికి ప్రభువైన యమునకు వివాహం చేసినట్లుగా భావించేవారు (ఋగ్వేదం I 14, 2). అథర్వ వేదాన్ని తరువాత భారత దేశానికి వలసవచ్చినవారు తెచ్చారని, ఆ వేదపు ఆచారవ్యవహారాలు ఋగ్వేదం ప్రాచీనమయినవని, కాగా భారతదేశంలో ఉనికి విషయంలో ఋగ్వేదపు ఆర్యుల తరువాతవని గ్రహించాలి. చాలకాలం వరకు ఋగ్వేదపు ఆర్యులు అథర్వ వేద ప్రామాణ్యతను అంగీకరించలేదు. వివాహం పూర్తి అయ్యేవరకు వరుడు వధువును చూడకూడదని ఆచారం ఋగ్వేదంలో లేదు. దానికి అథర్వ వేదంలో స్థానం కలిగింది. అథర్వవేదపు వివాహ పద్ధతిలో 'అస్మారోహణం' ఉంది. వధువు రాయిపై కాలూని నిల్చోవాలి. అంటే ఆమె రాయివలె స్థిరత్వం కలిగి పవిత్రమైన వైవాహిక జీవితాన్ని గడపవలెనని ఆశయం. యజుర్వేదంలో అగ్నిచుట్టూ ప్రదక్షిణం, సప్తపదిచోటు చేసుకున్నాయి. ఈనాటి సప్తపదికీ, శాంఖాయన గృహ్యసూత్రంలో చెప్పబడినదానికీ తేడా

గమనించండి. "ఒక పదంతో పసరు కొరకు, రెండు పదములతో రసంకొరకు (సోమలత రసంకొరకు), మూడు పదములతో సంపద వృద్ధికొరకు, నాలుగు పదములతో సౌఖ్యం కొరకు, అయిదు పదములతో సంతానం కోసం, ఋతువుల నిమిత్తం ఆరుపదములు, ఏడుపదములతో స్నేహాన్ని ఆశించివేయుము. నీవు నా యెడల విశ్వాసంతో ఉండుము" ఈ మాటలను వరుడు వధువుతో అంటాడు.17 మంత్ర బ్రాహ్మణంలోని సప్తపది ఉన్నపద్ధతినే బౌద్ధాయనుడు (యజుర్వేద పద్ధతి) అనుసరించాడు. 'నీవు నా స్నేహితురాలివి' అని వరుడు వధువుతో అని తనతో ఏడడుగులు ఆమెను నడిపిస్తాడు. విష్ణుపరంగా ప్రార్థనా యుతంగా తన ఆశను వెలిబుస్తాడు వరుడు. "నీ మొదటి అడుగును ఆహారం కోసం విష్ణువు వేయప్రోత్సహించును గాక"

రెండవ పదం బలం కోసం, మూడవపదం వ్రతాల నిమిత్తం, 4 వ పదం స్నేహాన్ని ఆశించి, 5 వ పదం పశువులకొరకు (ఆనాడు పశువులు ముఖ్యసంపద), 6 వ పదం సంపదను కోరి, ఏడవపదం ఏడుగులు ఆచార్యుల కోసం అని వరుడు చెప్తాడు. 'ఇలా ఏడడుగులు వేసిన నీవు నా స్నేహితు రాలివిగా ఉండుము. నేను నీ స్నేహాన్ని అనుభవించ గలుగుదును గాక.18

పాణిగ్రహణంలో వరుడు వధువు హృదయ దేశమందు తన హస్తాన్ని ఉంచి ఇలా అంటాడు :-

"నీ హృదయం నా హృదయమందు ఉండుగాక. నీ చిత్తం నా చిత్త మగుగాక. నీవు హృదయపూర్వకంగా నా వాక్కులను విందువుగాక. నీవు నన్ను అనుసరింతువుగాక. నీవు నా సహచరిగా ఉందువుగాక" (బౌద్ధాయన I 4, 1)

కన్యాదానం హిందూ వివాహంలో ప్రముఖమైన తంతు. తల్లిదండ్రులు కన్యను వరునికి అప్పగిస్తారు. తండ్రి అంతవరకు కన్యపై తనకు ఉన్న హక్కులను వరునికి ధారపోస్తాడు.

కన్యాధాన పద్ధతి హిందూ మతాన్ని ఎంతగానో అభిమానించే మహాత్మా గాంధి నిరసించాడు. తండ్రి కన్యకు రక్షకుడు, కాని యజమాని కాదు. కన్యాదానం చేసే హక్కు తండ్రికి కూడా లేదన్నాడు మహాత్ముడు.19

పాణిగ్రహణ మంత్రంలో 'నీవు నా మాట వినుము' అంటాడు వరుడు. సప్తపదిలో నీవు నన్ను అనుసరించుము. అనే భావం ప్రస్ఫుటంగా ఉంది. కన్యాదానం విషయం సరేసరి. అధికారాన్ని అల్లుడికి దత్తం చేస్తాడు. తిట్టుకున్నాసరే, కొట్టుకున్నాసరే ఉలకడు పలకడు. అందుకనే ఇన్ని స్త్రీల హత్యలు, ఆత్మహత్యలూ. ఈ పెండ్లి తంతులోనే నిండి నిబిడీకృతంగా ఉంది పురుషాధిక్య భావన. అది ఈనాడు కూడా ఆదరణీయమా? అనేది చర్చనీయాంశం. ఈ అంశాన్ని మరచిపోయి హిందూ సమాజ వివాహరీతులు 'ఔన్నత్యాన్ని' పొగడడం పొరపాటు కాదా?

హిందూ సమాజంలో దక్షిణాదిన మాంగల్య దారణకు ఎనలేని ప్రాముఖ్యత ఇస్తున్నారు. విద్యావంతులైన స్త్రీలు కూడా తమ వైవాహిక దశకు చిహ్నంగా తాళిని ఏరికోరి మెడలో కట్టించుకుంటున్నారు. అసలు దీని ప్రసక్తి మొదటిసారిగా శౌనకస్మృతి (I - 1) లో కనిపిస్తుంది.20 సూత్రాన్ని కన్య మెడలో కాక మొక్కకు కటేవారు.21 కన్య మెడలో మంగళసూత్రం కట్టడం అనేది అనార్య ఆచారం. దీనికి తమిళదేశంలో ప్రాముఖ్యత మరీ ఎక్కువ. సుముహూర్తం అంటే తాళి కట్టినవేళయే. తాళికట్టే పద్ధతి 11 వ శతాబ్దంలో స్కాందపురాణంలో మనకు దర్శన మిస్తుంది. అంటే ఇది సుమారు తొమ్మిది వందల సంవత్సరాల ఆచారం మాత్రమే.

అధ్యాయం 3

పాదదీపికలు

1. మానవ వివాహాల చరిత్ర : వెస్టర్ మార్క్
   (History of Homan Marrages Vol 1. Page 26)
2. ఉపాధ్యాయ : వివాహం అనే అధ్యాయంలో
3. ఆశ్వలాయన గృహ్యసూత్రం I 6. 1-4
   (వేదకాలపు స్త్రీలు : శకుంతలారావు శాస్త్రి పుట 121)
4. యుగయుగాలలో భారతీయ స్త్రీలు : పి. థామస్
   6 వ అధ్యాయం.

4. ఉపాధ్యాయ : 'వివాహం' అనే అధ్యాయంలో

6. డిటో డిటో

7. ఆల్టేకరు : 2 వ అధ్యాయం పుటలు 53-56

8. పి. థామస్ : 8 వ అధ్యాయం

9. ధర్మశాస్త్రిలు : కానే పుట 205

10. డిటో పుట 525

11. డిటో పుటలు 429 - 435

12. ఆల్టేకర్ : పుట 74

13. ధర్మశాస్త్రిలు : కానే పుటలు 447, 448

14. హిందూస్త్రీ Hindu Women
Normative model : Probhati
Mukherjee - (1978) Page 103

15. లఘు అశ్వలాయన స్మృతి 15-33

16. బౌద్ధాయన గృహ్యసూత్రిం V. 5 కానే వాల్యూమ్
2 పార్టు 1, పుట 537

17. ఆల్టేకరు పుటలు 40, 41

18. డిటో పుట 72

19. వేదకాలపు స్త్రీలు : శకుంతలరావు శాస్త్రి పుట 124

20. డిటో పుట 135

21, స్త్రీలు : మహాత్మా గాంధి : పుట 63
Women : M. K, Gandhi (Navajivan
Publishing House, Ahmedabad - 14. (1964)

అధ్యాయం

4 వైవాహిక జీవితం

ఈనాడు హిందువులలో అధిక సంఖ్యాకుల ఇళ్ళలో పురుషునిదే పెత్తనం. పేరుకు స్త్రీ గృహలక్ష్మి. అన్ని ముఖ్యమైన నిర్ణయాలు చేసేది అతడే. స్థిరాస్తి సంపాదన, దాన్ని భద్రపరచటం, చరాస్తి ఎలాంటిది కావాలో నిర్ణయించటం, పిల్లల పెళ్ళిళ్ళు, విద్య, ఒకటేమిటి ఇంచుమించుగా అన్నీ అతని హక్కు భుక్తాలే. కొన్ని కుటుంబాలలో ఏయే పధార్ధాలు వంట చేయాలో తేల్చేది అతడే. అతడు భుజించిన తరువాత ఏమైనా మిగిలివుంటే పిల్లలకు పెడుంది తల్లి. వారు తినగా ఇంకా ఏమయినా—మిగిలితే ఆమె తింటుంది. లేకపోతే మజ్జిగ నీళ్ళతో లేక గంజినీళ్ళతో తృప్తిపడుతుంది. ఆరోగ్యనిపుణులు ఈ విషయమై గగ్గోలు పెట్టున్నారు. స్త్రీకి పోషకాహారం చాలినంత లేదని ఆందోళన చేస్తున్నారు. అధిక సంతానం వలన ఆమె ఆరోగ్యం దెబ్బతింటున్నదని ఎలుగెత్తి చాటుతున్నారు. ఆమె కేవలం చాకిరీ చేసే యంత్రంగా మారిందని స్త్రీ విమోచనోద్యమకారులు పదే పదే ప్రకటిస్తున్నారు. ఈ స్థితి ఇలా ఉండటానికి హిందూ మనస్తత్వం కారణభూతమా? అనేది పరిశీలించాలి.

భార్యను గురించి వర్ణనలు :- శుభం తెచ్చునది కనుక ఆమె 'కళ్యాణి' (రుగ్వే III 53. 6). భర్త ఇంటికి ఆశీస్సులను తెచ్చునది కనుక ఆమె 'శివతమా' (రుగ్వే X 85, 37). పశువులకు సౌభాగ్యాన్ని తీసుకొని వచ్చేది (రుగ్వే X 85, 43; 44). కళ్ళల్లో క్రూరత్వం లేక, భర్తను చంపేదిగా కాక, పశువులకు శుభం చేకూర్చేదిగా, దేవతలను ప్రేమించేది, సంతోష స్వాంత, వీరమాత, పశుపక్ష్యాదులకు క్షేమం కలుగజేసేది (రుగ్వే X 84,44) భర్త సంతోషాన్ని పంచుకునేది, అతనిని కౌగలించేది (రుగ్వే X 89, 37). భార్యసామ్రాజ్ఞి (రుగ్వే X 85, 46). భార్యయే కుటుంబం, గృహం అని విశ్వామిత్ర ఉవాచ. రుగ్వే III. 53, 4)

కుటుంబానందం, దాంపత్య ప్రేమ అనే పదాలు రుషుల గానాలలో కనిపిస్తాయి. ఆర్యులది ఒక రకమైన సమతుల్య జీవితం. దేవతల పట్ల

యజ్ఞ, యాగాదుల విషయంలో కఠిననియమాలు, మరల కుటుంబంలో ప్రేమతో కూడిన దాంపత్య జీవితం ఈ రెండూ పెనవేసుకొని ఉన్నాయి.[1] "భర్తను అంటిపెట్టుకొని ఉంటుంది. అల్లుకున్న కౌగిలిలో ఇరువురు ప్రేమఫలాన్ని, ఆనందాన్ని పొందుతారు. ఋగ్వే I 105. 2). దోషరహితమైన శీలం కల భార్యను 'అనవద్యనారి' అని అభివర్ణించారు. ఇంద్రానివలన ఇంద్రునికి బలమట (ఋగ్వే 159, 4). భార్య వీరాంగన కావాలట.

ఈ సందర్భంలో పునశ్చరణగా కన్పించినా వివాహాన్ని ఏయే శాస్త్ర విదులు ఎలా పరికించారో గమనించటం అవసరం. దేవతలయెడ హోమ విధులు, ప్రేమ జీవితం గడపటం ఆర్యుల ఆశయం. (ఋగ్వే VII 31, 9) దానికి అనుగుణమైనది గృహస్థ ధర్మం. అథర్వవేద సమాజంలో పితృ దేవతలకు పిండప్రదానం ముఖ్యమైనది. అందువల్ల కుమారులనుకనటానికి భార్య అవసరమయింది. కనుక తన పిల్లల తల్లి కావటానికి భార్యను స్వీకరించాడు పురుషుడు. మత విధిని నేరవేర్చటానికి సాయపడే స్త్రీ భార్య అని బ్రాహ్మణాల కాలంలో భావించేవారు. ఉపనిషత్తులలో గార్గి - యాజ్ఞ వల్క్యుల సంభాషణ, మైత్రేయి యాజ్ఞవల్క్యుల సంవాదం ఎన్నదగినవి. గార్గిని యాజ్ఞవల్క్యుడు ఎంత బెదరించినా ఆమె పట్టుపట్టి బ్రహ్మజ్ఞాన సారాన్ని తెలుసుకుంది. బ్రహ్మలోకం ఎక్కడ ఉంది? అని ప్రశ్నించిన గార్గిని ఇలాంటి ప్రశ్నలు కొనసాగిస్తే చనిపోతావన్ని బెదిరించిన యాజ్ఞవల్క్యుడు ఆమె కోరికను మన్నించక తప్పలేదు. అలాగే ధన కనక వస్తు వాహనాదులు అక్కరలేదు, బ్రహ్మజ్ఞానాన్ని తనకు తెలియ జేయమని కోరిన మైత్రేయిని మొదట్లో వారించినా చివరకు ఆమెకు బ్రహ్మ స్వరూపం తెలియజెప్పక అతనికి తప్పలేదు. అంటే కేవలం భర్తను సంతోష పెట్టటమేకాక ఇతరత్రా జ్ఞాన సముపార్జన స్త్రీ విధియని భావించే భార్యలు ఉండే వారన్నమాట. తన ఆదర్శాల సాధనకోసం జీవితం సాగించే ప్రయత్నంలో భర్తలు భార్యల సహకారాన్ని అర్థించేవారు మాంత్రి బ్రాహ్మణ కాలంలో. మంత్రి బ్రాహ్మణం గృహ్య సూత్రాలకు పూర్వపుకాలపు గ్రంథం. కేవలం సంతాన ప్రాప్తియే గాక మతరంగంలో భార్యాభర్తల సహకారానికి, ఏకత్వానికి వివాహం ఉద్దేశింపబడింది. అశ్వలాయన గృహ్య సూత్రాల ప్రకారం వివాహం కేవలం సంతానం కొరకు మాత్రమే కాక కుటుంబ జీవితంలోని భౌతిక సుఖాలు లక్ష్యంగా కలది. బౌధాయనుడు

మాతృత్వానికి ప్రాధాన్యత ఇచ్చాడు. అగ్నిసాక్షిగా జరిగిన వివాహంలో స్త్రీ జీవితం పురుషుని జీవితంలో లీనమయిపోతుంది.2

బహు భార్యాత్వం :- ఏకభర్తృత్వం, ఏక భార్యాత్వం ఋగ్వేదకాలంలో ఉన్న నియమము. యజ్ఞయాగాది క్రతువులలో భార్య ప్రక్కన ఉండేది. భార్యను గురించి ఏకవచనములోనే చెప్పారు (ఋగ్వే I 124, 7). భర్త శవం ప్రక్కన ఒకే భార్యపడుకునేది (ఋగ్వే X 18, 8) బహు భార్యాత్వం పురాతన సంప్రదాయం. కాగా వేదకాలపు చివరి రోజుల్లో అది కనపడుతుంది. దస్యుల స్త్రీలను చెరపట్టేవారు. రాజులు సామంతులు వారి ఆస్థాన పురోహితులు బహు భార్యాత్వాన్ని పాటించారు. సామాన్యులు ఏకభర్తృత్వ, ఏక భార్యాత్వ విధానాన్ని అనుసరించేవారు. 'సపత్ని' అనే పదం. 'ద్విజాని' (ఇద్దరు భార్యలు కలవాడు) అనే పదాలు వైదిక వాఙ్మయంలో కనిపిస్తాయి (ఋగ్వే X 101, 11; ఋగ్వే III 1, 10). ఇంద్రుడు తన భార్యల మధ్య 'రాజీవుని' వలె వుండెను (ఋగ్వే I 62, 11; ఋగ్వే I 71, 1; ఋగ్వే I 104. 3) బ్రాహ్మణాల కాలం నాటికి రాజులకు నల్గురు భార్యలుండేవారట. 'మహిషి' అంటే పట్టపురాణి (ఆస్థానంలో అధికారం కలిగియుండేది). 'పరివ్యక్త' ఆమె స్థానం రాజకీయ కారణాల వలన పెరగడం తరగడం కలదు. 'వావాత' రాజుకు ఇష్టురాలైన భార్య. నాలుగవది 'పాలాగలీ'. ఋషులు అనేకమంది భార్యలను వివాహమాడేవారు. కక్షివాన్, చ్యవనుడు అలాంటివారు. బహు భార్యాత్వం అనుమతింపబడిన ఆచారం. కాని అది అంత ప్రబలంగా లేదు. ఆర్యుల సామాజిక వ్యవస్థ బహు భార్యాత్వానికి అనుకూలంగా లేదు.3 మహా భారతంలో అర్జునునికి ద్రౌపది, సుభద్ర, ఉలూపి భార్యలు. కృష్ణునికి ఎనిమిది మంది భార్యలు-రుక్మిణి, సత్యభామా, ఇత్యాదులు. రామాయణంలో దశరధునికి ముగ్గురు భార్యలు. ఇలా సాగింది హిందూ సమాజ ధోరణి. మదరాసు రాష్ట్రంలో 1948 దాకా, భారత దేశంలో 1955 దాకా హిందూ పురుషునికి ఏక కాలంలో ఎంతమందయినా భార్యలుండవచ్చును.

బహుభర్తృత్వం :- అశ్వినులు, మరుత్తులు, వైశ్యదేవులు బహుభర్తృత్వ కుటుంబాలకు నమూనాలని చెప్తారు. కాని వారు ప్రకృతి సంఘటనలకు ప్రతీకలు. కనుక 'ముక్కస్యముక్క: అర్థం చెప్పి బహుభర్తృత్వం ఉందనటం సరియైనది కాదు. అవి ఆనాటి సామాజిక అలవాట్లను బట్టి వచ్చిన ఉపమానాలు కనుక బహు భర్తృత్వం వేదకాలంలో లేనట్లేనని ఉపాధ్యాయ నిర్ధారించారు.

ఉదయం, సాయంత్రం 'సూర్య' ను పొందియుండుట, మేఘాలు (మరుత్తులు) రోదసి (మెరుపు) ని పొందియుండుట అలాంటివి.

బహు భర్తృత్వం అనార్య సంప్రదాయం.4 ఇది రెండురకాలు. ఒకటి సోదరులందరూ ఒకే భార్యను క లి గి యు ం డ డ ము (Fraternal Polyanoty) ఇది డెహ్రాడూన్ జిల్లాలోని ఖూసాలు పాటించిన ఆచారం. రెండవది రక్తసంబంధంలేని పురుషులు ఒకే భార్యను కలిగియుండడం (Nonfraternal Polyandry). ఇది నీలగిరిలోని తోడాలలోను సిక్కిం, టిబిట్‌లలో ఉండేదట. ఈ రెండూ ముఖ్యంగా ఆర్థికపరమైన ఏర్పాట్లు. పాండవులు అయిదుగురు ద్రౌపదిని వివాహమాడటం అలాంటిది. ద్రుపదుడు ఈ వివాహానికి అంగీకరించలేదు. ఉతనికి అనేక విధాల నచ్చజెప్పారు. కుంతి ఆదేశం, దేవతలే పాండవులుగా పుట్టారని వ్యాసుడు చెప్పటం, ద్రౌపది శివుని పూజించి భర్త కావాలని అయిదుసార్లు అడగటం, సంప్రదాయం ఇవన్నీ ద్రుపదుని అంగీకరింపజేసాయి. 'జటిల' అనే స్త్రీ ఏడుగురు రుషుల భార్యగా ఉన్నట్లు కథ చెప్పారు. ఇంతకూ ద్రౌపది నిరసన తెల్పినట్లు ఎక్కడా లేదు. మరెక్కడా బహుభర్తృత్వ ఆచారాలు కన్పట్టవు. ఒకనాడు సమాజపు తొలి దశలో వావి వసరులు లేని దశనుండి వివాహం ఉద్భవించినపుడు ఈ రకపు వివాహం కూడా ప్రారంభమయి ఉండవచ్చును; పురుషాధిపత్య స్థాపనతో బహు భార్యాత్వం స్థిరపడింది. బహు భర్తృత్వం క్షీణించింది. కాకపోతే సంతానం లేకుండా అన్న చనిపోతే సోదరుని ద్వారా - నియోగం ద్వారా - సంతానం కనవచ్చుననే పద్ధతి (Levirate) బహు భర్తృత్వ వివాహపు అవశేషమేమో! బహు భర్తృత్వం వేదంలో లేదు. ఐతరేయ బ్రాహ్మణం దానిని నిషేధించింది. పాండవులు ఆర్యేతరులు అయివుండవచ్చని కానే అభిప్రాయం. ఆర్యులలో ఒకతెగ యేమోనని ఆల్టేకరు ఊహ.

<u>భార్య విధులు :-</u> ఆధునిక కాలంలో కూడ, అంటే స్త్రీలు ఉద్యోగాలు చేస్తున్న ఈ రోజుల్లో కూడ స్త్రీలు బండెడు ఇంటిచాకిరీ గృహిణులుగా తామే చేస్తున్నారు. హిందూ పురుషులు (దరహంమీద విషయం) కొంచెం కూడా భార్యలకు సాయం చేయరు. ఇది ఎందువల్ల సంభవిస్తుంది? సమాజ పరిణామాన్ని పరికిస్తే సమాజం నాలుగువేల ఏండ్లనుండి పురుషాధిపత్యం

క్రింద సాగుతున్నదని తెలుతుంది. కనుకనే ఈ ఆచారం. దీనివెనుక బలంగా కొనసాగింపబడుతున్నది. ఇన్నివేల సంవత్సరాలుగా స్త్రీకి మేధ ప్రక్షాళనం (బ్రెయిన్ వాష్) జరిగింది. అదే సక్రమమైనదని ఆమె భావిస్తున్నది. నాటినుండి ఈనాటివరకు అది తన కర్తవ్యమని తలపోస్తున్నది. భార్యాభర్తలు ఇరువురు ఇంటి వెలుపల పనిచేస్తున్నట్లుగానే (విడివిడిగానే అనుకోండి) ఇంట్లోపనిని ఉమ్మడిగా చేసుకోవాలనే భావన ఆవిడకు కూడ వెగటుగా, విపరీతంగా తోస్తున్నది. మహిళా దశాబ్దం పూర్తి అయిన తరువాత కూడా భారత మహిళ - అందులో ముఖ్యంగా హిందూ మహిళ - పాత సంప్రదాయపు భావాలనే పట్టుకొని వ్రేలాడుతున్నది ఇది ఒక అంశానికి ఉదాహరణ మాత్రమే కనుక అసలు చారిత్రను పరిశీలిద్దాం.

వేదకాలంలో :-

గృహిణి అగ్ని ఆరిపోకుండా చూడాలి. భర్తతో కూడి అగ్నిని పూజించాలి. (ఋగ్వే V 43. 15). క్రతువులన్నింటికి అర్య గృహిణి హాజరు కావలసిందే (ఋగ్వే X 86, 10). పదిమంది వీరులను కనవలెను. (ఋగ్వే X 85, 45); మొదట్లో సామాజిక అవసరాలకోసం ఈ విధిని నిర్ణయించారు. తరువాత దీనికి మతాన్ని, ధర్మాన్ని జోడించారు. ఆమె గృహపత్ని. అందరిని నిద్రలేపాలి. అత్తమామలను, అడబిడ్డలను, మరదలను కనిపెట్టి ఉండాలి. ఆమె మానవులకు, పశువులకు తల్లి లాంటిది. (ఋగ్వే I 66, 3). పండుగలకు, పబ్బాలకు వెళ్ళాలి. (ఋగ్వే X 86, 10). ఇంట్లో వున్న స్త్రీ బానిసలపై ఆమెదే పెత్తనం. వారిని వధువులని పిలిచేవారు. ఆమె గృహపత్ని కనుక ఆమె గార్హపత్యాన్ని నిర్వహిస్తుంది. ఆమె భర్తకు సహధర్మిణి. ఆమెకు నచ్చని విషయం ఉంటే ఆమె అసమ్మతి తెలుపవచ్చును. అన్యాయమని ఎలుగెత్తి చాటవచ్చును; గొణగవచ్చును. ఆ కాలంలో ఆమె అణగి, మణగి ఉండవలసిన స్త్రీ కాదు. అవసరం వస్తే యుద్ధానికి వెళ్ళిన స్త్రీలున్నారు. ఖేలుని భార్య యుద్ధానికి వెళ్ళి భర్త సరసన పోరాడుతూ తన కాలును పోగొట్టుకుంటే, అశ్వినులు ఆమెకు ఇనుపకాలును సమకూర్చి పెట్టారు.5

భార్య భర్త భుజించిన తర్వాత భోజనం చేయవలెనని శతపథ బ్రాహ్మణంలో ఉన్నది. భార్యయొక్క విధులను గురించి స్మృతులు,

పురాణాలు, ధర్మకోశాలు ఎక్కువగా వ్రాసాయి.[6] భర్తకు విధేయురాలిగా ఉండాలి. భర్తను దైవంగా చూడాలి. (శతపథ బ్రాహ్మణం IV 1. 5. 9.) సుకన్య నా భర్తను (చ్యవనుని) వదలిపెట్టను అని అంటుంది. భర్త నపుంసకుడయినా, పతితుడయినా, కుంటివాడయినా, వ్యాధిగ్రస్తుడయినా, భార్య భర్తను ద్వేషించరాదు. శంఖలిఖిత స్మృతి -చూడడు పుట 562-కానే) దుష్టుడైనా, పరస్త్రీ వ్యామోహితుడయినా, సద్గుణవంతుడు కాకపోయినా గుణవంతురాలయిన భార్య భర్తను దేవుని వలె పూజించవలెను. (మను- V. 154) భార్యలు భర్త ఆజ్ఞలను శిరసావహించవలెను. (యాజ్ఞవల్క్యుడు I . 17) భర్త భార్యకు యజమాని, దైవము. పతి సేవల వల్లనే ఆమె ఉన్నతోన్నతి పొందగలదు. (రామాయణం అయోధ్యాకాండ 24.26,27)

మనుస్మృతిలో పంచమ అధ్యాయంలో స్త్రీల కట్టుబాట్లను గురించి ఇలా వివరించబడింది:-

1. బాల్యముగానుండినను, యవ్వనముగా నుండినను, వార్ధక్యముగా నుండినను స్త్రీలు తమ తమ ఇండ్లయందునూ తమ మనస్సు పోయినట్లు ఏకార్యమునూ చేయరాదు.

2. బాల్యమందు తండ్రి యాజ్ఞయందును, యౌవనమునందు పతి యాజ్ఞయందును, పతిగతించిన వెనుక బిడ్డల యాజ్ఞయందును నుండవలయును గాని స్త్రీలు స్వాధీనముగా నెప్పుడూ నుండరాదు.

3. తండ్రి, పతి, బిడ్డలు, వీరలను వదలి తానుమాత్రము ఒంటరిగా నుండవలయునని ఎప్పుడూ స్త్రీ దలంప కూడదు. అట్లు వారలను వదిలి స్వతంత్రురాలుగా నుండెడి స్త్రీ పుట్టిన కులము, చొచ్చిన కులము రెంటిని నిందలపాలు చేయుచున్నది.

4. ఎల్లప్పుడు తన యింటి కార్యమందు సామర్థ్యము కలదిగాను, సంతోషము కలదిగానూ, యింటనున్న వస్తువులను పరిశుద్ధ పరచునదిగానూ అధిక వ్యయమందు మనస్సులేనిదిగా నుండవలయును.

5. తండ్రి లేక తోడబుట్టినవాడు యామెను ఎవ్వనికి వివాహమునకై ఇచ్చుచున్నాడో వాడు జీవించియుండువరకు, వానికి ఈమె శుశ్రూష యచే

వలయును. వాడు చనిపోయిన వెనుకనూ వ్యభిచారము చేయక వానికి శ్రాద్ధము మొదలగు వానిని జేసికొనుచుండవలయును.

6. స్త్రీలకు వివాహకాలమందు శాంతిహోమము ఇవి యన్నియు నిష్టసిద్ధి కొరకు చేయబడుచున్నవి. నిశ్చితార్థమందు చేసెడు వాగ్దానమే పురుషుడు యాజమాన్యమును సూచించుచున్నది.

7. ఋతుకాలమందును, తక్కిన కాలమందును విధిప్రకారం వివాహం చేసుకొని భర్తయైనవాడు స్త్రీలకు ఇహమందు సుఖము నిచ్చుచున్నాడు. విధిప్రకారం అతని ననుసరించి నట్టులైన పరమందును సుఖము కలుగుచున్నది.

8. భర్త దురాచార వంతుడై యుండినను, అన్యస్త్రీ లోలుడై యుండినను, సద్గుణములేనివాడై యుండినను, పతివ్రతాస్త్రీ వానిని దైవముగా పూజించవలయును.

9. స్త్రీలకు పంచమహాయజ్ఞము, ఉపవాసము, వ్రతము, మొదలగు ధర్మములు ప్రత్యేకముగా లేవు భర్తకు శుశ్రూష చేయుటచేతనే స్వర్గమందు గౌరవము పొందుచున్నారు.

10. పరలోకమందు ఆపేక్ష గలస్త్రీ తన భర్తయుండినను, గతించినను వానికి విరోధమగు కార్యము చేయరాదు.

11. భర్త గతించిన పిదప పరిశుద్ధమైన నీరు, దుంపలు, ఫలములు, లేత చిగుళ్ళలాంటి స్వల్పాహారములచే కాలము గడపవలయును కాని కామేచ్ఛ చేత మరియొక పురుషుని పేరు చెప్పరాదు.

12. పతి గతించిన వెనుక తాను జీవించి యుండువరకు ఓర్పుకలదిగాను, పరిశుద్ధమైనదిగాను, బ్రహ్మధ్యానము గలదిగాను, మధుమాంస భక్షణ చేయనదిగాను, పతివ్రతాధర్మమును అపేక్షించునదిగా నుండవలయును.

13. పతి కాలము చేసిన యనంతరము బ్రహ్మచర్య వ్రతముగల పతివ్రతాస్త్రీ సంతానములేక యుండినను వాలఖిల్య, సనకాది బ్రహ్మచారులవలె స్వర్గమొందుచున్నది.

14. ఏ స్త్రీ స్వర్గలోకము నొందుటకొరకు పుత్రుడు కావలయునని పతి గతించిన వెనుక మరి యొకనితో సంపర్కము చేయుచున్నదో ఆమె ఈ లోకమందు నిందింపబడుచున్నది. ఆలాగు పుట్టిన పుత్రునిచే పుణ్యలోకమును చెందనేరదు.

15. పతివ్రతా స్త్రీలకు రెండవ వివాహమును గురించి ఏ శాస్త్రములోనూ చెప్పబడలేదు.

16. నికృష్టుడైన తన భర్తను విడిచి ఉత్కృష్టుడగు మరియొకనిని యే స్త్రీ పొందుచున్నదో ఆమె నిందలపాలగును.

17. స్త్రీ వ్యభిచారము చేయుటచేత లోకమునందు నిందింపబడుటయే గాక గతించిన పిదప గుంటనక్కగా జన్మించి తెల్ల కుష్టు మొదలగు వ్యాధుననుభవించును.

18. ఏ స్త్రీ మనోవాక్కాయముల నర్పించుకొని వ్యభిచరించకుండునో ఆమె పతిలోకమునకు చెందును. మహాత్ములచే పతివ్రత యనియు చెప్ప బడును. పుణ్యలోక ప్రాప్తి కలుగును.

19. రాజులు యోచించుచోట స్త్రీలుండరాదు. పండితులు సమావేశములలో పాలుపంచుకోరాదు.

20. భార్య గతించినట్లులైన విధిప్రకారం ద్వితియ వివాహము చేసుకొని తన జీవితకాలము యొక్క రెండవ భాగమును గృహస్థాశ్రమము నందుండి గడపవలయును.

ఎనిమిదవ అధ్యాయం :-

21. పురుషుడు తాను సంపాదించి తెచ్చిన ద్రవ్యమును కాపాడుట, వ్యయము చేయుట, పాత్రలు మొదలగు వానిని శుద్ధిచేయుట, దేవపూజ మొదలగు వానికి ఏ సహాయమైన కార్యము చేయుట, భక్ష్య భోజ్యములను పక్వ పరచుట, మొదలైన యవశ్యములగు కార్యములు భార్యకు నేర్పి ఆమెయొక్క మనస్సు ఇతర విషయములందు పోకుండునటుల చేయవలయును.

22. స్త్రీలకు చంచల స్వభావము, నిలకడలేని మనస్సు పుట్టుకతోనే ఉండుట వలన పురుషుల యొక్క రక్షణవలన వారు సహించుటలేదు.

23. ఏడుపు, ఆసనము, అలంకారము, కామము, కోపము, అబద్ధము, ద్రోహచింత, వీనిని స్త్రీల నిమిత్తమే మనువు కల్పించినాడు.

24. స్త్రీలు పాతివ్రత్యము లేమియు, నిలకడలేని మనస్సును, స్నేహము లేమియు స్వాభావికముగా కలిగినవారు కావున పురుషులచేత పాలింపబడి యుండినను వారలను విరోధించుచున్నారు.

25. కల్లు త్రాగుట, దుష్టులతో స్నేహము, పురుషుని విడిచి వేరు గ్రామమునకు పోవుట, కారణములేకయే అచ్చటచ్చటికి పోవుట, తాను ఇష్టమైన చోట నిద్రించుట, పొరుగిండ్లకుబోయి కూర్చుండి యుండుట స్త్రీలకు నిందాహేతువైన కార్యములు.

26. స్త్రీలు మిక్కిలి వ్యభిచార దోషము గలవారని యనేక శ్రుతులయందును, శాస్త్రములయందును చెప్పబడినది.

27. పురుషునిమాట చొప్పున నడవని యాడది లోకులచే నిందింపబడి, నక్కగా పుట్టి, పాపబంధముచే కష్టపడును. ఇలాంటి స్మృతులు చక్కగా మనకు దర్శనమిస్తాయి. స్మృతికర్తలు 24 మంది వున్నారు వారంతా రూపాల తేడాలతో వారివారి రచనా పాటవంతో, చమత్కృతులతో స్త్రీని కించపరచే భాషతో, వైవిధ్యంతో రచించబడ్డాయి మన ధర్మశాస్త్రాలన్నీ

భర్త భార్యయొక్క దేవుడు, ఏకైక బంధువు. అతడే ఆమెకు గమ్యం (మ. భారతం. అనుశాసన పర్వం 146. 55).

భర్త పరదైవతం (మ. భా. అశ్వమేధికపర్వం 90. 51). "భార్యకు భర్తయే దైవం. ఆమెకు గమ్యం" (మత్స్య పురాణం 210. 18).

భర్త భార్యను సంపూర్ణంగా శాసించడం ధర్మసమ్మతమైనదని కణ్వుడు శాకుంతలంలో అంటాడు. ఇదే భావాన్ని, మనువు V 150 - 156, యాజ్ఞవల్క్య I 83-87, విష్ణుధర్మశాస్త్రం 25-22, మ. భా. వనపర్వం 233.19.58

(ద్రౌపది), మహా. భా. అను. 123 (శాండిలీ), వేదవ్యాసస్మృతి II 20-32, వృద్ధ హారీత XI- 84, స్మృతి చంద్రిక (వ్యవహార కాండ), మదన పారి జాతంలలో పలుచోట్ల చెప్పటం జరిగింది. 'భార్య ఎల్లపుడు చిరునవ్వుతో ఉండాలి. చురుకుగా ఉండాలి. ఇంటిపనులలో తెలివి తేటలు ప్రదర్శించాలి. పాత్రలు శుభ్రంగా ఉంచాలి. అవి తళతళా మెరుస్తుండాలి. దుబారా ఖర్చు చేయరాదు. (మనువు V 150.) 'మద్యపానం, దుష్టుల సహవాసం, భర్తను విడిచి నివసించటం, తీర్థయాత్రలకు వెళ్ళటం, పగటినిద్ర, ఇతరుల ఇళ్ళల్లో ఉండటం - ఈ ఆరు వివాహిత స్త్రీకి చెడుగు కలిగిస్తాయి.' (మను XIX 13) 'భర్త బంధుగుల ఇళ్ళల్లో భార్య ఎక్కువకాలం ఉండటం అప్రశస్తం.' (మ. భా ఆది. 74. 12)

'పేరు, శీలం రెండూ పోతాయి' (అభిజ్ఞానశాకుంతలం 77-19) మార్కండేయ పురాణం 77-19 లో ఇదే భావాన్ని వెలిబుచ్చింది.

మనువు V - 150 లో చెప్పినవి కాక అదనంగా యాజ్ఞవల్క్యుడు ఇలా చెప్పాడు.

1) భర్తకు ఇష్టమైనవి (ప్రియమైనవి, లాభం చేకూర్చేవి) చేయాలి.
2) భర్త తల్లిదండ్రుల పాదపద్మాలకు నమస్కరించాలి.
3) మర్యాదగా ప్రవర్తించాలి.
4) ఇంద్రియ నిగ్రహం పాటించాలి.

శంఖలిఖిత స్మృతి ప్రవచించిన వాక్యాలు :-

1) భర్త లేక పెద్దలు పొమ్మంటే తప్ప ఇల్లుదాటరాదు.
2) చక చకా నడవరాదు.
3) (వ్యాపారి, సన్యాసి, వృద్ధుడు, వైద్యుడు కాక) బంధుత్వం లేని పురుషునితో మాట్లాడరాదు.
4) బొడ్డును కన్పింపరాదు,
5) పాదములవరకు జీరాడేలా చీర కట్టుకోవాలి.

6) స్తనాలను బహిర్గత పరచరాదు.

7) చేయిగాని, వస్త్రంకాని అడ్డం పెట్టుకోకుండా బిగ్గరగా నవ్వరాదు.

8) భర్తను గాని, అతని బంధుగులనుగాని ద్వేషించరాదు.

9) వేశ్యల సాంగత్యం కూడదు.

అలాగే జూదమాడే స్త్రీలతో, సన్యాసినులతో, అదృష్టం చెప్పు స్త్రీలతో మంత్రాలు, తంత్రాలు చేసే స్త్రీలతో, రహస్యక్రితువ్రలు చేసే వారితో, దుష్టులతో సాంగత్యం చేయరాదు. అలాంటి సాంగత్యం వలన మంచి వంశంలోని స్త్రీల శీలం దెబ్బతింటుందని వివేకవంతులు చెప్పుచున్నారు."

విష్ణుధర్మశాస్త్రం (25. 1-6) ఇలా చెప్పింది.

1. భర్త చేసే వ్రతాలు మాత్రమే భార్య చేయాలి.

2. వస్తువులను భద్రం చేయాలి.

3. ప్రేమ సంపాదించటానికి మంత్ర తంత్రాలను వాడ ప్రయత్నించ రాదు.

4. శుభ పరివర్తన యెడల శ్రద్ధ వహించాలి.

బృహస్పతి (IV 1. 32)

1. భర్త, పెద్దలు లేవకముందు పెందలకడ లేవాలి.

2. భర్త, పెద్దలు భుజించిన తరువాత తను భోజనం చేయాలి.

3. వారికన్నా తక్కువ ఎత్తుకల పీఠంపై కూర్చోవాలి.

'భర్త అనుమతితో మాత్రమే ఆమె వ్రతాలు, ఉపవాసాలు, పూజలు,' నోములు చేయాలి. (శంఖలిత స్మృతి).

'భర్తను సరిగా చూచుకునే భార్య హరిలోకానికి చేరగలదు. [భాగవతం VII 11-25,)

స్కాందపురాణం బ్రహ్మకాండం ధర్మారణ్యవిభాగం 7 వ అధ్యాయంలో పతివ్రతా లక్షణాలుగా పేర్కొనబడిన అంశాలు :- [క్రీ. శ 600-900]

1. భర్త పేరును ఆమె ఉచ్చరించరాదు. అలా చేస్తే ఆమె భర్త వయస్సు పెరుగుతుంది. అంటే పేరు ఉచ్చరిస్తే ఆయుఃక్షీణమవుతుందన్నమాట.
2. భర్తను నిందించి పరపురుషుని పేరు ఉచ్చరించరాదు.
3. ఆమె దండింపబడినా ఆమె పెద్దగా విలపించరాదు. చిరునవ్వు నవ్వాలి.

"కార్యేషు దాసీ, కరణేషు మంత్రి, శయనేషు రంభా, భోగ్యేషు మాతా...." [పద్మపురాణం-అధ్యాయం 47-55]

భర్త గ్రామాంతరం వెళ్తే భార్య ప్రవర్తన ఎలా ఉండాలో వేద వ్యాసుని ముఖపరంగా విందాము.

"ఆమె ముఖం పాలిపోయి ఉండాలి. బాధతో కన్పడాలి. పూర్తిగా భోజనం చేయరాదు. దేహాన్ని కృశింప చేయాలి." [వేదవ్యాస స్మృతి II-52]

పతివ్రత అంటే ఎలాంటిదో బృహస్పతిస్మృతిలో వివరించబడినది :-

1. భర్త వ్యధలో ఉంటే తను వ్యధ చెందాలి.
2. భర్త సంతోషంగా ఉంటే తను సంతోషంగా ఉండాలి.
3. భర్త పరాయి ఊరు వెళ్ళినపుడు కృశించిన దేహం కలది.
4. ,, ,, మురికి వస్త్రాలు ధరించేది.
5. భర్త చనిపోతే చనిపోయేది.

"మతవిషయాలలో భార్య భర్తకు సహకరించాలి" [మనువు]

"భర్త సమ్మతి లేకుండా స్వతంత్రంగా ఆమె మత కర్మలు చేయరాదు". [మను V-155]

దమయంతి, శాండిలీ, సావిత్రి, ధర్మవ్యాధోపాఖ్యానంలో కౌశికునికి హితబోధ చేసిన మహిళ, గాంధారి, అరుంధతి, అనసూయ, సత్య, మేనా [చివరి ఇరువురు స్కాందపురాణంలో వారు] కానే అభిప్రాయం ప్రకారం పేరుగాంచిన పతివ్రతలు.

బుద్ధుడు అంగుత్తర నికాయంలో వెలిబుచ్చిన విషయాలు :-

1. కుటుంబంలో పొద్దుననే లేచి, ఇంటిపని అంతా పూర్తి చేసి, అందరి కన్నా చివరగా నిద్రకు ఉపక్రమించవలెను. సుందరముగా వస్తువులను తీర్చిదిద్దడం ఆమె విధి.

2. మీ భర్త గౌరవించే వారిని మీరూ గౌరవించాలి.

3. మీ భర్త చేతివృత్తులను మీరూ పాటించాలి. ఇంటిలోని పనివారిని దయతో, కరుణతో చూడాలి.

4. వెండి బంగారు వస్తువులను భద్రపరచుకోవాలి. ఇట్లు చేసిన స్త్రీలు దేవలోకానికి పోతారు.7 బౌద్ధంలో విధేయత, విశ్వాసపాత్రతలపై నొక్కు ఉన్నది. భార్యాభర్తలు ఇరువురు వ్యక్తులు. ఇద్దరూ ఒకటి కాదు. విడదీయరానివారు కాదు. అయితే ఇరువురి మధ్య సహకారం స్ఫురింపచేయబడింది. స్వామిభక్తి, పెద్దలయెడ విధేయత, గృహ నిర్మాణంలో సమర్థత, శాంతిప్రియత్వం ఆదర్శగృహిణి ధర్మాలు. పాతివ్రత్యం అందులో లేదు. బౌద్ధం క్రీ. పూ. 500 సం॥ నాటిదని జ్ఞాపకం ఉంచుకోవాలి.

శకుంతల భార్యయొక్క స్వరూపాన్ని ధర్మశాస్త్రపరంగా వివరించింది. "పురుషుని ఆనంద ప్రాప్తికి ఆమె కారకురాలు". భార్య భర్త అర్ధాంగి; ముఖ్య స్నేహితురాలు. క్రతువులలో తండ్రివలె అనారోగ్య సమయంలో తల్లివలె, బహిష్కార సమయాల్లో ఆమె భర్త వెంట ఉంటుంది. కష్టాలలో ప్రక్కన ఉంటుంది. మరణంలో యమలోకంలో కలుస్తుంది. ముందుగా చనిపోతే అతనికోసం ఉంటుంది. కుమారుని రూపంలో భర్త తిరిగి పుడతాడు. ఆమె అతని క్షేత్రం. ఉక్కపోస్తున్న మనిషి స్నానంచేసి సేదదీర్చుకున్నట్లు భార్య సాంగత్యంలో అతడు బాధనుండి, దుఃఖాన్నుండి విముక్తుడవుతాడు. రుషులు కూడా స్త్రీలు లేకుండా సంతానాన్ని పొందలేరు. కనుక ఏ పురుషుడు భార్యను కష్టపెట్టరాదు; బాధపెట్టరాదు. మ. భా. ఆ. 297. 45; మహా.భా ఆదిపర్వం 68, 69 విరాటపర్వం 2 : 14)

భార్యయొక్క గొప్పతనాన్ని గురించి, బాధ్యతను గురించి శివుని భార్య ఉమ చెప్పిన సంగతులు :-

"భర్త మంచి పనులలో ఆమె అతనికి చేదోడు వాదోడు అవుతుంది. మంచి స్వభావము, మధుర భాషణం, సుందరమైన రూపం, మలిన రహిత శీలం కల స్త్రీ తన శిశువును చూచినట్లే భర్తను చూచుకోవాలి (విధి నిర్వహణ చేసే స్త్రీ మతాన్ని పాటించినట్లు); నిజంగా పరిశుద్ధ. భర్త మొక్కుబడులను

తనూ చెల్లించాలి. దేవునివలె భర్తను సేవించవలెను. భర్తనే ధ్యానించవలెను. పరపురుషుని కలలో కూడ అభిమానించరాదు. ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలి. తనను దౌష్ట్యంగా చూచినా, ఉదాసీనంగా చూచినా, నవ్వుతూ కళ కళలాడుతూ ఉండాలి. అలాంటి స్త్రీ నీతిమంతురాలు. పురుషనామం కల చెట్టునైనా. సూర్యునినైనా, చంద్రునినైనా అభిమానదృష్టితో చూడని స్త్రీ గుణవంతురాలు. బీదవాడైనా, అనారోగ్యవంతుడైనా, భర్తను తన శిశువు లాగా చూచే స్త్రీ సద్వర్తనం కలది. ఇంద్రియ నిగ్రహం కలిగి భర్తను శ్రద్ధా భక్తులతో సేవించునది మంచి స్త్రీ. తన బీద బంధులగులను ఆదరించి తన భర్త అవసరాలకన్న తన అవసరాలను తక్కువగా అంచనా వేసుకునే స్త్రీ మంచి మనిషి. ప్రొద్దుననే లేచి ఇంటిలో అగ్నిని వెలిగించి, ఇంటిని పరిశుభ్రం చేసి, దేవతలను స్తుతించి, పూజించి, అతిథి అభ్యాగతులను సేవించి సేవకులకు, తనపై ఆధారపడే వారికి భోజనం పెట్టి, చివరకు తను భుజించే స్త్రీ సత్ఫలమును పొందును. తన అత్త మామలను తల్లిదండ్రులవలె చూడగల స్త్రీ సన్యాసులవలె శ్రేష్ఠురాలు. కష్టయుతమైన మ్రొక్కుబడులను చెల్లించుకునే స్త్రీ, ఎల్లపుడు భర్త యోగక్షేమాలను కాంక్షించే స్త్రీ భర్త సద్గతిలో పాలు పంచుకొనును. భర్త యెడ శ్రద్ధా భక్తులు వివాహిత స్త్రీ యొక్క శ్రేష్ఠగుణం. ఆమెకు అదేతపస్సు; ముక్తి. స్త్రీకి భర్త యేదైవం. అతడేఆమెకు హితుడు. అతడే ఆమెకు ఆశ్రయం. భర్తలకు మించి ఆశ్రయమివ్వగల లేక శరణాగతులయిన దేవతలు స్త్రీకి లేరు, భర్త దయ ఆమెకు స్వర్గధామం. భర్త బీదవాడైనా వ్యాధిగ్రస్తుడైనా లేక శత్రువులచేతికి చిక్కిన వాడైన, బ్రాహ్మణుల శాపానికి గురి అయినవాడైనా, అనౌచిత్య కార్యాన్ని, అధర్మకార్యాన్ని, చేయమని భార్యను ఆజ్ఞాపిస్తే దానివలన ప్రాణహాని కలిగే ప్రమాదం ఉన్నా ఆమె నిస్సంకోచంగా ధర్మ నిర్వహణ కోసం ఆ పనిని చేయాలి; ఆ కార్యాన్ని నిర్వర్తించాలి.'' (మ. భా. అనుశా. 134. 6, 10, 30, 35) (మ. భా. అనుశా. 134. 32 - 55).

శకుంతల అభిభాషణకు, ఉమ ప్రవచనాలకు ఎంతో తేడా ఉంది. భర్తకు హితవుచెప్తూ మాట్లాడింది శకుంతల. తోటి స్త్రీలను తక్కువచేసి మాట్లాడింది ఉమ. ఇక ద్రౌపది ఉపదేశాలు పరిశీలిద్దాము. నీవు ఎలా నీ భర్తలను వశవర్తులను చేసుకున్నావు? అని సత్యభామ ద్రౌపదిని అడిగితే ద్రౌపది చెప్పిన జవాబు. "భార్య మూలికలను, మందులను, మాకులను వాడు

తున్నదని తెలిస్తే మంచంకి్రింద ఉన్న పామును చూచినట్లు భర్త తన భార్యను చూస్తాడు. చూచి వణికిపోతాడు. భయానికి లోనైన మనిషికి శాంతి, ఆనందం లభిస్తాయా? మందువల్ల, మాకులవల్ల చెడ్డరోగాలు వస్తాయని వింటున్నాం. శతు్రవులను చంపటానికి విషాహారాన్ని పంపుతారు. అజ్ఞానులైన స్త్రీలు తమ చేతలవల్ల నీరు, కుష్టు, పక్షవాతం, నపుంసకత్వం లాంటి వ్యాధులను భర్తలకు కలుగజేస్తారు మందులూ, మాకులూవాడి. కనుక ఓ స్నేహితురాలా; నేను నా భర్తలను ఎలా అదుపులో ఉంచుకుంటున్నానో తెలిసికో. నా భర్తలకు, నా పత్నులకు ఎలాంటి దురుద్దేశమూ,అసూయా లేకుండా శ్రద్ధతో దయతో సేవచేస్తాను; నా భర్తలు భుజించువరకు నేను స్నానం చేయను; భు జిం చ ను. సేవకులు భోజనం చేసేవరకు నేను భోజనం చేయను. పొలంనుండో, అడవినుండో, లేక సభనుండో ఏ భర్త తిరిగివచ్చినా ఎదురుపోయి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి ఇంటిలోకి తెస్తాను. ఇంటిని, పాత్రలను పరిశుభ్రంగా ఉంచుతాను. కుటుంబానికి పుష్టికరమైన ఆహారాన్ని తయారుచేస్తాను. సరిఅయిన వేళల్లో నేనే వారికి వడ్డిస్తాను. ఏనాడు కోపంగా, ఉదేృకంగా మాట్లాడను. చెడ్డస్త్రీల పద్ధతులను అనుసరించను. సోమరిపోతుతనం స్త్రీలలో ఉండే చెడ్డగుణం. దానిజోలికి నేనుపోను. ఉపయోగకరమైన పనిచేస్తూ ఎల్లప్పుడూ పనిలో నిమగ్నమయి ఉంటాను. వాకిలిముందు తారట్లాడను. వీధులలో విహారానికి పోను. ఉద్యానవనాలలో వాహ్యాళికిపోను. ఆరోగ్యవంతమైన పరిహాసం మాత్రమే నాలో నవ్వు తెప్పిస్తుంది. భర్తలకు దూరంగా ఉండే నాకు బాధగా ఉంటుంది. బలత్కార కారణాలవలన నేను భర్తలకు దూరమయితే నేను పూలను పెట్టుకోను. చందనాది సౌందర్య పోషక ద్రవ్యాలను వాడను. నా భర్తల యోగక్షేమాలను ఆశించి వ్రతాలూ, తపస్సూ చేస్తాను. నా భర్తలు వేటినైతే తాగ్రదలచరో, తినదలచరో, ఇచ్చగించరో వాటిని నేనూ త్యజిస్తాను." (మ. భారతం. ఆరణ్య పర్వం 5-222, 223).

ఈ సందర్భంలో ఒక విచిత్రమైన అంశాన్ని గుర్తుంచుకోవాలి. స్త్రీల చేత వారికి నష్టదాయకమైన ధర్మాలను చెప్పించుట. బ్రహ్మచారులచేత పలికించుట రెండవది. యుధిష్ఠరుని కోరికపై మార్కండేయుడు కౌశికుని కథచెప్పి పతివ్రతా ధర్మములను ఎరిగించెను. (మ. భా ఆరణ్య పర్వం పంచమాశ్వాసం). భీష్మ, యుధిష్ఠర సంవాదంలో భీష్ముడు లక్ష్మి, రుక్మిణిల

ప్రశ్నోత్తరములను గురించి వివరించెను. 'భర్త యెడల విశ్వాసం, క్షమించే గల శక్తి, పవిత్రత, సత్యనిరతి గలవారు సత్యగుణ సంపన్నులుగా ఉండి దేవతలను, బ్రాహ్మణులను పూజించెదరు. తమ సౌందర్యమును జాగ్రత్తగా పోషించుకొందురు. ఇలాంటివారు లక్ష్మికి ఇష్టులు. పరిశుభ్రత పాటించని వారిని, కుచ్చితులను, వినయములేని వారిని తగాదాపరులను, తిండిపోతులను, మత్తులను, నిద్రితులను లక్ష్మి అసహ్యించుకొనును. వారు ఎక్కువగా ఇతరుల ఇళ్ళలో నివసింతురు. భర్తకు విరుద్ధంగా మాట్లాడి తొందరపాటుగా సంచరింతురు. (మ. భా. అనుశాసనపర్వం-11) భీష్మ యుధిష్టర సంవాదంలో శాండిలి, సమనుల సంభాషణ వచ్చింది. 'నీవు ఎలా స్వర్గవాసివి అయ్యావు?' అనే ప్రశ్నకు శాండిలి సమాధానము. ఇది శాండిలి ఉవాచ. భీష్ముడు చెపుతున్నాడు. 1] భర్త యెడల విశ్వాసం 2] భర్త ఏ పనిచేస్తే తను అది చేసేది. 3] భర్తతో పరుషంగా ఏనాడు మాట్లాడి ఎరుగదు. 4] అతనికి ఇష్టంలేని ఆహార పానీయాలను వర్జించేది. 5] భర్త ఊరిలో లేనప్పుడు అలంకరణ మానుకునేది. 6] భర్త గ్రామాంతరం నుండి తిరిగివచ్చినపుడు శ్రద్ధగా సేవచేసేది. 7] వాకిలిముందు నిలుచుండి మాటలాడి ఎరుగదు. 8] ఉదయాననే లేచి విధి నిర్వహణ చేసేది. దేవతలను, పితృదేవతలను, బ్రాహ్మణులను, అత్తమామలను పూజించేది. కుటుంబ బాధ్యతలను నిర్వర్తించి, దాంపత్య ధర్మములను నెరవేర్చేది. [మ. భా. అను. 124] 'భర్త యెడల అవిధేయత చూపిన స్త్రీని కుక్కలకు ఆహారంగా వేయవలెను [మనుస్మృతి VIII- 371]. వివాహం తప్పని సరియైన సంస్కారమని చెప్పడానికి సుబ్రుగాలవి సుతుల కథ తార్కాణం (మ. భా. శల్యపర్వం-ద్వితీయాశ్వాసం, తెలుగు భారతం. 207-212)[8].

ఆదర్శ స్త్రీలు :- ద్రౌపదికి భర్త యెడల విశ్వాసము ఉండుటవలననే ఆమెకు కీర్తి వచ్చినది. ధృతరాష్ట్ర, సంజయ, విదురులు, ఆమెను పొగిడి 'సతి' అని బిరుదు ఇచ్చారు. మరీ ధృతరాష్ట్రుడు ఆమెను సాధ్వియనీ, పతివ్రతయనీ పొగిడాడు. ద్రౌపదిశీలంలో లోపాలున్నాయి. ఆమెకు అర్జునుడంటే ప్రేమ. అందుకే ఆమె బొందితో స్వర్గానికి పోలేదు. అహల్య, కుంతి, ద్రౌపది, మండోదరి పంచకన్యలు. వారిని స్మరిస్తారు కన్యలు. అహల్య చేసిన తప్పుకు పశ్చాత్తాపం చెందిన స్త్రీ. తార అన్నదమ్ములలో వేరువేరు సమయాలలో కాపురం చేసినా మంచి కార్యాలోచన పరురాలు. కుంతి కన్యగా

తల్లి అయిన స్త్రీ. ద్రౌపది పంచభర్తృక.9 వీరందరిలో ఒక్క మండోదరి శీలవతిగా ఎంచవచ్చును. కాని మండోదరికి అంగదుడు కుమారుడని ప్రతీతి. పతివ్రత అంటే భర్తకు విధేయురాలు అని, తన జీవితాన్ని యావత్తు భర్త శ్రేయస్సుకు ధారపోసినవ్యక్తి యని తేలుతుంది. కన్యలకు పుట్టినింట అణగి మణగి ఉండుట (విధేయత), విధినిర్వహణ, సర్దుకుపోవటం నేర్పుతుంది హిందూ సమాజం. విధిక్రింద వివాహాన్ని నిర్ధారించి, వైవాహిక జీవితంలో స్త్రీ యొక్క వ్యక్తిత్వాన్ని చిదిమివేసింది పాతివ్రత్యం పేర. ఈ పాతివ్రత్య భావం హిందూ స్త్రీలకు నరనరాన జీర్ణించిపోయింది. అందువలన వారు ఆత్మస్వరూపదర్శనం చేసుకోలేని స్థితిలో ఉన్నారు.

<u>మాతృత్వం</u> :- హిందూ వివాహానికి లక్ష్యం సంతానప్రాప్తి. కనుకనే ఈనాటికీ పెళ్ళయిన 4, 5 ఏండ్లకు స్త్రీకి సంతానం కలుగకపోతే తల్లిదండ్రులు ఒకవైపు, అత్తమామలు మరొకవైపు తహతహ లాడతారు. పైపెచ్చు ఇప్పుడున్న శాసనం ఏకభర్తృత్వ ఏక భార్యాత్వ వివాహాన్ని మాత్రమే అనుమతించడం వలననూ, సంతానం లేదనే కారణం వల్లనూ, కోర్టుల్లో విడాకులు పొందడానికి అవకాశం లేనందునను అలాంటి స్త్రీని గొడ్రాలిని ఈసడించడమూ, హింసించడమూ ఇప్పటికీ జరుగుతున్న నిత్యసత్యాలు. సంతానంలేని స్త్రీ ఆ హింసను భరించలేక ఆత్మహత్య చేసుకోవడమూ లేక అత్తమామలూ, భర్త కలసి ఆమెను హత్యచేయడమూ అచ్చటచ్చటా ఈనాటికీ జరుగుతుతూనే వున్నాయి. 1948 సంవత్సరానికి పూర్వం ఆమెయే భర్తను బ్రతిమిలాడి మరో స్త్రీతో అతనికి వివాహం చేయించటమో లేక అతడే ద్వితీయ వివాహం చేసుకోవటమో జరిగేది. చట్టప్రకారం ఇప్పుడది సాధ్యం కాక పోవటంతో భార్య జీవితానికే ప్రమాదం ఏర్పడే స్థితి కలుగుతున్నది. సంతానం కలుగక పోవటానికి భార్యా భర్తలలో ఇరువురిలో ఎవరైనా శారీరకలోపం కారణభూతం కావచ్చును. అలాంటప్పుడు కేవలం ఊహపై ఆధారపడి - అదైనా అజ్ఞానపు ఊహ - మరో అమ్మాయిని భార్యగా తెచ్చు కోవాలని ప్రయత్నించడం ఏమి సబబు? లోపం భర్తది కావచ్చును కదా! అలా ఆలోచించిన భార్య తను ద్వితీయభర్తను వివాహం చేసుకుంటానంటే అతడు అంగీకరిస్తాడా? సమాజం ఆమోదిస్తుందా? అత్తమామలు హర్షిస్తారా? ధర్మశాస్త్రజ్ఞులు వెసులుబాటు కల్పించారా? లేదు. ఎందుకని? హిందూ సమాజం పురుషాధిపత్య సమాజం కనుక. అతని పురాతన భావాలు అతని

మేధస్సును అలా మలిచాయి కనుక. భార్య క్షేత్రము. పురుషుడు క్షేత్రజ్ఞుడు క్షేత్రానికి యజమాని. పొలంలో వేసిన ప్రతి విత్తనమూ మొలవాల్సిందే. మొలవకపోతే పొలంయొక్క లోపం. అంతేకాని విత్తనం యొక్క లోపం కాదు. మరో పొలంలో విత్తనం వేస్తే మొలుస్తుంది. ఇదీ ఆలోచనా ధోరణి. కనుక ద్వితీయ వివాహనికి సన్నాహాలు జరిగేవి పూర్వం. ఇప్పటికీ గొడ్రాలయిన భార్యను ఎలాగైనా వదిలించుకోమని సలహా చెప్పే అత్తలు అనేకమంది ఉన్నారు. కేవలం సంతానం వివాహం యొక్క లక్ష్యంగా పరిగణింపబడటంతో వచ్చింది ఈ చిక్కు. భార్యాభర్తలు ఇద్దరు వ్యక్తులు, వారి ఇరువురి సాంగత్యం ఇరువురికీ లాభకరం. ఇరువురి సన్నిహితత్వం వలన ఇద్దరి జీవితాలు సుసంపన్నం అవుతాయి. వారి వైవాహిక జీవిత ఫలంగా - ప్రేమ ఫలంగా - సంతానం కలుగుతుందని, అంతేకాని వైవాహిక జీవితం యొక్క శ్రేష్టతను సంతానం లేనందువలన నాశనం చేసుకోవలసిన అగత్యం లేదని హిందూ సమాజం భావించటంలేదు. ఎంతసేపూ పితరులకు సద్గతులు కలిగించాలి, అందుకొరకు కుమారులను కనాలి అనే యావతప్ప మరో ధ్యాస లేదు. ఇలాంటి పొరపాటు భావనయొక్క ఫలితమే గొడ్రాలైన భార్యను ఈసడించడం, హింసించడం. ఈ హింసను శాసనాలు ఆపలేవు. ఇది అనుక్షణం సూటిపోటి మాటలతో జరిగేది. మామూలుగా మానసిక హింస రూపం తాలుస్తుంది. ఈ అవాంఛనీయ పరిస్థితి మారాలంటే హిందూ సమాజం మారాలి. అంటే వివాహం యొక్క లక్ష్యాన్ని మరల నిర్వచనం చేసుకోవాలి. ఇదంతా కేవలం పాశ్చాత్య సంస్కృతీ ప్రాభవమని, హిందూ సమాజ ప్రాశస్త్యాన్ని గుర్తించలేని గుడ్డితనమని, కేవలం దుష్ప్రచారమని, ఇంతకన్న అర్థరహితమయిన ప్రవర్తన మరొకటి లేదని సనాతన విదులు తీవ్రంగా విమర్శిస్తారు. ఈ సమస్యపైనున్న విరుద్ధ అభిప్రాయాలను మదింపు వేసేముందు హిందూ సమాజ వైఖరిని, సంప్రదాయాన్ని చారిత్రకంగా అధ్యయనం చేయాలి.

వేదకాలం :- ధర్మ సమ్మతంగా వివాహం అయిన తల్లిదండ్రులకు పుట్టటం ధర్మం. (ఋగ్వే VII 20, 6) ఈ మాటను ఎవరూ కాదనలేరు. కాగా వివాహమంత్రాలలోనే దేవతలకు చేసే ప్రార్థనలు గమనించండి- 'ఈ దంపతులకు సంతానం ఇమ్మ' అని పురోహితుడు అంటాడు. 'ప్రజాపతి

మనకు సంతానం ఇచ్చుగాక....అని భర్త భార్యతో అంటాడు గృహప్రవేశ సందర్భంగా. "పదిమంది మగపిల్లలను కనవలసినది. నీ భర్త 11 వ పురుషుడు" అని అంటాడు పురోహితుడు. కుటుంబంలో 11 మంది పురుషులు కావాలని ఆకాంక్ష. ఆర్యులు జాతిని పెంచే నిమిత్తం వివాహ మాడేవారు. వారికి ఆనాడు అధిక జనాభా అవసరం. అనార్యుల సంఖ్య అత్యధిం. పైగా వారితో ఎడతెగని యుద్ధాలు. మగవారు చనిపోవటం తరచుగా సంభవించటం జరిగేది. కనుక మగపిల్లలు కావాలి. భార్య ఇందుకు ఉపయోగపడాలి. ఆర్యులు పశుపాలకులు; వ్యవసాయ దారులు. వారి పరిజ్ఞానం కేవలం సంతానాన్ని అపేక్షించటానికి ప్రోద్బలం చేసింది. అప్యాయత, ప్రేమ సంతాన ప్రాప్తిని సాధించే సోపానాలు. అంతే. వేద కాలంలో సంతానం కావాలని ఎంత అభిలాష ఉందో గమనించండి. భర్త కారాగారంలో ఉండే పురుకుత్సాని ఇతరునిద్వారా కుమారుని కన్నది (ఋగ్వే IV 42, 8). పురంధి వధ్రిమతి భర్త నపుంసకుడైతే పరపురుషుని ద్వారా సంతానాన్ని పొందింది. అలాంటివి ఋగ్వేదం I 1, 116, 13; I 117,24; VI 62, 7; X 39, 7; X 65, 12 లలో కనిపిస్తాయి. భర్త బలహీను డయితే విమద అశ్వినీ దేవతల సహాయంతో సంతానవతి అయింది. (ఋగ్వే X 39, 7). మరో బలహీనుని భార్యకు సంతానం కలుగజేయటానికి అశ్వినులు హిరణ్య హస్తుని ఇచ్చారు; (ఋగ్వే I 117, 24). దీనిని నియోగం అనవచ్చు. ఈ నియోగాన్ని ఏ జ్ఞాతి అయినా చేయవచ్చును. కాని భర్త సోదరుని (దేవరను) ఎక్కువగా ఎన్నుకునేవారు. భర్త బ్రతికియున్న అతనికే అగ్రస్థానం. అమ్మాయికి పెండ్లి చేసేటప్పుడు (భర్త పుంసత్వాన్ని గురించి తెలియనప్పుడు) ఆమెను 'దేవృకామ' అని అభివర్ణించేవారు. (ఋగ్వే X 85: 44) అంటే 'దేవర' కొన్ని సందర్భాలలో కాబోయ్యే భర్త అని సూచించడం, (ఉత్తర హిందూ స్థానములో పదిన మరది (భర్త చిన తమ్ముడు ఈనాటికి హాటుసరసాలాడుతుంటారట). భర్త జ్యేష్ట సోదరుని ఏ విధవరాలు వివాహమాడరాదు. (ఈ వివరణ అంతా 'ఋగ్వేదంలో స్త్రీలు' అనే తన పుస్తకంలో ఉపాధ్యాయ 108-110 పుటలలో ఇచ్చారు).

బ్రాహ్మణాల కాలంనాటికి పూర్తిగా దృష్టిమారింది. లేక మారినట్లు కనుపడిందో గమనిద్దాం. పితృదేవతల పూజ పెరిగింది. వారికి భోజనాదులు అవసరమయినాయి. శ్రాద్ధాదులు వెలిశాయి. దానికి మగపిల్లవాడు చేయదగు

క్రతువే ముఖ్యమయింది. కారణం ఊహించడం క్లిష్టంకాదు. అది పితృస్వామ్య సమాజం. ఆడపిల్ల వివాహమయిన తరువాత భర్త ఇంటికి వెళ్ళి కాపురం చేస్తుంది. కుమారుడు ఇంట్లో నివసిస్తూ వంశాన్ని కనిపెట్టుకొని ఉంటాడు. కనుక పితృదేవతలకు తర్పణం ఇచ్చే బాధ్యత అతనికి కేటాయించటం సబబు. ఇలా మగపిల్లవాని ప్రాముఖ్యత, మరో కారణాన్ని పురస్కరించుకొని, పెరిగింది. అవి బహుభార్యాత్వం అమలులోఉన్న రోజులు. రాజన్యులు, ఋషులు, సామంతులు బహు భార్యాత్వాన్ని అనుసరించేవారు. సమాజాన్ని శాసించి పాలించేది వారే. సమాజానికి ధర్మశాస్త్ర విశదీకరణచేసేది బ్రాహ్మణుడు. దానిని అమలు జరిపించేది క్షత్రియుడు. వీరద్దరూ కలసి తమకు ఏది ఆనుకూలమో, తమ దృష్టిలో ఏది ఉచితమో దానిని అందరికి తలలమీద రుద్దారు. మగసంతానంపై కాంక్ష పెంచారు. అయితే మగ సంతానం ఎలా కలుగుతుందో ఖచ్చితమైన జ్ఞానం వారికి లేదు. అంతా ఊహ మాత్రమే. కనుక సంతానాన్ని కనవలసినదని ఆదేశించారు. సంతానాన్ని కంటూపోతే మగపిల్లలు కలుగకపోరని వారి ఆశ. ఇలా మతదృష్టితో సంతానాభివృద్ధికి రాచబాట వేసి దానికి కావలసిన భావనిర్మాణాన్ని చేశారు. సన్యాసాశ్రమం అనేది వేదకాలంలో లేనేలేదు. గృహస్థాశ్రమానికి విలువ హెచ్చుగా ఇచ్చారు.

గృహ్యసూత్రాలు :- గర్భాదాన, గర్భాలంబన, పుంసవన, సీమంతోన్నయన వీటితాలూకు కర్మకాండ సంతానం యొక్క ప్రాముఖ్యతను విశదం చేస్తుంది. రజస్వల కాగానే వివాహం అనే సూత్రిక సంతానం కోసం తాత్రియాన్ని తెలుపుతున్నది.

అర్థశాస్త్ర కాలం నాటికి క్రీ. పూ. 4, 3 శతాబ్దాలు. ఋతుకాల సంగమం విధిగా సంతాన ప్రాప్తికి దోహదమనే అభిప్రాయం ప్రబలంగా ఉండేది. ఋతు కాలంలో భార్యా సంగమం చేయని పురుషునకు 96 పణములు జరిమానా వేయాలని కౌటిల్యుడు శాసించాడు. భర్త విదేశాలకు వెళ్ళి అతని జాడ తెలియకపోయినా భార్య మరల వివాహమాడవచ్చునన్నాడు. అదంతా విడాకుల విషయం చర్చించేటపుడు విపులంగా తడివిచూద్దాం. కాగా రాజకార్యంపై వెళ్ళిన భర్త కోసం భార్య వేచియుండవలెను. కాని ఆమె బంధువుద్వారా సంతానం కనవచ్చును. భర్త సన్యాసం పుచ్చుకుంటే భర్త సోదరుని వలననో

లేక బంధువు వలననో ఆమె సంతానాన్ని కనవచ్చును. ఇదంతా సంతాన ప్రాప్తికి ఇచ్చే ప్రాధాన్యత కాక మరేమిటి? భర్త చనిపోయినపుడు, లేక వ్యాధి గ్రస్తుడయినపుడు ఆమె నియోగం ద్వారా సంతానాన్ని కనవచ్చును. ఈ విషయాన్ని వివరంగా చర్చించేముందు ఎన్నిరకాల పుత్రులున్నారో లెక్కిద్దాం. పురుషునికి 11 మంది కుమారులు వుండవచ్చు. 1) ఔరసుడు తనకు జన్మించినవాడు. 2) పుత్రికా పుత్రుడు [దహోత్రుడు] [కుమారులు లేక పోతే ఒక కుమార్తెను పేర్కొంచే ఆమె కుమారుడు] 3) క్షేత్రజుడు 4) గూఢజుడు [బంధువు ఇంట్లో తన భార్యకు రహస్యంగా కలిగినవాడు] 5) అపవిద్ధుడు (బంధువులచేత వదలివేయబడినవాడు). 6) కానీనుడు [భార్య కన్యగా ఉన్నపుడు కలిగినవాడు] 7) సహోఢుడు (పెండ్లి సమయంలో భార్య గర్భిణీగా ఉంటే కలిగినవాడు) 8) పునర్భవుడు (వితంతువుకు రెండవ భర్త వలన కలిగినవాడు. 9) దత్తుడు (తల్లి దండ్రులచేత ఇవ్వబడినవాడు) 10) ఉపాగతుడు (తనంతట తను వచ్చినవాడు లేక బంధువులచేత కుమారునిగా పరిగణింపబడినవాడు.) 11) కృతకుడు (కుమారునిగా పరిగణింపబడినవాడు. నియోగాన్ని, దత్తతను అనుమతించే ఆచారాలను కౌటిల్యుడు తక్కువచూపు చూచాడు. కాని క్షేత్రజుడు, గూఢజుడు, కానీనుడు, సహోఢుడు ఆమోదింపబడినారు. అంటే భార్యయందు తన అనుమతితో ఇతరులవల్ల కలిగిన సంతానాన్ని ఆమోదించాడు ఆనాటిభర్త. అలాగే పెళ్ళికాకముందు ఆమెకు కలిగిన సంతానాన్ని, ఆమె పెండ్లినాడు ఆమె గర్భంలో ఉన్న సంతానాన్ని, ఆమె బంధుగుల ఇంట రహస్యంగా కనిన సంతానాన్ని కాదనలేదు ఆనాటి ధర్మశాస్త్ర విదులు. ఇది భారత కాలంనాటి ఆచార అవశేషము. భారతకథ క్రీ. పూ. 1500 సం॥ ప్రాంతంలో జరిగిందని కొందరు, వెయ్యి సంవత్సరాల ప్రాంతంలో జరిగిందని మరికొందరు అంటున్నారు. ఏదయినా భారత కాలం అర్థశాస్త్ర కాలానికి ముమ్మందే. భారతంలో కర్ణుడు కానీనుడు. ధర్మరాజు, భీముడు, అర్జునుడు కుంతిద్వారా పాండురాజు కుమారులు. వారు క్షేత్రజులు. నకుల సహదేవులు మాద్రిరాజు పాండురాజు కుమారులు. వారు క్షేత్రజులే. ఆనాటి సంస్కృతీ నాగరికతల ప్రకారం పురుషునికి సంతానం కావాలి. తన క్షేత్రమైన భార్య యందు పరపురుషునివల్ల కలిగినా ఆ ఫల్యం తనదే. ధృతరాష్ట్ర పాండురాజులు వ్యాసునికి అంబిక అంబాలిక వలన నియోగం ద్వారా జనించినవారు. అయితే అప్పటికి వారు విధవలు. అంటే సంతానానికి పూర్వీకులు యిచ్చిన ప్రముఖ స్థానం తెలుస్తున్నది. మహా భారత

కాలంలో నియోగం ద్వారా ముగ్గురు కుమారులను కనవచ్చుననే ఆచారం అమల్లోవుంది.

మనుధర్మశాస్త్రం :- మనువుకూడా 12 మంది కుమారులను పేర్కొన్నాడు. మనువు కౌటిల్యుని తరువాతి కాలంవాడు. అతతూ క్షేత్రిజుని' గూఢోత్పన్నుని (గూఢజుడు), కానీనుణ్ణి, సహోడుని పేర్కొన్నాడు.

గూఢోత్పన్నుణ్ణి మినహాయిస్తే ఔరసుడు కాక అందరూ సామాజిక సంతానమే, మనువు విధవా వివాహాన్ని నిషేధించాడు. స్త్రీకి ఒకేసారి వివాహం జరగాలన్నాడు. అర్థశాస్త్రంలోని క్షేత్రజునికన్నా మనుస్మృతిలోని క్షేత్రిజునికి ఎక్కువ స్థానం ఉన్నది. మనువు విధిలేక నియోగపద్ధతిని ఆమోదించాడు. అయితే నియోగం ద్వారా ఒకే మగపిల్లవానిని కనమన్నాడు. నియోగం ఆనేది విధవరాలికి భర్త ద్వారా సంతానం లేకపోతే జరుగవలసిన ప్రక్రియ.

ఇప్పటికీ వధూవరులను ఆశీర్వదించేటపుడు 'వంశాభివృద్ధిరస్తు,' 'పుత్రి పౌత్రాభి వృద్ధిరస్తు' అని దీవిస్తారు. 'సంతాన ప్రాప్తిరస్తు' అనికూడా దీవిస్తారు. జనాభా సమస్య మహమ్మారిలా తయారయినా ఇదే దీవన. ఇద్దరు అత్తలు కలసినచోట 'నీ కోడలు నీళ్ళుపోసుకుందా' అని అడుగుతారు. అంటే నెలతప్పిందా? గర్భం వచ్చిందా? అని దానిఅర్థం. వైఖరి మారలేదనటానికి ఇది నిదర్శనం.

మాతగా తల్లిహోదా :- సంతాన ప్రాప్తిని ఇంత గొప్పగా భావించిన హిందువులు తల్లిని గౌరవించటంలో ఆశ్చర్యంలేదు. మాతృత్వాన్ని సాధించేది మాతగనుక ఆమెకూ గౌరవం కాస్తో కూస్తో వస్తుంది. మాతృత్వంపై ఎనలేని గౌరవం, అభిమానం ఉన్నాయికదా! మాతా పితలు అంటాము. తల్లిదండ్రులు అంటాము. కనుక తల్లికే ప్రధాన స్థానం అని ఒక వాదన ప్రతిపాదింపబడుతున్నది. బహిష్కృతుడైన తండ్రిని వదలివేయవచ్చును. కాని పతితయైన తల్లి కుమారునికి బహిష్కృతురాలు కాదు. (వసిష్ట ధర్మ సూత్రం 13. 47); పదిమంది ఉపాధ్యాయులకన్న ఆచార్యుడు మిన్న. వంద మంది ఆచార్యులకన్నా తండ్రి మిన్న. తండ్రికన్నా తల్లి వేయిరెట్లు ఎక్కువ' (మను. II-145). 'తండ్రికన్నా పదిరెట్లు పైగా తల్లి ఎక్కువ,

తల్లి భూమికన్నా గొప్పది. తల్లిలాంటి గురువు మరియొకరు లేరు' (మ. భా అనుశాసనపర్వం 105. 14-16).[9] పిల్లల సంఖ్యను బట్టి ఆమె గౌరవం పెరుగుతుంది. ఇంద్రాణి అనే కవయిత్రి మనువు. కుమార్తె పద్మను ఇరవైమంది పిల్లలను కన్నందులకు పొగిడింది (రుగ్వే X 86-23). తల్లిని ఇంత గొప్పగా పొగిడి హిందూ మతం అవిభక్త కుటుంబంలో భర్త ఆస్తిలో ఆమెకు వాటా లేకుండా చేశారు. కేవలం మనవర్తి మాత్రం ఉండేది. 1937 లో శాసనం ద్వారా ఆమె భర్త వంతు (చనిపోయేనాటికి విభాగాలు చేసుకుంటే వచ్చే భాగం) ఆమెకు పరిమిత హక్కులతో వచ్చే సౌకర్యం చేశారు. తరువాత 1955 హిందూ వారసత్వ శాసనం ప్రకారం భర్త వంతు (ఇందాకటి లెక్కన) ఆస్తిని ఆమె అత్తతోను, కుమారులతోను, కుమార్తెలతోను సమంగా పంచుకోవాలి. అలా వచ్చే వాటా బహుస్వల్పం. కాగా అది సర్వహక్కులతో వస్తుంది. ఇదీ తల్లిని గౌరవించిన విధానం.

హిందువులు గౌరవించేది మాతృత్వాన్ని కాని మాతను మాత్రం కాదు. పరశురాముడు తన తండ్రి జమదగ్ని ఆదేశం ప్రకారం తన తల్లి రేణుక తలనరికి చంపాడు. ఇది పితృస్వామ్య సమాజాన్ని సుస్థిరం చేసే ప్రయత్నంలో భాగమని మనం నిర్ధారించవచ్చు.

భర్త విధులు :- వైవాహిక జీవితంలో భర్తకు విధులు లేవా? అని సందేహం కలుగవచ్చు. ఉన్నాయని పేర్కొన్నారు ఋషులు.

'భర్త భార్యను మార్దవంగా పిలిచినట్లు నేను దేవుని పిలుస్తున్నాను.' (రుగ్వేదం. P 160 విల్సన్. రుగ్వేదం).

'భర్త భార్యను ప్రేమించినట్లు నా ప్రార్థనను అభిమానించు' (రుగ్వేదం) అని పురుషుడు దేవుని ప్రార్థించాడు.

"భర్త భార్య గొంతుకను ప్రేమించినట్లు నా గేయాలను అభిమానించు" అని దేవతలను అర్థిస్తాడు రుగ్వేదమానవుడు.

'భర్త బాధ్యతలు కుటుంబాన్ని అంటిపెట్టుకొని ఉంటాయి. ఆమెను రక్షించుకోవటానికి అతడు యుద్ధభూమికి ఇష్టపూర్వకంగా వెళ్తాడు.'

ఇది వేలకాలపునాటి మాట.

స్త్రీలు పూజింపబడుచోట దేవతలుందురు. స్త్రీలు పూజింపబడనిచోట సర్వక్రియలు నిష్ఫలము' (మను 3. 5. 6)

'భార్యచే సంతోషం పొందు భర్తయు, భర్తచే సంతోషం పొందు భార్యయు గల కులమున నిత్యము ధ్రువముగా కళ్యాణము కలుగును'. (మను 3-6-8)[10]

మరి పురుషుడు ఈ ఆదర్శమునకు నిలిచినాడా? లేదు. అంతేకాదు. పెండ్లినాడు ప్రమాణం చేస్తాడు. ధర్మార్థకామముల భార్యను విడువనని ప్రమాణం చేస్తాడు. కాని ఆ ప్రమాణాన్ని పాటించడు. పాటించని పురుషులను సమాజం శిక్షించలేదని ఆల్టేకరు పండితుడు కటకటపడతాడు.[11] బహుభార్యాత్వ విధానాన్ని నిరోధించటానికి ప్రయత్నాలు జరిగాయని ఉదాహరణలు చూపుతాడు. అయితే వేదకాలంలో బహు భార్యాత్వం ఉందని అంగీకరిస్తాడు. తమ సంపదకు, పేరు ప్రతిష్టలకు, సామాజిక హోదాకు బహు భార్యాత్వం తగునని ధనవంతులు భావించేవారట. అథర్వ వేదంలో సపత్నులు భర్త ప్రేమను పొందటానికి మంత్ర తంత్రాలను ఆచరించటం కలదు. మనువుకు 10 మంది భార్యలట. ఐతరేయబ్రాహ్మణంలో హరిశ్చంద్రునికి వందమంది భార్యలట. భార్య కనుక హద్దుమీరి పరపురుష సంపర్కాన్ని ఆశిస్తే ఆగ్రహించేవారు ధర్మశాస్త్రజ్ఞులు. సంతానం లేకపోతే భార్యయే సవతిని తెచ్చుకోమని భర్తను పోరుపెట్టాలట (కామసూత్రం VI -2). పదిఏండ్లకు కూడా పిల్లలు కలుగకపోతే అలా చేయాలట. ఆడపిల్లలు కలగడమో లేక పుట్టిన పిల్లలు చనిపోవడమో జరిగితే మరి మూడు ఏండ్లు ఆగాలట.[12] కొంచెం వెసులుబాటు ఇచ్చారు పురుషులకు. ఎంత కాదంటున్నా పూర్తి అవకాశాన్ని పొందారు వారు. భార్యను నిరాదరణ చేయటం అన్యాయమని మహాభారతం ఘోషించింది.[13] కుమారుని కలిగిన స్త్రీని విడనాడరాదని ఆపస్తంబసూత్రం (II 5, 11, 12) చెప్పింది. తగిన కారణం లేకుండా భార్యను వదలివేయడం మహా పాపమని మహాభారతం చెప్పింది (XII-58,13). అలాంటి పురుషుడు న్యాయస్థానంలో సాక్ష్యం ఇవ్వడానికి అనర్హుడని నారద స్మృతి (I, 180) ప్రకటించింది. కాని ఈ మహాకావ్యాలను ఎవరూ

ఖాతరు చేయలేదు. భార్యను నిష్కారణంగా వదలివేసి లేక ఆమె ఉండగానే మరి ఒక స్త్రీని భార్యగా పొందటం ఆచారంగా చెలరేగింది.

గృహ్యసూత్రాలన్నింటిలో ఒక్క పారాస్కర గృహ్యసూత్రం మాత్రమే బహు భార్యాత్వాన్ని సమర్థించింది. మొదటిదశ ధర్మసూత్రాలు ఈ పద్ధతిని కాదనలేదని, తతిమ్మా గృహ్యసూత్రాలు (బహుశః పురాతన మైనవి) ఆ విషయం పట్టించుకోలేదని శకుంతలారావు శాస్త్రి అభిప్రాయం (పుట 156).

భార్య సమ్మతిమీదనే భర్త ద్వితీయ భార్యను స్వీకరించాలని మనువు చెప్పాడు. కాని ఆ సమ్మతి ఎప్పుడూ అతనికి లభిస్తుంది. అంతగా ఆత్మ గౌరవం కల స్త్రీ సమ్మతించడానికి నిరాకరిస్తే అప్పటికీ అతడు ద్వితీయ కళత్రాన్ని తెచ్చుకోవచ్చును. కాని ఆమె కోపగించుకొని భర్త గృహాన్ని సాధారణంగా వదలిపెట్టి పోరాదు. అలా పోతే ఆమెను బలవంతంగా ఇంటిలో ఉంచవచ్చును. కాగా ఆమె మనవర్తిని భర్త నుండి అడగని షరతుతో ఆమె వెళ్ళి తల్లిదండ్రులవద్ద నివసించవచ్చును. ఇదీ మనుధర్మ రచయితగారు స్త్రీలపట్ల చూపిన ఔదార్యము! వివాహం వల్ల భార్యపై భర్త ఆధిపత్యం ఏర్పడినదనే సిద్ధాంతం వల్ల ఈ ధోరణి వస్తున్నది. దీనిని శాకుంతలంలో కాళిదాసు అంగీకరించాడు (శాకుంతలం V - 26). దీనితో పతివ్రతా తత్వాన్ని స్థిరపరచి తమ సద్వర్తనానికి గోరీ కట్టారు చాలమంది భర్తలు. ఇలా 'హిందూమతంలో భార్యాభర్తలు సమానులు' అని చెప్పేవారి వాదన వీగిపోతుంది.

వేర్పాటు : పరదా :-

మనం ఈనాడు 20 వ శతాబ్దపు చివరలో ఉన్నాము. మహిళా దశాబ్దన్ని పూర్తి చేసుకున్నాం. ఐ క్య రా జ్య స మి తి స్త్రీల పురోగతికి దోహదం చేస్తున్నది. 2000 సం॥ నాటికి ఎంతో అభివృద్ధి రావాలని పథకాలు వేస్తున్నారు. ఇలాంటి సమయంలో పరదా పద్ధతి హిందువులలో వ్యాప్తంగా ఉండడం శోచనీయం. దక్షిణాదిన ఆ బాధ లేదు. మొదటినుండి దక్షిణాదిన వేర్పాటు, పరదాలేవు. అనార్యులు ప్రబలంగా ఉన్న ప్రాంతం దక్షిణాపథం. ఆర్యావర్తం (వింధ్యకు ఉత్తరాన ఉన్న ప్రాంతం) లో గుజరాతు, రాజస్తాను,

ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్‌లలో ఈ ఆచారం నేటికి ప్రస్ఫుటంగా ఉన్నది. మేలిముసుగు వాడకంగా చలామణీ అవుతున్నది. మామలయెదుట, భర్త జ్యేష్ఠసోదరుని యెదుట కోడలు ముఖం కన్పడేలా నడయాడదు. ఇది ఇంట్లో సంగతి. బయటికి వస్తే చెప్పనక్కరలేదు. మనిషిని గుర్తించ డానికి వీలు లేనంతగా ముఖంమీదకు మేలిముసుగు లాక్కుంటారు. దక్షిణాదిన కూడా నలుబది ఏబది సంవత్సరాల క్రితంవరకు బ్రాహ్మణ వనితలు పర పురుషునితో తలుపుచాటున ఉండి మాట్లాడటం ఆచారం. ఆర్యుల ఆచారాలు దక్షిణాది బ్రాహ్మణులు తమ స్వంతం చేసుకున్నారు కదా! కాక వారే ఉత్తరం నుండి వలస వచ్చిన ఆర్యులా? ఈ మీమాంస ప్రస్తుతానికి మనకు అనవసరం.

ఈ ఆచారాలు కేవలం ముసల్మానుల ఆచారాలను హిందువులు అనుస రించటం వల్ల ఆమలులోకి వచ్చాయని కొందరి అభిప్రాయం. ముసల్మానులు ఉత్తర భారతానికి క్రీ. శ. 11 వ శతాబ్దంలో వచ్చారు. కనుక అంతకు పూర్వం ఈ పద్ధతి అమలులో ఉన్నట్లు సాక్ష్యాధారాలు దొరికితే ఇది హిందువుల ఆచార మని చెప్పక తప్పదు.

జమీందారీ సమాజంలో అంటే భూమి మాత్రమే ఉత్పత్తి సాధనంగా ఉన్న సమాజంలో ధనవంతులు తమ స్త్రీలను శ్రమకు - ఇంటి వెలుపల శ్రమకు దూరంచేశారు. వారికి ఆర్థికంగా భద్రత కల్పించి వారిని ఇంటి లోపలి భాగాలలో, అంతఃపురాలలో బంధించారు. ఇలా అంటే చాల మందికి ఆగ్రహం కలుగవచ్చు. కాని ఇది పచ్చినిజం. దాసదాసీలను సమకూర్చారు. అంతటితో ఆగక వారికి రక్షకులను నియమించారు. కాపలావారు ఇతర పురుషులైతే తమ స్త్రీల శీలం పెడదారిన పడ్తుందేమోనని భయపడి నపుంసకులను కాపలా పెట్టారు. ఈ పరిణామం అన్ని సమాజాలలో జరిగింది. హిందూ సమాజం దానికి భిన్నంకాదు. ఏ కాలంలోను కష్టజీవులకు పరదాలు, మేలి ముసుగులు, బురఖాలు కుదరవు. వారు పొలాలలో, బహిరంగ ప్రదేశాలలో శ్రమ చేయవలసి ఉంటుంది. వారిని పరపురుషులు చూడరాదనే నియమం ప్రవేశపెడ్తే వారికి పని దొరకదు. పని లేకపోతే తిండి దొరకదు. ఏ సమాజం లోని కష్టజీవుల స్త్రీలు అసూర్యం పశ్యలుగా ఉండలేరు. ఎండ కన్నెరగని మహిళలు కానేరరు. ఈ అంశాన్ని మనసులో ఉంచుకోవటం అవసరం.

వేదకాలంలో వివాహమప్పుడు వధువును కళ్యాణ మంటపానికి విచ్చేసిన పెద్దలందరికీ చూపిస్తారని ఒక పండితుడు అంటే, అలాకాదు వరుని ఇంటికి పోయేటప్పుడు పరపురుషులు చూడటం తటస్థిస్తుందని మరో పండితుడు వాదిస్తాడు. ఏమైనా వేదకాలపు ఆర్య మహిళ మేలిముసుగును కూడా వాడలేదు. పురుషులతో పాటు విద్యను గురువులవద్ద అభ్యసించింది. సభలలో ప్రసంగించేది. విదథలలో (పండిత సభ) ఉపన్యసించేది. సామాజిక ఉత్సవాలలో పాల్గొనేది. సమనలకు (ఉత్సవం లేక జాతర) యజ్ఞయాగాది క్రతువులకు వెళ్ళేది. కాగా సభలలో స్త్రీ పురుషులు కలసి కూర్చునే వారా లేక విడివిడిగా కూర్చునేవారా అనే ప్రశ్నకు సమాధానం చెప్పటానికి ఆధారాలు లేవు. ఈనాటి కొండజాతుల స్త్రీలలాగా కన్యలు యువకులతో చెట్టపట్టాలు వేసుకొని నృత్యం చేసినట్లు దాఖలాలు (ఋక్కులలో) ఉన్నాయి కనుక స్త్రీలు ప్రత్యేక స్థలాలతో కూర్చొని యుండరని ఊహించవచ్చును. అటు గ్రీకు దేశపు (హోమరుకాలపు) స్త్రీల స్థితికీ, ఆ కాలపు ఈజిప్టు దేశపు స్త్రీల పరిస్థితికి భిన్నంగా మధ్యేమార్గంగా ఆర్యస్త్రీల స్థితిగతులు ఉన్నాయని, సభ్యత వినయం అనే నియమాలకు లోబడి ... కాలంలో స్త్రీలకు స్వేచ్ఛ ఉందని (పరదాలాంటి పద్ధతులకు ఆమె బందీ కాదని) ఉపాధ్యాయ తన అభిప్రాయం వెలిబుచ్చారు.[14]

తమ మనవర్తిని సాధించుకోవడానికి స్త్రీలు న్యాయస్థానాలకు వెళ్ళే వారిని నిరుక్తం (క్రీ. పూ. 500) చెప్తున్నది.[15] వరుని ఇంటికి పోయే త్రోవలో ఇతరులు వధువును చూడవచ్చని ఆశ్వలాయన గృహ్యసూత్రం I - 8. 7 చెప్తుంది.[16]

రామాయణంలో అయోధ్యకాండలో సీతను అయోధ్యాపురవాసులు చూచినట్లున్నది. ఆపదల సమయంలో, కష్టకాలంలో, యుద్ధాలలో, స్వయంవరాలలో, యజ్ఞాలలో, పెళ్ళిళ్ళలో స్త్రీలు పరులకంట పడడం నింద్యంకాదు. (రామాయణం అయోధ్యాకాండ 116. 28) ఆకాశ దేవతల కంటకూడా పడని సీత ఈ రోజున నగరవాసుల దృష్టిన పడవలసి వచ్చినది కదాయని (అరణ్యవాసానికి పోయేటప్పుడు) అయోధ్యానగర వాసులు వాపోయారట. భారత యుద్ధం ముగిసిన తర్వాత ధృతరాష్ట్రుని స్త్రీ జనం అరణ్యానికి వెళ్ళేటపుడు కూడ ఇలాంటి మాటే పుట్టిందట. ఈ మూడు ప్రక్షిప్తాలని ఆల్టేకరు అభిప్రాయం.[17] కౌసల్య; సుమిత్ర, కైకేయి చిత్రకూటానికి వెళ్ళినపుడు

వాటిని పదిమందీ చూచారు. సీత అయోధ్యానగర వీధులలో వెళ్ళేటపుడు పరులు తనను చూస్తున్నారని ఇబ్బంది పడలేదు. కుంతి, గాంధారులు ఘోషాను పాటించలేదు. ద్రౌపది స్వయంవరం అయిన తరువాత సభలలోకి రాలేదని కానే పండితుడు (పుట 598) అంటే ఆమె ఋతుమతియై ఉన్నందున బాధపడిందని ఆల్టేకరు పండితుడు అంటాడు (పుట 169).

గౌతమబుద్ధుని భార్య యశోధర పరదాను పాటించలేదు. ఆమె పరదాను త్యజించింది. రామాయణ కాలంలో పరదా అంతఃపురాలకు పరిమితమని పి. థామస్ ('యుగ యుగాలలో భారతస్త్రీలు' రచించిన వారు) అభిప్రాయం. కామసూత్రాల కాలంలో (క్రీ. శ 1, 2 శతాబ్దాలు) స్త్రీలు భర్త యింటి భాగంలోకి రారాదు. అతడు ఏర్పాటుచేసే విందులు వినోదాలకు పోరాదు. నపుంసకులను అంతఃపుర రక్షకులనుగా ఏర్పరచటం జరిగింది. ధర్మశాస్త్ర కాలంతో స్త్రీకి విషాదయుగం ఆరంభమయింది. ఆమె స్వేచ్ఛ అరికట్టబడింది. భాసుని నాటకాలలో (క్రీ. శ 200), హర్షుని నాటకం 'నాగానందం' లో (క్రీ. శ 625) కన్యలు మేలిముసుగు వేసుకున్నట్టులేదు. కాని వివాహిత మేలిముసుగు ధరించేవారు.

ముసల్మానులు రాకపూర్వము కూడ మేలిముసుగు వాడాలని వాదించిన వారు క్రీ. పూ. 100 నుండి ఉన్నారని తెలుస్తుంది. కాగా కొంతమంది రాజులు పాటించారు. మరికొందరు పాటించలేదు. కథాసరిత్సాగరంలో రత్నప్రభ అనే స్త్రీ తన భర్త స్నేహితుడు కూడా తన ఆంతరంగిక గృహాంతర్భాగానికి రారాదని అసమ్మతి తెల్పిందట. క్రీ. శ 15, 16 శతాబ్దాలనుండి మేలిముసుగు పద్ధతి వేర్పాటు ఉత్తరప్రదేశ్, బెంగాలు, బీహారు లలో పెరిగిందని ఆల్టేకరు అభిప్రాయం. క్రీ. శ. 11 వ శతాబ్దం వరకు కొద్దిమందికే పరిమితమని ఆయన అభిప్రాయం. ఇది సరియైనది కాదు. బాల్యవివాహాలు అమలులోకి వచ్చి, విద్యకు స్త్రీలు దూరం చేయబడినప్పుడు వారిని రక్షించుకోవటానికి వారి స్వంతవారులు, యజమానులు, (భర్తలు) వారి స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తూ పరదాను ప్రవేశపెట్టి ప్రయత్నించటంలో ఆశ్చర్యంలేదు. ధనవంతుల స్త్రీలకు, రాజకుటుంబాల మహిళలకు పరదా వచ్చి ఉంటుంది. తతిమ్మా వారికి మేలిముసుగు నిర్ణయమై ఉంటుంది.

సంచార స్వాతంత్ర్యం వేరు. పరదావేరు. మేలిముసుగు ధారణవేరు. హిందూ స్త్రీలకు దేవాలయాల దర్శనానికి అభ్యంతరం ఏనాడూ లేదు. ముస్లిం స్త్రీలు భారతదేశంలో మశీదులకు పోరాదు. క్రైస్తవ స్త్రీలు చర్చీలకు పోతారు. హిందూ స్త్రీలు దేవాలయాలకు వెళతారు. మత ఉత్సవాలకు హాజరవుతారు. భర్తలతో కలసి, కుటుంబీకులతో కలసి తిర్థయాత్రలకు వెళ్తారు. నదులలో సముద్రాలలో సచేల స్నానాలు చేస్తారు. కాని మేలిముసుగు మాత్రం వదలటంలేదు ఉత్తర భారతదేశంలో. స్త్రీలకు పతివ్రతా బోధ, బాల్య వివాహం పెంచటం, పైగా స్త్రీ స్వభావాన్ని ఎడా పెడా నిందించటం ఇవన్నీ స్త్రీ పురుషులు దేవాలయాలలో, పురాణ కాలక్షేపాలలో, నాటక ప్రదర్శనలలో కూడ కలసి కూర్చోవడానికి వీలులేని పరిస్థితి కల్పించింది. కాగా ముస్లింలలో బురఖా ఉన్నది. హిందువులలో అదిలేదు. మేలిముసుగు మాత్రమే ఉన్నది. ఇది హిందూ సంస్కృతికి అనుగుణమే కాని బాహ్యవిషయం కాదు.

అధ్యాయం 4

పాదదీపికలు
వైవాహిక జీవితం

1. ఋగ్వేదకాలంలో స్త్రీలు : ఉపాధ్యాయ
   భార్య, తల్లి అనే శీర్షికగల 5 వ అధ్యాయం పుట 137
2. వేదకాలంలో స్త్రీలు : శకుంతలారావుశాస్త్రి పుట 171
3. ఉపాధ్యాయ : పుటలు 111 - 119
4. మహాభారతంలో వివాహమూ, సమాజము : కడియాల జగన్నాధ శర్మ
   Marriage & Society in Mahabharata ;
   unpublished thesisr of kadiyala jagannatha Sarma.
5. ఉపాధ్యాయ 5 వ అధ్యాయం.

6. కానే : ధర్మశాస్త్రాల చరిత్ర పుట 561
డిటో పుటలు 556, 564 - 567.

7. యుగయుగాలలో భారతీయ స్త్రీలు : పి. థామస్.
3 వ అధ్యాయం బౌద్ధం : స్త్రీలు.

8. హిందూ స్త్రీ : ప్రభాతి ముఖర్జీ : 2 వ అధ్యాయం.
డిటో

9. కానే : ధర్మశాస్త్రాల చరిత్ర VOL 2 పార్ట్ I, పుటలు 580, 581

10. ఆర్షధర్మ సూత్రాలు : చర్ల గణపతి శాస్త్రి
స్త్రీ ధర్మములు పుట 109

11. హిందూ నాగరికతలో స్త్రీ స్థానం : ఆల్టేకరు పుట 104

12. బౌద్ధాయన ధర్మసూత్రం (112, 4, 6) : ఆల్టేకరు పుట 106

13. మహాభారతం XII 272, 36 : ఆల్టేకరు పుట 106

14. రుగ్వేదకాలపు స్త్రీలు : ఉపాధ్యాయ. పుట 196

15. ఆల్టేకరు : పుట 167

16. కానే. ధర్మశాస్త్రాల చరిత్ర. సంపుటం 2 భాగం 1
పుట 596

17. ఆల్టేకరు : పుట 168

అధ్యాయం

5 వైధవ్యం

వివాహిత స్త్రీ పురుషులలో ఎవరో ఒకరు ముమ్ముందుగా చనిపోక తప్పదు. పురుషుడు చనిపోతే అతని భార్య 'విధవ' అవుతుంది. స్త్రీ చనిపోతే భర్త 'విధురుడు' అవుతాడు. కాని హిందూ సమాజంలో 1856 కు పూర్వం తిరిగి వివాహమాడటానికి స్త్రీకి అవకాశం లేదు. హిందూ విధవా వివాహ శాసనం 1856 లో బ్రిటిషు పాలన కాలంలో వచ్చింది. అంతకుక్రితం హిందూ విధవా వివాహాన్ని ధర్మశాస్త్రాలు నిషేధించాయి ఇంచుమించుగా క్రీస్తు శకారంభంనుండి. పురుషునికి అలాంటి ఇబ్బంది లేదు. 1955 వరకు (ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 1948 వరకు). అప్పటివరకు తన వీలును బట్టి, ఆర్థిక పరిస్థితులను బట్టి, సామాజిక హోదాను బట్టి పురుషుడు ఎంతమంది స్త్రీలనయినా భార్యలుగా స్వీకరించవచ్చును. అలాంటి పరిస్థితులలో విధురుడు పునర్వివాహానికి తయారవటంలో ఆశ్చర్యం లేదు. అలా జరిగేది. బ్రతికి నన్నాళ్ళు భార్యపై ప్రేమ ఒలకపోసి, ఆమె దినవారాలు కాగానే పెండ్లి కుమారులుగా సిద్ధపడిన పురుషులు వాస్తవ జీవితంలో ఎందరో. ఇదంతా పురుషులకొక పద్ధతిని, స్త్రీలకు మరియొక విధానాన్ని సూచిస్తున్నది. ఇది హిందూ సమాజం అనుసరించిన ద్వంద్వ నీతిలో ముఖ్యభాగం.

హిందూ వనితకు వైధవ్యం భయానక స్వప్నం. ఆమె భర్త కన్న ముమ్ముందుగా చనిపోవాలని కోరుకుంటుంది. పసుపు కుంకుమలతో దాటి పోవాలని ఆమె ఆకాంక్షిస్తుంది. వైధవ్య జీవితంలో తను పడే బాధలను తలచుకొని అలా ఆమె భావిస్తుందా? లేక భర్త మీది అనురాగంతో ఆమె అలా తలపోస్తున్నదా? అనే మీమాంస కొందరికి రావచ్చును. దానిపై శుష్క వాదోపవాదాలు చేసే ముందు, సతీ సహగమనం లాంటి హిందూ దురాచారాన్ని గురించి చర్చించేముందు హిందూ విధవ జీవితాన్ని గురించి తెలుసుకోవటం తప్పనిసరి అవుతుంది.

ఒకదశలో హిందూ విధవకు రెండు మార్గాంతాలు ఉండేవి. వైధవ్యంతో కాలం గడపటం ఒకటి. భర్త తమ్ముని వివాహం చేసుకోవటం మరియొకటి. ఇది వేదకాలపు స్థితి. మరో దశలో ఆమె విధవగా జీవితం కొనసాగించటం ఒకటి లేక పునర్వివాహం (ఎవరితోనైనా సరే) చేసుకొని జీవితాన్ని వెళ్ళ పుచ్చడం మరియొకటి. అలా చేసుకున్న స్త్రీని 'పునర్భువు' అనేవారు. మరల జన్మించిన మనిషి అని అర్థం. రెండవ పెండ్లివలన ఆమె పునరుజ్జీవనం అయినదన్నమాట. అలాకాక, ఆమెకు పురుష సంతానం లేకపోతే తన భర్త సోదరుని వలననో (మామూలుగా కనిష్ఠ సోదరుడు గ్రాహ్యుడు), లేక అతడులేని పక్షంలో సపిండుని వలననో, వీరిరువురు లభించనిచో కులములోని వాని సాయంతోను పెద్దల అనుమతితో 'నియోగం' ద్వారా పురుష సంతానం కనటం మూడవపద్ధతి. ఇవి అర్థశాస్త్రపు కాలం క్రీ. పూ. 4, 3 శతాబ్దాలలో చలామణిలో వుండేవి. మనువు రంగం మీదికి వచ్చాక పునర్వివాహాన్ని నిషేధించాడు. కాగా విధవరాలైన స్త్రీకి రెండే మార్గాలు. ఒకటి వైధవ్యంలో భర్తను స్మరిస్తూ 'ధర్మకామ' (ధర్మాన్ని అపేక్షించునది) అనే బిరుదుతో కాలం గడపటం. లేకపోతే 'నియోగం' ద్వారా ఒక్క పురుష సంతానాన్ని మాత్రం కనటం. ఇది మనుస్మృతిలో (క్రీ. త 1, 2 శతాబ్దాలు) గ్రంథస్థం చేయబడిన విషయం. తరువాత కాలపు పరిస్థితి విధవలకు మరీఘోరం. వైధవ్య జీవిత విధాన నిర్దేశంపేర ఆమెకు కఠిన నియమాలను విధించారు. సతీ సహగమన ప్రాశస్త్యాన్ని గురించి ఆమెకు నూరిపోశారు. ఆమెను బల వంతాన కూడా తగలేశారు. 'సతి' అని బిరుదు ఇచ్చి ప్రశంసించారు. సతీ సహగమన నిషేధ శాసనం వచ్చేవరకు ఇది బాహాటంగా విస్తృతంగా సాగింది. అంటే 1829 వరకు కొనసాగిందన్నమాట. తరువాత 1856 లో విధవా వివాహశాసనం వచ్చేవరకు విధవ బాధాకరమైన వైధవ్యాన్ని అనుభవించవలసి వచ్చేది. తరువాత సంస్కర్తలు ఈశ్వర చంద్ర విద్యాసాగర్ లాంటి వారలు విధవా వివాహాలను చేయించ నడుం కట్టారు. ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో బాలవిధవల వివాహాలు చేయించిన ఘనత కదుకూరి వీరేశలింగం గారికి దక్కింది. శాసనం అనుమతించినా విధవలను వివాహమాడటానికి వారి సంస్కృతి అడ్డువచ్చేది. తాము బిడ్డల తండ్రులయినా తమకు మాత్రం అనాఘ్రాత పుష్పం కావాలి. అలాంటి ద్వంద్వనీతి విధవా వివాహానికి పురుషులు ఉద్యుక్తులు అవటంలేదు. అభ్యుదయ కాములు కొందరు ముందుకు

వచ్చినా వారిలో హెచ్చుమంది బాలవిధవలను మాత్రమే వివాహ మాడటానికి ఇష్టపడుతున్నారు.

ఈ సమస్యను మరొక దృక్కోణం నుండి అర్థం చేసుకోవచ్చును. ఇది హిందూ సమాజపు మొత్తం యొక్క సమస్యా, లేక కొలదిమంది సమస్యా అనేది చర్చనీయాంశం. 'శూద్రుల' లో మారుమనువు ఆచారం ఉన్నది. కనుక వైధవ్యం పెద్ద సమస్యగా వారికి పరిణమించలేదు. హిందూ సమాజం 'ద్విజులను' శ్రేష్ఠులుగా పరిగణించినంత కాలం వారి ఆచార వ్యవహారాలు దావివి ప్రభావితం చేస్తాయి. 'సంస్కృతీ కరణ' పేరుతో తదితరులు వారిని అనుకరిస్తారు. వారి ఆచారాలను అనుసరిస్తారు. అక్కడ పెద్దప్రమాదం ఉందని గ్రహించాలి. వాస్తవ పరిస్థితులను గమనించటానికి కొన్ని లెక్కలను పరిశీలించవచ్చును. హిందూ సమాజంలో 13.9 శాతం వారు ఏనాడు విధవా వివాహాన్ని ఆమోదించి ఆచరణలో పెట్టలేదు. ఇది 1931 గణాంక లెక్క. మనుషుల లెక్కలో చూస్తే సుమారు 3 కోట్ల 30 లక్షల మంది అలాంటివారు ఉన్నారన్నమాట. 1951 గణాంక లెక్కల ప్రకారం భారతదేశంలో 2 కోట్ల 20 లక్షల విధవలున్నారని తేలింది. అంటే వెయ్యిమంది స్త్రీలలో 123 మంది విధవలు. విధురులు 3. 70 శాతం. విధవలు 10. 8 శాతం. 1971 గణాంకలెక్కల ప్రకారం 2 కోట్ల 30 లక్షల విధవలు, 80 లక్షల విధురులు ఉన్నారు. 1971 గణాంక లెక్కలను బట్టి 15 సం॥ నుండి 40 సం॥ లోపు వయస్సుకల స్త్రీలలో 50. 31 శాతం విధవలు. అలాగే 1971 లెక్కల ప్రకారమే 15 సం॥ నుండి 49 సం॥ వయస్సు కలవారిని తీసుకుంటే 100 మంది విధవలుంటే 46 మంది విధురులు ఉన్నారని తెలుస్తున్నది. సమస్య ఎంత జటిలమో కనిపిస్తున్నది.[1]

వేదకాలం :- విధవలు ఉండేవారు. భర్తను పోగొట్టుకొని పునర్వివాహం చేసుకొనని స్త్రీలు వారు. 'నారీర విధవా సుపత్నీ' అని వ్రాయబడినదానికి అర్థం ఏమంటే ఇక స్త్రీకి భర్త చనిపోయినపుడు పునిస్త్రీలు (ముత్తయిదువులు) అలంకరించుకొని విధవ ఇంటికి వెళ్తారు. బహుశః ఆమెను అలంకరించి నూతన జీవితంలో అడుగు పెట్టించటానికేమో! భర్త చనిపోగానే భర్త కనిష్ఠ సోదరునికో, లేక జ్ఞాతికో ఆమెను ఇచ్చి వివాహం చేస్తారు. ఆ ప్రక్రియ ఇలా జరుగుతుంది. స్మశానానికి విధవ వెళ్తుంది. చితిమీద భర్త శవాన్ని

పెట్టే ముందు ఆమె భర్త శవం ప్రక్కన పడుకుంటుంది. (మరీ పురాతన సమాజాలలో పురుషుడు చనిపోతే అతని భార్యను అతనితోపాటు పూడ్చి పెట్టటం లేక తగలెయ్యటం జరిగేది. ఈ ఆచారం ఈజిప్టు, ఈనాటి జర్మను ప్రాంతంతో ఉండేదట. ఆర్యులు భారతదేశానికి వలస రాకముందు వారిలో ఉండేదేమో! ఆమె భర్త శవాన్ని మోసుకొని వచ్చినవారు చుట్టూ ఉంటారు. నారీ రవిధవా (నారి+అవిధవా) అంటే పునిస్త్రీలు ఆమెను అలంకరిస్తారు. పురోహితుడు ఇలా అంటాడు. "ప్రాణమున్న ఈ ప్రపంచంలోకి రా. నీవు ఎవరి ప్రక్కన శయనించావో అతనిలో జీవంలేదు. నీకు ఇపుడు చేయి అందించినవాడు నీ భర్త. అతనితో సతీత్వం నీ విధి." (ఋగ్వే X-8). భర్త సోదరుడు ఆమెకు చేయి అందించి వివాహమాడతాడు. చనిపోయిన అతని శవంనుండి విల్లంబు పుచ్చుకుంటాడు. (అది యుద్ధాల కాలం, దస్యులతో పోరాటకాలం) సంతానం కనే వయస్సులో వున్న విధవలను అలా కృశించి పోనివ్వటం సమాజానికి నష్టం. ఒక్కరోజు కూడా ఆమె విధవగా ఉండరాదు. (కర్మాంతరాలు పూర్తి కాకుండానే ఆమె ముత్తయిదువు అవుతుంది) ఈ వివాహం అపకర్మలలో భాగం.2 యుద్ధాల రోజులు కనుక చావులు వారికి అంత బాధాకరం కాదేమో! అశ్వినులను 'ఉదయం సాయంత్రం మీరు ఎక్కడ ఉంటారు? రాత్రికి ఎక్కడా విశ్రాంతి తీసుకుంటారు? అని అడిగితే 'విధవరాలు భర్త సోదరుని పాన్పువైపు నడిపించినట్లు, వధువు వరుని ఆకర్షించినట్లు' అని ఉపమానాలతో సమాధానం చెప్పారు. (ఋగ్వే X 40, 2) భర్త సోదరుడు దేవర. భార్యను 'దేవృకామ' అనేవారు అంటే మరదితో కలవాలని ఉబలాటపడేది అని అర్థం. అందువలననే ద్వితీయ వివాహంలో భర్తృ విహీన 'దేవర' ను చేపట్టుంది. ఇతర విధవలు పునర్వివాహం చేసుకోవచ్చును. (ఋగ్వే I 124, 57). భర్తజాడ తెలియని స్త్రీ విధవతో సమానం. మరల ఆమె వివాహమాడవచ్చును. (ఋగ్వే VI 49, 8) ద్వితీయ వివాహానికి మంత్రతంత్రాలు లేవు. విధవలను తగలెయ్యడం ఇండో యూరోపియను యోధుల కుటుంబాలలో ఉండేది. దేనిని అధర్వ వేదంలో పురాణ ధర్మంగా (అధర్వ XVIII 3, 1) పేర్కొని ఖండించటం జరిగింది. బహుశః ఆమెను సతీసహగమనానికి తీసుకొని వెళ్ళే ముత్తయిదువుల ఊరేగింపే ఆమె పునర్వివాహానికి దోహదం చేసే ఊరేగింపుగా మారిందేమో!3 ఋగ్వేదంలో కనుపించే మిగతా విధవలు సంతానం కలిగే వయస్సు దాటిన వారై యుండా

లని ఉపాధ్యాయ ఊహ.[4] విధవ వివాహమాడితే ఆమె సంపూర్ణమైన భార్య; ప్రేమ, సంతానం, సౌభాగ్యం ఆమెహక్కు.[5]

బౌద్ధంలో సతీసహగమనం లేదు. యవ్వనులైన స్త్రీలు పెండ్లాడేవారు. పునర్వివాహం ఉన్నది. జైనుల పద్ధతి ప్రకారం సతీసహగమనాన్ని కొందరు స్త్రీలు పాటించేవారు. మహా భారతాన్ని క్రీ. శ 200 లో వ్రాశారని 'కానే', క్రీ. పూ. 200 సం॥ లో అది వ్రాయబడిందని 'కీత్' వ్రాశారు. మహా భారత కాలంలో విధవా వివాహాలు నింద్యం. రామాయణ కాలంలో సతీ సహగమనం ఉండేది. కుశధ్వజుని భార్య సతీసహగమనం చేసిందట. కౌటిల్యుని అర్థ శాస్త్రంలో 'వేదన', 'నివేశ', 'గమన' అనే పదాలు కనిపిస్తాయి. 'వేదన' అంటే పునర్వివాహం. 'నివేశ' :- భర్త కాని పురుషునితో కాపురం చేయటం. 'గమన' :- ఇంకొక పురుషుని దగ్గరకు లైంగికానుభవంకోసం వెళ్ళుట. విధవ తిరిగి వివాహమాడవచ్చును. వివాహమాడుట ఇష్టంలేనిచో వైధవ్యాన్ని అనుభవించవచ్చును. విధవ తిరిగి వివాహమాడితే శుల్కం తిరిగి ఇవ్వ వలెను. భర్త ఆస్తి అతని కుటుంబీకులకు తిరిగి ఇవ్వవలెను. స్త్రీ ధనం మొదటి భర్త కుమారులకు చెందును. నివేశ, గమన ఆచారాలను పాటించిన స్త్రీ తన స్త్రీ ధనాన్ని ఉంచుకోవచ్చును. కన్యలుగా ఉన్న విధవలు, విధ విధవలు, భర్త కుటుంబాలలోనే గాక మరియొకనిని మామ (భర్త తండ్రి) అనుమతితో వివాహం చేసుకోవచ్చును. కాని అనుమతి సాధారణంగా దొరకదు. అందువల్ల ఈ అవకాశాన్ని వినియోగించుకోవటానికి విధవలకు వీలు కలుగ లేదు. పునర్వివాహం చేసుకొనని విధవకు గౌరవం హెచ్చు. ఆమెను 'ధర్మకామ' (ధర్మాన్ని కాంక్షించేది) అని పిలిచేవారు. (అర్థశాస్త్రం 2.14,15)

మనుధర్మశాస్త్రం :- భర్త చనిపోయినా పునర్వివాహం పనికిరాదు. అప్పుడే ఆమెకు భర్త సరసన స్వర్గలోకంలో స్థానం ఉంటుంది.

కామసూత్రం :- వాత్స్యాయనుని కాలంలో విధవా వివాహాలు ఉండేవి. భర్త ఇంటిలో పునర్భుపుకు పెద్దగా గౌరవం ఉండేది కాదు.

నారద స్మృతి మూడురకాల పునర్భువులను చెప్పింది. గర్భాదానం కాని వివాహిత, భర్త చనిపోతే భర్త సోదరుడు లేక భర్త బంధుగులచేత మరియొకరికి (సపిండునకే) ఇవ్వబడినది ఆ కోవకిందికి వస్తాడు. యాజ్ఞవల్క్యుడు

రెండురకాల పునర్భువులను పేర్కొన్నాడు. గర్భాదానం కాని అవివాహిత, గర్భాదానం అయిన వివాహిత యని రెండు తెఱగుటు. పరాశర స్మృతిలోని 'నష్టేమృతే' అనే శ్లోకం కలియుగానికి వర్తిస్తుందని కొందరు (IV - 30) వర్తించదని కొందరు వాదోపవాదాలు చేశారు. మొత్తంమీద సంస్కరణ వాదుల ప్రయత్నాలు పరాశర స్మృతి వచనం నుండి బలాన్ని పుంజుకున్నాయి. ముస్లిం యుగంలో జాట్ శిక్కులలో విధవరాలు భర్త సోదరుని, అతడు లేకపోతే ఆ కులపు వానిని వివాహమాడవచ్చుననే ఆచారం ఉండేది.

నిన్న మొన్నటి వరకు బాల్యవివాహాలు ప్రబలంగా ఉండటం వలన, స్త్రీ కాపురానికి వచ్చిన కొలది కాలానికే తల్లికావటం వలన, ఆమె భర్త చని పోయినా పిల్లల బాధ్యత ఆమెకు ఉండడంతో ఆమె పునర్వివాహానికి పూనుకునే పరిస్థితి లేదు. ఆలస్యంగా వివాహమాడే కుటుంబాలలో కూడా స్త్రీకి త్వరగా గర్భధారణ జరగటంతో పురుషునికి మామూలుగా కల్గే స్వేచ్ఛ వితంతువుకు లభించదు. ఆమెను పిల్లలతో సహా భార్యగా స్వీకరించకలవారు, వివాహ మాడినా ప్రధమ సంతానాన్ని ఆదరంగా చూడగలవారు బహు అరుదుగా కనిపిస్తారు. అందువలన శాసనం వెసులుబాటు కల్పిస్తున్నా విధవా వివాహాలు విరివిగా జరగడానికి అవకాశాలు లేవు.

మహా సంస్కర్తలుగా పేరుపొందిన ప్రజానాయకులు విధవా వివాహాలను కొన్ని షరతులకు లోబడి ఆమోదించటం కూడా వాటి వ్యాప్తికి ప్రతి బంధక మైనది. అక్షత యోనియు అక్షత వీర్యుడు పునర్వివాహమాడవచ్చని, క్షత యోని స్త్రీకి క్షతవీర్య పురుషునకు పునర్వివాహం కూడదని, ఇది ఆర్యమతమని దయానంద సరస్వతులవారు సత్యార్థ ప్రకాశికలో వ్రాశారు. స్వాతంత్రోద్యమ సమరంలో లక్షలమందిని నడిపించిన మహాత్మాగాంధి సుమారు నలుబది సంవత్సరములు ప్రజా ప్రబోధం చేశారు. ఆయన అభిప్రాయాలు గమనిద్దాం. “జీవిత భాగస్వామి తన యెడ చూపిన ప్రేమను అనుభవించిన స్త్రీ చైతన్య వంతంగా, ఇష్టపూర్వకంగా వైధవ్యాన్ని స్వీకరిస్తే అది జీవితానికి హుందా తనాన్ని ఇస్తుంది, సౌకుమార్యాన్ని కలిగిస్తుంది; కుటుంబాన్ని పవిత్రం చేస్తుంది. మతాన్ని ఉత్కృష్ట స్థానానికి చేరుస్తుంది. అలాకాక మతం వల్లనో లేక ఆచారం వల్లనో నెత్తిన రుద్దబడిన వైధవ్యం భరించలేని భారమవుతుంది. రహస్యపద్ధతులు ఆశ్రయించే పాపంవల

కుటుంబాన్ని అపవిత్రం చేస్తుంది; మతాన్ని మలిన పరుస్తుంది."8 బాల విధవలకు వాస్తవంగా వివాహం జరగనట్లేనని ప్రకటించి బాలవిధవల పెళ్ళిళ్ళు చేయమని బోధించాడు. "విధవా వివాహాలు భారీ ఎత్తున సాగించమని నేను ఏనాడు అనలేదు. బాలవిధవలు (15 సం॥ లోపువారు)- ఈ దుఃఖ భాజనులు, శోచనీయస్థితిలో ఉన్నవారు - పతివ్రతా ధర్మం అంటే ఏమిటో తెలియనివారు. వారు (భర్త) ప్రేమను చవిచూడనివారు........."9 "బాల విధవ ఒక్క సంఖ్యలో ఉన్నా అన్యాయాన్ని సరిచేయాలి."10 ఈ ప్రవచనాల వల్ల అసలు సమస్య మరుగున పడిపోయింది.

సతీసహగమనం :- భర్త చనిపోతే అదే చితిపై స్త్రీ కాల్చుకొని చనిపోతే దానిని సహగమనం అంటాం. రుగ్వేదకాలంలో సహగమనం లేదని తెలుసుకున్నాం. బౌద్ధమతానుయాయులలో స్త్రీల సహగమనం లేదు. జైనులలో కొందరు ఈ ఆచారాన్ని ఆమోదించారు. రామాయణ కాలంలో సహగమనం జరిగింది. వాత్స్యాయనుని కాలంలో అనుమరణం ఉండేది. భర్త ఎక్కడో చనిపోతే ఆ వార్త విని చితి పేర్పించుకొని అందులో దూకి లేక పరుండి భార్య చనిపోవటం అనుమరణం అంటాము. 'సతి' విధవయొక్క విధియని అంగిరసుడు చెప్పాడు. బ్రాహ్మణులకు అనుమరణం నిషేధం చేశారు. క్షత్రియ స్త్రీలు అందులో ముఖ్యంగా రాజపుత్ర స్త్రీలు దీనిని పాటించేవారు. ఋగ్వేదంలో 'అగ్రే' అనే పదాన్ని 'అగ్నే' అని సనాతనులు మార్చి వేదకాలంలో సహగమనం ఉన్నదని సమర్థించచూచారని మాక్సు ముల్లరు (హిందూ సంస్కృతిపై గౌరవం కల మాక్సు ముల్లరు) వ్యాఖ్యానించాడు. ఆ భావం తప్పని, అసలు ఆ మంత్రం విధవకు వర్తించదని కానే పండితుడు వివరించాడు (ఋగ్వే X - 18-7). హుమాయూన్ సంతానం పొందే వయస్సు దాటిన విధవల సహగమనాన్ని ఆపించ ప్రయత్నించాడు. అక్బర్ చక్రవర్తి బలవంతాన ఏ స్త్రీ చేత సహగమనం చేయించకుండా అధికారులను నియోగించాడు. బ్రిటిషువారు 1829 లో శాసనం చేశారు. కాగా ఏ పదిఏండ్లకొకసారిగా మారుమూల గ్రామాలలో ఇప్పుడూ అలాంటి సంఘటన అరుదుగా జరుగుతున్నాయి. సతీసహగమనానికి ప్రామాణిక ఆధారం లేదన్నాడు మనుస్మృతి భాష్యకారుడు మేధతిథి., విధవను బ్రతికి ఉండి భర్తకు తర్పణాలనిమ్మన్నాడు విరటుడు. దేవణ్ణభట్టు (క్రీ. శ. 12 వ శతాబ్దం) దక్షిణాదివాడు. సతీసహగమనం తక్కువ

స్థాయి ధర్మమని అభిప్రాయం వెలిబుచ్చాడు. ఆ ఆచారాన్ని నిరసించాడు. కాదంబరి రచయిత బాణుడు (7 వ శతాబ్దపు వాడు) ఇలా భావప్రకటన చేశాడు :- "ప్రియునితో మరణించటం నిష్ప్రయోజనం. మూర్ఖులు అవలంబించే ఆచారమది. మోహంవల్ల చేసే పొరపాటు. అది తొందరపాటు చర్య. బ్రహ్మాండమైన తప్పిదం. చనిపోయినవారికి అది ఏమేలుచేయదు. అతడు స్వర్గానికి పోవటానికి, నరకానికి పోకుండా ఆది ఉపకరించదు. చనిపోయిన వారితో విధవను కలపదు. చనిపోయిన వ్యక్తి తన కర్మఫలం ప్రకారం నిర్ణయమైన ప్రదేశానికి పోతాడు. చితిపై చనిపోయి ఆత్మత్యాగం చేసేవారు ఆత్మహత్యా పాతకులకు కేటాయించబడిన నరకానికి వెళ్తారు. అలాకాక బ్రతికి ఉంటే చనిపోయిన వ్యక్తి ఆనందం కోసం తగిన తర్పణాలు ఇచ్చి తనకూ, చనిపోయిన వ్యక్తికీ మంచి చేయవచ్చును (సద్గతులు కలుగజేయవచ్చును). అతనితో చనిపోయినందువల్ల ఎవరికీ ప్రయోజనం లేదు." ఎంతో హేతుబద్ధమైన మానవీయమైన భావం స్ఫుటం.

సతీ సహగమనం ఇంచుమించుగా అదృశ్యమైన ఈ రోజుల్లో దీనిని గురించి ఈ మాత్రమైనా ఎందుకు ముచ్చటించవలసి వచ్చిందంటే, బెంగాలులో విధవలకు ఆస్తి లేకుండా చేయటానికి వారిని పురికొల్పి సహగమనం చేయించిన బ్రాహ్మణులు, చితిలో దూకిన రాజపుత్రి స్త్రీలకు భావాలను కల్గించిన సనాతనుల దుర్మార్గాన్ని వెలికితీసే నిమిత్తమే ఇన్నాళ్ళుగా సాగిన దుర్మార్గాన్ని ఆమోదించి పోషించిన హిందూ సంప్రదాయాన్ని నిరసించుటమే నేటి మన కర్తవ్యం.

<u>నియోగం :-</u> పురుషుడు నిస్సంతుగా చనిపోతే విధవ పునర్వివాహం చేసుకోకుండా నియోగంద్వారా చనిపోయిన భర్తకు సంతానాన్ని కనడం జాతి సంఖ్యను పెంచడానికి ఒక ఏర్పాటు. ఇది ప్రస్తుతం ఆమలులో లేదు. దీనిని గురించి వివరంగా వ్రాయవలసిన పనిలేదు. కాగా దీనిని ప్రోత్సహించిన ధర్మ శాస్త్రవిదులు, దీనికి హద్దులు, పరిమితులు విధించిన ధర్మశాస్త్ర రచయితలు వీరి ఉద్దేశాలను (దురుద్దేశాలనటం సబబేమో!) బహిర్గతం చేయుడానికి ఆ పరిశీలన అవసరం. కాగా దరహంమీద సాగించటం యుక్తి యుక్తం.

భర్త చనిపోతే భర్త సోదరుని వలన, అతడు లేకున్న సపిండుని వలన, అతడూ లేకున్న సప్రవరుని వలన, అతడూ లభించనిచో తన వర్ణము వాని వలన విధవ తన భర్తకు నియోగం ద్వారా సంతానం కనవచ్చని గౌతమ ధర్మ సూత్రం (18. 4-14) చెప్తుంది. విధవ క్షేత్రం. క్షేత్రికుడు భర్త. బీజినుడు నియోగితుడయిన పురుషుడు. ఇక్కడ ఒక నిబంధన ఉన్నది. పెద్దల అనుమతి కావాలి. ఇరువురు కుమారులను మాత్రమే పొందాలి. విధవరాలి వయస్సును గురించి నియమం ఉన్నది. ఆమె రజస్వల ఆయి 16 సంవత్సరాలు దాటరాదు. (వశిష్ట ధర్మసూత్రం 17. 56-65).

చనిపోయినవాని, లేక నపుంసకుని లేక నయంకాని వ్యాధిచేత పీడింప బడే వాని భార్యకు మాత్రమే నియోగం జరగవలెను. (బౌద్ధాయన ధర్మ సూత్రం II - 2-17).

ఒకే కుమారుని పొందవలెను (మనువు IX - 59-61) కౌటిల్యుడు విధించిన నియమాలు గమనార్హం. రాజుల విషయంలో. 1) భర్తకు బ్రతికి లేక చనిపోయిన పిల్లలు ఉండరాదు. 2) కుటుంబ సమావేశంలో గురువులు నిర్ణయించాలి. 3) భర్త సోదరుడో, సపిండుడో, లేక సగోత్రికుడో నియోగితుడు కావాలి. 4) నియోగితుడు ధర్మనిర్వహణచేయాలి కాని కామ ప్రేరితుడు కారాదు. 5) నియోగితుడు దేహానికి నెయ్యి పూసుకోవాలి. ఆమెతో సంభాషించరాదు. ఆమెను ముద్దిడరాదు. ఆమెతో క్రీడించరాదు. 6) ఒకరిద్దరు కుమారులు కలుగువరకు మాత్రమే ఈ ఏర్పాటు వుంది. 7) విధవ యవ్వనవతియై యుండవలెను. ముసలిది, గొడ్రాలు, ముట్లుడిగినది, వ్యాధిగ్రస్తురాలు, గర్భిణీ, ఇష్టపడనిది కారాదు. 8) ఒక కుమారుడు కలిగిన తర్వాత వారి సంబంధం మామ కోడళ్ళ సంబంధాన్ని పోలియుండును. షరతులకు భిన్నంగా నడిస్తే శిక్ష వేయవచ్చును. సంతానం క్షేత్రకునిది కాదు; నియోగితునిది (అర్థశాస్త్రం III - 7-40). మనువు కూడా నియోగాన్ని వర్ణించాడు. కాని ఖండించాడు. అయినా దానిని శాస్త్రసమ్మతం చేశాడు. నియోగం అనార్య సంప్రదాయమట (కొందరి అభిప్రాయం). హిందూ సమాజాన్ని కట్టుదిట్టం చేయటానికి నియోగాన్ని మనువు ఆమోదించవలసి వచ్చిందని ప్రతిభా ముఖర్జీ అభిప్రాయం. ఇది కేవలం ఆస్తిని వంశంలో

నిలపటానికి చేసిన ఆలోచన. మహాభారతంలో నియోగంవలన అంబిక అంబాలిక కుమారులను పొందారు. విధవలకు పునర్వివాహాన్ని కాదని తాత్కాలిక సంబంధంగా నియోగాన్ని ఏర్పాటు చేసాడు మనువు. ఈ ధర్మ విదుల దృష్టిలో స్త్రీ కేవలం సంతానం కనే యంత్రం. కనుకనే నియోగాన్ని గురించి ఇన్ని అసహ్యాకరమైన నిబంధనలు పెట్టారు. కౌటిల్యుని 'నివేశం' పద్ధతికి మనువు 'నియోగ పోలిక ఉన్నది. మనువు సోదరి కుమారుడిని వారసుడిగా చేశాడు. సోదరుడు లేని స్త్రీని వివాహమాడవద్దన్నాడు. ఎందు కంటే అతనికి వారసులుండరు కనుక. దాంతో నియోగపద్ధతి పెరిగింది. తెలిసి ఆస్తిని పోగొట్టుకోరుకదా! వివాహం అవిచ్ఛేద్యం. వంశం కొనసాగాలి. ఆస్తి వంశంలో ఉండాలి. ఇవి మనువు సూత్రాలు కనుక నియోగం (ఎంత ఇష్టంలేదని చెప్పినా) అవసరమయింది; రోజురోజుకూ ఈ ఆచారం పెరిగింది. చివరకు విశ్వరూప (యాజ్ఞవల్క్య స్మృతి వ్యాఖ్యాత) ఈ కాలానికి పనికి రాదని ఖండించాడు. క్షత్రియులకు, శూద్రులకు పరిమితం చేశారు. జనాభా పెరుగుదల ఆవశ్యకత కూడా ఈ ఆచారాన్ని పోషించింది కొన్ని వందల సంవత్సరాలు. ఈ ఆచారం నశించడం సమాజ ఆరోగ్యానికి అత్యవసరం. ఇంతగా స్త్రీలను అవమానించిన ఆచారం, స్త్రీలను సాధనాలుగా వాడిన మహరుషులు ఇతర సమాజాలలో లేరేమో! విధవ సంతాన ప్రాప్తికోసం భర్త సోదరుని వివాహమాడటాన్ని ప్రోత్సహించిన సమాజాలు ఉన్నాయి కాని స్త్రీ యొక్క ఉద్వేగాలకు, స్పందన, ప్రతిస్పందన భావాలకు విలువలను ఇవ్వకుండా, కేవలం ఆమెను తమ ప్రయోజనాలకు వాడుకోవడం హిందూ ధర్మశాస్త్ర విదులకే చెల్లును. స్త్రీ భర్త ఆస్తి అనే పాతకాలపు భావానికి ప్రతీక అయిన పాత ఆచారానికి ఇది అవశేషమని కానే పండితునీ భావం.[12] పితృరుణం తీర్చటానికి కుమారుని కొరకు ఆరాటమని ఆయన అభిప్రాయం. ఏ ఆరాటానికైనా మంచీ చెడ్డా ఉండాలికదా! సభ్యతను సంస్కారాన్ని పాటించాలి కదా! బహుశః పితృస్వామ్య సమాజాన్ని వ్యవస్థీకృతం చేయదలచిన వారికి ఇవి లెక్కకు రావేమో!

విధవ జీవితం :- హిందూ సమాజంలో నికృష్ట జీవిగా బ్రతికిన మనిషి, బ్రతుకుతున్న మనిషి విధవ. తనకు కావలసిన మనిషి లేకుండా పోయాడు. వెంటనే ఆభరణాదులు పోతాయి. తిండి కరువు అవుతుంది. గౌరవం నశిస్తుంది. విధవ ముఖావలోకనం దురదృష్టాన్ని తెస్తుందట.

పదిమందిలోకి పోవటానికి వీలులేదు. పండుగలలో, పబ్బాలలో ఎవరికంట పడకుండా తప్పించుకొని తిరగాలి. విరూపిని చేస్తారు. ముఖ్యంగా బ్రాహ్మణ వర్ణంలో [ఒక్క వైష్ణవులు తప్ప] ఆమెకు ముండనం చేస్తారు. జుత్తులేని ఆమె తల అందవికారం అవుతుంది. భర్త ఉండగా ఆమె ఇంటికి రాణి. కుటుంబానికి సామ్రాజ్ఞి. ప్రతి చిన్నదానికి ఆమె ఆశీర్వచనం కావాలి; ఆమె ఇచ్చే హారతులు, అందించే ప్రసాదాలు కావాలి. పరిస్థితి ఒక క్షణంలో మారిపోతుంది. ఎవరికీ అక్కరలేని మనిషి అవుతుంది. ఎవరికంట పడరాని పనికిమాలిన మనిషిగా మారిపోతుంది. ఈ మాటలు కేవలం ఉద్రేకపూరిత వచనాలు కావు.హిందూ ధర్మశాస్త్రజ్ఞులు ఆమెకు విధించిన శిక్షను గమనించండి. అది శిక్షకాదు ఆమెకు రక్ష అంటారు వారు. ఆ మాట ఎంత సబబో ఆలోచించవలసిన విషయం అనన్నమయింది.

విధవాధర్మం :- విధవ అనే పదం ఋగ్వేదంలో IV - 18,12; X - 7; X - 40. 2, X 40.8 ఋక్కులలో వాడబడింది. "మరత్తుల వేగంతో భూమి భర్తను కోల్పోయిన స్త్రీ వలె కనిపిస్తుంది" [ఋగ్వే I 87-3].

దుఃఖం వల్లనో తమయెడల ఇతరులు దుర్మార్గంగా ప్రవర్తిస్తారనో లేక ఎవరైనా తమరిని చెడుస్తారని భయంవల్లనో విధవలు తల్లడిల్లే వారన్న మాట.13 "ఒక సంవత్సరము విధవరాలు తేనెను, మాంసాన్ని, మద్యాన్ని, ఉప్పును త్యజించాలి. నేలపై పరుండాలి. తరువాత, ఆమెకు కుమారుడు లేకపోతే, పెద్దలు అంగీకరిస్తే, తన భర్త సోదరుని ద్వారా కుమారుని కన వచ్చును." [బౌద్ధాయన ధర్మసూత్రం II 66-68]. మౌద్గలాయనుడు ఆరు నెలలు గడువు మాత్రమే పెట్టాడు. వసిష్టుని ధర్మసూత్రం అలాంటి యేర్పాటే చేసింది. [17.55-56] మనువు చాల ఓపికగా, శ్రద్ధగా ఆమె విధులను వివరించాడు. "భర్త చనిపోయిన స్త్రీ ఆమెకు ఇష్టం అయితే, కందమూల శాదులు తింటూ బ్రతకాలి. పరాయి పురుషుని నామం కూడా ఉచ్చరించ రాదు. ప్రమాణాలను [పెళ్ళినాటి ప్రమాణాలను] పాటించాలి; బ్రహ్మచర్యాన్ని అవలంబించాలి. నిగ్రహంతో సంచరించాలి. భర్తమీద భక్తి శ్రద్ధలతో వారికి నిర్దేశింపబడిన మహోన్నతమైన ప్రవర్తనా నియమావళిని అనుసరించాలి. తనకు కుమారుడు లేకపోయినా, భర్త తదనంతరం ఇలా ప్రవర్తించిన విధవరాలు శౌనకునిలాగా స్వర్గానికి పోతుంది." [మనువు V 157-160].

ఈ అంశంలో పరాశరుడు మనువుతో ఏకీభవించాడు. వృద్ధహారీతుడు ఆమెను గురించి చాల జాగ్రత్త వహించాడు :-

"జుట్టు దువ్వుకోరాదు. తాంబూల సేవనం చేయరాదు. పూలను ముడుప రాదు. సుగంధ ద్రవ్యాలను వాడరాదు. ఆభరణాలను ధరించరాదు. రంగు చీరెలను కట్టరాదు. కంచు కంచంలో భోజనం చేయరాదు. రెండు వేళలా భోజనం చేయరాదు. కంటికి కాటుక కూడదు. తెల్లని వస్త్రాన్ని ధరించాలి. కోపాన్ని, ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి. మోసాన్ని, జిత్తులమారి ఎత్తులను ఆమె చేపట్టరాదు. సోమరిపోతు తనాన్ని, నిద్రను వర్జించాలి. పరిశుద్ధంగా ఉండాలి. శీలవతియై ఉండాలి. హరిసేవలో మునిగి తేలాలి. రాత్రివేళ నేలమీద కుశ దర్భచాపపై శయనించాలి. మనసును ఏకాగ్రతగా ఉంచుకోవాలి. సద్వర్తనుల సాంగత్యం చేయాలి" [వృద్ధ హారీత స్మృతి IX 205-210].

ఆమె నూనెతో తలంటుకొని స్నానం చేయరాదని, సన్యాసి కారాదని ప్రాచేతనుడు.[14] స్కాంద పురాణం [కాశీఖండం అధ్యాయం 4. 71-106] విధవ విధులను విశదీకరించింది. 'ఆమె రవిక ధరించరాదు. చనిపోయే టప్పుడు కూడా ఎద్దుబండి ఎక్కరాదు.' ఆమె సన్యాసి కాకూడదు కాని సన్యాసిలాగా జీవించాలి.[15]

ముండనం :- ఈ ఆచారం క్రీ. త. 14 వ శతాబ్దంలో అమలులోకి వచ్చిందని కానే పండితుడు అంటే క్రీ. త. 12 వ శతాబ్దంలోనని ఆల్టేకరు పండితుడు అంటాడు.[16] బహుశః మొదట్లో ఇది బ్రాహ్మణులలో వ్యాపించి, తదుపరి ఇతర వర్ణాల వారికి వ్యాప్తి చెంది యుండవచ్చును.

ఋగ్వేదంలో 'వికేశీ' [చిందర వందరగా జుత్తు ఉన్న స్త్రీ], అధర్వ వేదంలో 'వికేశీ' 'వికీర్ణకేశీ' అనే పదాలు మాత్రం ఉన్నాయి. శవంతో విధవలు స్మశానానికి వెళ్తారు. కాని ముండనం సంగతిలేదు. ఏదైనా క్షత్రియ విధవలు జుట్టు తీయించుకోరు. విధవ 'సతి' కాక బ్రతికితే త్యక్త కేశ అయి తపస్సు ద్వారా దేహాన్ని కృశింపచేయవలెను. (II - 53)

త్యక్త కేశ అంటే మూడు అర్థాలున్నాయి. కేశాలంకరణ చేయుట యందు శ్రద్ధలేనిది, గోవధ చేస్తే 2 వేళ్ళ వెడల్పున జుత్తును తీసివేసిన స్త్రీ, శిరోముండనం చేయించుకున్న స్త్రీ. వేదవ్యాసుడు ఏ అర్థంలో ఆ పదాన్ని వాడాడో చెప్పటం కష్టం. 1 వ అర్థం కావచ్చును లేక 3 వ అర్థం కావచ్చును. విధవ శిరోముండనం చేయించుకోకపోతే భర్త పరలోకంలో బానిసత్వంలో ఉంటాడట [స్కాందపురాణం - కాశీఖండం 4-64].17 శ్రీ వైష్ణవులలో ఈ ఆచారం లేదని తెలుసుకున్నాం. వారి సంహితలు [శంభు సంహిత, మనుసంహిత, హయగ్రీయ సంహిత] ఈ ఆచారాన్ని స్పష్టంగా నిషేధించాయి.18 శిరో ముండనం చేయించుకున్న స్త్రీ నరకానికి పోతుందని వారి మతాధికారులు బెదరించినా ఈ దురాచారం శ్రీ వైష్ణవులలో కూడా కొద్దిగా ప్రాకిందని ఆల్టేకరు అభిప్రాయం. గౌతమస్మృతి I - 5 ఈ ఆచారాన్ని ఖండించింది. వేదాలలో దీనిప్రసక్తి లేదు. గృహ్యసూత్రాలు దీనిని గురించి చెప్పలేదు. మను, యాజ్ఞవల్క్యులు దీని విషయమై మౌనం వహించారు. భర్త చనిపోయినపుడు ఒక్కసారి మాత్రం విధవ శిరో ముండనం చేయించుకోవాలని చెప్పారు. అంతేకాని జీవితాంతం శిరో ముండనం చేయించుకోమని ఆదేశించలేదు. మితాక్షర, అపరార్కులలో దీని ఊసేలేదు. క్రీ. శ. 10, లేక 11 శతాబ్దాలలో ఈ పద్ధతి మొదలయి ఉండవచ్చును. విధవలు యువతులు కావటం వలనలో, లేక విధవలను వికార రూపులను చేస్తే వారిని శీలవంతులుగా అట్టే పెట్టటం తేలిక అనో, లేక బౌద్ధ జైన, సన్యాసినులు పద్ధతిని అనుసరించియో ఈ విధానాన్ని ప్రవేశ పెట్టి వుంటారు. ఈనాటికీ శ్రీ వైష్ణవులలో 'తెంగళి' శాఖవారికి, గౌడ వితంతువులకు ఈ ఆచారం లేదు. తెలుగు దేశంలో బ్రాహ్మణ వితంతవులు శూద్రులలో కొందరు ఈ ఆచారాన్ని ఇప్పటికీ పాటిస్తున్నారు. దీనిని స్త్రీ జన ద్వేషి ఎవడో ప్రతిపాదించి ఉంటాడు.

<u>ముగింపు</u> :- వేదధ్యాయనాన్ని స్త్రీకి నిషేధించి ఆమెను శూద్రునితో సమతుల్యం చేసి ఆమెను సంతాన సాధన యంత్రంగా వాడి, అంటితో ద్వేషము పోక, వితంతు అయిన తరువాత ఆమెను వికారిని చేసి, మత సంస్కృతిని ఆమెకు జీర్ణింపజేసి తద్వారా అంధవిశ్వాసాన్ని ఆమెలో పెంచారు హిందూ సంప్రదాయవాదులు.19 ఆమెలో హేతుత్వ బుద్ధిని చిదిమి వేశారు

అసలు మధ్యయుగమే అంధకారయుగం. ఆ యుగంలో ఈ ప్రక్రియ పరాకాష్ఠకు చేరింది. స్త్రీ మనస్సుకు వేసిన సంకెళ్ళ నుండి ఆమె ఇంకా విడివడలేని స్థితిలో ఉంది. విధవా వివాహ చట్టం వచ్చినా పురుష పుంగవుల ఆలోచనా ధోరణి మారలేదు. స్త్రీల మనస్తత్వం ఎగదని స్థితిలోనే ఉంది; మార్పుసు వ్యతిరేకిస్తున్నది. ఈ దుర్భర శోచనీయ పరిస్థితి ఎన్ని దశాబ్దాలు ఇంకా ఇలా కొనసాగాలో! తలుచుకుంటే హృదయం బ్రద్దలు కాక తప్పదు; విముక్తికై పోరాడక తప్పదు.

అధ్యాయం 5

పాదదీపికలు

1. స్టేటస్ కమిటీ రిపోర్టు (1974 భారత ప్రభుత్వం) పుటలు 77 నుండి 79
2. ఋగ్వేదంలో స్త్రీలు : ఉపాధ్యాయ-పుట 102
3. డిటో పుట 105
4. డిటో పుట 107
5. డిటో పుట 107
6. కానే : ధర్మశాస్త్రాల చరిత్ర : పుట 634 2 వ వాల్యూము 1 వ భాగం
7. సత్యార్థప్రకాశిక : దయానంద సరస్వతి పుట 142
8. సర్వోదయ : మహాత్మగాంధి-నాల్గవ భాగం పుట 10
   Sarvodaya ; M. K. Gandhi (Navjivan Publishing House, Ahmedabad – 14 (1954) (young India' Dt. 5-8-196)

9. డిటో యంగ్ ఇండియా - 19-8-196
10. డిటో యంగ్ ఇండియా - 2-9-196
11. యుగయుగాలలో భారతీయ స్త్రీల చరిత్ర : పి. థామస్ - రెండవభాగం 'ప్రాచీన స్త్రీ విమోచన ఉద్యమకారులు'
12. కానే : ధర్మశాస్త్రాల చరిత్ర : పుట 606 2 వ వాల్యూము 1 వ భాగం
13 డిటో పుట 583 (12 వ అధ్యాయం) 2 వ వాల్యూము 1 వ భాగం
14. డిటో డిటో పుట 584
15. డిటో డిటో పుట 586
16. హిందూ నాగరికతలో భారత స్త్రీల స్థానం : అల్టేకరు పుట 161
17. అల్టేకరు పుట 160
18. డిటో పుట 161
19. చూడండి డిటో 358

అధ్యాయం

6 విడాకులు : పునర్వివాహం

శాస్త్రప్రకారం హిందూ వివాహం రద్దుకాపటానికి వీలుకానిది. స్త్రీకి ఇది గొడ్డలిపెట్టు. అభ్యుదయ వాదుల ఆందోళన ఫలితంగా వివాహం రద్దుకు అవకాశాన్ని కల్పిస్తూ బొంబాయి, ఉమ్మడి మద్రాసు రాష్ట్రాలలో వరుసగా 1947, 1948 సంవత్సరాలలో రాష్ట్ర శాసన సభలు చట్టాలను రూపొందించాయి. తరువాత 1955 లో భారతదేశం యావత్తుకూ వర్తించే శాసనం వచ్చింది. అయితే శాసన సమ్మతం కాకపోయినా అనుభవంలో 1947 కు పూర్వమే ఒకరకమైన విడాకులు అమలులో ఉన్నాయి.

భార్యా భర్తలు ఇరువురు బతికి ఉన్నపుడు ఏవో కొన్ని కారణాల వలన వారి వివాహం ఆచరణలో రద్దుకాబడితే అది అనుభవానికి వచ్చిన విడాకుల క్రిందనే లెక్క. అలాంటి సంఘటన జరుగక పోలేదు. ఈ విష యాన్ని కూలంకషంగా పరిశీలించటం అవసరం. విడాకులు వచ్చినపుడు భార్యా భర్తలు పునర్వివాహం చేసుకోవటానికి వీలు వుంటుంది. విడాకులు లేనపుడు కూడా కొన్ని పరిస్థితులలో భార్య పరపురుష సంగమానికి వీలు కలిగింది. అది నియోగం ద్వారా జరిగేది. దానిని క్రిందటి అధ్యా యాలలో తడివి తూచాము. కనుక దాని ప్రసక్తి ఇపుడు అనవసరం. కనుక 'నియోగం' క్రిందకు రానివి పునర్వివాహాలక్రింద పరిగణింపబడేవి వాటిని గురించి మాత్రమే ఈ అధికరణంలో చర్చించటం సమజసమని అనిపించింది.

భర్తజాడ తెలియకపోతే భార్య విధవతో సమానం. కనుక ఆమె మరల వివాహమాడవచ్చును. (ఋగ్వే VI - 49, 8) కాని, రెండవ పెండ్లికి మంత్ర తంత్రాలు లేవు.[1] బౌద్ధులకాలంలో ఇషిదాసి మూడు వివాహములు చేసుకున్నట్లు 'తేరీగాధ' లో ఉన్నది.[2] 73 మంది బౌద్ధ సన్యాసినులు వ్రాసిన గ్రంథమది. అందులో ఎక్కువమంది పురుషులచేత మోసగింపబడిన

వారు లేక నిరాదరణ చేయబడిన వారు. 'తేరి' అంటే 'జ్ఞానవృద్ధ' (జ్ఞానముతో వృద్ధులైన వారు). 'గాథ' అంటే పాట. తేరీ ఉత్పలవర్ణ తెలియక తన కూతురు భర్తనే రెండవ భర్తగా స్వీకరించినది.3 క్రీ. పూ. 400 నుండి క్రీ. త. 100 వరకు ధర్మసూత్రాలు వ్రాసిన వారు భర్త జాడ తెలియని స్త్రీ ఏడు సంవత్సరాలు వేచియుండాలని ఆల్తేకరు వ్రాశాడు.4 భర్త సన్యాసి అయినా, ఇల్లువదలి ఎక్కడికి వెళ్ళిందీ తెలియకపోయినా ఏడు తీర్థముల తర్వాత ఆమె భర్త యొక్క ఏకోదరులలో ఎవరో ఒకరిని ఎంపిక చేసుకొని అతనితో కాపురం [నివేశం] చేయవచ్చును. అందులో భార్య లేని కనిష్టునే ఎంచుకోవలెను. వారెవ్వరూ లేకపోతే సపిండులలో ఒకరితో కాపురం ఉండవచ్చును. గర్భవతి అయితే ఒక సంవత్సరం ఆగవలెను. [తీర్థం అంటే నెల; ముట్టుకు ముట్టుకు మధ్య ఉన్న గడువు]. ఇది అర్థశాస్త్ర విహితం.5 భర్త మత సందర్భంగా విదేశాలకు వెళ్ళి అతని జాడ తెలియకపోతే భార్య ఎనిమిది సంవత్సరాలు వేచియుండాలని, జ్ఞానం, పేరు ప్రఖ్యాతుల కోసం అతడు వెళ్ళియుంటే ఆరు సంవత్సరాలు వేచియుండాలని, మరొక భార్యతో ప్రేమ కలాపాలు సాగించటానికి వెళ్ళియుంటే మూడు సంవత్సరాలు వేచి యుండాలని మనువు ఆదేశించాడు [మను IX - 76]. అలా గడువు మేరకు వేచియున్న తరువాత భార్య ఏమి చేయాలో మనువు చెప్పలేదు. కాని ఇలా వేచివుండమని చెప్పటంలో అర్థం తరువాత అతడు మరణించినట్లు ఆమె భావించుకొని పునర్వివాహం చేసుకోవచ్చుననే అర్థం స్ఫురిస్తుంది. కాని పునర్వివాహానికి మనువు వ్యతిరేకి. కాగా ఆమె నియోగానికి అర్హురాలు. అంతేనని తోస్తున్నది. ఒక స్త్రీ ఒక పురుషునికి నిశ్చితార్థం అయిన తదుపరి వివాహం కాకుండా అతడు చనిపోతే ఆమె పునర్వివాహం చేసుకోనగునని [గర్భాదానం కాకపోతే] ఒక శాస్త్రకారుడు చెప్పాడు. అదే తర్కంమీద నిశ్చితార్థం అయిన తరువాత పురుషుడు వెళ్ళిపోయి అతని జాడ తెలియక పోతే స్త్రీ మరల వివాహమాడవచ్చని తేలికిగా నిర్ణయానికి రావచ్చును. గాంధర్వ, అసుర, రాక్షస, పైశాచికాలు అధార్మ్యవివాహాలు. అలా వివాహాలు చేసుకున్నవారు విడాకులు పొందవచ్చునట. (అర్థశాస్త్రం III - 3) కాకపోతే కొన్ని ఇబ్బందులకు లోను కావాలి. స్త్రీ ధనం పోతుంది. తనుగా 'నివేశం' నకు ఆమె తలపడినా ఆమెకు ధన నష్టం. (అర్థశాస్త్రం III 4-26; 2.15, 3. 21-23) వీదరికం వల్ల పునర్వివాహం చేసుకుంటే తప్పులేదట. ఇరువురి

ఇష్టం ప్రకారం విడాకులను అధార్మ్య వివాహాలలో కౌటిల్యుడు అంగీకరించాడు. నారదదుడు, పరాశరడు కొంత వెసులుబాటు చూపించారు. 'శూద్ర కమాలాకార' రచయిత నారదుడు 17 వ శతాబ్దంలో శూద్రులకు విడాకుల సౌకర్యం ఉందన్నాడు. పరాశరుని భాష్యకారులు పరాశరుడు చూపిన ఔదర్యాన్ని కాలరాచారు. 'నష్టేమృతే'6 శ్లోకానికి విపరీతార్థాలు చెప్పారు. సన్యాసి అయితే, అతనిజాడ తెలియకపోతే నని అర్థం. ఏదైనా పరాశరుని వాక్యం కలియుగానికి వర్తించదని తోసివేశారు సనాతనులు.7

బ్రాహ్మణ సంప్రదాయంలో విడాకుల కేసులు గ్రంథస్థం కాలేదు. బౌద్ధవాఙ్మయంలో పెక్కు కానవస్తాయి. 'కానా' అనే స్త్రీ తనఇంట లేనపుడు భర్త ద్వితీయ కళత్రాన్ని తెచ్చాడు. ఆమె ఆత్మగౌరవానికి అఘాతం కలిగింది. భర్తతో కాపురం చేయనన్నది. బుద్ధుని ఆదేశంపై ఒక రాజు ఆమెను పెంపుడు కుమార్తెగా స్వీకరించి ఒక సామంతునికి ఇచ్చి వివాహం చేశాడు. (ధమ్మపదం II - 82). భార్య అక్కరలేదన్న అల్లుళ్ళను బ్రతిమాలటానికి శూద్ర కుటుంబాలలోని తండ్రులు ఆసక్తి చూపేవారు కాదు. కన్హాదిపాయన జాతకంలో ఒక కథ ఉన్నది. ఒక స్త్రీ భర్తతో ఇలా అంటుంది. 'నీవు అంటే నాకు ప్రేమలేదు. మన కుటుంబంలో అలాంటి ఆచారం అంటే స్త్రీ పునర్వివాహం చేసుకునే ఆచారము లేదు కనుక నేను మళ్ళీ పెళ్ళి చేసుకోదలచలేదు." దీనిని బట్టి 'ఉన్నత' వర్ణాలవారు విడాకుల వెసులుబాటును వాడుకోవటానికి విముఖులుగా ఉండేవారని తెలుతున్నది. ఈ కథలో ఆత్మగౌరవం కల స్త్రీలు వ్యవహరించిన తీరు ప్రశంసాపాత్రం.

భర్తల చేత పరిత్యజింపబడిన భార్యల శోచనీయస్థితి చాల అసంతృప్తికరమని, హిందూ సంస్కృతికి భిన్నమని ఆల్టేకరు పండితుడు అభిప్రాయం వెలిబుచ్చాడు.8 మనువును అంగీకరిస్తే, మనుధర్మశాస్త్రం హిందూ సంస్కృతికి అద్దం పడుతుందనుకుంటే ఆ అభిప్రాయం సరియైనదే. కొన్ని ఆదేశాలు ఇచ్చి, కొన్ని నిబంధనలు ఏర్పరచి, కొన్ని నియమాలు విధించి, వాటిని పాటించనందువల్ల అనర్థాలు సంభవిస్తే, అవి అన్ని హిందూ సంస్కృతికి భిన్నమని తప్పించుకొనడానికి వీలులేదు. చేసింది పురుషాధిక్య

పురుష పుంగవుల పెత్తనం. స్త్రీలకు బాధ కలుగకుండా ఎలా ఉంటుంది, నిప్పులో చెయ్యిపెట్టి కాలిందని బాధపడి ఏమిలాభం? పాశ్చాత్యుల పద్ధతి, ఆలోచనలు వద్దని ఆల్టేకరు హెచ్చరించాడు. కాని కాలగమనం ఆగలేదు. విడాకులను అంగీకరిస్తూ శాసనం 1955 లో వచ్చింది. ఈ పని చేసింది హిందూ సంస్కృతి అంటే ఏమిటో తెలిసీ తెలియని విదేశీయులు కారు. హిందూ సంస్కృతీ పద ఘట్టన క్రింద నలిగిపోయిన స్త్రీమూర్తుల ఆక్రందనలూ, హాహాకారాలూ, భీషణ గర్జనలూ, ఆ శాసన ఆవిర్భావానికి దారి తీసినయి. ఆ శాసనం సమగ్రమయిందా లేక దానిలో లోటుపాట్లున్నాయా, దానిని ఎలా సవరించాలి, అనే అంశాలను మున్ముందు వచ్చే అధ్యాయంలో పరిశీలించడం సముచితం.

అధ్యాయం 6

పాదదీపికలు

1. ఋగ్వేదంలో స్త్రీలు : ఉపాధ్యాయ : 4 వ అధ్యాయం
2. వేదకాలంలో స్త్రీలు : శకుంతలారావుశాస్త్రి పుట 93
3. డిటో పుట 96
4. హిందూ నాగరికతలో స్త్రీలు : ఆల్టేకర్ పుట 84
5. అర్థశాస్త్రం III - 4.29
6. పరాశర స్మృతి IV - 30
7. కానే : ధర్మసూత్రాల చరిత్ర : 2 వ సంపుటం, 1 వ భాగం, పుట 611
8. ఆల్టేకర్-పుట 87

అధ్యాయం

7 జారత్వం, వేశ్యలు, దేవదాసీలు

ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా జారత్వం నింద్యమే. వివాహం నాడు సతీపతులు పరస్పర విశ్వాసంతో మెలగుతామని ప్రమాణాలు చేస్తారు కదా! కనుక వారు ఇరువురూ ఒకరు మరియొకరి యెడ సంపూర్ణ విశ్వాసంతో సంచరించవలసియుంటుంది. ధర్మార్థ కామములయందు నిన్ను వితనాడసని పురుషుడు ప్రమాణం చేస్తాడు. కలిమి లేములయందు, కష్టసుఖాలందు చేదోడు వాదోడుగా ఉంటూ స్నేహితురాలిగా, సహచరిగా, ప్రియురాలిగా, భార్యగా ఉంటానని ఆమె ప్రమాణం చేస్తుంది. ఇద్దరు కలసి చేసే ఏ పనికైనా పరస్పర విశ్వాసమూ నమ్మకమూ ముఖ్యము. అలాంటప్పుడు ఇరువురి కలయికకు పరాకాష్ట అయిన కుటుంబంలో విశ్వాసం సడలరాదు ఏ పరిస్థితుల్లోనైనా. ఈ దాంపత్య రహస్యాన్ని అన్ని దేశాలవారూ, సమాజాలవారూ, సంస్కృతులవారూ గ్రహించారు; గ్రహిస్తున్నారు. కాగా చిక్కల్లా ఎక్కడ వస్తున్నదంటే ఆయా దేశస్థులు, ఆయా సమాజాలవారు తమ మూల విశ్వాసాలకు, మౌలిక భావనలకు అణిగి మణిగి ఉండే స్థితిలో కుటుంబ జీవితాన్ని సాగిస్తారు. కనుక కుటుంబం ఆ మౌలిక భావ ప్రపంచపు పరిధిలోనే ఉనికి కలిగి సాగిపోవలసి ఉంటుంది. ఈ చారిత్రిక పూర్వ రంగాన్ని గుర్తిస్తే దురవగాహనకు, లేక పొరపాటుగా అర్థం చేసుకోవడానికి అవకాశం ఉండదు.

జారత్వమన్నా, వ్యభిచారమన్నా ఒకే అర్థం. పెండ్లినాటి జీవిత భాగస్వామితో కాక ఇతరులతో ప్రేమ వ్యవహారం పెట్టుకోవడం, సాంగత్యం నెరపడం, లైంగిక సాన్నిహిత్యాన్ని పొందడం జారబత్వమనిపించుకుంటుంది. ఈ పని భార్య చేసినా, భర్త చేసినా తప్పే. ఈ విషయంలో ఏ విధమైన అనుమానానికి తావులేదు. సమాజంలో ఉత్పత్తి విధానంలో పురుష ప్రాముఖ్యత పెరిగిన కొలదీ సమాజంలో అధికారం పురుషాయత్తమైనది.

పురుషుడు వేటాడి పశువులను చంపి తెచ్చినన్నాళ్ళు, స్త్రీ అడవిలో కందమూల ఫలాదులను ఏరి తెచ్చినన్నాళ్ళూ అంటే ఇరువురూ ఆహార సముపార్జన చేసినన్నాళ్ళూ పెద్దగా వ్యత్యాసాలు—వారిహోదా విషయంగా—రూపొంద లేదు. తరువాత కూడా ఆమె పొలంలో విత్తనాలు వెదజల్లి పైరు పండించినంతకాలం ఆమె ప్రాముఖ్యత తగ్గలేదు. పశుపాలనా బాధ్యతను ఆమె నిర్వహించినంతకాలం ఆమె అంతస్తు క్షీణించలేదు. కాగా పొలంలో అతడు నాగలితో వ్యవసాయం ఆరంభించినప్పటినుండి పురుషునికి అహం భావం మెండయింది. తనే సర్వమై సంచరించాడు. ఆమెను బానిసగా చేశాడు. ఆమెను లొంగదీసుకున్నాడు. ఆమెకు తన భావాలు నూరి పోశాడు. పితృస్వామ్య వ్యవస్థ నెలకొల్పాడు. ఆస్తి తన పిల్లలకు సంక్రమించాలన్నాడు. భార్య కనే సంతానం తన సంతానం అని గట్టిగా నిర్ధారణ కావటానికి ఆమె పరపురుషులతో సాంగత్యం నెరపరాదన్నాడు. ఆమె శరీరాన్ని, మనస్సును, తన అదుపులోకి తెచ్చుకున్నాడు. తను, ఆమె ఇద్దరూ రుజుమార్గాన జీవితాలు సాగించాలని చెప్పాడు మొదట్లో. తరువాత తనకు స్వేచ్ఛ ఉందన్నాడు. ఆమెకు ఆ స్వేచ్ఛను నిరాకరించాడు. ఆమెకు పతివ్రతా ధర్మాలు నేర్పాడు. ఎట్టి పరిస్థితులలోను ఆమెకు పునర్వివాహపు ఆలోచన పనికిరాదన్నాడు. ఆమె సంతానం తనది అన్నాడు. ఆమెను తన క్షేత్రమని నామకరణం చేసాడు. తను క్షేత్రికుడట. తన సమ్మతితో ఆమె ఎవరివల్ల సంతానాన్ని పొందినా ఆ సంతానం తనదేనట. ఇదీ ప్రమాదకరమని భావించి తదుపరి ఆమెకు ఎట్టి పరిస్థితులలోను పర పురుష సాంగత్యాన్ని నిషేధించాడు. చివరకు చచ్చి సాధించాడన్నట్లు చనిపోయిన తరువాత కూడా తననే స్మరించమని, తనకోసమే వ్రతకమని, పిండప్రదానాలు చేయించమని, శ్రాద్ధకర్మలు చేయించి, సద్గతులు కల్పించమని ఆదేశించి ఆమెకు వైధవ్యం కల్పించాడు. ఇదీ హిందూ పురుషుని జైత్రి యాత్ర వర్ణన.

పురుషుడు రెండురకాలుగా జారుడవచ్చును. వేశ్యా సంగమం ఒకటి. ఇతరస్త్రీల పొందు సాధించుకొనుట రెండవది. మొదటి దానిని గురించి తదుపరి గ్రహిద్దాము. ప్రస్తుతం రెండవస్థతిని చర్చనీయాంశం చేద్దాము. భర్త వ్యభిచరిస్తే తప్పులేదు. భార్య అలాంటి భర్తకు కూడా దోహదం చేయాలట. కుష్ఠురోగ పీడితుడైన తన భర్తను సుమతి తట్టలో

పెట్టుకొని వేశ్యవద్దకు తీసుకొని వెళ్తుంది. తోవలో అతని కాలు ఒక ముని శిరస్సుకు తగుల్తుంది. సూర్యోదయం కాగానే తల వ్రక్కలయి చస్తావని అతగాడు శపిస్తాడు. అంత సూర్యోదయం కాకుండా తన పతివ్రతా మహిమ వల్ల సుమతి ఆపుతుంది.[1] ఈ కథ మార్కండేయ పురాణంలోని కథ. పతివ్రతా మహాత్మ్యాన్ని వెలికి తీయటానికి ఈ కథను ఉటంకించటంలేదు. భర్తలు వ్యభిచారులుగా ఉండేవారని వారికి భార్యలు ఆ స్థితిలో కూడ సేవలు చేసేవారని నిర్ధారణ చేయటానికి మాత్రమే ఈ కథా ప్రసక్తి వచ్చింది. అసలు పురుషులకు జారత్వంతో సాధారణంగా పనిలేదు. శాశ్వత సంబంధాన్ని వారు ఆశిస్తే ఆ నచ్చిన స్త్రీని భార్యగా తెచ్చుకుంటారు. తాత్కాలిక సంబంధంతో తృప్తిపడ తలిస్తే వేశ్యలు అందరికీ ప్రణయాన్ని పంచి ఇవ్వడానికి - పణం తీసుకొని సుమండీ!- సిద్ధంగా ఉన్నారు. ఏటు వచ్చీ చిక్కు లల్లా స్త్రీకే. ఒకటి విడాకులకు అవకాశం లేదు. వివాహ విచ్ఛేదానికి వీలులేదు. పునర్వివాహానికి అసలే వెసులుబాటు లేదు. అందువల్ల మనస్సును నిగ్రహించుకోలేని స్త్రీలు, దేహ వాంఛలను అదుపులో పెట్టుకోలేని స్త్రీలు జారత్వానికి దిగజారుతారు. భర్తకు ఎప్పుడో అప్పుడు తెలుస్తుంది. రహస్యవర్తనం బయటపడుతుంది. క్రూరుడైన భర్త ఆమెను చీల్చి చెండాడుతాడు. ఉదారుడైన పురుషుడు ఆమెను కొద్దిపాటి దండనతో వదలివేస్తాడు. ఏదైనా అతడు అలా సంచరించాలో ఆనాటి సమాజం అతనికి మార్గదర్శకం చేస్తుంది. రహస్య ప్రియుల, జారుల ప్రసక్తి ఋగ్వే I - 66-4; I - 117-18; I - 133-3 లలో కనిపిస్తుంది.

ఈ సమస్య ఆనాటిదీ, ఈనాటిదీ కూడాను. ఇప్పటికీ వ్యభిచారం అయిన భార్యను చంపే మగధీరులు పత్రికలలో, సంఘ జీవితంలో దర్శన మిస్తారు. వ్యభిచారం దాంపత్యంలోని తోటి స్త్రీ లేక పురుషునిపట్ల నేరమే. కాదు కాదు ద్రోహమే. అది నిస్సంశయమైన అంశం. కాగా అది వైవాహిక రంగంలో తప్పిదమా లేక సాధారణ శిక్షాస్మృతి క్రింద వచ్చే నేరమా అనేది మీమాంస, మొదట్లో హిందూ సమాజం వ్యభిచరించిన భార్యల పట్ల ఉదారంగానే ప్రవర్తించింది. తదుపరి వైఖరి గట్టిపడింది. ఈ భావం యొక్క చారిత్రక గమనాన్ని పరికిద్దాం. జారత్వానికి అలవాటుపడిన స్త్రీ తన తప్పిదాన్ని అంగీకరిస్తే మత కర్మలలో కూడ పాల్గొన వచ్చుని, అలా వేదకాలంలో స్త్రీలను ఉదారంగా చూచారని శతపథ బ్రాహ్మణం చెప్తున్నది.[2]

వ్యభిచరించిన భార్యను ఇంటినుండి వెళ్ళగొట్ట నవసరం లేదు. ఆమె ప్రాయశ్చిత్తం చేసుకుంటే చాలు. ఆమెకు భోజనం పెట్టాలి. ఆమె నేల మీద శయనించాలి. మురికి వస్త్రాలు ధరించాలి. ఆమె బహిష్టు అయిన తరువాత శుచి అవుతుంది. అయితే ఆమెకు గర్భిణీ వచ్చినా, ఆమె గర్భ స్రావం చేసుకున్నా ఆమెను వదలివేయాలి.[3] (గౌతమ ధర్మ సూత్రం 22 - 35). గౌతముడు క్రీ. పూ. 600 - 300 కాలపు వాడు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యస్త్రీలు శూద్రునితో వ్యభిచరిస్తే—సంతానం కనకపోతే— ప్రాయశ్చిత్తం చాలును. ఆమెను ఇంట్లోనుంచి వెడలనడప వనిలేదు. కాగా ఈ దిగువ పేర్కొన్న నాలుగురకాల భార్యలను మాత్రమే వదలి వేయాలి. 1) భర్త శిష్యునితో వ్యభిచరించిన స్త్రీ. 2) భర్త గురువుతో పోయిన స్త్రీ. 3) భర్తను చంపబోయిన స్త్రీ. 4) చర్మకారునితో సంగమించిన స్త్రీ.[4] జారత్వానికి లోనయిన భార్య తల గొరించి, చెడిపోయిన తిండి పెట్టి, ఆమెను భర్త ఇంటిలోనే ఉంచాలని నారదుని మాట.[5] ఏ స్త్రీ అయినా తక్కువ కులపు వానితో వ్యభిచరిస్తే ఆమెను కుక్కలకు (ఆహారంగా) వేయాలి.[6] (మనువు VIII - 371, గౌ. ధ. సూ 23-14, మహాభారతం శాంతి పర్వం 165-64) స్త్రీ అలవాటుగా జారిణియైనచో మాత్రమే ఆమెను వదలి వేయాలని పరాశరుడు చెప్పాడు.[7] (పరాశర స్మృతి X - 35). జారత్వం వలన ఆమె గర్భం ధరిస్తేనే ఆమెను వదలివేయమన్నాడు యాజ్ఞవల్క్యుడు.[8] (యాజ్ఞవల్క్య స్మృతి I - 72). ఇటువంటి సందర్భాలలో స్త్రీ కన్న పురుషునిదే తప్పు అని మహా భారతం చెప్తుంది.[9] జారుడు మరీ తక్కువ జాతి పురుషుడైనపుడు మాత్రమే స్త్రీనిఇంటినుండి వెళ్ళగొట్టాలని పరాశర మాధ వీయంలో చాతుర్విం శతిమతం X - 28 చెప్తున్నది.[10] అలాకాని పక్షంలో ఆమెను ఇంటిలోనే వేరుగా ఉంచి మత కర్మలకు, హక్కులకు, సదుపాయాలకు దూరంగా ఉంచాలి.[11] (మితాక్షర యాజ్ఞవల్క్య స్మృతిపై భాష్యం I - 72). నెలసరి ముట్టు అయిన తరువాత మరల ఆమె వ్యభిచరించక పోతే తప్పుచేసిన భార్యను భర్త స్వీకరించాలి.[12] (వేదవ్యాస స్మృతి II - 49-50)

క్రీ. శ. 11 వ శతాబ్దం తరువాత స్త్రీల ఈ తప్పిదాలను కఠినంగా చూడసాగింది సమాజం పై సూత్రాలను కాదనలేక అవి అన్నీ మానసిక వ్యభిచారానికి మాత్రమే వర్తిస్తాయని యాజ్ఞవల్క్య స్మృతిపై భాష్యం

(అపరార్క) చెప్పింది.[13] (అపరార్క - యాజ్ఞ. స్మృ I - 72). పరాశర స్మృతిపై వ్యాఖ్య వ్రాసిన మాధవాచార్యులు ఉదారవైఖరి అవలంబించమని వాదించాడు. (పరాశర స్మృతి V - 2).[14] కులం కాని వానితో వ్యభిచరించిన స్త్రీ సంతానాన్ని కంటే బహిష్టతో పవిత్రురాలవుతుంది. తరువాత భార్యగా ఆమెను స్వీకరించవచ్చును. పిల్లను ఎవరికైనా ఇచ్చివేయాలి.[15] (అత్రి), దేవలుడు చెప్పినమాటలివి. · అత్రి స్మృతికర్త. దేవలుడు ధర్మశాస్త్ర విదుడు. స్మృతికర్త) చెరచబడ్డ స్త్రీ బహిష్టు అయినతర్వాత ఆమె పరిశుద్ధ అవుతుందని అత్రి ప్రకటించాడు.[16] (అత్రి 197-198). మ్లేచ్ఛులచేత చెరచబడిన స్త్రీ గర్భం ధరిస్తే ఆమెను ఎలా పరిశుద్ధను చేయాలో చెప్పాడు.[17] వాస్తవానికి ఈ చివరి రెండు వాక్యాలు చెరచబడిన స్త్రీకి సంబంధించినవి; జారిణికి సంబంధించినవి కావు. ఆమె ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా ఘోరం జరిగిపోతుంది ఈ సందర్భాలలో. అత్రి, దేవలుడు ఉదారవాదులని రుజువు చేయటానికి వీటిని ఇచ్చట ఉటంకించడం జరుగుతున్నది. (వీరివైఖరి 1947 లో దేశవిభజన సందర్భంగా మహాత్మాగాంధి అవలంబించిన వైఖరిని స్ఫురణకు తెస్తున్నది).

"బలవంతాన ఎత్తుకొని పోబడిన స్త్రీలు ఏ నేరమూ చేయలేదు. వారికి అప్రతిష్టలేదు. అటువంటి వారిని ఇంటిలోకి హృదయపూర్వకంగా ఆహ్వానించి వారిపై ప్రేమాభిమానాలు చిందించి వారికి వివాహం చేయాలి."[18] శత్రువులు ఎత్తుకొని వెళ్ళిన స్త్రీలను హిందూ సమాజం తనలో చేర్చుకోలేదు. వారిని వెలివేసింది.

జారత్వానికి సంబంధించిన సూత్రాలను కానే పండితుడు వరుసగా వ్రాశాడు :-

1) వ్యభిచరించినంతమాత్రాన భార్యను వదలిచేయటానికి లేదు.

2) వ్యభిచారం ఉపపాతకం (చిన్నపాపం)

3) ప్రాయశ్చిత్తం చేసుకున్న వ్యభిచార స్త్రీని భర్త భార్యగా స్వీకరించవలెను.

4) ఆమె పశ్చాత్తాపం వెలిబుచ్చి ప్రాయశ్చిత్తం చేసుకోనంతకాలం ఆమెకు చాలీ చాలని తిండిని భర్త పెట్టాలి.

5) శూద్రునితో వ్యభిచరించిన స్త్రీ, సంతానాన్ని కనినచో లేక గర్భస్రావము చేసుకున్నచో, లేక భర్తను చంపపోయినచో అది మహా పాతకం. ఆమె ప్రాయశ్చిత్తం చేసుకున్నప్పటికి ఆమెకు చాలీ చాలని తిండి పెట్టి ఇంటివద్ద గుడిశలో ఉంచాలి. (మను. XI-177)

6) సంతానం కనకుండా, గర్భస్రావం చేసుకొనక, నెలసరి బహిష్టు అయి ప్రాయశ్చిత్తం చేసుకొనని భార్యలకు చాలీ చాలని తిండి, మనవర్తి ఇవ్వాలి.

7) సంతానం కని లేక గర్భస్రావం చేసుకొనిన వ్యభిచార స్త్రీ ప్రాయశ్చిత్తాన్ని నిరాకరిస్తే, మనవర్తిగాని, నివాసయోగ్యతగాని ఆమెకు ఇవ్వనక్కరలేదు.[19]

యుద్ధంలో గెలిచిన స్త్రీలను సైనికులకు ఇవ్వవచ్చును. (మనువు. VII - 70)[20] వారిని ఆ సైనికుడు భార్యలుగా స్వీకరిస్తాడో, ఉంపుడు గత్తెలుగా స్వీకరిస్తాడో తెలియదు. అతనిని అభిశంసించటం లేదు. క్రీ. పూ. 600 కాలంలో ఆపస్తంభుడు భార్యయెడల అపచారం చేసిన (వ్యభిచారం వల్ల) పురుషుని గాడిద చర్మం కప్పుకొని ఆరునెలలు భిక్షాటన చేయమన్నాడు.[21] కాని వీటిని పురుషులు ఖాతరు చేయలేదు. ఉంపుడు కత్తెలను తమ ఇళ్ళల్లో ఉంచుకున్నారు. అమెను 'అవరుద్ధా' అని పిలిచేవారు. ఆమె అవరుద్ధ స్త్రీ. యజమాని ఇతర కుటుంబీకులతో కలసి కాపురం ఉండేది. ఈమెకు మనవర్తి ఇవ్వాలని నారదుడు, కాత్యాయనుడు చెప్పారు. ఇంట్లోగాక వేరుగా ఉంచుకున్న ఉంపుడుగత్తె పేరు 'భూజిస్వా'. వీరిని గురించిన ప్రసక్తి మహాభారతం కర్ణపర్వం 94-26, యాజ్ఞవల్క్యస్మృతి II. 290 వీటిలో ఉన్నది. ఇదంతా పురుషుల జారత్వం క్రింద వస్తుంది. కాని పురుషుల జారత్వానికి పట్టింపు లేదు; శిక్షలేదు.

నాట్యకత్తెలు :-

వేదకాలంలో కూడ నాట్యకత్తెలు ఉండేవారు. నృత్యం వృత్తిగా స్వీకరించిన వారు రాజాస్థానంలో కూడ నృత్యం చేసేవారు. ఆచ్ఛాదన లేని

వక్ష స్థలంతో వారు నాట్యం చేసేవారు. (ఋగ్వే I - 92-4) పాటతో పదం కలపటాన్ని 'పేృఖుఖం' అనేవారు.

బౌద్ధం నుండి, జైనం నుండి ప్రజల దృష్టిని మరల్చటానికి హిందు వులు నానాపాట్లు పడ్డారు. పురాణాలు వ్రాయించారు. దేవాలయాలు పెట్టించారు. దేవుళ్ళ ఉత్సవాలు రక్తి కట్టాలని దేవాలయాలలో నాట్యాలు చేయించారు. క్రొత్త దేవుళ్ళను సృష్టి చేశారు. దేవతల కొరకని విందులు, వినోదాలు ఏర్పాటు చేశారు. దేవుళ్ళకు భోగాలు అవసరమయ్యాయి. అందుకు ఆట, పాట కావాల్సిన అవరసం వచ్చింది. దాంతో దేవదాసీలు పుట్టారు. అర్థశాస్త్రంలో వేశ్యలసంగతి ఉన్నది కాని దేవదాసీల ప్రసక్తి కానరాదు. తీర్థస్థలా లలో యాత్రికులను అలరింపచేసేవారు ఈ దేవదాసీలు. వీరు ఇతోధిక సంఖ్యలో ఉండేవారు. వీరు తమ వృత్తిని కొనసాగించటానికి వీరికి మడులు, మాన్యాలు ఇవ్వబడినాయి. మహమ్మదు గజనీ దండయాత్రనాటికి సోమనాధ దేవాలయాన్ని కనిపెట్టుకొని 500 మంది దేవదాసీలు ఉండేవారట. సూర్యదేవాలయాలు శృంగా రానికి పట్టం కట్టాయి. వాటికి ఆడపిల్లలను దేవదాసీలుగాఇస్తే సూర్యలోక ప్రాప్తి జరుగుతుందని భవిష్యత్ పురాణంచెప్తున్నది. దేవాలయాలలో నృత్యానికి సనాతన బ్రాహ్మణులు అభ్యంతర పెట్టారు. మొదట్లో రాజులు సంకోచించారు. ధైర్యం తెచ్చుకొని దేవదాసీపద్ధతిని కొనసాగించారు. దేవదాసీ పద్ధతి వల్ల వేశ్యావత్తి పెరిగింది. చాలమంది దేవదాసీలు అధిక వరుమానం కోసం వేశ్యా వృత్తిని స్వీకరించారు. కాని పాశ్చాత్య దేశాలలో లాగ దేవాలయాలలో వ్యభిచారం సాగించినట్లు దాఖలాలు లేవు. దేవదాసీ పద్ధతిని మాన్పించ టానికి ఉద్యమంగా కదిలి శాసనం తెచ్చి విజయం పొందారు.

స్త్రీలు : వేశ్యలు

వేశ్యా వృత్తిని పురాతనమైన వృత్తిగా వర్ణిస్తారు అన్ని దేశాలలో. స్త్రీలను దుర్మార్గంగా వాడు కోవడం విషయంలో దీనిని మించినది లేదు. ఇదంతా సంఘటిత రూపం తాలుస్తున్నది. అన్ని వ్యాపారాల లాగా దీనికి హంగులూ, మందీ, మార్బలమూ ఏర్పడినయి. పురుష ప్రపంచం ఈ వ్యవస్థను సహిస్తున్నది. కొంతమంది పురుషులు దీనిని పోషిస్తుంటే మరికొందరు ఇతర కారణాల పేరుతో చూచీ చూడనట్లు ఊరుకుంటున్నారు. ఈ దేహ వ్యాపా

రంలో స్త్రీ కేవలం 'సెక్సు సింబల్' గా మిగిలిపోతున్నది. ఆమె నికాల్సొయిన భోగ్య వస్తువు. ఆకలి వేసిన నాడు ఫలహారం తినడానికి హోటలుకు వెళ్ళినట్లు పురుషుడు అలాంటి స్త్రీ వద్దకు వెళ్ళి తన కామాన్ని తీర్చుకుంటున్నాడు. పడుపువృత్తికి ఉనికి కల్పించింది మన సమాజం. సమాజం ఆరోగ్య వంతంగా సాగాలంటే ఈ వృత్తి 'అవసరమైన చెడు' అని వర్ణించి తృప్తిపడు తున్నది సమాజం. ఈ పరిస్థితిని మార్చటానికి ఎందరో మహానుభావులు, సంసర్తలు కృషి చేశారు. దీనిని నిరోధించటానికి అనేక శాసనాలు వచ్చాయి. అన్నింటినీ రద్దుచేసి 1956 లో- స్త్రీలు, బాలికలు వీరి పరంగా అవినీతికర వ్యాపారాన్ని చేయడం, ప్రోద్బలం చేయడం, పడుపుగృహాలు నడపడం నేరాలుగా చేసే కేంద్ర శాసనం వచ్చింది. దీనిని 'Sita' అని పిలుస్తా వుంటారు. అవినీతి వ్యాపార నిరోధశాసనం వల్ల స్త్రీలకు శిక్షలు పడుతున్నాయి· కాని పడుపు వృత్తిని అవలంబించే స్త్రీలను ఆదరిస్తున్న పురుషులు తప్పించు కొని తిరుగుతున్నారు. మాయనిమచ్చకు దూరమైపోతున్నారు. ఈ పడుపు వృత్తికి కారణాలను ఆరురకాలుగా వర్గీకరణ చేయడం జరిగింది అవి—

1) కుటుంబంలో తండ్రి, తల్లి, భర్త సంరక్షకుడు, లేక బందువులు లేకపోవటం. (సహజకారణాలు)

2) బీదరికం, గాలికి వదలి వేయబడటం. (ఆర్థికం)

3) తల్లిదండ్రులచేత, భర్త చేత, బంధువుల చేత బాధింపబడి ఇల్లువెడలి, పొట్టగడవక ఈ వృత్తిని చేపట్టటం. (కుటుంబపరం)

4) స్త్రీని బలవంతతగా ఎత్తుకొని పోవడం, మాయమాటలు చెప్పి ఇంటినుండి వెలుపలికి తేవడం, దుష్ట సహవాసం, ప్రేమించినట్లు ఆమెను భ్రష్టుచేసి వదిలివేయటం లాంటివి. (సామాజికం)

5) అక్రమంగా గర్భం రావడం తద్వారా సాంఘిక వెలికి లోనవటం, అతి కామ భావనలాంటివి. (శారీరకం)

6) అజ్ఞానం, భోగ లాలస, నైతిక విలువలు లేకపోవడం వగైరా. (మానసికం).

ఈ వృత్తిని అనుసరించేవారు రెండురకాలు వంశపారంపర్యంగా దీనిని సాగించేవారు, లేక పైన చెప్పిన కారణాలవలన వృత్తిలోకి వచ్చినవారు22

వంశ పారంపర్యంగా ఈ వృత్తిని సాగించిన కులాలు పూర్వం తెలుగునాట, ఇతర భాషాప్రాంతాలలో ఉండేవి. సంస్కర్తల అమోఘ కృషివల్ల ఆ స్థితి చాలవరకు మారింది. పడుపు వృత్తిని సాగించే కులాలంటూ ఇంచుమించుగా ఈనాడు లేకుండా పోయినయి, 'ఎల్లమ్మ' అనే దేవతకు పూజారిణులుగా కొల్హాపూర్ ప్రాంతంలో ఏటా వందలమంది ఈ వృత్తిలోకి కులాచారంగా దిగుతున్నారని పత్రికలలో వార్తలు వచ్చాయి. పెట్టుబడిదారీ సమాజ ఆవిర్భావంతో ఈ వృత్తి నూతన తొడుగులు దిద్దుకుంటోంది.

మనం ఆలోచించవలసిన విషయం హిందూ సమాజంలో ఈ పడుపు వృత్తి (పైకం కోసం లేక ప్రతిఫలం కోసం పురుషుడి కామతృష్ణ తీర్చడమే; ఇది జీవనోపాధికి మార్గం అయింది) ఎప్పటి నుండి ఉన్నది, ఎలా పరిణామం చెందింది, హిందూ సంస్కృతి దీనిని పెంచి పోషించిందా, లేక నిరోధించ ప్రయత్నించిందా అనేది మాత్రమే ఆలోచనీయాంశాలు. ఆచారంగా పడుపు వృత్తి చేసే స్త్రీలు ఒక కులంగా ఉన్నట్లు తేలింది కదా. ఇది ఏనాటి నుండి? అంటే వేదకాలంలోనూ వేశ్యలుండేవారు. ఇద్దరికి భోగ్యమయిన భార్యను 'సాధారిణి' అనేవారు.

బహు భర్తృత్వం వేదకాలంలో లేదని భావిస్తే, తత్సంబంధమైన రుక్కులకు ప్రకృతి పరంగా చెప్పుకుంటే, ఈ పదం ఎందుకు పుట్టినట్లు? నాట్యగత్తెలు వక్ష స్థలంమీద ఆచ్ఛాదన లేకుండా ఎందుకు నృత్యం చేసినట్లు? మరి సామాజిక జీవితంలో ఆర్య స్త్రీ తన వక్ష స్థలాన్ని కప్పుకొని తిరుగుతున్నట్లు దాఖలాలు ఉన్నాయికదా! అంటే కామోద్దీపనకోసం పురుషుల కామ తృష్ణ తీర్చడం కోసం కొంతమంది స్త్రీలున్నట్లు తెలుతున్నది. (చూడండి ఋగ్వే I - 167-4)

సమాజంలో వేశ్యలను చిన్నచూపు చూచేవారు. కాని లలిత కళలను అభ్యసించినవారుగా, సంగీత సాహిత్య విశారదలుగా, నాట్యగత్తెలుగా వారికి పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. క్రీ. పూ. 400 నుండి స్త్రీ యొక్క హోదా పూర్తిగా పడిపోవటంతో సంసారాలు చేసే స్త్రీలకు విద్యా వ్యాసంగం తగ్గింది. కళాపిపాసువులైన పురుషులు, సాహిత్యాభిలాషులు తమ భార్యల సాంగత్యాన్ని అభిలషించలేకపోయారు. భార్యల మానసికస్థాయి అత్యల్పంగా ఉండేది

కదా! అందుకని సమాజంలోని నాగరికులు గణికలను, నాట్యగత్తెలను అభిమానించడం సాగించారు. పోషించడం ప్రారంభించారు. ఉంపుడు గత్తె పద్ధతి అమలులోకి వచ్చింది. ఏ ఒక్కరి సొత్తో కాకుండా అందరికీ ప్రణయాన్ని, ఆనందాన్ని పంచి యిచ్చేవారు సంఖ్యలో పెరిగారు. వారిది వేశ్యవృత్తిగా రూఢి అయింది.

గౌతమ ధర్మసూత్రం XXII - 27) లో వేశ్యల ప్రసక్తి ఉన్నది. ధృతరాష్ట్రుని భార్య గాంధారి ప్రసవించినపుడు మంత్రసానిగా ఒక వేశ్య పనిచేసింది. (మహాభారత-ఆదిపర్వం 115-39) కౌరవుల వేశ్యలకు యుధి ష్ఠరుడు అభివాదం చేశాడట (మహాభారతం. ఉద్యోగపర్వం 30-38). వేశ్యలలో కూడ పురుషుడు 'ఎగువ' కులాల స్త్రీలతో పొందు పెట్టుకోరాదు. (నారదస్మృతి స్త్రీ. పుం. శ 78-79) మత్స్య పురాణం 70 వ అధ్యాయంలో వేశ్యాధర్మాన్ని వివరించింది. కామసూత్రం (I - 3.20 లో గణిక చతుష్షష్టి కళలలో నిష్ణాతురాలని వాత్స్యాయనుడు అభివర్ణించాడు. వేశ్య చేతి భోజనం బ్రాహ్మణులకు పనికిరాదన్నాడు మనువు. (మనువు IV - 209). వేశ్యలలో మోసకత్తెలకు శిక్షలను మనువు పేర్కొన్నాడు (మనువు IX - 259)[23].

అర్థశాస్త్రంలో వ్యభిచారాన్ని గురించి వ్రాశాడు కౌటిల్యుడు. ఆ కాలంలో గణికలకు ప్రాధాన్యం, నృత్యం చేసేవారికి ఆదరణ ఉండేవి. వ్యభిచారం శాసనసమ్మతం. వ్యభిచారిణుల ఆదాయంపై 15 శాతం పన్ను వేసేవారు రాజులు. కౌటిల్యునిది లౌకికదృష్టికదా! బౌద్ధులకాలంలో వ్యభిచారిణులను కూడా భిక్షుణీల సంఘాలలో చేర్చుకున్నారు. ఇది ప్రాచీన బౌద్ధ సారస్వతంలో గోచరిస్తుంది. వేశ్యావృత్తికి నిరసన లేదు. లచ్చవుల ఆహ్వానాన్ని కాదని 'అమ్రపాలి' అనే వేశ్య ఇంట ఆతిథ్యం స్వీకరించాడు బుద్ధుడు. వేశ్యావృత్తి ఉపయోగకరమైనదిగాను, అతిక్రమమైనదిగానుభావించారు.వారి ఉనికి పట్టణా లకు అలంకారంగా,గౌరవంగా భావించారు.బుద్ధుడుకూడా వేశ్యావృత్తినిఖండిస్తూ ఉపన్యసించలేదు. బుద్ధునిదృష్టిలో వ్యభిచారం దోషమే. చేపలను పట్టడం, పక్షు లను చంపడం తప్పే. అయినా ఆ వృత్తులను ఖండించలేదు. అదే వైఖరిని వేశ్యవృత్తి పట్ల బుద్ధుడు చేపట్టాడు. ఆ కాలపు సమాజపధిరిని బుద్ధుడంతటి వాడు ఈ విషయంలో దాటలేకపోయాడు. ఒక పురుషుని వద్ద మూడువేల

రూపాయలు తీసుకున్నది ఒక వేశ్య పణంగా అతడు పైకం ఇచ్చి ఆమె సాంగత్యానికి రాలేదు. ఆమె అతనికోసం మూడు సంవత్సరాలు వేచియుంది. ఈలోగా ఆమె బీదరికాన్ని కూడ అనుభవించవలసి వచ్చింది. ఇది వేశ్యయొక్క నీతి; వేశ్యా ధర్మపాలన. 'మిళిందపన్హా' లో 'బిందుమతి' అనే వేశ్య యొక్క ప్రభావ వర్ణితము. ఆమె గంగా ప్రవాహాన్ని వెనుకకు మళ్ళించిందట. కులాన్ని తృణీకరించటం వలన ఆమెకు ఆ శక్తి కలిగిందట. బౌద్ధుల ప్రాభవం క్రీ. పూ. 500 - క్రీ. త. 500 వరకు సాగిందనేది గుర్తుంచుకోవాలి.

జైనుల కాలంలో వేశ్యలకు ఆదరణ ఉండేది. రాజవేశ్యా సంగమం రాజద్రోహంతో సమానం. రాజవేశ్యతో లైంగిక సంబంధం ఘోరమైన నేరం. దానికి శిక్ష కాళ్ళు చేతులు నరకటం లేక బహిరంగంగా అవమాన కరంగా ఊరేగించి శిరచ్ఛేదం చేయడం. అంటే ప్రజలు రాజుగారి వేశ్యల వైపు కన్నెత్తి చూడరాదని. ఇతర వేశ్యలు సామాన్యలు. అందరికీ అందు బాటులో ఉంటారు. పౌరాణిక హైందవంలో దేవదాసీలు ఉద్భవిల్లారు. వారు వేశ్యలుగా రూపొందారు. వాత్స్యాయనుడు (క్రీ. త. 1, 2 శతాబ్దాలు) తొమ్మిది రకాల వేశ్యలను అభివర్ణించాడు. గణిక సాహచర్యం కోసం తహ తహ లాడే వారు నాగరికులు. వేశ్యలు వైభవాన్ని, సంపదను అనుభవించే వారు. సమాజంలో పేరు ప్రఖ్యాతులుండేవి. వసంతసేన 'మృచ్ఛకటకం' లోని వేశ్య. ఆమె రుజువర్తనానికి మెచ్చి సాధ్వులు ధరించే వసనాన్ని ఆమెకు బహూకరించాడు చారుదత్తుడనే శ్రోత్రియ బ్రాహ్మణుడు. అతని భార్య కూడా ఆమెను కౌగిలించుకొని ఆదరిస్తుంది.24

మూడవ శతాబ్దిలో ఉజ్జయనిలో మహాకాల దేవాలయంలో దేవదాసీలు ఉండేవారు. 'రాజతరంగణి' కాశ్మీరులో ఈ ఆచారం క్రీ. త. 7 వ శాతాబ్దంలో ఉన్నట్లు తెలియజేస్తున్నది. క్రీ. త. 10 వ శతాబ్దంలోని తంజాపూరు దేవాలయంలో 400 మంది దేవదాసీలకు మడిమాన్యాదులు ఇచ్చి కట్టడి చేశాడు ఆనాటి రాజు రాజరాజు. చివరకు కాశీ విశ్వనాధుని (దేవుడు) ముందుకూడా దేవదాసీలు నృత్యం చేసినట్లు ఆధారాలున్నాయి.25 దేవదాసీ చట్టం వల్ల నిరోధం వచ్చేవరకు (1929) ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో దేవదాసీలు దేవుళ్ళ యెదుట నాట్యం చేసేవారు. ఆనాడు ఆంధ్రప్రాంతం ఉమ్మడి

మదరాసు రాష్ట్రంలోనే ఉండేది. దేవదాసీలు అవివాహితలు. దేవాలయం వారు ఇచ్చిన మడిమాన్యాల ఆదాయం చాలక వారు వేశ్య వృత్తిని జీవనోపాధి కోసం స్వీకరించారు. అలా దేవదాసీ వృత్తికి, వేశ్యావృత్తికి అవినాభావ సంబంధం ఏర్పడింది. దేవదాసీల సముద్ధరణకోసం చేసే ప్రయత్నంలో భాగంగా దేవునిముందు ఆడటం, పాడటం మాన్పించారు. కాని ఆస్తులు వారికే ఉన్నాయి. దాంతో దేవదాసీ వృత్తికి పునాది పోయింది. ఆ కులపు వారు తలిమ్మా అన్ని కులాల వారిలాగానే పెండ్లిండ్లు చేసుకొని సుఖ,శాంతులతో సంసారాలు చేస్తున్నారు. సమాన హోదాతో సమాజంలో జీవిస్తున్నారు ఈనాడు. ఇదంతా శాసన ప్రభావం. సంస్కరణ ఫలితం. అంతేకాని పురాతన హైందవం ప్రభావం కాదు.

మరో విషయం ప్రస్తావించక తప్పదు. ప్రబంధాలలో కొన్ని వర్ణనలు విధిగా ఉండాలట. సూర్యోదయ వర్ణన మొదలైనవే గాక పురవర్ణన కూడా వాటిలో చోటుచేసుకునేది. పురవర్ణనలో నాలుగువర్ణాల వారినే కాక వేశ్యలను కూడ వర్ణించేవారు. ఇది క్రి. శ. 1900 వరకు సాగింది. వేశ్యలపై ఎంత గౌరవమో గమనించండి. వేశ్యలు నగరాలకు అందచందాలను సమకూర్చే వారని భావం వుండనే వుందికదా;

ఇలా హైందవం వేశ్యావృత్తికి ఉనికి కల్పించి, పెంచి, పోషించి దానిని శాస్త్రసమ్మతం చేసింది. కనుకనే మహాత్మాగాంధి ఇలా అనాల్సివచ్చింది. అబలలని పేర్కొని స్త్రీలలో కొందరికి వేశ్యా వృత్తిని అంటగట్టి, శాసనాలు తయారుచేసి ధర్మాలు ప్రవచించిన పురుషుడు తాను చేసిన పాపానికి శిక్ష అనుభవించక తప్పదు."26 ఇవి హిందూమతాభిమాని మహాత్మాగాంధి మాటలు.

భారతదేశంలో వేశ్యావృత్తి సాగినంతకాలం హైందవం ఈ విషయంలో తన వంతు దుర్మార్గానికి బాధ్యత వహించక తప్పదు.

అధ్యాయం 7

పాదదీపికలు

1. హిందూ నాగరికతలో భారత స్త్రీల స్థానం :
   డా॥ ఎ. ఎస్. ఆల్టేకర్. పుట 109
2. శతపథ బ్రాహ్మణం II - 5, 2, 20-ఆల్టేకరు. పుట 313
3. హిందూ ధర్మ శాస్త్రాల చరిత్ర : కానే 2 వ సంపుటం
   ఒకటవ భాగం, పుట 571
4. డిటో డిటో
5. నారదస్మృతి - డిటో - పుట 572
6. డిటో - పుట 572
7. ఆల్టేకర్. పుట 313
8. డిటో పుట 313
9. డిటో పుట 313
10. డిటో పుట 313
11. డిటో పుట 313
12. కానే - పుట 572
13. ఆల్టేకర్. పుట 313
14. డిటో పుట 314
15. కానే పుట 575
16. డిటో డిటో
17. డిటో డిటో

18. మహాత్మాగాంధి-హరిజన పత్రిక తే 3-11--46
స్త్రీలు అనే పుస్తకంలో
(Women by M. K. Gandhi-page 100 Novjivan Publishing House, Ahmedabad)14 (1964)

19. ధర్మశాస్త్రాల చరిత్ర - కానే. పుటలు 572, 573

20. ఆల్టేకరు : పుట 314

21 డిటో - పుట 312

22. 'సమానత్వంవైపు' స్టేటస్ కమిటీ రిపోర్టు.
Repot on the status of women in India (1974)

23. కానే ధర్మశాస్త్రాల చరిత్ర 2 వ సంపుటం
1 వ భాగం పుట - 637

24. యుగ యుగాలలో భారతస్త్రీలు : థామస్.

25 ఆల్టేకరు : పుట 183

26. స్త్రీలు : మహాత్మాగాంధి - పుట 106

అధ్యాయం

8 ఆస్తిహక్కు

ఇంతవరకు స్త్రీ జీవితంలో హిందూ భావన ప్రకారం ముఖ్యమైనదిగా ఎంచబడిన వివాహాన్ని గురించి, వైవాహిక జీవితాన్ని గురించి వివరించడం జరిగింది. ఇపుడు స్త్రీకి ఆస్తిలో గల హక్కులను గురించి విశదీకరించుకోవటం అవసరం. హిందూ సంప్రదాయం స్త్రీని ఎలా పరిగణించిందీ—అంటే వస్తుతుల్యంగానా, బానిసజీవిగానా, లేక ద్వితీయస్థాయి మనిషి గానా—మనకు ఆస్తి తాలూకు హక్కులవల్ల కూడా తెలుస్తుంది. ఈనాడు వారసత్వాన్ని నిర్ధారిస్తూ 1955 సం॥ పు హిందూ వారసత్వ చట్టం అమలులో ఉన్నది. ఈ శాసనానికి పూర్వం హిందూ సంప్రదాయ సూత్రాలను మారుస్తూ 1928లో హిందూ వారసత్వ అనర్హతల తొలగింపు శాసనము, 1929 లో వారసత్వ సవరణ శాసనము, 1930 లో విద్యాలాభం వల్ల ఆర్జన చట్టం, ఆస్తికి హిందూ స్త్రీల హక్కుల శాసనం (1937), వచ్చాయి. 1955 సంవత్సరపు శాసనం రాగానే 1929 వారసత్వ సవరణ శాసనం, 1937 హిందూ స్త్రీల హక్కుల శాసనమూ రద్దయినాయి. 1955 సం॥ పు శాసనం సమగ్రము కనుక అలా చేయవలసి వచ్చింది. 1955 సం॥ శాసనం తెచ్చిన ముఖ్యమైన మార్పులను గురించి తదుపరి వచ్చే అధ్యాయంలో వివరింపబడుతుంది. ఈ విషయమంతా ఇక్కడ ప్రస్తావించడంలో అర్థం ఏమంటే శాసనాలద్వారా మార్పులు జరుగకముందు ఆస్తి విషయంగా హిందూ సమాజం ఎలాంటి హక్కులను స్త్రీకి ప్రసాదించిందో ముమ్ముందుగా తెలుసుకోవలసిన అగత్య మున్నదని చెప్పడానికే ఆస్తియందు స్త్రీకి హక్కు అనేక విధములుగా కలుగ వచ్చును. ఆమె స్వాధీనంలో ఉండే ఆస్తి :-

1. స్త్రీ ధనంగా పరిగణింపబడేది.
2. స్త్రీ ధనపు ఆస్తి వృద్ధివల్ల వచ్చేది.
3. వారసత్వం వల్ల సంక్రమించేది.

4. భర్త, కుమారులు భాగ పంపిణీ చేసుకున్నపుడు ఆమెకు ఇవ్వబడేది.

5. ఆమె స్వశక్తివల్ల సంపాదించుకున్నది.

6. భరణంగా వచ్చినది.

7. ఇతరుల ఆస్తిని వారి హక్కులకు భంగంగా అవిచ్ఛిన్నంగా ఆమె అనుభవించినందువల్ల హక్కు కలిగినది. (Adverse Possession)

8. ఇతరమైనది.

ఈ సూత్రాన్ని మనస్సులో ఉంచుకొని స్త్రీకి సర్వహక్కులు కల ఆస్తిని గురించి విచారిద్దాం.

స్త్రీ ధనం :- వేదకాలంలో వివాహమపుడు పిల్లకు లోపమున్నపుడు ఆమెకు కొంత ఆస్తిని తండ్రి ఇచ్చేవాడు. మామూలుగా ఆభరణాలు, వస్త్రాలు, నిత్యావసర సామాగ్రి (మంచం, పెట్టె లాంటివి) ఇవ్వడం కద్దు. దీనిని కట్నమనేవారు. ఇది ఆడపిల్లలకు కట్నం. ఇది వధువుయొక్క ఆస్తి. దీనియందు ఆమెకు సంపూర్ణ హక్కులుండేవి. దీనిని 'స్త్రీ ధనం' అని పిలవడం జరిగేది. స్త్రీ ధనాన్ని ఆమె బ్రాహ్మణులకు దక్షిణగా ఇవ్వ వచ్చును. మామూలుగా ఆమెకు ఆస్తి ఉండేది కాదు. వారసత్వంలేదు.[1]

స్మృతులు వ్రాసిన ఋషులు పనపై మందిదాకా ఉన్నారు. కాగా స్త్రీ ధనాన్ని గురించి వ్రాసినవారిలో భాష్యకారులు ఎనిమిదిమందిని మాత్రమే పేర్కొన్నారు. 1) మనువు 2) నారదుడు 3) విష్ణువు 4) కాత్యాయనుడు 5) ఆపస్తంభుడు 6) వ్యాసుడు 7) దేవలుడు 8) యాజ్ఞవల్క్యుడు.

మనువు ప్రకారం స్త్రీ ధనం అంటే :-

1) పెండ్లికాలమందు ఇవ్వబడినది; అధ్యాగ్ని [అగ్నిముందు ఇవ్వబడినది]

2) వరుని ఇంటికి పోవునపుడు ఇవ్వబడినది [అధ్యావాహనిక]

3) ప్రేమ పురస్సరంగా ఇవ్వబడినది. అత్తమామలు ఇచ్చేది 'ప్రీతి దత్తం'. పెద్దల పాదాలకు నమస్కరిస్తే వారుఇచ్చేది పాదవందనిక.

4) తండ్రి ఇచ్చే కానుకలు

5) తల్లి ఇచ్చే కానుకలు

6) సోదరుడు ఇచ్చే కానుకలు

విష్ణుధర్మసూత్రం మరో నాల్గింటిని కలిపింది.

1) భర్త మరో స్త్రీని భార్యగా తెచ్చుకొన్నప్పుడు మొదటిభార్యకు భర్త చెల్లించునది [అధివేదనిక]

2) వివాహ మయిన తదుపరి భర్త బంధుగులచేత. తల్లిదండ్రుల బంధుగులచేత ఇవ్వబడిన కానుకలు [అన్వాధేయక]

3) శుల్కము

4) కుమారులు తదితర బంధువులు ఇచ్చేవి.

కాత్యాయనుడి అభిప్రాయం ప్రకారం వైవాహిక దశలో స్త్రీ తన నైపుణ్యంచేత (వస్త్రములు నేయుట ఇత్యాది పనులు) సంపాదించినది, ఇతరులు ఆమెకు కానుకగా ఇచ్చినది, ఆమె భర్త ఆధీనములో ఉండును. అయితే వివాహంలోను, వరుని ఇంటికి ఊరేగింపుకు పోయేటప్పుడు, ఇతరులు ఇచ్చిన కానుకలు ఆమెవే. స్త్రీ యొక్క ఆభరణాలు ఆమె స్త్రీ ధనమని చెప్పటంతో ఎవరికీ అభిప్రాయభేదం లేదు. యాజ్ఞవల్క్యుడు ఇలా చెప్పాడు. తల్లి, తండ్రి, భర్త, సోదరుడు ఇచ్చినవి, పెళ్ళినాడు అగ్నిముందు కూర్చున్న పుడు వచ్చిన కానుకలు, భర్త మరో పెండ్లి చేసుకున్నపుడు (ఆమెకు ఉప శమనంగా) ఇచ్చినది, ఇంకా తదితరాలు స్త్రీ ధనమనబడును. 'ధనం' అంటే ఆస్తి అని అర్థం. యాజ్ఞవల్క్య స్మృతికి మితాక్షర భాష్యం వచ్చింది. దానికి నాలుగు వ్యాఖ్యానాలు వచ్చినయి. ఆ నాలుగు కాశీ, మిధిల, బొంబాయి, మదరాసు శాఖలుగా పేరెన్నిక పొందాయి. విజ్ఞానేశ్వరుని మితాక్షర ప్రకారం స్త్రీ ధనం అంటే తల్లి, తండ్రి, సోదరుడు, భర్త వీరు ఇచ్చిన ఆస్తి, పెండ్లి నాడు హోమం ముందు మేనమామ మొదలైన వారు ఇచ్చిన కానుకలు, భర్త మరో స్త్రీని వివాహం చేసుకున్నపుడు మొదటిభార్యకు ఇచ్చునది, తదితరాలు.

తదితరాలు అంటే 1) వారసత్వం 2) కొనుగోలు 3) భాగపంపిణీ 4) ఇతరుల ఆస్తియందు ప్రత్యేక పరిస్థితుల్లో హక్కు రావడం (Adverse Possession) 5) దొరకుట, వీటివల్ల వచ్చిన ఆస్తి. అంటే స్త్రీకి చెందిన ఆస్తి అంతా స్త్రీ ధనమే. నాలుగు ప్రాంతాలకు చెందిన నాలుగు శాఖల వారి శాస్త్రము పలుతెరగుల వ్యాఖ్యానాలు చేశాయి. వాటికి బ్రిటిషు న్యాయ స్థానాలు అర్థాలు చెప్పి అన్వయాలు చేసాయి. వాటిని గురించి మనం లోతుకు దిగవలసిన పనిలేదు. కాగా కొన్ని పదాలను వాటి వెనుకనున్న భావాలను తరచి చూడవలసిన అవసరం చాలా వున్నది.

శుల్కం :- ఈ పదానికి అనేకమంది శాస్త్ర రచయితలు పలు రకాలుగా అర్థం చెప్పారు. వీటి నిర్వచనాన్ని బట్టి అది శిసలైన స్త్రీ ధనమా (Technical or Proper) కాదా అనేది తేలుతుంది. దానిని బట్టి దాని వారసత్వం నిర్ణయమవుతుంది. కనుక ఈ రకమైన చర్చ కేవలం పాండిత్య ప్రకర్షకు సంబంధించినది కాదు.

వారసత్వాన్ని దృష్టిలో పెట్టుకొని మితాక్షర స్త్రీ ధనాన్ని రెండు రకాలుగా నిర్ణయించింది. I) శుల్కం : పిల్లను ఇచ్చినందుకు వరుడు లేక వరుని వైపువారు ఇచ్చునది. II) తదితరం.

శుల్కం సోదరునికి లేక తల్లికి లేక తండ్రికి లేక తండ్రి వారసులకు పోతుంది.

తతిమ్మాది అవివాహిత కుమార్తెలకు లేక ఆస్తిలేని వివాహిత కుమార్తెలకు లేక ఆస్తి ఉన్న కుమార్తెలకు వగైరాలకు వారసత్వరూపేణా సంక్రమిస్తుంది.

బొంబాయి ప్రాంతంలో అమలులో ఉండే 'వ్యవహార మయూఖ' ప్రకారం గృహపరికరణాలు, పాడిపశువులు, అరకపశువులు, ఆభరణాలు వీటికి బదులుగా ఇచ్చినవి. పెండ్లి అయి పుట్టింటి నుంచి పుట్టింటి ఆస్తిలో వాటా లేకుండా ఆడపిల్ల అత్తింటికి వెళ్తున్నందుకు ప్రతిఫలమన్నమాట. దక్షిణాదిన ప్రాచుర్యం కలిగిన 'స్మృతి చంద్రిక' ప్రకారం కూడా అదే నిర్వచనం. మిథిల ప్రాంతంలో జనాదరణ పొందిన 'వివాద చింతామణి'

ప్రకటించిన విధమున అధార్మ్య వివాహాలలో (అసుర, గంధర్వ, రాక్షస, పైశాచికములు) పెండ్లి సమయంలో వధువు వరునినుండి తీసుకునే ఆస్తి శుల్కం అనబడును. బెంగాలులో ఆచరణయోగ్యంగా భావించబడిన దాయభాగశాఖాసిద్ధాంతం ప్రకారం "భర్త గృహానికి రావడానికి వధువును ప్రోత్సాహ కారణంగా ఇవ్వబడిన ఆస్తి" శుల్కమని పిలిచేవారు. పెండ్లి సమయంలో భర్తతో కలసి వధువు ఒకే పీటమీద కూర్చున్నపుడు (యుత కలసి కూర్చున్నపుడు) ఆమెకు ఇవ్వబడిన కానుకలు 'యౌతక' అని పేర్కొనబడెను. భర్త చేత ఇవ్వబడిన, లేక తన తదనంతరం చెందజేసిన ఆస్తి 'భర్తృదత్తం' అని పిలిచేది. ఆమె బంధువులచేత లేక ఆమె భర్త బంధువులచేత వివాహమయిన తదుపరి ఇవ్వబడిన ఆస్తి, చెందజేయబడిన ఆస్తి దీనికిందకే వస్తాయి.

దక్షిణాదిన ప్రచారంలో ఉన్న స్మృతి చంద్రిక శిసక్తైన స్త్రీ ధనాన్నే గుర్తించి వారసత్వ క్రమం నిర్ణయించే నిమిత్తం దానిని నాలుగు రకాలుగా విభజించింది. 1) శుల్కం 2) యౌతకం 3) భర్తృ దత్తం మరియు అన్వధేయకం 4) తదితరం.

శుల్కం యొక్క స్వభావాన్ని గురించి భేదాభిప్రాయాలున్నా దాని వారసత్వం గురించి నాలుగు శాఖలలో ఏకాభిప్రాయం ఉన్నది.

స్త్రీ ధనం ఇన్నిరకాలుగా ఉంది కదా వీటి అన్నింటి పైనా ఆమెకు సర్వాధికారాలు ఉన్నాయా? అనేది మరో ఆసక్తికరమైన విషయం. అలా లేదు. ఆమె జీవిత దశలను బట్టి, ఆ స్త్రీ ధనపు ఆస్తి స్వభావాన్ని బట్టి వేరు వేరుగా నిర్ణయాలు చేయబడినాయి. కన్యగా ఉన్నపుడు ఆమె స్త్రీ ధనపు ఆస్తిపై ఆమెకు సర్వాధికారాలు ఉండేవి. అలాగే ఆమె విధవ అయినచో అన్నిరకాల స్త్రీ ధనంపై ఆమెకు సంపూర్ణాధికారం ఉండేది. ఇక పోతే ఆమె వివాహితగా ఉన్నపుడు మాత్రం కొంత తేడా కన్పడుతున్నది. ఆ పరిస్థితిలో రెండు రకాలుగా స్త్రీ ధనాన్ని వర్గీకరణ చేశారు. 1) సౌదాయక స్త్రీ ధనం :- ప్రేమ పురస్సరంగా ఇచ్చిన కానుక. వివాహానికి పూర్వం కాని, వివాహ సమయంలో కాని, వివాహం తరువాతగాని ఆమె తల్లిదండ్రులు వారి బంధువులు, భర్త, ఆతని బంధువులు ఇచ్చిన కానుకలు; అంటే ఇతరులు

ఇచ్చిన కానుకలు గాక బంధువులు ఇచ్చిన కానుకలు. అలాగే బంధువులు తమ తదనంతరం చెందజేసిన ఆస్తులు కూడా సౌదాయక స్త్రీ ధనం క్రిందికి వస్తాయే. సౌదాయక స్త్రీ ధనాన్ని తన భర్త ఆదుపాజ్ఞలో నిమిత్తం లేకుండా స్త్రీ తన ఇష్టం వచ్చినట్లు వాడుకోవచ్చును; విక్రయించవచ్చును; అన్యాక్రాంతం చేయవచ్చును. కాగా కరువు, వ్యాధిగ్రస్తత, కారాగారవాసం లాంటి ఆపదలు సంభవించినపుడు భర్త ఆ ఆస్తిని తీసుకోవచ్చును. సౌదాయక స్త్రీ ధనం కాక తదితర స్త్రీ ధనంను - అంటే ఆమె వివాహితగా ఉన్నపుడు శ్రమచేసి సంపాదించినది, ఇతరులచేత ఇవ్వబడిన కానుకలు, వగైరా....ఆమె భర్త అనుమతి లేకుండా ఆమె అన్యాక్రాంతం చేయరాదు. కష్టాలు, ఆపదలు వీటితో నిమిత్తం లేకుండా భర్త ఈ రకపు ఆస్తిని తన ఇష్టం వచ్చినట్లు వాడవచ్చును.

హిందూ వివాహం స్త్రీ పురుషుల శారీరక, మానసిక తాదాత్మ్యానికి సాధనమని భావిస్తే స్త్రీ పురుషులిరువురు కలసి ఒకటే. అపుడు వారి మధ్య 'నీ ఆస్తి అది, నా ఆస్తి ఇది' అనే తేడా భావం ఉండటానికి అవకాశం లేదు. అలాగని అసౌదాయక (Non - Sowdavaka) స్త్రీ ధనంపై భర్త అదుపు, ఆజ్ఞలే గాక సర్వహక్కులను ఎలా ఆమోదించగలం ఎలా సమర్ధించగలం. భర్త బ్రతికి ఉండగా ఏ విధమైన ఆస్తిపై హక్కులు లేకున్న [తన సంపాదన మీద, తన జీతంమీద, తనకు వారసత్వంగా వచ్చిన ఆస్తి మీద, తనకు బంధువులు, సన్నిహితులు కానుకగా ఇచ్చిన దానిమీద] పాశ్చాత్యవనిత స్థితి కన్న భారత మహిళస్థితి - ఆనాడు - మెరుగే కదాయని ప్రశ్నించవచ్చును. నిజమే పాశ్చాత్యవనితకు వేరే అస్తిత్వం ఉండేది కాదు. పెళ్ళించి స్త్రీల వేతనాలు భర్తలు వసూలు చేసుకునేవారట. (ప్రత్యేకంగా లేక విడిగా ఆస్తి కలిగియుండటానికి వారు 1907 లో ఆందోళన జరిపి వేతనాలమీద తమ హక్కులను సంపాదించుకున్నారు.) కనుక భారతీయ మహిళలకు ఈ ధనపు హక్కు - కొద్దిపాటి పరిమితులు విధించబడినా - ధర్మశాస్త్ర కారులు కొంతహక్కు ఇవ్వడమే విశేషం అని పేర్కొనవచ్చు. అర్ధశాస్త్రం లోను, మనుస్మృతిలోను 'స్త్రీ ధనం' పరంగా వైఖరిలో వచ్చిన మార్పును గమనించటానికి రెంటిని తరచి చూడటం మంచిది.

అర్థశాస్త్ర కాలం [క్రీ. పూ. 4, 3 శతాబ్దాలు]

ఆస్తిహక్కు నిర్ణీత లక్ష్యంతో నిర్దేశింపబడినది. నిర్ణయింపబడిన ఆచారాలను పాటిస్తే ఆస్తిహక్కు ఉండేది. కనుక ఆస్తిహక్కు ఎలా వస్తుంది? దాని స్వభావం ఏమిటి? సమాజంలో స్త్రీల హోదాపై దాని ప్రభావం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకోవాలి. స్త్రీకి ఆస్తి రెండుచోట్ల నుండి సంక్రమించేది. 1] తల్లిదండ్రులు, భర్త, మామ 2] స్నేహితులు' బంధువులు. అర్ధశాస్త్రం ప్రకారం స్త్రీకి ఆస్తి ఏర్పడే విధానాలు అనేకం.

స్త్రీ యొక్క ఆస్తి :-

1] పూర్వీకులనుండి సంక్రమించిన ఆస్తి.

2] వాడుకోవడానికి భర్త ఇచ్చినందువల్ల కలిగిన ఆస్తిహక్కులు.

3] స్వంతంగా సంపాదించుకున్న ఆస్తి.

4] సర్వసాధారణంగా వివాహ సందర్భంగా ఇతరులు ఇచ్చిన కానుకలు బహుమతులు, దానాలు పోషణ వగైరాలకు ఇవ్వబడినవి.

కౌటిల్యుని లెక్కప్రకారం స్త్రీ ధనం అనేక రకాలుగా ఉండేది. శ్వశుర, పతిదత్తం - అంటే భర్త, భర్త తండ్రి ఇచ్చిన ఆస్తి. అధి వేదనిక అంటే మనవర్తి. జీవితం సాగించటానికి సదుపాయం. వృత్తి ఫలాని దాని కోసమని నిర్ణయించి యిచ్చిన అదనపు మొత్తం. భర్త మరో స్త్రీని ఆమెకు సవతిగా తెస్తే అధివేదనిక, వృత్తి ఈ రెంటిని ఆమెకు చెల్లిస్తాంటాడు. ఇవిగాక వివాహమపుడు వచ్చిన ఆభరణాలు, వస్తువులు, అవరణం, అన్వాధేయం బంధుదత్తం, అన్యత్ స్త్రీ క్రింద నందకువస్తాయి. (A. S. III 15-92; 2-17, 14, 15, 13, 16; IV 12 : 173)[1]

ఇబ్బందులను అధిగమించటానికి ఉదాహరణకు భర్త ముందు చనిపోయి సంతానం లేకపోతే, భర్త ఇల్లు వదలిపోయిన సందర్భంలో తనను, కుమారులను కోడళ్ళను పోషించుకునే నిమిత్తం స్త్రీ ధనం ఏర్పరచడమైనది. (A. S. III 2-16, 14) కరువు కాటకాలలో, వ్యాధి కలిగిన సందర్భాలలో, ధర్మం చేసే నిమిత్తం భర్తకూడ ఈ ఆస్తిని వాడవచ్చును. కవలపిల్లలు

కలిగినవారు పరస్పర సమ్మతిపై స్త్రీ ధనాన్ని వాడుకోవచ్చును. బ్రాహ్మ ప్రాజాపత్య, అర్ష దైవపద్ధతులలో వివాహమయిన వారిలో భర్త ఈ ఆస్తిని మూడు సంవత్సరాలు వాడుకోవచ్చును. గాంధర్వ, అసుర వివాహములలో భర్త ఆ ఆస్తిని వాడుకుంటే వడ్డీతో సహా దానిని తిరిగి భార్యకు ఇవ్వవలెను. రాక్షస, పైశాచిక వివాహాలలో భర్త భార్య స్త్రీ ధనం వాడితే అది దొంగతనంతో సమానం. (A. S. III 2, 14 Shamsastry's Translation (1951) PP 179, 173). అప్పటికీ ఆమె ఆస్తిపై స్త్రీకి సర్వాధికారాలు లేవు. ఆమెకు ఇవ్వవలసింది కొన్ని పరిస్థితులలో ఇచ్చేది లేదు. అదంతా ఆమె నడతపై ఆధారపడుతుంది. స్త్రీ అవర్ణుని వివాహమాడితే ఆభరణాలు ఆమెకు చెంద కుండా పోతయి. ఆమె భర్తను వదలిపోతే, ఆమె స్త్రీ ధనం ఆమెకు కాకుండా పోతుంది. శుల్కం, స్త్రీ ధనం వగైరా అతిచరంవల్ల (హద్దుమీరిన ప్రవర్తన వలన) పోతయి. బీదరికం తప్ప మరే కారణం వల్లనైనా ఆమె పునర్వివాహం చేసుకుంటే స్త్రీ ధనం పోతుంది. వివాహబంధం తెంచుకున్నా (మోక్షం), ఇంకొకనితో తనుగా కాపురానికి స్థిరపడినా (అంటే పెద్దల అనుమతి లేకుండా) ఆమెకు ధననష్టం. స్త్రీ ధనం కాకుండా పోతుంది. (A. S. III 4,26; 2, 15; 3. 21-23)[3]

కౌటిల్యుని అర్థశాస్త్రంలో అనేక పేర్లు వాడబడినాయి. వివరణ సరిగా లేదు. పేర్లు ఆచారాలను బట్టి వచ్చినట్లు కనపడుతున్నది. 'వేదన' పోషణ కొరకు ఇవ్వబడేది. శుల్కం నిర్వచనం చేయబడలేదు. ద్రవ్యం, శుల్కం వైవాహిక జీవితంలో ఆమె నడతను బట్టి ఉండేవట. అలంకారం, ద్రవ్యం ఆలస్యంగా పెండ్లి అయితే ఇవ్వబడేవి. శ్వశుర, పతిదత్తం, నివేశం కాపురం చేయడాన్ని బట్టి ఉంటుంది. కౌటిల్యుని అర్థశాస్త్రం లౌకిక ధర్మ పరమైనది. కనుక స్త్రీ ధనానికి ఎక్కువ విలువ ఇవ్వబడింది. పురుషుడు మరో భార్యను చేసుకుంటే పూర్వం స్త్రీ ధనం, శుల్కం ఇవ్వకపోయినా అపుడు—ద్వితీయ మపుడు - తప్పక మొదటి భార్యకు ఇవ్వాలి. శుల్కం, స్త్రీ ధనం, అధి వేదనకం ఆమెకు విధిగా చెందాలి. అధివేదనికం అతని ఆదాయాన్ని బట్టి, శాసనాన్ని బట్టి ఉంటుంది. (A. S. III 3, 14; 15. 92; 2. 15; 16, 17; 3. 19). అధివేదనికానికి హామీ ఇవ్వాలి. [మరొక హామీ అంటే ఒప్పందాన్ని ఎగవేసే ఆచారం ఉన్నట్లేనా?[4] ప్రభాతి ముఖర్జీ ప్రశ్న]. ఈ స్త్రీ ధనపు ఆస్తి లాంచన ప్రాయపు ఆస్తి కాదు. దీని వాడికంపై కొన్ని నిబంధనలున్నాయి.

భర్త కొన్ని సందర్భాలలో వాడుకోవచ్చును. కొన్ని పరిస్థితులలో ఆమె దానిపై తనే సర్వాధికారాలు సరాసరి కలిగి ఉండవచ్చును. కొన్ని షరతులకు లోబడి అది ఇతరులకు సంక్రమిస్తుంది. వివాహిత స్త్రీ ఆస్తి మామూలుగా చరాస్తియే. దానిని కాపాడటానికి ఒక వ్యక్తి నియమితుడు. అతని పేరు 'అన్వధి' సంరక్షకుడు అన్నమాట. (అర్థశాస్త్రం 3. 21; 4. 25). భర్త ఆమెను ద్వేషిస్తే అన్వధి ఆమెను ఆదుకోవాలి. ఆమె ఆస్తికి తండ్రి ఇంటివారు వారసులు. తల్లి ఇంటివారు నియోగానికి అర్హులు [అర్థశాస్త్రం 5. 33; I - 17-85]. అందువలన ఈ కాలంలో భార్యను కిరసనాయిలు పోసి నిప్పంటించి చంపి, లేక గొంతుపిసికి చంపి, ఉరితీసుకున్నట్లు కధలు కల్పించి, ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రభుత్వాధికారులల కనులు కప్పిగాని, లేక మోస పుచ్చిగాని, లేక లొంగదీసుకొనిగాని ఆమె ఆస్తిని కాజేయుటకు ఆనాడు వీలు లేదు. ఇంత దుర్మార్గానికి ఒడికట్టినా ఆమె ఆభరణాలు వగైరాలు భర్తకు దక్కవు. పుట్టింటివారు వారసులు కదా! కనుక స్త్రీ యొక్క ఆర్థిక ప్రతిపత్తి, వ్యక్తిత్వం (ఆర్థికంగా) ఉండేవి.

మనుస్మృతి :- ఆరు రకాల స్త్రీ ధనాన్ని మనుస్మృతి పేర్కొన్నది. యౌతకం, దుక్తం, స్త్రీ ధనం, ధన, వసువు, విత్తం వాటి పేర్లు. కన్య తన భర్తను తనే ఎన్నుకుంటే అంటే గాంధర్వ వివాహం చేసుకుంటే తండ్రి, సోదరుడు ఇవ్వవలసిన ఆభరణాలు ఆమెకు రావు. అసుర, రాక్షస, పైశాచిక వివాహాలలో ఆమె ఆస్తి తల్లిదండ్రులకు చెందుతుంది. తన స్వంత ఆస్తిని కూడా భర్త అనుమతిలేకుండా ఆమె వినియోగించరాదని మనువు హితవు చెప్పాడు. (మనుస్మృతి IX - 92, 197, 199)

స్త్రీ ధనపు ఆస్తిపై స్త్రీ యొక్క అధికారాన్ని కౌటిల్యుడు ఇంచుమించుగా స్వతంత్రం చేశాడు. మనువు ఆమె స్వాతంత్ర్యాన్ని తగ్గించాడు. "స్త్రీలు బానిసలు, కుమారులు ఆస్తి కలిగి ఉండరాదు. వారల ఆస్తి వారిని పొందినవారికి చెందుతుంది." (మనుస్మృతి VIII - 4. 16) అర్థశాస్త్రం కాలంనాటి స్త్రీ స్థితి మనువు కాలంనాటికి (క్రీ. పూ. 200 - క్రీ. శ. 200) క్షీణించింది. ఆమెకు ఆస్తి వచ్చే వనరులు, వచ్చే ఆస్తి తగ్గాయి. పుత్రికా పుత్రుడు వచ్చి ఆమె తండ్రి ఆస్తిలో హక్కు లేకుండా చేశాడు (మున్ముందు దీనిపై చర్చ వస్తుంది). స్త్రీ ధనం విధిగా ఇవ్వాలని లేదు; ఇవ్వవచ్చును.

ఆమెకు ఆస్తి ఇచ్చేవారిలో భర్త ఒకడు మాత్రమే. శుల్కం, అధివేదనిక, వృత్తి (అలంకారం వగైరాలకు ఇచ్చే సొమ్ము) ను గురించి మనువు చెప్పలేదు. స్త్రీ ధనాన్ని పవిత్రించేసి దాని విలువ తగ్గించాడు. భర్తకు అధికారం ఇచ్చి దాని విలువ తగ్గించాడు. అదికంగా ఆమెకు భద్రత తగ్గింది. ఉన్న కొద్ది పాటి ఆస్తి ఆమె స్వేచ్ఛగా వినియోగించ వీలులేదు. భర్త నిజానికి యజమాని అయినాడు. స్త్రీకి ఒక మంచిస్థానం కల్పించాలనే శ్రద్ధ మనువుకు లేదు.

కానే పండితుని వ్యాఖ్యను మరోసారి గుర్తుచేసుకోవడం ఈ పరిస్థితిలో చాలా అవశ్యకం. ధర్మశాస్త్రకాలంలో స్త్రీ పరిస్థితి మరీ అధ్వాన్నమయింది. ఒక్క ఆస్తి విషయంలో మాత్రం ఇందుకు భిన్నంగా జరిగింది.6 వేదకాలంలో స్త్రీలకు ఆస్తిలో వాటా ఇవ్వలేదు. (కానే : పుట 576) అనాడు ఆస్తిమాట అటుంచితే స్త్రీ స్థానం సామాజికంగా మెరుగుగా ఉంది. (పుట 574). మధ్య యుగంలో శాస్త్రకారులు స్త్రీకి ఆస్తిలో హక్కును గుర్తించారు.7 ఇది విచిత్రమైన పరిణామం. ఆమె వ్యక్తిత్వాన్ని చిదిమివేశారు. మతపరంగా హక్కులు తగ్గించారు. సామాజికంగా అణచివేశారు. కాని ఆస్తి ఇచ్చారు. దీనిని గురించి సామాజిక శాస్త్రజ్ఞులు గాఢంగా, సునిశితంగా, తప్పనిసరిగా పరిశీలన చేయవలసి ఉంటుంది.

స్త్రీ ధనం విషయమైన పరిశీలనను ప్రాచీన సమాజాలను ఎంతో జాగ్రత్తగా పరిశీలించిన మెయిన్ మాటలను ఉటంకిద్దాం. "కన్యాశుల్కం అనే వ్యవస్థలో స్త్రీ యొక్క ప్రత్యేక ఆస్తియొక్క రూపురేఖలు దరహంమీద ఆర్యుల సమాజాలలో గోచరమవుతుంది. వరుడు పెండ్లిరోజున గాని మరునాడు గాని ఈ శుల్కాన్ని వధువు తండ్రికి చెల్లించేవాడు. తండ్రిగా కాని కుటుంబ యజమానిగా కాని వధువు తండ్రి యొక్క ఆధిపత్యాన్ని వరునకు అతడు బదిలీ చేసినందుకు ప్రతిఫలంగా ఈ శుల్కంలో సగం వధువు తండ్రికి చేరేది. మిగతా సగం వధువుకు ముట్టేది. దానిని ఆమె భర్త ఆస్తితో మిశితం చేయకుండా ప్రత్యేకంగా ఉంచుకొనేది, అనుభవించేది."8 "రోమనులకన్న ముమ్మందుగా స్త్రీకి ప్రత్యేక ఆస్తి ఇచ్చిన ఘనత హిందువులకు దక్కింది"9 ఇదొక్కటే హిందూ సమాజానికి కలికితురాయి.

వారసత్వం :-

స్త్రీకి వారసత్వం బహువిధాలుగా రావచ్చును. అందులో ముఖ్యమైనవి మాత్రం పరిశీలనార్హమవుతాయి.

ఈ దిగువ పేర్కొనబడిన వ్యక్తులు చనిపోతే ఆమెకు వారసత్వంగా ఆస్తి రావచ్చును. వారు ఆమె తల్లి, తండ్రి, భర్త, కుమారుడు, సోదరుడు, కుమార్తె. ముమ్ముందుగా తల్లి, కూతుళ్ళను తీసుకుందాము.

1] తల్లి ఆస్తి :-

అర్ధశాస్త్రం ప్రకారం తల్లియొక్క స్త్రీ ధనం పిల్లలకు చెందుతుంది. కనుక కుమార్తెకు వస్తుంది. శుల్కం, అన్వాధేయం, అన్వాత్, బంధుదత్తం మాత్రం తల్లి పుట్టింటివారికి చెందుతుంది. మనువు మరో విధంగా చెప్పాడు. రుక్తం కుమారుడు, కుమార్తెలు అందరికీ వస్తుంది. యౌతకం అవివాహిత కుమార్తెలకు వస్తుంది. మితాక్షర లెక్కన శుల్కం తల్లి పుట్టింటివారికి వస్తుంది. ఇతర స్త్రీ ధనం అవివాహిత కుమార్తెకు ఆమె లేకపోతే ఆస్తిలేని వివాహిత కుమార్తెకు ఆమెకూడా లేకపోతే ఆస్తివున్న వివాహిత కుమార్తె. దక్షిణాదిన శుల్కం తండ్రి పుట్టింటివారికి పోతుంది. యౌతకం అవివాహిత కుమార్తెలకు చేరుతుంది. భర్తృదత్త, అన్వాధేయక రెండూను విధవా కుమార్తెలు కాక కుమార్తెలకు, కుమారులకు సమంగా చెందాలి. తతిమ్మా రకాల స్త్రీ ధనం అవివాహిత కుమార్తెలు, ఆస్తిలేని వివాహిత కుమార్తెలు సమానంగా పంచుకుంటారు. (కోర్టు తీర్పులవల్ల వచ్చిన మార్పును సూచించటం లేదు. 2. ఈనాటి 1955 శాసనం ప్రకారం ఈ రకపు వారసత్వం లేదు. వీటిని గమనంలో ఉంచుకోవాలి).

కూతురునుండి :-

కూతురు చనిపోతే శుల్కం, అన్వాధేయం, అన్వాత్, బంధుదత్తం ఒక పరిస్థితిలో తల్లికి సంక్రమిస్తుంది. ఇది కౌటిల్యుని అర్థశాస్త్రపు స్థితి. ధనం అంటే అసుర, రాక్షస, పైశాచిక వివాహాలలో తల్లిదండ్రులిచ్చినది తల్లిదండ్రులకు చెందుతుందని మనస్మృతి ప్రకటించింది. మితాక్షర ప్రకారం శుల్కం ఏకోదరునికి అతడు లేకపోతే తల్లికి చెందుతుంది. దక్షిణాదిన కూడా శుల్కం వరుసగా ఏకోదరుడు, తల్లి, తండ్రి (ఎవరు బ్రతికి ఉంటే వారికి) చెందుతుంది.

భర్తనుండి :- సర్వసాధారణంగా నిస్సంతుగా చనిపోయిన పురుషుని ఆస్తికి స్త్రీలు వారసులు కారు. కాని ఈ సూత్రానికి కొంత మినహాయింపు యివ్వ

బడింది. విధవ, కుమార్తె, తల్లి, తండ్రి తల్లి, తండ్రి తండ్రి తల్లి మొదలైనవారు అలాంటివారు నిస్సంతుగా చనిపోయిన పురుషునికి అతని విధవ వారసురాలు కావటానికి 2 వేల సంవత్సరాలనాడు ఆమోదం రావటం విశేషం. తన భర్తకు విశ్వాసపాత్రురాలుగా ఉండి (పరపురుషునితో ఏ విధంగా లైంగిక సంబంధం పెట్టుకోకుండా) మత క్రతువులు చేస్తున్న విధవ చనిపోయిన భర్తకు దినవారాలు చేసి అతని వాటాను పొందగలదని బృహస్పతి చెప్తున్నది (బృహస్పతి స్మృతి XXV - 46, 47, 55). వృద్ధమనువు, యాజ్ఞవల్క్యుడు, విష్ణువు, బృహస్పతి, కాత్యాయనుడు, శంఖలిఖితులుకి దేవలుడు విధవ వారసత్వ హక్కును ఇచ్చారు. ఆపస్తంభుడు, వశిష్ఠుడు, నారదుడు నిరాకరించారు. సాధారణంగా నారదుడు ఉదారవాది. అలాంటి నారదుడు వ్యతిరేకించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. బృహస్పతి పూర్తిగా విధవ హక్కులను బలపరిచాడు. సంతానం లేనపుడే ఆమెయే ప్రథమ వారసురాలన్నాడు. స్మృతులకు, ధర్మసూత్రాలకు, ధర్మశాస్త్రాలకు భాష్యాలు వ్రాసినవారు, కోశగ్రంధాలు రచించినవారు ఆమె హక్కును సర్వేసర్వత్రా గుర్తించారు." తన సమిష్టి హిందూ కుటుంబీకులనుండి విడివిడిన పురుషుని ఆస్తి (మరల సమిష్టి కుటుంబంలో) కలవకపోతే, అతనికి సంతానం లేకపోతే, అతని ధర్మపత్నికి - ఆమె పతివ్రతగా ఉంటే అంటే భర్త పట్ల ద్రోహం చేయకపోతే - పూర్తిగా చెందుతుంది' అని విజ్ఞానేశ్వరుడు మీతాక్షరలో చెప్పాడు. యాజ్ఞవల్క్యస్మృతికి భాష్యం రాసిన అపరార్కుడు 'భార్య' అనే పదానికి 'గర్భిణీ అయిన భార్య' అని అర్థం చెప్పాడు. ఈ అభిప్రాయాన్ని, అతడు వశిష్టుని సూక్తులనుండి బలాన్ని పొందాడు. ఒక పురుషుడు సమిష్టి కుటుంబంలో ఉండికూడా కొంత స్వార్జితపు ఆస్తి కలిగియుండి చనిపోతే అతని స్వార్జితపు ఆస్తి అతనికి సంతానం లేనిపక్షంలో భార్యకు సంక్రమిస్తుంది. అతని సమిష్టి హిందూ కుటుంబ సభ్యులకు (కోపార్టనర్లకు) పోతుంది.[10] చనిపోయిన పురుషుడు హిందూ అవిభక్త కుటుంబీకుడిగా, ఉన్నా విభక్తుడైనా దాయభాగన్యాయశాస్త్రప్రకారం అతనివాటా విధవకు చెందుతుంది. స్వార్జితపు ఆస్తి సరేసరి. ఎలాగూ ఆమెకే వస్తుంది. పైన సంతానం అని చెప్పబడినపుడు కుమారుడు, కుమారుని కుమారుడు, కుమారుని కుమారుని కుమారుడు అని అర్థం చెప్పుకోవలెను. అంతేగాక విధవకు వచ్చే ఆస్తి పరిమిత హక్కులతో (Limited Rights) వస్తుంది. దానిని పరిమిత హక్కులు కల ఆస్తి' (Limited Estate) అంటారు. అది సంపూర్ణ

హక్కులు కల ఆస్తికి, జీవితకాలం అనుభవించే హక్కు గల ఆస్తికి మధ్యలో ఉంటుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో విధవ ఆ ఆస్తిని అన్యాక్రాంతం చేయవచ్చును. కాగా విధవ విషయంలో ఒక నిబంధన ఉన్నది. భర్త చనిపోయే నాటికి ఆమె పతివ్రతగా ఉండవలెను. ఇదంతా ఒక సూత్రంపై ఆధారపడుతున్నది. ఆమె భర్త యొక్క అర్ధాంగి కనుక ఆమె అతనికి వారసురాలు. కాగా ఆమె జీవితాంతాన ఆ ఆస్తి ఆమె భర్త సోదరులకు పోతుంది. ఇతంతా 1937 హిందూ స్త్రీల ఆస్తిహక్కు శాసనానికి పూర్వపు మాట. విధవరాలు 4 వ వారసు.

కుమారునినుంచి :-

స్త్రీ కుమారుని తల్లిగా కొన్ని పరిస్థితులలో అతని ఆస్తికి వారసురాలవుతుంది. గౌతముడు, బౌద్ధాయనుడు, ఆపస్తంభుడు, వశిష్టుడు, కౌటిల్యుడు, ఆమెను వారసురాలిగా అంగీకరించలేదు. కాని ఆమె యొక్క, తండ్రి తల్లి యొక్క హక్కులను బాగా సమర్ధించాడు. "నిస్సంతుగా చనిపోయిన వ్యక్తికి తల్లి ఆమె బ్రతికి ఉండకపోతే తండ్రి తల్లి వారసులు." స్మృతి చంద్రిక, వీర మిత్రోదయం, వివాద చింతామణి, మితాక్షర అదే అభిప్రాయాన్ని వెలిబుచ్చాయి. వారసుల జాబితాలో చనిపోయిన వ్యక్తి తండ్రితరువాత స్థానాన్ని విష్ణువు తల్లికి ఇచ్చాడు. యాజ్ఞవల్క్యుడు తల్లి దండ్రులకు అతని కుమార్తె తరువాత స్థానాలను కేటాయించాడు. స్మృతి కర్తలైన బృహస్పతి, కాత్యాయనులు ఆమె హక్కును గుర్తించారు. పురుషుడు చనిపోయిన తరువాత అతని సంతానం ఆస్తిని భాగ పంపిణీ చేసుకునే సమయంలో ఆమెకు వాటం వస్తుందని నారదుడు చెప్పినాడే కాని ఆమెను వారసుల వరుసలో చేర్చలేదు.11 మితాక్షర ప్రకారం వారసుల క్రమంలో ఆమె స్థానం చనిపోయిన వ్యక్తి యొక్క పుత్రికా పుత్రుని తరువాత వస్తుంది. విధవవలె ఆమెకు వచ్చే ఆస్తి పరిమిత హక్కులతో ఉంటుంది. దత్తు తల్లి కూడా తల్లికిందయే లెక్క. కాగా తల్లి వ్యభిచార జీవితం కాని, పునర్వివాహం కాని ఆమె వారసత్వానికి అడ్డురాదు. తల్లీ కొడుకులది సరాసరి రక్త సంబంధం కదా! వ్యవహారమయూఖ ప్రకారము తల్లిస్థానం తండ్రి తరువాత వస్తుంది. వారసుల క్రమంలో దక్షిణాదిన తల్లిస్థానం 7 వది.

తండ్రినుండి :-

స్త్రీ కుమార్తె హోదాలో ఆస్తికి వారసురాలవుతుంది. కౌటిల్యుని అర్థ శాస్త్రప్రకారం కుమారులు ఉంటే పితార్జితపు ఆస్తిలో కుమార్తెలకు హక్కు లేదు. కాగా కన్యలకు వివాహం నిమిత్తం కట్నం ఇవ్వాలి. కుమారులు లేకపోతే ఆతని అవివాహిత కుమార్తెలు (కన్యలు), చనిపోయినవాని సోదరులు ఆతని వస్తువులను (ద్రవ్యం) తీసుకుంటారు. తల్లి దండ్రులు ధర్మాను సరణంగా వివాహమాడితే కుమార్తెలు (దుహితలు) ఆస్తిని వంశపారంపర్యంగా అనుభవిస్తారు. రాజులకు కొన్ని ప్రత్యేక ధర్మసూత్రాలను ఏర్పాటు చేసాడు కౌటిల్యుడు. ఔరసపుత్రులకు ప్రత్యామ్నాయంగా పుత్రికా పుత్రుని పేర్కొన్నాడు. ఎంపిక చేయబడిన కుమార్తె కుమారుడు పుత్రికా పుత్రుడనబడును. రాజుకుకుమారుడు ఉండి, రాజ్యార్హత లేకపోతే, ఇక రాజుకు సంతానం కలిగే అవకాశం లేకపోతే పుత్రికా పుత్రుడికి అవకాశం వస్తుంది. (అర్థశాస్త్రం - III - 5-32; 7-40; V 6. 222; I 17-89). మనువు కౌటిల్యుని పద్ధతిని మొత్తంమీద ఆమోదించాడు. పితార్జితం కుమారులకు వస్తుంది. అవివాహిత కుమార్తెలు పెండ్లి ఖర్చును పొందుతారు. కుమార్తె పెండ్లి ఖర్చు కుమారుని పెండ్లి ఖర్చులో నాలుగవవంతు (మనుస్మృతి XI - 109, 185, 192. 118). కుమారులు లేకపోతే కుమార్తెల కుమారులు, పుత్రికా పుత్రికులు ఆస్తిని పొందుతారు. తల్లి ఆస్తిని పొందటంలో కుమారులు కుమార్తెలు సమానంగా ఎంచబడినారు. కాని అదే సందర్భంలో పుత్రికా పుత్రుని పేర్కొనటం వల్ల ఆ భావానికి విలువపోయింది (మ. స్మృ IX 130, 132, 127, 133, 136, 137). దీనిని కొంత వివరించవచ్చును. తండ్రి కుమార్తెను ఎంపిక చేస్తాడు. ఆమె పుత్రిక. తతిమ్మా కుమార్తెలు దుహితలు. పుత్రిక కుమారుడు పుత్రికా పుత్రుడు. ఆతనిని వాడుక భాషలో దహోత్రుడు అని పిలుస్తున్నారు కాని అది సరియైన పదం కాదు. అతడు తల్లి తండ్రికి శ్రాద్ధాదులు పెట్టాలి. ఆతడు అలా తాత ఆస్తికి వారసుడవుతున్నాడు మ. స్మృ. IX - 127, 132, 136, 140. పుత్రికా పుత్రుని నియమించుకున్న తరువాత కుమారుడు కలిగినా, ఔరసపుత్రుడూ, పుత్రికా పుత్రుడు కుమారులవలె సమానంగా ఆస్తిని పంచుకుంటారు. కాగా కుమారులలోని పెద్దవానికి వచ్చే జ్యేష్ఠభాగం పుత్రికా పుత్రునికి రాదు. పుత్రిక కుమారుని కనకుండా చనిపోయినా అల్లుడు మామగారి ఆస్తి పొందవచ్చును. ఇదంతా

ఎందుకు వివరించ వలసి వచ్చిందంటే పుత్రికా పుత్రుని పద్ధతి వచ్చిన తరువాత పుత్రిక స్థానం తగ్గింది. పుత్రికా పుత్రుడు ఔరస పుత్రునితో సమానుడు కనుకను, కుమారులు ఉన్నచో కుమార్తెకు వారసత్వం లేదు కనుకను, ఆమె స్థానం చాల వెనుకకు పోయింది.12 పురాతన కాలంనుండి కుమార్తెను వారసురాలిగా గుర్తించారు. బహుశః మొదట్లో పేర్కొనబడిన కుమార్తె (పుత్రిక) గా, తరువాత కేవలం కుమార్తెగా (దుహిత) ఆమెను వారసుగా ఆమోదించి ఉంటారు ధర్మశాస్త్ర విదులు. మనువు మాటల్లో "కుమారుడు తండ్రి ఒకరే (తండ్రి కుమారునిలో జన్మిస్తాడు). కుమార్తె కుమారునితో నమానం; కుమార్తె జీవించి ఉన్నంతకాలం తండ్రి జీవించి యున్నట్లే. కనుక ఇతరులు అతని ఆస్తిని (ఆమెకు కాకుండా) ఎలా తీసుకోగలుగుతారు?" (మను. స్మృ IX 130). మనువుకు భాష్యం చెప్పిన వారు కొందరు 'కుమార్తె' అంటే 'పుత్రిక' అని అర్థం చెప్పారు. మనువు వాడిన పదం 'దుహిత' అని మాత్రమే; అంతేకాని 'పుత్రిక' అనే పదాన్ని ఆయన వాడలేదు. పుత్రికను గురించి మనువు IX - 127-128 లో చెప్పాడు. బృహస్పతి మామూలుగా మనువును అనుసరిస్తాడు. ఆయన మనువు కుమార్తెను గురించి చెప్పినట్లే అర్థం చేసుకున్నాడు. ఆయన ఇలా ప్రశ్నించాడు. "కుమార్తె కుమారునివలె పురుషుని శరీరంలోని ప్రతి అణువునుండి ఉద్భవిస్తుంది. అందువలన ఆమె జీవించి యుండగా మరొక ప్రాణి అతని ఆస్తిని ఎలా పొందగలరు?" (బృహ. XXV - 56). విష్ణు, యాజ్ఞవల్క్య, కాత్యాయనులు కుమార్తె యొక్క వారసత్వ హక్కుని గుర్తించారు. కాత్యాయన, బృహస్పతులను అనుసరించిన మితాక్షర భార్య లేకపోతే ఆస్తి కుమార్తెలకు సంక్రమిస్తుందని చెప్పింది. తండ్రి ఆస్తిలో కుమారులవలె కుమార్తెలకు హక్కు వారి జన్మవల్లనే వస్తుందని అపరార్క భాష్యం అభిప్రాయ ప్రకటన చేసింది. స్మృతి చంద్రిక, వీరమిత్రోదయ, వివాద చింతామణి, మనువు అందరు కుమార్తెలను గురించి చెప్పినట్లే అర్థం చేసుకున్నారు. మితాక్షర భావం కూడ ఇదే.13 శాసనాల వల్ల మార్పులు రాకముందు వారసుల వరుస క్రమంలో కుమార్తెస్థానం ఐదవది. కుమార్తె అపవిత్ర జీవితానికి వారసత్వానికి సంబంధం లేదు. ఆమెకు చనిపోయిన వానికి జన్మనుబట్టి రక్తసంబంధం ఉన్నది కనుక ఆమె పాతివ్రత్య రాహిత్యం ఆమె వారసత్వానికి అడ్డురాదు.

<u>సోదరుని నుండి :-</u>

కొన్ని స్మృతులలో భాగపంపిణీ అపుడు లేక మరల కలసి పంపిణీ చేసుకునేటప్పుడు సోదరికి వాటా ఇవ్వవలెనని వ్రాయబడినది. నిస్సంతుగాను భార్య తండ్రి లేకుండాను చనిపోయినవాని ఆస్తి సోదరికి వస్తుందని బృహస్పతి వ్రాసాడు. శంఖలిఖితుల పద్ధతిన నిస్సంతుగా చనిపోయిన తల్లియొక్క కుమారుని ఆస్తికి సోదరి వారసురాలు. జగన్నాధ ధర్మకోశంలో బృహస్పతి తల్లి తరువాత వారసుగా సోదరిని పేర్కొన్నట్లు వ్రాయబడినది. ఇదే భావాన్ని మనువును వివరిస్తూ కల్లూకుడు చెప్పాడు. బొంబాయి శాఖలో సోదరిస్థానం గోత్రజసపిండురాలుగా గుర్తింపబడినది. ఆమె మరో వంశం లోకి వివాహం ద్వారా వెళ్ళినా ఆమె భిన్నగోత్రికురాలు కాదు. మితాక్షర లెక్కన సవతి సోదరుడు, అతని కుమారుడు వీరిరువురి తరువాత సోదరి స్థానం ఉంటుంది. బొంబాయి ప్రాంతంలో చలామణీలో ఉన్న 'వ్యవహార మయూఖం' ఆమెను - సోదరిని - నాయనమ్మ తాతయ్యల మధ్యన స్థానం కలుగచేసింది. సవతి సోదరుని తరువాత, (Helf - Brother) ఏకోదరుని (Full Brother) ముందు సోదరికి వారసుల వరుస క్రమంలో స్థానాన్ని నిర్దేశించింది. మద్రాసు శాఖ సోదరి స్థానాన్ని స్పష్టంగా తెలియజెప్పింది. మితాక్షరలో దీని వివరణ ఉంది. సోదరి భిన్నగోత్ర సపిండురాలు. ఆమె బంధువుల జాబితాలోకి వస్తుంది. కాని ఆమె సాధారణ బంధువు కాదు. ఆమెకు విశిష్ట స్థానం ఉన్నది. దక్షిణాది శాఖలో పురుష బంధువుల తరువాత సోదరి వస్తుంది. మరీ దూరపు పురుష బంధువుల తరువాత మాత్రము కాదు. ఇపుడు 1929 లో వచ్చిన హిందూ వారసత్వ సవరణ శాసనం వలన సోదరి, తండ్రి తండ్రి తరువాత ప్రవేశపెట్టబడిన కుమారుని కుమార్తె, కుమార్తె కుమార్తెల తరువాత స్థానానికి వచ్చింది. 13 వ స్థానానికి వచ్చింది. ఇది 1955 కు పూర్వపుస్థితి.

దీనివలన తేలిన విషయాలు I) భార్యకన్న కుమారులు మనుమలు, ముని మనుమలు, ఎక్కువ II)కుమార్తె కుమారునితో సమానం కాదు. III)సోదరుడు

9 వ స్థానపు వారసుడు కాగా, సోదరి వారసుల వరుసక్రమంలో 12, 13 ల మధ్యస్థానం కలిగి ఉన్నది. ఎంతసేపూ పిండప్రదానాలూ, తర్పణాలూ వాటికే ప్రాముఖ్యత. ప్రేమలకు అభిమానాలకు, సాంగత్యానికి విలువే లేదు. పారలౌకిక దృష్టి పేరుతో ఇహలోక జీవితాన్ని దుఃఖభాజనం చేసుకున్నది. ఎవరు ఆత్మీయులో, ఎవరు కాదో తేల్చుకోలేని దుర్భరస్థితిలో పడింది హిందూ సమాజం.

అధ్యాయం 8

పాదదీపికలు

1. ఋగ్వేదంలో స్త్రీలు : ఉపాధ్యాయ అధ్యాయాలు 3, 4
2. హిందూ స్త్రీ : ప్రభాతీ ముఖర్జీ - పుట - 77
   Hindu women (Normativemodel) by
   Probhati Mukherjee (1978)
3. డిటో పుట 79
4. డిటో పుట 81, 82
5. డిటో పుట 83
6. ధర్మశాస్త్రాల చరిత్ర : కానే - పుట 577
7. డిటో డిటో పుట 582
8. ప్రాచీన సమాజాలు : మెయిన్
9. డిటో
   Lectures on early history of
   Institutions : Maine (1914)

10. హిందూశాస్త్రము-ఆచారము : మెయిన్ - పుట 614-616
పేరాలు 498, 499,

Treatise on Hindu Law & Usage by
Maine [Ed. by Sreenivasa Iyenger Pub.
Higginbothams, Madras (1914)]

11. డిటో పుట 620; పేరా 503

12. హిందూ స్త్రీ : ప్రతిభా ముఖర్జి - 8 వ అధ్యాయం

13. హిందూ శాస్త్రము-ఆచారము : మెయిన్ పుటలు 619, 620;
పేరా 502

14. డిటో డిటో పుటలు 621-624; పేరాలు 506-509

అధ్యాయం

9 మనవర్తి, దత్తత

మనవర్తి :- ఈ విషయంలో శాసనపరంగా మొదటిసారిగా 1946 లో శాసనం వచ్చింది. 'హిందూ వివాహిత స్త్రీ వేరు కాపురానికి, మనవర్తికి శాసనం' దాని పేరు. దానిలో ఏ పరిస్థితిలో వివాహిత స్త్రీ భర్తకు దూరంగా వేరుగా కాపురముండవచ్చునో వివరించబడింది. ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో వచ్చిన 'హిందూ బహుభార్యాత్వ నిషేధశాసనం' 1910 లో వచ్చింది. 1956 నుండి 'హిందూ దత్తత మరియు మనవర్తి శాసనం' అమలులో ఉంది. బ్రిటిషు పాలన మొదలైన తరువాత కోర్టు తీర్పులలో హైందవం కొంత మారింది. కనుక అంతకు క్రితపు హైందవాన్ని తరచి చూద్దాం.

సమష్టి హిందూ కుటుంబంలోని సభ్యులలో కొంతమందికి మతిస్థిమితం లేనందువల్ల, పుట్టుకతో తనపని తను చేసుకోలేని అసమర్థతతో పుట్టినందు వల్ల వారసత్వానికి, భాగపంపిణీలో వాటా పొందటానికి వారు అనర్హులు. కాని కుటుంబం వారిని, వారి భార్యలను పోషించాలి. వారి కుమార్తెలకు వివాహ మయ్యేవరకు పోషణ జరగాలి. ఇక తతిమ్మా సమిష్టి హిందూ కుటుంబ సభ్యుల సంగతి-కుమార్తెలు, కుమారులు, భార్యలు, కోడళ్ళు, తల్లులు, అక్క చెల్లెళ్ళు వీరి సంగతి చెప్పనక్కరలేదు. సమిష్టి కుటుంబ యజమాని వీరి నందరినీ పోషించవలసినదే. అక్రమ సంతానంగా ఉన్న కుమారులు, వాటాకు అనర్హులయినపుడు మనవర్తికి అర్హులు. కాని అలాంటి కుమార్తెలకు మనవర్తి రాదు. ఒక పురుషుడు తన మరణానంతరం వరకు ఒక స్త్రీని ఉంపుడు గత్తెగా ఏర్పరచుకొని అలా జీవిస్తే ఆమె 'అవరుద్ధ స్త్రీ' అనబడుతుంది. ఆమె భరణాన్ని పొందవచ్చును. పురుషునికి ఆస్తి ఉన్నా లేకపోయినా వయో వృద్ధులైన తల్లిదండ్రులను, భార్యను, మైనరుకుమారుని పోషించాలి. పెండ్లి అయ్యే వరకు అక్కగాని, చెల్లెలుగాని పోషణకు లేక మనవర్తికి అర్హురాలు. విధవ

సోదరిని పోషించవలసిన బాధ్యత కేవలం నైతికం. భార్య తన హోదాకు తగిన విధులను నెరవేర్చినంతకాలం భర్త భార్యను పోషించాలి. భర్త మరో భార్యను స్వీకరించినంతమాత్రాన భార్య అతనిని విడనాడుటకు హక్కులేదు. అలా విడిపోతే ఆమెకు మనవర్తి హక్కులేదు. వ్యభిచరించిన భార్య విషయం ఇంతకుముందు ప్రస్తావనకు వచ్చింది. విధవ తన కుమారునికి ఆస్తి ఉన్నా లేకపోయినా మనవర్తి కోరవచ్చును. కాని మామకు విధవ కోడలును పోషించవలసిన బాధ్యత లేదు. పిత్రార్జితపు ఆస్తి ఉంటేనే అతడు బాధ్యుడు. విధవ తన భర్త బంధువులతో కలసి వుండవలసిన అగత్యం లేదు. అపవిత్ర జీవితం గడిపే విధవకు మనవర్తి లేదు. విధవ పునర్వివాహం చేసుకోగానే మొదటిభర్త కుటుంబం నుండి మనవర్తి పొందే హక్కు పోతుంది. విధవ తన భర్త కుటుంబ గృహములో కాపురం ఉండటానికి హక్కుకలిగి వున్నది. పెండ్లి అయ్యేవరకు, కుమార్తెలకు పోషణ హక్కు, లేక తండ్రి వదలి వేసినచో మనవర్తి పొందే హక్కు ఉన్నాయి. పిత్రార్జితపు ఆస్తి ఉంటే తన ఆస్తికి తగ్గట్టు తండ్రి ఆడపిల్ల పెండ్లి ఖర్చులను భరించవలెను.

దత్తత :-

దత్తుకు సంబంధించి 1956 లో శాసనం వచ్చింది. బ్రిటీషువారు వచ్చినప్పటినుండి ధర్మశాస్త్రాలు, కోర్టు తీర్పులు, హిందూ సమాజాన్ని నడిపించాయి. దత్తుకు సంబంధించిన ధర్మాలు పరస్పర భిన్నంగా ఉండటం వల్ల, ఆచారాలు భిన్నంగా సాగినందువల్ల, ధర్మశాస్త్రాల అన్వయం సంస్కృతం రాని ఇంగ్లిషు జడ్జీలకు కష్టతరమయినందువల్ల, దానికి సంబంధించిన 'లా' సంక్లిష్టమయింది. న్యాయస్థానాలలో కేసులు సగంపైగా అందువల్ల ఉత్పన్నమయినవే. న్యాయవాదులు సగంమందికి ఈ దత్తు దావాలే జీవనోపాధిని కల్పించాయి.

దత్తతను గురించి చారిత్రక దృష్టితో అధ్యయనం చేయడం ప్రయోజనకరం. వేదకాలంలో దత్తత ఉన్నదట. శునశ్శేపుని విశ్వామిత్రుడు దత్తు తీసుకున్నట్లు ఐతరేయ బ్రాహ్మణం చెప్తున్నది. అత్రి అనే రుషి తన ఏకైక కుమారుని ఔర్వికి దత్తు ఇచ్చాడట. పుత్రికా పుత్రుడికి తాత ఆస్తి రావడం వలన తతిమ్మా కుమార్తెల సంతానానికి బాధగా తోచింది. తతిమ్మా

కుమార్తెలకు హక్కులు రావడం మొదలయింది. సోదరుడు లేని కన్యలను వివాహం చేసుకోరాదనే నియమం రావడంతో వారికి పెళ్ళిళ్ళు కావడం కష్టమయింది. పుత్రికా పుత్రుడు ఎంత మంచివాడయినా భిన్నగోత్ర సపిండుడు. కనుక దత్తత ఆవశ్యకతను సమాజం గుర్తించింది. గౌతమ, బౌద్ధాయన, మనువులు దత్తునికి ఔరస, క్షేత్రజ కుమారుల తరువాతి స్థానం ఇచ్చారు. ఆపస్తంభుడు వ్యతిరేకించాడు. వసిష్ఠుడు అతనికి 8 వ స్థానాన్ని ఇచ్చాడు. యాజ్ఞవల్క్యుడు దత్తుని కుమారులలో 7 వ వానిగాను, మనువు మొదటి 6 గురిలో ఒకనిగాను, నారదుడు 9 వ వానిగాను పేర్కొన్నారు. దత్త మతకారణాలవల్ల పుట్టిందా? లేక లౌకిక కారణాలవల్ల ఉద్భవించిందా? అనేది వివాదాంశం. గుప్త సామ్రాజ్య పతనం తర్వాత ముఖ్యంగా మహమ్మదీయుల కాలంలో ఈ ఆచారం ప్రబలమయింది. ఆస్తిని నిలబెట్టుకోడానికి అవసరమయిందని మెయిన్ అభిప్రాయం. మత భావన ద్వితీయస్థాయి కారణం. శ్రాద్ధ కర్మలను చేయటానికి ఒక పురుషుడు కావాల్సి వచ్చింది.

మతకారణాలు లౌకిక కారణాలను తోసి రాజనలేదు. వంశోద్ధరణ ముఖ్య ప్రోద్బల కారణం. అంటే లౌకిక కారణమే ప్రబలమన్నమాట. ఇది మెయిన్ ఆలోచనా ధోరణి. మతకారణాలే ప్రబలంగా పనిచేసాయని చెప్పడం యుక్తి యుక్తం. పున్నామ నరకం తమకు సంప్రాప్తమవకుండా దత్తత అవసరమయింది.

కుమారుడు, మనుమనుడు, మునిమనుమడు ఉంటే దత్త చేసుకోరాదు. కుమారుడు సన్యసిస్తే దత్త చేసుకోవచ్చును. ఉన్న ఒక్క కుమారుడు హిందూ మతాన్ని వదలివేస్తే తండ్రి దత్త చేసుకోవచ్చును. వ్యభిచారజీవితం గడుపుతున్న విధవ భర్త అధికారం ఇచ్చినా దత్త చేసుకోరాదు.

భార్య అనుమతి లేకపోయినా భర్త దత్త చేసుకోవచ్చును. ఆమె వ్యతిరేకించినా దత్తతకు అతడు ఉపక్రమించవచ్చును. విధవ భర్త అధికారం పొందియైనా దత్త చేసుకోవలెను లేక జ్ఞాతులు ఒప్పుదల మీద ఆధారపడి ఆ పని చేయవచ్చును. భర్త అధికారాన్ని గురించి, జ్ఞాతుల ఒప్పుదలను

గురించి ఎంతో గ్రంథం పెరిగింది, అనేక ప్రాంతీయ భేదాలు మత భేదాలు వెలిశాయి. భర్త సమష్టి హిందూ కుటుంబీకుడుగా చనిపోతే ఆ కుటుంబం లోని వారి సమ్మతి కోసం ఆమె ప్రయత్నించాలి. వేరుపడిపోతే, దగ్గర జ్ఞాతుల అంగీకారం కావాలి. అత్తగారి సమ్మతికి కూడా విలువ ఉన్నది. కాని ఆమె ఒక్క సమ్మతి చాలదు. దత్తు చేసుకోవద్దని భర్త చెప్పి చనిపోతే దత్తు చేసుకోడానికి విధవకు అధికారం లేదు. భార్య సమ్మతించకపోయినా భర్త వారిరువురి కుమారుని తానొక్కడే ఇతరులకు దత్తు ఇవ్వవచ్చును. ఏ కుర్రవాని తల్లినయితే దత్తు తీసుకునే పురుషుడు, ఆమె కన్యగా ఉన్నచో, వివాహమాడరాదో ఆ కుర్రవానిని దత్తు తీసుకొనరాదు. ఆచారం పేర దీనిని సడలించారు ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో. బొంబాయిలో కుమార్తె కుమారుని, సోదరి కుమారుని, పినతల్లి కుమారుని దత్తు చేసుకొనరాదు. వారి తల్లులను దత్తు తండ్రి ఏ పరిస్థితులలోను వివాహమాడరాదు కదా!

బ్రహ్మచారి, విధురుడు దత్తు చేసుకోవచ్చును. భార్య ఇష్టపడక పోయినా, వ్యతిరేకించినా ఒక పురుషుడు ఒక దత్తు కుమారుని స్వీకరిస్తే వాడు—ఆ కుర్రవాడు—ఆ పురుషుని భార్యను దత్తుతల్లిగా పరిగణిస్తాడు. ధర్మశాస్త్రం అంగీకరిస్తుంది. దత్తు పురుషునికి జరుగుతుంది. అది అతని ఇష్టాఇష్టాలపై ఆధారపడుతుంది. అయితే దత్తు జరిగేనాటికి దత్తు తండ్రి భార్య చనిపోయి ఉంటే దత్తుడు - దత్తు చేసుకోబడిన పురుషుడు - ఆమెకు కూడా దత్తు కుమారుడయినట్లే లెక్క.

ఇందులో ముఖ్యంగా గమనించవలసినవి :- దత్తు అనేది పురుషునికి సద్గతులు కల్గించటానికి - పిండ ప్రదానాలు చేసి, తర్పణాలు ఇచ్చుట ద్వారా- ఉద్దేశింపబడింది. స్త్రీ తనకు దత్తు చేసుకొనరాదు. ఆమె పతి జీవించి వుండగా ఆమె తన భర్త కోసం కూడా దత్తు చేసుకోరాదు. విధవ తన భర్త కొరకు భర్త పేరుమీదుగా దత్తు చేసుకోవాలి. అదయినా అతడు అధికారం ఇచ్చి వుంటే, లేక సపిండుల సమ్మతి మీద. అత్తగారున్నా ఆమె ఒక్కతే సమ్మతించినా చాలదు. దత్తు తీసుకునే విషయంలో, తన కుమారుని ఇతరులకు

దత్తు ఇచ్చే విషయంలో ఆమె-ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేదు. "భర్త యొక్క ఆధిక్యత ఫలితంగా, అతడు దత్తు చేసుకోగానే, దత్తుడు ఆమె కుమారుడుగా భావించబడడం పూర్తి అవుతుంది. భర్త అంగీకరించిన దేనినయినా ఆమె తన ఆస్తిగా ఎలా అనుకున్నదో దీని విషయంలోనూ అలాగే జరగాలి" ఇవి 'దత్తత మీమాంస' గాని వాక్యాలు. దత్తత అనే వ్యవస్థ పురుషుని కోసం కల్పింపబడింది. పురుషునికోసం కొనసాగింపబడింది. కాగా 1956 లో కొద్ది మార్పులు జరిగాయి. వీటిని గురించి ముందు విచారిద్దాం.

అధ్యాయం

10 మైనారిటీ, సంరక్షకత్వం

మైనారిటీ : హిందూ స్త్రీ పురుషులకు 16 వ ఏట మైనారిటీ తీరి పోతుందని అధికారిక ప్రవచనము. కాగా 16 వ ఏడు మొదట్లోనా లేక ఆ సంవత్సరం పూర్తి అయిన తరువాతనా అనే భేదాభిప్రాయాలువున్నాయి. ఎక్కువమంది సంస్కృత రచయితలు 16 వ సంవత్సరం మొదట అని చెప్పారు. 16 సంవత్సరాలు నిండాలని బెంగాలు ప్రాంతం వారి భావం. మదరాసు వారుకూడా బెంగాలు భావనను బలపరిచారు. ప్రస్తుత మదరాసు, బెంగాలులలో మెజారిటీ రావడమంటే 16 సం॥ నిండడము. దేశంలోని తతిమ్మా ప్రాంతములలో 15 సం॥ నిండితే చాలును. ప్రస్తుతం ఇది అంతగా ప్రత్యేకంగా ప్రాముఖ్యత లేనిది. 1875 లో భారత మెజారిటీ శాసనం ఆమోదింపబడింది. దాని ప్రకారం మామూలుగా 18 సం॥ నిండిన వ్యక్తికి మైనారిటీ వెళ్ళిందని అంటాం. కోర్టువారు సంరక్షకుని నియమిస్తే అతని మైనారిటీ 21 సం॥ నిండువరకు ఉంటుంది. ఈ శాసనము దత్తత, వివాహము, విడాకులు అనే మూడు విషయాలలో వర్తించదు.

సంరక్షకులు నాలుగు రకాలవారు: 1) సహజ సంరక్షకులు 2) వీలునామా ద్వారా నియమింపబడినవారు 3) కోర్టుద్వారా ఏర్పాటు చేయబడినవారు. 4) ఇతరుల నియామకం లేకపోయినా పరిస్థితులవల్ల అనుభవంలో సంరక్షలు. 1890 లో సంరక్షకుల - సంరక్షితుల శాసనం వచ్చింది (Guardians & Wards Act). దీనిప్రకారం కొన్ని సందర్భాలలో అయుక్త వయస్కులకు (మైనర్లకు) సంరక్షకులను నియమించటానికి న్యాయస్థానాలకు అధికారాలు సంక్రమించాయి. ఈ శాసనం ప్రకారం అవిభక్త కుటుంబం లోని మైనరు పురుషుని ఆస్తికి సంరక్షకుని నియమించటానికి వీలులేదు. కాగా అవిభక్త హిందూ కుటుంబంలోని మైనరు బాలుని వ్యక్తిగా పరిగణించి సంరక్షకుని నియమింపవచ్చును. అంటే వ్యక్తి వేరు, అతని ఆస్తి వేరు.

ఆస్తికాక తతిమ్మా విషయాలన్నీ అతని వ్యక్తిగత విషయాల క్రింద లెక్క. అతని శారీరక, మానసిక ఆరోగ్యం, విద్య, వైద్యం మొదలగునవి వ్యక్తి సంబంధమైన సంరక్షకుని పరిధిలోకి వస్తాయి.

తల్లి, తండ్రి సహజ సంరక్షకులు. ప్రప్రథమంగా తండ్రి అలాంటి సంరక్షకుడు. తండ్రి జీవించి యుండనిచో తల్లి సహజ సంరక్షకురాలు. వీరిరువురు లేకపోతే న్యాయస్థానం ఒక మనిషిని సంరక్షకునిగా నియమిస్తుంది. అవిభక్త హిందూ కుటుంబంలోని అయుక్తవయస్కుడైన పురుషునికి (మైనరుకు) ఆస్తి సంబంధంగా కాక యితరత్రా తన వీలునామాద్వారా తండ్రి సంరక్షకుని నియమించవచ్చును. తల్లికి అలాంటి అధికారం లేదు. మైనరుకు ప్రత్యేక ఆస్తి ఉంటే దానికి వీలునామా ద్వారా తండ్రి సంరక్షకుని నియామకం చేయవచ్చును.

అయుక్త వయస్క [మైనరు] బాలకు యుక్తవయస్కుడైన భర్త సంరక్షకుడు. అతడే ఆమెకు రెండురకాల సంరక్షకుడు. కాగా దక్షిణాదిన ఆడపిల్ల ఈడేరువరకు తల్లిదండ్రుల ఇంట్లో వుండే ఆచారం వున్నది. అయినా శాస్త్రరీత్యా భర్తయే సంరక్షకుడు. ఆమె ఆస్తికీ, వ్యక్తికి రెంటికీ అతడే సంరక్షకుడని భావం. మైనరు భార్యకు మైనరు భర్తయే సంరక్షకుడు. అంటే ఆస్తి సంబంధం కాక ఇతరత్రా అని అర్థం చెప్పుకోవాలి.

తల్లి పునర్వివాహం చేసుకుంటే తన సంతానానికి సహజ సంరక్షకురాలుగా ఉండే హక్కును ఆమె పోగొట్టుకుంటుంది. ఒక వ్యక్తి కులం పోగొట్టుకుంటే సంరక్షకత్వ అర్హత పోతుంది. కులసంబంధమైన అనర్హతల తొలగింపు శాసనం (Caste Disabilities Removal Act 1850) వల్ల ఆ ప్రమాదం తప్పిపోయింది.

తండ్రి మతం మార్చుకున్నా తన సంతానానికి సంరక్షకుడుగా ఉండే హక్కును కోల్పోడు. తల్లి విషయంలో అలాకాదు. ఆమె సంరక్షకురాలుగా ఉండే అర్హత కోల్పోతుంది. "తండ్రి మతాన్నే పిల్లలు అనుసరిస్తారని - భారతదేశంలో - అనుకోవాలి. అలాగే తండ్రియొక్క వ్యవహార సంబంధమైన హోదాకూడా పిల్లలకు సంక్రమిస్తుంది." ఇది ప్రివీ కౌన్సిలు తీర్పు.

భారతీయ ఒప్పందపు చట్టము [Indian Contract Act] నిబంధనల ప్రకారం అయుక్త వయస్కులు [మైనర్లు] చేసే ఒప్పందాలు చెల్లవు. కాగా వారి ముఖ్య అవసరాలను ఎవడైనా సమకూరిస్తే వాటి వెలను అతనికి అయుక్త వయస్కుల ఆస్తి నుండీ చెల్లింపచేస్తుంది న్యాయస్థానం. సంరక్షకుడు సంరక్షితుని ఆస్తిని సక్రమంగా నిర్వహించి కాపాడాల్సిన బాధ్యత వుంది. దుర్వినియోగం చేసినచో మైనరుకు కల్గే కష్టనష్టములకు సంరక్షక స్థానములో ఉన్న వ్యక్తియే బాధ్యుడు. న్యాయస్థానం సంరక్షకుని నియమించేటప్పుడు కేవలం మైనరు శ్రేయస్సును మాత్రమే దృష్టిలో ఉంచుకుంటుంది. సహజ సంరక్షక వ్యక్తి మైనరు యొక్క వ్యక్తికీ, ఆస్తికీ రెంటికీ సంరక్షకునిగా వ్యవహరించవచ్చు. 1956 లో మైనారిటీ మరియు సంరక్షకత్వ శాసనం వచ్చింది.

అధ్యాయం

11 భ్రష్టులు, బందీలు

హిందూ సమాజంలో వర్ణాశ్రమధర్మాలు కీలక పాత్ర వహించాయి. మొదట్లో వేదకాలంలో మూడు వర్ణాలు మాత్రమే ఉండేవి. ఆర్యులు ప్రధానంగా పశుపాలకులు. వారు వచ్చే నాటికి దేశంలో రాజ్యం చేస్తున్న అనార్యుల వ్యవసాయంపై ఎక్కువగా ఆధారపడేవారు. ఆర్య - అనార్య సంఘర్షణ రెండు నాగరికతల వారిమధ్య పోరాటం. ఆర్యులకు అశ్వాలు ఉండడంతో వారు అనార్యులను తమ వేగంతో జయించికలిగారు. వారిని బందీలుగా చేసుకున్నారు. వారిని చంపేదానికంటే వారిచేత ఊడిగం చేయించుకోవటం మేలని వారిని 'దాసులను' చేశారు. వారికొక వర్ణాన్ని సృష్టించారు. దానినే శూద్ర వర్ణమని నామకరణం చేశారు. ఇతర జాతుల వారిని రాజకీయ, సామాజిక కారణాలవలన తమలో కలుపుకున్నారు. ఆగంతకుల హోదాను బట్టి వారికి కుల నిర్దేశం చేశారు. వారు శక్తివంతులై రాజ్యాధినేతలైతే వారిని క్షత్రియులలో చేర్చారు. కాకపోతే వారిని శూద్రులతో కలిపారు. మానవ సమాజంలో స్త్రీ పురుషుల మధ్య ఉండే ఆకర్షణలను శాసనాలు, సామాజిక కట్టుబాట్లు ఆపలేవు; ఆపలేకపోయాయి. దానికి అనేక సామాజిక రాజకీయాంశాలు తోడు అయినాయి. వర్ణసంకరం కలిగింది. అనేక కులాలు ఉద్భవించాయి. మరల వాటికి వృత్తులు కేటాయించటం, కులధర్మాలను నిర్ణయించి శాసించటం పరిపాటి అయింది. విదేశాలనుండి అనేకులు దండెత్తి వచ్చారు. మొదట్లో వారిని హిందూ సమాజం కలుపుకున్నది. కాని ముసల్మానులు, ఐరోపియనులు హిందూ సమాజంలో కలవడానికి వీలు లేదు. హిందూ సమాజపు విధానాలు వేరు. తతిమ్మావారి పద్ధతులు వేరు. దాంతో ఇతరులను కలుపుకునే కార్యక్రమం ఆగిపోయి హిందూ సమాజాన్ని కుదించి గట్టిపరిచే ప్రయత్నాలు సాగాయి. దాంతో కులవ్యవస్థ, వర్ణవ్యవస్థ గట్టిపడినాయి. హిందూ సమాజంలోనుండి కారణాంతరాల వలన వెలుపలికి అడుగిడిన వారిని వెలివేశారు. స్త్రీల విషయంలోనూ అలాగే జరిగింది.

ఇది స్త్రీలపట్ల అపచారంగా పరిణమించింది. ఈ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొని భారతదేశ చరిత్రను అధ్యయనం చేయాలి. లేకపోతే తప్పుడు అవగాహనకు దారి తీస్తుంది.

కుల భ్రష్టలయిన స్త్రీలను, మత భ్రష్టలయిన స్త్రీలను సమాజం ఎలా చూచింది? అనే విషయాన్ని తెలుసుకునే ముందు కొన్ని మౌలిక అంశాలను గుర్తుంచుకోవాలి. కులాన్ని గుర్తించడం ఎలా? ఆ కులపువారు తమనిని ఎలా అభివర్ణించుకుంటున్నారు? ఇతర కులాలవారు ఆ కులపువారిని ఏలా పరిగణిస్తున్నరు, అసలు ఆ కులపు వారి ఆచారాలు, నడత ఎలా వున్నాయి? అనేవి కులాన్ని గుర్తించడానికి సహాయకారులు. వర్ణాశ్రమాలు లేని దేశాన్ని మ్లేచ్ఛదేశమన్నాడు హారిదత్తుడు.[1]

ఆర్యావర్తాన్ని దాటి వున్నదంతా మ్లేచ్ఛదేశమన్నాడు మనువు. పౌండ్రకులు, యవనులు, శకులు, మ్లేచ్ఛ భాషను వాడతారని మనువు చెప్పాడు. యవనులను, శకులను హిందువులు తమ సమాజంలో కలుపుకున్నారని భండార్కర్ తెల్పారు.[2] వర్ణపారిశుద్ధ్యానికి పెద్దగా పట్టుపట్టలేదు. వర్ణాన్ని వేరుగా చూడటాన్ని, జాత్యంహంకారాన్ని వదులుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా పైకి హడావుడి లేకుండా కొత్త వారిని, విజాతీయులను కూడా హిందూ సమాజంలోకి చేర్చుకోవడం సాగించారు. అలా చేయమని ఇంద్రుడు మాంధాతకు చెప్పినట్లు (మహాభారతం - శాంతిపర్వం. 65) కథ ఉన్నది.[3] యవనులను వారిని పోలినవారిని బ్రాహ్మణ ప్రభావంలోకి తెమ్మని దాని భావం. హిందూ మతమంటే బ్రాహ్మణ మతమే కదా! హూణ రాకుమార్తెను భారత రాజు వివాహమాడినట్లు శాసనాల వల్ల తెలుస్తున్నది.[4] అయితే అధికారం కలవారు విజాతీయులైనా, క్షత్రియులైనారు కనుక వారి స్త్రీలు కూడా ఆ వర్ణపు వారుగానే పరిగణింపబడ్డారు. ఇది జాతి భ్రష్టల చరిత్ర.

<u>మతభ్రష్టలు</u> :- వీరు రెండురకాలు. ఇచ్ఛికంగా వేరొక మతాన్ని స్వీకరించినవారు. ఉదాహరణకు - బౌద్ధాన్ని, జైనాన్ని చేపట్టినవారు. అలా కాక ఇతరులచేత బందీలుగా తీసుకోబడి మతమార్పిడికి లోను కావలసి వచ్చిన వారు. ఈ రెండవ కోవకు చెందిన వారికి, ఇతరజాతులకు బందీలయి చిక్కిన వారికి, కొన్ని సామాన్య అంశాలు ఉన్నాయి. అందులో ముఖ్యమైనది స్వాతంత్ర్యాన్ని కోల్పోవటం.

ఇష్టపూర్వకంగా మతం మార్చుకున్న స్త్రీలను గురించి విశదీకరణ చేసేముందు వారెవరో, వారు అలా ఎందుకు చేశారో స్థూలంగా పరిశీలించ వచ్చును. గౌతమ ధర్మసూత్రాలు బ్రహ్మచర్య, గృహస్థాశ్రమాలను మాత్రమే పేర్కొన్నాయి. వైఖానస స్మార్త సూత్రం వానప్రస్థ ఆశ్రమాన్ని ప్రస్తా వించింది. వశిష్ఠుడు బ్రహచర్య, గృహస్థ, వానప్రస్థ, పరివ్రాజక ఆశ్రమాలను పేర్కొన్నాడు. ఇవన్నీ పురుషులకే. స్త్రీలకు ఐచ్ఛికంగా ఉన్నవి రెండే రెండు ఆశ్రమాలు, ఒకటి బ్రహ్మచర్యం, రెండవది గృహస్థాశ్రమం. కాగా భర్త వానప్రస్థాశ్రమాన్ని స్వీకరిస్తే, ధర్మపత్ని కనుక భార్య అతని అడుగు జాడలలో అరణ్యాలలో ఆశ్రమవాసం చేస్తుంది. జీవిత రహస్య ములను గురించి ఆలోచించువాడు ముని. ఇంద్రియములను నియంత్రణం చేయువాడు యతి. ఒకచోట ఉండక ఒక ప్రదేశమునుండి మరియొక ప్రదేశమునకు పోవువాడు పరివ్రాజకుడు. ఆహారాన్ని భిక్షగా స్వీకరించువాడు భిక్షువు. సన్యాస లక్షణాలను మనువు నిర్వచనం చేశాడు. బ్రహ్మచారి అనే పదం ఋగ్వేదంలో, అధర్వవేదంలో కనిపిస్తుంది. వానప్రస్థం వేద వాఙ్మయంలో లేదు. మంత్ర శాస్త్రాన్ని అధ్యయనం చేసి ఆచరించేవారు యతులు. వారు ఇంద్రుని ఆగ్రహానికి గురి అయినారు. యతులు వైదిక ఆర్యులు కారు.[5] ఇంద్రుడు మునులతో స్నేహంగా ఉండేవాడు. రామాయణ కాలంనాటి దక్షిణా పథంలో కన్పించే మునులు బ్రాహ్మణ మత ప్రచారానికి పూనుకున్న పండిత బ్రాహ్మణులు, వారు ఈనాటి క్రైస్తవ మిషనరీల వంటివారు. అందువలననే వారిపై రాక్షసుల దాడులు జరిగేవి. ముని ఆశ్రమాల రక్షణకు రాముడు పూనుకోవటం జరిగింది. యజ్ఞయాగాది క్రతువుల పైన, వర్ణాశ్రమ ధర్మాలపైన, కులధర్మ నిర్వహణపైన నొక్కిపెట్టిన హిందూ మతాన్ని బుద్ధిపూర్వకంగా విడనాడి అనేకమంది స్త్రీలు బౌద్ధ, జైన మతాలను స్వీకరించారు. సన్యాసినులు అయ్యారు. బౌద్ధ భిక్షుకీ సంఘాలలో చేరారు. వీరిని మత భ్రష్టలుగా పరిగణించింది హిందూ సంఘం. తమ సంఘపు స్త్రీలు గృహస్థాశ్రమం స్వీకరించకుండా సరాసరి సన్యాసినులు అవుతారేమోనని భయపడి వివాహాన్ని స్త్రీకి ముఖ్య సంస్కారంగా చేసి, చిన్నతనంలోనే పెళ్ళి చేయటం ఆరంభించారు. అదంతా పూర్వం ప్రస్తావనకు వచ్చింది. ఇలాంటి మత భ్రష్టలను మరల హిందూ సమాజంలో కలుపుకునే ప్రస్తావన అసలు రానే రాలేదు.

ముసల్మానులు దండయాత్ర చేసినపుడు ఈనాటి సింధురాష్ట్రంలో (ఇపుడు పాకిస్తానుకో ఉంది) అనేక హిందూ స్త్రీలను చెరపట్టారు. మతం మార్పించారు. పెళ్ళిళ్ళు చేసుకున్నారు. దానితో వేలమంది హిందూ వనితలు మతభ్రష్టలయ్యారు. వీరిలో ఎవరైనా చెరనుండి తప్పించుకొని పారిపోయి వచ్చినా హిందూ సమాజం వారిని స్వీకరించలేదు. వారిని ముసల్మానులు గానే పరిగణించింది. వెలివేసింది. పంక్తి బాహ్యులను చేసింది. ఈ కష్టాలు భరించలేక ఆ స్త్రీలు మరల తమను చెరపట్టినవారినే ఆశ్రయించారు. ఇది ఒకరకపు కథ. మరొకరకపు చరిత్ర సాగింది. రాజకీయ ఒత్తిడికి లొంగి కొందరు రాజపుత్రులు తమ కన్యలను మొగల్ రాజపుత్రులకు వివాహాలు చేశారు. కాని అట్టి రాజపుత్ర వంశాలవారిని తతిమ్మా వారు మతభ్రష్టులుగా పరిగణించేవారు. వాస్తవానికి మొగలాయీ రాజపుత్రులను వివాహమాడిన హిందూ స్త్రీలు హిందూ మతాన్ని పాటించినట్లు దాఖలాలు ఉన్నాయి. కాగా ముస్లిం భర్తల సాంగత్యం మటుకు వారికి తప్పలేదు. ఇక్కడ మతాను సరణకన్నా విమతస్తుని సాహచర్యానికి ప్రాధాన్యత ఇవ్వబడింది. ఇలా మతభ్రష్టలను నిరసించింది హిందూ సమాజం. మొదటిరకం వారు చెరపట్ట బడి మతం మార్చుకోవలసి వస్తే, రెండవ రకం వారు రాజకీయ ఒత్తిడికి లొంగి మతాంతరుని వివాహం చేసుకున్నారు. ఏదైనా ఫలితం ఒకటే. వారు మత బాహ్యులు.

ఇక బందీల విషయం ఎత్తుకుంటే రామాయణగాథ స్ఫురణకు వస్తుంది. రాక్షస రాజు రావణుని బందీగా ఉన్నందున సీత అపవిత్రురాలయిందట. అందుచేత ఆమెను స్వీకరించ నిరాకరించాడు రాముడు. ఈ సంఘటన వృత్తాంతం ప్రక్షిప్తమని ఆట్రేకరు భావన. సీతయొక్క పాతివ్రత్యానికి దేవతల ధ్రువీకరణకోసం ఆ కథ అల్లారట; ఈ సంజాయిషీ అంత యుక్తి యుక్తంగా లేదు. రాముని శీలాన్ని పరికిస్తే ఇది బోధపడుతుంది. తన రాజ్య ధర్మ నిర్వహణ ఊసే తప్ప మరేమీ ఎరుగడు శ్రీరామచంద్రమూర్తి. తరువాత అయోధ్యలో పట్టాభిషిక్తుడైన తరువాత మరల సీతను వనవాసానికి పంపాడు. ఆ వ్యక్తి సీతను - అంతకుముందు - అగ్నిప్రవేశం చేయమన టంలో ఆశ్చర్యం లేదు. రాముని గురించి కాదు చర్చ, బందీలను ఎలా పరిగణించాలనేదే ప్రశ్న. రావణుడు అనార్యుడు, సీతను సగౌరవంగా చూచాడు. ఆమె ప్రేమను అర్థించాడు. బ్రతిమాలాడు, అదలించాడు, బెదరించాడు. అంతే

కాని అత్యాచారానికి ఒడికట్టలేదు. కాని రాముని సంగతి వేరు. సీత తన యిష్టప్రకారం రావణునితో వెళ్ళిపోలేదని రామునికి తెలుసు. అయినా ఆమెకు పరీక్ష పెట్టాడు. తరువాత హిందువులంతా ఆ విధానాన్ని అనుసరించారు. ఇతరులచేత బందీలుగా కొనిపోబడిన స్త్రీలను నిరసించారు.

హిందూ ధర్మశాస్త్రజ్ఞులలో కొంతమంది ఉదారులు లేకపోలేదు. ఒక స్త్రీని శత్రువులు చెరపట్టినా, దొంగలు ఎత్తుకొని పోయినా, లేక ఆమెను ఇతరులు బలాత్కారంగా చెరిచినా ఆమెను కుటుంబం వదలి వేయరాదని . : ; డు (వశిష్ట ధర్మసూత్రం, XXVIII - 2-3).

భావాన్ని సమర్థించాడు (V - 35). మామూలు ప్రాయశ్చిత్తం చాలునన్నాడు. పరాశరుడు కూడా ఈ విషయంలో ఔదార్యాన్ని ప్రకటించాడు. (X - 26-7). మత్స్య పురాణం అదే చెపుతుంది (227, 126). ఆమె ఇష్టపూర్వకంగా ఏ పాపమూ చేయలేదు. బృహస్పతి అదే అంటాడు; కాకపోతే తగిన ప్రాయశ్చిత్తం ఉండనే ఉందన్నాడు. గర్భం వచ్చిన సరే, బిడ్డను ప్రసవించిన తరువాత ఆ స్త్రీని స్వీకరించమని అత్రి, దేవతలు చెప్పారు. కాని వీరి మాటలను హిందూ సమాజం ఖాతరు చేయలేదు. రాముడు దేవుడయినాడు కనుక మనుష్యుల మాటలు పదలివేసి దేవుడు చేసినట్లే చేశారు. ఇతరులచేత బందీలుగా తీసుకొనిపోబడిన స్త్రీలను బహిష్కృతులనుగా చూచారు. మతం మార్చుకున్నవారికి అంటే ముసల్మాను మతంను వదలిపెట్టిన వారికి మరణశిక్ష విధించారు ముస్లిం పరిపాలకులు. అందువలన హిందువులు ఇలాంటి వైఖరిని అవలంబించారని కొంతమంది అంటారు. అది సరియైన వాదన కాదు. ముసల్మానుల పరిపాలన లేని రాజస్థాను, దక్కను ప్రాంతాలలో కూడ అలాంటి స్త్రీలను సంఘం వెలివేసింది. కనుక హిందూ మనస్తత్వమే దీనికి కారణం.

కులభ్రష్టలను హిందూ మతం ఎలా పరిగణించిందీ మునుపే తరచి చూశాం. ఒక విషయం తథ్యం. స్త్రీల విషయంలో ఏదో కారణం చూపి హిందూ సమాజం చాల కర్కశంగా ప్రవర్తించినదనేది తిరుగులేని సత్యం; మరువరాని పచ్చినిజం.

అధ్యాయం 11

పాదదీపికలు

1. ధర్మశాస్త్రాల చరిత్ర : కానే, 2 వ సంపుటం-మొదటిభాగం పుట 383
2. డిటో : పుట 384
3. డిటో : పుట 389
4. డిటో : పుట 389
5. డిటో : పుట 419
6. హిందూ నాగరికతలో స్త్రీల స్థానం : ఆల్టేకరు పుట 307

అధ్యాయం

12 ఆర్థిక, రాజకీయాలు

సామాజిక రంగంలో స్త్రీల పాత్రను గురించి ఇంతకుక్రితం చాల సవిస్తారంగా వ్రాయడం జరిగింది. కనుక ఆర్థిక రాజకీయ రంగాలలో స్త్రీల పాత్రను గురించి మదింపు వేయాలి. అది చాలా అవసరం.

వేదకాలంలో ఆర్యులు ఎక్కువగా యుద్ధాలలో మునిగి తేలుతూ వుండే వారు. కనుక వారికి స్త్రీల సహకారం ఎంతగానో కావలసి వచ్చింది. స్త్రీలు వ్యవసాయ రంగంలో తమ వంతు పనిని చేసేవారు. విల్లంబులు, బాణాలు తదితర యుద్ధసామాగ్రిని వారు తయారుచేసేవారు. అల్లకం, అద్దకం, బుట్టలు తయారు చేయడం స్త్రీలు చేసేపనులు.

వేదకాలం తరువాత రోజుల్లో స్త్రీలు ఉపాధ్యాయినులుగా ఉండేవారు, ఆచార్యుని భార్యను 'ఆచారాణి' అనేవారు. స్త్రీ ఉపాధ్యాయుని 'ఆచార్యా' అని పిలిచేవారు. వ్యాకరణం, కవిత్వం, సాహిత్యం ఉపాధ్యాయినుల విశిష్ట అభిమాన విషయాలు. వారికి పేరు ప్రఖ్యాతులుండేవి. బౌద్ధ, జైన సమాజాలలో భిక్షుణిలు మత ప్రబోధం చేసేవారు. 'ధర్మదిన్న' లాంటి స్త్రీలు అలా ప్రసిద్ధిగాంచినవారు. వారు బుద్ధుని మెచ్చుకోలు కూడా పొందారు. క్రీ. త. 8 వ శాబ్దంలో 'రూసా' అనే స్త్రీ మంత్రసాని తనంపై ఉద్గ్రంథం వ్రాసింది.1 వ్యాపార రంగంలో స్త్రీలపై ఆంక్షలు లేవు. తక్కువ ఆదాయం కల కుటుంబాలలో స్త్రీలు వ్యాపారం చేసేవారు, సంగీతాన్ని వృత్తిగా సంసారం చేసే స్త్రీలు సాగించినట్లు దాఖలాలు లేవు. రజస్వలాత్పూర్వ వివాహాలు అమలులోకి రావడంతో సంగీత సాధన పెండ్లికి ముందు ఎక్కువగా చేయటానికి అవకాశం ఉండేది కాదు. దరిమిలా సంగీత సాధన ద్వారా జీవనోపాధి సంపాదించుకోవటానికి సభ్యత, సంస్కారమూ అడ్డు వచ్చేవి. కాకపోతే వేశ్యలు, నాట్యగత్తెలు వీరుమాత్రం ఈ వృత్తులను - సంగీతం, నృత్యము - చేపట్టేవారు.

అడి, పాటే స్త్రీల సంఖ్య ఎక్కువగానే ఉండేది. స్త్రీలు ఛత్రి, చామరాలను మోయువారుగాను, కేశాలంకార నిపుణులుగాను వృత్తులు చేసేవారు. కాలం దొర్లి దేవాలయాలు భారీ ఎత్తున వెలసిన కొద్దీ దేవదాసీల సంఖ్య పెరుగ ప్రారంభించింది.

స్త్రీల ఆర్థిక స్థితి గతులను గురించి సమాచారం చాల స్వల్పంగా ఉన్నది సాక్ష్యాధారాలు పెద్దగా లేవు. కావ్యాలనుండి మాత్రమే వారిని గురించి కొంతగా కొంత తెలిసికోగలుగుతున్నాము. కావ్యాలు రాజవంశీయులు, కులీనులు, ధనవంతులు, శ్రేష్ఠులు వీరి జీవితాలను చిత్రించాయి. శ్రామిక స్త్రీల జీవితాలను కథా వస్తువులుగా స్వీకరించిన సాహిత్య గ్రంథాలు ఆ రోజుల్లో అసలు వెలువడనే లేదు. అందుచేత సమాచారం సరిగా లభ్యం కావటంలేదు. అనార్యుల జీవితాలనుండి, సంప్రదాయాలనుండి కొంత విషయం గోచరమయింది. అదైనా అత్యల్పం. పరిశోధకులు ఇప్పటికైనా ఈ లోటును పూడ్చవలసి వున్నది.

రాజకీయరంగంలో :-

స్త్రీలు రాజ్యం చేయదగునా లేదా అనే అంశంపై రెండు అభిప్రాయాలు వుండేవి. రాముడు అరణ్యానికి పోవలసి వచ్చినపుడు సీతకు రాజ్యాధికారం ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చింది (రామాయణం II - 37, 38). పురుష సంతానం లేకుండా యుద్ధంలో చనిపోయిన రాజుల కుమార్తెలకు పట్టం కట్టమని భీష్ముడు యుధిష్ఠరునికి సలహా చెప్పాడు (మహా భారతం XII - 32, 33). 9 వ శతాబ్దం చివరలో ఒరిస్సాలో 'లలితాభరణ దేవుడు' చనిపోగా సామంతుల కోరికలపై రాజు తల్లి పరిపాలించి తరువాత రాజ్యాన్ని మనుమనికి ఒప్పచెప్పింది. స్వంతహక్కుగా రాజ్యం చేసిన స్త్రీల సంఖ్య తక్కువ. బహుశః స్త్రీలు రాజరికం సాగించరాదనే అభిప్రాయం బలపడటం వలన అలా సంభవించిందేమో! ఏకైక రాజపుత్రిక వివాహమాడితే సాధారణంగా ఆమె భర్త రాజు అయ్యేవాడు. 10 వ శతాబ్దంలో 'రాట్ట' అనే రాజకుమార్తె పెండ్లాడితే ఆమె భర్త బాణహట్టవంశీకుడు రాజు అయినాడు.

సాధారణంగా భర్తలు జీవించి వుండగా రాణులు రాజ్యాధికారాన్ని చలాయించేవారు కాదు. కౌశాంబి రాజు ఉదయనుడు బందీ అయినప్పుడు

అతని తల్లి రాజ్యాన్ని పాలించింది. భర్త అలెగ్జాండరుతో జరిగిన పోరులో చనిపోయినా మానగా రాణియుద్ధాన్ని సాగించింది. క్రీ. పూ. 2 వ శతాబ్దంలో తన కుమారుడు అయుక్త వయస్కుడు (మైనరు) గా ఉన్నపుడు తల్లి నాయనికా శాతవాహన రాజ్యభారాన్ని మోసింది. అలాగే మధ్యప్రదేశ్‌లో వాకాటక రాజ్యాన్ని తన కుమారుని తరపున రాణి 'ప్రభావతీ గుప్త' క్రీ. త. 4 వ శతాబ్దంలో పదిఏళ్ళు పాలించింది. క్రీ. త. 1193 లో పృధ్వీరాజుతో సహా తన భర్త 'సామరసీ' చనిపోగా అతని భార్య 'కూర్మాదేవి' మేవాడు రాజ్య పరిపాలనా భారాన్ని స్వీకరించి, కుతుబుద్దీన్‌తో పోరాటంలో సైనికులను నడిపింది. రాణాసింగ్ భార్యలలో ఒకతైన 'కర్ణావతి' చితోడ్ రక్షణ కార్యక్రమంలో ప్రముఖపాత్ర వహించింది. ఇలా ఎన్నో ఉదాహరణలు ఇవ్వొచ్చును.[2] కొల్హాపూర్‌కు చెందిన 'తారాబాయ్', ఇచాలో కరంజికి చెందిన 'అనూబాయ్', ఇందూర్ రాజ్యపు 'అహల్యాబాయి', 'ఝాన్సీ లక్ష్మీబాయి' పేరెన్నికగన్న రాజ్యాధినేతలు. వారు ఎంతో సమర్థతతో రాజ్యపాలన చేశారు.

రాజులు రాజ్యం చేస్తున్న సందర్భాలలో కూడ రాణులకు పలుకుబడి ఉండేది. మహాభారతంలో గాంధారి, కుంతి, ద్రౌపది అలాంటివారు.

కేవలం నామమాత్రపు రాజ్యపాలకులుగా కాక, రాణులు చాలమంది పరిపాలనలో సమర్థవంతంగా జోక్యం కలిగించుకున్నట్లు సాక్ష్యాధారాలు ఉన్నాయి. రాష్ట్రకూట రాజు ధ్రువుని భార్య 'శీల మహాదేవి' భూములను దానం చేసింది. రాష్ట్రకూట రాజు అమోఘవర్షుని కుమార్తె 'రేవక నమ్మడి' (క్రీ. త. 837), సోమసేవ చాళుక్యుని భార్య 'మైలాల దేవి' (క్రీ. త. 1053) చిన్న చిన్న రాజ్యాలను పాలించారు. 'అక్కాదేవి' (క్రీ. త. 1022), 'కుంకుమదేవి' (క్రీ. త. 1077) జిల్లాల పరిపాలనకు బాధ్యత వహించారు. కాకతీయ సామ్రాజ్ఞి రుద్రమదేవి తెలుగుదేశపు రాణి. వీరంతా ఎంతో రాజకీయ చతురను, పరిపాలనా నైపుణ్యాన్ని, సమర్థతను ప్రదర్శించారు.[3]

సామాన్య జాతులకు చెందిన స్త్రీ, పురుషుల జోక్యం పరిపాలనలో ఎంతగా ఉందో చూద్దాం. వేదకాలంలో ప్రజాస్వామ్య సభలుండేవి. ఆ సభలలో

వధువు పాల్గొనగలదనే ఆశాభావాన్ని వెలిబుచ్చే ఋక్కు ఋగ్వేదంలో ఉన్నది. (ఋగ్వే X - 85, 26). కనుక కొందరు స్త్రీలు వీటిలో పాల్గొని వుండవచ్చని ఊహించవచ్చును. తరువాత కాలంలో పరిస్థితులు మారాయి. స్త్రీలు రాజకీయ నిర్ణయాలు చేసే సభలకు పోవటం మానుకున్నట్లు తెలుస్తున్నది (మనుస్మృతి IV - 7, 4). తరువాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ప్రభుత్వాలుగా అంతరించాయి. కేవలం గ్రామ సభలు, శ్రేణులు, వృత్తి సంఘాలు రంగంలో మిగిలాయి (క్రీ. 200 నుండి క్రీ. త. 1200 వరకు). స్త్రీలు వీటిలో కూడ పాల్గొనే అవకాశం నశించింది. 1900 సంవత్సరం వరకు ఇలాగే సాగింది.[4]

ఏనాడు రజస్వలాత్పూర్వ వివాహాలు అవతరించాయో, ఏనాడు స్త్రీ త్వరగా చిన్నవయస్సులోనే మాతృత్వభారం వహించిందో ఆనాడే ఆమెకు సామాజిక, రాజకీయ అవకాశాలు సన్నగిల్లినాయి. రాజకీయాధికారం కల సభలు - ఒకటో అరో ఉన్నా - ఆమెకు ప్రవేశం లేనివైనాయి. రాజకీయాధికారం ఆమెకు అలా దూరమయిపోయింది.

కొంతమంది స్త్రీలు రాజ్యాధికారాన్ని చలాయించిన కారణం చూపి స్త్రీలను హిందూ సమాజం ఆదరించిందని చెప్పి తమకు తామే ధ్రువపత్రాలను ఇచ్చుకునే సంప్రదాయ వాదులు ఈ దేశంలో లేకపోలేదు. పురుషుడు రాజ్యం చేసినా, స్త్రీ రాజ్యం ఏలినా విషయమొకటే. తేడా బహుస్వల్పం. శాసనాలు, ధర్మాలు పురుష నిర్మితాలు. ధర్మశాస్త్ర కర్తలు పురుషులు. ఋక్కులు గానం చేసిన ఋషులలో ఋగ్వేదకాలంలో స్త్రీలున్నారు కాని, ఆచార్య పథాన్ని అనుసరించిన అతివలున్నారు కాని, ధర్మసూత్ర కారులుగా కర్తలుగా, ధర్మశాస్త్ర రచయితలుగా, భాష్యకారులుగా, ధర్మకోశ నిర్మాతలుగా స్త్రీలు కలికానికి కనబడరు. తులసీదాస్ లాంటివారు కూడా స్త్రీలను గురించి నిందావాక్యాలు పలికారని బాధపడుదూ మహాత్మాగాంధి ఇలా చెప్పాడు. ప్రాచీన శాసనాలను (ధర్మాలను) పురుషులు రూపొందించారు. ఋషులయినా, ద్రష్టలయినా స్త్రీలను గురించి వాస్తవ జ్ఞాన లేమి వారిలో చోటుచేసుకుంది.[5] కనుక సర్వసాధారణంగా వారు తయారుచేసిన శాసనాలు పురుషుని పెత్తనానికి అనుకూలంగానే ఉన్నాయి. స్త్రీ శ్రేయస్సుకు భంగకరంగా ఉన్నాయి.

అలాంటి శాసనాలను, సామాజిక ధర్మాలను పురుషులు అమలుపరచినా స్త్రీలు చలామణీ చేయించినా ఫలితం ఒకటే. ఏరాయి అయితే నేమి పన్ను ఊడటానికి? ఎవరైనా ఒకటే అయినప్పుడు రాజకీయాధికారం కావాలని స్త్రీలు ఎందుకు కోరుతున్నారు? అనేది జటిల ప్రశ్నగా కొందరికి కన్పించవచ్చు. జాగ్రత్తగా పరికిస్తే ఇందులో చిక్కు ఏమీలేదు. సామాజిక ధర్మాల స్వభావమేమిటి, రాజకీయ శాసనాల రూపు రేఖలు ఏమిటి? అనేది ముఖ్యాంశము. కాగా పెత్తనం చేసే పురుషునికి స్త్రీ బాధలు, వ్యధలు సర్వసామాన్యంగా తెలియవు. ఒకరిద్దరు పురుష పుంగవులు సానుభూతి చూపినా వారి మాటలను ఎవరూ వినరు. అత్రి మాటలను, దేవలుని ఉపదేశాలను ఎవరు పట్టించుకున్నారు? పోనీ స్త్రీకి స్త్రీ బాధలు, వ్యధలు తెలుస్తాయి కదా ఆమె రాజ్యాధికారాన్ని చలాయిస్తే చాలదా? చాలదు. చైతన్యం కల ఏ ఒక్క స్త్రీ రాణి అయినా, తతిమ్మా స్త్రీలకు రాజకీయాధికారం లేనపుడు ఏమీ చేయలేదు; స్త్రీ జనాభ్యుదయాన్ని సాధించ లేదు. కారణం ఒక్కటే ఒకటి. ఆమెకు ప్రజలు అంటే రాజాకీయాధి కారంకల ప్రజలు అంటే పురుషులు బలపరచరు; స్త్రీలకు ప్రవేశమూ హక్కులుంటే సామాన్యంగా స్త్రీ జన పురోగతిని సాధించ పూనుకున్న రాణులు మద్దతు ఇచ్చేవారే. కాని స్త్రీలకు ఆ హక్కులు లేకుండా అశక్తులను చేసింది కదా పురుషాధిక్య సమాజం. ఈ పరిస్థితిలో రాణి ఏకాకి అవుతుంది. ఒక వేళ ఆమెకు చైతన్యం ఉన్నా (ఆనాటి రాణులకు లేదనుకోండి) లాభంలేదు. ఆమె మహిళా ప్రగతికి వ్యతిరేకమైన శాసనాలను, ధర్మాలను అమలు జరిపి తన పదవిని నిలుపుకుంటుంది. అలాంటి వారిని ఎంతమందిని చూడటం లేదు ఈ 20 వ శతాబ్దంలో కూడా? స్త్రీ హోదా విపరీతంగా తగ్గిపోయింది సామాజిక రంగంలో. ఆర్థికంగా ఆస్తిహక్కు వచ్చింది. అది లాభించేది ఆస్తి ఉన్న కుటుంబాల వారికి మాత్రమే. పోనీ వారైనా దానిని వినియో గించుకోవచ్చుకదా అంటే వారు సర్వదా పతివ్రతలు. పతికోసం వారు ఎంత త్యాగమైనా చేయగలరు. కనుక వారికి ఆ ఆస్తి ఉండి ఏమి లాభం? దాని ప్రయోజనం వారి భర్తలకే చెందేది. ఇకపోతే రాజకీయాధికారాన్ని వినియో గించి శాసనాలను ధర్మాలను మార్పుచేయించవచ్చుకదా! అని భావిస్తే స్త్రీలకు రాజకీయహక్కులు లేవు. (బ్రిటిషు వనితలు పోరాడి 1919 లో వోటుహక్కు తెచ్చుకుంటే ఆ వోటు హక్కు ననాయాసంగా భారత మహిళలకూ

దక్కించింది). కనుక సమాజ ధర్మాలు మారలేదు; శాసనాలు మారలేదు మౌలికంగా. ఇలా సామాజిక రంగం ఆర్థిక రంగాన్ని ప్రభావితం చేసింది. రాజకీయంగా స్త్రీలు ఈ పరిస్థితిని మార్చలేకపోయారు. హిందూ సమాజపు పరిణామ చరిత్ర స్త్రీలకు సంబంధించినంతవరకు - ఇలా సాగింది.

అధ్యాయం 12

పాదదీపికలు

1. హిందూ నాగరికతలో స్త్రీల స్థానం : అల్టేరు పుట-180
2. డిటో డిటో పుటలు 185 - 187
3. డిటో డిటో పుటలు 189 - 190
4. డిటో డిటో పుటలు 190. 191
5. బాపూ ఉత్తరాలు - 1 ఆశ్రమ సోదరీలకు
   తే. 6-12-26 నుండి తే. 30-12-1929 వరకు
   సం॥ కాకాసాహెబ్ కలేల్కర్ (నవజీవన పబ్లిషింగు
   హౌస్, అహమ్మదాబాద్ - 14, 1960) : పుట 98

అధ్యాయం

13 హైందవ విశిష్టత

హైందవ సమాజం స్త్రీలకు ఏ స్థానాన్ని సమాజంలో కేటాయించిందో, వారి వ్యక్తిత్వాన్ని ఎలా కాలరాచిందో, వారి హక్కులను ఎలా కబళించిందో మనం చూచాం. ఇలాంటి సమాజాన్ని నడిపిస్తున్న భావనా ప్రపంచం ఏది? దీని వెనుకనున్న తాత్విక చింతన ఎట్టిది? హిందువుల తాత్త్విక ధోరణి వారి జీవితాలను ఏ మేరకు ప్రభావితం చేసింది? అనే విషయాలను తరచి చూడటం అత్యవసరం; అవశ్య కర్తవ్యం కూడాను.

సింధు నాగరికత నాటి అనార్యులు నగరాలు నిర్మించుకొని ప్రశాంత జీవితం సాగిస్తున్నారు. వారిమీద ఆర్యులు విరుచుకొని పడ్డారు. నగరాలను ధ్వంసం చేశారు. వారు పూజించేదేవతలను 'పురందరుడని' అందుకే పిలిచారు. జీవితంలో ప్రశాంతతను అలవరచుకున్నందున అనార్యులు ఆర్యుల దాడిని తట్టులేకపోయారు. ఆర్యులలో క్రొత్తదనం, సాహసం, నాయకత్వం, సమస్యా సాధనశక్తి, నిర్ణయాత్మక శక్తి లక్షణాలుగా కనిపించాయి. అనార్యుల నుండి వారు దేవతలనే గాక, ప్రత్తి వాడకం, పశువుల పెంపకం, వ్యవసాయంలో కొన్ని మెళుకువలు వీటిని తమవిగా చేసుకున్నారు.

హరప్పా క్రీ. పూ. 1500 లో ఆర్యులచేతికి చిక్కింది. అలాగే 'ప్రాతిహారస్' అనే పట్టణం క్రీ. పూ. 1000 తో ఆర్యులవశమయింది. ఈ 500 సంవత్సరాల కాలంలో ఆర్య నాగరికత వెల్లివిరిసింది. ఆర్య సంస్కృతి పుష్పించింది.

మౌర్యుల కాలంలో ప్రభుత్వమే కొన్ని పరిశ్రమలను నడిపేది. 'స్టేట్ సోషలిజం' ఉండేదని ఒక అభిప్రాయం. గనులు, నేతకర్మాగారాలు, నూలుకర్మాగారాలు ప్రభుత్వ ఆధీనంలో ఉండేవి. 500 కుమ్మర

సారెలున్న కర్మాగారం శ్రావస్తిలో ఉండేదట. అలెగ్జాండరును పురుషోత్తముడు నిలువరించి పోరాడాడు. దానితో అలెగ్జాండరు బీస్‌నదిని దాటి తూర్పుకు పురోగమించ సాహసించలేకపోయాడు. చంద్రగుప్త మౌర్యునితో (క్రీ. పూ. 331 - 324) అలెగ్జాండరు సేనాపతి సెల్యూకస్ రాజీకి రావలసి వచ్చింది. సముద్రగుప్తుడు శకులను, పుష్యమిత్రుడు బాక్ట్రియను గ్రీకులను ఎదిరించారు. స్కంద గుప్తుడు (క్రీ. శ. 455 - 467) హూణులను ఆపగలగాడు. అశోకుడు నెలకొల్పిన స్తంభాలు ఈనాటికీ తమ కాంతులను వెదజల్లుతున్నాయి. క్రీ. శ. 500 ప్రాంతంలో ఆర్యభట్టు సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. భూమి తనచుట్టూ తానే తిరుగుతున్నదని ప్రకటించాడు. గణిత శాస్త్రంలో పురోగతి అత్యద్భుతం. సున్నా, అనంతం, బీజగణితం, దశాంశం ఇవన్నీ భారతదేశంనుండే ప్రపంచానికి అందాయి. సంఖ్యలకు ధన రుణ లక్షణాలను కనిపెట్టారు. 'పై' యొక్క విలువను ఆర్యభట్టు 62832, 20, 000 గా చెప్పాడు. తరువాతవచ్చిన గణిత శాస్త్రజ్ఞులు దానిని 9 వ దశాంశం వరకు గుణించారు. స్క్వేరు రూటు (Square Root), క్యూబికురూటు (Cubic Root) వీటిని కనుగొనే పటిష్టమైన పద్ధతిని కనిపెట్టారు. శూన్యం (సున్నా) ను సరిగా అంచనా వేశారు. పూర్వం ఏ అంకెనయినా శూన్యంతో భాగహారం చేస్తే ఆ వస్తువు మాత్రమే వస్తుందని భావించేవారు. భాస్కరుడు అలా కాదని అప్పుడు అనంతం వస్తుందని తేల్చాడు. అలాగే అనంతాన్ని దేనితో భాగహారం చేసినా అనంతం వస్తుందని రూఢి అయింది ఏనాడో. భౌతికశాస్త్రంలో ఈనాటి అణుసిద్ధాంతాన్ని ఏనాడో ఆర్యులు ప్రతిపాదించారు. ఈనాటికీ తుప్పు పట్టని ఢిల్లీ ఉక్కు స్తంభం వారి లోహ శాస్త్రజ్ఞానానికి ప్రతీక. వైద్యంలో ఆనాడు ముందంజ వేశారు. శస్త్రచికిత్సలో, ఎముకలను సరిదిద్దటంలో, ఇంకా ఇతరత్రా ఎన్నో శాఖలలో అభివృద్ధి జరిగింది. మందులలో ఎంతో పురోగమనం సాధించారు. ఉద్యాన వనాలు, తీర్చిదిద్దిన వీధులు, నీళ్ళుచల్లిన వీధులు, పుర ప్రాకారాలు, సభా భవనాలు, నాట్యశాలలు, వీధి దీపాలు, జూదగృహాలు, న్యాయస్థానాలు, వ్యాపార స్థలాలు, చేతివృత్తులవారికి ప్రత్యేక ప్రదేశాలు ఇలా ఎంతో శోభతో నగరాలు మిరుమిట్లు కొలిపేవట. బౌద్ధుల కథలలో ఈ వర్ణన ఉంది. నీతి, నిజాయితీలకు సామాజిక జీవితంలో అత్యధిక స్థానం ఉండేదట. అనృతం (అబద్ధం) పలికేవారు కారట. తలుపులకు సాధారణంగా గడియలు వేసుకునేవారు కారట. మెగస్తనీసు వీటిని గురించి ఎంతో కొనియాడాడు.

చంద్రగుప్త మౌర్యుని కాలంలో (క్రీ. పూ. 350) హైందవ నాగరికత ఉచ్ఛస్థాయిలో వుంది. గుప్తులకాలం నాటికి (క్రీ. శ. 350 - 400) అది ఉన్నతోన్నత స్థానాన్ని చేరుకుంది. తరువాత క్షీణదశ ప్రారంభం అని దాస్ గుప్తా అభిప్రాయం.1 క్రీ. శ. 1001 నాటికి, మహమ్మద్ గజనీ దండయాత్ర నాటికి హైందవం యొక్క రాజకీయ పతనం ప్రారంభమయింది.

యజ్ఞయాగాది క్రతువులతో, సాధు జీవిత విధానంతో, వర్ణతత్వ వివక్షతో విసిగిపోయిన ప్రజలకు బౌద్ధమతం కొంతకాలం ఆశ్రయం ఇచ్చింది. తరువాత బౌద్ధం కూడా హైందవంలో భాగమయింది.

ఇంత ప్రతిభా వ్యుత్పత్తులను చూపిన హైందవ సమాజం ఎందుకు విదేశీయుల దండయాత్రలకు తల ఒగ్గింది? ఎందుకు నూతన స్వేచ్ఛా వాయువులను పీల్చలేకపోయింది. షుమారు వెయ్యి సంవత్సరాలు ఎందుకు వెనుకబడిపోయింది? వీటికి సమాధానాలు వెదకికోవటం అత్యావశ్యకం. ఏ జాతి మార్పు చెందదో, ఏ సమాజం మార్పును కోరదో ఆ జాతి చరిత్ర పరుగులో వెనుకబడి పోతుందనేది పచ్చినిజం, అనుభవైక సత్యం.

వేదాలు- ధర్మసూత్రాలు, ఇతిహాసాలు, భగవద్గీత, సంహితలు, ఇతర ధర్మశాస్త్రాలు, వాటి భాష్యాలు, అన్వయాలు అన్నీ సనాతన హైందవాన్ని రూపొందించాయి. వేదాలలో వర్ణవ్యవస్థ ఉన్నది, ఇతిహాసాలలో వానిని గట్టిపరచడం జరిగింది. భగవద్గీతలో దానికి తాత్విక ప్రాతిపదిక ఇవ్వడం సంభవించింది. తరువాత వచ్చిన ధర్మశాస్త్రాలు దానిని కట్టుదిట్టం చేశాయి. ఈ వర్ణవ్యవస్థ, కుల కట్టడి హైందవాన్ని నీరసింప చేసింది. ధర్మాన్ని పాలించటం అంటే వర్ణ నిర్దేశిత ధర్మాన్ని నిర్వహించడం, ప్రాపంచిక జీవితంపై విసుగు, కర్మసూత్రంపై విశ్వాసం, జన్మపరంపర సిద్ధాంతంపై నమ్మకం, శరణం పొందే మనస్తత్వం, యోగంపై మోజు, కులం ఈ ఏడు అంశాలు సనాతన ధర్మాన్ని పోషించాయి. అంతేకాదు 2 వేల సంవత్సరాలు ఇతర సంస్కృతుల దాడిని ఎదుర్కొనేలాగా హైందవాన్ని తయారు చేసాయి. శరణు జొచ్చే భావన 15 వ శతాబ్దం నాటికి భక్తి ఉద్యమానికి పునాదిరాయి అని, యోగం అంటే ప్రజ్ఞద్వారా సమాధ్యవస్థను సాధించి (అంటే చిత్త వృత్తులను నిరోధించి), మానసిక శక్తులను పెంపొందించుకొని సృష్టికర్తతో

నరానకి సంబంధం ఏర్పరచుకోవటం అంటే తాదాత్మ్యం పొందటం అని తెలిసికొని ఆ లక్ష్యాన్ని సాధించటం హిందువుల దృష్టిని ఆధ్యాత్మికంవైపు మళ్ళిందని మనం గ్రహించాలి. ఇక కులతత్వం సంగతి సర్వజన విదితం. సమాజాన్ని ముక్కలు ముక్కలుగా చీల్చింది. ఒక కులానికి మరొక కులానికి మధ్య అడ్డుగోడలు నిర్మించింది. సహపంక్తి భోజనాలను, వర్ణాంతర, కులాంతర వివాహాలను నిషేధించింది. స్పర్శలోనే కాక, దృష్టిలో కూడ అపవిత్రతను సృష్టించింది. అసహన భావాన్ని పెంపొందించింది. వేర్పాటుకు తాత్విక ప్రాతిపదికను అందిచ్చింది. సమాజాన్ని మార్పునుండి వెనుకకు మళ్ళించింది.

ఆనాటి మమాజంలో ప్రకృతి వనరులు తగినంతగా ఉన్నాయి. ఉన్నదాంతో తృప్తిపడే సమాజం ఉద్భవించింది. సర్వసామాన్యంగా మార్పుకు దోహదం చేసే లక్షణాలను తమ సమాజానికి ఉన్నట్లుగా అర్థం చెప్పుకొని తృప్తిపడ్డారు పూర్వీకులు. పుట్టుకనుంచి చావువరకు వచ్చే ప్రశ్నలకు అన్నింటికి సమాధానాలు చెప్పుకున్నారు. సాధారణంగా మార్పుకు ప్రేరకాలు ఏడు. భద్రత కోసం, ఉన్నత జీవన ప్రమాణం కోసం ఆరాటం మనిషిని ముందుకు నడిపిస్తుంది. కాని హిందువులకు ఆ యావ లేదు. సంపదపై వాంఛలేదు. సంతృప్తి వారి లక్షణం. కులధర్మ నిర్వహణ వారి విద్యుక్త ధర్మం సమాజంలో 'నేను నా సమాజానికి చెందిన వ్యక్తిని' అనే భావం ఉంటే సమాజంలో తానొకడై పురోగమించటం జరుగుతుంది. కులం, కర్మ సిద్ధాంతం, జన్మ పరంపరా సూత్రం ఇవన్నీ కలసి హిందువుకు కులంలో, హిందూ సమాజంలో ఆ భావాన్ని కలిగించాయి. దాంతో ఆతనిలో వైమనస్యత (Alienation) చోటు చేసుకోలేదు. ఆత్మగౌరవ భావనకూడా అభ్యుదయానికి దారి తీస్తుంది. అలాగే ఆత్మ సాక్షాత్కారం కూడా. ఈ రెండూ కులంలోనే లభించాయి హిందువుకు. వ్యక్తిని మించి విశ్వ వ్యవస్థతో తాదాత్మ్యం చెందుటకూడా పరిణామానికి ఉపకరిస్తుంది. ఈ భావాన్ని వేదాంతంలో, గీతా బోధనలో, 'తత్వమసి' అనే వాక్యంలో గ్రహించాడు హిందువు; గ్రహించింది హిందూ స్త్రీ. సామాజిక న్యాయంకోసం తహతహ వర్తనానికి బాటవేస్తుంది. కాని హిందువు తన కులవ్యవస్థలోనే సామాజిక న్యాయాన్ని దర్శించటం జరిగింది. హైందవం తరతమయుతమైన అసమానత్వాన్ని సమానత్వంగా చిత్రించుకుంది. సామాజిక ఆచారాలను, ఆలవాట్లను

ఆలోచనా ధారలను ఎదిరించే శక్తులు ఉద్భవిల్లిననాడు సమాజం మారుతుంది. అయితే అలాంటి శక్తులు హైందవంలో పుట్టకపోలేదు. సమాజంనుండి పారిపోయి 'సాధు' జీవితం గడిపినవారు, చార్వాకులు అలాంటివారు. అలా హిందువులు భౌతికానందానికన్నా, ఆత్మానందానికి ప్రాముఖ్యత ఇచ్చారు. గతాన్ని గురించి ఆలోచించటం, వ్యక్తిత్వానికి ప్రాధాన్యత ఇవ్వకపోవటం, సంప్రదాయాన్ని పాటించటం హైందవ లక్షణాలు.[2]

ఎస్. ఎన్. దాస్ గుప్తా అభిప్రాయం ప్రకారం భారత భావ వాదం వెనుక ఆరు పిడివాద సిద్ధాంతాలు ఉన్నాయి. 1) పునర్జన్మ, 2) కర్మ సిద్ధాంతం, 3) మోక్షం, 4) మానసిక స్వభావానికి, ఆధ్యాత్మిక స్వభావానికి మధ్య అంతరం, 5) ఆధ్యాత్మికానుభూతికి ఎక్కువ విలువ ఇవ్వడం, 6) మత గ్రంధాల ప్రామాణ్యత తిరుగులేనిదనటం. హిందూ మనస్తత్వంలో ఈ అతార్కిక భావనలు చోటుచేసుకోవటం ఆశ్చర్యకరమన్నాడు దాస్‌గుప్తా[3] ఇవన్నీ పిడివాదాలు. వీటిని రుజువు చేయవలసిన అవసరం హిందువుకు కనిపించదు. శివుని దేవునిగా స్వీకరించటంలో హైందవ మనస్తత్వం గోచరిస్తుంది. శక్తికీ, రక్షణకూ, సంతానోత్పాదనకూ ప్రతీక శివుడు.

హైందవ ఆచారాలూ, సంప్రదాయాలూ, విలువలూ అన్నీ హిందువుల చైతన్య స్థాయిలోని, అచేతన స్థాయిలోని అవసరాలను బట్టి పుట్టాయి, పెరిగాయి. వారి మనః కవాటాలను మూసివేశారు, వారి సమాజ ద్వారాలను పూడ్చివేశారు. ఇదంతా జరగడానికి కారణం హైందవ సంస్కృతికి భిన్నమయిన సంస్కృతులు కల విదేశీయులు దండెత్తిరావడం. లేక దేశంలోకి చొచ్చుకరావడమే. ఇది మానసిక సబంధమైన 'రక్షణ చర్య' ఫలితం. తమ సంస్కృతి రక్షణార్థం హైందవ జాతి చేపట్టిన మార్గమిది. ఇది సమాజ స్తబ్ధతకు దారి తీసింది. శుభయూదాస్ గుప్తా యొక్క ఈ అభిప్రాయం సరియైనదే,

హిందూ సమాజాన్ని పట్టుకొని వ్రేలాడుతున్నవి ముఖ్యంగా రెండు భావాలు. 1) పవిత్రతను గురించి భావన, 2) వర్గీకరణ చేసి దానిని చివరవరకు కొనసాగించడం. ఈ రెండూ హైందవ జీవితంపై ఎనలేని ప్రభావాన్ని చూపాయి. కులవ్యవస్థ, కులాల ధర్మాల నిర్దేశన, నిబంధనలను

విపరీతంగా పెంచడం, వాటిని పాటించని వానిని వెలివేయడం, ఇవన్నీ హైందవ వర్గీకరణమైన 'నిర్దిష్టమైన క్రమంపై మక్కువ' వీటిపై ఆధారపడు తున్నాయి. సంస్కృత వ్యాకరణ సూత్రాలు, బీజగణితం, దశాంశపద్ధతి వీటిని కనుగొనటం ఈ మనస్తత్వ ఫలితమే. వర్గీకరణ, క్రమం, నియమం ఇవి ఆ భావన యొక్క విశిష్ట లక్షణాలు. దాంతో పవిత్రత పేరుతో ఛాందసం, అసహనం సమాజంలో చోటుచేసుకున్నాయి. క్రీ. పూ. 600 నుండి క్రీ. శ. 600 వరకు వున్న సృజనాత్మకత నశించింది. యుద్ధాలలో ఓటమి గతవైభవాన్ని తలపింపచేసి లేని తృప్తిని ఇచ్చింది. భౌతిక జీవితంలో మెరుగుదల లేకపోయినా తాత్వికంగా, ఉద్వేగపరంగా సమాధానం చెప్పుకొని జీవయాత్ర చేశారు. భయం (మలినమయి పోతామేమోనని), ఆందోళన జీవితంలోకి ప్రవేశించాయి. రక్షకుడు కావలసి వచ్చాడు. గురువు వచ్చాడు రంగంపైకి. నిబంధనలను నియమాలను, పాటించడం కష్టమవుతున్నది. వాటిని అతిక్రమిస్తే దోషభావం మనస్సులో పుట్టుతున్నది. దానిని ఉదాత్తం చేయలేకపోయింది హైందవం. అసంబద్ధ విషయాలు సమాజ భావనలో చోటుచేసుకున్నాయి. ఒక వైపు విశ్వాత్మ భావన; మరోవైపు సంకుచిత కులతత్వం. ఒకవైపు దౌర్జన్య రాహిత్యం; మరోవైపు సతీసహగమనాన్ని అమలుపరచటంలో విధవపై దౌర్జన్యం, హింస. ఒకవైపు ప్రపంచం మిధ్యయనే భావం; మరోవైపు బ్రాహ్మణులకు సమాజంలో ఉన్నత స్థానాన్ని కట్టబెట్టడం, వారికి ఇతోధిక సదుపాయాలు సౌకర్యాలు కలుగజేయడం. అంతేగాక ప్రాయశ్చిత్త చర్య తేలిక అవడంతో మరల పాపం చేయడానికి అవకాశం ఎక్కువయింది, నియమాలను అతిక్రమిస్తే లాభాలు, ప్రయోజనాలు ఎక్కువగా కన్పించాయి. ఇలా మౌలికంగా అసంబద్ధమైన వైఖరులను ప్రదర్శించింది హైందవం.

యోగంపై వ్యామోహం సమాధిస్థితిని ఆశించేటట్లు చేసింది. దానికి గురువు అవసరమయ్యాడు. గురువు అంటే వ్యక్తికి బాహ్యమైన అధికారి. తండ్రిలాంటివాడు. తనపై అధికారాన్ని చలాయించువాడు. అసలు భగవంతుడే రక్షకుడు. ఆ భగవంతునికి హిందూ వ్యక్తికి మధ్య మనిషి గురువు. ఇలా భవిష్యత్‌పై ఆశలు పోగొట్టుకున్న హిందూ వ్యక్తి, కట్టుదిట్టం చేయబడిన వ్యక్తిత్వాన్ని, నియమ నిబంధనలలో నలిగిపోయే వ్యక్తిత్వాన్ని పొందడం జరిగింది. ఇతరులపై ఆధార పడటం సర్వసాధారణ మయింది. దేవుడు

గురువు అలా వెలుపలినుండి అతనికి లేక ఆమెకు బలాన్ని ఇచ్చే శక్తులుగా రూపొందారు.

కర్మసిద్ధాంతం విధిసూత్రంపై నమ్మకానికి దారి తీసింది. హైందవ సమాజంలోని అస్థిరత్వం హిందువు అంతర్ముఖుడయ్యే పరిస్థితిని కల్పించింది. అహింసా సిద్ధాంతంలో విశ్వాసం శాఖాహార భోజనాన్ని మాత్రమే స్వీకరించే టట్లు చేయలేదు. జీవితంలో ఎదుర్కోవలసిన సంఘటనలు ఒకవైపు, ధర్మ సూత్రాలు మరోవైపు హిందువును ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఈ జన్మలో నిష్కృతి కనిపించడంలేదు. వచ్చేజన్మకోసం ఎదురుచూడటం అలవాటయింది. అది తరువాతి తేదీ వేసిన చెక్కులాంటిది. (పోస్టుడేటెడ్‌చెక్కు) దానికి ప్రతిఫలం పైకం ముట్టవచ్చును లేక పైకం లభ్యం కాకపోవచ్చును. కనుక బాహిరమైన శక్తిపై (దేవుడు, గురువు) అధారపడటం సాగింది. అంటే ఆ శక్తికి పూర్తిగా లొంగిపోయి 'మామేకం శరణం వ్రజ' అనే సూత్రార్థాన్ని పోషించటం జరుగుతున్నది. పరాధీనపు బ్రతుకు అలవాటుపడిన వ్యక్తి ఇతరులపై అధికారం చలాయించే మనస్తత్వాన్ని అలవరచుకుంటాడు. బాహ్య శక్తులను శరణుజొచ్చిన హిందువు అధికార మనస్తత్వాన్ని స్వంతం చేసు కుంటాడు. కనుక 'శరణం కోరడం' అతని స్వభావంలో ముఖ్యలక్షణ మవుతుంది. తనని నడిపించటానికి పెద్దలు - ఋషులు, ధర్మసూత్ర రచయితలు, ఇతిహాసాలలో భీష్మాదులు, ధర్మశాస్త్ర కారులు - ఏర్పరచిన నియమాలను నిబంధనలను హిందువు కౌగిలించుకుంటాడు. అవి అతనికి లేక ఆమెకు పట్టుకొమ్మలు. ఆ ఆధారాలను విడనాడడం ప్రాణత్యాగంతో సమానం. కనుకనే హిందువులు నాయకుల జయంతులు, వర్ధంతులు ఉత్సాహంగా జరుపుకుంటారు. హైందవం నియమాల సంస్కృతి దశ. కాని అప్పు డప్పుడు తమ లాభంకోసం నియమాలను అతిక్రమిస్తారు. అది అలవాటు అవుతుంది. అవినీతిని స్వీకరించడం సంభవిస్తుంది. అయినా ధర్మ పన్నాలను ఏ కరువు పెట్టటం మానరు. అసంబద్ధమైన విషయాలను ఆదరిస్తారు. చెప్పేది ఒకటి, చేసేది మరియొకటి. పరస్పర విశ్వాసం గాలిలోకి ఎగిరిపోతుంది. అసహనం ప్రబలుతుంది. అధికార మనస్తత్వంతో సంచరిస్తాడు హిందువు. అధికార మనస్తత్వ ప్రభావంలో ఉండే సమాజం అధికారం చెలరేగే కుటుంబానికి దారితీస్తుంది. అంటే కుటుంబంలో పురుషుడు స్త్రీపై, పిల్లలపై అధికారం చలాయిస్తాడు. 'ఇది నీ విధి' అని స్త్రీని శాసిస్తాడు.

ఆమెకు ధర్మబోధ చేస్తాడు. ఆమె మెదడును క్షాళనం చేస్తాడు. ఆమె బుర్రలో తన భావాలను చొప్పిస్తాడు, హైందవం స్త్రీని అలా మానసికంగా లొంగతీసుకున్నది. ఎదురు తిరిగిన స్త్రీని శిక్షించింది. కష్టనష్టాలపాలు చేసింది. అలా హైందవం స్త్రీలను పురుషునికి, కుటుంబానికి, సమాజానికి బానిసను చేసింది. ఆమె వ్యక్తిత్వాన్ని చిదిమి వేసింది. ఆమె ఆలోచనా శక్తికి ఆనకట్టలు కట్టింది. ఆమె సృజనాత్మకను మంట కలిపింది. ఆమె కార్యాచరణను నిరోధించింది. ఆమెను కాళ్ళూ చేతులూ కట్టి ఇంట్లో పడ వేసింది. ఆమెను ఓదార్చటానికి 'ఇల్లాలు', 'గృహిణి', 'గృహ సామ్రాజ్ఞి' అని బిరుదులిచ్చింది. 'మతాన్ని, జాతిని కాపాడేది నీవే' నని స్తుతించింది. 'నీ వల్లనే ఈ మాత్రమైనా హైందవం మనుగడ సాగిస్తున్నదని ఆమెను పొగిడింది. ఇదంతా నిజమనే నమ్మే స్త్రీలు ఇంకా ఉన్నారు.

ఈ హైందవ సామాజికాచారాలను, సంప్రదాయాలను, ఆలోచనా స్రవంతిని, భావనా విధానాన్ని నిలబెట్టూ దీనికి, నిజానికి, మూలస్తంభాలుగా ఉంటున్నవారు మతగురువులు, పూజారులు. వీరిని గురించి, కులతత్వాన్ని నిర్ద్వందంగా ఖండించిన వివేకానందుడు ఏమన్నాడో గమనిద్దాం. అస్పృశ్యతను నిరసిస్తూ తన దేశస్తులకు చెప్పినమాటలు ఇవి :-

"రండి. మనుషులు కండి. మతగురువులను, పూజారులను తన్ని పారేయండి. వారు అభ్యుదయానికి వ్యతిరేకులు; వారు ఎన్నటికీ మారరు. వారికి హృదయ వైశాల్యం అబ్బదు. శతాబ్దాల తరబడి సాగిన మౌఢ్యానికీ, నిరంకుశత్వానికి వారు వారసులు. మున్ముందుగా పూజారీ విధానాన్ని నిర్మూలించండి. రండి. మానవులుగా తయారవ్వండి. మీ సంకుచిత పరిధినుండి వెలువడి, చుట్టూ ఉన్న ఇతర ప్రపంచాన్ని గమనించండి. దేశాలు ఎలా పురోగమనిస్తున్నయో తిలకించండి. మీరంతా (పాత ఆచారాల మీద నియమాలమీద) పిచ్చివ్యామోహం కలవారు. విదేశాలకు పోతే మీ కులం పోతుందని మీకు భయం.

మనం ప్రయాణం చేయాలి; విదేశాలకు పోవాలి. సమాజం ఇతర దేశాలలో ఎలా పని నిస్తున్నదో తెలిసికోవాలి. మరల మనం ఒకజాతిగా వర్ధిల్లాలంటే మనం స్వేచ్ఛా వాయువులను పీల్చాలి. ఇతర దేశస్తుల

భావనలను, ఆలోచనా విధానాలను పరిశీలించాలి. అన్నింటికన్నా ముఖ్యం మనం నిరంకుశులంగా ప్రవర్తించటం మానుకోవాలి.5

ఇలా పురోహితులపై ప్రజలను ఉసిగొల్పిన ధీశాలి వివేకానందుడు హిందువునని గర్వంగా చెప్పుకున్నాడు.

పురోహిత పద్ధతిని నిర్మూలించాలని, నిరంకుశ ధోరణులను విడనాడాలని వివేకానందుని ఉద్బోధ.

ఈ నాటి హైందంలో - ఆ మాటకు వస్తే సనాతన హైందవంలో - స్త్రీలపై దుర్మార్గంగా అమానుషంగా అధికారం చలాయించడం, పూజారీ విధానం, స్త్రీలపై నిరంకుశ ధోరణి అన్నీ ఇమిడి ఉన్నాయని విదితమవుతుంది. అంతేకాక ఈ 'పూజారులు' మతగురువులు, ధర్మశాస్త్ర నిర్ణేతలు వీరి పెత్తనాన్ని స్త్రీలు సవాలు చేస్తే తప్ప స్త్రీ జాతికి ముక్తి, విముక్తి లేవని స్పష్టమవుతున్నది.

అధ్యాయం 13

పాదదీపికలు

1. హైందవ విశిష్టత మరియు మార్పు చేసే సవాలు - శుభయూ దాస్‌గుప్త : పుట 77
   Hindu Ethos and the Challenge of Change ; Subhayu Das Gupta (The Minerva Associates, Calcutta).
2. డిటో పుటలు 96 - 101
3. డిటో పుట 102

   Ref : S. N. Das Gupta : Dogmas of Indian Philosophy (Philosophical Essays) Calcutta University, 1941.
4. శుభయూదాస్ గుప్తా : పుట 216
5. కులం, సంస్కృతి, సోషలిజం : వివేకానంద.
   Caste, Culture & Socialism : Vivekananda, Adwaita Ashram, India - 1965.

అధ్యాయం

14 ఆధునిక వైజ్ఞానిక దృక్పథం

హిందూ సమాజపు చరిత్రను అధ్యయనం చేశాం. హిందూ ఆచార సంప్రదాయాలను క్షుణ్ణంగా కాకపోయినా తగినంత గాఢంగా తెలుసుకున్నాము. వీటి వెనుకనున్న హిందూ మనస్తత్వాన్ని, భావనాప్రపంచాన్ని అవగాహన చేసుకున్నాం. కాగా ఈనాడు అమలులో ఉన్న హిందూ శాసనాలు ఎంత వరకు పురోగమించాయో, ఏమేరకు తిరోగమన భావాలకు రూపకల్పన చేశాయో, ఏయే అంశాలలో మార్పులు కావలసి వున్నాయో మదింపు వేసుకొని సమీక్షించుకోవటానికి మనకు ఒక కొలమానం, ఒక ప్రమాణం అత్యవసరం. ఆ కొలమానం హిందూ సంప్రదాయ పరంగా ఉండాల్సిన పనిలేదు. ఆ ప్రమాణం హిందూ మనస్తత్వాన్ని ఆధారంగా తీసుకోవలసిన అగత్యం లేదు. మరి అది ఎలాంటిది? దానికి ఆధార భూతాలైన మౌలిక భావాలు ఎట్టివి? ఆ మౌలిక భావాల వెనుక ఏదైనా తాత్త్విక ఆలోచనా స్రవంతి ఉన్నదా? ఆ ఆలోచనా విధానానికి అనువైన జీవిత సరళి ఎలాంటిది? ఈ ప్రశ్నలకు సమాధానాలను యీ అధ్యాయంలో కనుగొన ప్రయత్నిద్దాం.

మానవ చరిత్ర మతాల చరిత్ర కన్న విస్తృతమైనది. ప్రాంతీయ సామాజిక ధోరణులను మించిన విలువకలది అంటే అది హైందవం కన్న విశాలమైనది. క్రైస్తవం కన్న పురాతనమైనది. ఇస్లాం విషయం వేరే పేర్కొన పనిలేదు. అది కేవలం 1300 సంవత్సరాలనాడు పుట్టిన మతం. అదీగాక దాని మౌలిక భావాలకు పురాతన యూదు చరిత్రలో పునాదులు ఉన్నాయి. కనుక ఏ ఒక్క మతస్థుడూ, ఏ ఒక్క దేశస్థుడూ తన సంస్కృతి గొప్పదనే అహంకారంతో సంచరించపనిలేదు. ఎన్నో నాగరికతలు పుట్టి, పెరిగి, కాలగర్భంలో కలిసిపోయాయి. దక్షిణ అమెరికాలోని మాయా నాగరికత, బాబిలోనియను నాగరికత, సుమేరియను నాగరికత, ఇలా ఎన్నో ఉద్భవించి, ఎదిగి, సమసిపోయాయి. చైనా సంస్కృతి భారత ఆర్యుల

సంస్కృతివలె ఐదువేల ఏండ్ల చరిత్ర కలది. ఈజిప్టు ఒకనాడు సంస్కృతీ క్షేత్రంగా విరాజిల్లింది. ఇదంతా అందరికీ తెలిసిన విషయమే. దీనిని ఇపుడు పునశ్చరణ చేయడంలో ఉద్దేశం ఏమంటే-ఏ జాతీ, ఏ దేశం, ఏ ప్రాంతం, ఏ మతం తన సంస్కృతీ, నాగరికతలు మాత్రమే గొప్పవని విర్రవీగరాదని మనవి చేయడానికే.

ఆధునిక వైజ్ఞానిక దృక్పథం అనగా ఈనాడే సైన్సు పుట్టిందా, పూర్వం సైన్సుకు ఉనికియే లేదా? అని ప్రశ్నించవచ్చును. విజ్ఞానం ఈనాడు పుట్టలేదు. మానవ జీవితంతో ఆరంభమయినది. రెండు రాళ్ళను రాపిడిచేసి అగ్నిని రాజించినప్పుడే పుట్టింది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మానవుని పూర్వీకుడైన కోతి చెట్టుకొమ్మను విరిచి దానిని గడగా వాడుకొని లేత కొమ్మమీది కాయను కొట్టి నేలపై పడవేసినప్పుడే మొదలయింది. అంటే ఒక పనిముట్టు, సాధనం యొక్క సృష్టి జరిగిందన్నమాట. మనిషికి హేతుత్వ శక్తి ఉన్నది. ఆలోచించగల సత్తా, తన అనుభవాన్ని నెమరువేసుకొని తర్క - వితర్కాలు చేసి సమన్వయం చేసుకొని నూతనానుభవాన్ని ఎలా ఎదుర్కోవాలో తేల్చుకోగల ప్రజ్ఞ, భావనా బలం, మననం చేసుకోగల తాహతు, జ్ఞాపకశక్తి, అన్నింటికన్న మిన్న సృజనాకౌశల్యం ఉన్నాయి. తన పరిసరాలను తనకు అనుకూలంగా అమలుపరచుకొని సుఖాన్ని, ఆనందాన్ని పొందగల నేర్పు మానవవ్యక్తి సొమ్ము. అంటే అతనికి స్వతంత్ర ప్రతిపత్తి ఉందన్నమాట. ప్రకృతి శక్తులను ఎలా అదుపులో పెట్టుకోవాలో, ఎలా వాటివల్ల లాభమూ, ప్రయోజనమూ పొందాలో, మానవవ్యక్తి తెలుసుకోవటం జరిగింది. ప్రకృతిని పూర్తిగా జయించలేనని తెలుసుకున్న అతడు లేక ఆమె ప్రకృతి ధర్మాలను అవగతం చేసుకోవటానికీ తద్వారా ప్రకృతిని తన అధీనంలోకి తెచ్చుకోవటానికీ ప్రయత్నం చేయటం సాగుతున్నది. ఇక్కడ ఒక్క అంశాన్ని విస్మరించరాదు. ఈ అనంత విశ్వంలో (Unbounded Universe) మనం నివసిస్తున్న భూమి ఒక సూర్యునికి సంబంధించిన కుటుంబంలోనిది. సూర్యుడు ఒక నక్షత్రం. అలాంటి సూర్యులు లక్షలసంఖ్యలో ఉన్నాయి. నక్షత్రాలు కలిసి గెలక్సీలుగా ఏర్పడతాయి. ఆ గెలక్సీలుఅనేకం. కనుక మొత్తం మీద ఒక విషయం తేలుతుంది. విశ్వం బ్రహ్మాండమైనది. అందులో ఒక మారుమూల ఉన్న మనం రోజూ చూస్తూ ఉన్న సౌరకుటుంబంలోని భూమిపై మనం నడయాడుతున్నాము. ఇదంతా తలుచుకుంటే మానవుని అల్పత్వం

గోచరిస్తుంది. దురంహంకారం పటాపంచలవుతుంది. మానవుని మనస్సులో వినయం పొడసూపుతుంది. విస్మయం తలపెత్తుతుంది. ఆశ్చర్యం తల మునకలు చేస్తుంది.

ఈ విషయజ్ఞానాన్ని పొందిన మనిషి దురహంకారి కాలేడు; కారాదు. అయితే న్యూనతా భావంతో కుంగిపోరాదు. సమతుల్య మానసికస్థితిని పెంపొందించుకోవాలి. లేకపోతే మానవ జీవితం దుర్భరమవుతుంది.

విజ్ఞానం వృద్ధిపొందింది. తత్ఫలితంగా అనేక యంత్రాలకు, సాధనాలకు రూపకల్పన చేసుకున్నాము. ఒకనాడు దేవతగా భావించిన చంద్రునిపై కాలూనాము. మామూలు పద్ధతిలో రాకపోకలు సాగిస్తున్నాము. దూరదర్శన దూర శ్రవణాది సౌకర్యాలను ఏర్పరచుకున్నాము. జీవకణాలను ప్రయోగ శాలలో తయారుచేసే స్థితికి చేరువ అయ్యాము. ఎలాంటి సంతానం కావాలో అలాంటి సంతానాన్ని పొందగల స్థితికి సమాజం ఇంచుమించుగా వచ్చేసినట్లే. ప్రకృతిలోని గ్రహాలను, ఉపగ్రహాలను చూచి, వాటి తీరు గమనించి కృత్రిమ ఉపగ్రహాలను సృష్టించాం. ప్రమాణంలో వేగాన్ని పెంచుకున్నాం. వాయు వేగాన్ని అధిగమించాం. కాంతి వేగాన్ని లెక్కకట్టాం. పదార్థంలో ఉండే అణువును బదాబదలు చేసి బ్రహ్మాండమైన శక్తిని విడుదల చేసి కొండలను పిండిచేస్తున్నాం. నదులను మళ్ళిస్తున్నాం. పొలాల ఫలసాయాన్ని పెంచు కున్నాం, అనవసర క్రిమి, కీటకాదులను సంహారం చేసుకున్నాం. ఇలా ఎంతో ప్రగతిని సాధించాం. కాని ఇదే సందర్భంలో ప్రకృతి జ్ఞానం పెరిగినంతగా మనిషి మానసిక వికాసం పెరగలేదు. మనుష్యులలో ఒక తెగ ఐదువేల సంవత్సరాలనాటి భావాలతో మనుగడ సాగిస్తుంటే మరొకతెగ రెండువేల సంవత్సరాల సంస్కృతితో జీవయాత్ర సాగిస్తోంది. వేరొక శాఖ వెయ్యి సంవత్సరాల క్రిందటి ఆచార వ్యవహారాలను పాటిస్తూ తమ జీవిత విధానమే ఉత్కృష్టమైనదని తలపోస్తోంది. కాగా దౌర్భాగ్యమేమంటే, మానవ సృజనాశక్తి యొక్క విస్తారతను, గాంభీర్యతను చాలమంది అవగాహన చేసుకోకపోవటం. తమశాఖవారు అభిమానించే రుషినో, ప్రవక్తనో, మహా గురువునో, నాయకునినో 'దైవసమానుని' చేసి అతని వాక్యమే తుది వాక్యమని, అతని ఆలోచనా ధోరణి మించినది లేదని, అతని మేధాశక్తి అనంతమని భావిస్తూ తమ జీవితాలను, ఇతరుల జీవితాలను దుఃఖభాజనం చేసుకుంటున్నారు. ఇక్కడే ఉంది ప్రమాదం.

ప్రకృతి శక్తులను చూచి విస్మయం చెందిన మనిషి రూపుకల్పన చేసుకున్నాడు. తనలాంటి మనిషిని ఊహించుకున్నాడు వాటికి ప్రతీకగా. కాగా తనకున్న ప్రకృతి శక్తులు ఎన్నో రెట్లు శక్తివంతం కనుక అధి మానవుని సృష్టించాడు తన మనస్సులో. దేవతలు పెరిగిపోయారు సంఖ్యలో. సమాజ జీవితంలో మార్పులు వచ్చాయి. సమాజంలో నాయకుడు పుట్టాడు. సమాజాలు ఒకదానితో మరొకటి పోరాటానికి దిగాయి. ఒక సమాజపు నాయకుడు మరొక సమాజపు నాయకునితో పోరాటానికి తలపడ్డాడు. ఆ క్రమంలో బాగా బలవంతుడైన నాయకుడొకడు తన సమాజ అండ దండలతో తతిమ్మా వారిని లొంగదీసుకున్నాడు. సామ్రాజ్యాలు వెలిశాయి. సామ్రాట్టు ఉన్నట్లు దేవతలకు ఒక అధిపతి పుట్టాడు. చివరకు దేవుడు ఒకడే అయినాడు. ప్రకృతి ధర్మాలను తగినంతగా అవగాహన చేసుకోలేని ఆ స్థితిలో ఆ దేవుని బలులతో తృప్తిపరచి, శాంతింపచేసి, ప్రార్థనలు చేసి అనుగ్రహం పొందాలని మానవజాతి ప్రయత్నించింది. ఆ క్రమంలో పూజా విధానం జన్మ ఎత్తింది. పూజారులు రంగం మీదికి వచ్చారు. వారికి చేతి నిండాపని, పూర్తికాలపు పని కలిగింది. కనుక జీవనోపాధికి ఏర్పాట్లు అవసరమయ్యాయి. అప్పటికి సంపాదించిన ప్రకృతి విషయ పరిజ్ఞానంతో ప్రజానీకాన్ని హడలగొట్టించిన వారు తమ అవసరాలను తామే నిర్ణయించు కున్నారు. వాటిని తమకు అందించాలని సమాజాలను కట్టడిచేశారు. ఆ కట్టడిని అమలు పరచమని సమాజ నాయకులను ఆదేశించారు. వారు శిరసా వహించారు మొదట్లో. పూజారుల బుద్ధిబలం, నాయకుల కండబలం సామాన్యులను అదుపులో పెట్టాయి. ధర్మాలను ప్రవచనం చేశారు పూజారులు; వాటిని అమలుచేశారు నాయకులు వరపు రాజులు. అలా సాగింది కొంతకాలం. పూజారుల అహంభావం పెరిగిపోయింది. నాయకులు, రాజులు ఎదురు తిరిగారు, వ్యాపారస్తులు రాజులకు వంతపలికారు. భారత దేశంలో ఒక వెయ్యిసంవత్సరాలు బౌద్ధ, జైనాల పేరుతో ఆ తిరుగుబాటు సాగింది, పూజారులు పుంజుకున్నారు. క్రొత్త రకపు నాయకులను తయారు చేస్తున్నారు. తమ ఆధిపత్యాన్ని మరల స్థాపించుకున్నారు. ఇది ఒక పరిణామం. మానవ సమాజంలో అన్ని ప్రాంతాలలో, వేరు వేరు కాలాలలో మరో ధోరణి చెలరేగింది. అది ప్రశ్నించే ధోరణి. వారు పూజారులను, మతగురువులను, నాయకులను ప్రశ్నించ నారంభించారు. సామాజిక వ్యవస్థయొక్క మౌలిక

సూత్రాలను ప్రశ్నించారు. సమాజంలో అసమానత, దోపిడి, అక్రమం, అన్యాయం అన్నింటిని తలదన్నిన దుస్థితిని, అజ్ఞానం పెచ్చు పెరిగిపోవడాన్ని, వారు సహించలేకపోయారు. సమాజాన్ని మార్చాలని వారు భావించారు. సమాజంయొక్క ఆధారాలను తెలుసుకోవాలనుకున్నారు. 'సత్యం' యొక్క స్వరూపాన్ని అర్థం చేసుకోవాలని తహ తహ లాడారు. ఈ తపన అన్ని రంగాలలో ప్రదర్శిత మయింది. ప్రకృతి శక్తుల సత్యస్వరూపాన్ని తెలుసుకోవాలనే ఆకాంక్ష ఆధునిక విజ్ఞానానికి బీజాలు వేశింది. సైన్సు ఈనాటి రూపంలో పుట్టింది. దానికి కొన్ని పద్దతులను ఏర్పరచుకున్నారు. అదే వైజ్ఞానిక పద్ధతి.

సైన్సు వేరు, సైన్సు ఫలితాలు వేరు. విజ్ఞానాన్ని సరిగా వాడుకోలేక మానవ ప్రపంచాన్ని బదాబదలు చేసుకొని సర్వనాశనం చేసుకునే ప్రయత్నాలు అజ్ఞానయుత, దురహంకారయుత వైఖరితో సాగుతున్న ఈ తరుణంలో కూడ విజ్ఞానాన్ని తిట్టిపోసినందువల్ల లాభంలేదు. విజ్ఞానం మనకు పనిముట్లను అందిస్తుంది. వాటిని సక్రమంగా మానవ సంక్షేమం కోసం వాడుకుంటే మనం బాగుపడతాము. లేకపోతే వినాశకర పరిస్థితులను కొని తెచ్చుకుంటాము. తప్పు అంతా సమాజాల నాయకులది. సైన్సుపని చేసే తీరును గమనించాలి. ముందు ఒక ఊహాధారంతో బయలుదేరి ప్రయోగంచేసి, ఫలితాన్నిబట్టి ఆ ఊహాధారం సరియైనదో కాదో తేల్చుకోవటం ఆ పద్ధతి. ఆలోచనా పద్ధతి క్రమంగా, తర్కయుతంగా ఉండాలి. భిన్నవిషయాల పరస్పర వైరుధ్యాని కన్న సమన్వయానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఆలోచనా, తర్కం, ఊహ, ప్రయోగం, ఫలితం, సరిపోల్చుకొనుట, సమన్వయం ఇలా సాగిపోతుంది. విజ్ఞానయాత్రా రథం. వైజ్ఞానికుడు సత్యాన్వేషి. అతనికి వ్యక్తిగత ఆవేశకావేషాలు ఉండరాదు. నిస్సంగత్వం అతని లక్షణంగా ఉండాలి. అతనిలో విశ్వశ్రేయస్సు, మానవ సంక్షేమం, సత్యనిరతి, స్వేచ్ఛా పిపాసకల మానవునిపట్ల గౌరవం, మానవ విలువలయెడ అభిమానం చోటుచేసుకుంటాయి. అతనికి వినయం ఉంటుందని తెలిసికొన్నాం. అతనికి ఏదైనా తెలియకపోతే తెలియదని అంగీకరిస్తాడు. కాకపోతే జీవితపు పోకడ చూచినవాడు కనుక జీవితానుభవాన్ని బట్టి ఈనాడు తెలియని విషయం రేపు తెలుసుకోగలమనే ఆత్మవిశ్వాసం కలిగిఉంటాడు. వందసంవత్సరాలక్రితం తెలియని విషయం ఈనాడు తెలుసుకున్నాం. అలాగే ఈనాడు తెలియనిది రేపు

తెలుసుకోగలము. ఇది అనుభవాన్ని బట్టి తెలుసుకున్న సత్యం, దీనిని అనుసరిస్తాడు. ఇది అంధవిశ్వాసం కాదు. సత్యమార్గ పయనం.

ప్రకృతి శక్తులను గమనిస్తున్నాం. వాటి స్వరూపాలను గుర్తించాం. వాటి పరస్పర సంబంధాలను పరిశీలించాం. అవి ఒక రూపంనుండి మరో రూపానికి ఎలా మారుతున్నాయో గ్రహించి వాటిని ఆలా మలుచు కుంటున్నాం. కాగా ఈ ప్రకృతిలో ఉన్న శక్తి అంతా ఒకటే అని, దాని రూపాంతరాలు వేరని తెలుసుకున్నాం. అంతటితో ఆగిపోయాడు ప్రస్తుతానికి ఆధునిక వైజ్ఞానికుడు, ఇక్కడ "నేను వస్తున్నాను" అంటూ తయారయ్యాడు మతవాది. ఈ ప్రకృతి శక్తికి ఆధారభూతం దైవం అన్నాడు. దానికి పూజాదిక కార్యక్రమాలు, తంతు నిర్ణయం చేశాడు. దేవుని ఉనికి ఊహా అంటాడు వైజ్ఞానికుడు. 'నీ శక్తికి పరిధి ఉన్నది' అంటాడు మతవాది. ఇదీ ఈనాటి ఘర్షణ. ఇది భావాలకు పరిమితం కాలేదు. సామాజిక జీవితానికి ప్రాకింది. ఒక్కొక్క దేవుని ఆవేశం ప్రకారం - ఆ దేవుడు ప్రవక్తకో, రుషికో దర్శనమయి చెప్తాడు - ఒక్కొక్క సామాజిక విధానం యేర్పడు తుందని శాసిస్తారు మతవాదులు. ఇలా వివిధ సామాజిక రీతులమధ్య సంఘర్షణ సాగుతుంది. మతయుద్ధాలు సాగుతయి! సాగాయి, ఈనాడుకూడా సాగుతున్నాయి. ఈ సంఘటనల వెనుక ఆలోచనకు అందని 'విశిష్ట దైవ భావం' ఉన్నదని మరచిపోరాదు. కేవలం ఊహపై ఆధారపడి యావత్తు జీవితాన్ని ప్రభావితం చేసుకొని, జీవితంలో సుఖసంపాదనను, ఆనంద ప్రాప్తిని, మానసిక శాంతి సాధవను వదులుకోవటం మంచిది కాదని వైజ్ఞా నికుడు అంటాడు. తలాగని ప్రకటిస్తాడు. సత్యం ఒక్కరి సొమ్ము కాదని, సత్యం మానవాళి సమష్టి కృషి ఫలిత సాధ్యమని అతని విశ్వాసం. అది అతని జీవితానుభవ సూత్రం.

ఆధునిక వైజ్ఞానిక పద్ధతిని ఈనాడు మనం సమాజ జీవితానికి, కుటుంబ జీవితానికి, స్త్రీ పురుషుల సంబంధాలకు వర్తింపచేస్తే మనకు అనేక విషయాలు క్రొత్తవి తెలుస్తాయి. పాతవి క్రొత్త వెలుగుతో కన్పడతాయి. నూతన జీవిత సత్యాలు దర్శనమిస్తాయి. వాటికి అనుగుణంగా మనం నడుచు కోవటానికి ప్రయత్నిస్తే ఆధునికులం అనిపించుకోగలం. కారును, విమానాన్ని దూరదర్శన యంత్రాన్ని వాడిన ప్రతి మానిసి ఆధునికుడు కాడు. ఆధునిక

విజ్ఞాన సూత్రాల ప్రకారం జీవితాలను మలుచుకోడానికి సిద్ధపడితేనే మనం ఆధునికులంగా చలామణీ కాగలం. ఆధునిక విజ్ఞానం ఏం చెప్తున్నదో జ్ఞాపకం చేసుకోవడం అవసరం.

స్త్రీ పురుషులు సమానులు, ఇది బౌతిక సత్యం. ఇద్దరిలోను మేధా శక్తి పనిచేస్తున్నది, ఇద్దరూ ఇంచుమించుగా సమాన శక్తియుక్తులు కల వారు. కాగా స్త్రీకి అదనంగా ఒక శక్తి ఉంది. అదే గర్భధారణ లేక సంతాన సాధన శక్తి. దానికి తగిన అవయవ నిర్మాణం ప్రకృతి పరిణామంలో ఆమెకు లభించింది. తద్వారా జాతి జీవితాన్ని కొనసాగించటానికి ఆమె సాయపడుతున్నది. ఇది ఆమెకు కలికితురాయి.

స్త్రీ మాత్రమే సంతానాన్ని కనగలదు, కాని భార్యా భర్తలలో ఎవరికైనా లేక ఇరువురికి శిశుపోషణ చేయగల శక్తి వుంది. కుటుంబ జీవితానికి స్త్రీ పురుషుల సాన్నిహిత్యం, సాంగత్యం అవసరం. లైంగిక సంపర్కం భార్యాభర్తల అనుబంధాన్ని బట్టి గట్టి చేస్తుంది. అది ప్రకృతి సహజచర్య. అది స్త్రీ పురుషులిద్దరికీ ఆనందాన్ని చేకూరుస్తుంది. సెక్సు అనుభవాన్ని సంతాన ప్రాప్తిని విడదీసి ఆలోచించాలి. సంతాన ప్రాప్తికి సెక్సు సంయోగం అవసరము కావచ్చును. కాని సంతానాన్ని అభిలషించని లైంగిక సన్నిహితత్వం ఉనికి కలిగి వుందనేది నగ్నసత్యం. అది సాధ్యమయింది ఈనాటి విజ్ఞాన ఫలితంగా, ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగిపోతున్నది. ఆ సత్యాన్ని గుర్తించి కొందరు దంపతులు జన్మనిగ్రహాన్ని పాటిస్తున్నారు. అధిక సంతానం వలన కల్గే అనారోగ్యాన్ని తనకు కలుగకుండా చేసుకోవటానికి, ఇంకా యితర కారణాలపై స్త్రీ సంతానాన్ని క్రమబద్ధం చేసుకుంటున్నది. తన సంతానాన్ని క్రమబద్ధం చేసుకోవటానికి, తను సంతానాన్ని కనకుండా ఉండటానికి స్త్రీకి ఆధునిక విజ్ఞానం సమాచారాన్ని, సాధనాలను, శక్తిని ఇస్తున్నది. దాంతో స్త్రీకి మాతృత్వం ఐచ్ఛికం అయింది.

స్త్రీ పురుషుల సంయోగంతో నిమిత్తం లేకుండా సంతానప్రాప్తి సాధ్యం అయింది. ఒక స్త్రీ మరియొక స్త్రీకి సాయపడడానికి తన గర్భసంచిని (Uterus) అరువు ఇవ్వవచ్చును. అలాగే పరపురుష సంపర్కం లేకుండా కృత్రిమ గర్భధారణ సాధ్యం. ఫలాని లక్షణాలు కల సంతానం కావాలందే లక్ష్యం చేసే ప్రక్రియలు ఈనాడు సాధ్యమవుతున్నాయి.

పురుషుడితో సమానంగా స్త్రీ అన్ని విద్యలు నేర్వగలదు. పురుషాధిపత్యానికి శారీరక శాస్త్రంలో ఆధారాలు లేవు.

మానవజాతి అంతా ఒకటే. హిందువులలో ఒకరక్తం, ముస్లింలలో ఒకరక్తం లేదు. అలాగే స్త్రీ పురుషులలో కూడాను. అందరిలోను ఉన్న రక్తం ఒకటే. కాకపోతే వర్గీకరణ మాత్రం వుంది. పురుషుడిలో 'ఏ' గ్రూపు రక్తం ఉండవచ్చు. స్త్రీలోనూ 'ఏ' గ్రూపు రక్తం వుండవచ్చును. ఈ సూత్రమే అన్ని గ్రూపులకు వర్తిస్తుంది. ఈనాడు ధరహంమీద మానవ సమాజంలోనూ ప్రత్యేకంగా భారత ప్రజానీకంలోనూ ఏ జాతికూడా సంకరం కాని స్థితిలో లేదు. మానవాళి అంతా ఒకటే. వర్ణభేదం [రంగు తేడా) స్త్రీ పురుషుల కలయికకు అవకాశం ఉంది. హిందూ మతంలోని వర్ణ వ్యవస్థ, కులవ్యవస్థ స్త్రీ పురుష సంయోగ, వియోగాలకు అడ్డురావు.

సామాజిక, ఆర్థిక రాజకీయ వ్యవస్థలు మానవ నిర్మాతలు. సాంస్కృతిక సౌధం సమష్టి మానవ జీవిత ఫలం.

దగ్గర పూర్వీకుని ద్వారా జన్మను పొందినవారి మధ్య దాంపత్య జీవితం వల్ల కలిగే సంతానం వికలాంగంగా పుట్టే అవకాశం ఎక్కువ వున్నట్లు సైన్సు రుజువు చేసింది.

హిందూ ధర్మశాస్త్రజ్ఞులు స్త్రీకి సంతాన ప్రాప్తికి అనువైనవిగా, ఋతుమతి అయిన తదుపరి కొన్ని దినాలను నిర్ణయించారు. ఆ పెద్దల అంచనాలకు శారీరక శాస్త్రంలో ఆధారం లేదు. వారికి విషయం తెలియదు. వాస్తవానికి ఆ రోజులు ఆమెకు సంతాన ప్రాప్తికి అనువు కాని రోజులు. ఋతుమతియైన స్త్రీ, ప్రసవించిన స్త్రీ అస్పృశ్యులు అనడానికి విజ్ఞాన శాస్త్రంలో ఏ విధమైన సమర్థన లభించదు.

ఈ వైజ్ఞానిక సత్యాలను సామాజిక జీవితానికి అన్వయం చేస్తే కొన్ని ముఖ్యమైన నిర్ణయాలకు రాగలుగుతాం,

వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ అర్థరహితం. పీటివిషయంగా స్త్రీల చర్యలను నియంత్రణం చేయడం పొరపాటు. స్త్రీ ఒక వ్యక్తి. పురుషుడు మరొక

వ్యక్తి. ఇరువురికీ వ్యక్తి వికాసానికి హక్కు ఉన్నది. ఒకరు మరొకరి వస్తువుకాదు, బానిసకాదు; కారాదు. స్త్రీ ద్వితీయస్థాయి జీవికాదు. స్త్రీ పురుషులకు ఒకే విధమైన సంస్కారాలు ఉండవచ్చును. ఉదాహరణకు ఉపనయనాదులను పేర్కొనవచ్చును. ఇరువురికీ ఒకేరకపు విద్య అందుబాటులో ఉండాలి. ఇంటిపని స్త్రీకి మాత్రమే కేటాయించటం అక్రమం. భార్యాభర్తలిద్దరూ పాలుపంచుకోవాలి. అలాగే శిశుపోషణ, పిల్లల పెంపకం ఇద్దరి కర్తవ్యం. సంతానాన్ని కనాలో అక్కరలేదో వస్తుతః నిర్ణయించుకోవలసింది స్త్రీయే. నవమాసాలు గర్భస్థశిశువును మోసేది ఆమే కదా! పిల్లలకు తల్లిద్వారా పేరుండాలి. మాతృత్వం రూఢి అంటే తనబిడ్డ తండ్రియవరో తల్లికి మాత్రమే తెలుసు. కనుక పితృస్వామ్యం వైజ్ఞానిక సత్యాలకు వ్యతిరేకం. మాతృస్వామ్యం వైజ్ఞానిక జ్ఞానానికి అనువుగా ఉంటుంది. భార్యాభర్తలలో ఏ ఒక్కరు కోరినా వివాహవిచ్ఛేదనం జరగాలి. భార్యపై భర్త కూడా లైంగిక హింసకుగాని మరే హింసకుగాని పాల్పడరాదు. వివాహమే స్త్రీకి జీవిత పరమావధి అని నిర్ణయించటం, బోధించటం పొరపాటు. బాల్యవివాహాలు స్త్రీకి హానికలిగిస్తాయి. రజస్వల అవడం అంటే ఆమె స్త్రీగా రూపొందడానికి నాంది అన్నమాట. రజస్వల అయినంత మాత్రాన ఆమె స్త్రీత్వాన్ని సంపూర్ణంగా పొందినదనుకోవడం సరియైన భావన కాదు. స్త్రీ అస్వతంత్రకాదు. ఆమెకు స్వతంత్ర ప్రతిపత్తి ఉంది. కాగా వైవాహిక జీవితంలో భార్యాభర్తలు పరస్పరం సహకరించుకుంటారు. వారిరువురు వేరువేరు వ్యక్తులు. ఇరువురు ఒకరుకాదు. స్త్రీ వ్యక్తిత్వం పురుషుని వ్యక్తిత్వంలో మిళితం కావలసిన అవసరం లేదు. పాతివ్రత్యం స్త్రీని కించపరిచే సూత్రం. స్త్రీ అవివాహితగా ఉండటానికి హక్కు కలిగి వుంది. ఆ మాటకు వస్తే స్త్రీ అవివాహిత మాత కావడానికి కూడా ఆమెకు హక్కున్నది. ఇతరుల శ్రేయస్సుకు, స్వేచ్ఛకు భంగం కాని రీతిలో, తన హోదాను వ్యక్తిత్వాన్ని కించపరచుకోకుండా స్త్రీ జీవించడానికి ఆమెకు హక్కు ఉంది. సంతానం కనమని నిర్బంధించటానికి గాని, పురుష సంతానం కలిగే వరకు పిల్లలను కనమని బలవంతం చెయ్యటానికి గాని భర్తకు హక్కులేదు. ఆమె శరీరంపై హక్కు పూర్తిగా ఆమెదే. గర్భస్రావం చేసుకోడానికి, చేసుకోక పోవడానికి ఆమె ఇష్టాయిష్టాలే నిర్ణాయక విషయాలు కావాలి.

స్త్రీని దానం చేయడానికి తల్లిదండ్రులకు కూడా హక్కు లేదు. కన్యాదానం అర్థరహితమైన తంతు. 'నన్ను అనుసరించుము' అని వరుడు సప్తపదిలో వధువును కోరటం కూడా అనుచితమే. సమానత్వ సూత్రానికి ఇది వ్యతిరేకం. పురుషాధిపత్య చిహ్నాలయిన పెండ్లి తంతులన్నీ అక్రమం. వధువుకు మంగళసూత్ర ధారణ సమానత్వ సిద్ధాంతానికి వ్యతిరేకం. అన్ని కులాలవారు మంగళసూత్రం కట్టిస్తున్నారు (దక్షిణాపధాన). కాని వరుడు తనమెడలో ఏదైనా కట్టించుకొని జీవితకాలమంతా తను వివాహిత వ్యక్తినని తెలియజేయటం లేదే? "ఓ దేవా! మగపిల్లవానిని ఇమ్ము", "ఓ దేవా! గర్భస్థపిండాన్ని మగశిశువుగా మార్చుము" అనే మంత్రాలు స్త్రీని అవమానపర్చటమే. దేవుడు వీరి ప్రార్థనలను విని సమాజంలో శిశువులందరినీ మగశిశువులుగా పుట్టిస్తే ఈ మగవారి గతి ఏమవుతుంది? సమాజపు మనుగడ ఏది? మానవజాతి - ప్రస్తుతం హిందూజాతి - నశించదా?

వివాహిత, అవివాహిత; విధవ, విడాకులు పొందిన స్త్రీ ఎవరైనా ఏ పిల్లనైనా - పురుషునిగాని, స్త్రీనిగాని దత్తు చేసుకోవచ్చు. అని ధర్మసూత్రీకరణ చేయాలి. విడాకులు పొందినపుడు స్త్రీ పురుషులు కలసి పెంపొందించిన ఆస్తిని, కలసి కృషిచేసి సంపాదించిన ఆస్తిని చెరిసగంగా తీసుకోవాలి. ఆమె ఇంట్లో చేసిన పని భర్త ఇంటి వెలుపల సంపాదించిన వృత్తితో సమానంగా ఎంచాలి. వారసత్వ విషయంలో భర్త పేరనున్న ఆస్తిలో సగం ఆమెకు ఇచ్చి తరువాత తతిమ్మావారు, కుమారులు కుమార్తెలు పంచుకోవాలి. పిత్రార్జితపు ఆస్తిలో కుమారులకు గాని కుమార్తెలకుగాని జన్మతః హక్కు ఉండరాదు. కాపురానికి రమ్మనమని పిటీషను పెట్టి, ఉత్తర్వులు పొంది, వానిని అమలు పర్చుటకై, ఒకరి ఆస్తిని రెండోవారు జప్తుచేయించి, వేలానికి తెచ్చుటద్వారా ఒత్తిడిచేయడం ధర్మవిరుద్ధం. అసలు ఆ ప్రక్రియకు స్వస్తి చెప్పాలి. వివాహరథం కుంటుపడిందని ఒకరు ఆరోపణ చేసినపుడు, అది నిర్ధారణ అయితే, దానికి ఎవరు కారకులు, ఎవరు నిందార్హులు అనే అనవసర విచారణకు దిగకుండా భార్యాభర్తలకు విడాకులు ఇవ్వాలి. సంతానానికి ఎవరు సంరక్షకులుగా ఉండాలో భార్యాభర్తలు తేల్చుకోవటానికి అవకాశం ఇవ్వాలి. వారిమధ్య అంగీకారం లేనిచో భార్యయే ప్రధమ సంరక్షకురాలిగా ఉండాలి. ఆమె జీవించి ఉండని పక్షములో

భర్తకు ఆ అధికారం సంక్రమిస్తుంది. వివాహం కాగానే భార్య భర్త ఇంటికి కాపురానికి పోవాలనే నిబంధన మారాలి. అది వారిరువురి సమ్మతిపై ఆధారపడాలి. అలా అంగీకారం కుదరని పక్షంలో ఎవరికి వారే వేరు వేరు ప్రదేశాలలో వేరు వేరు గృహాలలో కాపురం ఉండవచ్చును. భర్త ఇంట్లోనే కాపురం ఉండాలని ఏ న్యాయస్థానము ఆమెను ఆదేశించరాదు. వివాహమయిన దరిమిలా విద్యార్థి దశను కొనసాగించడమా లేదా అనేది, అలాగే ఆమె ఉద్యోగం చేయడమా లేదా అనేది భార్య ఇష్టంమీద మాత్రమే ఆధారపడాలి. శాసించడానికి భర్తకు అధికారం లేదు. ఒకరి సంపాదనను మరొకరు స్వంతం చేసుకోవడానికి దత్తం చేసుకోవడానికి హక్కు లేదు. సభ్యత పేర, సంస్కారం పేర స్త్రీ యొక్క సంచార స్వాతంత్ర్యాన్ని, భావస్వాతంత్ర్యాన్ని అరికట్టడానికి భర్తకు కూడా హక్కు లేదు. అట్లే ఆమె రాజకీయ అభిప్రాయాలమీద, రాజకీయ ఆచరణమీద పెత్తనం సాగించటానికి భర్తకు కూడా హక్కు లేదు. స్త్రీయొక్క అభిరుచులను, ప్రదేశాన్ని, శిక్షణను భర్త అదుపులో ఉంచరాదు.

తల్లిదండ్రులు తమ కుమార్తె వివాహవిషయంలో ఆమెపై ఒత్తిడి తేరాదు. వివాహం ఆమె వ్యక్తిగత విషయం. అట్లే ఉద్యోగం, ఆమె అభిరుచులు, వ్యాసంగాలు ఆమె ఇష్టాఇష్టాలపై ఆధారపడతాయి. అయుక్త వయస్కురాలైన బాలికలకు (మైనర్లకు) ఎవరు వివాహం చేసినా చెల్లరాదు, ఆ వివాహం 'లా' ప్రకారం జరగనట్లుగానే భావించాలి.

వివాహిత స్త్రీతో వ్యభిచారం చేసిన పురుషునికి శిక్ష విధించే సెక్షను భారత శిక్షాస్మృతినుండి తీసివేయాలి. పురుషుని వస్తువును దొంగిలించిన వానికి శిక్ష ఉన్నట్లే భార్యతో జారత్వం చేసినవానికి శిక్ష వేయడానికి ఆస్కారమిస్తుంది ఆ శిక్షాస్మృతి. అది పొరపాటు. స్త్రీ భర్త వస్తువు కాదు. ఆలోచనయూ, ఇచ్ఛాగలయూ ఉన్న వ్యక్తి. జారత్వం తప్పే; అది విడాకులకు కారణభూతం కావచ్చును; కాని శిక్షకు ప్రాతిపదిక కారాదు. పై చెప్పిన ఉపమానాన్ని కొనసాగిస్తే (దొంగలించుట నేరమనేది) భర్తతో వ్యభిచరించిన పరాయిస్త్రీకి శిక్ష ఉండాలికదా! అదిలేదు శిక్షాస్మృతిలో. జారత్వానికి మొదట్లో ఇరువురికి మనువు శిక్షలు చెప్పాడు. స్త్రీలపై జాలికలిగి బ్రిటిషు వారు స్త్రీలపై శిక్షలు తీసివేశారు. కనుక ఈ ఏకరంగా వాదించటం పొరపాటు

అని ప్రతివాదన చేయవచ్చు. అది సమర్థనీయం కాదు. శిక్షాస్మృతిలో నిబంధన ఎందుకు వచ్చిందనేది కాదు సమస్య. ఇపుడున్న రూపంలో అది అర్థరహితమేనా కాదా లేక స్త్రీల గౌరవానికి, హుందాకు, స్వతంత్ర వ్యక్తిత్వానికి భంగకరమగునా లేదా అనేది చర్చనీయాంశంగా ఉండాలి.

బాలబాలికలను పెంచటంలో తల్లిదండ్రుల ఇంటిలో సాగే వివక్ష నిర్మూలనం కావాలి. స్త్రీకి అణకువ, విధేయత, సర్దుకుపోవటం అనే గుణాలను ఉగ్గుపాలతో నూరిపోయటం మానాలి. విద్యాబుద్ధులు చెప్పించటంలో ప్రదర్శితమయ్యే పక్షపాత దృష్టి పోవాలి.

ఇలా సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో స్త్రీకి స్వేచ్ఛ, సమానత్వం సిద్ధించాలి. అపుడే ఆధునిక వైజ్ఞానానికి దృక్పథాన్ని అలవర్చుకున్నామని మనం సంతసించవచ్చు. లేనినాడు అంధవిశ్వాసాలనే పాములున్న ఇంట్లో కాపురమున్నట్లే. వైజ్ఞానిక వ్యతిరేక భావాలు స్త్రీలకు మాత్రమే వ్యతిరేకమని, నష్టదాయకమని, వారి ప్రయోజనాలకు శ్రేయస్సుకు భంగకరమని కొందరు పురుషులు విశ్వసించవచ్చును. అది పొరపాటు భావమని చెప్పక తప్పదు. సమాజంలో సగంమంది స్త్రీలు. వారిలో ఎక్కువ మంది అజ్ఞానాంధకారంతో మునిగి, విద్యలేనివారై, వ్యక్తిత్వ హీనలై, అస్వతంత్రులై అమాయకంగా జీవిస్తున్న రోజులలో వారి భావోద్రేకాన్ని రెచ్చగొట్టి, వారిని తన వాగాడంబరంతో వివేక హీనులనుగా చేసి, వారి వోట్లను తనకు వేయించుకొని ఏ వ్యక్తి అయినా నియంతగా వస్తే భారతదేశ భవిష్యత్తు అంధకార బంధురమవుతుంది. ఇది రాజకీయాంశము. సామాజిక విషయంగా చూస్తే అలాంటివారు ఎలా తమ పిల్లలను పెంచగలుగుతారు? ఎలా విద్యాబుద్ధులను నేర్పకలుగుతారు? కేవలం కుటుంబాన్నే తీసుకోండి. అలాంటిస్త్రీలు భర్తకు ఎలాంటి సాంగత్యాన్ని ఇవ్వగలుగుతారు? భర్త సాంస్కృతిక జీవితానికి అలాంటి స్త్రీ ఎలా సాయపడకలుగుతుంది? చివరమాట. ఆమె ఇప్పుడున్న స్థితిలో ఉంటే అతడు అభ్యుదయగామిగా సంచరించగలడా? ఎంతమంది అభ్యుదయ వాదులైన పురుషులు తమ అజ్ఞానపు భార్యల మూలాన నిష్క్రియాపరులు అవుతున్నారో మనకు తెలియదా? స్త్రీ విమోచన పురుష విముక్తికి రాచబాట అని ఆధునిక విజ్ఞానం మనకు తెలియ చెప్తున్నది.

అధ్యాయం

15 హిందూ శాసనాలు

ధర్మశాస్త్ర ప్రతిపాదితమైన హైందవ ధర్మసూత్రాలను బ్రిటీష పాలనలో శాసనాలద్వారా కొంతమార్చడం, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారీఎత్తున మార్చటం జరిగింది. వాటిలో ముఖ్యమైనవాటిని చర్చించటం అవశ్యకం.

సతీసహగమన నిరోధశాసనం (1829), విధవావివాహ శాసనం (1856), కుల బహిష్కారణవల్ల అనర్హతల తొలగింపు శాసనం (1850), హిందూవారసత్వ అనర్హతల తొలగింపు శాసనం (1929), విద్యవల్ల ఆర్జితానికి సంబంధించిన శాసనం [1930], బాల్యవివాహ నిరోధశాసనం [1929], హిందూస్త్రీల ఆస్తిహక్కు శాసనం [1937], ఆర్యవివాహ సమర్థశాసనం [1937], హిందూస్త్రీ ప్రత్యేక నివాసమునవర్తిశాసనం [1946], సగోత్ర, సప్రవర వివాహాలను అనుమతిస్తూ హిందూ వివాహఅనర్హతలతొలగింపు శాసనం [1946] వర్ణాంతర కులాంతర, శాఖాంతర వివాహాలను అనుమతిస్తూ 1949లో శాసనం భారతదేశం స్వతంత్ర దేశంగా రూపొందక ముందువచ్చాయి. వీటిని బ్రిటీషువారి చొరవతో వచ్చినవిగాను, భారతీయుల ప్రతిపాదనపై వచ్చినవిగాను విభజించవచ్చును. 19 వ శతాబ్దపు శాసనాల విషయంలో బ్రిటీషువారి పట్టుదలజాస్తి. తరువాతవీ భారతీయ సంస్కర్తల ఆందోళనా ఫలితాలు.

ఈనాడు అమలులోఉన్న శాసనాలలో ముఖ్యమైనవి వివాహానికి, వారసత్వానికి దత్తతకు, మనవర్తికి, మైనారిటీ మరియు సంరక్షకత్వానికి సంబంధించినవి. ద్వితీయ శ్రేణికి చెందిన బాల్యవివాహ నిరోధశాసనం, వరకట్న నిషేధశాసనం శిక్షాస్మృతిలో వచ్చిన మార్పులు.

1948 లో హిందువులకు వర్తించే ధర్మకోశాన్ని (హిందూ కోడ్ బిల్లు) శాసన రూపంగా తయారు చేయాలని బిల్లు ప్రతిపాదించబడటం

దానికి వ్యతిరేకత రాగా విరమించడం జరిగింది. తరువాత 1955, 1956 సంవత్సరాలలో దానిలో కొంతభాగాన్ని నాలుగు ముక్కలుగా చేసి నాలుగు శాసనాలుగా ఆమోదింప చేసింది జవహరలాల్ నెహ్రూ ప్రభుత్వం.

హిందూ దత్తత మరియు మనవర్తి శాసనం (1956)

దత్తతకు సంబంధించి మౌలికమైన మార్పులు వచ్చాయి. దత్తుకు మతపరమైన భావన తీసివేసి దానిని లౌకికం చేశారు. కుమార్తెనుగాని కుమారునిగాని దత్తు తీసుకోవచ్చును. భార్య అనుమతి లేకుండా పురుషుడు దత్తు చేసుకోవటానికి వీలులేదు. అవివాహిత, వివాహము రద్దయిన స్త్రీ, విధవరాలు, లేక సన్యాసియైన వాని భార్య, మతాంతరుని భార్య, మతిస్థిమితం లేని భార్య కుమారునిగాని కుమార్తెనుగాని దత్తు చేసుకోవచ్చును. తల్లి అనుమతి లేకుండా ఏ తండ్రి తన సంతానాన్ని ఇతరులకు దత్తు ఇయ్యరాదు. తండ్రి మరణించినపుడు, సన్యాసి యైనపుడు, మతాంతరుడయినపుడు, లేక మతి స్థిమితం లేనివాడని కోర్టు నిర్ధారణ చేసినపుడు తల్లి తన సంతానాన్ని దత్తు ఇవ్వవచ్చును. దత్తు ఇవ్వబడే వ్యక్తి హిందువయి ఉండాలి; 15 సం॥ల వయస్సు పూర్తి కానివాడుగా ఉండాలి. అవివాహితుడుగా ఉండాలి. ఆచారం ఉంటే ఈ నియమాలకు సడలింపు వుంది. కుమారుడు, మనుమడు (కుమారుని ద్వారా) మునిమనుమడు (అలాంటి మనుమని ద్వారా) కలిగిన వారు కుమారుని దత్తు చేసుకోరాదు. కుమార్తెను దత్తు చేసుకోదలిచినవారికి హిందూ కుమార్తెగాని, కుమారుని కుమార్తెగాని ఉండరాదు, పురుషుడు స్త్రీని దత్తు చెసుకోదలిస్తే దత్తురాలి వయస్సుకన్న దత్తు తండ్రి వయస్సు 21 సం॥ పైగా ఉండాలి. అలాగే స్త్రీ పురుషుని దత్తు చేసుకోదలిస్తే దత్తు తల్లి వయస్సు దత్తుని వయస్సుకన్న 11 సం॥ పైగా ఉండవలెను. వివాహిత స్త్రీ భర్త సమ్మతితో తనకు దత్తు చేసుకోవటానికి శాసనంలో వెసులుబాటు లేదు. వివాహితులలో దత్తు చేసుకొనే అధికారం పురుషునిదే. అంటే వారిలో పురుషుని ఆధిక్యతను అట్లే ఉంచినట్లు తోస్తుంది. దంపతులలో ఏ ఒకరైనా మరియొకరి సమ్మతితో దత్తు చేసుకోడానికి వీలు ఉండాలని 'స్టేటస్ కమిటీ' సిఫారసు చేసింది.

ఇదే శాసనంలో మనవర్తిని గురించిన నియమాలు ఉన్నాయి. న్యాయ స్థానాలు అంతకు క్రితం ఇచ్చిన తీర్పులను ఎక్కువగా ఆధారం చేసుకొని

రూపొందించారు. భర్త వదలేసినా, భర్తతో కాపురముండటం ఆమెకు ప్రమాదమని ఆమెకు భీతి కల్గించేటట్లు ఆమెను క్రూరంగా హింసించినా, భర్త కుష్టురోగ పీడితుడయినా, మరో భార్యను కలిగి ఉన్నా, ఉంపుడు గత్తెను ఇంటిలో కాపురం పెట్టినా లేక మరోచోట అలవాటుగా ఉంపుడు గత్తెతో కాపురం ఉంటున్నా, మతం మార్చుకున్నా ఇంకా ఏవైనా తగిన కారణాలున్నా ఆమె వేరుగా కాపురం ఉవడవచ్చును. తన జీవితకాలము అతనినుండి మనవర్తిని పొందవచ్చును. ప్రతి హిందువు తన సంతానాన్ని క్రమంగా కాని అక్రమంగా కాని - వృద్ధులైన తల్లిదండ్రులను పోషించ వలెను. బిడ్డలు మైనర్లుగా ఉన్నంత కాలమే వారికి మనవర్తి లభిస్తుంది. వివాహిత కుమార్తెలకు ఆ హక్కు పోతుంది. ఈ శాసనంలో భర్తను పోషించాల్సిన బాధ్యత (అతడు పోషించుకోలేకపోతే) భార్యపై విధించలేదు. అది స్త్రీ పురుష సమానత్వ సిద్ధాంతానికి వ్యతిరేకం. అదీగాక ఈనాడు ఆర్థిక ప్రతిపత్తి కలిగిన స్త్రీల సంఖ్య పెరుగుతోంది. కనుక అలాంటి స్త్రీ కూడా (1) తనమీద ఆధారపడే భర్తను పోషించాలి. (2) బిడ్డల పోషణా భారాన్ని భర్తతో పాలుపంచుకోవాలి. (3) బీదలుగా ఉండే తల్లిదండ్రులను పోషించే విషయంలో సోదరులతోపాటు సోదరికూడా బరువు భారాన్ని మోయాలి అని స్టేటస్ కమిటీ సూచించింది.2

హిందూ మైనారిటీ మరియు సంరక్షకత్వ శాసనం (1956)

మైనరు బాలునికి, బాలికలకు తండ్రి సహజ సంరక్షకుడు. కాకపోతే మైనరు 5 సం॥ వయస్సు నిండేవరకు సర్వ సామాన్యంగా తల్లివద్ద ఉండ వచ్చును. అక్రమ సంతానం అయితే తల్లి సహజ సంరక్షకురాలు. ఆమె లేకపోతే తండ్రి సంరక్షకుడు. వివాహితఅయిన మైనరు స్త్రీకి భర్తయే సంరక్షకుడు. దత్తు కుమారునికి తండ్రియే సంరక్షకుడు. అతడు లేకపోతే తల్లి సంరక్షకురాలవుతుంది. సహజ సంరక్షకుని బిడ్డమీద, బిడ్డ ఆస్తిమీద అదుపు ఉంటుంది. హిందూతండ్రి తన వీలునామాద్వారా మరియొకరిని తన బిడ్డకు సంరక్షకునిగా నియమించవచ్చును. ఆ వీలునామాలోని నియామకం అతడు భార్యకన్నా ముందు చనిపోతే వర్తించదు. విధవ కాని, భర్త సంరక్షకుడుగాని ఉండడానికి వీలులేని పరిస్థితులలో భార్యకాని తవీ లునామాద్వారా మరియొక వ్యక్తిని తన బిడ్డకు సంరక్షకునిగా నియమించవ

వచ్చును. ఇది గొప్పవిశేషమట! కోర్టువారు సంరక్షకుని నియమించడంలో మైనరు శ్రేయస్సునే అత్యధిక విషయంగా పరిగణించవలెను. మైనరు అంటే 18 సం॥ నిండని వ్యక్తి అని శాసనం నిర్వచనం చేసింది. తల్లిది సంరక్షరాలిగా ద్వితీయస్థానం. 5 సం॥ లోపు బిడ్డను సర్వసామాన్యంగా ఆమె తనవద్ద ఉంచుకోవచ్చు. ఈ రెండు అంశాలు ఈ శాసనంలోని లోపాలు. స్టేటస్ కమిటీ ఈ రెంటినీ గమనించింది.3

హిందూ వివాహ శాసనం (1955)

ఇది ఈ విషయాన్ని గురించిన సమగ్రమైన శాసనం. వివాహము కాపురానికి రమ్మని కోరటం, కోర్టుద్వారా ఉత్తర్వులు పొంది విడిగా ఉండటానికి ఏర్పాటు, విడాకులు, ఆ సందర్భంగా మనవర్తి, పిల్లల సంరక్షణ మొదలైన అంశాలన్నింటిపైన నిర్వచనాలు, నిబంధనలు, అమలుజరిపే విధానాలు అన్నీ ఈ చట్టములో ఉన్నాయి. ఇది జమ్మూ, కాశ్మీర్ ప్రాంతానికి కాక భారతదేశానికంతటికీ వర్తిస్తుంది. ఈ శాసనం విస్తరింప బడిన ప్రాంతాలలో శాసన సమ్మతంగా స్థిరనివాసం ఏర్పరచుకున్న హిందువులకు వర్తిస్తుంది. మతరీత్యా హిందువులకు, బౌద్ధులకు, జైనులకు, శిక్కులకు, ఈ శాసనం వర్తించిన ప్రాంతాలలో స్థిరనివాసముంటూ ఇస్లాం, క్రైస్తవ, యూదు, పార్శీమతాలకు చెందకుండా ఉన్నవారందరికీ వర్తిస్తుంది. ఇద్దరు తల్లిదండ్రులు హిందువులు బౌద్ధులు లేక జైనులు లేక సిక్కులు అయినచో వారి సంతానం సక్రమమైనా, అక్రమమైనా వారికి, తల్లిదండ్రులలో ఒకరు, మాత్రమే హిందువు, బౌద్ధ, జైన, శిక్కులైయున్నచో, ఆ సంతానం వారివద్ద పెంచబడినను, పైన చెప్పిన నాల్గు మతాలలోకి ఇతర మతాలనుండి మారిన వారు, నాలుగు మతాలనుండి - హిందూ, బౌద్ధ, జైన శిక్కు మతాలనుండి ఇతర మతాలకు పోయి మరల తిరిగి అసలు వారి పాత మతాలకు తిరిగి వచ్చినవారు, వీరందరూ ఈ శాసనం క్రింద ఉండవలసిన వారే. ఇంకా ఏమైనా అనుమానం ఉంటుందేమోనని ఇలా స్పష్టం చేశారు. హిందూ మతానికి చెందినవాడు కాకపోయినా పై చెప్పిన నిర్వచనం వల్ల ఈ శాసనం వర్తించే ఏ వ్యక్తి అయినా 'హిందువు' గానే పరిగణింపబడును. అంటే ఇండియాలో స్థిరనివాసం కలిగిన నాస్తికులు, హేతువాదులు, అజ్ఞేయవాదులు, సంశయవాదులు అందరూ ఈ శాసనం క్రిందికి వచ్చువారే.

వధూవరులలో ఏ ఒకరికైనా అంతకు క్రితమే భార్యగాని, భర్తగాని జీవించి యున్నపుడు, వధూవరులు సపిండులయినపుడు, లేక వధూవరుల సంబంధం వివాహానికి నిషిద్ధమయినపుడు ఆ పెండ్లి చెల్లనేరదు. అది జరగ నట్లే ఎంచుకోవలెను.

అదీగాక ఈ దిగువ పేర్కొనబడిన పరిస్థితులు ఉన్నపుడు భార్యా భర్తలలో ఎవరో ఒకరు పిటీషను పెట్టి ఆ వివాహాన్ని చెల్లనిదానిగా న్యాయ స్థానం చేత ప్రకటింప చేసుకొవచ్చును :-

i రెస్పాండెంటు యొక్క లోపం వలన గర్భాదానం జరగక పోవుట,

ii వధూవరులో ఒకరికి మతిస్థిమితం లేక చెల్లదగిన సమ్మతి ఇవ్వలేని పరిస్థితిలో,

iii) అలాంటి సమ్మతి ఇవ్వడానికి శక్తి కలిగినా వివాహానికి తగక, సంతానం కనడానికి అర్హత లేకుండా ఉండే స్థాయిలో మానసిక రుగ్మతవల్ల బాధపడుచున్నందున

iv) తరచుగా, వధూవరులలో ఒకరు మూర్ఛరోగానికి, పిచ్చికి లోనై యుండుటవలన,

v) వివాహాన్ని గురించి కాని, రెస్పాండెంటుకు సంబంధించిన వివరాలు, పరిస్థితులను గురించి కాని రెస్పాండెంటు మోసం చేయడమో, బలవంతం చేయడమో జరిగినప్పుడు,

vi) పిటీషనరు వల్లగాక రెస్పాండెంటు వివాహకాలమందు ఎవరిద్వారా నైనా గర్భాన్ని పొంది యుండుట

ఈ రకం పిటీషను పెట్టవచ్చును.

బలవంతం చేశారనే ఆరోపణ వచ్చినపుడు బలవంతం ఆగిపోయిన తదుపరి సంవత్సరంలోగా పిటీషను పెట్టాలి. లేకపోతే ఆ పిటీషను చెల్లదు. ఆ మోసం తెలిసిన తరువాత, ఆ బలవంతం ఆగిపోయిన తరువాత పిటీషనరు రెస్పాండెంటుతో ఇష్టపూర్వకంగా కాపురం చేస్తే పిటీషను పెట్ట టానికి వీలులేదు. రెస్పాండెంటు గర్భిణీగా ఉన్నదనే కారణం విషయంలో

ఆ విషయం పిటీషనురుకు అపుడు తెలియకుండా ఉండాలి. పెండ్లి అయిన సంవత్సరంలోగా ఆ కారణంపై పిటీషను పెట్టాలి. ఆ వాస్తవం తెలిసిన తరువాత పిటీషనరు సమ్మతితో భార్యాభర్తల మధ్య శారీరక సంయోగం జరగకుండా ఉండాలి. ఈ షరతులు విధిగా వుండాలి. లేకపోతే పిటీషను చెల్లదు.

విడాకులు :- భార్యాభర్తలలో ఏ ఒకరు పిటీషను పెట్టినా ఈ దిగువ కారణాలను ఆరోపించి రుజువుచేసి విడాకులను పొంది వివాహాన్ని విచ్ఛేదనం చేసుకోవచ్చును :-

i) వివాహం అయిన తదుపరి రెస్పాండెంటు భర్త తోనో లేక భార్యతోనో లేక భార్యతోనో గాక మరియొకరితో లైంగిక సంపర్కం ఏర్పరచు కొనుట

ii) పిటీషనరును క్రూరంగా హింసించుట

iii) పిటీషను పెట్టిన తేదీకి వరుసగా రెండుసంవత్సరముల కాలము రెస్పాండెంటు పిటీషనరును వదలియుండుట

iv) రెస్పాండెంటు హిందూ మతమును విడనాడి మరియొక మతమును స్వీకరించుట

v) రెస్పాండెంటుతో పిటీషనరు కాపురం చేయుటకు హేతుబద్ధంగా వీలులేని పరిస్థితి రెస్పాండెంటు యొక్క అవిచ్ఛిన్నమైన లేక అపుడపుడు సంభవించే మానసిక రుగ్మత వల్ల ఏర్పడినపుడు, లేక రెస్పాండెంటుకు నయం కావటానికి అవకాశంలేని మతిస్థిమిత రాహిత్య మున్నపుడు,

vi) రెస్పాండెంటు తీవ్రమయిన, నయంకావటానికి అవకాశంలేని కుష్ఠు వ్యాధితో బాధపడుతున్నపుడు.

vii) అవతలివారికి సంక్రమించే లక్షణం కల, నయంకాని సుఖ వ్యాధిని రెస్పాండెంటు కలిగి యుంటే,

viii) ఏదైనా మతసంస్థలో చేరి సన్యాసం పుచ్చుకొని యుంటే,

ix) ఏడు సంవత్సరములు రెస్పాండెంటు జాడ, మామూలుగా అతని జాడ తెలిసేవారికి, తెలియకుండుట, విడాకుల కొరకు పిటీషనరు పెట్టవచ్చును.

వదలి యుండుట అంటే సహేతుకమైన కారణము మరియు సమ్మతి లేకుండా గాని, లేక పిటీషనరు ఇష్టానికి వ్యతిరేకంగా గాని, రెస్పాండెంటు వదలివేయుట పిటీషనరును నిరాదరణ చేయటం కూడా దానికిందనే వస్తుంది.

ఇరువురు విడిగా ఉండవచ్చని కాని, లేక అందులో ఒకరిని రెండవ వారితో కాపురం చేయమని కాని కోర్టువారు ఉత్తరువు ఇచ్చి ఉంటే, ఆ ఉత్తరువు పుట్టిన ఒక సంవత్సరంలోగా ఇరువురు కాపురం చేయుట ఆరంభం చేయక పోతే విడాకులకోసం పిటీషను పెట్టుకోవచ్చును.

అలాకాక భర్తకు ద్వితీయ భార్య ఉన్నదనిగాని, తనతో వివాహ మయిన తదువరి భర్త మరల ఇంకొక స్త్రీని వివాహమాడాడని ఆరోపణచేస్తే, అలాగే భర్త మానభంగం, ఏకలింగ సంపర్కం, లేక పశువుతో లైంగిక సంపర్కంలాంటి నేరాలకు పాలుపడితే, భార్యకు మనవర్తి శాసనం క్రింద గాని, లేక క్రిమినలు ప్రొసీజరు కోడ్ క్రిందగాని మనవర్తి ఇవ్వబడి యుండి ఆ ఉత్తరువు పుట్టిన నాటినుండి ఒక సంవత్సరంలోగా భర్త విడాకుల కోసం పిటీషను పెట్టుకోవచ్చును. అంతేగాక తనకు 15 సంవత్సరాలు నిండేలోపల వివాహమయినదని 18 సంవత్సరాలు నిండేలోపల తను ఆ వివాహం తనకు అక్కరలేదని ప్రకటించానని భార్య చెప్పి విడాకులు కోరవచ్చును. ఇపుడు ఈ శాసనం ప్రకారం వధువుకు 18 సం॥ నిండాలి. వరునికి 21 సం॥ నిండాలి. ఈ వివాహ శాసనానికి 1976 లో సవరణ వచ్చింది. దాని ప్రకారం విడాకులు కోరడానికి అదనంగా ఒక కారణం చేరికింది. ఇద్దరం ఒక సంవత్సరము నుండిగాని లేక పైకాలం నుండిగాని విడివిడిగా ఉంటున్నామని, ఇద్దరం కలసి ఉండలేకపోయామని, మరియు వివాహం రద్దుపడానికి ఇద్దరం అంగీకరించామని భార్యాభర్తలు కోర్టుకు నివేదిస్తే వివాహం రద్దు అవుతుంది. అలా పిటీషను పెట్టిన తరువాత ఆరు నెలల తదువరి పద్దెనిమిది నెలల లోపల ఇరువురి కోరిక మీద విడాకుల

ఉత్తరువు పుట్టుంది. సాధారణంగా విడాకులకోసం ఏ పిటీషనూ వివాహమయి సంవత్సరం పూర్తి కాకముందు స్వీకరింపబడదు. పిటీషనరుకూ ఎంతో ప్రత్యేకమైన, అసాధారణమైన ఇబ్బంది కలిగినపుడు కోర్టు ఈ గడువును సడలించి పిటీషను స్వీకరిస్తుంది. గడువును తగ్గించమనే పిటీషను విచారణపుడు భార్యా భర్తలకు సంతానం ఉంటే, ఆ సంతానపు శ్రేయస్సు, సంవత్సరం లోపల భార్యాభర్తల మధ్య సామరస్య సాధనకు ప్రయత్నం జరిగిందా లేదా అనే విషయం కోర్టు పరిగణనలోకి తీసుకుంటుంది.

వివాహం రద్దు అయిన తరువాత, అపీలు లేకపోతే, వెంటనే అలాకాక అపీలుకు అస్కారం ఉంటే అపీలు, గడువు అయిపోయినా అపీలు దాఖలు కాకపోతే, లేక అపీలు దాఖలయితే అది కొట్టివేయబడినపుడు భార్యా భర్తలలో ఎవరైనా మరల వివాహమాడవచ్చును.

భార్యా భర్తలలో ఏ ఒకరైనా రెండవ వారిని తనతో కాపురం చేయవలసినదని కోర్టుద్వారా ఉత్తరువు పొందవచ్చును. అలాగే విడాకులకు నిర్ణయింపబడిన ఏ కారణం వలనైనా భార్యగాని, భర్తగాని న్యాయశాస్త్రరీత్యా విడివిడిగా వుండే హక్కును పొందవచ్చును.

భార్య ఉండగా లేక భర్త ఉండగా మరొక వ్యక్తిని భర్తగానో లేక భార్యగానో స్వీకరిస్తే అది నేరమవుతుంది. అంతేకాక ఆ ద్వితీయ వివాహం 'లా' ప్రకారం చెల్లతగదు. ఈ వివాహ శాసనంలోని నిబంధనలకు వ్యతిరేకంగా నడచిన వ్యక్తికి శిక్షలు నిర్దేశించబడినాయి. వివాహమయిన ప్రదేశం, రెస్పాండెంటు నివసిస్తున్న చోటు, చివరిసారిగా భార్యాభర్తలు కలసి కాపురం ఉన్న ఊరు వీటిలో దీనిపైన ఆధిపత్యం కల జిల్లా కోర్టులోగాని, సబ్ కోర్టులోగాని పైచెప్పిన పిటీషన్లు పెట్టవచ్చును. విచారణ వీలయినంత త్వరలో చేయాలి. రెస్పాండెంటుకు నోటీసుముట్టిన ఆరునెలలలోగా విచారణ పూర్తి చేయటానికి ప్రయత్నం జరగాలి. ఈ కేసు విచారణ రహస్యంగా జరుగుతుంది. ఎవరూ ఈ విచారణ విషయాలను ప్రకటించరాదు. వీలయినంతవరకు భార్యాభర్తలమధ్య సఖ్యత, సామరస్యం నెలకొల్పటానికి కోర్టు తనంతతాను గాని, లేక వారిరువురు ఎన్నుకున్న వ్యక్తి, వారిరువురు ఒకవ్యక్తి పేరు చెప్పలేకపోతే కోర్టు నియమించిన వ్యక్తిద్వారా గాని ప్రయత్నించాలి. కోర్టులో

విచారణ కాలంలో ఏ ఒక్క పార్టీకైనా కోర్టు తాత్కాలిక మనవర్తిని, వ్యాజ్య ఖర్చులు ఇప్పించవచ్చును. చివరసారిగా ఉత్తరువు ఇచ్చేటపుడు శాశ్వత మనవర్తిని చెల్లించమని ఉత్తరువు జారీ చేయవచ్చును. మైనరు పిల్లల యొక్క స్వాధీనం, భరణం, విద్యలాంటి విషయాలను గురించి వ్యాయస్థానం ఉత్తరువు ఇవ్వవచ్చును. అలాగే ఇరువురికి సంబంధించిన ఆస్తి విషయమై ఉత్తరువు రూపంలో సూచనలు చేయవచ్చును.

కోర్టు జారీచేసిన ఉత్తరువులు సివిలుకోర్టు డిక్రీలవలె అమలు చేయ బడగలవు. ప్రత్యేక వివాహశాసనంలోని నిబంధనలకు ఈ శాసనంలోని నిబంధనలు వ్యతిరేకంగా పనిచేయవు. అంటే హిందువులు ఆ శాసనం క్రింద వివాహం చేసుకుంటే వారికి ఆ వివాహశాసనమే వర్తిస్తుంది, కాని ఈ హిందూ వివాహ శాసనం వర్తించదు.

ఈ హిందూ వివాహ శాసనం క్రింద పరిహారాన్ని పొందటానికై పిటీషను చాలును. దావా వేయనక్కరలేదు. అంటే కోర్టుఫీజు తక్కువ అన్నమాట. ఇది పెద్ద సౌకర్యం.

భర్త ఒకఊరిలో కాపురం ఉంటుంటే భార్య మరొక గ్రామంలోనో లేక పట్టణంలోనో కాపురం చేస్తుంటే అది భార్య భర్తను వదలివేసినట్లు కాదని స్పష్టంగా వివరించటం అవసరమని స్టేటస్ కమిటీ తలపోసింది.4

హిందూ వారసత్వ శాసనం (1956)

ఈ శాసనంయొక్క పరిధి హిందూ వివాహశాసనం లాంటిదే. దీనిలోని 'హిందూ' పద నిర్వచనం వివాహ శాసనంలోని లాంటిదే. ఈ శాసనం సమగ్రమైనది. కనుక ఈ శాసనంలో ఉన్న నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న ఆచారము, సంప్రదాయం చెల్లనేరవు. భారతీయ వారసత్వ శాసనము వర్తించే వారికి ఈ వారసత్వ శాసనము వర్తించదు.

ఈ శాసనం చేసిన మౌలికమైన మార్పులు :-

i) కొన్ని సందర్భాలలో కుమార్తెలను, కుమారులను సమంగా చూచింది. (షెడ్యూల్ 1 వ వర్గం)

ii) కోపార్సనరీ కుటుంబంలో ఒక సభ్యుడు చనిపోతే 1937 కు పూర్వం అతని హక్కులు తతిమ్మా సభ్యులకు చెందేవి. ఆ నిబంధన కొంత మారింది 1937 లో. ఇపుడు ఈ శాసనం వల్ల పూర్తిగా మారింది (సెక్టను 6).

iii) పురుషుని ఆస్తికి వారసులను నాలుగు వర్గాలుగా చేసి ఒక వర్గం తరువాత మరో వర్గాన్ని వీలునామా వ్రాయకుండా చనిపోయిన అతనికి వారసులనుగా నిర్ణయించింది (సెక్షను 8).

iv) స్త్రీ స్వాధీనంలో ఉన్న ఆస్తికి స్త్రీకి సంపూర్ణ హక్కులు ఇచ్చింది. అలాగే స్త్రీకి స్వాధీనానికి హక్కుగల అస్తి ఆమెకు వారసత్వం వల్ల సంక్రమించినా, మనవర్తిగా వచ్చినా, దాఖలు పూర్వకంగా వచ్చినా దానియందు ఆమెకు సర్వహక్కులూ ఏర్పడతాయి (సెక్షను 14).

v) 1956 కు పూర్వం స్త్రీ యొక్క స్త్రీ ధనపు ఆస్తి కుమార్తెలకు చెందేది. ఈ శాసనం వలన కుమారులు, కుమార్తెలు, భర్త సమానంగా మున్ముందుగా పొందుతారు (సెక్షను 15).

vi) హిందూ పురుషుని ఆస్తికి స్త్రీలు కూడా వారసులైనపుడు పురుష వారసులు పంచుకునే వరకు కాపురపు ఇంటిని స్త్రీ వారసు భాగ పంపిణీ కోరదు (సెక్షను) 23).

vii) వారసత్వం మొదలయిన సమయంలో పునర్వివాహం చేసుకున్న స్త్రీ (ముందుగా చనిపోయిన కుమారుని విధవ, ముందుగా చనిపోయిన కుమారుని ముందుగా చనిపోయిన కుమారుని విధవ, సోదరుని విధవ) పునర్వివాహం చేసుకున్నచో ఆమెకు వారసత్వంగా ఆస్తి రాదు (సెక్షను 24).

viii) ఎవరైనా ఏ వ్యక్తినైనా ఖూనీ చేసినా, చేయటానికి సహాయం చేసినా ఆ చనిపోయిన వ్యక్తి ఆస్తికి అలాంటివారు వారసులు కారాదు (సెక్షను 25)

ix) ఏ వ్యక్తి అయినా మతాంతరుడయితే అతని లేక ఆమెయొక్క సంతానం వారి సంతానం వారి హిందూ బంధువుల ఆస్తులకు -

ఆ సంతానం వారి సంతానం హిందువులయితే తప్ప - వారసత్వ రీత్యా యజమానులు కాలేరు (సెక్షను 26).

x) ఏ వ్యక్తి అయినా వారసుడుగా ఉండటానికి అనర్హుడయితే, అతడు చనిపోయినట్లుగా భావించి, వారసత్వం తరువాత వారికి చెందవలెను. (సెక్షను 27).

xi) ఈ శాసనంలో పేర్కొన్న రీతిగా కాక ఏ వ్యక్తి అయినా వ్యాధి లోపం, అంగవైకల్యం వలన వారసత్వానికి అనర్హత చేత బాధ పడరాదు (సెక్షను 28).

xii) శాసనంలో పేర్కొనబడిన వారసులు ఎవరూ లేకపోతే ఆస్తి ప్రభుత్వానికి సంక్రమిస్తుంది (సెక్షను 29).

xiii) మితాక్షర కోపార్సనరీలో తన హక్కులకు హిందూ పురుషుడు వారసత్వాన్ని ఏర్పరచవచ్చును (సెక్షను 30).

హిందూ సమిష్టి కుటుంబ లక్షణాన్ని మితాక్షర ప్రకారం - తీసి వేద్దామని ప్రభుత్వం మొదట్లో ఆలోచించినా సనాతనుల ఒత్తిడిని తట్టుకోలేక దానిని తీసివేయలేదు. అంటే మితాక్షర న్యాయాన్ని మార్చి దాయభాగ న్యాయాన్ని ప్రవేశపెట్టలేదు. అంటే కుమారునికి పిత్రార్జితపు ఆస్తిలో జన్మతః ఏర్పడిన హక్కును తీసివేయలేదు. అయితే 1937 హిందూ స్త్రీ ఆస్తిహక్కు చట్టం ప్రకారం సమిష్టి హిందూ కుటుంబాలలో (మితాక్షర పద్ధతి) భర్త వాటా పరిమిత హక్కులతో (Limited Rights) భార్యకు వచ్చేది. అదిపోయి పిత్రార్జితపు ఆస్తిలో భర్త వాటాను (అతడు విభక్తుడుగా చనిపోయినట్లు భావించుకొని) శాసనపు షెడ్యూలులో 1 వ వర్గంలో పేర్కొన బడిన వారందరు పంచుకుంటారు. కుమారుడు, కుమార్తె, భార్య, తల్లి, ముందుగా చనిపోయిన కుమారుని కుమారుడు, ముందుగా చనిపోయిన కుమార్తె కుమారుడు, ముందుగా చనిపోయిన కుమార్తె కుమార్తె, ముందుగా చనిపోయిన కుమారుని విధవ, ముందుగా చనిపోయిన కుమారుని ముందుగా చనిపోయిన కుమారుని కుమారుడు, ముందుగా చనిపోయిన కుమారుని ముందుగా చనిపోయిన కుమారుని కుమార్తె, ముందుగా చనిపోయిన కుమారుని ముందుగా చనిపోయిన కుమారుని విధవ. వీరు షెడ్యూలు 1 వ వర్గంవారు.

వీలునామా వ్రాయకుండా చనిపోయిన హిందూ పురుషుని ఆస్తి శాసనపు షెడ్యూలులోని 1 వ వర్గం వారికి చెందుతుంది. వారూ లేకపోతే చనిపోయిన అతని వంశం వారికి చెందుతుంది. వారూ లేకపోతే అతని రక్త సంబంధీకు లైన ఇతరులకు చెందుతుంది (సెక్షను 8). 1 వ వర్గంలోని వారసులు ఒక్కసారిగా ఆస్తిని తీసుకుంటారు. వారి తర్వాత రెండవ వర్గంలోని 1 వ వరుస వారికి వస్తుంది. వారు లేకపోతే 2 వ వర్గంలోని రెండవ వరుస వారికి వస్తుంది. తరువాత 3 వ వరుస. తరువాత 4 వ వరుస. ఆదేక్రమం చివరవరకూ వర్తిస్తుంది (సెక్షను 9). 1 వ వర్గంలోని వారసులు ఈ విధంగా పంచుకుంటారు. చనిపోయిన అతనికి అనేకమంది భార్యలుంటే వారంతా కలసి ఒక వాటా తీసుకుంటారు. (రూలు 1), తండ్రి చనిపోయే నాటికి బ్రతికి వున్న కుమారులు, కుమార్తెలు, తల్లి తలా ఒక వాటా తీసుకుంటారు. (రూలు 2). ముందుగా చనిపోయిన కుమారుని లేక ముందుగా చనిపోయిన కుమార్తె శాఖలకు సంబంధించిన వారసులు వారంతా కలసి శాఖకు ఒక వాటా తీసుకుంటారు. (రూలు 3). ముందుగా చనిపోయిన కుమారుని శాఖకు సంబంధించిన వాటాలో అతని విధవ ఒక వాటా, కుమారులు కుమార్తెలు తలా ఒక వాటా పొందుతారు [రూలు 4 (i)]. ముందుగా చనిపోయిన కుమార్తె శాఖకు సంబంధించిన వాటాలో ఆమె కుమారులు కుమార్తెలు తలా ఒక వాటా తీసుకుంటారు [రూలు 4 (ii)], (సెక్షను 10). షెడ్యూలులోని 2 వ వర్గంలోని ఏ వరుసలోని వారసులయినా సమానంగా తీసుకుంటారు (సెక్షను 11). సపిండులు, రక్తసంబంధీకుల వారసత్వ విధానం 12 వ సెక్షనులో చెప్పబడినది. వీలునామా వ్రాయకుండా చనిపోయిన పురుషుడికి అవిభక్త హిందూ కుటుంబంలో ఉన్న హక్కు (వాటా) అతని ఆస్తిగా ఎంచబడును. అంటే దానికి, అతని స్వార్జితపు ఆస్తికి సెక్షను 8 లో రూపొందించబడిన వారసత్వ విధానం అమలులోకి వస్తుంది. ఒక ఉదాహరణ తీసుకుందాము. ఒక హిందూ పురుషుడు తన ముగ్గురు కుమారులతో అవిభక్తుడుగా ఉండి చనిపోయినాడనుకుందాము. 1937 సం॥ శాసనం ప్రకారం పితార్జితంలో అతని నాలుగవ వంతు ఆస్తి (చనిపోయిన రోజున అతడు విభక్తుడయినట్లు భావించుకొని) అతని విధవకు పరిమిత హక్కులతో వచ్చేది. ఇపుడు పరిస్థితి పూర్తిగా మారింది. అతనికి ముగ్గురు కుమార్తెలు, తల్లి ఉందని ఎంచుకుంటే అప్పుడు, ఈ శాసనం ప్రకారం, అతని నాల్గవ

వంతు వాటాను ఆఅని కుమారులు ముగ్గురు, కుమార్తెలు ముగ్గురు, తల్లి ఒకామె, భార్య ఒకతె మొత్తం ఎనిమిదిమంది పంచుకుంటారు. అపుడు

భార్యకు $\frac{1}{4} \times \frac{1}{8} = \frac{1}{32}$ తల్లికి $\frac{1}{4} \times \frac{1}{8} = \frac{1}{32}$

కుమార్తెలకు ఒక్కొక్కరికి $\frac{1}{4} \times \frac{1}{8} = \frac{1}{32}$ సర్వహక్కులతో వస్తుంది.

ముగ్గురు కుమార్తెలకు $3 \times \frac{1}{32} = 3/32$ వస్తుంది. కుమారుకు ఒక్కొకనికి

$\frac{1}{4}$ (స్వంతహక్కుగా) $+ \frac{1}{32}$ (తండ్రిద్వారా) $= \frac{9}{32}$ వస్తుంది.

ముగ్గురు కుమారులకు—$3 \times \frac{9}{32} = 27/32$.

1937 కు పూర్వం కుమారులు ఉండగా భార్యకు, కుమార్తెకు వారసత్వ హక్కు ఉండేది కాదు. కుమారులు, భార్య, కుమార్తెలు ఉండగా తల్లికి వారసత్వ హక్కు ఉండేది కాదు.

ఈ శాసనంవల్ల కొంతగా కుమార్తెలు లాభించారు; అలాగే తల్లి లాభించింది. కాని చనిపోయిన వ్యక్తి యొక్క విధవ నష్టపోయింది. 1937 సంవత్సరపు 'ఆక్టు' ప్రకారం పై ఉదాహరణలో విధవకు $\frac{1}{4}$ వంతు పరిమిత హక్కులతో వస్తే ఇపుడు దాని స్థానంలో $\frac{1}{32}$ సర్వహక్కులతో వచ్చింది. [ఇపుడు ఆం. ప్ర. హిందూ వారసత్వ సవరణ బిల్లు 1985 ప్రకారం భార్యకు $\frac{1}{32}$ వంతు బదులు $\frac{1}{7}$ (జన్మతః హక్కు ఉన్నవారు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, చనిపోయిన వ్యక్తి మొత్తం

7 గురు) లో $\frac{1}{8}$ వంతు అంటే $\frac{1}{7} \times \frac{1}{8} = \frac{1}{56}$ వంతు సర్వహక్కులతో వస్తుంది. కుమార్తెలకు, కుమారులకు అరుగురికి ఒక్కొక్కరికి $\left\{\frac{1}{7}+\frac{1}{56}\right\}\frac{9}{56}$ వంతు వస్తుంది. తల్లికి $\frac{1}{56}$ సర్వహక్కులతో వస్తుంది].

స్వార్జితపు ఆస్తిని తీసుకుందాం. పై ఉదాహరణను పరిగణిద్దాము. అపుడు ముగ్గురు కుమార్తెలు, తల్లి, విధవ 8 మంది సమానంగా పంచుకుంటారు. అంటే తలా $\frac{1}{8}$ వంతు ఆస్తి వస్తుంది. (ఆం. ప్ర. హిందూ వారసత్వ సవరణ బిల్లు వల్ల కూడా ఈ వాటాలలో మార్పు ఉండరాదు).

ఇక ఈ శాసనంలో స్టేటస్ కమిటీ వారు పేర్కొనిన లోపాలు :-

1) కుమారునికి జన్మతః పిత్రార్జితపు ఆస్తిలో ఉన్న హక్కు (మితాక్షర న్యాయం ప్రకారం) తీసివేయాలి.[5]

2) వ్యవసాయ కమతాలు చిన్నా భిన్నం కాకుండాను, లేక కమతాల పై గరిష్ఠ పరిమితి విధిస్తూను, లేక ఆ కమతాల వారసత్వ క్రమాన్ని నిర్ణయిస్తూను చేయబడిన శాసనాలను ఈ శాసనం ఏ విధంగాను భంగపరచరాదు అని సెక్షను 4 (2) లో వ్రాయబడినందున రాష్ట్ర శాసన సభలు కమతాలను గురించి చేసిన శాసనాలు చెల్లుతాయి. అంటే అవి ఈ శాసన పరిధినుండి మినహాయింపు చేయబడినవి. ఈ దేశంలో గ్రామాలు జాస్తి. వ్యవసాయ భూమి ఎక్కువ. కనుక హిందూ స్త్రీల హక్కులను నివారించటానికి రాష్ట్ర శాసన సభలు పైన ఉదహరింపబడిన శాసనాలను చేసే ప్రమాదం ఉన్నది. ఉత్తర ప్రదేశ్ శాసనం ప్రకారం కమతం పురుష సంతతికి వస్తుంది. వారు లేకపోతేనే విధవకు, తల్లికి వస్తోంది. వారి తరువాత తండ్రి. అతడు లేకపోతే అవివాహిత కుమార్తె. పైచెప్పినది ఊహ కాదని ఈ ఉత్తర ప్రదేశ్ శాసనం రుజువు చేస్తున్నది.[6]

3) హిందూ స్త్రీ వీలునామా వ్రాయకుండా చనిపోతే ఆమె ఆస్తి కుమారులకు కుమార్తెలకు, భర్తకు వస్తుంది. ముందుగా చనిపోయిన కుమారుని సంతతి, ముందుగా చనిపోయిన కుమార్తె సంతతి కూడా వాటాలు పొందుతాయి. వీరెవరూ లేక భర్త మాత్రమే ఉన్నా ఒక పరిస్థితిలో ఆస్తి భర్తకు రాదు (సెక్షను 15). ఆ ఆస్తి ఆమెకు అంతకు క్రితం తండ్రి వల్ల వచ్చి ఉంటే తండ్రి వారసులకు వస్తుంది [సెక్షను 15 (2) ఎ] అలాగే ఆస్తి ఆమెకు భర్త వల్ల, మామవల్ల వచ్చివుంటే పైచెప్పిన సంతతి లేనపుడు భర్త వారసులకు వస్తుంది [సెక్షను 15 (2) బి]. స్త్రీ ధనం సంతానానికి భర్తకు ముందుగా - మామూలుగా వస్తుంది. వారు లేకపోతే భర్త వారసులకు ఆ తర్వాత తల్లికి తండ్రికి, వారూ లేకపోతే తండ్రి వారసులకు వారూ లేక పోతే తల్లి వారసులకు వస్తుంది. [సెక్షను 15 (1)] పైన ఉటంకించబడిన ప్రత్యేక నిబంధనలవల్ల [సెక్షను 15 (2)] 'అందరికీ ఒకే సూత్రం వర్తించాలి అనేది' దెబ్బతిన్నది.7

4) కాపురపు ఇంటిని భాగపంపిణీ చేసుకునే విషయంలో స్త్రీ వారసుల యెడ వివక్ష ఉన్నది. అంతేగాక కాపురపు ఇంటిలో నివాసముండే హక్కు అవివాహిత కుమార్తెకు, విధవరాలైన కుమార్తెకు, భర్త నుండి విడివడిన కుమార్తెకు పరిమితం చేసింది.8

5) ఏ హిందూ పురుషుడైనా స్త్రీ వారసుల హక్కులను తోసి రాజనటానికి వీలునామా వ్రాయవచ్చును. అది మంచి పద్ధతి కాదు. కనుక అలా చేయకుండా హిందూ పురుషుడు తన ఆస్తిలో కొంతమాత్రమే వీలునామా ద్వారా చెంద జేయనగును అని సవరించాలి.9 స్త్రీల శ్రేయస్సు దృష్ట్యా హిందూ వారసత్వ శాసనం మార్పులకు లోను కావలసి ఉన్నది.

బాల్య వివాహ నిరోధ శాసనం (1929)

ఇది చివరిసారిగా 1978 లో సవరింపబడినది. 21 సంవత్సరములు నిండని పురుషుడు బాలుని, 18 సం॥ నిండని స్త్రీ బాలిక అని నిర్వచనం చేయబడింది. బాల్యవివాహం చేసుకున్న వరునికి శిక్ష, తల్లితండ్రులకు శిక్ష నిర్దేశింపబడినాయి. సంరక్షకునికి కూడా శిక్ష చెప్పబడినది. స్త్రీకి జైలుశిక్ష వేయరాదు. ఈ శాసనం క్రింది నేరాలను పోలీసులు దర్యాప్తు

చేయగలదు. బాల్యవివాహాన్ని ఆపటానికి న్యాయస్థానం నిషేధపు ఉత్తరువును జారీ చేయవచ్చును.

కట్న నిషేధ శాసనం (1961).

ఇది 1984 లో సవరింపబడినది. సవరణ చట్టము తే 2-10-84 నుండి అమలులోకి వచ్చింది. ముఖ్యమైన మార్పులు జరిగాయి. శిక్షల పరిమితి, బహుమతుల జాబితాలు, జరిమానాల హెచ్చింపు, కేసు పెట్టడానికి అర్హత, వరకట్నాన్ని వివాహమాడిన స్త్రీకి తిరిగి ఇవ్వడానికి నిర్దేశింపబడిన కాలవ్యవధి, మొదలగు విషయాలలో మార్పులు వచ్చాయి. కట్నంయొక్క నిర్వచనాన్ని కూడా మార్చడం సంభవించింది. ఈనాటి శాసనం ప్రకారం చాల కట్టుదిట్టాలు వచ్చాయి. ఈ శాసనం అందరికీ వర్తిస్తుంది కనుక, వరకట్న దురాచారం హిందువులలో ఎక్కువగా ఉన్నది కనుక, ఈ శాసనాన్ని ప్రత్యేకంగా హిందువులకై వర్తింపచేయకపోయినా ఇక్కడ చర్చిస్తున్నాం.

వివాహంతో ఒకపార్టీ మరిఒక పార్టీకి, లేక ఒక పార్టీ తల్లిదండ్రులు గాని మరెవరైనా గానీ రెండవ పార్టీకి లేక మరియొక వ్యక్తికి ఆ పార్టీల పెండ్లి సందర్భంగా ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని ఇచ్చిన ఆస్తి లేక విలువగల ధనం, పత్రం, చరాస్తి వగైరా లేక ఇచ్చుటకు అంగీకరించిన కట్నమనబడును. ముసల్మాను ధర్మశాస్త్రప్రకారం పేర్కొనబడిన 'మహర్' (Dower) దీని క్రిందకు రాదు. (సెక్షను 2) ఏ వ్యక్తి అయినా కట్నం ఇచ్చినా, పుచ్చుకున్నా, లేక ఇచ్చుటతో, పుచ్చుకొనుటలో సహాయపడినా, అనికి ఆరుమాసములకు తక్కువగాని 2 సం॥ మించని జైలుశిక్ష. ఇంకా పదివేల రూ. లు లేక కట్నం ఏది ఎక్కువ అయితే దానికి మించని జరిమానాకు పాత్రుడు లేక పాత్రురాలు. కాకపోతే ప్రత్యేక కారణాలను పేర్కొని కోర్టు ఆరు మాసాలకు తక్కువ శిక్ష వేయవచ్చును. వివాహకాలమందు, ఎవరూ కోరకుండా, వధువుకు ఇవ్వబడిన బహుమతులు - ఈ శాసనం క్రింద తయారయిన నిబంధనల ప్రకారం ఏర్పడిన జాబితాలో పేర్కొనబడినచో - కట్నం క్రిందికి రావు.

అలాగే, ఎవరిచేత కోరబడకుండా, వరునికి వివాహమపుడు ఇవ్వబడిన బహుమతులు - జాబితాలో వ్రాయబడితే - కట్నం క్రిందికి రావు. కాగా

వరునికి వచ్చే బహుమతులకు సంబంధించి మరో షరతు వుంది. అవి వధువు తరపున గాని లేక వధువు బంధువైన వ్యక్తి తరపునగాని ఇవ్వబడి, అవి ఆచారం ప్రకారం ఇవ్వబడే బహుమతులు అయి, ఎవరివల్ల లేక ఎవరి తరపున ఆ బహుమతులు ఇవ్వబడినవో ఆ వ్యక్తి యొక్క ఆర్థిక స్తోమతును పరిగణవ లోకి తీసుకొనినచో అధిక విలువ కానివి అయినచో అవి కట్నం క్రింద లెక్కకురావు. (సెక్షను 3) ఏ వ్యక్తి అయినా ప్రత్యక్షంగా కాని వధువు లేక వరునియొక్క తల్లిదండ్రులనుండి, బంధువులనుండి లేక సంరక్షుని నుండి కట్నంను 'డిమాండు' చేసినచో ఆ వ్యక్తికి 2 సం॥ లకు మించకుండా 6 నెలలకు తగ్గకుండా జైలుశిక్ష మరియు పదివేలకు మించని జరిమానా వేయ వచ్చును. కాకపోతే తగిన కారణాలు ఉంటే కోర్టువారు 6 నెలల లోపున శిక్ష వేయవచ్చును (సెక్షను 4), కట్నం ఇవ్వడానికి, పుచ్చుకోడానికి చేసుకున్న ఒప్పందం చెల్లనేరదు (సెక్షను 5).

ఏ స్త్రీ వివాహ సందర్భంగా కట్నం ఏ వ్యక్తి చేతనైనా తీసికొనబడినచో- ఆ స్త్రీ కాక - ఆ వ్యక్తి ఆ కట్నాన్ని ఆ స్త్రీకి ఈ దిగువ విధంగా తిరిగి ఇచ్చివేయవలెను.

i) కట్నం పెళ్ళికి ముందే తీసుకుంటే పెళ్ళి తేదీనుండి 3 మాసాల లోపల.

ii) కట్నం వివాహమపుడు కాని లేక తరువాత గాని తీసుకుంటే తీసుకున్న తేదీనుండి 3 నెలల లోపల

iii) స్త్రీ మైనరుగా ఉన్నవుడు కట్నం తీసుకుంటే, ఆ స్త్రీకి 18 సం॥ నిండిన 3 మాసాలలోగా, అది ఆమెకు చెందజేయాలి (సెక్షను 6).

అలా చేయని వ్యక్తికి 6 మాసాలకు తక్కువ కాకుండా 2 సం॥ మించని జైలుశిక్ష లేక పదివేలకు మించని జరిమానా లేక ఆ రెండు శిక్షలు విధించవచ్చును. అలా హక్కుదారయిన స్త్రీ చనిపోతే ఆ కట్నం ఆమె వారసులకు చెందవలెను [సెక్షను 6 (3)]. ఏ వ్యక్తి అయినా కట్నాన్ని శిక్ష చెప్పకముందు ఆ స్త్రీకి చెందజేయకపోతే శిక్ష వేయడమే కాక ఆ ఆస్తిని ఆ స్త్రీకి చేర్చమని అతనికి లేక ఆమెకు ఉత్తరువును కోర్టువారు ఇవ్వవచ్చును. అలాంటి ఉత్తరువును కోర్టువారు ఇచ్చిన గడువు లోపల ఆ వ్యక్తి ఖాతరు

చేయకపోతే ఆ కట్నపు విలువను అతని ఆస్తినుండి, కోర్టువారు విధించిన జరిమానాను వసూలు చేసే పద్ధతిలో, రాబట్టవచ్చును [సెక్షను 6 (3 ఎ)]. ఈ కేసులను ఫస్టు క్లాసు మెజస్ట్రేటు విచారించగలడు. కోర్టువారు ఇలాంటి కేసును స్వయంగా తమకు తెలిసిన విషయాన్ని ఆధారంగా ఫైలులోకి తీసుకో గలరు. లేక పోలీసు రిపోర్టుపైన, ఆ నేరంవల్ల బాధిత వ్యక్తి, లేక తల్లి దండ్రులు, లేక బంధువు, లేక గుర్తింపబడిన సంక్షేమ సంఘం వారి ఫిర్యాదు పైన మెజస్ట్రేటు కేసును స్వీకరించగలడు. కేంద్ర, లేక రాష్ట్ర ప్రభుత్వాలచే గుర్తింపు పొందిన సామాజిక సంక్షేమ సంఘము 'గుర్తింపబడిన సంక్షేమ సంఘం'గా పరిగణింపబడును. ఈ శాసనం క్రింద నమోదయ్యే నేరాలు 'కాగ్నిజిబులు' నేరాలు. అంటే పోలీసువారు నిందితులకు వారంటు లేకుండా అరెస్టు చెయడానికి వీలయిన నేరాలు. ఈ కేసులో జామీనుపై నిందితుని విడుదల చేయవచ్చును. అయితే ఈ కేసులో రాజీపడటానికి వీలులేదు. బహుమతుల జాబితాను ఎవరు తయారు చేయాలి, ఎలా తయారు చేయాలి అనే దాని విషయమై కేంద్ర ప్రభుత్వం నిబంధనలను రూపొందించవచ్చును. నిబంధనలను తే 19-8-1985 న గెజిటులో ప్రకటించారు. బహుమతుల జాబి తాను వరుడు వ్రాయాలి. ప్రతి బహుమతి, దాని వివరం, దాని సుమారు విలువ, ఇచ్చిన వారి పేరు, బహుమతి వధువు బంధువు గాని, వరుని బంధువు గాని ఇస్తే ఆ బంధుత్వం ఈ అంశాలన్నీ ఆ జాబితాలో ఉండాలి. ఈ జాబితాపై వధూవరుల దస్కతులు లేక వేలిముద్రలు ఉండాలి. అంతేగాక పెండ్లి సమయంలో హాజరయిన బంధువుల, లేక ఇతర వ్యక్తుల సంతకాలు కూడా ఆ జాబితాపై తీసుకొనవచ్చును.

ఇలా ఎన్ని కట్టుబాట్లు శాసనపరంగా చేసినా ఈ సామాజిక దురా చారాన్ని అరికట్టడం కష్టం. స్త్రీలలో చైతన్యం వెల్లివిరిసిననాడు, వరకట్నం ఇవ్వడానికి వారు నిరాకరించిననాడు, వివాహం స్త్రీకి తప్పనిసరి సంస్కార మని భావించటం మానివేసిననాడు, కట్నం తీసుకున్న పురుషుని సమాజం ఈసడించి, అసహ్యించే స్థితికి కొంతగా కొంత వచ్చిన నాడు ఈ దురాచారం నశిస్తుంది. ఆ శుభ సమయాన్ని దగ్గర చేయటానికి స్త్రీలు ఉద్యమించాలి.

అధ్యాయం 15

పాదదీపికలు

1. స్టేటస్ కమిటీ రిపోర్టు పుట 125
సమానత్వంవైపు (భారత ప్రభుత్వం)
Towards Equality (Govt of india 1974)
2. డిటో పుట 129
3. డిటో పుట 126
4. డిటో పుట 119
5. డిటో పుట 136
6. డిటో పుట 137
7. డిటో పుట 138
8. డిటో పుట 138
9. డిటో పుట 138

అధ్యాయం

16 మదింపు, ముగింపు

హిందూ సమాజాన్ని స్థూలంగా దర్శనం చేసుకున్న తరువాత, ఆ సమాజాన్ని నడిపించే మత సూత్రాలను అవగతం చేసుకున్న తదుపరి, దాని ధార్మిక నియమాన్ని గుర్తించిన పిదప దాని బాగోగులను గురించి ఆలోచించవలసి ఉంటుంది. కాగా విషయ ప్రధానంగా సామాజిక ధర్మాలను, నియమాలను, సంప్రదాయాలను, ఆచారాలను విశ్లేషణ చేసుకున్నాం. కనుక ఇపుడు ఒకసారి కాలగతి ననుసరించి సమీక్ష చేసుకోవటం అవసరం.

ఋగ్వేద కాలంలో (సుమారు క్రీ. పూ 2500 క్రీ. పూ 1500) స్త్రీలు మత విషయకంగా, విద్య పరంగా తృప్తికరమైన స్థానంలోనే ఉన్నారు. కాగా వారు రాజ్య నిర్వాహణ చేసినట్లు లేదు. ఆర్థిక రంగంలో పాత్ర స్త్రీపురుషు లిద్దరికీ అంతంతమాత్రమే. కాగా ఆమెకు వేరే ఆస్తి ఉన్నట్లుగా గాని దానిని ఆమె ఎలా అనుభవించేదో గాని మనకు సాక్ష్యాధారాలు లేవు. కాబట్టి ఆమెకు విడిగా ఆస్తిపై హక్కులు లేవని ఊహించవచ్చును. వివాహ విషయంలో ఆమె గౌరవ చూపటానికి అవకాశం ఉండేది. 16 సంవత్సరముల వయస్సు లో వివాహం జరిగేది. సభలలో, విద్వత్ సభలలో ఆమెకు ఆనాడు ప్రవేశం ఉండేది. భర్త చనిపోతే భార్య మరణించవలసిన పనిలేదు. విధవా వివాహం వుండేది.

క్రీ. పూ 1500 నుండి క్రీ. పూ 500 వరకు గడచిన కాలాన్ని సంహితలయుగమనవచ్చు. సంహితలు, బ్రాహ్మణాలు ధర్మసూత్రాలు, గృహ్యా సూత్రాలు, తొలికాలపు స్మృతులు పుట్టాయి. ఈ కాలంలో వివాహ వయస్సు తగ్గలేదు. కాగా జీవిత దృక్పధం మారింది. భౌతికానందానికి ప్రాధాన్యత తగ్గి, పితృదేవతల ఋణవిముక్తికి ప్రాముఖ్యత వచ్చింది. ప్రతి మనిషికి మూడు ఋణాలు ఉన్నాయట. అవి దేవఋణం, పితృఋణం, మనుష్యఋణం, దేవ ఋణం తీర్చుకోడానికి యజ్ఞాలు, యాగాలు, క్రతువులు సాగించే మానవుడు

పితరుల సేవకు పూనుకున్నాడు. వారిని దేవతలతో సమానంచేసి పితృదేవత లన్నాడు. వారికి సద్గతులు కల్గించటానికి సంతానాన్ని అపేక్షించాడు. సంతానాన్ని కనవలసిందని ఆమెను ఆదేశించాడు. స్త్రీ స్థానం పతనం కాజొచ్చింది. వేదకాలంలో తమ జనాభాను పెంచుకుంటే తప్ప శత్రువులను జయించలేమనే భావంతో సంతానాన్ని అధికంగా ఆశించిన ఆర్యుడు ఈ కాలంలో మత కారణం వలన అలాంటి పనికే పూనుకున్నాడు. మరో సామాజిక పరిణామం సంభవించింది. ఆర్యులు అనార్య స్త్రీలను వివాహ మాడసాగారు. కాని వారితో తమ సుఖసంతోషాలకు మాత్రం సాంగత్యం నెరపి, మత క్రతువులలో ఆర్య భార్యలకు అధికారం, ప్రమేయం కల్పించారు. వైదిక యజ్ఞాలను క్రతువులను సంక్లిష్టం చేసుకున్నారు. కావున స్త్రీ సంతాన సాధనకు ఉపకరించే జీవి మాత్రమే కాక ఇల్లాలు కూడాను. అయితే భార్యలలో రెండు తెగలు. మత క్రతువులలో సాహచర్యం జరుపగల భార్యలు. ఆ స్వేచ్ఛలేని భార్యలు. 'విభజించి పాలించు' సిద్ధాంతం ఆచరణలో స్త్రీల పరంగా ప్రారంభమయిందా! అని తోస్తున్నది.

క్రీ. పూ. 500 నుండి క్రీ. త. 500 వరకు 'సూత్రయుగం' అని పిలవవచ్చు. ధర్మశాస్త్రాలు అశేషంగా ఉద్భవిల్లాయి. సూత్ర గ్రంథాలు, స్మృతులు, పురాణాలు వచ్చాయి. ఈ దశలో స్త్రీ స్థితి చరమాంకానికి వచ్చింది. ఈ కాలంలోని ముఖ్యులు కౌటిల్యుడు, మనువు. కౌటిల్యునిది లౌకికతత్వం. మనువుది 'ధర్మ' దృష్టి. ధర్మమంటే న్యాయమైనదని కాదు. ధర్మమంటే విధ్యుధర్మం. అంటే తప్పక చేయవలసిన పని అని అర్థం చెప్పుకోవాలి. వీరిరువురి మధ్య ఉన్న కొద్దిపాటి తేడాలను, పోలికలను గమనిద్దాం. అర్థ శాస్త్రంలో స్త్రీకి ఆర్థిక ప్రతిపత్తి, ఆర్థిక పరంగా వ్యక్తిత్వం ఉండేవి. మనువు కాలం నాటికి అది క్షీణించింది. ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా కుమారుని అవసరాన్ని నిర్ధారించి వంశోద్ధరణ యొక్క ప్రాముఖ్యాన్ని, పితృస్వామ్య వ్యవస్థయొక్క ప్రాధాన్యతను మనుస్మృతి తెలుపుతున్నది. అర్థశాస్త్రం, మనుస్మృతి ఈ రెండు కూడా స్త్రీని పురుషునిపై ఆధారపడేటట్లు చేశాయి. స్త్రీలు సాంఘిక ఆర్థిక హక్కులు కోల్పోయారు. తమ భవిష్యత్తును తాము నిర్ణయించుకోగల సత్తాను కోల్పోయారు. ఇది కాలక్రమేణ జరిగిన మార్పు-వీరికాలంలో. వీరు దీనికి సిద్ధాంతపరమైన ఆధారాలను కల్పించారు. స్త్రీలకు అవకాశాలు సన్నగిలినాయి. అర్థశాస్త్రకాలంలో పునర్వివాహం, స్వతంత్రంగా

ఆస్తి కలిగి ఉండడం ఉండేది. 'ధర్మకామ' అయిన విధవ గొప్పమనిషి. లౌకిక వివాహాలకన్న ధార్మ్య వివాహాలు గొప్ప. కాని లౌకిక వివాహం చేసుకున్న స్త్రీలకు ఎక్కువ హక్కులు వెసులుబాట్లు ఉన్నాయి. మనువు కాలంలో (క్రీ. పూ. 200 - క్రీ. శ. 200) రజస్వలాత్పూర్వ వివాహాలు వచ్చాయి. వర్ణాంతర వివాహ నిషేధం వచ్చింది. బహుభార్యాత్వం స్థిరపడింది. ధార్మ్య వివాహాలను ప్రోత్సహించడానికి, ధార్మ్య వివాహం చేసుకున్న వారికి ఇతోధిక హక్కులను సౌకర్యాలను ఇచ్చాడు మనువు. స్త్రీల హోదాలో తేడా - ఆర్య భార్యలు, అనార్య భార్యల మధ్య - తీసివేశాడు. అందరు స్త్రీలనూ అస్వతంత్రిలను చేశాడు. బ్రాహ్మణుల ఆచారాలను మనువు సమాజం మొత్తంపై రుద్దాడు. వాస్తవానికి కౌటిల్యునికీ, మనువుకూ లక్ష్యాల విషయంలో తేడా లేదు. కౌటిల్యుడు 'అర్థం' పై దృష్టితో వ్రాశాడు. మనువు 'ధర్మాన్ని' మనసులో ఉంచుకున్నాడు. కౌటిల్యుని కాలంలో ధనవంతులు, బీదలు వేరు వేరుగా ఉండి ఎవరి ధర్మాలు వారికి ఉండేవి. మనువు కాలంలో ధనవంతుల ధర్మాలు అందరి ధర్మాలుగా చేయబడినయి. మనువు సామాజిక సంస్థకు విలువ ఇచ్చాడు. ఆస్తికి విలువ ఇవ్వలేదు. రాజకీయ కారణాలను, మతవ్యాప్తి అవకాశాలను పురస్కరించుకొని గాంధర్వ వివాహాన్ని, నియోగాన్ని మనువు అంగీకరించాడు. వర్ణవ్యవస్థ పూర్తిగా నాశనం కాకుండా చేసిన ప్రయత్నమది. విధవా పునర్వివాహాన్ని ఆపటానికి నియోగాన్ని ఆమోదించాడు. అర్థశాస్త్రంలో కుమార్తెలకు హక్కులుండేవి వారసత్వ విషయంగా. అవి కోల్పోయారు మనువు ధర్మమా అని. కుమారుని ప్రాముఖ్యత పెరిగింది. వివాహానికి, వారసత్వానికి ధర్మాన్ని జోడించాడు మనువు. శుల్కాన్ని నిషేధించాడు. ద్విజులలో కూడ వర్ణాంతర వివాహాలను నిషేధించాడు. అర్థశాస్త్రకాలంలో వర్ణ వ్యవస్థ బిగవలేదు. మనువు నాటికి గట్టిపడింది. మనుస్మృతితో బ్రాహ్మణుల స్థానం స్థిరపడింది. పితృస్వామ్య వ్యవస్థ మనుస్మృతి కాలంనాటికి బలపడింది. దాంతో స్త్రీల శాశ్వత పరాధీనత, సమాజంలో పురుషుల పెత్తనం స్థిరపడినయి.[1] స్త్రీకి ఉపనయనాధికారం పోయింది. చిన్నతనంలో పెండ్లి అవటంతో విద్యా సముపార్జనావకాశాలు మృగ్యమైనాయి. స్త్రీని దండించటానికి మనువు భర్తకు అధికారం ఇచ్చాడు. త్రాడుతోకాని, సన్న వెదురు బొంగుతో కాని భార్యను వీపుమీద కొట్టి భర్త ఆమెను దండించవచ్చును (మనుస్మృతి VIII - 299-30)[2] మనువు స్త్రీలకు

భద్రత ఇచ్చాడు. స్త్రీలను గౌరవంగా, ప్రేమగా చూడమన్నాడు.3 మనువు విధవా వివాహాలను పూర్తిగా నిషేధించాడు. వివాహాన్ని త్రెంచివేయటానికి, రద్దుచేయటానికి వీలులేదన్నాడు.

ఈ కాలంలో స్త్రీలకు కొన్ని సదుపాయాలను మాత్రం కల్పించారు ధర్మశాస్త్రకారులు. అవి ఇలా ఉన్నాయి. స్త్రీలను చంపరాదు. పతిత కుమార్తె పతిత కాదు, పతిత కుమారుడు పతితుడు. పురుషునికి విధింపబడిన ప్రాయశ్చిత్తం లో స్త్రీకి విధింపబడిన ప్రాయశ్చిత్తం సగం మాత్రమే. అన్ని వర్ణాల స్త్రీలకు పన్నులు చెల్లించవలసిన బాధ్యత లేదు. గర్భిణీ స్త్రీలకు నదిని దాటటానికి పడవ సుంకం లేదు. వివాహితలై పుట్టింట నున్న స్త్రీలకు యజమాని కన్న ముందుగా భోజనం పెట్టాలి (యాజ్ఞవల్క్యుడు). స్త్రీ ధనానికి కుమార్తెలే వారసులు (శుల్కానికి కాదు). పెండ్లి విషయంలో ఆచారాలను స్త్రీల వద్ద తెలిసికోవలెను (అపస్తంబ గృహ్య సూత్రం II - 15). ఈ కాలం లో మనువుదే పెద్ద పీట అని తెలిసికున్నాం కదా! "తమ ఆస్తిని భద్రంగా కుటుంబంలోని పురుషుల అధీనంలో ఉంచి భద్రంగా అనుభవించే నిమిత్తం బహుశః స్త్రీలే తమ హక్కులను పోగొట్టుకున్నారేమో! ఇది ప్రభాతీ ముఖర్జీ ఊహ.6 ఒక మాట సత్యం. ఈ యుగంలో స్త్రీలు స్వేచ్ఛను పోగొట్టు కున్నారు. భద్రతను సంపాదించుకున్నారు. అది బానిసలకు ఉండే భద్రతయా? లేక పరిచారకులకు ఉండే భద్రతయా? అనేది మీమాంస.

హైందవంలో చివరి దశ క్రీ. త. 500 క్రీ. త. 1800 వరకు సాగింది ఇది అంధకారయుగం. స్త్రీలకు విషాదయుగం. బాల్య వివాహాలు ఎక్కువ యినయి. సతీసహగమనం క్రీ. త. 12 వ శతాబ్దం నుండి విలయ తాండవం చేసింది. విధవల శిరోముండనం క్రీ. త. 8 వ శతాబ్దంలో ప్రారంభమయింది. స్త్రీల పరిస్థితి ఘోరంగా క్షీణదశలో ఉండిపోయింది. కాకపోతే ఆస్తి విషయంలో ఆమె హక్కులు పెరిగాయి. సామాజికంగా, వ్యక్తిగతంగా స్వేచ్ఛ లేని స్త్రీలకు ఆస్తి హక్కు వున్నా లేకున్నా ఫలితం మాత్రం హుళక్కి అయింది. పతివ్రతా ధర్మాలు ఆమెను బంధించి పడవేసినయి. ఆమెకు వేరే వ్యక్తిత్వం, జీవితం లేకుండా చేసినయి. ఆమె వైధవ్య జీవితాన్ని నికృష్టం చేసి, ఆమెకు జీవితంపై రోత కలిగేలా చేశాయి.

బ్రిటిషు పరిపాలన వచ్చి హిందూ సమాజ వ్యవహారాలలో ప్రభుత్వం జోక్యం కలిగించుకొనే నాటికి స్త్రీల పరిస్థితి చాల శోచనీయంగా ఉంది. రజస్వలాత్పూర్వ వివాహమేకాక 8 సం॥ వయస్సు కల ఆడపిల్లలకు పెళ్ళి, బాలికకు చదువు అక్కరలేదు అనే భావం, విడాకులు లేకపోవటం, వితంతు పునర్వివాహ నిషేధం, వర్ణాంతర వివాహ నిషేధం, వైధవ్య జీవితంలో నిర్బంధంగా కఠిన నియమాలు, విధిగా విధవకు శిరోముండనం, పతివ్రతా ధర్మాలు, భార్యను భర్త దండించే అధికారం, ఎంతమంది పిల్లలను భర్త కవమంటే అంత మందిని భార్య కనవలసి రావడం, బహు భార్యాత్వం, భార్యలను నిరాదరణ చేయటం, స్త్రీలను తక్కువ చూపు చూడటం, ఆమెపై సతీధర్మాల అస్త్రాలను ప్రయోగించి ఆమెకు బయటి ప్రపంచ స్వభావ, స్వరూపాదులను తెలియజేయనీయక పోవడం, పర్దా, మేలిముసుగులతో ఆమెను బంధించడం, స్త్రీ జీవితంలో అన్ని దశలతోనూ ఆమెకు వ్యతిరేకంగా వివక్ష, వివాహం స్త్రీకి విధికృత సంస్కారమవటం. మాతృత్వానికి విలువను ఇచ్చి మాతయైన స్త్రీని నిరాదరణ చేయటం, స్త్రీలకు సామాజిక జీవితంలో తగుస్థానం కల్పించకపోవటం, రాజకీయ జీవితంలో ఆమెకు ప్రవేశం నిరాకరింపబడటం, స్వతంత్రంగా ఆమె ఏవైనా వృత్తులను అవలంబించి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కలిగి ఉండటానికి వీలులేని స్థితి, చివరకు దత్తత విషయంలో కూడ ఆమె సమ్మతి, అసమ్మతులకు విలువలేకపోవటం, సామాజిక జీవితంలో వేర్పాటు, స్వేచ్ఛారాహిత్యం, సమానత్వ లేమి, ఆమె వ్యక్తిత్వంను గుర్తించకుండుట ఇవి అన్నీ స్త్రీని ప్రాణం ఉన్న వస్తువుగా దిగజార్చాయి. ఆమె శ్రేయోభివృద్ధికి 1829 నుండి శాసనాలు వస్తున్నా ఆమె పరిస్థితిలో ఇంకా ఎంతో మార్పు రావలసి వుంది.

హిందూ సామాజిక వ్యవస్థమీద పలువురు ప్రసిద్ధులు అభిప్రాయాలను ఏర్చి కూర్చుకొని, వాటికి విలువ కట్టుకునే ముందు ప్రాచీన కాలంలో స్త్రీ విమోచనానికి దోహదం చేసిన వారిని స్మరించడం విధ్యుక్తధర్మం. థామస్, లెక్కన తాంత్రికులు, వరాహమిహిరుడు (క్రీ. శ. ఆరవ శతాబ్దపువాడు), కర్నాటక ప్రాంతపు లింగాయతు శాఖ స్థాపకుడు బసవుడు (క్రీ. శ. 12 వ శతాబ్దపు వాడు) ఎన్నిక గన్నవారు. తాంత్రికులు స్త్రీ దేవతను పూజ చేసేవారు బహుశః అందువలన నేమో వారు స్త్రీల పరిస్థితివి పయ్యంలో ...

'మహానిర్వాణతంత్ర' అనే గ్రంథంలో ఈ దిగువ వాక్యాలు పరిశీలనార్హాలు: ''గృహస్థు భార్యను అభిమానించాలి. పిల్లలను విద్యావంతులుగా చేయాలి. బంధువులను, స్నేహితులను, పోషించాలి. ఇది శాశ్వత ధర్మం. భార్యను శిక్షించరాదు. భార్య బ్రతికి వుండగా దురుద్దేశంతో మరొక స్త్రీని తాకరాదు. సంపదతో, దుస్తులతో, ప్రేమతో, గౌరవంతో, మధుర భాషణంతో, భార్యను సంతోషపెట్టవలెను. ఆమెకు అహితం కలిగించే పనిని అతడు చేయరాదు. 'సతీ' ని సహగమనాన్ని నిరసించింది ఆ గ్రంథం. మానభంగానికి మరణ శిక్ష విధించమన్నది. స్త్రీని అవమానించినవాడు, ఆమెపై కోపగించుకునే వాడు, కొట్టినవాడు శిక్షార్హులు. భార్యను వదలిపెడితే గాడిద చర్మం కప్పుకొని ఏడు ఇళ్ళవద్ద పురుషుడు భిక్షాటన చేయాలి. అట్లు విడువబడిన స్త్రీ పరపురుష సాంగత్యం చేయవచ్చును. బాలవిధవ పునర్వివాహం చేసుకోవచ్చును. భర్త నపుంసకుడయితే ఆమె విడాకులు పొంది పునర్వివాహం చేసుకోవచ్చును. వరునివద్ద పైకం తీసుకొని కుమార్తెను అతనికిచ్చి వివాహం చేయరాదు. శుల్కం పుచ్చుకొనుట నిషేధింపబడినదన్నమాట. అష్టవివాహాలు మాత్రమే కాక వారు 'శైవ వివాహం' అనే తొమ్మిదవ వివాహాన్ని ప్రతిపాదించారు. భార్య-దేవీ పూజలో కూర్చొనడానికి అంగీకరించకపోతే పురుషుడు మరొక స్త్రీని శైవ భార్యగా స్వీకరించవచ్చును. మొదటి భార్యకు మనవర్తి, ఆమె సంతానానికి వారసత్వ హక్కులుంటాయి. శైవ భార్య సంతానానికీ వారసత్వ హక్కు ఉంటుంది. తాంత్రికుల సతీ సహగమన నిరసన వారి శాఖకు పరిమితమయింది. వారిలో వారు సహగమనాన్ని ఆమోదించలేదు. ఇతరుల విషయం వారు పట్టించుకోలేదు.7

స్త్రీల యెడ అన్యాయాన్ని, వివక్షను నిరసించిన వారిలో ముఖ్యుడు వరాహమిహిరుడు. ఇతడు ప్రఖ్యాత ఖగోళ శాస్త్రజ్ఞుడు, విజ్ఞాన శాస్త్రవేత్త. అతడు తన గ్రంథం 'బృహత్ సంహిత' లో ఇలా అన్నాడు. "స్త్రీలు రత్నాలకు వన్నె తెస్తారు. అంతేకాని ఆ స్త్రీలకు వన్నె తీసుకొనిరావు. స్త్రీ తన చూపు ద్వారా, మాటలద్వారా, ఊహలద్వారా, స్పర్శద్వారా పురుషునికి ఆనందాన్ని ఇస్తుంది. ఆమెను మించిన రత్నాన్ని దేవుడు సృజించలేదు. ఆమెద్వారానే ధర్మార్థ కామాలు సాధ్యం. ఆమెవల్లనే పుత్రప్రాప్తి. అందువలన స్త్రీ లోకాన్ని లక్ష్మికి ఆలవాలంగా సమాజానికి వెన్నెముకగా, మర్యాదచేసి గౌరవించాలి. ఎవరైతే సన్యాసభావనతో స్త్రీలపై ద్వేషం కక్కుతారో,

ఎవరైతే స్త్రీల గొప్ప గుణాలను పరిగణించరో వారే దుష్టులు. వారి వాచాలత్వానిరి విలువ లేదు. పురుషునికి లేని లోపం స్త్రీకి ఏమి ఉన్నది. ఆ మాటకు వస్తే పురుషులే స్త్రీలకు వక్ర మార్గం పట్టిస్తున్నారు. సద్గుణ ప్రస్తావనగా స్త్రీలు పురుషుల కంటె ఉన్నతలు. మనువు ఈ సందర్భంలో ఏమంటాడు: సోముడు వారికి అందాన్నిచ్చాడట. గాంధర్వులు మధురవాణిని ఇచ్చారట. అగ్ని పరిశుద్ధతను ప్రసాదించాడట. స్త్రీలు సువర్ణం లాగానే అమలినులు. బ్రాహ్మణుల పాదాలు పరిశుద్ధం. ఆవు వీపు, మేక, కుక్కల నోళ్ళు పరిశుద్ధం అయితే స్త్రీలు తమ శరీరం యావత్తు పరిశుద్ధులు. స్త్రీలు అసమానంగా పరిశుద్ధులు. వారు ఎప్పుడు అపవిత్రులు కారు. వారి బహిష్ట రక్తస్రావం వారి అపరిశుద్ధతను తొలగిస్తుంది. స్త్రీలను గౌరవించని కుటుంబాలు వినాశ దేవత ఆగ్రహానికి గురి అయినట్లుగా నాశనం అవుతాయి. స్త్రీ నుండియే పురుషుడు ఉద్భవిస్తున్నాడు. ఓ కృతజ్ఞత లేని పురుషులారా: మీ జన్మకు కారకులయిన స్త్రీలను మీరు నిందిస్తే మీరు ఎలా ఆనందంగా ఉండగలరు? దాంపత్యంలో స్త్రీ పురుషులిరువులూ విశ్వాసంతో ప్రవర్తించాలి. ఇరువురిలో ఎవరు భిన్నంగా ప్రవర్తించినా శాస్త్రాలు వారిని అభిశంసించాయి. ఈ శాస్త్ర వాక్యాలను వేటిని పురుషులు పట్టించుకోరు. స్త్రీలు అలా చేయరు. అందు వలన పురుషులకన్న స్త్రీలు గొప్పవారు. తన భార్య యెడ అవిశ్వాసంతో ప్రవర్తించినపుడు (ఆమెను కాదని మరియొక స్త్రీని చేపట్టినవాడు) వెంట్రుకలు బయటికి ఉండే గాడిద చర్మం కప్పుకొని 'నేను భార్యకు ద్రోహం చేసిన వాడను, నాకు భిక్ష ఇవ్వండి' అని ఆరు మాసాలు భిక్షాటనం చేయాలి. 100 సం॥ వయస్సు వచ్చినా పురుషుని కామేచ్ఛ నశించదు. వీర్యశక్తి నశించి నప్పుడే అదిపోతుంది. అలాకాక స్త్రీలు సంకల్ప బలంతో కామేచ్ఛను అదుపులో పెట్టుకోగలరు. బందిపోటు దొంగ ఎవరినో దోచి వారిని 'దొంగ, దొంగ' యని పిలిచినట్లు పురుషులు ఎంత లజ్జాహీనంగా స్త్రీలను నిందిస్తారు? ఏంకాతంలో స్త్రీతో ఆడిన మధుర భాషణలను పురుషుడు మరచిపోతాడు. తద్భిన్నంగా ఆమె అతని శవాన్ని కౌగిలించుకొని అతని చితిపై అగ్ని ప్రవేశం చేస్తుంది."8 ఇంత నిక్కచ్చిగా, ఘాటుగా, నిజాయితీగా భావ ప్రకటన చేసిన పురుషుడు ప్రాచీన సమాజంలో ఇతనొక్కడే. బృహత్ సంహిత 74 అధ్యాయంలో ఇంకా కొన్ని అభిప్రాయాలు చెప్పాడు. "స్త్రీల సద్గుణాలను గుర్తించకపోవడం క్షంతవ్యం కాదు." పరలోక భావనపై

మోజుతో, సన్యాస జీవితంపై గల ఆసక్తితో స్త్రీని నిందిస్తున్నారని అతడు వ్యధ వెలిబుచ్చాడు.9 కాళిదాసు, బాణుడు, భవభూతి స్త్రీని ఉదారభావంతో చిత్రించారు. "స్త్రీల పక్షాన ఎలుగెత్తి వాదించినవాడు వరాహమిహిరుడు ఒక్కడే."10

దక్షిణాదిన ప్రఖ్యాత. యశస్కుడు బసవడు. బ్రాహ్మణ వంశోద్భవుడు. ఏకేశ్వరోపాసనము ప్రతిపాదించాడు. విగ్రహారాధనను నిరసించాడు. కుల వ్యవస్థను ఖండించాడు. జన్మ పరంపరను కాదన్నాడు. స్త్రీలు పురుషుల కన్న తక్కువ కాదని, స్త్రీలను గౌరవించి దయతో చూడాలని. బాల్యవివాహం, సతీ సహగమనం అభ్యంతర కరమని, వివాహానికి వధూవరుల సమ్మతి అవసరమని, సంతానం ఉన్న విధవలు కూడ వివాహ మాడవచ్చని సాహసంతో ప్రకటించిన ధీరుడు. కొన్ని సందర్భాలలో విడాకులు పొందడానికి స్త్రీలకు హక్కు ఉందని ఉద్ఘాటించాడు. సనాతన బ్రాహ్మణుల ఆగ్రహానికి గురి అయినా తను విశ్వసించిన సిద్ధాంతాలను ప్రచారం చేసిన ధైర్యశాలి, స్థిరచిత్తుడు. తన జీవితంలో తన సిద్ధాంతాలను ఆచరణలోకి తెచ్చిన నిజాయితీపరుడు. అతనికి స్త్రీ లోకం రుణగ్రస్తమయి ఉండాలి.11

మార్పుయొక్క ఆవశ్యకత :-

గత రెండువేల సంవత్సరాలనుండి స్త్రీ యొక్క స్థితి మరీ క్షీణించింది. అందువల్ల మార్పు అవసరం. స్త్రీలకు సమాజంలో సముచితమైన, న్యాయమైన స్థానాన్ని ఇచ్చే నిమిత్తం కొన్ని ఆచారాలను, వ్యవస్థలను విప్లవాత్మకంగా మార్చవలసి ఉంటుందని ఆల్టేకర్ అభిప్రాయం వెలిబుచ్చారు.12 మరోచోట ఇదే భావాన్ని ఇంకా కొంచెం తీవ్రపదజాలంలో ప్రకటించారు. "పరిస్థితులు మౌలికంగా మారాయి. కనుక ఆచారాలు వ్యవస్థలూ విధిగా పరిణామాను సారంగా మారాలి."13 ఈ మాటలు స్త్రీ విమోచన ఉద్యమకారులవి కావు. ఏంతో సానుభూతితో, అవగాహనతో హిందూ నాగరికతను అధ్యయనం చేసిన ఆల్టేకరు వాక్యాలు.

మార్పును వ్యతిరేకించేవారు :-

ఇందరు ఇన్ని విధాలుగా చెప్తున్నా మతస్వేచ్ఛ స్త్రీకి హిందూమతంలో ఉన్నంతగా మరెక్కడా లేదని, హిందూమతం ఆమెకు సమానత్వాన్ని

ప్రసాదిస్తున్నదనీ ఇప్పటికీ వాదించే నిజమైన హిందువులు (అంటే పాశ్చాత్య ఆచారాలను తమకు అనుకూలమైన వాటిని పాటిస్తూ తమకు అసౌకర్యమైన వాటిని తృణీకరించి స్త్రీలకు పతివ్రతా ధర్మాలు బోధించేవారు) ఇంకా ఈనాటికి భారతదేశంలో అసంఖ్యాకంగా ఉన్నారు. మత సమానత్వాన్ని గురించి, లౌకిక సమానత్వాన్ని గురించి మచ్చుకు నాలుగు మాటలు గుర్తు చేసుకుందాం. స్త్రీలు ఒకసారి మాత్రమే ఆచమనం జేయాలి. (మనుస్మృతి V - 139 యాజ్ఞవల్క్యస్మృతి I - 21). స్త్రీలు మంత్ర రహితంగా స్నానం చేయాలి. స్త్రీలు అన్నంతో పిండం చేయగాదు. స్త్రీలను చంపినా, శూద్రుని చంపినా ఒకే ప్రాయశ్చిత్తం (బౌద్ధాయన ధర్మసూత్రం II - 1-11-12; పరాశర VI - 16). సాధారణంగా స్త్రీలు, పిల్లలు, వృద్ధులూ సాక్షులుగా పనికిరారు (యాజ్ఞ II - 70). స్త్రీల తగాదాలలో, ఇంకొక సాక్ష్యం లేకపోతే దొంగతనం, వ్యభిచారం, బలప్రయోగం వీటి విషయంగా స్త్రీలు సాక్షులుగా ఉండవచ్చును. (మనుస్మృతి VIII 68, 70)[14]. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం పుట్టి పెరిగిన మహిళలలో పెక్కుమంది సామాజిక మార్పును వ్యతిరేకిస్తున్నారు. వారు పాత పద్ధతులలో పుట్టి పెరిగారు. 'కుమారీ శతకం' లాంటి శతకాలను బట్టీ పెట్టి గృహిణులయినారు. క్రి. శ. 1850 సం॥ ప్రాంతంలో పక్కి వేంకట నరసయ్యా విరచితమై, 20 వ శతాబ్దపు తొలి సంగంలో కూడ బాలల ప్రాథమిక పాఠశాలలలో నిర్బంధ పాఠ్య గ్రంథమైన కుమారీ శతకం ఏమిచెప్పిందో చూద్దాం.

క. పరపురుషులన్నదమ్ములు;
వరుడే దైవంబు; తోడి పడుచులు వదినెల్
మఱదండ్రుధు; నత్తమామలు
దరఁ దల్లియుఁ దండ్రియనియు దలఁపు కుమారీ
(6 వ పద్యం).

క. పతి పాపపుఁ బని చెప్పిన
బతిమాలి మరల్ప వలయుఁ; బతివినకున్నన్
హితమనుచు నాచరింపుము;
మతిలోపల సంశయంబు । మాని కుమారీ ॥
(12 వ పద్యం).

క. ధనహీను (డైన గడుదు
ర్జను (డైన (గురూపి యైన । జారుండైనన్
విను పాపియైన నెప్పుడు (
దనవతియే తనకు దేవ । తంబు కుమారీ ॥
(21 వ పద్యం)

క. జీవములు భర్త పదరా
జీవములని చిత్తమందు (। జింతించిన
లక్ష్మీ వల్లభు చరణంబుల
సేవ లతాంగులకు నెమ్మి।జేయు (గుమారీ ॥
(31 వ పద్యం)

క. మును నాధు (డు దరలినచో
వెనువెంటనే పోయి యెల్ల । వేల్పులు పొగడం
గని, యెందు నిందు నందును
ఘన కీర్తుల బొందు చుండు (। గాదె కుమారీ ॥
(92 వ పద్యం)

చివరి పద్యము శతకం మొత్తానికి పరాకాష్ట.

తా॥ భర్త తనకంటే ముందు మరణించిన యెడల
పతివ్రతయగు స్త్రీ ఆయన వెంటనే తాను చనిపోయి
పరలోకమున భర్తను దర్శించి యానందము ననుభవించును.15

ఈ పద్యాలను బట్టీయం చేసి వాటి భావాలను సరనరాన జీర్ణించుకున్న మామ్మలు, బామ్మలు మార్పును అభిలషిస్తారా? అభ్యుదయ భావాలు గల పురుషులు ముందుకు సాగిపోతలచినా ఈ అమ్మలు, అమ్మమ్మలు “నా మాట ఒక్కటి వినరా నాయనా!” అని ఆదలించి, బెదరించి మనుమరాండ్ర పెళ్ళిళ్ళలో పెత్తనం వహిస్తూ వాళ్ళ మెడలలో మంగళ సూత్రాలు కట్టించి వాళ్ళకు పతివ్రతా ధర్మాలు నూరిపోయకుండా ఆగుతారా? ఆ మనుమరాండ్రు ఆ మంగళ సూత్రాలను గర్వకారణంగా బహిరంగంగా

ప్రదర్శించుకుంటూ హిందూ సమాజ ప్రాశస్త్యాన్ని పొగడటం లేదా, ప్రఖ్యాత కళాతపస్వి ఆనంద కుమారస్వామి అభిప్రాయాలను గురించి ముచ్చటించుకున్నాం. వారి అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవించక పోయినా హిందూ సంస్కృతిలో స్త్రీ స్థానాన్ని పొగిడిన పాశ్చాత్య వనిత మార్గరెట్ కార్‌మాచ్ వివరణ గురించి పరికిద్దాం. "స్త్రీ పురుషుల మధ్య పోటీ లేకుండా ఎవరి విద్యుక్త ధర్మాన్ని వారు నిర్వహించటానికి స్త్రీత్వాన్ని సాధించుకోవాటానికి, స్త్రీత్వ శక్తిని పొందటానికి ఆనంద కుమారస్వామి వ్యాఖ్యానాలు సందర్భోచితం."16 ఆమె అంతటితో ఆగక ఇలా అన్నది. "సిద్ధాంతరీత్యా స్త్రీల స్థానాన్ని పురుషుల కంటే తక్కువగా ఉండాలని హిందువులు భావించారని తల పోయరాదు. ఈ ఆదర్శాన్ని మలినం చేసుకోటం వలననే స్త్రీలు నీచ స్థాయికి దిగజారడం జరిగింది" 17 హిందూ స్త్రీలు అణగి మణగి ఉంటారని చెప్తు, తమ వ్యక్తిత్వాలను వికసింప చేసుకోలేరని అంగీకరిస్తూ ఇన్ని చెప్పి వారికి మానసిక భద్రత ఉందని మార్గరెట్ హిందూ స్త్రీలను మెచ్చుకుంటుంది. హిందూ స్త్రీకి భర్తను వెదకు కునే బరువు బాధ్యతలు లేవు కదా! ఈ అంశం అ పాశ్చాత్య మహిళను ఆకర్షించింది. మానసిక శాస్త్ర విశ్లేషణను కాస్త జోడించి, స్త్రీత్వ స్వరూపాన్ని విశదీకరించి. స్త్రీత్వ సిద్ధి కొరకు హిందూ స్త్రీ కృషిని మార్గరెట్ అభినందించింది. హిందూ సమాజం నుండి ఇతర దేశాల స్త్రీలు నేర్చుకోవలసిన అంశం పురుషులతో పోటీ పడకుండుట అని తేల్చి స్త్రీత్వ సిద్ధి అనే ఆదర్శాన్ని పొగిడింది. 18

ఈ రోజుల్లో కూడ ఎంతో ప్రసిద్ధి చెందిన మహా మహులు పాత భావాలనే ప్రచారం చేస్తున్నారు. రవీంద్రనాధ ఠాకూరు స్త్రీల బాధల యెడ ఎంతో సానుభూతి చూపించాడు. కాని ఆయన కూడ విధేయత, భర్తను ఆరాధించటం, పూజించటం అనే ధర్మాలను ప్రస్తుతించాడు. "ఆమె (హిందూ స్త్రీ) చర్యలన్నింట యెడ ఆరాధనా భావం ఎంతో కొట్టవచ్చినట్టు కన్పడేది. ఆమె ఆత్మ త్యాగాన్ని గురించిన నా స్మృతులు నాకు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. స్త్రీ యొక్క ప్రేమకు పరాకాష్ట భర్త యెడ గౌరవం. అది ఏ అడ్డంకులు లేకపోతే సహజంగా ఆరాధనగా మారుతుంది." ఈ వాక్యాలు ఆయన ఒక బ్రిటిష వనితను గురించిన స్మృతులలోభాగాలు. 18

మరోరకపు పురుషులు :-

హిందూ సమాజం యెడ అత్యంత అభిమానంతో వర్ణాశ్రమాల మౌలిక సూత్రాన్ని అంగీకరిస్తూ, స్త్రీ పురుష పని విభజనను సమర్థిస్తూ, సంపాదన పురుషుని బాధ్యత అని ఇల్లు చక్కపెట్టడం స్త్రీ కర్తవ్యం[19] అని ప్రకటించిన మహాత్మ గాంధి ఈ కోవకు చెందినవాడు. అంటే హిందూ మత మౌలిక ప్రాతిపదికను త్రోసి రాజనకుండా హిందూ మత దురాచారాలను ఖండించే శాఖకు చెందుతారు వీరు. ఆయన బాల్య వివాహాలను[20] వివాహంలో కన్య పై బలవంతాన్ని [21] నిరసించాడు. బలవంతపు వైధవ్యాన్ని ఖండించాడు. [22] తప్పని సరి అయితే విడాకులను ఆమోదించాడు. [23] బాల విధవలకు వివాహాలు చెయ్యమన్నాడు. [24] వరకట్న దురాచారాన్ని పారద్రోల మన్నాడు. [25] పరదా పద్ధతి మంచిది కాదన్నాడు. మూఢ విశ్వాసాల నుండి బయట పడాలన్నాడు. స్త్రీల పై దౌర్జన్యాలను ప్రతిఘటించమన్నాడు. ఇతర విషయాలలో ఎలా ఉన్నా ఒకటి రెండు విషయాలలో తప్ప - జన్మ నిగ్రహం, స్త్రీ ఆదర్శం, సమాజంలో స్త్రీ పాత్ర - మిగతా వాటి విషయంలో మహాత్మ గాంధి చాలా పురోగామిగా వ్యవహరించాడు.

మూడవ కోవకు చెందినవారు :-

ముల్క్‌రాజ్ అనంద్, అంబేద్కరు, ఎం.ఎన్. రాయ్ ఈ కోవకు చెందిన వారిలో ముఖ్యులు. వారు హిందూ సమాజ ప్రాతి పదికలనే ప్రశ్నించారు. హిందూ తాత్విక ఆలోచనను త్రోసి రాజన్నారు. హిందూ భావనను నిరసించారు.

హిందూ శాస్త్రకారులు ఎందుకు స్త్రీని ద్వేషించారో ప్రఖ్యాత నవలా కారుడు ముల్క్ రాజ్ ఆనంద్ ఇలా చెప్పారు. "మత గురువు తను అసాధారణమైన వ్యక్తినని భావించాడు. తనకే అన్ని మర్మాలు, రహస్యాలు తెలుసుననుకున్నాడు. తర్వాత సమాజానికి సంరక్షకుడుగా తయారయినాడు, మున్ముందుగా తన ఉన్నతోన్నత స్థానాన్ని జాగ్రత్తగా పదిల పరుచుకో దలిచాడు. కాని స్త్రీ కూడా మార్మిక విషయానికి అధికారి అని, ఆమె శక్తి తన శక్తి కన్నా మిగుల అందమైనది, రహస్యమైనది అని గ్రహించి, స్త్రీని పోటీదారుగా పోల్చుకొని ఆమె స్థానాన్ని నీచపరచ జూస్తున్నాడు. (ఇక్కడే, ఈ లోకంలోనే, తన సంతానోత్పాదన శక్తి ద్వారా తన ప్రతిభను ఆమె వెలారుస్తున్నది.)" మత గురువుకు స్త్రీపై అసూయ, ఈర్ష్య. అందుకే ఆమె పై కక్ష. అందుచేత ఆమెను ఘోరంగా నిందించాడు. ముల్క్‌రాజ్ ఆనంద్

దృష్టిలో మనువు ఘోరమైన దుర్మార్గుడు. బ్రాహ్మణుల ప్రతినిధిగా పురుష జాతి ప్లీడరుగా భారత స్త్రీల పై బానిసత్వ సంకెళ్ళు విధించాడు. 27

అంబేద్కరు మనువును గురించి మరో రకమైన విశ్లేషణ చేశాడు. "మనువు స్త్రీలను గురించి చెప్పిన దానిలో క్రొత్త కాని, వింత కాని లేదు. భారతదేశంలో బ్రాహ్మణత్వం పుట్టినప్పటి నుండి బ్రాహ్మణులు పదే పదే వల్లిస్తున్నవే ఈ 'సూక్తులు'. మనువు రాక పూర్వం అవి సామాజిక సిద్ధాంతంగా ఉన్నాయి. మనువు వాటికి శాసన రూపం ఇచ్చాడు. అదీ అతని ప్రత్యేకత, 'విశిష్టత'. 28

శూద్రులు, స్త్రీలు ఎక్కువగా బౌద్ధమతావలంబులయినారు. వారిని బౌద్ధ మతంలోకి పోకుండా నిరోధించాలంటే వారిని ఇళ్ళల్లో కట్టి పడవేయాలి. మనువు అపనే చేశాడని అంబేద్కరు అంటాడు. కనుక హిందూ మహిళ స్థానం హిందూ సమాజంలో పడిపోవడానికి ముఖ్యకారకుడు మనువు.29 ఈ రకమైన ఆలోచన హిందూమత పునాదులనే కదిలించింది.

హిందూ సమాజాన్ని కూలంకషంగా పరిశీలించి, స్త్రీ యెడల జరిగిన అన్యాయానికి ఆక్రోశించి, తద్విషయమై తీవ్రంగా, గాఢంగా ఆలోచించి హిందూ తాత్విక ధోరణిని, భావనను, సామాజిక జీవితరీతిని తూర్పార బట్టిన ఘనత ఎం. ఎన్. రాయ్‌కి దక్కుతుంది. ఈ సందర్భంలో ఆయన మాటలను కొన్నింటిని గుర్తు తెచ్చుకోవటం మనకు అత్యంత అవసరం. "వివాహ సంబంధంలో విశ్వాసం మౌలికమైనది. విశ్వాసవంతులుగా వుండమని హిందూ మతం పురుషులను ఆదేశించడంలేదు. వివాహం భర్తల పరంగా శాసన సమ్మతమైన వ్యభిచారం. అనేక సాకులతో బహు భార్యాత్వం ఆచరింప బడుతున్నది. పెక్కు సందర్భాలలో ఆ సాకులు అల్పాతి అల్పమైనవి బహు భార్యాత్వం చట్ట సమ్మతమైన వ్యభిచారం. భార్య చాలకాలం వ్యాధి గ్రస్తురాలయితే భర్త తన పెళ్ళినాటి ప్రమాణం యొక్క బలంనుండి, (బంధం నుండి) విశ్వాసంనుండి విడుదల అవుతాడు. ఆ పరిస్థితుల్లో కుటుంబ సంరక్షణార్థం అతడు మరో భార్యను సంపాదించుకోవటానికి నైతిక పరమైన, మత పరమైన హక్కు కలుగుతుంది. భర్త అలా నిర్దయగా తనని వదలిపెడితే దానికి అంగీకరించి సవతికి స్థా[illegible] అభ్యసించ

వలసిన బాధ్యత భారతనారి ఆదర్శంలో ఒక భాగం. అది 'ఉదాత్తమైన' ఆదర్శం; అది నైతిక స్పందనకు అభిరుచికి సంబంధించిన విషయం. కాని ఈ నియతమైన నడక ఉద్వేగ పరంగా అసాధ్యం. నిస్పృహాయుతైన స్త్రీలు లాంఛనగా అలా నడుచుకోవచ్చు. నీతి, న్యాయం అనే భావన సంప్రదాయపు బరువుకు కృంగిపోయినపుడు ఈ పద్ధతికి సహజంగా ఎదురు తిరుగుతుంది. (స్త్రీ). స్త్రీలను వస్తువులుగా మార్చే ఈ నిర్దాక్షిణ్యమైన పద్ధతిని నిరసిస్తుంది. అంటే సంతానాన్ని కనే యంత్రాలుగా పురుషులు స్త్రీలను పరిగణించడాన్ని వ్యతిరేకిస్తుంది." ఈ వాక్యాలను చదివి స్త్రీ విమోచనోద్యమకారులలో ఒకరైన కమలా భాసిన్ "ఒక పురుషుని నోట సానుభూతితో అవగాహనతో వచ్చిన ఆశ్చర్యకర పదాలు" అని అభివర్ణించింది. బహుభార్యాత్వం ఈనాడు లేదు. శాసనం వల్ల పోయింది. కాని ఆ పద్ధతి వెనుక ప్రస్ఫుటంగా ఉన్న మౌలిక ఆలోచనా స్రవంతి హిందూ సమాజాన్ని నియంత్రణం చేస్తున్నది. కనుకనే ఎం. ఎన్. రాయ్ ఆలోచనా సరళికి ఈనాడు కూడా విలువ. ఆ మాటలను ఆయన 1935 లోనే చెప్పాడు. స్త్రీ అర్ధాంగి అయినపుడు పురుషునితో సమానం కావాలి కదా అని ప్రశ్నించాడు.[31] హిందూ మత వివాహం పిల్లలను కనడానికే ఉద్దేశింపబడింది.[32] హిందూ వివాహం ద్వారా స్త్రీ భర్తతో ఆధ్యాత్మిక కలయికలో ఉంటుందని చెప్పి, ఆమెను పొగడి ఆమెచేత బహు సంతానాన్ని కన్నాడు.[33] ఇలా హిందూ సమాజాన్ని తెగడి హిందూ స్త్రీ - తదితర స్త్రీలవలె కోరుతున్నదేదో వివరించాడు. మానవ నిర్మితమైన ధర్మశాస్త్రాలూ, పరిస్థితులూ వ్యక్తులుగా అభివృద్ధిలోకి రానీయటం లేదు గనుక వాటిని రద్దుచేయాలని ఈనాటి స్త్రీలు డిమాండు చేస్తున్నారు.[34] ఇలా ఆధునిక వైజ్ఞానిక దృక్పథాన్ని భారత దేశంలో తొలిసారిగా వెలార్చిన ఖ్యాతి ఎం. ఎన్. రాయ్‌కి దక్కుతుంది.

హిందూ వాదంలో పునర్వికాసానికి కావలసిన వైజ్ఞానిక మహోద్యమం రాలేదు.[35] కనుకనే అనురాగ బంధం చేతకట్టి వేయబడిన ఇద్దరు వ్యక్తులుగా సతీ పతులను హిందూ సమాజం ఊహించలేదు. దాంపత్యమనే బండికి ఇద్దరూ రెండు చక్రాలని పైకి చెప్తున్నా ఆ బండిలో ఒకే చక్రం తిరుగుతున్నది. అతడే పురుషుడు. స్త్రీ యైన రెండో చక్రం తిరగదు; దానిని మొదటి చక్రం ఈడ్చుకొని వెళ్తుంది. ఇది జీవిత అనుభవం. కాదనలేని వచ్చినిజం.[36] హిందూ స్త్రీ జీవితంలో వివాహం ఎంత కీలకమైనదో తెలిసికున్న మనువు

ఈ చిత్రణ హిందూ మతం యొక్క అభ్యుదయ వ్యతిరేక ధోరణిని వెలికి తీస్తున్నది.

మతాన్ని వేరుగాను, తాత్విక ఆలోచనను వేరుగాను చూసే సర్వేపల్లి రాధాకృష్ణన్ కూడా స్త్రీలపై విధించిన ఈ అమానుష నియమాలను ఖండించాడు. "మన దేశ ప్రజలలో లక్షలాది మందిని అర్ధరహితంగా క్రూరంగా చూచేది, ఈ దేశంలో స్త్రీలపై సహించరాని ఇబ్బందులును, ఇక్కట్లను, విధించేది అయిన మత అంధ విశ్వాసం ఎడతెగని ప్రమాదం. ఆత్మను అది న్యూనత పరుస్తుంది. ఇతర మానవుల పై అలాంటి ఇక్కట్లను, ఆంక్షలను విధించేవారు అజ్ఞానానికి, అంధ విశ్వాసానికి తామే బలియైనవారు". ఈ వాక్యాలు బాగానే ఉన్నాయి వినటానికి, చదవటానికి. కాని ప్రతిమతం వెనుక ఒక తాత్విక చింతన ఉంటుంది. రెంటినీ విడదీయడం, విడదీయ ప్రయత్నించడం వృధాప్రయాస. మానవాళి పునరుజ్జీవనమే హిందూ మత ఆశయంఅని చెప్తాడు రాధా కృష్ణన్ పండితుడు. 37 దాని లక్ష్యం మానవ స్వభావాన్ని ఆధ్యాత్మికంగా మార్చటమట. మానవుని లోని హేతుత్వం, సహకారం, ప్రేమ అనే ఉదాత్త గుణాలకు మాత్రం విజ్ఞప్తి చేస్తుందట. భయం, దురాశ, ద్వేషాలకు కాదట. ఇవి రాధా కృష్ణన్ మాటలే. కాని ఇతర మతాల సంగతి అటుంచి హిందూ మతాన్ని పరికిస్తే ఇంత ఉదాత్తమైన భావాలతో అది పొత్తు పెట్టుకోలేదని తోస్తుంది. ఆ మాటకు వస్తే అన్ని మతాలు అదే వరసన నడిచాయి. ఏ దేశంలో, ఏ మతంలో ఏనాడూ స్త్రీ సమాన హోదా, తాహతూ అనుభవించినట్లు ఆధారాలు లేవు.38

హిందూ మతస్తులు దురభిమానాన్ని వదలి తమ సహజ సంస్కరణకు పూనుకుంటారని ఆశిద్దాం.

హిందూ సమాజాన్ని మార్చటం హిందూ స్త్రీలకు ప్రధమ కర్తవ్యం. వారి జీవితాలు ఈ కార్య నిర్వాహణతో ముడిపడి ఉన్నాయి కనుక వారు ఈ విషయంగా ఉపేక్షను ప్రదర్శించ వీలులేదు. ఈ సందర్భంగా ఒక్క అంశాన్ని హిందూ స్త్రీలు గుర్తుంచుకోవాలి. వారిని ఉద్ధరించడానికి, వారి పరిస్థితిని మెరుగు పరచ డానికీఏ మహనీయుని పైననో, ఏ తత్వవేత్త పైననో వారు ఆశలు పెంచుకొని లాభంలేదు. ఈ మహత్కార్యానికి వారే పూనుకోవాలి.

ఈ లక్ష్యాన్ని వారే సాధించుకోవాలి. కాగా వారి బాటలలో ఎన్నో అడ్డంకులు, అవాంతరాలు, కష్టాలు వస్తాయి. అది సహజం. జీవితం పూలబాట కాదు. హిందూ స్త్రీ జీవితం నిజానికి ముళ్ళబాట. హిందూ పురుషుల - వ్యతిరేకత అడుగడునా తటస్థిస్తుంది. సామాజికాచారాల పేర, సంప్రదాయాల పేర, శాసనాల పేర అభ్యంతరాలు, ఆటంకాలు వస్తాయి. ఇన్నింటిని అధిగమించటం ఒక ఎత్తు; స్త్రీలలో ఉండే ఉపేక్షా భావాన్ని, వ్యతిరేకపు ఆలోచనా ధోరణిని దాటి పోగల్గటం మరో ఎత్తు. 'స్త్రీలే స్త్రీలకు శత్రువులు' అని పురుషులు ఈసడించడం గమనిస్తున్నాం. అది హేళనగా, పరిహాసంగా, అధిక్షేపంగా వారు వాడే పదజాలం. అయితే దాంట్లో కొంత నిజం లేకపోలేదు. సంప్రదాయానికి, ఆధునికతకు జరిగే భావ సంఘర్షణలో, ఉద్యమరూపంగా జరిగే కార్యాచరణ సందర్భంగా, నూతన భావ ప్రపంచానికి అడ్డుతగిలే విషయంగా సనాతన హిందూ స్త్రీలు కొంతమంది అమాయకంగా, అజ్ఞానంలో - నిందకాదు సుమండీ, పరిస్థితులు సరిగా తెలిసికోలేక అని అర్థం - అభ్యుదయ వాదులైన స్త్రీలకు ఎదురొడ్డి నిలుస్తారు. ఈ పరిస్థితిని సనాతన హిందూ పురుషులు హర్షిస్తారు. వారు తమ ప్రయోజనాలను, శ్రేయస్సును, సుఖాలను, సౌకర్యాలను కాపాడుకోవటానికి చేయవలసిన పనిని - ఆధునిక స్త్రీలను ఎదుర్కోవడం - స్త్రీలలో ఒక వర్గంవారే చేపట్టడం వారికి సంతోషదాయకం గాక మరేమవుతుంది? కనుక ఆ సనాతన పురుషులు సంప్రదాయ మహిళలను పురికొల్పుతారు; ఉత్సాహ పరుస్తారు. అండదండలందిస్తారు. సహాయానికి సాధన సంపత్తిని సమకూరుస్తారు. సనాతన హిందూ పురుషుల మనస్తత్వాన్ని ఆలోచనను, కార్యాచరణ విధానాన్ని, వ్యూహాన్ని. ఎత్తుగడలను తెలిసికోలేని సనాతన హిందూ స్త్రీలు అభ్యుదయానికి వ్యతిరేకంగా కృషి చేస్తారు. కనుక ముమ్మొందుగా వారి వ్యతిరేకతలను పోగొట్టుకోవాలి. ఇది కేవలం ప్రబోధంతో జరిగేపని కాదు. సనాతన స్త్రీలకూ కష్టాలు వస్తాయి. అవి పురుష ప్రాధాన్య సమాజపు నియమాలవల్ల కలుగుతున్నాయని వారికి తెలియదు. అది 'విధివ్రాత' అని తలపోసి బాధపడుతుంటారు. ఆ విషయాన్ని విజ్ఞులైన స్త్రీలు వారికి వివరించి చెప్తే వారూ గ్రహిస్తారు. ఏదైనా ఆ పని అంత తేలికైన విషయం కాదు. కాగా విధిగా చేయవలసిన పని. స్త్రీలలో భావ విప్లవం రావాలి. దానికి తగిన ప్రబోధం, ప్రచారం విస్తృతంగా సాగాలి. భావ విప్లవం ముందా? సామాజిక పరిణామం ముందా అని తర్కవితర్కాలు చేయవలసిన పనిలేదు.

భావవిప్లవం మున్ముందుగా రావాలని చెప్పేవారు కూడా సామాజిక కార్యక్రమం అక్కర లేదని చెప్పరు. తగినంత మంది స్త్రీలలో ఆధునిక భావాలు, చైతన్యం వ్యాప్తి అయితే తప్ప కార్యాచరణకు రంగం సిద్ధం కాదని వారి భావం. ఏదయినా భావ విప్లవమూ, సామాజిక పరిణామమూ ఒక్కసారిగా సాగక తప్పదు. మహిళా దశాబ్దం ఈ విషయాన్ని వెలికితీసి గట్టిగా ప్రకటించింది.

చివరిగా ఒక్కమాట పునరుద్ఘాటన చేయవలసి ఉంది. స్త్రీలు తమ సర్వతోముఖ వికాసానికి-సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక వికాసానికి తమ పైననే ఆధారపడాలి. ఇతరులు సానుభూతి చూపినా, సహాయం చేసినా, కార్యక్రమాలకు మద్దతు ఇచ్చినా వద్దనేది లేదు. ఆ సహాయ సానుభూతులను సాదరంగా స్వీకరించాలి. అయితే తమ భవిష్యత్తుకు రూపకల్పన చేసుకునే బృహత్తర ఉద్యమంలో స్త్రీలే ముఖ్య పాత్రధారులు కావాలి. ఈ అంశాన్ని అభ్యుదయ గాములైన స్త్రీలూ, తదితరులూ గుర్తించటం అవశ్యం జరగాలి. హైందవ సమాజంలోని స్త్రీలు ఈ విషయంలో వెనుకంజ వేయరని, వేయ రాదని విశ్వసిద్దాం.

అధ్యాయం 16

పాదదీపికలు

1. హిదూ స్త్రీ : ఆదర్శ మూర్తులు : ప్రభాతీ ముఖర్జీ.
   పుటలు 96 - 104
2. ధర్మశాస్త్రాల చరిత్ర : కానే 2 వ సంపుటం. 1 వ భాగం
   పుట 569
3. ప్రభాతీ ముఖర్జీ : పుట 104
4. కానే : పుట 595

5. కానే : పుట 596

6. ప్రభాతీ ముఖర్జీ : పుట 104

7. యుగ యుగాలలో భారతీయ స్త్రీలు : పి. థామస్ - 2 వ భాగం.

8. డిటో ,,

9. కానే : పుట 580.

10. డిటో.

11. పి. థామస్ : 2 వ భాగం.

12. హిందూ నాగరికతలో భారత స్త్రీలు : ఆల్టేకర్, పుట 359.

13. డిటో 361

14. కానే పుటలు 594, 595

15. కుమారీ శతకం : పక్కి వేంకటనరసయ్య.
రాయలు అండ్ కో, కడప (1952) పుటలు 3, 6, 11, 16, 44

16. హిందూ స్త్రీ : మార్గరెట్ కార్మాచ్ (1961) పుట 139

17. డిటో పుట 192

18. భారతదేశ మధ్య తరగతి స్త్రీల విషమపరిస్థితి :
కమల భాసిన్ (భారత దేశంలో స్త్రీల స్థానం.
The Position of Women in India (Leslie Sawhny Programme of Training for Democracy Ed. KamlaBhasin - (1971)] పుట 39

19. సర్వోదయ : మహాత్మాగాంధి, పుట 60
Sarvodaya by M. K. Gandhi
స్త్రీలు : మహాత్మాగాంధి Women by M. K. Gandhi, పుట, 9

20. స్త్రీలు : గాంధి, పుట 48
సర్వోదయ : గాంధీ - పుట 62

21. స్త్రీలు : గాంధి; పుట 56

22. సర్వోదయ : గాంధి – 62

23. డిటో 63

24. డిటో 63

25. స్త్రీలు : మహాత్మాగాంధీ, పుట 70

26. ముల్క్‌రాజ్ ఆనంద్ 'ది బ్రైడ్స్ బుక్ ఆఫ్ బ్యూటీ'
The Brides Book of Beauty by Mulkraj Anand
in The Position of Women in India (189 Bid)
పుట 38

27. డిటో పుట 38

28. హిందూ స్త్రీ యొక్క అభివృద్ధి-పతనం : అంబేద్కరు, పుట 26
Rise & Fall of Hindu Women : Dr. B. R. Ambedkar
(Bheem Patrika Publications) Jullunder.

29. డిటో పుట 21

30. భారతనారి ఆదర్శం : ఎం. ఎన్. రాయ్, అనువాదం
మల్లాది సుబ్బమ్మ, హైదరాబాద్. పుటలు 29, 30

31. డిటో - పుట 20

32. డిటో - పుట 10

33. డిటో - పుట 13

34. డిటో - పుట 55

35. హిందూయిజం ఎక్సురే : తర్క తీర్థ లక్ష్మణశాస్త్రి జోషి-
'ప్రసారిత' అక్టోబరు - డిసెంబరు 1972 హైదరాబాద్

36. బంగారు సంకెళ్ళు : మల్లాది సుబ్బమ్మ.
(ప్రజాస్వామ్య పబ్లిషర్స్, హైదరాబాద్) పుట 5

37. Recovery of Faith by S. Radha Krishnan - Page. 105
Orient Paper Back

38. డిటో పుట 64

39. భావవాహిని : మల్లాది సుబ్బమ్మ
ప్రజాస్వామ్య పబ్లిషర్స్, హైదరాబాద్ పుట 44.

పరిశీలించిన గ్రంథాల పట్టిక

Bibliography

1. History of Dharma Sastra by P. V. Kane vol. 2 Part I Bhandarkar Oriental Research Institute, Pune, 1941.

2. The Position of Women in Hindu Civilisation by Dr A. S. Altekar, Motilal Banarsidas, Delhi. Reprinted 1978.

3. Indian Women through the Ages: by P. Thomas Asia Publishing House (1964)

4. Hindu Ethos: and the Challenge of Change: by Subhayu Dasgupta, The Minerva Associates, Calcutta (1972)

5. Women: by M. K. Gandhi, Navjivan Publishing House, Ahmedabad - 14 (1964)

6. To Ashram Sisters: M. K. Gandhi „ „ (1960)

7. Sarvodaya : by M. K. Gandhi „ „ (1969)

8. The Rise & Fall of Hindu women : by Dr. B. R. Ambedkar - Bheem Patrika Publications, Jullunder, pin 144 003 (1977)

9. The Position of Women in India. Ed. Kamla Bhasin-Leslie Sawhny Programme of Training for Democracy, Bombay (1971)

10. Recovery of Faith : by Dr. S. Radhakrishnan Hind Pocket Books, Delhi.

11. Religion & Culture : by Dr. S. Radhakrishnan Hind Pocket Books, Delhi.

12. Kural : Tiru - Valluvar
Bharatiya Vidya Bhavan, Bombay (1970)

13 Women in the Vedic Age : Shakuntala Rao Shastri
Bharatiya Vidya Bhavan, Bombay (1952)

14. Women in Rig Veda : By Upadhyaya (1932)

15. Hindu Women (normative Model) by Probhati Mukherjee-Orient Longman (1978)

16. The Hindu Women : by Margaret Cormach
Asia Publishing House (1961)

17. Indian women : Ed. Devaki Jain
Publications Division, Government of India (1975)

18. Marriage & Society in Mahabharata : by
Dr. K. Jagannatha Sarma unpublished thesis, submitted to Nagarjuna university, Nagarjuna Nagar, Gnntur Dt. (A. P.)

19. Towards Equality : Report of the Committee on the Status of Women in India. Government of India, Dept. of Social welfare Ministry of Education & Social welfare, (1974)

20. Hindu Law : by Mayne
Higgin Bothams (1938)

21. The Hindu Adoption & Maintenance Act. (1956)

22. The Hindu Minority & Guardianship Act. (1956)

23. The Hindu Marriage Act. (1955)

24. The Hindu Succession Act. (1956)

25. The Dowry Prohibition Act. (1961)

26. Child Marriage Restraint Act. (1929)

27. ఆంధ్రవేదములు (ఋగ్వేదము) ప్రథమ సంపుటం :
బంకుపల్లె మల్లయ్య శాస్త్రి, వినయాశ్రమం,
గుంటూరుజిల్లా (1940)

28. సత్యార్థప్రకాశ్ : మహర్షి దయానంద సరస్వతి
ఆర్యప్రతినిధి సభ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ 500001 (1981)

29. హిందూ మతము : జటావల్లభుల పురుషోత్తం :
(జె- గోపాలం, కాకినాడ, 1947)

30. భారతనారీ ఆదర్శం : ఎం. ఎన్. రాయ్
అనువాదం । మల్లాది సుబ్బమ్మ
ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్ 19
హైదరాబాద్ 500 028 (1984)

31. వర్ణభేదం : డా- బి. ఆర్. అంబేద్కరు
అనువాదం । సింగంపల్లి వేంకట సుబ్బారావు
సుందరరాం అండ్ సన్సు. తెనాలి (1948)

32. కుమారీ శతకం : పక్కి వేంకట నరసయ్య,
రాయలు అండ్ కో, కడప (1952)

33. బంగారు సంకెళ్ళు : మల్లాది సుబ్బమ్మ
ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్,
హైదరాబాదు 500 028 (1984)

34. భావవాహిని : మల్లాది సుబ్బమ్మ
ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్ (1983)

35. హిందూ యిజం ఎక్కుడ్రే : తర్క తీర్థ లక్ష్మణశాస్త్రి జోషి,
ప్రసారిత, త్రైమాసిక పత్రిక
అక్టోబరు - డిసెంబరు 1972 నెం. 10
C/o పి. సత్యనారాయణ, 103, కాకతీయనగర్,
హబ్సిగూడ, హైదరాబాద్ 500 007

36. ఆర్ష ధర్మసూత్రాలు : చర్ల గణపతి శాస్త్రి

ఇష్టం : స్త్రీలు

విషయసూచిక

స్వవిషయం
నాదొక మాట
కృతజ్ఞత
ఉపోద్ఘాతం
1. పూర్వరంగం 1
2. స్త్రీల హోదా 16
3. వివాహం 20
4. విడాకులు 36
5. మనవర్తి 46
6. దత్తు 54
7. పిల్లల సంరక్షకత్వం 56
8. వారసత్వం 61
9. వేర్పాటు 66
10. విద్య 82
11. కుటుంబ నియంత్రణ 85
12. ఆర్థిక స్థాయి 88
13. రాజకీయ రంగం 91
14. ముగింపు 93
పరిశీలన గ్రంథాల పట్టిక 102

స్వ విషయం

"ప్రజాస్వామ్య ప్రచురణలు" ఒక వినూత్న ప్రయత్నం. ఇతర సంస్థలతో రూపసామ్యం వున్న ఆదర్శాలలో, లక్ష్యసాధనా విధానాలలో, కార్యాచరణ రీతులలో భిన్నమైనది.

వ్యక్తి జీవితంలో, సమాజ జీవితంలో అన్ని రంగాలలో ప్రజా స్వామ్యం వెల్లివిరిసి మూడు పూవులు, ఆరు కాయలుగా వర్ధిల్లాలని ఈ సంస్థ అభిమతం, ఆశయం కూడాను.

ఇలాంటి ప్రయత్నాలు పూర్వం జరిగినవి. ప్రస్తుతం జరుగు చున్నవి. కాని, వానికీ-ఈ ప్రయత్నానికీ తారతమ్య మున్నది. ఉదాత్త మయిన ఆశయాలతో, ఉత్తేజంపొందిన మేధావుల సమిష్టి సహకార కృషి ఫలితంగా ఈ సంస్థ ఉద్భవించింది.

విశ్వ జనీనతే దీని విశిష్టత. మొత్తం మానవ ప్రపంచ సంస్కృతీ సాహిత్యాలు దీని వారసత్వం. ముఖ్యంగా భారతదేశ సంస్కృతిలో ఇంత వరకు మరుగున పడిన మాణిక్యాలు—చార్వాక, కపిల, కణాదుల మతాలు, సిద్ధాంతాలు దీని సొమ్ము. తెలుగుదేశమే కాదు, తెలుగు భాష విస్తరించిన ప్రాంతమంతా దీని కార్యక్షేత్రము.

ప్రపంచంలో విప్లవాలు ఎక్కడ వచ్చినా, ఏ కాలమందు జరిగినా, అవన్నీ దీనికి అధ్యయన యోగ్యాలే. ఇంగ్లండులో 1689లో బ్రిటిష రాచరికానికి పరిమితులు, హద్దులు విధించిన విప్లవం: అమెరికాలో 1773 లో ప్రాతినిధ్యాధికారమున్నవారే పన్నులు వి ధిం చ గ ల హక్కుదారులనే 'ప్రజాస్వామ్యం' సూత్రాన్ని ఎలుగెత్తి చాటిన విప్లవం: 1789 లో స్వేచ్ఛ, సమానత్వము, సౌభ్రాతృత్వము ఆదర్శాలుగా విజయవంతమయిన ఫ్రెంచి విప్లవం; 1917 లో 'భూమి, తిండి, శాంతి' నినాదాలతో కార్మికవర్గం, మధ్య తరగతి రష్యాలో సాధించిన విప్లవం: 1947 లో భారతదేశం పొందిన స్వాతంత్ర్యం; 1949లో కర్షకబలం చైనాలో జరిగిన విప్లవం మొదల యినన చారిత్రాత్మక సంఘటనలను లోతుగా, సునిశితంగా, సమ్యక్దృష్టితో పరిశీలించి తదనుగుణమైన ప్రచురణలు చేయాలని ఈ సంస్థ ఆదర్శం.

సామాజిక పరివర్తనకూ, భావగమనానికి అవినాభావ సంబంధ మున్నదనే విషయం జగద్విదితం. అయితే భావాలు ప్రాతిభాసికాలేనా

లేక మానవ మస్తిష్కములో ఉదయించిన తరుణం నుంచీ ప్రత్యేక గమన సూత్రాలతో స్వతంత్ర లక్షణాలు కలిగి పెంపొందుచున్నవా? రెండవ స్వరూపం అవశ్య పరిగ్రహణయోగ్యం. ఈ సూత్రాన్ని విశ్వవిఖ్యాత విప్లవవాది, మేధావి అయిన యమ్. ఎన్. రాయ్ 1946 లో ప్రవచించాడు. ఈ భావన యీ సంస్థకు జీవగర్ర.

వ్యక్తివాదం, హేతువాదం, మానవవాదం ఈ సంస్థను శాసించే త్రికము (త్రిగుణాలు). మానవులంతా ఒకటే; మానవ సమాజానికి మూలం మానవుడే; మానవుని అభ్యున్నతియే మానవ సమాజ అభ్యుదయానికి, శ్రేయస్సుకు కొలమానం లేక వరుమానం; ప్రకృతి నియమబద్ధమైనది కనుక ప్రకృతినుంచే ఉద్భవించిన మానవుడుకూడా వస్తుతః నియమబద్ధుడు అంటే హేతువాది. కనుక అతడు నీతివంతుడుగా మనగలడని ప్రకటించిన రాడికల్ హ్యూమనిజం యొక్క తాత్విక సిద్ధాంతం ఈ సంస్థకు వెలుగు బాటగా అడుగడుగునా ప్రభావితం చేస్తుంది.

మానవవాదం యీనాటిది కాదు. మానవజాతి సహజంగా మనుగడ సాగించినప్పటినుంచీ యీ తాత్విక చింతన జరుగుతూనే వచ్చినది. కాని ఆధునిక యుగంలో మానవ విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందటంతో ప్రస్తుతం నూతన భాష్యాలతో, వినూత్న విషయ పరిజ్ఞానంతో ఆ పాత కాలపు మానవవాదాన్ని పరిశీలించి, సవరించి, పునరుద్ధరించవలసిన అవసరమేర్పడినది. ఆకృషి ఫలితమే యమ్.ఎన్.రాయ్ నవ్యమానవవాదం.

స్వేచ్ఛాపిపాస, సత్యాన్వేషణ మానవ మనుగడ ప్రేరకాలని పేర్కొనటం ఈ నవ్యమానవవాద విశిష్టత. (1) అంతరాత్మ ప్రేరిత నీతి లేక దైవ నిర్దేశిత నీతి: (2) ప్రయోజనాత్మక నీతి; అనే రెంటికీ ప్రత్యామ్నాయంగా హేతుబద్ధమయిన నీతిని చాటిచెప్పినది. రాజకీయరంగంలో పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని ప్రతిపాదించినది. ఆర్థిక రంగంలో సహకార సంబంధమయిన ప్రణాళికా రచనలను రూపొందించినది. సాంస్కృతిక రంగంలో భావ స్వతంత్ర ప్రతిపత్తిని గుర్తించినది. సాంఘికంగా కుల, మత, వర్గ, లింగ, ప్రాంతీయ, భాష, జాతి, దేశ విభేదాలను నిరసించినది. విశ్వజనీయ సంస్కృతికి విలువనిచ్చినది. ఏకత్వంలో భిన్నత్వాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడగల్గినది. అంధ విశ్వాసాలకు గొడ్డలి పెట్టు ప్రబోధ కార్యక్రమాలను బలపరుస్తుంది. అందులో ఒక భాగమే ఈ సంస్థ ప్రచురణ యత్నం.

ఈ ప్రకృతికి అతీతమయిన మరే యితర శక్తి లేదని తెలుసుకొనటం తన మనుగడకు, భవిష్యత్తుకు తానే బాధ్యుడనని గుర్తెరగటం, తన క్షేమానికీ, అభ్యున్నతికీ, తోటి మానవుల శ్రేయస్సుకూ వైరుధ్యంలేదనే విషయాన్ని గ్రహించి సమాజ స్థితిగతులను మెరుగు పరచటానికి ఉద్యుక్తుడు కావడం ఉత్తమ మానవలక్షణం.

ఈ మానవవాద లక్ష్యాలనే 1952 లో నెలకొల్పబడిన అంతర్జాతీయ హ్యూమనిస్టు నైతిక సంఘం మరోరూపంలో ప్రకటించినది. భారత రాడికల్ హ్యూమనిస్టు సంఘాన్ని ఆ ప్రపంచ సంస్థ గుర్తించి పూర్తి సభ్యత్వాన్నిచ్చినది. ఆ అంతర్జాతీయ సంఘం ఐదు ఖండాలలోని అనేక దేశాలలో అనుబంధ సంస్థలు కలిగి అసమానమైన కృషి సాగిస్తున్నది.

ప్రస్తుతం ప్రపంచ మానవాళి సాంస్కృతికంగా విషమస్థితిలో చిక్కుకొని యున్నది. ఒకవైపు మత ప్రాబల్యాలు, మరోవైపు ఫాసిజం, కమ్యూనిజంలాంటి నియంతృత్వ విధానాలు చలామణి అవుతూ ప్రజల సంక్షేమం కొరకు ప్రజల ఆశయాలను నెరవేర్చకపోగా హీనస్థితికి దిగజార్చుచున్నవి. దీని ఫలితంగా తృతీయ మార్గాన్వేషణ ప్రారంభ మయినది. విజ్ఞానం పెరుగుదల, మానవ మేధస్సు-సృజనాశక్తి అభివృద్ధి చెందడంతో నూతన తాత్విక చింతనలకు ప్రాతిపదిక ఏర్పడినది.

దీనినే నైతిక హ్యూమనిజం అని పిలవటం కూడా కద్దు. ఇది ప్రజాస్వామ్య సూత్రానికి కట్టుబడి వున్నది. ప్రతివ్యక్తీ సాధ్యమైనంతగా వికాసం పొందటానికి హక్కు కలిగి యున్నాడు. కేవలం ప్రభుత్వ పరిధిలోనేగాక జీవిత సంబంధాలన్నింటిలోనూ, ఈ ప్రజాస్వామ్య సూత్రం వర్తిస్తుంది. విజ్ఞానాన్ని మానవ వినాశనానికి కాక క్షేమానికి, శ్రేయస్సుకు, నిర్మాణయుతంగా వినియోగించటం ఈ సిద్ధాంతపు ఆదర్శ ముఖ్య లక్షణాలలో ఒకటి. విజ్ఞానము లక్ష్యాలను నిర్దేశించదు. మానవ శ్రేయస్సును సాధించటానికి అనువైన మార్గాలను సూచిస్తుంది.

హ్యూమనిజం నైతిక దృక్పథం కలది. మానవుని హుందాతనాన్ని, సాధ్యమైనంతలో ప్రతివ్యక్తి ఇతోధికంగా ఇతరుల హక్కులకు భంగం కలుగని రీతిగా స్వయంగా వికాసాన్ని పొందగల హక్కును గుర్తిస్తుంది. సామర్థ్యం, క్రమశిక్షణ పేరుతో మానవ జీవితాన్ని యాంత్రికం చేసే వ్యవస్థను వ్యతిరేకిస్తుంది. యాంత్రికరణ మానవ విలువలను నమ్ము చేస్తుంది. కనుక, తాత్కాలిక లక్ష్యాలను సాధించే ప్రయత్నంలో సమగ్ర

నియంతృత్వ సిద్ధాంతాలు అమలుపరచ జూచే సమగ్ర యాంత్రీకరణను తోసి రాజంటుంది. సమాజం యెడ బాధ్యతతో సమ్మిళితమైన వ్యక్తి స్వేచ్ఛను లక్ష్యంగా స్వీకరిస్తుంది. భౌతిక అవసరాలను తీర్చటం, భౌతిక పరిస్థితులను మెరుగుపరచటం అనే పేరుతో పైన పేర్కొనబడిన వ్యక్తి స్వేచ్ఛను త్యజించ నిచ్ఛగించదు. మానసిక స్వేచ్ఛ, మౌలిక చింతన లేనప్పుడు అభ్యుదయం అసాధ్యం.

పిడివాదాన్ని, పిడివాదపు సిద్ధాంతాన్ని తోసిరాజని హ్యూమనిజం స్వేచ్ఛను ప్రబోధిస్తుంది. నైతిక విలువలను, సృజనాశక్తులతో సమ్మిళిత మైన జీవిత విధానాన్ని, వ్యక్తి వికాసాన్ని లక్ష్యంగా అంగీకరిస్తుంది. మారుచున్న సమాజానికి అనుగుణంగా అభ్యుదయ పథంలో అనుసరించ దగిన మౌలిక జీవిత సూత్రం ఇది.

విజ్ఞానాన్ని ప్రపంచ శాంతి కొరకు వినియోగించ గలిగితే ప్రస్తుత విషమ స్థితినుంచి మానవాళి విముక్తి చెందగలదు. భయవిముక్తుడైన మానవునిపరిపూర్ణ వికాసానికి పరిమితులుండకూడదు. ఈ తాత్విక ఆలోచనా రీతిని మానవ ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొనే సవాలుకు సరియైన జవా బుగా భావించవచ్చును.

ఇలాంటి తాత్విక ధోరణి స్వేచ్ఛా భావుకతను పోషిస్తుంది. కనుక అన్ని సామాజిక రంగాలలోను వినూత్నమయిన రీతిలో స్వేచ్ఛను పెంపొం దించి అభ్యుదయ మార్గాన అడుగుల వేయించగల నూతన భావాన్వేషణయే 'ప్రజాస్వామ్య ప్రచురణల సంస్థ' ధ్యేయం.

అట్టి భావాలను ప్రజాబాహుళ్యానికి ఎరుకపరచటం ఈసంస్థ ప్రథమ కర్తవ్యంగా భావిస్తుంది. ఇది సాహసమే కావచ్చు. ప్రమాదభరితం కూడా కావచ్చు. కాని లక్ష్యసాధన కొరకు చేసే ఇట్టి కృషిని విస్మరించ జాలము. ఈ ప్రయత్నానికి, వ్యాపారానికి స్వేచ్ఛాపిపాసకల వ్యక్తు లందరి సానుభూతి సహకారాలను అర్థిస్తున్నాము.

సభ్యులు : శ్రీ ఎం. వి. రామమూర్తి
శ్రీ కోగంటి రాధాకృష్ణమూర్తి
శ్రీ గుంటువల్లి గోపాలరావు
శ్రీమతి మల్లాది సుబ్బమ్మ
శ్రీ గురిజాల సీతారామయ్య
శ్రీ కొల్లా సుబ్బారావు

ఎం. వి. రామమూర్తి
అధ్యక్షుడు
బోర్డు ఆఫ్ డైరెక్టర్స్

నా దొక మాట

" బాబుల్‌హమ్ తొరేఖూన్ లేకా గయాస్
జదర్‌బాంద్ దో చాంద్ జాయేన్ "

'మేము పశువులము. ఓ తండ్రీ నీవు ఏ గాటికి కడితే అక్కడే పడివుంటాము.' ఇది ముస్లిం స్త్రీలు తమ కుమార్తెలను భర్తతో సాగనంపేటప్పుడు పాడే పాట. ముస్లిం మహిళలు తమ పుట్టుక, స్థాయి, హోదా అంతా దైవదత్తమని నమ్ముతారు. ఖురాన్‌లో స్త్రీ జన్మించిన దాది ఆమె జీవితపర్యంతం ఎలా నడుచుకోవాలో స్పష్టీకరించి వుంది. అందులో వివాహం, విడాకులు, వారసత్వం, ఆస్తిహక్కులలో స్త్రీ పురుషుల మధ్య ఎలాంటి తేడాలు చూపారో చక్కగా నిరూపించవచ్చు. ఇస్లాం ఆధునిక భావాలను, మార్పును తీవ్రంగాఖండిస్తుంది. ప్రతి విషయాన్ని ఖురాన్ ఆదేశానుసారం నమ్మమంటుంది. సొంత ఆలోచనకుగాని, చర్చకుగాని అందులో ఆస్కారంలేదు. క్రీ. శ. 571 లో జన్మించిన మహమ్మద్ ప్రవక్త ఇస్లాము 622 లో స్థాపించాడు. ఇస్లాం మతగ్రంధం ఖురాన్. అది ఇస్లాంకు పరమ ప్రాణం. ఖురాన్‌లో 114 సూరాలున్నాయి. ప్రతి సూరాలో ఆయత్తులున్నాయి; వాటిలో మతధర్మాలు అన్నీ వున్నాయి. అందులో వాటికన్నింటికీ ప్రత్యేక స్వరూపాలు, అర్థాలు వున్నాయి. మసీదుకెళ్ళటం, ప్రార్థనలు చెయ్యటం, రంజాన్‌లో పగలు భోజనం లేకపోవడం వగైరాలన్నీ అందులో వ్రాసివున్నాయి. ఖురాన్ ఆధారంతో వ్రాసిందే షరియా చట్టం. అది 1937 లో లిఖించబడ్డది. ఆ శాసనాలనే నేటికీ ఆచరించటం హాస్యాస్పదమనక తప్పదు. మహమ్మద్ అనుయాయులు ఒకచేతితో కత్తి మరోచేత ఖురాన్ ధరించి అనేక మందిని ఇస్లాం మతంలోకి మార్చారు. 1360 ఏండ్ల ఫలితంగా ఇస్లాం మతం ఈనాడు 700 మిలియన్ల ప్రజల మతమయింది. మొదట తాము ముస్లింలగాను తర్వాత ఆయా జాతి ప్రజలగాను భావించుకొనుట వారి మనస్తత్వం. ఇస్లాం ఒక వ్యవస్థిత మతం. అంటే అంతా క్రమబద్ధంగా వుంటుంది. ఆ మత సూత్రాలనుండే ముస్లింలు

ఉత్తేజితులై వాటిని శిరసావహిస్తారు. ఖురాన్ ప్రకారం ఈనాటికీ భూమి నలచదరపు బల్ల. దానిచుట్టూ పర్వతాలునిలబడి దాన్ని కదలకుండా నిలుపుతున్నాయంటుంది. కాదంటే కఠినశిక్షలు, చిత్రహింసలూ. అవిశ్వాసుల నెలా శిక్షించాలో, ఎలాంటి నరకయాతనలు పెట్టాలో, ఆ చిత్రహింసల స్వరూప స్వభావాలన్నీ స్పష్టీకరించారు ఆ మతగురువులు. అసలు వ్యతిరేక భావాన్ని సహించకపోగా చట్టం పేరుతో వారిని సర్వనాశనం చేస్తారు ముల్లాలు, మౌల్వీలు. ఖురాన్ దైవదత్తమని అది చాలా పవిత్రమైనదని నమ్ముతారు ముసల్మానులు.

తమ మతం మహోన్నతమైనదని, దాన్ని నిరశించరాదనే నమ్మికతో మతసంరక్షణార్థం ఎంతటి పశుత్వానికైనా వెనుదీయరు మతవాదులు. వేదాలు నమ్మని వారిని పాషండులని, బైబిలు నమ్మని వారిని 'అన్యులు' అని, ఖురాన్‌ను విశ్వసించనివారిని 'కాఫిర్లు' అని దూషిస్తారు. అవిశ్వాసుల్ని అన్ని మతాలు చీల్చిచెండాడిన గాథలెన్నో వున్నాయి. వేదాలు నమ్మని చార్వాకులను, కాఫిర్లను, అన్యులను వందలు, వేల సంఖ్యలో బలిగొన్నారు. సజీవదహనం చేశారు. అసామాన్యమైన చిత్రహింసలపాలు చేశారు. ఇంకా మతయుద్ధాలు లెక్కకు మిక్కుటంగానే జరిగాయి.

మతగ్రంథాలనిండా కరుణ, శాంతి, దయ, ప్రేమ వుండాలని వ్రాస్తారు. కాని ఆచరణలో మాత్రం అది శూన్యం. ఆచారాలు, సంప్రదాయాలన్న పేరుతో ఒకమతాన్ని మరొక మతం గౌరవించకపోగా ద్వేషిస్తుంది; హింసిస్తుంది. సర్వనాశనానికైనా తయారుగావుంటుంది. ఏ చిన్న సంఘటనను కూడా సహించలేదు మతం. అది వ్యక్తుల్ని బలిగొంటుంది. సమాజాన్ని నాశనం చేస్తుంది. దానికి తోడూ, నీడా, తనా, మనా అనే అరమరికలు లేవు. అలాంటి మతం స్త్రీలకు అన్యాయం చేస్తుంది. వారి వ్యక్తిత్వాన్ని వమ్ముచేస్తుంది. వారి హక్కులను కాలరాస్తుంది. దీనిని గురించి ఆశ్చర్యపడాల్సిన పనిలేదు.

ప్రపంచంలో నాడూ, నేడూ, ఏనాడు ఏ మతమూ స్త్రీకి సంపూర్ణ స్వేచ్ఛా సమానత్వాన్ని ప్రతిపాదించనేలేదు. స్త్రీల పై స్వైరవిహారం చేస్తూనేవుంది. అందువల్లే విద్యా విజ్ఞానాలు బొత్తిగా లేక, సంప్రదాయం

పేరుతో, మతాదేశంతో వంట ఇంటికీ, పడకటింటికీ పరిమితమయింది స్త్రీ. ఆమెను ఒకవైపు మతం మరోవైపు సమాజం, వేరొకవైపు పురుష దురహంకారం ఇనుప చట్రాలతో కట్టిపడేశాయి. వ్యక్తిత్వంలేని ఆటబొమ్మగా, నాసిరకం జాతిగా, నికృష్టజీవితాన్ని గడుపుతున్నది నారీలోకం. స్త్రీలను పురుషుల ఆస్తిలో జమకడుతుంది ఇస్లాం. అంటే ఆమెను దున్నే భూమితో పోల్చి దానిపై హక్కు దున్నేవాడిదేనని, వాడికి సర్వహక్కులూ వున్నాయంటుంది ఖురాన్. ప్రేమ ప్రాతిపదికగాగల వివాహంలోకాని, వారసత్వంలోకాని, సంరక్షకత్వంలోకాని, సంతాన నిరోధంలోకాని ఏ విషయంలో ఏ మాత్రం హక్కులేని బాధామయజీవి ముస్లిం స్త్రీ. అది చాలక భర్త నలుగురి భార్యలను పెండ్లాడే హక్కు ఇచ్చింది ఇస్లాం. ఇంకా నికృష్టమైనది పరదా. ఇలా ఎన్నో మరెన్నో పరిమితులకు లోనుచేసింది ఇస్లాం. అలా మతం యుగయుగాలుగా మహిళలపై స్వైరవిహారం చేస్తూనేవుంది. మతం పేరుతో మహిళపై దోపిడీలూ, దౌర్జన్యాలూ జరుగుతూనే వున్నాయి. మతం మహాక్రూరమైంది. కనుకనే నీతిపేరుతో దుర్మార్గపు దోపిడీని దేవుని వాక్కుగా బోధించి స్త్రీని బ్రహ్మాండంగా 'బ్రెయిన్ వాష్' చేసింది. ఇదంతా పురుషులే తమ అధికారాన్ని నిలుపుకోడానికి, పెంచుకోటానికి జరిపిన కుతంత్రం. దాన్ని నీతి, ధర్మం, చట్టం అనేపేర్లతో ప్రచారం చేశారు; చేస్తున్నారు. ఏనాటికీ స్త్రీలు స్వేచ్ఛా సమానత్వాలు కోరనంతగా ఈ భావాలు వారిలో జీర్ణించిపోయాయి. సనాతన ముసల్మాన్ మతగురువులు తమ అధికారాన్ని నిలుపుకోటానికి అవసరమొస్తే స్త్రీని సర్వనాశనం చేసిఅయినాసరే పురుషాధిపత్యాన్ని నిల్పటానికి సర్వవేళలా ఈ పని చేస్తూనేవుంటారు. మతాలన్నింటిలోకి ఇస్లాం చిట్టచివరిది. అయినా స్త్రీలను మహా క్రూరంగా, హీనంగా చూచేది ఇస్లామేనని చెప్పటానికి నిరూపణలు చాలా వున్నాయి.

మతమేదయినా వారి మార్గమేదయినా హిందూ, ముస్లిం, క్రైస్తవం స్త్రీల విషయంలలో ఏకాభిప్రాయంతో వున్నాయనేది నగ్న సత్యం. స్త్రీని ఒక నీచప్రాణిగాను, బానిసగా పేర్కొన్నది క్రైస్తవం. దేవుడు ఆదామును నిద్రపుచ్చి అతని ప్రక్కటెముకనుండి ఈవ్‌ను సృష్టించాడని బైబిలువాక్యం. స్త్రీ మూలంగానే పురుషుడికి ఇన్ని కష్టాలొచ్చాయని బైబిలు నిర్దేశించింది. స్త్రీ నరకానికి సింహద్వారమన్నాడు శంకరాచార్యుడు. ఇక స్త్రీలను కుక్కల

కన్నా హీనంచేశాడు మనువు. ఇక ఇస్లాంలో స్త్రీని గురించి చెప్పాలంటే చాలా ఘోరం; వర్ణనాతీతం. "తమ సంతానానికి పాలుఇచ్చి పెంచాలని తండ్రికోరితే రెండు సంవత్సరాలు ఆమె తప్పక పాలుఇవ్వాలి. వేరే స్త్రీ ద్వారా ఇప్పించే ఏర్పాటుచేస్తే అది ఆక్షేపణీయం కాదు" (233 ఖురాన్) అంటే భార్యాభర్తాలు విడిపడితే భర్త ఆజ్ఞలేనిదే బిడ్డకు పాలిచ్చే అధికారం తల్లికి లేదన్నమాట. ఆమె వ్యక్తిత్వం, హోదాను చాలా కించపరిచింది ఇస్లాం. అలాగే దాంపత్య జీవితంలో, విడాకులలో, వివాహంలో, మనవర్తి, దత్తతలలో, వారసత్వం, సంరక్షకత్వాలలో ఖురాన్ ఆమెకు న్యాయం చేయకపోగా పక్షపాతంతో చాలా అన్యాయం చేసింది. ఇంకా సాంఘిక, ఆర్థిక, రాజకీయరంగాలలో స్త్రీ పాత్రకు విలువేలేదు,

ముస్లిం స్త్రీలు ఏనాడూ సభలుపెట్టి కోర్కెలు, హక్కులూ, అధికారాలు అడిగిన పాపానపోలేదు. 'మనం మీరిలాంటి కృత్రిమ జీవితం గడుపుతా రెందుకమ్మా' అంటే మనల్ని తెగనాడుతారు. అజ్ఞాని అయిన చిరుతడిలా వుంటుంది వారి అభిభాషణ. ఉద్యోగినులు సైతం బురాఖాతో ఆఫీసులకెళ్ళి ఆఫీసుముందు తీసి సంచిలోపెట్టి మళ్ళా బైటికెళ్ళేటప్పుడు దాన్ని విధిగా ధరిస్తారు. పరదావల్ల గాలి, వెలుతురులేని ఇళ్ళల్లో నివాసంవల్ల మీ కళ్ళు పోవా? అంటే 'మేము చాలా అందమైన వాళ్ళమమ్మా కనుక పురుషులు మమ్ముచూస్తే మోహావేశులవుతారు. కాబట్టి మమ్ము గృహాలలోవుంచి మాకన్ని ఏర్పాట్లుచేస్తారు మా పెద్దలు.' అంటారు. స్త్రీ అందంగా అలంకరించుకొని బైటికెడితే ఆమెనే చూస్తారట. అంటే నెయ్యి వేడికి కరిగినట్లే స్త్రీని చూచిన పురుషుడు అలాగే కరిగిపోగలడని వారు చెప్తారు. అందువల్ల అందంగా కనిపించకుండా బుర్ఖా వేసుకుంటే ఏదో దయ్యం పోతున్నదిలే అని చూడరట. అందుకే వారి ఇళ్ళకు, కిటికీలకు విధిగా కర్టెన్లు వేసుకుంటారు. జాకెట్లు ముంజేతివరకు కుట్టించుకోవాలి. దర్జీకి నిలబడి కొలతలు ఇస్తే అపచారం. పైగా మొగాయన తాకితే మైలపడి పోతారట. స్త్రీ ఎంత సిగ్గుపడితే అంత పవిత్రత అంటారు. సిగ్గుమాలిన ఆడది పురుషుణ్ణి చెడగొడుతుందని వారి నమ్మకం. ఎంత చాటుగా మెలిగితే, ఎంతగా ముసుగులోకి నెట్టబడితే అంత పుణ్యవతిగా పేరు పొందుతుంది. అందువల్లే మాకు ముసుగులుంటే ఏం, మా మగాళ్ళు నల్గురి భార్యలను పెళ్ళాడితే ఏం అని ఎదురు ప్రశ్నలు వేసేవారు లేకపోలేదు.

అందువల్ల ముందుగా ముస్లింస్త్రీల వైఖరి మారితేనే గదా సంస్కరణకు మార్గాన్వేషణ. అసలు మతస్థుల మతదురహంకారం మార్చటం ఎంత కష్టమో ముస్లిం స్త్రీలలో మానసిక విప్లవం తేనటం అంతకన్నా కష్టం. సనాతనత్వపాదును పెకళించడం ఎంత కష్టమో అక్కడ ఆధునిక బీజాలు నాటటం అంతకన్నా కష్టతరం. అయినా ఎప్పుడో అప్పుడు ఈ పని జరగాలికదా! తమకాళ్ళకు బంధాలుపడ్డాయని, స్వేచ్ఛా వయునానికి తమకు హక్కులేదని మనము మనముస్లిం సోదరీమణులకు తెలియజెప్పాలి కదా! మూడుకోట్ల ముస్లిం సోదరీమణులు బానిసావస్థలో వుంటే ప్రగతి పథకాలు అంతర్ధానం అయిపోవా?

సమాజంలో ఒక వర్గానికి అంటే ముస్లింస్త్రీలకు జరుగుతున్న అన్యాయాన్ని, అసమానతను, అవకతవకల్ని ఎత్తి చూపాల్సిన బాధ్యత మానవత్వమున్న ప్రతి వ్యక్తికీవుంది. అన్యాయాన్ని, అవినీతిని చూచిన సహృదయుడు స్పందిస్తాడు. ఆ కుళ్ళును, ఆ నైచ్యాన్ని ప్రజల దృష్టికి తెస్తాడు. వాళ్ళహృదయాలలో హత్తుకునేలా చేస్తాడు. ఒక వర్గమైన స్త్రీల ప్రయోజనాన్ని కాంక్షించి, వారిని ఆ మురికి కూపాలనుండి, ఇరుకుసందుల నుండి వెలుగులోకి తేవాలనే కాంక్షే నన్నీ రచనకు పురిగొల్పింది.

రచయిత, నిబద్ధత బాధ్యత ఇలాంటి రచనల్లో బైటపడుతుంది. సమాజంలో ఒక వర్గానికి కోపం వస్తుందని భయపడ్డ రచయిత సంఘంపట్ల తనకున్న బాధ్యత విస్మరించినట్లవుతుంది. నిజాయితీ లోపిస్తుంది. అతను నిజమైనసంస్కారి కాడని చెప్పవచ్చు. లబ్ధప్రతిష్ఠులైన గురజాడ, కందుకూరి, చలం, త్రిపురనేని అలా భయపడితే వాళ్ళకు చరిత్రలో స్థానం వుండేదికాదు; సమాజంలో మార్పు వచ్చేదికాదు.

ముస్లిం స్త్రీలతో చర్చించి, తర్కించి ఖురాన్ ఆధారంతో వ్రాసిందే ఈ సాహిత్యమంతా. తోటి అక్కా చెల్లెళ్ళయిన వారిస్థితిని మార్చాలనే తపనే నాయీ రచనకు ప్రోత్సాహాన్నిచ్చింది. ఆధ్యేయమేనాకు మానసిక ధైర్యాన్ని సమకూర్చింది. నేను మనసారా నమ్మిన సత్యాన్నే ఇందు పొందుపరిచాను. ఇందులో నా పొరపాట్లు, లోపాలు దొర్లవచ్చు. దానికి నేనే బాధ్యత

వహిస్తానని హామీ ఇస్తున్నా. సహృదయులైన పాఠకులు ఇందులోని మంచిని గ్రహించగలరని నమ్ముతున్నాను. ఏది ఏమయినా నేను చెప్పింది నిజమని, వ్రాసింది న్యాయమని, నమ్మితే చాలను. ఈ రచన ద్వారా ఆ వర్గపు మహిళలు మేల్కొంటే నాకదే పారితోషికం. ఒకసారి ధ్వజమెత్తితే ఇక ఆ వర్గం కష్టాలకు, నష్టాలకు, అడ్డంకులకు, అవరోధాలకు ఝుడియదు. ఎన్ని అవాంతరాలొచ్చినా వెనుకంజ వేయదు. ఆ పరివర్తన ఆ మహిళలలో కలుగక మానదు. డార్విన్ అన్నట్లు 'అణచబడ్డ ప్రతిజీవి ఒత్తిడికి తట్టుకో లేక ప్రతిఘటిస్తుంది.' ఆ స్థితికి స్త్రీలు వచ్చిననాడే వారిలో మానసిక వికాసం వస్తుంది. మార్పుకై పోరాడతారు; విముక్తికై పోరాటాలు సాగిస్తారు. చివరికి ఆత్మవిశ్వాసం పొందిన మహిళలు వ్యక్తిత్వాన్ని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందగల్గుతారు; సమానత్వాన్ని సాధిస్తారు. ఆనాడే నిజమైన సమ సమాజావిర్భావం జరుగుతుంది. స్త్రీ పురుషులిద్దరికీ ఒకేనీతి ఆవిర్భవిస్తుంది. అస్తవ్యస్తాలు నశిస్తాయి. నేడు మన స్త్రీలకు కావాల్సింది సరిఅయిన అవగాహన, విద్య తద్వారా మానసిక జాగృతి; శాస్త్రీయ దృక్పథం. దీనికి ముఖ్యమైన అంశం మానసిక దాస్య విముక్తి. ఆ విముక్తికి ఈ గ్రంథం తోడ్పడాలనేదే నా ఆకాంక్ష. సామాజిక ప్రగతికి, ముఖ్యంగా ముస్లిం మహిళాభ్యుదయానికి ఈ గ్రంథం ఉపకరిస్తే నా కృషి ఫలించినట్లే నాకదే పారితోషికం.

మల్లాది సుబ్బమ్మ

కృతజ్ఞత

ఈ గ్రంథాన్ని వ్రాయటానికి ప్రిప్రధమంగా నాకు ఉత్సాహాన్ని, ప్రోద్బలాన్ని కలిగించింది నా జీవిత భాగస్వామి, సహచరుడు, సహ కార్యకర్త శ్రీ ఎం. వి. రామమూర్తి. అంతేకాదు అనేకమంది రచించిన ఇంగ్లీషు సాహిత్యాన్ని తెలుగులోకి అనువాదంచేసి ఆ భావాలను సంగ్రహంగా చెప్పారు. అలా నాకు వారు తమ తోడ్పాటును అందించారు. ఎనలేని వారిసహాయం, సహకారాలు లేనిచో ఈ పుస్తకం అసలు బహిర్గతం కాకపోయేది. అది అక్షరాలా నిజం. ఈ పుస్తక ప్రచురణ కార్యక్రమానికి సర్వవిధాలా తోడ్పడిన రామమూర్తి గారికి నేను రుణపడివున్నాను. ఇంకా ఈ పుస్తకానికి ఉపోద్ఘాతంకూడా రాశారు. దానికి నేను వారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఇట్లు
రచయిత

ఉపోద్ఘాతం

ప్రపంచ వ్యాప్తిగా లెక్కలోకి తీసుకుంటే ఇస్లాంమతం ఈనాడు రెండవస్థానంలోవుంది. దేశాల సంఖ్యలో మొదటి స్థానంలోవుంది. ముస్లిం రాజ్యాలలో గత దశాబ్దంలో నూనె బావులు రాజ్యాధినేతల చేతుల్లోకిరావడం వల్ల ముస్లిం దేశాలకు విశేష విలువ, ప్రాధాన్యత వచ్చాయి. ఆ దేశాల సంపద పెరిగి అనేక దేశాల పౌరులకు, ముఖ్యంగా నిరుద్యోగులకు ఆ దేశాలలో ఉపాధి కలిగింది. ముస్లిందేశాలకు విశేషధనార్జన కలిగింది. ఆ సంపదనంతా వారూ క్రైస్తవులవలె మత ప్రచారానికి, మతవ్యాప్తికి కుమ్మరించడం మొదలు పెట్టారు.

మతాంతరీకరణ

భారతదేశంలాంటి దేశాలలో పూర్వం మతాంతరీకరణ అధికారంద్వారా జరిగేది. ఈనాడు ప్రచారంతోను, ప్రబోధంద్వారా సాగుతుంది. ఈ మధ్య తమిళనాడులో ఒక గ్రామంలో ఒక వందమందికి పైగా దళితులు హిందూ మతాన్ని విడనాడి మహమ్మదీయ మతాన్ని స్వీకరించారు. దాంతో దేశమంతా కలవరపడ్డది. క్రైస్తవ మిషనరీలు వందల ఏండ్లుగా మతాంతరీకరణ చేస్తున్నా ఏనాడూ ఇంత రభస జరగనేలేదు. ఈ అలజడికి, ఆందోళనకు కారణమేమిటి? మూడువేల ఏండ్లనుండి హిందూసమాజ రక్కసి ఉక్కు పాదాలక్రింద నలిగిపోతున్న దళితులు గత్యంతరంలేక మతం మార్చుకున్నారు. ఇది తప్పా? మానవుడు స్వేచ్ఛాజీవి. ఆశాజీవికూడాను. ఈ మార్పిడివల్లనైనా తాము విముక్తి పొందుతామని ఆశించటం ఆశ్చర్యమూ కాదు; నేరం అంతకన్నా కాదు. అసలింతకూ వారు తతిమ్మా మతాలనువదలి మహమ్మదీయ మతాన్ని ఎంచుకోవడం తప్పా? ఆ మాటకు వస్తే హిందూమతంలోనే ఉండి ఆ సమాజం పెట్టే యాతనలుపడుతూ, అవమానాలను భరిస్తూ కాలం వెళ్ళబుచ్చకుండా తిరుగుబాటు మనస్తత్వం వెలిబుచ్చటం తప్పా? హిందువుల దృష్టిలో అన్నింటికన్నా పెద్దతప్పు వారు మహమ్మదీయ మతంలో చేరడం. కారణం ఒకటి కాదు; అనేకం. మహమ్మదీయ సమాజంలో కులవ్యవస్థ అధికారికంగా లేదు. అది హిందువులకు

సవాలు. మహమ్మదీయులు సాధారణంగా ఉద్రిక్తులు. దురాక్రమణ మనస్తత్వాన్ని ప్రదర్శిస్తారు. మత కలహాలలో అనేక ప్రదేశాలలో మొదటి దెబ్బ వారుతీస్తారు. (చివరకు వారే నష్టపడే విషయం అందరికీ తెలిసినదే.) వీరి ఈ వైఖరి రెండవ కారణము. ముస్లింలు ఇంతవరకు పెద్దస్థాయిలో కుటుంబనియంత్రణ కార్యక్రమాన్ని చేపట్టలేదు. కనుక వారి జనాభా హిందువుల జనాభాకన్నా ఎక్కువ రేటులో పెరుగుతుంది. ఉదాహరణకు 1961 – 70 లో వారు 100 కి 33 చిల్లర పెరిగారు. ఈ లెక్కన వారి సంఖ్య గణనీయమవుతుందని భయం. అంతే కాదు. మతాంతరీకరణ తమిళనాడులోవలె సాగితే షెడ్యూలు జాతులు, షెడ్యూలు తెగలవారు ముస్లింలుగా మారితే దేశజనాభాలో ముస్లింలు 100 కి 25 మంది అవుతారు. ఒకవైపు పాకిస్తాను, మరోవైపు బంగ్లాదేశ్ ఉండగా, ఇతర ముస్లిం దేశాలు అండగా నిలిస్తే, దేశజనాభాలో 100 కి 25 మంది ముసల్మానులు ఉంటే ఎప్పటికయినా హిందూజాతి మనుగడకు ప్రమాదమని హిందూ జాతిరక్షణకు కంకణం కట్టుకున్న హిందువులకు భయంవుంది. ఇది మూడవ కారణం. ఇలాంటి కారణాలవల్ల తమిళనాడు సంఘటన హిందూ నాయకులలో కలవరం తెచ్చింది. మతమార్పిడి జాతి మనుగడకే గొడ్డలిపెట్టని .... వణికి పోతున్నారు.

స్త్రీల ప్రసక్తి

రాజకీయాలు ఎలాఉన్నా, మహమ్మదీయ మతంలోకి పోవడంవల్ల దళితులు ఉత్తరోత్తరాలాభిస్తారా అనేదే మరోప్రశ్న. ఏదైనా వారికి ఇష్టంవచ్చిన మతాన్ని స్వీకరించడానికి, ఆ మాటకువస్తే అన్ని మతాలను కాదని, ఏ మతంలో చేరకుండా ఉండటానికి దళితులకు సంపూర్ణమైన హక్కు ఉంది. దానిని ఎవరూ కాదనలేరు ; కాదనరాదు. కాగా అస్పృశ్యతను తొలగించుకోవటానికి ఇస్లాం మతంలోకిపోతే, మరి ఏ ఇతర బాధలు కలగవా అనేది మరోప్రశ్న. అంటరానితనం మానవజాతికే కళంకం. నిస్సందేహంగా దానిని ఎవరూ సమర్థించరాదు ; సమర్థించలేరు. అయితే ఇస్లాంలో స్త్రీల స్థితిఅన్నా మెరుగుగా ఉందా ? ఏ జాతిలో అయినా సగంమంది స్త్రీలు కదా ! మరి వారి స్థితిని గురించి ఆలోచించ నక్కరలేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రపంచంలో స్త్రీలస్థితి

మతాంతరీకరణ విషయం కాసేపు అవతలకునెట్టి ఆలోచించసాగితే స్త్రీల సమస్య తీవ్రస్వరూపం బోధపడుతున్నది. ఎంతో నాగరికత వెల్లివిరిసిన పాశ్చాత్య దేశాలలో సైతం ఆర్థిక రాజకీయరంగాలలో స్త్రీలను ముందుకు రానివ్వడంలేదు. కీలకస్థానాలలో స్త్రీలు ఇంచుమించుగా లేనట్లే లెక్క. ఇక మధ్యయుగపు పరిస్థితిలో ఉన్న దేశాలసంగతీ, అభివృద్ధి చెందని దేశాల సంగతీ చెప్పనవసరంలేదు. ప్రపంచవ్యాప్తగా స్త్రీలను గురించి పురుషులు, సమాజాలు మూడురకాలుగా ఆలోచిస్తున్నారు. స్త్రీని ప్రాణమున్న వస్తువుగా చూడటం మొదటిది. స్త్రీ పురుషులు దేవునిదృష్టిలో, మతవిషయికంగా సమానులు అని చెపుతూ ఈ సమానత్వం సర్వేసర్వత్రా వర్తించరాదనడం రెండవది. సమానులే కాని వారువేరు వీరువేరు. ఎవరి హక్కులూ బాధ్యతలూ వారికి ప్రత్యేకం అని చెప్పడం ఈ పద్ధతి. అలా కాక 'శారీరక నిర్మాణంలో తప్ప తతిమ్మా విషయాలన్నింటిలో స్త్రీ పురుషులు సమానులు; వారు సమాన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించగలరు' అని చెప్పేది మూడవ పద్ధతి. దీనిని ఆధునికదృక్పథం అంటాం. ఇప్పుడిప్పుడే ఈ దృక్పథం పుంజుకుంటున్నది. దీనిని వ్యాప్తిచేయడానికే, దీనికి వ్యవస్థా రూపం ఇవ్వడానికే మహిళా దశాబ్దాన్ని ప్రకటించింది ఐక్యరాజ్యసమితి.

ముస్లిం స్త్రీల స్థితిగతుల సమీక్ష

ఆధునికభావాల ప్రాతిపదికమీద సమాజాల పురోగతిని సమీక్ష చేయడం చేతు చాలా అవసరం. జనాభాలో సగంమందిగా ఉన్న స్త్రీలు దైన్యంలో, వైచ్యంలో మునిగివుంటే సమాజప్రగతి అనే దానికి అర్థం లేదు. కనుక విశేషవ్యాప్తి, ప్రాచుర్యం కలిగిన ఇస్లాం మతాన్ని అనుసరించే వారిలో స్త్రీలస్థితి ఎలా ఉన్నదనేది విచారణీయాంశం అయింది. అంతేగాక భారతదేశంలో నూటికి పదకొండు మంది ముస్లింలు ఉన్నారు. అంటే మతదృష్ట్యా అల్పసంఖ్యాక వర్గంలో అగ్రశ్రేణిలో ఉన్నారన్నమాట. అలాంటి భారత ముస్లింలలో స్త్రీల స్థితి ఎలా ఉందోగమనించటం మహిళోద్యమ కార్యకర్తలకే కాక, మానవ సంక్షేమాన్ని ఆకాంక్షించే

వారందరికీ అవశ్యకర్తవ్యం. ఈ దృష్ట్యా ఈ గ్రంథ రచనకు పూనుకోవడం జరిగిందని భావించాలి.

మతం : స్త్రీలు

ఒక మతంలో స్త్రీలస్థితిని అంచనా కట్టేముందు ఆ మతాన్ని అనేక దృక్కోణాలనుండి పరిశీలించాలి. అధి చారిత్రక దృష్టిఅంటే ఈ మతం ఏ దేశంలో ఏ కాలంలో పుట్టింది, ఆనాటి దేశకాల పరిస్థితులు దానిని ప్రభావితం చేశాయా లేదా, అనేవి. అంతేగాక ఈ మత వ్యాప్తికి పూనుకున్న దేశీయులు ఎవరు? వారి సామాజికాచారాలు ఈ మతస్థుల సంప్రదాయాలను మలిచాయియా లేదా అనేది అందులోనే మరో అంశం. ఏ దేశంలో ముస్లిం సమాజాన్ని పరిశీలిస్తున్నామో ఆ సమాజపు స్థితిగతులు ఎలాంటివి? ఆ మతం ఆ దేశంలో ప్రవేశించేటప్పుడు ఎలా ఉన్నాయి అనేది మూడవ అంశం. అంటే పుట్టినచోటు, వ్యాప్తిచేసిన వారి దేశం, స్వీకరించిన ప్రాంతం, అన్నిటి సామాజిక ఆచారాలు ఆ మతంపై ప్రభావం కలిగి ఉంటాయన్న మాట. ఆ మతప్రవక్త యొక్క వ్యక్తిత్వం, అతని ఆలోచనా ధోరణి, ఆయన ప్రవచనాలు, ఆయన ఆచరణ, వారి సూక్తులు, వారి సహచరుల ప్రవర్తన నియమావళి, పండితుల వ్యాఖ్యానాలు భాష్యాలూ వీటిని పరిశీలించటం మరొక దృక్పథం. ఈనాటి అవసరాలకు, ఈనాటి ఆలోచనా ధోరణికి, ఆ మతంయొక్క పద్ధతులు సరిపోతాయా అని ఆలోచించడం మూడవ దృక్పథం. రెండవ, మూడవ తరహా దృష్టితోనే ఈ పొత్తం రాయడానికి పూనుకున్నట్లు తోస్తుంది. కాగా పూర్వరంగ పరిచయం లేకపోతే సమస్య సరిగా అవగాహన కాదు కనుక ఉపోద్ఘాతంలో కూడా దానిని స్పృశించడం జరుగుతున్నది.

మహమ్మదు ప్రవక్త

క్రీ. శ. 6వ శతాబ్దంలో జన్మించాడు మహమ్మదు అరేబియాలో. ఆనాటి సమాజం దైవవిశ్వాసం కలిగిఉన్నా అనేక దురాచారాలకు ఆలవాలంగాఉంది. వారిదేశం ఎక్కువగా ఎడారితో నిండిఉండేది. అక్కడక్కడ సొనలు, తోటలు ఉండేవి. కనుక ప్రజలు సంచార జాతులుగా

ఉండేవారు. తెగలుగా బ్రతికేవారు; ఒకతెగ మరియొక తెగతో పోరాడుతూ ఉండేది. కనుక యుద్ధాలుచేసే మగజాతికి ప్రాధాన్యత లభించింది. స్త్రీలను హీనంగా చూసేవారు. వారు ఇంచుమించుగా వస్తువులక్రింద జమ. నిరక్షరాస్యుడయిన మహమ్మదు ఆ సమాజ సంస్కరణకు పూనుకున్నాడు. ఆనాడు ప్రజలకు దేవునిపైన నమ్మకం ఉన్నదికదా! అలాంటి రోజులలో "నేను చెప్తున్నాను" అని మహమ్మదు ఏదైనా మంచిమాట చెప్పినా ఎవరూ నమ్మరు. ఆ విషయం మహమ్మదుకు తెలుసు. కనుక తన చెవిలో దేవ దూత గేబ్రియల్ చెప్పిన విషయాలనే తను చెప్తున్నానని ప్రజలకు అతడు తెలియపరిచేటప్పటికి ప్రజలలో కొందరికయినా అతనిపై విశ్వాసం కుదిరింది. అప్పటికే అతనిని కొందరు పిచ్చివాడని నిరసించారు. అతడు "సమాధి" లోకి పోయేవాడు. అతని విమర్శకులు అతనికి 'మూర్ఛరోగమని', ఎగతాళి చేశారు. కష్టనష్టాలు భరించాడు. జయాపజయాలు పొందాడు. అవమానాలు సహించాడు. చివరకు విజయం అతనిదయింది. ప్రచారబలంతో, ఆయుధ సాయంతో తన మతవ్యాప్తి చేశాడు తన దేశంలో. అభిమానులు 'ప్రవక్త' అని అభివర్ణించారు. శత్రువులు 'వంచకుడు' అన్నారు. పండితులు "అజ్ఞాని" అని ఈసడించారు. ఎవరు ఏమన్నా మహమ్మదు చాల తెలివి కలవాడు. అందుకే సామాజిక సంస్కరణకు మత ప్రబోధాన్ని జోడించాడు. అతడు ఒక రకంగా ఆలోచిస్తే "యుగపురుషుడు". అంటే ఆ కాలపు పరిస్థితుల అవసరాలు తీర్చటానికి పుట్టినవాడు. అంతేకాదు ఆనాటి సామాజిక పరిస్థితులను సరిదిద్దటానికి ఆనాటి మౌలిక చింతనను అధిగమించి పోలేని మానిసి, అదే అతని బలహీనత. మరొక దృక్కోణం నుంచి చూస్తే అదే అతని బలం. ప్రజాదరణను పొందటానికి సాయపడిన విషయం. నిశ్చయంగా అతడు మహావ్యక్తి. కనుకనే ఎంతోమందిని ప్రభావితం చేయగలిగాడు; ఎంతోమందికి నేతృత్వం వహించగలిగాడు. ఈనాటికీ అతని అనుయాయులు కోట్లాదిగా ఉన్నారు. కాకపోతే ఈనాటికీ అతని భావాలు అనుసరణీయాలా అనేది వేరే చర్చనీయాంశం. ఈనాడు ఇస్లాం మతాన్ని అవుననడానికి గాని, కాదనడానికి గాని అతనిని ప్రత్యేకంగా నిందించవలసిన అవసరంలేదు; ఖండించవలసిన అవసరంలేదు. కాగా ఒక్క విషయం మాత్రం గుర్తుపెట్టుకోవాలి. మహమ్మదు 'చివరి ప్రవక్త'

అనే భావం ఈనాడు అనుసరణీయం; అంగీకారయోగ్యం కాదు. దేవుని అస్తిత్వానికే ఎసరువచ్చిన ఈ రోజుల్లో, ప్రవక్తలకు చోటు ఎక్కడ ఉంటుంది ? అందులో 'ఆఖరి ప్రవక్త'కు అసలు చోటు లేదు. ఇలాంటి ప్రకటన మానవ మేధస్సుకు అపచారం. 13 వందల సంవత్సరాల నుండి తత్వశాస్త్రంలో, సైన్సులో, లలిత కళలలో, కవిత్వంలో ప్రగతి ఆగిపోయిందనడం అసంబద్ధం; అవివేకమేమో ! ఇలా నమ్మడం అంటే మానవ సమాజాభ్యుదయం స్తంభించి పోయిందనడం అన్నమాట. మహమ్మదు నిరక్షరాస్యుడయినంత మాత్రాన అతనిని అపహాస్యం చెయ్యనక్కరలేదు. 'చివరి ప్రవక్త' అని అతని వాక్యాలను శిరోధార్యాలుగా స్వీకరించనక్కర లేదు. అతనిని సరిగా అంచనావేసి అతని భావాలకు సరిగా మదింపు వేయటం, చరిత్రలో అతని స్థానాన్ని నిర్దేశించటం అవసరం. అందుకు అతని దేశపు ఆ కాలపు స్థితిగతులను గమనించడం అవశ్య కర్తవ్యం.

మహమ్మదు కాలపు పరిస్థితులు :

అది తెగల సమాజం. ఆడపిల్లలను శత్రువులు ఎత్తుకొని వెళ్ళి పెళ్ళి చేసుకోవడం లేక ఉంపుడుగత్తెలుగా ఉంచుకోవటం జరిగేది. దీనిని తెగలు అవమానంగా భావించేవి. గట్టిగా రక్షించే స్థితిలో లేవు. కనుక బాలిక జననం అవమానంగా భావించేవారు అక్కరలేని ఆడపిల్లలు పుట్టగానే చంపి పూడ్చిపెట్టేవాళ్ళు. ఈ విషయాన్ని రూబిన్ లెవీ 'ఇస్లాంయొక్క' సామాజికశాస్త్రం ('Sociology of Islam' by Ruben Levy) లో వ్రాశాడు. ఇస్లాంకు పూర్వం అరేబియాలో బహు భార్యత్వం ఉండేది. (1948 వరకు మద్రాసు రాష్ట్రంలో కూడ, 1955 వరకు కొన్ని రాష్ట్రాలలో తప్ప యావద్భారతంలో హిందువులలో బహుభార్యత్వం ఉందనే విషయం హిందువులు గుర్తుచేసుకోవడం అవసరం). కాగా స్త్రీలు పురుషుని ఆస్తిగా పరిగణింపబడేవారు. పుట్టింటివారు కావచ్చు, భర్తకావచ్చు ఆమెకు పెత్తందారులు, వివాహాలు మూడురకాలుగా ఉండేవి. 'బీనా' (BEENA) పద్ధతిలో స్త్రీ తన తమ భర్తను ఎంపిక చేసుకోవచ్చును. తన ఇష్టం వచ్చినపుడు అతనిని బయటికి పంపవచ్చు. పిల్లలు మాత్రం ఆమె పుట్టింటివారి ఆస్థి. 'బాల్' (BAAL) అనేది రెండవ విధానం. భర్త ఇంట్లో భార్య కాపురం చేయాలి. పిల్లలు భర్త వంశానికి చెందుతారు. విడాకులు ఇచ్చే హక్కు భర్తది.

మూడవది మ్యూతా (MUTA) పద్ధతి. ఇంతకాలం భార్యా భర్తలుగా ఉంటా మని గడువు నిర్ణయించుకొని కంట్రాక్టు ఏర్పరచుకుంటారు. కంట్రాక్టు కాలంలో భార్య భర్తకు విడాకు లివ్వరాదు. పిల్లలు ఆమె పుట్టింటి వంశానికి చెందుతారు. ఆమెకు మనవర్తి హక్కులేదు.

అనాడు విడాకులు రెండు రకాలుగా ఉండేని. మొదటిది "ఖోల్". "మహర్", అనాడు వధువుకు చెందేది కాదు. వధువు తండ్రికి చెందేది. ఆ మహర్‌ను వధువు తండ్రి అల్లుడికి తిరిగి ఇచ్చి వేస్తే వివాహం రద్దు అయినట్టే. అంటే తండ్రి తన కుమార్తెను అలుడికి అమ్మాడన్న మాట. తీసుకున్న ధరమళ్ళీ తిరిగి ఇచ్చి వేస్తే ఆమె తండ్రి ఆస్తి అవుతుంది. రెండవరకం విడాకులను 'తలాఖ్' అంటారు. భర్తకు భార్యపై సంపూర్ణ హక్కులు ఉండేవి. ఆమెను అతిథులకు ఇవ్వ వచ్చు. ఇతరులతో కాపురం చేయమనవచ్చు. మా మూలు గా తన గొరెర్రెలను కావలాకాసేవానితో కాపురం చేయమనే ఆచారం ఉండేది. సంతానకోసం కూలీన వంశస్తునితో కాపురం చేయమనవచ్చును. అతని మరణానంతరం అతని వారసులు ఆమెను స్వాధీనపరచుకొని ఆమె పొందును స్వీకరించవచ్చు. ఇలాంటి వివాహవ్యవస్థలో భర్త తన ఇష్టం వచ్చినపుడు భార్యకు వినాకులివ్వడం 'తలాఖ్' పద్ధతి. అతడు ఎవరికీ ఏ కారణాలను చెప్పనవసరం లేదు. భార్యగా ఉండగా ఆమెను భర్త తన ఇష్టం వచ్చినట్లు శిక్షించవచ్చు.

దీనినిబట్టి తెలిందేమంటే మాతృ వారసత్వ వ్యవస్థనుండి (MATRILINEAL) పితృవారసత్వ వ్యవస్థకు మారే రోజులు (PATRILINEAL) అవి. మహమ్మదు చేసిన మార్పులలో ముఖ్యమైన వాటిని పేర్కొనడం అప్రసంగం కాదు. (1) బీదరికంవల్లగాని ఇతరత్రాగాని పిల్లలను చంపడం మాన్పించాడు. దాంతో ఆడ పిల్లలు బ్రతికారు.

(2) 'జకాత్' ఏర్పాటు చేసి బీదరికాన్ని తగ్గించాడు.

(3) స్త్రీలను బలవంతాన ఎత్తుకొని వెళ్ళి పెళ్ళి చేసుకోవడాన్ని నిషేధించాడు.

(4) భర్త ఆస్తిలో భార్యకు, తండ్రి ఆస్తిలో కూతురుకు వారసత్వ హక్కు కలిగించాడు.

(5) 'మహర్' స్త్రీకి చెందేటట్లు చేశాడు. అంతకు క్రితం దానిని తల్లిదండ్రులు, బంధువులు తీసుకునేవారు. ఆమె దానిని తన ఇష్టం ఇచ్చినట్లు వాడుకోవచ్చు.

(6) స్త్రీ ఇష్ట ప్రకారం వివాహం జరగాలి.

(7) కొన్ని సందర్భాలలో వివాహపు రద్దును కోరడానికి స్త్రీకి హక్కు ఏర్పరచబడింది.

(8) భర్త త్వరపడి విడాకులిచ్చి, మళ్ళీ ఆమెనే పెళ్ళి చేసుకుంటానంటే కొన్ని ఆటంకాలు, ఆంక్షలు పెట్టాడు.

(9) బహుభార్యత్వాన్ని పూర్తిగా నిరసించలేదు కాని ఏక కాలంలో నల్గురు భార్యలకన్న ఎక్కువ కలిగి ఉండటానికి వీలులేకుండా చేశాడు. నల్గురు భార్యలను సమదృష్టితో చూడాలని ఆదేశించాడు. అంటే ప్రేమ, అభిమానం, గౌరవం వీటన్నిటి విషయంలో సమానంగా చూడాలి.

ఇవన్నీ మహమ్మదు సంస్కరణ భావాలకు ప్రతీకలు. భార్య భర్త ఇంట్లోనే కాపురముండాలనే దానిని, భర్తకుగల ఏక పక్షపు విడాకుల హక్కును, స్త్రీల ఇతరత్రా హోదాను, ప్రజాకార్యక్రమాలలో ఆమెకు ప్రసక్తి లేక పోవడాన్ని ఇలాంటి వాటిని మహమ్మదు మార్చలేక పోయాడు. అందరూ అన్ని పనులూ చేయలేరు; అందులో అన్ని కాలాలలోనూ చేయలేరు. మహమ్మదుకూ ఈ ఇబ్బందులూ, సాధక బాధకాలూ ఉన్నాయి. కాగా మహమ్మదు ఆ కాలానికి అభ్యుదయవాది అని గ్రహించడం మన విధి.

ఇక పోతే ఏ సమాజంలోనన్నా స్త్రీల స్థితిగతులను సమీక్ష చేసేటప్పుడు ఈ క్రింది నమోదుచేసే అంశాలను దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. 1) సమాజంలో స్త్రీలకు ఉన్న విద్యావకాశాలు ఎన్ని ?

2) వృత్తులను చేపట్టటం విషయంలో వారికున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, అవకాశాలు ఎలాంటివి ?

3) ఆ సమాజం యొక్క సాంస్కృతిక స్థాయి ఎలాంటిది ?

4) సమాజంలో స్త్రీ పురుషుల సంబంధాలు సమానత్వ ప్రాతిపదిక పైన ఉన్నాయా లేక పెత్తందారు, పనికత్తె సంబంధాలతో ఉన్నాయా ?

5) వివాహం విషయంలో స్త్రీలకు ఎంపిక హక్కు ఉన్నదా? ఉంటే అది ఎంత వరకు వర్తిస్తుంది.

6) వివాహ వ్యవస్థలో స్త్రీ హోదా ఎలాంటిది? కుటుంబ బడ్జెటు, పిల్లల విద్య, పిల్లల పెళ్ళిళ్ళు, వస్తువుల క్రియ విక్రియాలు, కుటుంబానికి ఇళ్ళు, భూములు లాంటివి సంపాదించుట వగయిరా కుటుంబ విషయాలలో జరిగే నిర్ణయాలలో ఆమె పాత్ర ఏ మేరకు?

7) విడాకులు, మనవర్తి లాంటి విషయాలలో ఆమెకు వెసులుబాట్లు ఉన్నాయా?

8) సంతానం పొందే విషయంలో వివాహిత అయిన ఆమె మాటకు విలువ ఉందా?

9) తన సంతానం యొక్క పోషణ, సంరక్షత్వం మొదలైన అంశాల సందర్భంగా ఆమెకు హక్కులు న్యాయంగా తగినట్లుగా ఉన్నాయా?

10) ఆమె ఆస్తిమీద, ఆమె సంపాదమీద, ఆమె ఆమె భర్త కలిసి సంపాదించిన ఆస్తులపైన ఆమెకు యాజమాన్యపు హక్కు, వినియోగపు హక్కు ఉన్నాయా? ఉంటే అవి ఏ మేరకు?

11) వారసత్వంగా ఆమెకు ఆస్థి సంక్రమించే విషయంలో స్త్రీ పురుషుల మధ్య వివక్ష ఉందా?

12) సమాజంయొక్క సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రాజకీయ రంగాలలో ఆమె స్థానం ఎట్టిది? కీలక స్థానాల్లో పదవీ బాధ్యతలు నిర్వర్తించటానికి ఆమెకు అవకాశాలు ఉన్నాయా?

13) పురుషులలాగా ఆమెకు సంచారస్వాతంత్ర్యం ఉందా?

14) వేష భాషలలో, నడక తీరులో, మాట్లాడే పద్ధతిలో, పెద్దలను గౌరవించవలసిన విధానాల్లో స్త్రీ పురుష వివక్ష ఉందా? ఆమెపై ఆంక్షలు, పరిమితులు విధించబడ్డాయా? ఆమె విధి నిషేదాల వత్తిళ్ళకు లోనవు తున్నదా?

15) ఇతరుల పిల్లలను దత్తు చేసుకునే సందర్భంలో ఆమె వివక్షకు లోనవుతున్నదా?

16) స్త్రీ పురుష సందర్భంగా సమాజంలో ద్వంద్వనీతి చలామణి అవుతున్నదా?

17) వివాహమాడడానికి, అవివాహితగా ఉండటానికి స్త్రీకి హక్కు ఉందా? వివాహం ఆమెకు మాత్రమే నిర్ణయింపబడిన సంస్కారమా?

18) స్త్రీ అవివాహితగా తల్లి అవటం తప్పా!

19) శ్రమకు విలువ కట్టే సందర్భంగా స్త్రీ పురుష వివక్ష చెలామణి అవుతోందా?

20) సమాజంలో స్త్రీ పురుషుల మధ్య శారీరక నిర్మాణంలో తేడాలు ఉండవచ్చును కాని మేధస్సు, ఇతర శక్తి సామర్థ్యాల విషయంగా స్త్రీని చిన్నచూపు చూడటం సంభవిస్తున్నదా?

ఈ పై అంశాలను సర్వదా దృష్టిలో ఉంచుకొని ముసల్మాను సమాజాన్ని పరిశీలించడం అవశ్య కర్తవ్యం.

ముస్లిం సమాజాన్ని నియంత్రిణం చేసేవి అనేకం. మహమ్మదుచే 'దైవ ప్రేరితం'గా చెప్పబడిన ఖురాన్ మొదటిది. మహమ్మదు ఇతర సందర్భాలలో చెప్పిన మాటలు రెండవ కోవకు చెందినవి. వాటిని 'హాడిత్' అని వ్యవహరించడం కద్దు. ఏ సందర్భంలోనయినా మహమ్మదుయొక్క ఆచరణ('సున్నా') మార్గదర్శకంగా పరిగణించబడేది; అది మూడవ అంశం. ఇవన్నీ దొరకనప్పుడు మహమ్మదుయొక్క సహచరుల ఆలోచనకు ప్రాధాన్యత వస్తుంది. దానిని 'ఇజ్మా' అంటారు. ఇది నాల్గవది అన్నింటికన్న చివరిది దేశాచారాన్నిబట్టి నిర్ణయింపబడే విషయం. దీనిని 'ఇష్టిహాసన్' అని పిలుస్తారు. కనుక ముస్లిం సమాజంయొక్క బాగోగులను నిర్ధారణ చేయుడానికి కేవలం ఖురానులో వాక్యాలు, దానికి మతగురువులు, పండితులు చేసిన వ్యాఖ్యానాలు, భాష్యాలు మాత్రమే చాలవు. ఈ నాడు మనం 20వ శతాబ్దంలో బ్రతుకుతున్నాం. ఇస్లాం మతం పుట్టిన 13 శతాబ్దాల తరువాత అవాటు లేనివి, ఆనాడు ఊహించటానికి కూడా అవకాశం లేనివి అనేక సందర్భాలూ సన్నివేశాలు మనకు ఎదురు అవుతుంటాయి. ముస్లిం సమాజం ఆ సమస్యను ఎదుర్కొనక తప్పదు. అప్పుడు అచ్చంగా ఖురాను మాత్రమే సహాయకారి కాదు. కాగా మహమ్మదుచే ప్రవచింపబడిన సుభాషితాలు ఉపకరించవచ్చు. కొన్ని సందర్భాలలో అవి అన్వయించక

పోవచ్చు. అపుడు మానవుడు తన స్వబుద్ధిమీద, వివేచన మీద ఆధారపడవలసి రావచ్చు. కనుక మహమ్మదును చివరి ప్రవక్తగా అభి వర్ణించుతుంటూ ముస్లింల ఆలోచన ఆయన మాటలతో, చేతలతో ఆగిపోతే ముస్లిం సమాజం పెదగజాలదు. సరిగ్గా ఆ ప్రమాదమే సంభవించింది ముసల్మాను సమాజానికి. అందువలననే ముసల్మాను మతాన్ని అంటి పెట్టు కొని యున్న దేశాలు, రాజ్యాలు ప్రగతిపథంలో ముందుకు సాగలేకుండా ఉన్నాయి. పారిశ్రామికీకరణతో వచ్చిన నాగరికతను, సంస్కృతిని జీర్ణించుకోలేక వేల సంవత్సరాలు వెనుకబడి ఉన్నాయి. ముఖ్యంగా స్త్రీల విషయం తీసుకుంటే ఆయాదేశాలలో సగంగా ఉన్న స్త్రీలను వంటఇండ్లకూ, పడకగదులకూ అంకితం చేసినయి. ప్రజాశక్తి, శ్రామికశక్తి సగం దేశానికి ఉపకరించకుండా పోయింది. ఇన్ని ఇబ్బందులు పడ్తున్నా, ఇంత వెనుకబడి ఉన్నా, ఇంతగా సాంకేతిక సాంస్కృతిక రంగాలలో కుంటుపడు తున్నా తమ మతమే ఉత్కృష్టమయినదని, తమ జీవిత విధానమే ఆదర్శ ప్రాయమని గుడ్డిగా విశ్వసిస్తున్నారు ముసల్మానులు. ఇలా పురుషులు మాత్రమే నమ్మటం లేదు; స్త్రీలుకూడా విశ్వసిస్తున్నారు. ఆ మాటకువస్తే స్త్రీలకు అలాంటి అభిప్రాయాలను ముసల్మాను పురుషులు కలుగజేశారు. ముసల్మాను స్త్రీలు వాటిని తమ స్వంతం చేసుకున్నారు. అవి వారి వర నరాన జీర్ణించి పోయాయి. కనుకనే బహుళ సంఖ్యాకులైన స్త్రీలు మార్పును వాంఛించటం లేదు. అభ్యుదయ భావాలుకల మహిళలు కొందరు మాత్రం ఆందోళన చేస్తున్నారు తమ స్థితి మెరుగు పడాలని; కాని వారికి ఎక్కువగా ముసల్మాను స్త్రీ పురుషుల నుండి మద్దతు రాకపోవటం శోచనీయం.

ఈ పరిస్థితి ఇలా కొనసాగటం ముస్లింలకు, దేశానికీ మంచిది కాదు వర్తమాన సమాజంలో వచ్చిన ప్రగతిలో వారూ పాలు పంచుకోవటం న్యాయం; అవశ్యం కూడాను. ముసల్మాను సమాజంలో ఇలాంటి పరివర్తన రావటానికి ఏయే ఆటంకాలు ఉన్నాయో గమనించవలసిన తరుణం ఆసన్న మయింది. ముసల్మాను మత సూత్రాలను, మతాచారాలను ఈ సందర్భంగా క్షుణ్ణంగా పరిశీలించటం అవసరం. అందుకు ఈ పుస్తకం కొంతవరకు ఉపకరిస్తుంది.

— ఎం. వి. రామమూర్తి

1. పూర్వరంగం

ఇస్లాంలో స్త్రీల పరిస్థితి తెలిసికొనే ముందు ముస్లింల మతం, నాటి ఆచార వ్యవహారాలు, సాంఘిక స్థితిగతులు పరిశీలించడం ముఖ్యం. ఇస్లాం మతం దివ్యదర్శనం (REVELATION) పై ఆధారపడిన మతం. ఆ మత సూక్తులను దేవదూత మహమ్మదు చెవిలో చెప్పాడని కథ. కనుక ఇదంతా ఏ కాలంలో, ఏ పరి స్తితులలో ఎలా జరిగిందో, మతావిర్భావం, మత ధర్మాలు తప్పక తెలుసుకోవాలి. ఆ నాటి సంస్కృతి, పరిస్థితులను కూడ అవగాహన కాక తప్పదు.

ఈనాడువలె ఆనాడూ అరేబియాదేశం ఎడారి ప్రాంతం. ఒంటెలపై సామానులు వేసుకుని ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి తరలి వెళ్ళేవారు వర్తకులు. దానిలో అచ్చటచ్చట నీళ్ళు ఫలవృక్షాలు ఉన్న చోట మజిలీలు చేసేవారు. వాటిని స్వర్గతుల్యంగా పరిగణించేవారు. ప్రజలు తెగలుగా ఉండేవారు. వంశాలకు, గోత్రాలకు విపరీతమయిన ప్రాముఖ్యత ఉండేది. తమ వారిని ఎవరైనా హత్యచేస్తే, పరిమారిస్తే, వారిని చంపేవరకు హతుని బంధువులు నిద్రపోయేవారుకారు. పగ, ద్వేషం, ప్రతీకారం ఆనాడు ప్రజల మనస్సులలో గూడు కట్టుకుని వుండేవి. స్త్రీలను చెరపట్టడం, ఉంపుడు కత్తెలుగా వాడుకోవటం, బానిసలుగా క్రయవిక్రయాలకులోను చేయడం ఆచారంగా ఉండేది. విగ్రహారాధన మిక్కుటంగా సాగేది. మక్కాలో "కాబా" దేవాలయంలో మూడు వందల అరవై దేవతా విగ్రహాలు ఉండేవట. ఆనాడు వారిలో సోదరభావం మృగ్యం. శాంతి, కరుణ బలహీనతగా ఎంచుకొనేవారు. ఆ సమాజం ఆ పరిస్థితులలో మారవలసిన తరుణం ఆసన్నమయింది. సరిగ్గా ఆ రోజుల్లోనే ॥క్రీ॥శ॥ 571 లో మహమ్మదుగా పేరు ప్రఖ్యాతులు గాంచిన రసూల్ జన్మించాడు.

రసూల్ తండ్రిప్రేమకు నోచుకోలేదు. అతడు పుట్టేనాటికి తండ్రి గతించాడు. ఆరేండ్ల ప్రాయం నిండకముందే తల్లి కూడా చనిపోయింది. రసూల్‌ను తాత పెంచాడు. తరువాత పెద తండ్రి రక్షణలో పెరిగాడు.

వ్యాపార సందర్భంగా సిరియా వెళ్ళాడు. అక్కడ అతనికి ఒక క్రైస్తవ సన్యాసి తటస్థించటం జరిగింది. మహమ్మదుకు బహుదేవతారాధనపై ఆ సన్యాసి వైముఖ్యం కలిగించాడు. శిథిలమయిన క్రైస్తవ మతాచారాలపై, విరక్తీ, అసహ్యమూ, దేవుడు ఒక్కడే అనే భావమూ ఆనాడే అతనికి కలిగాయి. ధనవంతురాలైన ఖడీజా అనే మధ్య వయస్కురాలయిన స్త్రీ అతన్ని ఏరికోరి వివాహమాడింది. అప్పటికి అతనికి 25 సంవత్సరాల వయస్సు. ఆమెకు నలుబది సంవత్సరాలు. ఆర్థికంగా రసూల్ జీవితం సాఫీగా నడిచిపోతున్నా సృష్టిని గురించిన ప్రశ్నలు అతన్ని తికమకచేయడం ఆరంభించాడు. అతడు నిరక్షరాస్యుడు; అయినా తెలివి కలవాడు. నిరంతర ఆలోచనా స్రవంతిలో మునిగితేలుతూ ఉండేవాడు. అప్పుడప్పుడు స్పృహకూడా కోల్పోతుండేవాడు. ఇతనికి ఏదో వ్యాధి సంభవించిందని ప్రజలు భావించేవారు. ఏకాంతాన్ని అభిలషిస్తూ మక్కానగర పరిసర విజయ ప్రాంతాలలో తిరగాడ నారంభించాడు. ఒకసారి గుహలో ఒంటరిగా ఉండగా అతనికి సృష్టిరహస్యం మాటల రూపంగా వినవడిందట. దేవుడు మట్టిలోనుంచి మనిషిని సృష్టిచేశాడని, దేవుడు దయామయుడని, మనిషికి దేవుడు విజ్ఞానబోధ చేస్తాడని, ఆ బోధ నంతా చదవమని అతనికి ఎవరో చెప్పినట్లు వినపడిందట.

తమ చదవలేనని అతడు విన్నవించుకున్నాడట. అపుడు దైవదూత జిబ్రియలు ప్రత్యక్షమయి అతనిని "నీవు అల్లాహ్‌దూతవు" అని చెప్పిందట. ఈ విషయాన్ని భార్య ఖడీజాతోచెప్తే, ఆమె తన బంధువర్గంలోని పండితుని సంప్రతిస్తే అతడు రసూల్‌ను ప్రవక్తని చెప్పాడట. రసూలే మహమ్మదు ప్రవక్తగా నాటి నుండి చలామణి అయ్యాడు. దీంతో ఖటీజాకు భర్త దివ్యత్వంపై విశ్వాసం కలిగింది. ఆమె అతని శిష్యురాలయింది. తరువాత అతని బంధువు అలీ, బానిస జయిదీ, అతని చిన్ననాటి స్నేహితుడు అబూ బకర్ అతని అనుయాయులయ్యారు. మొదట్లో మక్కానగరవాసులు మహమ్మదు బోధవలను పట్టించుకోలేదు. హేళనచేశారు; దూషించారు. బాధలు పెట్టారు. ఓర్మితో సహించాడు. దేవదూత జిబ్రాయేలు తనకు చెవిలో చెప్పిన విషయాలను ఇతరులకు చెప్పేవాడు. అతనికి స్పృహలేనప్పుడు జిబ్రాయేలు వచ్చిచెప్పిపోయేవాడట. ఇతంతా కట్టు

కథయని నగర వాసులు తోసిపుచ్చారు. క్రమేపి శిష్యగణం పెరిగింది. మహమ్మదును వెలివేశారు మక్కా తెగలవారు. మూడు సంవత్సరాలు ఒక కుగ్రామంలో అనేక కష్టాలకు లోనగుతూ కాలం గడిపాడు. అతనిని వప్ప గించవలసిందని మక్కా తెగలవారు మహమ్మదు తెగవారిని ఆదేశించారు. ఇలా ఉండగా మదీనా పురవాసులు కొంత మంది వచ్చి అతనికి శిష్యులుగా, అంతే వాసులుగా అయినారు. అతనికి స్ఫురించింది మదీనాకు పారిపోదా మని. దానిని దైవాజ్ఞగా చెప్తాడు మహమ్మదు. విడువలేక విడువలేక మక్కా వదలి మదీనా చేరాడు మహమ్మదు. కాని ఏ నాటికయినా కాబా దేవాల యాన్ని తన స్వాధీనంలోకి తీసుకోవాలనే ఆకాంక్ష మాత్రం అతనిని వదల లేదు ఆ కోరిక ఎనిమిది సంవత్సరాల తరువాత ఫలించడం జరిగింది. దానికి కారణం –

మక్కాకు హాజ్ సమయంలో యాత్రికులు అనేక మంది వస్తూ ఉండే వారు. వారికి దేవదూత తనకు చెప్పిన విషయాలు మహమ్మదు బోధిస్తూ ఉండేవాడు. మొదటి సంవత్సరం భజరజ్ వంశానికి చెందిన కొందరు వ్యక్తులకు 'ఆకబా' అనేచోట సందేశాన్ని వినిపించాడు. మరుసటి సంవ త్సరం పన్నెండు మంది మదీనా పౌరులు ఇస్లాం మతాన్ని స్వీకరించారు. ఆ తరువాత సంవత్సరం 72 మంది మతంలో చేరారు. అపుడు మహమ్మదు వారిచేత ఇలా ప్రతిజ్ఞలు చేయించాడు.

ఒకే దేవునికి తప్ప మరెవరికీ దాస్యం చెయ్యం;
దొంగతనం చెయ్యం; వ్యభిచారం చెయ్యం; సంతాన హత్య చెయ్యం;
ఇతరులపై అభాండాలు మోపం. అని పలికించేవాడు దైవ సందేశ హరుడు (సల్లల్లాహు అలైహివసల్లం అంటే మహమ్మదు) ఏసత్కార్యం (మారూఫ్) చెయ్యమంటే దానిని కాదనం.

ఇలా ఏకేశ్వరోపాసనను పెంపొందించటమే కాక తన ఆధ్యాత్మిక ఆధిపత్యానికి పునాదులు వేశాడు మహమ్మదు.

ఏనాడయినా సామాన్య ప్రజానీకానికి మహిమలపై మోజు ఉంటూ వస్తున్నది. ప్రకృతి ధర్మాలకు వ్యతిరేకంగా జరిగే పనిని మహిమ అంటాం. అలాంటి మహిమలు ఏసు క్రీస్తు చేసినట్లు కథలు ప్రచారంలో ఉన్నాయి.

మరి మహాప్రవక్త మహమ్మదులవారు మహిమలు చేయలేదా? చేయలేక పోయారా అనే సందేహం కలగవచ్చును. ఆ మహిమల (మోజిజా) ప్రసక్తి వారి జీవిత కథలో రాకపోలేదు. మొదటి మహిమగా 'దివ్య' ఖుర్ ఆన్ ను పేర్కొనడం కద్దు. ఒక నిరక్షరాస్యుని నోట అంతటి కవితా ప్రవాహం కల ఖుర్ ఆన్ వెలువడటం ఆ కాలపు వారికి మహిమ కాదా మరి! చంద్ర భేదనం (షక్కుల్ కమర్) రెండవది. "మహాప్రవక్త" ఉన్న 'మినా' అనే ప్రాంతంలో చంద్రుడు రెండు ముక్కలవడం జరిగిందట. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ ఊద్ ఈ సంఘటనను ఉల్లేఖించారట. దీని ప్రస్తావన "సహీహ్ బుఖారి ముస్లిం" ఇత్యాది హదీసు గ్రంథాలలో ఉందట. (చూడు/పుట 104 "మహాప్రవక్త" తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్, హైదరాబాద్). మూడవ మహత్తు మేరాజ్! అంటే మహమ్మదుగారి అధిరోహణ అన్న మాట. వారు ఏడు ఆకాశాలను దర్శించి తిరిగి వచ్చారట. (చూడు అదే పుస్తకం పుటలు 107-112) స్వర్గనరకాలను కూడ దర్శించారట. ఈ విషయం మహమ్మదు శిష్యులకు చెప్పారట. ఈ విషయం "బుఖారీ ముస్లిం" హదీసు గ్రంథాల్లో రాయబడిందట. ఏ వ్యక్తి అయినా తన్మయత్వంలో ఉన్నప్పుడు భ్రమలకు లోనవుతాడు. ఈ సూత్రం గురువుకూ, శిష్యునికీ ఇద్దరికీ వర్తిస్తుంది. తమ దైవ సందేశహరుడనని (దైవం నుండి సందేశం తెచ్చినవాడి నని) ఒక వ్యక్తి నమ్మినపుడు అతడు ఇలాంటి భ్రమలను నిజాయితీగా సత్యంగా విశ్వసిస్తాడు. గురువుపై అచంచల విశ్వాసం కల శిష్యుడు వెన్వెంటనే నమ్ముతాడు. ఇదే జరిగి ఉంటుంది మహమ్మదు విషయంలో, దీనికి ఉదాహరణలు కూడా లేకపోలేదు.

మదీనాకు వెళ్ళి స్థిరపడిన మహమ్మదు నూతన మత స్థాపకుడేకాదు. సరికొత్త సమాజానికి పునాదులు వెయ్యవలసిన బాధ్యత అతనిపైన పడింది ఆనాడు. అంతేకాదు నూతన రాజ్యస్థాపన జరిగిన తరువాత దాని శత్రువుల నుండి- (మదీనాలో వెలుపల నుండి దండెత్తి వచ్చేవారు, మదీనాలో ఉంటూ కపటులుగా ఉంటూ శతృత్వం నెరపేవారు)- రక్షించవలసి అతని కర్తవ్యం అయింది. అతడు సమాజ సంస్కరణ వాదిగా రాజనీతిజ్ఞుడుగా కూడ భాసించవలసి వచ్చింది. ఈ విషయంలో మహమ్మదు ఎన లేని విజయాలు సాధించాడని అంగీకరించాలి. వివాహం, విడాకులు

మనవర్తి, వారసత్వం లాంటి లౌకిక వ్యవహారాలే కాక యుద్ధాలు, ఒడంబడికలు, శాంతిసందేశాలు, వీటన్నిటినీసమర్థవంతంగా నిర్వహించగలిగాడుఅతని జీవిత కాలంలో-చివరి పదేండ్లలో - ఇరవై ఏడుదండయాత్రలలో, అనేక యుద్ధాల్లో అతడు స్వయంగా పాల్గొన్నాడు. అతడి సందేశాలవల్ల అతన అనుయాయులను ఉత్తేజ పరిచాడు. అనేకసార్లు పరాజయాలను విజయాలుగా మార్చ గలిగాడు. 'అంతా దేవుని దయ' అని భారము 'అల్లాహ్' మీద పెట్టేవాడు. ఇదంతా అతని ప్రత్యేక నైపుణ్యం అవక తప్పదు.

ఏ సందర్భానికి అవసరమైన సందేశాన్ని ఆయా సమయాల్లో ఉపయోగించేవాడు. అతని సమయజ్ఞత మెచ్చుకోదగినది. 'బద్రి' యుద్ధం మదీనా ప్రవాసానికి వెళ్ళిన రెండవ సంవత్సరంలో జరిగింది. షుమారు మూడువందల మంది ముస్లింలను వెయ్యమంది ఖురేషీలను పరాజితులను చేసిన యుద్ధం అది. ఆ యుద్ధ సమీక్షలో తన సహాయకులను ప్రోత్సహిస్తూ చెప్పింది 'అన్ ఫాఫా' సురా.

"విశ్వసించినవారలారా! ఏదయినా వర్గాన్ని మీరు మార్కొన్నప్పుడు స్థిరచిత్తంతో ఉండండి. అల్లాహ్‌న్‌ను అధికంగా ధ్యానించండి. మీకు విజయభాగ్యం కలుగుతుందనే ఆశ ఉంది. అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు విధేయత చూపండి. పరస్పరం కలహించకండి – సహనంతో మెలగండి !! అన్ఫాల్ 45, 46. యుద్ధఫలంకోసం కలహించుకునే తన సైన్యంలోని వారిని మందలిస్తూ అందులో అయిదవభాగం అల్లాహకు, మరియు ఆయన ప్రవక్తకు, బంధువులకు, అనాథలకు, బీదవారికి మరియు బాటసారులకు చెందుతుందని ప్రకటించాడు. (అన్ఫాల్ 41) భావోద్రేకాలపట్ల, మనో వాంఛలపట్ల నిగ్రహం చూపాలనేభావాన్ని 'సహనం' అనే పదంలో ఇమిడ్చి చెప్పాడు. (అన్ఫాల్ 46) ఉహద్ యుద్ధంలో మొదట్లో మహమ్మదు సైన్యానికి పరాజయం సంభవించింది. తరువాత అది విజయంగా మారింది. యుద్ధఫలాన్ని ఆశించి అజాగ్రత్తగా వ్యవహరించిన ముస్లిం సైన్యం దెబ్బతిన్నది. ముస్లింల ధనప్రీతి మహమ్మదును కలవర పరచింది. ధనప్రాప్తికి మార్గమయిన వడ్డీని నిరసించాడు మహమ్మదు. అహ్జాబ్ యుద్ధం (కందకయుద్ధం) సందర్భంగా 'అహ్జాబ్' సురా చెప్పడం జరిగింది.

దైవాన్ని గురించి ముస్లింలకు అనుమానం కలిగినపుడు వారికి అది పరీక్షా సమయమని చెప్పాడు మహమ్మదు. ఏదో సాకు చెప్పి యుద్ధానికి రాకుండా ఇంటివద్దవున్న కపటులను శిక్షించలేదు అతడు. కాని అదే పనిని ముస్లిం చేస్తే శిక్ష వేశాడు. తరువాత సానుభూతితో క్షమించాడు. మక్కాను జయించిన తరువాత లొంగిపోయిన ఖురేషీలను శిక్షాపాత్రులను చేయలేదు, ఇలా రాజనీతిజ్ఞత ప్రదర్శించి వారి సుహృద్భావాన్ని చూరగొనుటలో ప్రత్యేకత.

ముస్లింరాజ్యాన్ని సుప్రతిష్టితం చేయటానికి మహమ్మదుకు 11 సం॥ పట్టింది. మక్కా నుండి మదీనా పారిపోయిన క్రీ. శ. 622 నుండి హిజ్రాశక ప్రారంభం క్రింద లెక్క.

మహమ్మదు నోట వెలువడిన అల్లాహ్ వాక్యాలే ఖురాన్‌లో పొందు పరచబడినాయి. వీటిని మహమ్మదు కాలంలోనే రాయడడేం జరిగింది. వాటిని చాలామంది కంఠతా పట్టారు. మహమ్మదు క్రీ. శ. 633 లో చనిపోతే అబూ బకర్ కాలిఫ్ అయ్యాడు. అపుడు ఖురాన్‌ను గ్రంథస్థం చేశారు. రెండేడ్లలోగా యుద్ధంలో ఖురాన్ కంఠతా వచ్చిన వారిలో పెక్కుమంది చనిపోయారు. జరిగిన తరువాత వచ్చిన కాలిఫ్ ధేమాన్ రోజుల్లో మరల సేకరణ జరిగి అధి కారరింగా ఖురాన్‌ను ప్రకటించడం జరిగింది. కాని ఆ గ్రంధంలో అంశాలు కాలానుక్రమ గణికంగా లేవు. ఒకే సురా (అధ్యాయం)లో అనేక సంద ర్భాలలో అనేక సమయాలలో చెప్పబడినవి పొందుపరచడం జరిగింది.

మహమ్మదు ముస్లింలకు అందించిన సందేశాలలో ముఖ్యమయినది జ్ఞానతృష్ణ. బహుశః తను నిరక్షరాస్యుడననే బాధ అతనిని పీడిస్తున్నదేమో జ్ఞానానికి విలువ ఇచ్చాడు. అందువల్లనే మధ్యయుగాలలో క్రైస్తవ ప్రపంచం అంధకార యుగంలో ఉన్నపుడు ఇటు ప్రాచ్య విజ్ఞానాన్నీ అటు గ్రీకు విజ్ఞానాన్ని సంతరించి భవిష్యత్ తరాలకు అందించిన ఘనత అరబ్బులకు చెందింది. ఇది మహమ్మదు వారసత్వ మనవచ్చు.

సన్మార్గంలో నిరంతర కృషిగా చిత్రించబడిన జిహాద్‌పై మహమ్మదు నొక్కి పెట్టాడు. తన మదీనా రాజ్యం బలపడని రోజుల్లో ధర్మ రక్షణకోసం

'జిహాద్' సాగించమన్నాడు. ఇస్లాం రాజ్యం సుస్థిరం అయిన తరువాత సత్యమార్గ విస్తరణకోసం జిహాద్ చేపట్టవలెనన్నాడు. బహుశః అందువలన వేమో కత్తి చేతబూని ముసల్మాను మతవ్యాప్తి చేశారు ఆయన మతానుయాయులు నిన్నమొన్నటి వరకు. ఈనాడు ప్రపంచంలో సుమారు డెభై కోట్ల ముసల్మానులున్నారు. రెండవ మతంగా-విస్తరణ దృష్ట్యా - ఇస్లాంను పేర్కొంటున్నాం. ఆసియా, ఆఫ్రికా ఖండాలలో ఎక్కువగా ముసల్మాను మతాన్ని స్వీకరించారు.

"తొలి సందేశంతో మహమ్మదు ప్రకటించిన సత్యాలు ఇవి :

1) సృష్టికర్త అయిన నీ దేవుని పేరిట పఠించండి.

2) ఆయన మట్టి నుంచి మనిషిని సృష్టించినాడు.

3) నీ దైవము అత్యున్నత గౌరవార్హుడు.

4) వ్రాయుటమాయనే నేర్పించాడు.

5) మానవునికి తెలియని దానిని బోధించాడు."

(పుట 32 'ఇస్లామ్ దర్శనం' తెలుగు అకాడమీ, హైదరాబాద్)

మహమ్మదు పాత నిబంధనను (OLD TESTAMENT OF BIBLE) కాదన లేదు. ప్రవక్తల పరంపరను అంగీకరించాడు. కాగా తను చివరి ప్రవక్త అని అతని అభిప్రాయం. ఏసును ప్రవక్తగా పేర్కొంటాడు కాని "ప్రభు కుమారుని"గా చిత్రించాడు. కనుకనే క్రైస్తవులు, మహమ్మదీయులు ఇద్దరూ కితాబీయాలు; అంటే పవిత్ర గ్రంథంలో పాత నిబంధనలో-నమ్మకమున్నవారు. బహుశః అందుచేతనే కాబోలు ముస్లిం పురుషుడు కితాబియా స్త్రీని అంటే క్రైస్తవ స్త్రీని వివాహమాడవచ్చనే నిబంధన పుట్టింది. క్రైస్తవులలాగే ముస్లింలకు తీర్పు దినం (DAY OF JUDGMENT) పై విశ్వాసమున్నది. పరలోక జీవితంపై ఆసక్తి ఉన్నది. పరలోక జీవితమే శాశ్వత జీవితమట. దానికోసం ఇహలోక సౌఖ్యాలను విడనాడాలట.

మహమ్మదు నమ్మిన దేవుడు కూడా మోసెస్ దేవునివలె తిడ్తాడు, శాపాలు పెడ్తాడు, బెదిరిస్తాడు; స్వర్గలోకంలో అన్ని సౌఖ్యాలు చేకూరుస్తానని

ఆశలు చూపుతాడు. అన్యులను, ఇస్లాం పరిభాషలో 'కాఫిరులను' శిక్షించ వలెనని శాసిస్తాడు. అంతటితో ఊరుకోడు. నన్నొక్కడినే నమ్మమంటాడు; తనకే దాస్యం చెయ్యమంటాడు. ఇస్లాం మతంలో ప్రార్థనకు ప్రాముఖ్యత జాస్తి. మహమ్మదు గగనారోహణచేసి తిరిగి వచ్చేటప్పుడు రోజుకు యాభైసార్లు దైవ ప్రార్థన చేయటం మంచిదని భావించాడట. కాని భగవంతుని ప్రోత్సాహంతోనే సంఖ్యను యాభై నుండి అయిదుకు తగ్గించాడట. మొదట్లో నమాజు చేసేటప్పుడు జెరూసలేము వైపుకు తిరిగి ప్రార్థించేవారు ముస్లింలు. తరువాత "ఖిబ్లా"ను మహమ్మదు మక్కావైపు మార్చాడు. ఈ సంఘటన యూదులు మహమ్మదుపై కుట్రలు పన్నడం మొదలు పెట్టిన తరువాత జరిగింది. బహుశః తన మతం యొక్క క్రొత్తతనానికి నిదర్శనంగా మహమ్మదు అలా చేసాడేమో. లేక మక్కా - తను పుట్టి పెరిగిన ఊరు – పై అభిమానంచేత అలా చేసాడో! ఏదైనా ఇపుడు ప్రపంచంలోని ముస్లింలందరూ మక్కావైపు తిరిగి నమాజు చేస్తారు. ఈ నమాజు అయిదు పర్యాయాలు జరగాలు. సూర్యోదయానికి పూర్వం, సూర్యోదయం తర్వాత, పొద్దు తిరిగిన తర్వాత, సాయంత్రము సంధ్యవేళ, రాత్రిపూట ప్రార్థన చేయాలి ప్రతి ముసల్మాను. స్త్రీలకూ, పురుషులకూ ఈ సూత్రం వర్తిస్తుంది. సమష్టిగా ప్రార్థన చేయటానికి మసీదుల నిర్మాణం సాగింది. ప్రతి ముస్లిం దేవునికి తను దాసుడనని స్పష్టంగా ప్రకటించుకోవాలి. వారికి విధించబడిన కర్తవ్యాలు అయిదు.

1. అల్లాహ్ తప్ప మరో దేవుడు లేడని, మహమ్మదు చివరి ప్రవక్తయని విశ్వసించాలి.

2. ఐదు వేళల ప్రార్థన చేయాలి.

3. రంజాన్ సందర్భంగా ఉపవాసం చేయాలి పగలు. 40 రోజుల ఉపవాసముండుట ఉత్తమం. 30 రోజులు సాగించటం మధ్యమం.

4. తన సంవత్సర ఆదాయంలో 100 కి 2.5 వంతు దానం చెయ్యాలి. దీనిని జకాత్ అంటారు.

5. జీవితంలో ఒక్కసారి అయినా మక్కా యాత్ర (హాజ్) చెయ్యాలి.

చివరి రెండు విధులు ఆయా వ్యక్తి యొక్క ఆర్థిక స్తోమతనుబట్టి ఉంటాయి. వాటిని పాటించనంత మాత్రాన దేవుడు ఆ ముస్లిం వ్యక్తిని శిక్షించడన్నమాట. మక్కా యాత్రచేసి వచ్చిన ప్రతి వ్యక్తీ తన పేరు ముందు 'హాజీ' అని తగిలించుకుంటాడు. ఇది గౌరవ చిహ్నముగా పరిగణించారు ఒకనాడు; ఈనాడు ఆ గౌరవాన్ని వ్యాపార దృష్టితో వాడుకునేవారు లేకపోలేదు. ఇదంతా ఎందుకు చెప్తున్నామంటే ఇస్లాం మతంలో మానవుడు భగవంతునికి దాసానుదాసుడు. బానిసత్వం అమలులో ఉండే రోజుల్లో ఊహించబడిన మతం గనుక అలా చెప్పటం జరిగిందేమో! ముస్లిం భగవంతునికి ఆత్మార్పణ (SURRENDER) చేసుకోవాలి. అది అతని విధ్యుక్త ధర్మం. భగవంతుడు మనిషికి ప్రజ్ఞను ఇచ్చాడు; స్వాతంత్ర్యాన్ని ఇచ్చాడు. నిజమే; కాని దానిని అతడు సద్వినియోగం చేసుకోవాలి. అంటే తన స్వాతంత్ర్యాన్ని దేవునికి ధారపోయాలి; దేవునికి అర్పించాలి. ఒక రకంగా ఆలోచిస్తే ఇది బానిస మతం. అంటే మనిషిలో బానిసత్వ భావమును ప్రేరేపించేది. ఖురాన్‌లోని దేవునికి మానవునికుండే లక్షణాలు ఆరోపింపబడినాయి. "సమస్త సామ్రాజ్యాధిపతి అయిన భగవంతుడికి కీర్తి కలుగుగాక" (6) "నా స్వహస్తాలతో సృష్టించినది" (38 : 76)- "దయామయుడైన భగవంతుడు. సింహాసనా రూఢుడాయెను" (20 : 5) వంటి వాక్యాలు పైదానికి నిదర్శనాలు. మనిషి భగవంతుడిని మనిషి రూపంలో ఊహించాడు; చీమలు ఊహిస్తే భగవంతుని చీమల రూపంలో ఊహిస్తాయి. ఇదీ వరస. ఇదీ మనో వ్యాపార ధర్మం. దానికి ఇస్లాం అతీతం లేదని మనం నిరూపించవచ్చు.

ఇస్లాం అభివృద్ధి చెందే దశలో ఆ మతంలో కూడ హేతువాద ధోరణులు రాకపోలేదు. అట్టి శాఖగా "ముతాజిలిజం"ను పేర్కొనవచ్చు. దీనికి క్రీ. శ. 749 తరువాత ప్రభుత్వాదరణ కూడ లభించినది. దాని సూత్రాలు :

1. దైవం ఒకటే.

2. దైవం న్యాయం పరిసక్తి పెట్టుకోడు. మానవుడు నిర్వహించలేని భారాన్ని భగవంతుడు మనిషిపై మోపడు గనుక మంచి చెడులను తన వివేచనను అనుసరించి మనిషే తెలుసుకోవాలి.

3. పాపం చేసిన మానవుడు విశ్వాసానికీ, అవిశ్వాసానికీ మధ్యలో ఉంటాడు.

4. దైవం శాశ్వతం. కాని దైవ వాక్కు అయిన ఖురాన్ శాశ్వతం కాదు.

5. దైవంలో ధర్మనీయతు వస్తువులు ఉండవలసిన పరిస్థితులు లేక పోవడంవల్ల దృశ్య విజ్ఞానాధారంగా భగవంతుని ఉనికిని రుజువు చేయటానికి గాని, దైవాన్ని దర్శించటంగాని సాధ్యంకాదు.

6. ప్రవక్త స్వర్గారోహణను భౌతిక దృష్టితో చూడరాదు. రాజ్యాధికారాన్ని వాడి ప్రజలను మంచికి పురికొల్పాలనే సిద్ధాంతాన్ని చేపట్టటంవల్ల ఈ శాఖ పతనమయింది. ప్రవక్త జీవితాన్ని అనుసరించి నమ్రభావాన్ని అలవరించుకున్నవారు, మత కర్తవ్యాలలో, నిమగ్నులయి సన్యాసులయిన వారు 'స్ూఫీలు'గా ఛలామణీ అయ్యారు. కాని నిజమయిన సూఫీ శరీరాన్ని నిర్లక్ష్యం చెయ్యడు. సామాజిక వ్యాపారాలను నిరసించడు. అన్నింటా భగవంతుని చూస్తాడు. భగవంతుని శక్తిని గమనిస్తాడు. అతని సామీప్యాన్ని, సాన్నిహిత్యాన్ని, పర్యాంతర్యామిత్వాన్ని, అంతర్వర్తిత్వాన్ని అవగాహన చేసుకుంటారు. ఈ మార్మికవాదులు (MYSTICS). అయితే వీరికి ఇంత తాత్త్విక ప్రాతిపదిక ఉన్నా ఆచరణలో ఫకీరులుగా, తంత్రగాళ్ళుగా, గారడీ చేసేవారుగా తయారయ్యారు.

విశ్వాసులందరి మధ్యా సోదరభావాన్ని పెంచిన ఇస్లాంలో కులవ్యవస్థ చోటు చేసుకున్నది కాలక్రమేణ. సున్నీలు, షియాలుగా చీలిపోయారు. మహమ్మదు కుమార్తె ఫతీమా భర్త ఆలీ కాలిఫ్ అయితే అతడిని ప్రత్యర్థులు హత్యచేశారు. ఆలీ అనుయాయులు షియాలయ్యారు. వీరు ఇప్పటికీ ఇరాన్‌లో అధిక సంఖ్యలో ఉన్నారు. భారతదేశానికి ఇస్లాం మతానుయాయులుగా వచ్చినవారు తమను అషాౖఫులని, షేక్‌లని, ఖాన్‌లని, పఠాన్‌లని పిలుచుకుంటున్నారు. భారతదేశంలో అనేక మంది ఇస్లాంను స్వీకరించారు. వీరందరి మధ్య వివాహ సంబంధాలు ఉండరాదనే నియమం మత పూర్తిగా లేదు. కాని ఆచరణలో అలాంటి పెళ్ళిళ్ళు జరగటం లేదు.

ఇది ఎక్కువగా భారతదేశంలో ఉత్తరాదిన జరుగుతున్నది. దక్షిణాదిన ఈ పట్టింపులు లేవు. భారతదేశంలో అత్యధిక సంఖ్యాకులు హిందువులు కనుక వారి దురాచారమయిన కులతత్వం ఈ దేశంలో నెలకొన్న ఇతర మతాలవారికీ ప్రాకింది. ఇది కులవ్యవస్థలో ఇమిడిఉన్న దురాచారము అనక తప్పదు.

మహమ్మదు ఆచరణ (సున్నా) ఆదర్శ ప్రాయంగా ముస్లింలు పరిగణించటంతో అనేక అసంబద్ధాలు, చిక్కులు వచ్చి పడ్తున్నాయి అనేక మతాలున్న మన దేశంలాంటి దేశాలలో. వివాహాదులకు మేళతాళాలు పెట్టారు ముస్లింలు. ఊరేగింపులు చేస్తారు. కాని మసీదు ముందు మేళం వాయించరు. ఇతరులు వాయిస్తే కొట్లాటలు జరుగుతాయి. కారణం ఆలోచిస్తే మహమ్మదు జీవితంలో ఒక కథ కనిపిస్తుంది. ఆయన మశీదులో ప్రసంగిస్తుండగా మేళతాళాలతో ఒక ఊరేగింపు వచ్చిందట. ఎవరో కొద్ది మంది తప్ప "విశ్వాసులందరూ" లేచి ఊరేగింపు చూడ్డానికి బయటికి వెళ్ళిపోయారట. అప్పటి నుండి మశీదు ముందు మేళతాళాలను వాయించడం నిషేధించబడింది. ఇలా అనేక విషయాలు ఆయన జీవిత గాథల నుండి పుట్టినవే. పందియెడ ద్వేషము, ఊసరవెల్లి పై కౌర్యం ఇలాంటివే. మహమ్మదు ప్రవక్త కావడం తుది ప్రవక్త కావడం ఈ అరిష్టాలకు మూలం.

మహమ్మదు ఆలోచనా పరుడు. కనుక సందర్భాన్ని బట్టి తనకు అనుకూలంగా అనేక నియమాలను ఏర్పరిచాడు. స్త్రీలపై వ్యభిచారనేరము ఆరోపించడానికి కావలసిన సాక్షుల సంఖ్య, ప్రవక్త భార్యలను తదితరులు వివాహమాడరాదనే సూత్రం, ఏక కాలంలో నల్గురు భార్యలకన్న ఎక్కువ మంది ఉండరాదనే నియమం తనకు వర్తించక పోవడం ఇలాంటివన్ని ఆయన జీవితం నుండి ఉదాహరణలుగా మనం తీసుకోవచ్చు.

"కాబా" దేవాలయంలో పూజలందుకునేది ఒక నల్లబండరాయి. దానిని మోషే పూజించాడని కథ. మరి మక్కాకుపోయి ఆ కాబాను దర్శించటం ఎందుకు ? ఇది ఒక పద్ధతి విగ్రహారాధన కాదా ? ఈ సంశయాలు పోవాలంటే ఆ కాలపు పరిస్థితులను గమనించాలి. అరేబియాలోని తెగలన్నీ మక్కాలోని కాబా దర్శనంకోసం హాజ్ యాత్ర చేస్తాయి. ఒక్క

సారిగా దానిని కాదంటే తన మతం వ్యాప్తి చెందదు. కనుక కాబా దేవాలయంలోని దేవతా విగ్రహాల ఉనికిపై దాడి చేశాడు మహమ్మదు. మక్కా విజయం తర్వాత వాటిని తొలగించాడు. కాని హాజ్‌యాత్రను నిరసించటం అతనికి అలవికాని పని అయింది. ఏకేశ్వరోపాసన పేరుతో కాబా దర్శనాన్ని సమర్థించుకుంటున్నారు ముస్లింలు. ఈ సందర్భంలో ఉటంకించవలసిన మరో విషయం సాధువుల, మహాత్ముల దర్గాలు. విగ్రహారాధన నిరసించే ముసల్మానులు సాధువులు, మహాత్ములు సమాధి చేయబడిన ప్రాంతాలను దివ్య స్థలాలుగా ఎంచినప్పటికీ పూజాపునస్కారాలు చేస్తున్నారు. విగ్రహాలను కాదని శవాలను పూజించటం ఏ మంత వివేకమో! ఏ మతమయినా బహుళ వ్యాప్తి చెందినపుడు ఆయా దేశాలలోని అలవాట్లు, ఆచారాలు దానిని కూడా ప్రభావితం చేస్తాయి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో. అదే జరిగింది ఇస్లాం పట్ల కూడా.

ఇస్లాం మతంలో సంస్కరణకు అవకాశం ఉందా? హిందూమతాన్ని, ఆచారాలను పరిదిద్దటానికి భావవికాసోద్యమ మూలపురుషుడుగా రాజారామ్మోహనరాయ్ అవతరించినట్లుగా ముస్లిం సమాజంలో మహత్తర వ్యక్తి ఉద్భవించగలడా అనే ప్రశ్న అనేక మందిని ఇప్పటికీ కలవర పరుస్తూనే వున్నది. మొగలాయీ సామ్రాజ్య పతనానంతరం బ్రిటిషు ప్రభుత్వంపై ద్వేషం పెంచుకుని ముసల్మానులు ఇంగ్లీషువారికి, వారి భాషకు దూరంగా ఉన్నారు. ఆ సమయంలో సయ్యద్ అహ్మద్‌ఖాన్ (1817-90) అలీఘరులో అంగ్లో ఓరియంటల్ కాలేజీని స్థాపించాడు. ముస్లింలకు ఇంగ్లీషు విద్య నేర్పించటం, ఇస్లాం సూత్రాలను హేతుబద్ధంగా అవగాహన చేసుకొనుట ఈ రెండూ ఆ కాలేజీ లక్ష్యాలు. మొదట్లో వారి మాటలు, చేతలు స్వేచ్ఛా ప్రియులలో, సత్యాన్వేషకులలో ఎంతో ఆశను రేకెత్తించాయి. కాని తర్వాత అది అలీఘరు విశ్వవిద్యాలయంగా మారి ముస్లిం సనాతనత్వానికి కూడలి అయింది. ముస్లింలను, హిందువులను వేరుచేసింది. ఈ పరిణామం శోచనీయంగా కన్పడినా తీవ్రంగా ఆలోచిస్తే ఇది అనివార్యమనే భావన కలుగుతుంది. ఇటీవల ఖుర్‌ఆన్‌లోని ప్రవచనాలను హేతుబద్ధంగా సమర్థించే ప్రయత్నాలు విపరీతంగా జరుగుతున్నాయి. ఖుర్‌ఆన్‌లోని సార్వకాలిక సత్యాలనే అనుసరించాలనే వారు లేకపోలేదు.

ప్రముఖ గ్రంధకర్త అమీరాలీ మొదలైనవారు ఆ కోవకు చెందినవారు. అలాకాక ఖుర్‌ఆన్‌లోని అన్ని విషయాలను తు. చ. తప్పకుండా పాటించాలని, అనుసరించాలని మౌలానా మౌదూది లాంటి వాళ్ళు రెండవకోవవారు. భారతదేశంలోని జమాఅతె ఇస్లామీ సంస్థ ముస్లిం సంప్రదాయాన్ని స్థిరంగా నెలకొల్పే ప్రయత్నం అమోఘంగా చేస్తూనే వున్నది. ఇటీవల ప్రపంచమంతటా క్రైస్తవంలో, ఇస్లాములో, హిందూమతంలో కరుడుకట్టిన సనాతనత్వం (FUNDAMENTALISM) ప్రబలుతున్నది. ప్రపంచానికి ఈ ఉద్యమాలు ముప్పుతెచ్చి పెట్టాయి వాటిని నిరోధించకపోతే అంధ. విశ్వాసం ప్రాతిపదికగా ఉండటమే. ఆ ఉద్యమాలలోని చెడుగుగా మనం పేర్కొనక తప్పదు.

ముస్లింలు అధిక సంఖ్యాకులుగా ఉన్న పెక్కు దేశాలలో ముస్లిం సామాజిక స్వాతంత్ర్యం, బహుభార్యాత్వము, విడాకులు, మనవర్తి, పిల్లల సంరక్షత్వంలాంటి విషయాలలో-కొద్దోగొప్పో మారుస్తున్నారు. ట్యునీసియా, టర్కీ, ఈజిప్టులాంటి దేశాలలో గుణాత్మకమయిన మార్పులు వస్తే పాకిస్తాను, ఇండొనీషియా లాంటిదేశాలలో కొద్దిపాటి సవరణలు వచ్చాయి. 1939 సంవత్సరం నుండి ఏ సవరణ లేకుండా ఉన్నది ఒక్క భారతదేశంలోనే అనేది గమనార్హం. కాగా మొదటిసారిగా ముస్లిం స్త్రీలకు కోర్టులో దావా చేయుటం ద్వారా విడాకులుపొందేహక్కును 1939 ముస్లిం లా సవరణ చట్టం ప్రసాదించింది. అంతే అంతటితో ఆగిపోయింది సంస్కరణల ప్రయత్నం. దీనికి కారణాలు అనేకం. (1) రాజకీయం. భారతదేశం రెండుగా అంటే పాకిస్తానుగా, ఇండియాగా చీలిపోవడంతో ఇండియాలో ముస్లింలు శాశ్వతంగా అల్ప సంఖ్యాకులుగా ఉండి పోయారు. తమ సంస్కృతి రక్షణ పేరుతో ఉలేమాలు, మౌల్వీలు ఏ మాత్రపు మార్పును సహించలేని స్థితి కలిగింది. (2) ఇస్లాం సామాజిక వ్యవస్థ నిర్మాణం యొక్క ప్రత్యేకత వల్ల సంస్కరణ వాదులు దానిలోనుండి ఉద్భవించటం కష్టతరమేకాక అసాధ్యమయింది. (3) పాశ్చాత్య సంస్కృతి ప్రభావానికి, ఆధునిక విజ్ఞానానికి దగ్గరయిన కొలదిమంది ముస్లింలు సంకల్పబలంలేకనో, లేక అశక్తతవల్లనో తమ సమాజాన్ని ప్రభావితం చేయలేక పోయారు. మార్పు కోసం అలజడులు జరగలేదు. (4) స్వరాజ్యానికి పూర్వం - అంటే

1947 కు పూర్వం భారతదేశ మతాలను మన్నిస్తామనే విక్టోరియారాణి ప్రకటనను ఉటంకిస్తూ బ్రిటీషువారు ముస్లిం సామాజిక జీవితాన్ని శాసనం ద్వారా సంస్కరించటానికి పూనుకోక పోవటం మరో ముఖ్య విషయం. (౯) ముస్లింలలో అధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులు కావటం కూడా దానికి దోహదం చేసింది. అందులో ముస్లిం స్త్రీలలో విద్యావ్యాప్తి చాల తక్కువగా ఉండటం. వారికి సామాజిక స్పృహ లోపించటంవల్ల ఏ మార్పుకైనా వారికి చాలా భయం. (౧౦) రాజకీయ కారణాలను పురస్క రించుకొని వెనుకబడిఉన్న అరేబియాదేశపు ముస్లిం రాజ్యాలు ముస్లిం మత ప్రచారం పేరుతో సనాతన ముస్లిం శక్తులను బలపరచడం కూడా జరిగింది.

దేశ పరిస్థితులు మారుతూఉన్నాయి. అన్ని మతాలవారూ తమ సామాజిక వ్యవస్థను మార్చుకుంటున్నారు. ఖచ్చితంగా చెప్పాలంటే మతం మనిషికీ దైవానికీ ఉన్న సంబంధాన్ని నిర్దేశించాలి. అంతేకాని లౌకిక వ్యవహారాలను శాసించటం తగదు. ఒక దేశంలోని ప్రజలందరికీ విశ్వ మానవ సూత్రాలను అనుసరించి ఒకే ఒక వ్యవహార సంహిత ఏర్పడాలి. అంతవరకు ఒక మతం వారు మరొక మతం వారిని అన్యులని, కాఫిరులని, యవనులని పేర్కొని ద్వేషం పెంచుకుంటారు. అలాంటి భావాలు పెరుగు తున్నపుడు సహజీవనం అసాధ్యమవుతుంది. "పవిత్ర యుద్ధాల పేరుతో మత గురువులు తమ అనుయాయులను తదితరులపై ఎగసన తోస్తారు. దాంతో మత కలహాలు, కొట్లాటలు, హత్యలు, దోపిడీలు, గృహదహనాలు, మానభంగాలు, సజీవ దహనాలు పెచ్చుపెరుగుతయి; ఇది మన దేశానికే కాక ప్రపంచానికి కూడ ప్రమాదకారిగా పరిణమించగల పరిస్థితి. దైవంతో విశ్వాసం కలిగి ఉండడం తప్పా, ఒప్పా అనేది వేరు విషయం. ప్రతి వ్యక్తి తనుగా నిర్ణయించుకోవలసిన విషయం. తన ఇచ్చవచ్చినట్లు తన ఇష్టదైవాన్ని - ఇతరులకు ఇబ్బంది, కష్టము, బాధ, అపాయం లేని విధంగా ధ్యానించుకోవచ్చు, ప్రార్థించనూవచ్చు; ఆరాధించవచ్చు. అది పూర్తిగా వ్యక్తిగత విషయంగా మాత్రమే ఉండాలి. అలా రాజ్యాన్ని మతాన్ని వేరుగా చూడగల దృష్టి దేశప్రజలకు కల్గిననాడు మన దేశం పురోగమిస్తుందనుటలో సందేహం లేదు.

ఇస్లాం మతం స్త్రీలకు ఏ హోదాను ఇచ్చిందో, వారికి ఏ బాధ్యతలు, హక్కులు కేటాయించిందో, వారికి ఎలాంటి వెసులుబాట్లు, సౌకర్యాలు సమకూర్చిందో, వారి ఇక్కట్లను ఎంత వరకు తొలగించ గలిగిందో అధ్యయనం చేయుటం భారత మహిళోద్యమ కార్యకర్తలకే కాక సమస్తనారీలోకానికి అత్యవసరం. అందుకే ఈ చిరుపొత్తంలో ముస్లిం స్త్రీల స్థాయి, స్థానం గురించి, ముఖ్యమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో వారి పరిస్థితి ఎలా వున్నదో వివరించ పూనుకోవడం జరిగింది.

2. స్త్రీల హోదా

ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా స్త్రీల హోదా ఆయా సమాజ పరిణామ దశనుబట్టి ఉంటుందని అభిజ్ఞుల అభిప్రాయం. నాగలితో వ్యవసాయం చేసేచోట పురుషులు వ్యవసాయం సాగిస్తారని అందువల్ల అలాంటి సమాజంలో పురుషాధిక్యత ఉంటుందని, అలాగే యురేషియా, ఆసియాలలో మగవారి పెత్తనం సాగే సమాజాలు ఉన్నాయని ఒక వర్గంవారి అభిప్రాయం. పారతో (HOE) వ్యయసాయం జరిగే ప్రాంతాలలో అనగా ఆఫ్రికా ఖండంలో స్త్రీలకు పురుషులతోపాటు సమానహోదా ఉంటున్నదని సిద్ధాంతీకరించడం జరిగింది. (చూడుడు GOODAY PRODUCTION & REPRODUCTION 1976 Quoted in "FROGS in a WELL-Indian women in Purdah" by PATRICIA JEFFERY, Vikas 1979).

స్త్రీలు విత్తనాలు చల్లి వ్యవసాయం సాగించే ప్రాంతాలలో స్త్రీలకు ఎక్కువ స్వేచ్ఛ ఉంటుందని మరో సిద్ధాంతం. అందువల్లనే ఇండియాలో కొండజాతుల్లో స్త్రీలకు ఎక్కువ స్వేచ్ఛ ఉంటున్నదని వ్యాఖ్య. అలాగే వ్యవసాయ రంగంలో స్త్రీలు ప్రాధాన్యత వహించే ప్రాంతాలలో స్త్రీల పరిస్థితి మెరుగుగా ఉంటుందని భావం - బహుభార్యాత్వం, కన్యాశుల్కం, కొంతగా కొంత స్త్రీలకు స్వేచ్ఛ, ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటాయని ఎస్తర్ బోస్ రప్ అనే గ్రంథ రచయిత (Women's Role in Economic Development 1970) భావప్రకటన చేశారు.

చేపలు, కందమూలాలు ఆహారంగా సంపాదించుకొని బ్రతికే రోజుల్లో స్త్రీలు పురుషులతోపాటు నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు కనుక వారి హోదా పెరుగుతుందని వేటద్వారా ఆహార సముపార్జన చేసుకునే సమాజాలలోనూ, పశుపాలన చేసుకుని జీవితం సాగించే సమాజాలలోను స్త్రీల హోదా తగ్గుతుందని వెస్టర్ మార్క్ అనే సామాజిక శాస్త్రజ్ఞుని సిద్ధాంతం.

ఇస్లాం మతం ఉద్భవించిన అరేబియా ఎడారి ప్రాంతమయి ఎక్కువగా వ్యాపారం మీద ఆధారపడిన దేశం. ఒంటెలపై సామాన్లు వేసుకొని

వర్తకులు ఇతర దేశాలకు వెళ్ళి వస్తువుల క్రియ విక్రియాలు చేసే సమాజం. తెగల సమాజం. బానిస వ్యవస్థ ఉన్న సమాజం. ఆ సంఘంలో స్త్రీ ప్రాణం గల వస్తువు. ఆ స్థితినుండి ఆమెకు మరి కొంచెం మెరుగయిన హోదాను కల్పించాడు మహమ్మదు. ఆమెను ద్వితీయ శ్రేణి మానవిగా పరిగణించాడు. ఆమెకు పురుషులతోపాటు సరిసమాన హోదా కల్పించ లేక పోయాడు. వారికి అనేకవిధులు, బాధ్యతలు విధించాడు.

"పురుషులు స్త్రీలకు సంరక్షకులు, అధికారులు (ఖవ్వామ్). అల్లాహ్ వారిలో ఒకరికొకరిపై ఆధిక్యతను ప్రసాదించినందుకు, ఇంకా పురుషులు తమ సంపదను వారికొరకు ఖర్చుచేస్తున్నందుకు. సుగుణవంతులైన స్త్రీలు విధేయతా స్వభావులు. మగవారు లేనప్పుడు అల్లాహ్ రక్షణలో ఉంటూ వారి హక్కుల్ని కాపాడేవారు. తిరగబడతారనే భయం మీకు ఏ స్త్రీల విషయంలోనైతే కలుగుతుందో వారికి నచ్చ జెప్పండి, పడక గదుల్లో వారికి దూరంగా ఉండండి, ఇంకా కొట్టండి. తరువాత వారు మీకు విధేయులైతే అకారణంగా వారిని వేధించటానికి సాకులు వెతక్కండి." (ఖురాన్ : సురా 'అన్‌నిసా' 4-34, 35 ఆయతులు పుట 229 దివ్య ఖురాన్ తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్, హైదరాబాద్). ఋతుస్రావపు రోజుల్లో స్త్రీ సంగమాన్ని నిషేధిస్తూ చెప్పిన వాక్యాలలో "వారు 'స్త్రీలు' పరిశుద్ధులు అయిన తరువాత, అల్లాహ్ ఆదేశించిన విధంగా మీరు వారి వద్దకు పోవచ్చు .... మీ స్త్రీలు మీ యొక్క సేద్యపు భూములు. మీ పొలాలకు మీరు కోరిన విధంగా పోవుటకు మీకు అధికారం ఉంది...." ('అల్‌బఖర' సురా 2-222, 223).

"మగవారికి మహిళలపై ఎలాంటి హక్కులైతే ఉన్నయో, అలాంటి హక్కులే ధర్మంప్రకారం మహిళలకు కూడ ఉన్నాయి. కాని పురుషులకు స్త్రీలపై కొంచెం ఆధిక్యత కలదు. అందరిపై అల్లాహ్‌కు ఆధిక్యత కలదు." ("అల్‌బఖర" సురా 2-228)

"స్త్రీలు, సంతానం, వెండి, బంగారు రాసులు, మేలుజాతి గుర్రాలు, పశువులు, సేద్యపు భూముల వంటి వ్యామోహాల ప్రేమ ఆకర్షవంతం చెయ్య

బడింది. కాని ఇవన్నీ అనిత్యమైన ఐహిక జీవన సంపదలు మాత్రమే. అసలైన ఉత్తమ నివాసం అల్లాహ్‌వద్ద ఉన్నదే – చెప్పండి. వీటికన్నా ప్రశస్తమైనదేదో నేను మీకు తెలిపేదా ? భయభక్తులు కలవారి కొరకు వారి ప్రభువువద్ద ఉద్యానవనాలు ఉన్నయ్. వాటి క్రిందుగా కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ వారికి శాశ్వత జీవితం లభిస్తుంది. పవిత్ర భార్యల సాంగత్యం లభిస్తుంది." (సురా "ఆలి ఇమ్రాన్." 3-14,17)

దీనినిబట్టి తేలిన విషయాలు :

1. స్త్రీ పురుషులందరూ అల్లాహ్‌దాసులు.
2. స్త్రీలు పురుషుల ఆధిక్యానికి లోబడి ఉండాలి.
3. లైంగిక జీవితము విషయంలో పురుషునికి స్వేచ్ఛ ఉన్నది; స్త్రీ అతను కోరితే విధిగా అంగీకరించాలి.
4. భార్యను శిక్షించటానికి భర్తకు అధికారం ఉన్నది.
5. భార్యను పోషించేవాడు కనుక భర్తకు ఆధిక్యత వుండాలి, అతని ఆజ్ఞ ఆమె పాటించాలి.
6. స్త్రీలు వ్యామోహాన్ని రేకెత్తించే వస్తువులతో సమానం. కనుక వారిని కనిపెట్టి వుండాలి.
7. స్వర్గంలో పురుషులకు పవిత్ర భార్యలు లభిస్తారు. (స్త్రీలకు పవిత్ర భర్తలు లభిస్తారని చెప్పలేదు సుమండీ.)
8. స్త్రీలు సర్వదా సంరక్షణలో ఉండవలసినవారే.

ఇలాంటి సూత్రాలను 'ప్రవచించిన' మహమ్మదును ఈ కాలంలో, విశ్వమానవ హక్కుల ప్రకటనను సభ్యతకల దేశాలు ఆమోదించిన ఈ రోజులో, చంద్రుణ్ణి గోళంగా గుర్తించి, చంద్రుడి నెత్తిపై కాలూని నప్పుడు మనం ఎందుకు అనుసరించాలి ? ఎలా ఆమోదించాలి ? వాటిని పట్టుకొని ప్రేలాడేవారు మధ్యయుగపు మనస్తత్వంతో కొట్టుమిట్టాడేవారని గ్రహించక తప్పదు. మహమ్మదు వాడిన తర్కం నిరుపయోగమని తేలటం లేదా ? భార్యలుగా ఉన్న స్త్రీలు తమ స్వశక్తితో సంపాదించు కుంటూ ఆర్థిక స్తోమత్తు కలిగి ఉన్న ఈ శతాబ్దంలో 'ప్రవక్త' వాదనలు

హూష్కాకీ అంటూ ఎగిరిపోదా ? ఆ వాదననే అంగీకరిస్తే భార్యలచేత పోషింపబడే పురుషులు భార్యలకు విధేయులుగా ఉండాల్సిందే కదా! వాస్తవానికి స్త్రీ పురుషులలో ఎవరూ ఎవరికీ లోబడి వుండనవసరం లేదు. ఇరువురూ సమానులు. సమాన హోదాతో పరస్పర గౌరవంతో వ్యవహరించుకోవటం జరగాలి.

స్త్రీలు వచ్చినపుడు మహమ్మదు లేచినిలబడేవాడని చెప్తారు. ముస్లిం పురుషులు తమ భార్యలను "జీ" (అండీ) అని సంభోధిస్తారని వింటున్నాం. అంతవరకూ మంచిదే. కాని సమగ్రంగా చూస్తే, సమ్యక్ దృక్పథంతో చూస్తే ముసల్మాను పురుషులు స్త్రీలను చిన్నచూపు చూస్తారనేది నగ్నసత్యం.

3. వివాహము : ఆచారపరమైన విధులు

ఇంచుమించుగా అన్నిమతాలు స్త్రీలకు వివాహాన్ని ఒక గొప్ప సంస్కారంగా నిర్ణయించాయి. ముసల్మాను మతంలో వివాహం స్త్రీ పురుషుల మధ్య ఒక ఒడంబడిక (ఖరారు). బాల్య వివాహం నిషేధింపబడ లేదు. సంరక్షకుడు బాలికను పురుషునికిచ్చి వివాహం చేయవచ్చును. ఆమె వ్యక్తురాలయిన తర్వాత, 15 సంవత్సరములు నిండిన తరువాత ఆమె తన భర్తతో దాంపత్య జీవితం ప్రారంభించక ముందు ఈ వివాహాన్ని కాదని రద్దు చేయవచ్చు. ఇది ఆనాడు అభ్యుదయకరమైన హక్కుగా పరిగణించవచ్చు. 1978 తర్వాత వరునికి 21 సంవత్సరాలు నిండాలి, వధువుకు 18 సంవత్సరాలు నిండాలి అనే శాసనం అమలుల్లోకి వచ్చింది.

ఇస్లాం మత స్థాపనకు పూర్వం వివాహానికి వావివరుసల పట్టింపు చాల తక్కువగా ఉండేది. ఉదాహరణకు ఒక వ్యక్తి చనిపోతే, అతనికి అనేక మంది భార్యలుంటే, అతని కుమారుడు తన తల్లిని తప్ప తతిమ్మా వారిని అంటే సవతి తల్లులను తన భార్యలుగా స్వీకరించే ఆచారం ఉండేది. మహమ్మదు దానిని 'హరాము' (నిషేధం) చేశాడు. "అన్నిసా" సురాలో 4-23, 24 ఆయతులలో ఈ విషయం స్పష్టీకరించబడింది.

"మీ కొరకు 'హరాము' చెయ్యబడ్డారు : మీ తల్లులు, కుమార్తెలు, సోదరీమణులు, మీ తండ్రి సోదరీమణులు, తల్లి సోదరీమణులు, మీ సోదరుల కుమార్తెలు, మీ సోదరీమణుల కుమార్తెలు, మీకు పాలిచ్చిన తల్లులు, మీతోపాటు పాలు త్రాగిన సోదరీమణులు, మీ భార్యల తల్లులు, మీ భార్యల కుమార్తెలు, ఎవరైతే మీ సంరక్షణలో పెరిగారో/-అంటే మీరు సంభోగించిన భార్యల కుమార్తెలు: అయితే ఒక వేళ (కేవలం వివాహం అయి) సంభోగించడం జరిగి ఉండకపోతే (వారికి విడాకులిచ్చి వారి కుమార్తెలను వివాహమాడటం) మీకు దోషంకాదు- మీ జఘనం నుండి పుట్టిన మీ కుమారుల భార్యలు, ఇంకా ఏక కాలంలో ఇద్దరు సోదరీమణుల్ని కలిపి భార్యలుగా ఉండటం కూడా నిషిద్ధం (హరామ్) చెయ్యబడింది. భార్యల

జరిగిందేదో జరిగిపోయింది. అల్లాహ్ క్షమించేవాడు కరుణించేవాడూను. ఇంకా ఇతరుల వివాహబంధంలో వుండే స్త్రీల కూడా మీకు హరామ్. మీ చేతికి (యుద్ధంలో) లభించిన స్త్రీలు తప్ప. ఇది అల్లాహ శాసనం. దీనిని మీరు విధిగా పాటించాలి''.

పిల్లలను దత్తుచేసుకోవటం అనేది ఇస్లాంలో లేదు (33–4). కనుక పెంపుడు కుమారుని భార్యను ఏ పురుషుడైనా వివాహం చేసుకోవచ్చునన్న మాట. మహమ్మదు వద్ద ఒక బానిస వుండేవాడు. అతని పేరు జయ్యద్. అతనిని కుమారునిలా పెంచాడు. అతనికి ఒక అమ్మాయిని ఇచ్చి పెండ్లి చేశాడు. వారి దాంపత్య జీవితం దుఃఖ భాజనమయింది. అంత జయ్యద్ చేత ఆమెకు విడాకులిప్పించి మహమ్మదు ఆమెను-జీనాబ్‌ను-వివాహ మాడాడు. దీనిని సురా 33–37 ఆయత్‌లో సమర్ధించుకున్నాడు. అందువలన జఘనంలోనుండి పుట్టిన కుమారుని భార్యను మాత్రమే వివాహమాడరాదని శాసించాడు. ఇది మహమ్మదు తెలివితేటలకు నిదర్శనం కావచ్చును. కాని అరాజకవ్యవస్థలో ఉన్న అరేబియాదేశ సమాజాన్ని సంస్కరించిన ఘనత మహమ్మదుది.

అతడు ఏర్పరచిన వివాహవ్యవస్థ పురుషులకు అనుకూలంగా ఉన్నా, వివాహ వ్యవస్థ ప్రాశస్త్యాన్ని నొక్కి చెప్పాడు. "విశృంఖల కామ క్రీడ లకు ఒడికట్టరాదు" అని 4వ సురా 24–25 ఆయతులలోనే చెప్పాడు. ఎవరికైనా వివాహానికి ముస్లిం వనితలభ్యం కాకపోతే ముస్లింలైన బానిస స్త్రీలలో ఎవరినైనా వివాహం చేసుకోమన్నాడు. ఇస్లాం మతాన్ని అంగీక రించిన బానిస స్త్రీ మతాన్ని స్వీకరించని కులీన స్త్రీ కన్న ఎంతో మేలు. అని 2–221 లో చెప్పబడింది.

వితంతు వివాహం :– సనాతన హిందూమతం విధించిన వైధవ్యాన్ని స్త్రీలపై ఇస్లాం విధించలేదు. 1856 బ్రిటిషువారి ధర్మమా అని హిందూ వితంతు వివాహశాసనం వచ్చింది. అలాంటి అవసరం ఇస్లాంకు లేదు. వితంతువు, ఎవరి సమ్మతితో నిమిత్తం లేకుండా, స్వేచ్ఛగా తన ఇచ్చ వచ్చిన పురుషుని వివాహమాడవచ్చు ముసల్మాను మత ధర్మం ప్రకారం.

మహమ్మదు ఖదీజా అనే వితంతువును వివాహమాడి సుమారు 25 సంవత్స రాలు ఏకపత్నీవ్రతుడుగా ఉన్నాడు. ఆమె క్రీ. శ. 619 లో చనిపో యింది. తరువాత మహమ్మదు పది మంది స్త్రీలను వివాహమాడాడు. అందులో 8 మంది విధవలు, ఇరువురు కన్యలు. అనాధ స్త్రీలను అనేకమంది సంరక్షకులైన పురుషులు, ఇస్లాం మతవ్యాప్తికి పూర్వం, దుర్మార్గంగా వాడు కునేవారు. ఆ పద్ధతిని నిరసించాడు మహమ్మదు. "అన్‌నిసా" 48- అనే సురాలో అనాధుల ప్రసక్తి ఉంది.

"అనాధల ఆస్తిని వారికి వాపసు ఇవ్వండి." (4-2)

"అనాధలకు న్యాయం కలుగజేయలేమని మీకు భయం కలిగితే, మీకునచ్చిన స్త్రీలను ఇద్దరేసిగాని, ముగ్గురేసిగాని, నలుగురేసిగాని వివాహం చేసుకోండి. అయితే వారితో న్యాయంగా వ్యవహరించలేమనే సంశయం మీకుంటే అప్పుడు ఒకామెనే చేసుకోండి. లేదా మీ స్వాధీనం లోకి వచ్చిన స్త్రీలను దాంపత్యంలోకి తీసుకోండి. అన్యాయానికి దూరంగా ఉండేందుకు ఇది అత్యుత్తమ మార్గం." (4-3.)

"అనాధలు పెళ్ళి ఈడుకు వచ్చేవరకు వారిని పరీక్షిస్తూ వుండండి. వారు యోగ్యులయ్యారని మీరు భావించినపుడు వారి ఆస్తివారికి అప్ప చెప్పండి. (ఖురాను 4-6)

ఆనాడు యుద్ధాలు జరిగేవి కదా ! అనేక మంది పురుషులు చని పోయేవారు. వారి భార్యలు అనాధలయితే వారి రక్షణకోసం ఈ నియమా లను ఏర్పరిచాడు మహమ్మదు.

మహర్ (ఓలి) : ఇస్లాంకు పూర్వం ఓలి పద్ధతి ఉండేది. హిందు వులలో ఒకనాడు కన్యాశుల్కమున్నట్లే అక్కడా సాగింది. ఆ శుల్క ధనాన్ని వధువు తండ్రి తీసుకునేవాడు. అది వధువుకు దక్కేది కాదు. ఆ ధనం ఆమెకే చెందాలని మహమ్మదు కట్టడి చేశాడు. ఇది గొప్ప చర్యగా మనం అభివర్ణించవచ్చు.

మహర్ చెల్లించటం భర్తకు ముఖ్య విధిగా మహమ్మదు పేర్కొన్నాడు. ఆ అంశాన్ని పదే పదే నొక్కి చెప్పడం జరిగింది. బానిస స్త్రీని వివాహం చేసుకున్నా మహర్ చెల్లించమన్నాడు. (ఖురాన్ 4-24, 25)

"మీరు ముట్టుకోక పూర్వమే మీ స్త్రీలకు విడాకులిస్తే ఒక వేళ అప్పటికేవారి మహర్ నిర్ణయింపబడితే అప్పుడు సగం మహరును చెల్లించవలసి వుంటుంది." (2-236, 237) వివాహం ఒప్పందం కనుక కొంత ధనం తీసుకోటానికి అంగీకరించి స్త్రీ పురుషుడి అధీనంలోకి పోతున్నది. ఇస్లాం రాజ్య స్థాపనకుపూర్వం ఆమె తండ్రి ఆమెను విక్రయించేవాడు; ఇపుడు ఆమె తనను విక్రయించుకుంటున్నది. అరేబియా బేహారుల క్రియ విక్రియాల భాషలో ఇది సమ్మతం కావచ్చును కాని నేడు ఇది ఆమోదయోగ్యం కానే కాదు.

మహమ్మదు ఎంత సద్బుద్ధితో శాసించినా ఒక పొరపాటు జరిగింది. "స్త్రీ ఉదారబుద్ధితో వ్యవహరించి (మహర్‌ను క్షమించి విడిచిపెట్టి) నట్లయితే లేక నికాహ్ అధికారం కలిగి ఉన్న పురుషుడు ఔదార్యం వ్యక్తంచేసి (పూర్తిగా మహర్ చెల్లించి) నట్లయితే అది అభ్యంతరకరం కాదు......" అని అదే ఆయతులో చెప్పబడింది. ఇలాంటి ఏర్పాటే కాపురం చేసిన స్త్రీ విషయంలోనూ జరిగింది. తనకు రావలసిన మహర్‌ను ఆమె ఔదార్యంతో వదులుకోవచ్చును. ఈ పద్ధతివల్ల వచ్చిన పరిణామాలను అధ్యయనం చేయటం ఆసక్తిదాయకం. మహర్ రెండురకాలు - మహర్ మూజ్జల్ (PROMPT DOWER) మహర్ మువజ్జల్ (DEFERRED DOWER). ఆమె కోరినపుడు చెల్లించవలసినది మొదటిది. విడాకులవల్లగాని భర్త మరణంవల్లగాని వివాహం రద్దు అయినపుడు చెల్లించవలసినది రెండవది. పది దిర్హాములు (అరేబియా నాణెము)కు మహర్ తగ్గరాదు. ఎంతయినా ఉండవచ్చును. తెలుగునాట 125, 250, 525, ఇలా 5250 రూపాయల వరకూ మహర్ చలామణీలో ఉంటున్నది. భర్తకు విడాకులిచ్చే అధికార ఏక పక్షంగా ఇస్లాం మతంలో (తలాక్ ద్వారా) ఉన్నది కనుక ఈ మహర్ ఎక్కువగా ఉంటే భర్త త్వరపడి భార్యకు విడాకులివ్వజాలడని కొందరు వాదించవచ్చు. సిద్ధాంతరీత్యా ఇది సరిగానే కన్పట్టుతుంది. కాని ఆచరణలో ఇది వక్రీకరించింది. కారణాలు ఒకటి కాదు అనేకం.

1. పరిహారం (CONSIDERATION) లేక ప్రతిఫలం లేకుండానే భార్య మహరును వదులుకోవచ్చును. శోభనపు గదిలోకి వెళ్ళేముందు వధువుచేత మహరును వదులుకున్నట్లు వ్రాయిస్తున్నారు ఆమె అత్త, ఆడు బిడ్డలు. కాకపోయినా సంతానం కలిగిన తర్వాత ఏ భార్య తన సంతానపు రక్షణను పోషణను విస్మరించి ఆ కొద్దిపాటి మహరును అడుగుతుంది ? ఆమె అడగటం లేదు. ఎక్కడో ఒకచోట పది లక్షల కుటుంబాల కొకరు మహరును భర్త దగ్గర వసూలు చేయడం జరుగుతున్నది.

2. పురుషుడు ఏకకాలంలో నలుగురు భార్యలను కలిగి ఉండ వచ్చు. కనుక మరొక స్త్రీని వివాహమాడి ఆమెతో కులుకుతూ మొదటి భార్యను బాధించవచ్చును; ఆమెకు విడాకులివ్వ నిరాకరించవచ్చును. 1939 చట్టం ప్రకారం ఆమె విడాకులను కోర్టుద్వారా పొందవచ్చును. కాని అది వ్యయప్రయాసలతో కూడిన పని. కనుక ఆమె మహరును వదులుకొని (పరిస్తితుల వత్తిడివల్ల) భర్తచేత 'తలాక్' (విడాకులు) పొందుతుంది. ఇది వాస్తవంగా అనేక కుటుంబాలలో జరుగుతున్న మామూలు సంఘటన.

3. మహర్ మొత్తాన్ని లాంఛన ప్రాయంగా తక్కువగా నిర్ణయిం చటం జరుగుతున్నది. ఇలా మహరు ఏర్పాటువల్ల ఆచరణలో ఏమీ లాభం కలగటం లేదు. పురుషుడి నిర్నిబంధ అధికారానికి నిరంకుశత్వానికి అది అడ్డుగోడగా ఉండటం లేదు.

4. ఒకవేళ భార్య ఎపుడుకోరితే అపుడు చెల్లించవలసిన మహర్ ఏర్పాటయినదనుకుందాం. కాని ఆమె ఆ మహర్ అడిగితే భర్తకు కోపం వచ్చి వెన్వెంట మూడు పర్యాయాలు 'తలాఖ్' అని ఉచ్చరిస్తే వివాహం రద్దు అవుతుంది కదా ! తెలిసి ఏ భార్య ఆ పరిస్తితిని కోరితెచ్చు కుంటుంది ?

5. మహరును కోరి వసూలు చేసిన స్త్రీని సాటి స్త్రీలు చులకనగా చూస్తారు. ఈ మహర్ యొక్క గొప్పతనాన్ని గురించి గానంచేసే ఇస్లాం మతాభిమానులు పై ప్రశ్నలకు జవాబులు చెప్పవలసి ఉంటుంది. ఏది

ఏమయినా ఇచ్చే మహర్ చాలా కొద్ది. అది పుచ్చుకున్న వారిని సాంఘికంగా పొగరుబోతుగా వర్ణిస్తారు. అందువల్ల ఆ హక్కు వమ్ముఅవుతోంది.

దాంపత్య జీవితంలో భార్య బాధ్యతలు, విధులు :-

1) వివాహము అయినప్పటి నుండి భార్య భర్తయెడ విశ్వాసంతో ప్రవర్తించవలెను.
2) ఆమె ఆరోగ్యానికి, సభ్యతకు భంగం లేకుండా ఆమె సహేతుకమైన సమయాలలో, ప్రదేశాలలో భర్తకు తన లైంగిక సాంగత్యాన్ని అందించవలెను.
3) విడాకులు ఇవ్వబడిన తరువాత లేక భర్త మరణానంతరం ఆమె 'ఇద్దత్' గడువును పాటించవలెను.
4) భర్తయొక్క సహేతుకమైన ఆజ్ఞలను పాలించవలెను.
5) సహేతుకమయిన కారణముంటే తప్ప భర్త ఎచ్చట కాపురముంటే అచ్చట కాపురముండవలెను లేక భర్త వెన్వెంట పోవలెను.
6) భర్తయొక్క సంచార స్వాతంత్ర్యాన్ని భర్త సహేతుకమైన అదుపులో ఉంచవచ్చును. ఇలాంటివింకా కోకొల్లలుగా ముస్లిం గృహిణుల విధులుగా నిర్వచించారు.

ఆమె హక్కులు :-

1) తనకు నిర్ణయింపబడిన మహర్‌ను కోరవచ్చును.
2) తన పోషణ బాధ్యతను భర్తను స్వీకరించమని కోరవచ్చును.
3) తనకూ, తన భర్తకూ అలాయిదాగా ఒక గది వాడుకకు కావలెనని ఆమె అడగవచ్చును.
4) ప్రతి శుక్రవారం తన తల్లి దండ్రులను చూడవచ్చును లేక వారువచ్చి ఆమెను చూచి పోవచ్చును. దగ్గర బంధువులు సంవత్సరానికి ఒకసారి వచ్చి ఆమెను చూడవచ్చు లేక ఆమె వెళ్ళిరావచ్చు. పూర్వపు భర్తవల్ల కలిగిన సంతానం సహేతుకమయిన వ్యవధిలో వస్తూపోతూ ఉండవచ్చును.

5) తన సవత్నులతో సమానంగా అన్ని విషయాలలో ఆమె భర్త సాంగత్యాన్ని, ఆమె భర్త ఆదరాన్ని పొందడానికి ఆమె అర్హురాలు.

6) 1939 సంవత్సరపు వివాహరద్దు శాసనం ప్రకారం ఆ పరిస్థితులుంటే ఆమె వివాహపు రద్దును ఆశించవచ్చును. ముస్లిం లా ప్రకారం వివాహం కాంట్రాక్టు కనుక ఈ క్రింది అంశాలను నిర్ణయిస్తూ వివాహమపుడుకాని తరువాతకాని ఆమె భర్తతో ఒప్పందం చేసుకోవచ్చును.

1) ఆమె మైనారిటీ దశలో ఆమె పుట్టింటిలో మూడు సంవత్సరాలకు మించకుండా భర్త కాపురముండవలెను.

2) ఆమె తప్పులేకుండా భర్త ఆమెను కొట్టరాదు, ఆమెను కష పెట్టరాదు. ఆమె కోరినప్పుడు ఆమెకు మహర్ చెల్లించవలెను.

3) భర్త గౌరవప్రదమైన జీవితము గడుపుతూ, ఆమెను పోషిస్తూ, ఆమె, ఆమె తల్లిదండ్రులు ఆమోదించిన ఇంట కాపురముండవలెను.

4) తగాదాలువస్తే విడాకులిచ్చుటకు ఆమెకు హక్కుకలదు.

5) ఆమెకు మానసిక వ్యధ కలుగచేయరాదు. దుర్నీతితో సంచరించరాదు.

6) కొంత నిర్ణీతమైన గడువుకు ఆమెకు వేరే భరణం ఇవ్వవలెను.

7) భర్త ఆమె ఆభరణాలను తిరిగి ఇవ్వవలెను.

8) భర్త మతం మారరాదు.

ఈ షరతులకు భిన్నంగా అతడునడిస్తే ఆమె ఆతనికి తలాక్ ఇవ్వవచ్చును. దానిని 'తలాక్ తఫ్వీజ్' అంటారు.

ఇదంతా చదివితే భార్యకు చాల హక్కులున్నట్లు అనిపిస్తుంది. 'లా' వేరు. ఆచరణ వేరు. ధర్మశాస్త్రాలతో, చట్టాలలో రాయబడ్డ హక్కులూ ఆచరణలో మృగ్యమవుతున్నాయనేది అందరికీ తెలిసిన విషయమే కదా!

బహుభార్యాత్వం :- ఈ అంశాన్ని గురించి వాదోపవాదాలు తర్క వితర్కాలు అనేకంగా ఉన్నాయి. ఇస్లాం ప్రకారం ముసల్మాను పురుషుడు ఏక కాలంలో నలుగురు భార్యలను కలిగి యుండవచ్చును. కాని అందరిని సమదృష్టితో చూడాలి. "అయితే వారితో న్యాయంగా వ్యవహరించలేమనే సంశయం మీకు ఉంటే, అప్పుడు ఒకామెనే చేసుకోండి" (ఖురాన్ 4-4) ఇది న్యాయమా; సాధ్యమా అనేది చర్చనీయాంశం. "భార్యల మధ్య పూర్తి న్యాయం చెయ్యటం శక్తికి మించిన పని. మీరు ఎంతకోరినా దీనిని సాధించ లేరు. కనుక ఒక భార్యవైపుకు ఎక్కువగా మొగ్గి మరొకామెను అనిశ్చిత స్థితికిలోను చెయ్యకండి." (4-128-134) ఖురాన్‌లోనే ఇది దుస్సాధ్యమని తేలుతోంది.

ముస్లింలకు ఏక పత్నీత్వం ఆదర్శమని, బహుభార్యాత్వం విశేష ధర్మమని కొందరు ఇస్లాంను సమర్థిస్తారు. ఖుర్‌ఆన్‌ను ఇంగ్లీషులోకి తర్జుమాచేసిన పిక్‌థాల్ అలాంటి వ్యక్తి. ముస్లింకు నలుగురు భార్యలకన్నా ఉండరాదు. మరి మహమ్మదుకు పది మంది భార్యలు. రాజ్యాధినేతగా, స్త్రీల రక్షకుడుగా మహమ్మదుకు ప్రత్యేకమైన వెసులుబాటును దైవం కల్పించాడట. ఇది ఒక సమర్థన. మరిమొకటి ముసల్మానులు ఏక పత్నీవ్రతులని సిద్ధాంతీక రించటం. ఈ వ్యాఖ్యానికి వ్యతిరేకంగా సనాతన ముస్లిం ప్రతినిధి మౌలానా సయ్యిద్ అబుల్ ఆలామౌదూది (రహ్మలై) ప్రకటిస్తున్నారు. "పాశ్చాత్యుల దృక్పథాల ప్రాబల్యానికి, బానిసత్వానికి గురిఅయిన కొందరు, బహు భార్యాత్వపు పద్ధతిని (ఇది పాశ్చాత్యుల దృష్టికోణంలో మౌలికంగా తప్పుడు పద్ధతి) రూపుమాపటమే ఖురాన్ ఉద్దేశ్యం అని నిరూపించడానికి ప్రయత్నం చేస్తారు. అయితే ఇటువంటి మాటలు మానసిక బానిసత్వంవల్ల ఉత్పన్నమవుతాయి. స్వతహః బహుభార్యాత్వం ఒక చెడు అవటమే అసలు ఒప్పుకోదగ్గ విషయం కాదు; ఎందుకంటే కొన్ని పరిస్థితుల్లో ఇది ఒక నాగరిక, నైతిక అవసరం అవుతుంది. ఖురాన్ స్పష్టమైన మాటల్లో దీన్ని ధర్మసమ్మతం చేసింది. మరియు సూచన ప్రాయంగానైనా సరే దాన్ని నిరసిస్తూ ఏ పదాన్నీ ఉపయోగించలేదు అది దాన్ని నిజంగానే వారిస్తుందని తెలుసుకోవటానికి. (చూడుడు పుటలు 214, 215

ఖురాన్ (తెలుగు) తెలుగు ఇస్లామియా పబ్లికేషన్స్, హైదరాబాద్ 1981) (ఇందులో వక్కాణింపు మాది).

సురా (4-128-134 ఆయుతులలో బహుభార్యాత్వానికిచ్చిన అనుమతిని ఆచరణాత్మకంగా ఖురాన్ రద్దుచేసిందని కొందరుచేసే వాదనను తిరస్కరిస్తూ తెలుగు ఖురాన్ పుట 275 లో క్రింద వ్యాఖ్య వ్రాయబడింది. ఆ వాదనకు అవకాశంలేదట. దానిని క్రైస్తవ యూరోపియనులను అనుసరించే మహానుభావులే ఆ వాదనను లేవతియ్యదలచుకున్నారట. దీనినిబట్టి తేలుతున్నదేమంటే భారతదేశ ముస్లింలు బహుభార్యాత్వపు హక్కును పట్టుకొని వ్రేలాడదల్చుకున్నారన్నమాట. ఇది ఇస్లాం దృష్టిలో పవిత్రత కావచ్చు కాని మానవత్వ దృష్టితో చూస్తే ముస్లింస్త్రీలపై విషం క్రక్కటమేనని స్థిరీకరించాలి. బహుభార్యాత్వాన్ని పూర్తిగా రూపుమాపలేకపోయాడని మహమ్మదును నిందించి ప్రయోజనం లేదు. అనాటి పరిస్థితులు వేరు. అతని కాలంనాటికి ఒక్కొక్క పురుషునికి వందల వేల భార్యలు, ఉంపుడు కత్తెలు వుండేవారు. అంతవరకు మహమ్మదు సంస్కరణ తేగలిగాడు సంతోషము. ఆ సూత్రం సర్వకాలాలకూ వర్తిస్తుందనడము హాస్యాస్పదం అవక తప్పదు. రెండవది, సనాతన మత గురువుల వ్యాఖ్యానంలోనే ఉన్నదానిని పూర్తిగా తార్కికంగా కొనసాగించక పోవటం. "బహుభార్యాత్వం, కొన్ని పరిస్థితుల్లో ఒక నాగరిక నైతిక అవసరం" అని చెప్పి ఇపుడు ఆ పరిస్థితులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని చర్చించక సమస్యను దాటవేయపూనడం మోసం; అనాగరికతకు చిహ్నం. అనాడు స్త్రీల సంఖ్య ఎక్కువ. పురుషులు యుద్ధాలలో ఎక్కువగా చనిపోయినందున వారి సంఖ్య తక్కువ కనుక అలాంటి ఏర్పాటు అవసరమని భావిస్తే స్త్రీల సంఖ్య పురుషుల సంఖ్యకన్న తక్కువగా ఉన్న పాకిస్తానులోని సరిహద్దు రాష్ట్రంలోనూ, బెలూచిస్థానులోనూ బహు భర్తృత్వాన్ని ఆమోదిస్తారా మౌలానా మౌదూదిగారు? ఆమోదించరు. కారణం ఒకటే. ఒకటే. వారి వాదంలో వారికే నమ్మకం లేదు. పురుషాధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి చేసే వాదన అదనీ, చివర దాకా లాగితే నిలవదనీ వారికి తెలుసు. శారీరక బలానికి ప్రాధాన్యత తగ్గి మేధస్సుకు ప్రాముఖ్యత ఉన్న ఈ శతాబ్దంలో పురుషాధిక్యతను నిలబెట్టాలని ప్రయత్నించడం

హాస్యాస్పదం. అన్ని రంగాలలోనూ, క్షేత్రాలలోనూ స్త్రీలు పురుషులతో పాటు సమఉజ్జీగా ఉంటున్నారు. ఈనాటి లైంగికశాస్త్ర విజ్ఞానాన్ని, మనో విజ్ఞానాన్ని పరిశీలించినా ఉద్వేగ స్థాయిలో స్త్రీ పురుషులు సమదీటులుగా ఉన్నారనే అంశం తెలుస్తుంది. అంధవిశ్వాసమే చుక్కానిగా జీవితనౌకలను నడిపించదలచుకున్న సనాతన చాంధస పండితులు స్త్రీ విమోచనోద్యమాన్ని అరికట్టలేరు సరికదా వారి తిరుగుబాటు ఎదుర్కోక తప్పదు.

భారతదేశ జనాభాలో ఈనాడు ముస్లింలు 100 కి 12 మంది వున్నారు. ముసల్మాను పురుషులలో ఈనాడు 100 కి 90 మంది ఒకే భార్యను కలిగి ఉన్నారు. చాల కొద్దిమంది మాత్రమే బహుభార్యలను కలిగి ఉన్నారన్నమాట నిజం. ఇది ఎలా సంభవించింది ? అధిక సంఖ్యాకులయిన ముసల్మానులు బీదవారు కావటం, 'జనానాకు' (ఇంట్లో స్త్రీలుండేచోటు), 'మర్దానాకు' (పురుషులు తిరుగాడే ఇంటి భాగం) రెంటికీ గృహవసతి లేక పోవటం. అనేకమంది భార్యలుంటే బహు సంతానం కల్గటం, కూర్చొని తినేవారు ఇంట్లో ఎక్కువ మంది కావడంతో జాస్త తెలివి తేటలున్న వారు అందరూ ఏకపత్నీ వ్రతాన్ని అనుసరిస్తున్నారు. ఈ పరిణామం ముదావహం. కాగా ఒంటెత్తు పోకడగా భారత ముస్లింలు బహుభార్యాత్వ సిద్ధాంతాన్ని సమర్థించ ప్రయత్నించటం కొరివితో తలగోక్కోవటం అవుతోంది. సోదర రాజ్యాలైన పాకిస్తాను, ఈజిప్టు, ట్యునీషియా, ఇండొనీషియా పురోగమిస్తుంటే భారత ముస్లింలు ఉష్ట్రపక్షి వైఖరిని ప్రదర్శించటం అనుచితం.

ముస్లింలు అధికంగా ఉన్న టర్కీలో బహుభార్యాత్వాన్ని ఏనాడో నిషేధించారు. టర్కీలో పౌరులందరికి ఒకే ఒక వ్యవహార సంహిత **(COMMON CIVIL CODE)** ఉన్నది. మరణము, విడాకులు, లేక వివాహం కోర్టు ద్వారా రద్దు అయినట్లు ప్రకటన **(NULLITY)** జరిగి పెండ్లి రద్దు అయినపుడే ఎవరయినా మరల వివాహమాడవచ్చు. ట్యునీషియాలో 18వ ఆర్టికల్ ప్రకారం బహుభార్యాత్వం నిషేధింపబడింది. వివాహ దశలో మరియొక వివాహం చేసుకుంటే ఆ దేశంలో 2,40,000 ఫ్రాంకుల జరిమానాయున్నూ, ఒక సంవత్సరము కఠిన శిక్ష విధిస్తారు. సోవియట

రష్యాలో, కమ్యూనిస్టు చైనాలో ముసల్మానులు ఏక భర్తృత్వ ఏకపత్నీత్వ వివాహాన్ని పాటించాలి. ట్యునీషియాలో ఈ శాసనం రావడానికి కారణం ఇస్లాముకు ధర్మశాస్త్రులకు వారు ఇచ్చిన భాష్యం. I) బానిసత్వం, బహుభార్యాత్వం కొరాను పుట్టిన కాలంలో చెల్లుతవేమోకాని ఈనాడు నింద్యము. II) బహుభార్యాత్వములో అందరు భార్యలను సమదృష్టితో (EQUITY) చూడటం కష్టమని ప్రవక్తయే సెలవిచ్చి యున్నాడు. అట్టి చర్య – సమదృష్టితో చూడటం – ఒక్క ప్రవక్తకే చెల్లుతుంది. ఇతరులకు అది వర్తించదు. ఈ రెండవ దృక్పథంవల్ల ఒక పరిణామం సంభవించింది. ఇరాన్, ఇరాక్, సింగపూర్, సిరియాలలో భర్త పునర్వివాహం చెసుకోవాలంటే కోర్టుల అనుమతి కావాలని నిబంధనలు పుట్టాయి. పాకిస్తాను, శ్రీలంక, ఇండోనీషియాలలో అనుమతి ఇచ్చే అధికారం మామూలు న్యాయస్థానాలకు గాక ఇతర సంస్థలకు ఇచ్చారు. ఉదాహరణకు పాకిస్తాన్‌లో 1961 లో పుట్టిన ముస్లిం కుటుంబ ఆర్డినెన్సు ప్రకారం 'మధ్యవర్తి సమితి' అనుమతి లభించాలి. అలాంటి వివాహము అవసరమని, న్యాయమని ఆ సమితికి తోస్తే అనుమతి ఇస్తుంది. అనుమతి లేకుండా మరో పెళ్ళి చేసుకుంటే ఒక సంవత్సరము జైలు శిక్ష, ఐదువేల రూపాయల జరిమానా లేక రెండునూ. ఇలా చుట్టూ ఉన్న దేశాలు మారుతూ ఉంటే భారత ముస్లింలు మాత్రం మార్పును 'ససేమిరా' అంటూ వ్యతిరేకిస్తున్నారు.

బహుభార్యాత్వం భారత ముస్లింలలో వ్యాప్తిలో ఉండడానికి కారణాలు నాలుగు. (i) చాల సందర్భాలలో భర్తలు భార్యలను వదలివేసి వారికి తెలియకుండా మరొక స్త్రీని వివాహమాడటం. (ii) కుటుంబంలో కాపురం చేయడం దుస్సహమైనపుడు భార్య భర్తను వదిలివెళ్తుంది ఆమెకు విడాకులిస్తే మహరు చెల్లించవలసి వస్తుందని అతడు ఆమెకు విడాకులు ఇవ్వడు; మరియొక స్త్రీని భార్యగా స్వీకరిస్తాడు. (iii) ఆర్థికంగా భర్తలపై భార్యలు ఆధారపడి ఉంటున్నారు కనుక అతని ద్వితీయ వివాహానికి ఆమె సమ్మతించటం. (iv) ఇతర మతాలలో బహు భార్యాత్వం అనే వెసులుబాటు లేనందువల్ల పురుషులు ఇతరమతాలనుండి మారి ఇస్లాంను స్వీకరించి ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలను పెండ్లాడడము. (పుట 107 : **Towards Equality, Report of the committee on status of women in India 1974.)**

వివక్ష :- ఇస్లాంకు చెందిన పురుషుడు కితాబియా స్త్రీని "సాహి" (VALID) వివాహం చేసుకోవచ్చును. కితాబియా అంటే బైబిలు పాత నిబంధనలో విశ్వాసమున్న యూదులు, క్రైస్తవులు. అలాగే ముసల్మాను పురుషుడు తాత్కాలికమైన ఒక గడువు మేరకు అగ్నిని ఆరాధించే మతానికి చెందిన స్త్రీని కూడా "మ్యుతా" వివాహ పద్ధతిన పెండ్లాడవచ్చును. కాని ముసల్మానుస్త్రీ ఇస్లామేతర పురుషుని వివాహమాడరాదు. ఇది ద్వంద నీతికి నిదర్శనం.

పురుషుడు ఏకకాలంలో నలుగురు భార్యలను కలిగి ఉండవచ్చును. స్త్రీ మాత్రం ఏక భర్తృత్వ పద్ధతిని అవలంబించవలెను. ఇది పురుషాధిపత్యానికి ఉదాహరణ.

పెండ్లికి ఇద్దరు పురుషులు కాని, ఒక పురుషుడు మరియు ఇద్దరు స్త్రీలు సాక్షులుగా ఉండవలెను. అంటే ఇద్దరు స్త్రీలు ఒక పురుషునితో సమానమన్న మాట.

అలాయిదా ఒప్పందం ఉంటే తప్ప భార్యభర్త ఇంట్లో నివసించాలి. ఆమె రాకపోకలపై అతడు ఆంక్ష పెట్టవచ్చును. అతని రాకపోకలపై ఆమె ఆంక్షలు విధించే శక్తి లేదు.

భర్త భార్యను దండించవచ్చును. భార్య తప్పుచేసిన భర్తను దండించే అవకాశం లేనే లేదు.

ఖురాన్ చదివితే పురుషులను ఎక్కువగా ఉద్దేశించి చెప్పినట్లు తోస్తుంది. మతవిషయంలో సమానత్వం ప్రతిపాదించినట్లు కన్పడినా ఖురాన్‌లో వర్ణింపబడిన స్వర్గం పురుషులకొరకే నిర్మింపబడిందా అనే సంశయం ఉద్భవిస్తుంది. అంటే స్త్రీలు స్వర్గానికి పోరాదా అనే ప్రశ్న రావచ్చును. సురా 66-11 ఆయతులో ఫారోభార్య ఫారో సాంగత్యం లేకుండా స్వర్గంలో ఉంటున్నట్లు చెప్పబడింది. అయితే ముఖ్యంగా స్వర్గంలో వుండేవి ఏమిటి ? అంటే ఉద్యానవనాలు, సొనలు, సిల్కు దుస్తులు, విశాలాక్షులు, సౌందర్యవంతులైన స్త్రీలు (వివాహమాడటానికి), చావులేని స్థితి. (44-52) మరోచోట ఖురాన్‌లో ఇలా చెప్పడం జరిగింది:

తోటలు, ఆరోగ్యంగా తినడం, తాగడం, ఫలాలు, వివిధ మాంసములు, సోఫాలలో ఆసీనులు కావడం, విశాలాక్షులు, సుందర నేత్రులు, ఆయన అందాల బరిణెలైన స్త్రీలతో వివాహం. (సురా 52 : 17 నుండి 20 వరకు ఆయుతులు).

అల్లాహ్‌వద్ద ఉద్యానవనాలు. కాలువలు, శాశ్వతజీవితం, పవిత్ర భార్యల సాంగత్యం ఉంటాయుట (3 : 14-1౬) సురా 55 : 46-78 లో మరో సందర్భంలో స్వర్గాన్ని వర్ణించడం జరిగింది. అంతా మామూలు కథే. తోటలు, నీటిని వెదజల్లే కుళాయిలు, ఫలవృక్షాలు, సోఫాలు, సిల్కువసనాలు, పురుషులచేత దేవతలచేత తాకబడని సుందరాంగులు వగైరా ఉంటాయుట. స్త్రీల చేత తాకబడని పురుషులు, అందము చేత భాసిల్లే పురుషులు వీరిని గురించి ఖురాన్ చెప్పదు. మరి పాపం స్వర్గానికి పోయిన స్త్రీల గతేమిటి. వారికి తోడు అక్కరలేదా ? వారు వివాహమాడటానికి సుందరాకారులైన పురుషులు అవసరం లేదా స్వర్గంలో, ముఖ్యంగా, ప్రముఖంగా పురుషుల భోగలాలసత్వం కోసం స్వర్గం ఏర్పడిందని తెలుతున్నది.

వివాహోద్దేశము :- విభిన్న లింగాలకు చెందిన వ్యక్తుల మధ్య, పరస్పర ఆనందంకోసం, సంతానోత్పత్తి కోసం, సంతానానికి సక్రమ స్థాయినిచ్చే నిమిత్తం వివాహవ్యవస్థ ఇస్లాంలో ఏర్పరచబడింది. వ్యభిచారంలాంటి దుర్మార్గుల నుండి మనస్సును మళ్ళించుకునే నిమిత్తం, ఉద్వేగాలను అదుపులో పెట్టుకోవడానికి నిర్మింపబడిన వ్యవస్థ అది. కనుక ప్రతి వ్యక్తికి వివాహం విధిగా భావించాలి. అంతేగాక పరస్పర సుఖసంతోషాలకోసం ఉద్దేశించబడింది. కనుక వివాహానికి వయస్సు అడ్డురాదు. సంతానోత్పాదనశక్తి లేమీ ఆటంకం కాదు. ఇస్లాం బ్రహ్మచర్యాన్ని ప్రోత్సహించదు. వృద్ధులు, కాటికి కాలుజాచుకున్న వాళ్ళుకూడా వివాహమాడ వచ్చును. అలాంటి పెండ్లిడ్లను ఎవరూ ఎగతాళి చేయరు; నిరసించరు కూడాను.

దాంపత్య జీవితం :- స్త్రీని దాంపత్య జీవిత సందర్భంగా కరుణతో చూడకపోతే ఆమెవల్ల పురుషునికి సుఖప్రాప్తి ఉండదని మహమ్మదుకు

తెలుసు. అందుకే గౌరవప్రదంగా సంసారం చెయ్యమని "అన్‌నిసా" సురాలో (4 : 19-21) లో చెప్పాడు. ఎవడైనా పురుషుడు తన భార్యకు దూరంగా ఉంటానని ప్రమాణంచేసినా వారు నాలుగుమాసాల వ్యవధిలో దాంపత్య జీవితాన్ని మళ్ళీ ప్రారంభించవచ్చన్నాడు మహమ్మదు. (సురా అల్‌బఖర 2 : 224-225). లైంగిక సంపర్కానికి అధిక ప్రాముఖ్యత నిచ్చాడు. వివాహ వ్యవస్థలో దానికున్న ప్రాధాన్యతను గుర్తించాడు.

స్త్రీలను భార్యలుగా ఎపుడు స్వీకరించవచ్చు ? మతానికీ, విశ్వాసానికీ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడా 'దైవ సందేశహరుడు' అని తోస్తుంది.

"ముష్రిక్ మహిళలు విశ్వసించనంతవరకు మీరు వారికి ఎట్టి పరిస్తితుల్లోనూ వివాహమాడరాదు. ముష్రిక్ కులీన స్త్రీ మీకు ఎంత పసందయినా, ఆమెకంటే విశ్వసించిన ఒక బానిస స్త్రీ ఎంతో మేలు. (అదే విధంగా) ముష్రిక్ పురుషులు విశ్వసించనంత వరకు మీరు మీ మహిళలను వారికిచ్చి ఎన్నటికీ వివాహం చెయ్యకూడదు. ముష్రిక్ కులీనుడు మీకు ఎంత నచ్చినా, అతని కంటె ఒక విశ్వసించిన బానిస ఎంతో మేలు...." (అల్‌బఖర 2:221)

"విగ్రహారాధకులనుండి పారిపోయి వచ్చిన స్త్రీలను పరీక్షించండి, వారు నిజమైన విశ్వాసులైతే వారిని తిరిగి పంపవద్దు. వారిని మీరు వివాహమాడవచ్చు. అవిశ్వాసులు ఆ స్త్రీలపై ఖర్చుపెట్టిన సొమ్ము వారికి ఇవ్వండి. అవిశ్వాస స్త్రీలతో బంధాలు, సంబంధాలు తెంచుకోండి. వారిపై మీరు ఖర్చుపెట్టినది తీసుకోండి." (60 : 10)

"మీ భార్యలు అవిశ్వాసులవద్దకు పోతే (యుద్ధంలో పరాజయంవల్ల) వారు తిరిగి యుద్ధంలో విజయంహొందితే, విశ్వాసులైన మీ భార్యలుతిరిగి మీ వద్దకుచేరితే అవిశ్వాసులువారిపై ఖర్చు పెట్టిన పైకం వారికి ఇవ్వండి" (60 : 11).

"విశ్వాసులైన స్త్రీలు మీ వద్దకు వచ్చి మీతో ఉంటామంటే, దొంగతనము చేయమని ప్రమాణం చేస్తే, వ్యభిచరించమని ఒట్టుపెట్టుకుంటే, పిల్లలను చంపము అంటే, అసత్యము పలకమని నమ్మకంగా చెప్తే, మంచి విషయాలలో మీకు విధేయులుగా ఉంటామంటే వారిని మీరు స్వీకరించవచ్చును." (33 : 12)

"యుద్ధంలో బందీలుగా దొరికిన స్త్రీలను వి వా హ మా డ వ చ్చు." (33 : 50) దీనినిబట్టి తేలిందేమిటి ? స్త్రీ ఇంచుమించుగా వస్తువు అనే భావం ఇంకా పోలేదు ఇస్లాంలోకూడ. కనుక పెంపుడు జంతువుపై యజమాని పెట్టిన ఖర్చుకు అతడు హక్కుదారు అయినట్లు స్త్రీలపై పెట్టిన ఖర్చుకు వారిని పోషించినవారు హక్కుదారులవుతున్నారు. ఈ భావమే పై ఆయతులలో కన్పిస్తుంది.

స్త్రీలు : పరిశుద్ధత :- "ఋతుస్రావం (అదొక) అపరిశుద్ధా వ్యవస్థ కనుక ఋతుకాలంలో భార్యలకు దూరంగా ఉండండి. వారు పరిశుద్ధులు కానంతవరకు వారివద్దకు పోకండి. వారు పరిశుద్ధులు అయిన తరువాత, అల్లాహ్ ఆదేశించిన విధంగా మీరు వారి వద్దకు పోవచ్చు." (అల్‌బఖర 2 : 222, 223). ఆదిమ తెగలలో ఋతుస్రావాన్ని చూచి భయపడేవారు మనుష్యులు. దేహ ధర్మం వారికి అర్థమయ్యేది కాదు. అందువలన దానిని అపరిశుద్ధ స్థితిగా భావించటం జరిగింది. అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాడు మహమ్మదు.

"విశ్వసించిన ఓ ప్రజలారా ! మీరు నమాజ్ కొరకు లేచినపుడు, మీ ముఖాలను, మోచేతులువరకు చేతుల్ని కడుక్కోండి; .... మీరు స్త్రీలను ముట్టుకుంటే, అప్పుడు నీరు లభించని పక్షంలో పరిశుభ్రమైన మట్టితో అవసరం తీర్చుకోండి ...." (అల్‌మా ఇద 5 : 6) దీని అర్థమేమిటంటే స్త్రీలు మట్టికంటే హీనులన్న భావం ఇందులో ఇమిడివుంది. నమాజ్ నియమాన్ని గురించి సురా అన్‌నిసా 4 : 43లో "మీరు స్త్రీలను ముట్టుకుంటే మీకు నీరు లభ్యం కాని పక్షంలో పరిశుభ్రమైన మట్టిని ఉపయోగించండి" అని చెప్పాడు మహమ్మదు. దీనిని గురించి తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్సువారు ప్రచురించిన మౌలానా మౌదూది తర్జుమా ఖురాన్‌లో ఇలా వ్యాఖ్య చేయబడింది. "లమ్స్" (తాకటం) అంటే భావం ఏమిటి అనే విషయంలో భేదాభిప్రాయం ఉంది. దీని భావం సంభోగం అని అనేక మంది విద్వాంసులు అభిప్రాయ పడ్డారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ అలై) మరియు ఆయన సహచరులు ఈ అభిప్రాయాన్ని స్వీకరించారు. దీనికి భిన్నంగా, కొందరు ఇతర షరియత్ వేత్తలవద్ద దీనిభావం

తాకటం లేక చెయ్యివెయ్యటం. ఇదే అభిప్రాయాన్ని ఇమామ్ షా ఫయీ (రహ్మఅలై) స్వీకరించారు. ఇమామ్‌మాలిక్ (రహ్మఅలై) అభిప్రాయ మేమంటే, ఒక వేళ స్త్రీ గాని, పురుషుడుగాని, ఒకరినొకరు కామోద్రేకంతో చేత్తో తాకితే, అప్పుడు వారి వుజూ భంగమవుతుంది. కాని కామోద్రేకం లేకుండా ఒకరి శరీరం మరొకరిని తాకితే, అందులో ఏ దోషమూ లేదు."

స్త్రీ పురుష సంగమం ఆనంద హేతువుగా అంగీకరించిన మహమ్మదు నమాజుకు ముందు స్త్రీ స్పర్శ పనికిరాదని నిషేధించారు. స్త్రీని వ్యామోహ వస్తువుల జాబితాలో పేర్కొన్న మన స్తత్వమే ఇచ్చట ప్రదర్శితమవు తున్నది. ఎంత అయినా స్త్రీని చిన్నచూపు చూడటం ఆనాటి పద్ధతి. దానిని అధిగమించలేక పోయాడు మహమ్మదు, ఇది మతదృష్టిలో మహిళ స్థానా నికి నిదర్శనం.

4. విడాకంలు

ఇస్లాం మతంలో విడాకులకు అవకాశం ఉన్నది. 1948 కి పూర్వం హిందూ మతంలో విడాకుల సౌకర్యం లేదు. రోమను కాథలికు శాఖ క్రైస్తవానికి విడాకులలో విశ్వాసం లేదు. కనుక ఒక రకంగా ఇస్లాం మతం ఈ విషయంలో ముందంజ వేసిందనే చెప్పాలి.

ముసల్మాను వివాహం ఈ క్రింది పరిస్థితుల్లో రద్దు అవుతుంది.

i) భర్త మరో మతాన్ని స్వీకరిస్తే

ii) 1939 ముస్లిం వివాహ రద్దుశాసనం క్రిందికి వచ్చే పద్ధతిలో భార్య మరోమతాన్ని స్వీకరిస్తే

iii) విడాకులవల్ల

iv) 15 సంవత్సరాల లోపల స్త్రీకి వివాహం చేయుబడితే, 18 సంవత్సరాలు నిండే లోగా ఈ లోగా, భర్తతో దాంపత్య జీవితం గడపని పరిస్థితిలో ఈ వివాహం తనకు అక్కరలేదని ఆమె తృణీకరిస్తే,

v) ఆ వివాహం నిషిద్ధమైనపుడు వారి వివాహం రద్దుఅవుతోంది. మొదటి నుండీ మతాన్ని గురించి ఇస్లాం ఎంతో పట్టుదలగా ఉంది. ముస్లిం పురుషుడు మతం మారితే అతనిని సంహరించాలి. స్త్రీ వేరొక మతాన్ని స్వీకరిస్తే ఆమె మరల ఇస్లాంను స్వీకరించేవరకు జైల్లో పెట్టాలి. తరువాత ఉధృతం తగ్గింది. ముసల్మాను స్త్రీ ముసల్మానేతర పురుషుని వివాహమాడ రాదు. కనుక భర్త వేరొక మతంలోకి పోతే వివాహం వెన్వెంటనే రద్దు అవుతుంది. కాగా స్త్రీ విషయంలో కొంత తేడా ఉంది. ఆమె మతం మారినా వివాహం రద్దుకాదు. ఆమె ఆ రద్దును కోరవచ్చును. అప్పుడు కోర్టు ఆ వివాహాన్ని రద్దు చేస్తుంది.

విడాకులు ఈ దిగువ నమోదు అయిన రకాలుగా ఉంటాయి.

(i) "తలాఖ్" - భర్త వివాహాన్ని రద్దుచేయుటంవల్ల

II) "ఈలా" 'నీతో సంగమించను' అని భర్త భార్యతో చెప్పి నాలుగు నెలలకు తగ్గకుండా ఆమెకు దూరంగా ఉండటం.
(సురా 2: 226, 227)

III) 'జహర్' భర్త భార్యను "నీవు నా తల్లివి లేక చెల్లెలివి" అనటం అంటే ఎవరినైతే అతడు వివాహమాడరాదో వారితో ఆమెను పోల్చటం.

IV) 'లియాన్' భర్త భార్యను వ్యభిచారిణిగా నిందించుట.

అపుడు ఆమె విడాకులు కోరవచ్చును.

V) 'ఖులా' వివాహబంధం నుండి విడివడటానికి భార్య భర్తకు ప్రతిఫలం చెల్లించి అతని సమ్మతి పొందితే.

VI) 'ముబారత్' భార్యా భర్తల సమ్మతిపై విడాకులు.

VII) 'ఫక్ష్' కోర్టు ద్వారా విడాకులు.

1939 శాసనం ద్వారా లభించేవి ఇవి.

ముస్లిం పురుషుడు తనుగా గాని, లేక ఏజంటు ద్వారాగాని భార్యకు విడాకులివ్వ వచ్చును. ఏదో ఒక సంఘటన జరిగినపుడు విడాకులు ఇవ్వటానికి ఏజంటుకు అధికారం ఇవ్వవచ్చును. పెండ్లి అపుడు కాని తరువాత కాని చేసుకున్న ఒప్పందం ప్రకారం తలాఖ్ ఇచ్చే తన అధికారాన్ని తన భార్యకు దత్తం చేయవచ్చును. దానిని భార్య వినియోగించ వచ్చును. ఆ అధికారాన్ని 'తలాఖ్ – ఇ – తఫ్వీజ్' అంటారు. ఇపుడు కొందరు స్త్రీలు ఈ హక్కును సంపాదించే షరతును నికా అగ్రిమెంటులో వ్రాయిస్తున్నారు. తలాఖ్ నోటిమాటతో గాని వ్రాతపూర్వకంగానీ ఉండవచ్చును.

తలాఖ్ అనేక రకాలుగా ఇవ్వవచ్చును.

1) ఒకసారి తలాఖ్ ఇచ్చి 'ఇద్దత్' గడువు కాలంలో ఆమెకు లైంగికంగా దూరంగా ఉండటం. ఆమె బహిష్టు అయ్యే స్త్రీ అయితే తలాఖ్ ఇచ్చేవ ఆమె 'తుహుర్' ఆమెతో అతడు సంపర్కం లేనివాడై ఉండాలి. దీనిని 'తలాఖ్ అహసన్' అంటారు. (తుహుర్ అంటే బహిష్టుకు బహిష్టుకు మధ్యఉండే గడువు.)

2) a) భార్యా భర్తలు అసలు దాంపత్యజీవితం ప్రారంభించక పోతే ఆమె తుహుర్‌లో ఒక్కసారే తలాఖ్ అనుటవల్ల.

b) భార్యా భర్తలు దాంపత్యజీవితం ప్రారంభించిన వారయివుంటే,

i) బహిష్టు అయ్యే భార్య అయితే, వరుసగా మూడు తుహుర్‌లలో తలాఖ్‌ను ఒక్కొక్కసారిగా మొత్తం మూడుసార్లు ప్రకటించితే,

ii) ముట్లుడిగిన స్త్రీ అయితే, ముప్పైరోజుల వ్యవధిలో మూడుసార్లు తలాఖ్ ప్రకటించి ఆమెతో లైంగిక సంపర్కం లేకుండుట. గర్భిణి స్త్రీ అయితే ప్రసవించువరకు ఆమెకు దూరంగా ఉండుట. ఈ తలాఖ్‌ను 'తలాఖ్ హసన్' అంటారు.

3) a) ఒక్కసారిగా తలాఖ్ ఈ దిగువ విధంగా ప్రకటించి

i) వివాహాన్ని తిరుగులేనివిధంగా రద్దుచేసే సంకల్పం తెలియపరచి

ii) లైంగిక సంపర్కం ఉన్న తుహర్ కాలంలో

iii) దాంపత్య జీవితం గడిపిన భార్య ఋతుకాలంలో

b) ఒక్క వాక్యంలో కాని ఇతరత్రా కాని తలాఖ్‌ను మూడుసార్లు ప్రకటించి

ఈ రకపు తలాఖ్‌ను 'తలాఖ్ ఉల్ బిద్దత్' అంటారు.

తలాఖ్ ఎప్పుడు తిరుగులేనిది దవుతుంది?

1) దాంపత్య జీవితం సాగించని భార్యా భర్తలలో ప్రకటించిన వెన్వెంటనే

2) ఇద్దతు కాలం — నిరీక్షణ వ్యవధి — ముగిసిన తరువాత తలాఖ్ అహసన్ ఖాయమవుతుంది.

3) మూడవసారి తలాఖ్ అనగానే తలాఖ్ హసన్ ఖాయమవుతుంది.

4) తలాఖ్ – ఉల్ బిద్దత్ ప్రకటించిన వెంటనే ఖాయమవుతుంది.

గమనిక :- మనవర్తి విషయంగాను, పునర్వివాహం చేసుకునే స్థితిని నిర్ణయించటంలోనూ ఈ నిరీక్షణా వ్యవధి 'ఇద్దత్' కు చాల ప్రాముఖ్యత ఉన్నది.

తలాఖ్ తిరుగులేనిదయ్యేలోగా భర్త తన పొరపాటును సవరించుకో వచ్చును. "నీతో సంగమించను" అని దేవుని పై ప్రమాణం చేసినా నాలుగు నెలలలోపల మళ్ళీ దాంపత్య జీవితం ఆరంభిస్తే విడాకులు అమలు లోనికి రావు. అలాగే రెండు 'తుహర్' లలో తలాఖ్ అని మూడవసారి అనకుండా దాంపత్య జీవితం ప్రారంభిస్తే విడాకులు ఇచ్చినట్లు లెక్కకాదు. అయితే విడాకులు ఖాయమయిన తరువాత మరల లెంపలు వేసుకొని ఆ భార్యనే మరల వివాహం చేసుకుంటానంటే ఒక ఆటంకం ఏర్పరిచాడు మహమ్మదు. అదేమంటే విడాకుల తదనంతరం ఆమె వదేండ్ల పైన వయస్సుగల మరొక పురుషుని వివాహమాడి, అతనితో దాంపత్య జీవితం గడిపి మరల విడాకులు తీసుకుంటేనే అది సాధ్యం (ఖుర్ఆన్ 2-230). కనుక త్వరపడి తలాఖ్ అనడానికి పురుషుడు జంకుతాడని 'ప్రవక్త' ఉద్దేశం. కాని ఆచరణలో ముస్లిం పురుషులు అలాంటి భయ సందేహాలకు లోనుకావటం లేదు.

తలాఖ్ ఇప్పిస్తానని అత్త, తలాఖ్ ఇస్తానని భర్త క్రొత్తగా కాపురానికి వచ్చిన కోడలును బెదిరిస్తూ, నానా హింసలు పెడ్తూ, చాకిరీ చేయిస్తున్న ముస్లిం కుటుంబాలు చాల హెచ్చుస్థాయిలో వున్నాయి.

ఇక భార్యలకున్న హక్కు — విడాకులు కోరే హక్కును - గురించి కొంత తెలిసికోవటం చాలా అవసరం.

1939 లో శాసనం రాకపూర్వం భర్త నపుంసకుడయితే భార్య విడాకులు కోరవచ్చును. 1939 ముసల్మాను వివాహరద్దు శాసనం తర్వాత ఆమె ఈ దిగువ పరిస్థితుల్లో విడాకులు కోరుతూ కోర్టులో దావావేసి డిక్రీ పొంద వచ్చును.

1) 4 సంవత్సరముల నుండి భర్తజాడ తెలియకపోవటం;

2) 2 సంవత్సరాలు భర్త ఆమెను పోషించకపోవుట, లేక పోషణ విషయంలో నిర్లక్ష్యం చేయుట;

3) 7 సంవత్సరాలు కాని అంతకు పై కాలానికి గాని భర్తకు జైలు శిక్షపడుట;

4) సహేతుకమయిన కారణములు లేకుండానే 3 సంవత్సరములు భర్త తనతో దాంపత్య జీవితం గడపకుండుట ;

5) పెండ్లినాడు భర్త నపుంసకుడయి దావా నాటికి అట్లే ఉండుట;

6) రెండు సంవత్సరముల కాలము భర్త మనశ్చాంచల్యం కలిగి ఉండుట లేక కుష్ఠు వ్యాధివల్ల గాని లేక సుఖవ్యాధి వల్ల గాని రెండు సంవత్సరముల కాలము బాధ పడుచుండుట ;

7) 15 సంవత్సరాల లోపల ఆమెకు గార్డియను వివాహంచేస్తే ఆమెకు 18 సం॥ నిండేలోగా భర్తతో దాంపత్య జీవితం ప్రారంభించక ముందే వివాహాన్ని నిరసించుట ;

8) భర్త ఆమెను క్రూరంగా హింసించినపుడు ;

9) ముస్లిం లా గుర్తించిన ఇతర పరిస్థితుల్లో, అనగా భార్యపై భర్త వ్యభిచార ఆరోపణచేసినపుడు, ఖులా, ముభారత్, తలాఖ్ - ఇ - తఫ్వీజ్ లకు వప్పందం ప్రకారం ఏర్పాటు ఉన్నపుడు.

భార్యను క్రూరంగా హింసించటం అంటే :-

i) ఆమెను శారీరకంగా హింసించడం, శారీరక హింస లేక పోయినా భర్త తన దుర్మార్గమైన నడతవల్ల ఆమెజీవితాన్ని దుఃఖభూయిష్ఠం చేయటం,

ii) చెడ్డ పేరుగల స్త్రీలతో సహవాసం లేక అపకీర్తిపాలయ్యే జీవితం గడపటం,

iii) ఆమె ఆస్తిని విక్రయాదులు చేయటం లేక దానిపై ఆమెను తనకున్న లా ప్రకారం ఉన్న హక్కులను అనుభవించనీయక పోవటం,

iv) ఆమెను అవినీతికర జీవితం గడపమని బలవంతం చేయటానికి ప్రయత్నించటం,

v) ఆమె మతాన్ని ఆమె అనుసరించటానికి, ఆచరించటానికి ఆటంకపరచటం,

vi) అతనికి ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలుంటే ఖుర్ఆన్ ఆదేశాలకు భిన్నంగా అందరినీ సమదృష్టితో చూడకపోవటం.

ఈ శాసనం ముసల్మాను స్త్రీల స్థితిని కొంత మెరుగు పరిచింది. ప్రఖ్యాత ముసల్మాను న్యాయ శాస్త్రవేత్త అమీరాలీ అభిప్రాయాలకు అనుగుణంగా ఈ శాసనం రూపొందించబడింది. ఈ కాలానికి చూచుకుంటే ఇది హిందూ వివాహశాసనానికీ, ప్రత్యేక వివాహశాసనానికీ వెనుకబడి ఉంది. భార్యా భర్తల ఇద్దరి మనస్తత్వాలు కుదిరికలవలేకనే కారణంమీద, పరస్పర సమ్మతిమీద విడాకులకు అవకాశంలేదు ఈ శాసనంలో. భార్యా భర్తలలో ఏ ఒకరు కోరినా, కోర్టులో వారు తమ బాధామయగాధ వినిపించ నవసరం లేకుండానే, వారికి విడాకుల నివ్వవలసిన ఈ 20 వ శతాబ్దంలో ముసల్మాను భర్తకు ఏకపక్షంగా తలాఖ్ విషయంలో సర్వ హక్కులిచ్చి భార్యను కోర్టుల పాలు చేయటం ఏమి న్యాయం? ఈ విషయంలో అరేబియా దేశపు ఆనాటి ఆచారాలను కాదనలేక పోయాడు మహమ్మదు. కాకపోతే స్త్రీలను దయతో చూడమన్నాడు.

> "విడాకులివ్వబడిన స్త్రీని సాగనంపేటప్పుడు మీరు వారికి పూర్వం ఇచ్చిన వాటినుండి దేన్నయినా వాపసు తీసుకోవటం ధర్మసమ్మతం కాదు" (2 : 229)
>
> "మీరు మీ స్త్రీలకు విడాకులిచ్చినపుడు వారికొరకు నిర్ణయింపబడిన గడువు (ఇద్దత్) దగ్గర పడగానే, వారిని సహృదయంతో మీ వద్ద ఉంచుకోవాలి లేదా మంచితనంతో సాగనంపాలి. కేవలం పీడించే ఉద్దేశ్యంతో వారిని మీతో ఉంచుకోవటం అన్యాయం" (2 : 231)

భార్యల హక్కులు లిఖితంగా బాగానేవున్నా ఆచరణలో అవి నెరవేరడం కల్ల.

విడాకుల ఫలితం :-

I) ఇద్దరూ పునర్వివాహానికి అర్హులు.

i) వివాహంలో దాంపత్య జీవితం ప్రారంభింప బడకపోతే విడాకులు అయిన వెన్వెంటనే,

ii) దాంపత్య జీవితం సాగించిఉంటె నిరీక్షణ వ్యవధి (ఇద్దతు ముగిసిన తర్వాత)

పురుషుడు మరొక స్త్రీని, భార్య మరియొక పురుషుని వివాహమాడ వచ్చును. (2 : 231 ఖుర్ఆన్)

2) ఇంతకు క్రితం ఉటంకించబడిన ఆంక్షకు లోనయినవారు మరల ఒకరినొకరు వివాహం చేసుకోవచ్చును.

3) మహర్ వెంటనే చెల్లించవలసి ఉంటుంది.

4) భర్తకు మరణమాసన్నమయిన సందర్భంలో ఇవ్వబడే విడాకుల సందర్భంలో తప్ప ఇతరత్రా ఒకరి ఆస్థికి మరియొకరు వారసులు కారు.

5) విడాకుల తదనంతరం వారిద్దరు కలసి కాపురం చేయరాదు. చేస్తే కలిగే సంతానం అక్రమ సంతానంగా పరిగణింపబడ్తారు.

6) ఇద్దతు కాలానికి, ఇతరత్రా కొన్ని సందర్భాలలో ఆమె భరణం పొందడానికి అర్హురాలు.

<u>ఇద్దతు (నిరీక్షణ వ్యవధి) :-</u>

"విడాకులివ్వబడిన అతివ మూడు ఋతువులు (తుహుర్‌లు) అయ్యే వరకు వేచి ఉండాలి" (ఖురాన్ 2 : 228)

"మీలో ఎవరైనా మరణించి వారి భార్యలు సజీవంగా ఉంటే, వారు నాలుగు నెలల పది రోజులవరకు తమను తాము నిగ్రహించు కోవాలి. ఈ గడువు (ఇద్దత్) పూర్తి అయిన పిదప, వారు తమకొరకు ఏది ఉచితమో, దాన్ని ధర్మ సమ్మతంగా చేసుకోవటానికి స్వేచ్ఛ కలిగి ఉన్నారు. .... ఈ వితంతువులను వివాహం చేసుకోవాలనే అభిప్రాయాన్ని మీరు వారి నిరీక్షణ కాలంలో పరోక్షంగా తెలిపినా లేక దాన్ని మీ మనస్సులో గోప్యంగా ఉంచినా అది దోషంకాదు. .... కాని రహస్యంగా పెళ్ళి ఒప్పందం చేసుకోరాదు. .... నిరీక్షణా వ్యవధి పూర్తి కానంతవరకు వివాహ నిర్ణయం తీసుకోకూడదు." (2 : 234, 235)

"మీరు మీ స్త్రీలకు విడాకులిచ్చిన పిదవ, వారు తమ నిరీక్షణావ్యవధి (ఇద్దత్) ని పూర్తిచేసి తమ కాబోయే భర్తలతో ధర్మ సమ్మతంగా పరస్పరం ఇష్టపడి, వివాహం చేసుకోదలిస్తే, మీరు వారిని ఆటంక పరచకూడదు.
(2 : 223)

ముట్లుడిగిన స్త్రీకి విడాకుల పిదవ ఇద్దతు కాలము చాంద్రమానపు లెక్కన 3 నెలలు. విడాకుల సమయంలో భార్య గర్భిణీగా ఉంటే ప్రసవ మయ్యేవరకు లేక గర్భ విచ్ఛిత్తి అయ్యేవరకు ఇద్దతు కాలం ఉంటుంది (65 : 4). ఒకవేళ విడాకులివ్వబడిన పరిస్థితిలో ఇద్దతు కాలంలోనే ప్రసవ మయినా లేక గర్భవిచ్ఛిత్తి అయినా ఇద్దతు ముగుస్తుంది. కాని భర్త మరణం వల్ల వివాహబంధం రద్దుఅయితే ఇద్దతు గడువు పూర్తిగా జరగవలసినదే.

'ఇద్దతు' ఏర్పరచటంలో ఉద్దేశ్యము :-

ఇద్దతు యొక్క ముఖ్య లక్ష్యం సంతానం యొక్క తండ్రిని నిర్ధారించటం. ఆ విషయంలో గందరగోళాన్ని అయోమయాన్ని నివారించటం. అక్రమ సంతానం అంటే ఇస్లాము మతానికి అసహ్యం. అంతేకాదు 'ఇద్దతు' అనేది భర్త యెడ గౌరవానికి చిహ్నంకూడాను. వివాహబంధం విధించే బాధ్యతలలో అది ఒకటి.

భార్యపై వ్యభిచార ఆరోపణ :-

'ప్రవక్త' భార్య అయేషా ఒకసారి ఒక మజిలీలో దిగబడి ఉండి పోయింది. మరునాడు ఆమెను ఒక యోధుడు తీసుకొని వచ్చాడు ఆమె భర్త వద్దకు. గుసగుసలు బయలుదేరాయి ఆమె శీలాన్ని గురించి. అపుడు మహమ్మదుగారు ఈ విషయమై ప్రసంగించారు.

"వ్యభిచారిణికి, వ్యభిచార పురుషుడికి చెరి వంద కొరడాదెబ్బలు కొట్టండి" (ఖుర్‌ఆన్ 24 : 2)

"వ్యభిచార పురుషుడు వ్యభిచారిణిని, లేక విగ్రహారాధకురాలిని మాత్రమే వివాహమాడాలి. వ్యభిచారిణి వ్యభిచార పురుషునికి, విగ్రహారాధకుని మాత్రమే పెండ్లాడాలి. వారిరువురు విశ్వాసులకు నిషేధము."
(24 : 3)

"గౌరవనీయులయిన స్త్రీలపై వ్యభిచార నేరాన్ని ఆరోపించేవారు నల్గురు సాక్షులను తేలేకపోతే వారికి 80 కొరడాదెబ్బల శిక్ష" (24 : 4)

"భార్యను వ్యభిచారి అని నిందించేవాడు సాక్ష్యాలను తేలేకపోయినా అతని సాక్ష్యం నలుగురు సాక్ష్యంతో సమానం. అయితే అతడు అల్లాహ్ పై ప్రమాణం చేస్తున్నాననడం." (24 : 6)

భార్య అల్లాహ్ పై ప్రమాణంచేసి భర్త అసత్య మాడుతున్నాడని అంటే, అంతేగాక భర్త నిజంచెప్తే అల్లాహ్ యొక్క క్రోధం తనపై ప్రసరించుగాక అని అంటే ఆమెకు శిక్షలేదు. (24 : 6-9)

"నలుగురు సాక్షులను తేలేకపోతే నిందారోపణచేసేవారు అబద్ధీకులన్న మాట." (24 : 13)

వ్యభిచారులను రాళ్ళతో కొట్టేపద్ధతి ఇప్పటికీ అరేబియాలో ఉందంటే, ఇస్లాం పాతకాలపు పద్ధతులను మార్చలేక పోయిందని విదితమవుతున్నది. షరియతు పేరుతో క్రూరాతి క్రూరమైన శిక్షలపాలు చేస్తున్నారు ముస్లిం రాజ్యాల పాలకులు. దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుంది ఇస్లాం మతం.

స్త్రీ పురుష సంబంధాలయొక్క వైశిష్ట్యాన్ని, సున్నిత స్వభావాన్ని అర్ధం చేసుకోలేని అనాగరక భావాలకు బలం చేకూరుస్తోంది ఇస్లాం ఈనాడు.

తలాఖ్ అనేది ముస్లిం స్త్రీల తలలపై వ్రేలాడే కత్తికాగా, అనాగరక పురుషాధిక్యతా సమాజపు భావాలను తమలో జీర్ణింపచేసుకొని, స్త్రీ పట్ల అతి పరమ పవిత్రమని; అది అల్లా ఆదేశమని తమ బానిస జీవితమే పరమోత్కృష్టమని తలుస్తున్నారు అధిక సంఖ్యాక ముసల్మాను స్త్రీలు. కాని ఆధునిక సంస్కృతీస్పర్శ చవిచూచిన స్త్రీలా తిరుగుబాటు చేయాలని సంకల్పిస్తున్నారు. సనాతన ఇస్లాం మతానుసరణ పేర అజ్ఞానులూ, ఛాంధసులూ అందరూ కలసి వారి ప్రయత్నాలను వమ్ము చేయాలని చూస్తున్నారు. మహారాష్ట్రలో ముస్లిం సత్యశోధక మండలి ఆధ్వర్యంలో ఆనాడు ఎ. బి. షా. ఇచ్చిన ఉత్తేజంతో ముందుకుసాగాడు మిత్రుడు హమీద్ దల్వాయి. అతనిని తూర్పారపట్టారు సనాతనులు. అతని

మరణానంతరం అతని భార్య మెహరున్నీసా దల్వాయ్ ఆ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ఆ ఉద్యమ ఆధ్వర్యంలో అనేకమంది స్త్రీలు – అకారణంగా విడాకులకు లోనయి ముస్లిం స్త్రీలు — ఈనాడు సభలు, మహాసభలు, ఊరేగింపులు జరిపి తమ హక్కుల కోసం, ముసల్మాను సమాజ సంస్కరణ కోసం ఆందోళన చేస్తున్నారు. అలీఘరులో, అక్నోలో, ఇంకా కొన్ని విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో కొన్ని అభ్యుదయ భావ వీచికలు వస్తున్నాయి. కాని ఈ సనాతన పెనుకొండను కదిలించగల స్థాయి వాటికి ఇంకా రాలేదు. ఇరాన్‌లాంటి దేశాలలో ఏ మాత్రం స్త్రీ ఉద్యమాలు తల ఎత్తినా విధ్వంసం చేయిస్తున్నారు మౌల్వీలు, ముల్లాలు. ఆ స్త్రీలను చిత్రహింసలపాలు చేస్తున్నారు.

5. మనవర్తి (MAINTENANCE)

మనవర్తి అనగానే స్త్రీకి భార్యగా పోషణ, విడాకుల తరువాత భరణం రెండూ స్ఫురణకు వస్తాయి.

ముసల్మాను భార్యకు మనవర్తి పొందటానికి 3 రకాలుగా వీలు ఉంది.

1) ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం.

2) స్త్రీలు కాని, వారి సంరక్షకులు కాని భర్తలతో చేసుకున్న ఒప్పందము ప్రకారం ఆ అగ్రిమెంటు ప్రజానీతికి, ముసల్మాను ధర్మ సూత్రాలకు వ్యతిరేకంగా ఉండరాదు.

3) క్రిమినలు ప్రొసీజరుకోడు సెక్షను 125 క్రింద ఈ దిగువ సూత్రాల ప్రకారం ఇస్లాం భార్యను పోషించమని భర్తను ఆదేశిస్తుంది.

i) భార్య వ్యక్తురాలై దాంపత్య జీవితానికి అర్హత గల వయస్సును చేరింది.

ii) సహేతుకమైన కారణాలకు తప్ప ఆమె భర్తతో లైంగిక సంపర్కానికి అందుబాటులో ఉంది.

iii) సహేతుకమైన కారణాలు ఉంటేతప్ప ఆమె భర్తతో కాపురము చేస్తూ అతనితో కలిసి నివసించాలి. అతని సహేతుకమైన ఉత్తరువులను అనుసరించాలి.

ఈ పరిస్థితులున్నప్పుడు, ఆమెకు వేరే ఆస్తి ఉన్నా, భర్త ఆమెను పోషించాలి.

విడాకుల తదనంతరం ఇద్దతు కాలంలో భర్త ఆమెను పోషించాలి. ప్రసవమయ్యే వరకు గర్భిణీ స్త్రీని ఆదరించాలి. (65 : 6)

విధవరాలికి భరణం :-

"మీలోని వారెవరైనా మరణించి వారి భార్యలు సజీవంగా ఉంటే, వారు తమ భార్యలకు ఒక సంవత్సరం వరకు భరణపు ఖర్చులు ఇవ్వాలని, వారిని ఇంటినుండి బహిష్కరించరాదని ఒక వీలునామా వ్రాయాలి."

(2 : 240, 241)

విడాకులివ్వబడిన స్త్రీ :- ఇద్దతు కాలంవరకు మాత్రమే ఆమెకు భర్తవల్ల భరణం రాగలదు. "సంతానంయొక్క పాలుపట్టి గడువు పూర్తికావాలని తండ్రులు కోరినపక్షంలో తల్లులు తమ బిడ్డలకు పూర్తిగా రెండు సంవత్సరాలు పాలు పట్టాలి. అప్పుడు ఆమెకు పిల్లల తండ్రి తగురీతిన భోజన వస్త్రాలను ఇచ్చి పోషించవలసి ఉంటుంది. కాని శక్తికి మించిన భారం ఎవరిమీదా మోపకూడదు ...." (2 : 233) ఇదంతా విడాకులివ్వబడిన స్త్రీని ఉద్దేశించి చెప్పబడింది.

ఇక ఒప్పందాన్ని బట్టి మనవర్తిని పొందే అర్హతగల స్త్రీల విషయం పరిశీలిద్దాం. ముస్లిం లా ప్రకారం వివాహం కంట్రాక్టు కనుక అన్ని ఒప్పందాల వలె అదికూడా ఇరుపార్టీలు అంగీకరించే షరతులకులోనయి ఉంటుంది.

క్రిమినల్ ప్రొజిసీరు కోడు క్రింద మనవర్తి

భారత పౌరులలో అనేక మతాలకు చెందినవారున్నారు. ఏ మతానికి చెందనివారూ వున్నారు. మతస్తులకు వర్తించే శాసనాలలో నిరాదరణ చేయబడిన భార్యలకు భర్త మనవర్తి చెల్లించాలని వ్రాయబడి వుంది. అదనంగా ఆమెకు క్రిమినల్ ప్రొసీజర్‌కోడ్ 125వ సెక్షన్ క్రింద అలాంటి హక్కు ఇవ్వబడింది. ఆ మొత్తం నెలకు రూ. 500 లకు మించరాదు. భార్య మనవర్తికి దావావేస్తే, భర్త విడాకులిచ్చి మనవర్తి చెల్లించే బాధ్యతను వదిలించు కుంటున్నాడు. ఈ బాధను అలాంటి స్త్రీలకు తప్పించే నిమిత్తం భార్య అంటే విడాకులివ్వబడి మరల వివాహమాడని స్త్రీ అని కూడా వివరించ బడింది. క్రిమినల్ ప్రొసీజరు కోడ్ అన్ని మతాల వారికి, భారత పౌరు లందరికీ వర్తిస్తుంది.

కనుక క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో కొత్తగా ప్రవేశ పెట్టబడిన పై వివరణవల్ల ముస్లిం పురుషులకు అన్యాయం జరుగుతున్నదని ఆందోళన జరిగింది. దాని ఫలితంగా 127వ సెక్షన్‌ను సవరించి అదనంగా మూడవ క్లాజును చేర్చారు. దీని ఫలితంగా ఒక స్త్రీ మతశాసనం ప్రకారం విడాకుల సమయంలో పరిహారం పొందితే భర్త మరల మనవర్తి చెల్లించాల్సిన అవసరంలేదు. కాగా మతపరమైన శాసనాలు నిర్ణయించిన పరిహారం సహేతుకం కాకపోతే, తగినంత మొత్తంలో లేకపోతే క్రిమినల్ కోర్టు

మనవర్తిని ఇప్పించ వచ్చునా లేదా అనేది తగాదా అంశమయింది. బొంబాయి, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ హైకోర్టులు మహర్ చెల్లించిన ముస్లిం భర్తచేత విడాకులివ్వబడిన భార్యకు మనవర్తి ఇప్పించనక్కరలేదని తీర్పు చెప్పాయి. తరువాత మద్రాసు, బొంబాయి, కేరళ, గుజరాత్ హైకోర్టులలో కొన్ని తీర్పులు ముస్లిం స్త్రీకి అనుకూలంగా ఇవ్వబడినాయి. ఈ వివాదం 1977 లో బాయితహీరా ఎదిరి, అలీహుస్సేన్ అనే కేసులో సుప్రీంకోర్టు తీర్పుద్వారా పరిష్కారమయింది. ఆ కేసులో విడాకులిచ్చిన భర్త మహర్ మొత్తమూ, ఇద్దత్ పైకమూ (మూడు నెలల మనవర్తి) చెల్లించాడు. అయినా క్రిమినల్ కోర్టు ఆమెకు, ఆమె బిడ్డకూ మనవర్తి ఇచ్చింది. అపీలులో సెషన్సు జడ్జి మనవర్తి రద్దుచేశాడు. బొంబాయి హైకోర్టు ఆ తీర్పును ధృవపర్చింది. సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును రద్దు చేసి ఆమెకూ, ఆమె కుమారునికి మనవర్తి ఇప్పించింది. ఆ తీర్పును న్యాయమూర్తి కృష్ణ అయ్యర్ వ్రాశారు. అందులోని ముఖ్యాంశాలు ఇవి.

i) క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 125 వ సెక్షన్ క్రింద స్త్రీలకు సామాజిక న్యాయం చేకూర్చాలి.

ii) భర్త చెల్లించే పైకం క్రిమినల్ కోర్టు ఇచ్చే మనవర్తిరేటు నిర్ణయించే సమయంలో పరిగణనలోనికి వస్తుంది.

iii) ఆ మొత్తాలు సహేతుకమైనవై, తగినంతవిగా వుంటే తప్ప క్రిమినల్ కోర్టు ఇచ్చే మనవర్తి రద్దుకాదు.

iv) భర్త కొన్ని సందర్భాలలో రెండుసార్లు మనవర్తి చెల్లించాల్సి రాకుండుటే సెక్షన్ 127 (3) (బి) యొక్క ముఖ్యలక్ష్యం.

1979 లోని సుప్రీంకోర్టు తీర్పులోని ఛాయాలనే 1980 తో బొంబాయి హైకోర్టు మరోకేసులో వెలిబుచ్చింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టునుండి వెళ్ళిన అప్పీలుతో ఫజులుల్ బీ ఎదిరి. ఖాదర్ వలీ అనే కేసులో సుప్రీంకోర్టు తన పాత తీర్పును ధృవపర్చింది. ఆ కేసులో మొదట్లో మేజిస్ట్రేటు స్త్రీకి మనవర్తి ఇప్పిస్తే, ఆం. ప్ర. హైకోర్టుతో సహా అపీలు నిరాకరించాయి. ఆం. ప్ర. హైకోర్టు సుప్రీంకోర్టు తీర్పును శిరసావహించాల్సిందే అన్నది.

సుప్రీంకోర్టు – అంతేకాక మనోవర్తి తగిన మొత్తంలో ఇవ్వబడాలి అనే అంశాన్ని కేరళ ఫుల్‌బెంచి విమర్శించిందని విస్మరించడం జరిగింది. మహర్ అనేది వివాహానికి గాని, శుల్కానికిగాని ప్రత్యామ్నాయం కాదు. మహర్ చెల్లిస్తాననడం స్త్రీని గౌరవించడం. దానిని వివాహానికి ముందుగాని, తర్వాత గాని విడాకుల సమయంలో గానీ చెల్లించవచ్చును. మరొక న్యాయసూత్రాన్ని కూడా సుప్రీంకోర్టు ప్రకటించింది. అదేమంటే, విడాకులివ్వడం, పైకం చెల్లించడం రెండూ ఒకదానికొకటి పరిహారంగా వుండాలి. కాని మహర్ అలాంటిదికాదు; విడాకులకు మాత్రమే సంబంధించింది కాదు. గనుక ముస్లిం భర్త విడాకులిచ్చి మహర్ చెల్లించినా ఆ మొత్తం ఆవిడ మనుగడ సాగించడానికి చాలనిదయితే, అది సహేతుకం కాకపోతే క్రిమినల్ కోర్టు ఆమెకు మనోవర్తి ఇప్పించవచ్చు.

సుప్రీం కోర్టు తీర్పువల్ల విడాకులు పొందిన ముస్లిం స్త్రీలకు వచ్చిన సదుపాయాలను వమ్ము చేయడానికి పార్లమెంటు మెంబరు షాబుద్దీన్ ఒక ప్రయివేటు బిల్లుకు నోటీసు ఇచ్చాడు. ఆ బిల్లు శాసనమయితే మహర్‌ను ఇద్దతు మొత్తాన్ని చెల్లించిన ముస్లిం భర్త విడాకులు ఇవ్వబడిన భార్యకు క్రిమినల్ కోర్టులో మనోవర్తి ఇవ్వనక్కరలేదు. ఈ బిల్లుకు సామాజిక, రాజ్యాంగ, మతపరమైన కారణాలు చెప్పబడినాయి. అనేక ఆరోపణలు చేయబడ్డాయి. సుప్రీంకోర్టు ముస్లిం ధర్మశాస్త్రాన్ని త్రోసి రాజన్నది అనే ఆరోపణ నిరాధారమయింది. భర్త రెండు పర్యాయాలు మనోవర్తి చెల్లించనక్కరలేదు అనే న్యాయసూత్రాన్ని కోర్టు పాటించింది. కాకపోతే మనోవర్తి మొత్తం తగినంతదిగా వుండాలని నిర్ణయించింది. విడాకులివ్వబడిన భార్యలను ఇద్దతుగడువు తర్వాతకూడ ముస్లిం పురుషులు భరించాల్సి వస్తుందని, అది అన్యాయమని షాబుద్దీన్ వాదిస్తున్నాడు.

మహర్ మొత్తం చాలా స్వల్పమయినప్పుడు విడాకులివ్వబడిన స్త్రీ ఎలా బ్రతకాలి? మహర్ మొత్తం సహేతుకంగా వుండాలనే అంశాన్ని షాబుద్దీన్ విస్మరిస్తున్నాడు. ముస్లిం పురుషుడు భార్యకు తేలిగ్గా విడాకులివ్వవచ్చు. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగపు 15(3), 37,39 అధికరణలను బట్టి సహజ న్యాయ సూత్రాలను, సామాజిక న్యాయాన్ని పాటిస్తోంది.

ముస్లిం స్త్రీల యెడ మానవతా దృక్పథాన్ని ప్రదర్శిస్తోంది. అంతే కాదు, భారత పౌరులందరికి ఒకేఒక వ్యవహార సంహిత (**Uniform Civil Code**) ఏర్పడటానికి సుప్రీంకోర్టు తీర్పు ఉపకరిస్తుంది. షాబుద్దీన్ బిల్లు ముస్లిం స్త్రీల శ్రేయస్సుకు గొడ్డలిపెట్టు.

షాబుద్దీన్ వాదనను ఈ క్రింది అంశాలలో పొందుపరచవచ్చు.

1) సుప్రీంకోర్టు తీర్పు శాసనానికి వక్రభాష్యం చెప్తున్నది.

2) మహర్‌ను న్యాయ శాస్త్రజ్ఞులు సరిగా అర్థం చేసుకోలేదు. మహర్‌కు విడాకులకు సంబంధం లేదు. ఒక్కొక్కప్పుడు దానిని పెళ్ళికి ముందుగాని, తర్వాత గానీ చెల్లించవచ్చు. విడాకులు పొందిన స్త్రీ ఇద్దత్ గడువు వరకు మనోవర్తిని పొందవచ్చు. అంతేకాక కాపురంచేసిన రోజుల్లో భర్త ఇచ్చిన బహుమానాలను, తల్లిదండ్రులు ఇచ్చిన ఆస్తులను, తన సంపాదనతో కొన్న ఆస్తులను ఆమె తిరిగి స్వాధీనం చేసుకోవచ్చు. ఈ అంశం ఇప్పుడున్న క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లెక్కలోనికి తీసుకోవడం లేదు.

3) విడాకులు పొందిన స్త్రీ గతి ఏమిటి? ఆమె భౌతిక, నైతిక సంక్షేమాన్ని గూర్చి ఏంచెయ్యాలి? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. చుట్టూ హిందూ సమాజం వున్నందువల్ల ఇలాంటి ప్రశ్నలుదయించటం సహజమే. హిందూమత రీతి ప్రకారం పునర్వివాహం నింద్యం. కాని ఇస్లాం పద్ధతి వేరు. ఆమె మరల వివాహమాడవచ్చు; విధిగా వివాహమాడాలి కూడా. ఆమె మోడుగా జీవించరాదు. అదీకాక ఆమెకు తల్లిదండ్రులనుండీ, భర్తనుండీ, తన సంపాదన నుండీ వచ్చిన ఆస్తి వుండనేవుంది. తన పుట్టింటివారి కుటుంబంనుండి కూడా ఆమెకు వారసత్వరీత్యా ఆస్తివస్తుంది. పైగా ఆమె తన నేర్పరితనాన్ని, అనుభవాన్ని, విజ్ఞానాన్ని వినియోగించి సంపాదించుకోవచ్చుకూడా. అయినా, ఎప్పుడూ పురుషుడిమీద ఆధారపడివుండాలనే విధంగా స్త్రీ వుండాలని అభ్యుదయ కాముకులు ఎందుకు కోరుకోవాలి?

4) అదీకాక వివాహం చేసుకోకుండా వ్యభిచార జీవితంగడిపే స్త్రీకి మాజీ భర్త ఎందుకు మనోవర్తి చెల్లించాలి?

5) భార్యలను ముస్లిం పురుషులు విడాకులద్వారా తేలిగ్గా వొదిలించుకుంటున్నారని భావిస్తే, విడాకులు ఇవ్వడం లేక పొందటం కష్టతరం చేయవచ్చు.

6) మహర్ అత్యల్పంగా వుందనిభావిస్తే మహర్ భారీఎత్తున వుండేలా చూడడానికి ఒక ఉద్యమాన్ని లేవనెత్తవచ్చు. పెళ్ళి మార్కెట్‌లో ఆడవాళ్ళ సంఖ్యనుబట్టి మహర్ నిర్ణయింపబడుతుంది అనే మాట మరచిపోరాదు.

7) అన్నింటికన్నా ముఖ్యమయింది ఇస్లాంలో వివాహానికి వున్న స్థానం. అది పరస్పర అంగీకారం మీద ఆధారపడే కంట్రాక్టు. కనుక వివాహం రద్దు అయితే కంట్రాక్టు ప్రకారమే మనవర్తి చెల్లించాలిగాని ఇతరత్రా ఇప్పించరాదు.

ఈ వాదనలకు భిన్నంగా జయానగాడే అనే పూనా కాలేజీ అధ్యాపకురాలు సెక్యులరిష్టు పత్రికలో అభిప్రాయ ప్రకటన చేసింది. ఆమె వాదన ఏమంటే:-

1) ముస్లిం వివాహం కంట్రాక్టుకు, మామూలు వ్యాపార కంట్రాక్టుకు తేడావుంది. వివాహ కంట్రాక్టువల్ల స్త్రీ పురుషులకు హోదా ఏర్పడుతుంది. కనుక వేర్వేలకూ వర్తించే క్రిమినల్ ప్రొసీజరు కోడు సెక్షన్లు ముస్లింలకు ఎందుకు వర్తించరాదో అర్థం కావటం లేదు.

2) సుప్రీంకోర్టు అన్ని కేసుల్లోనూ క్రిమినల్ కోర్టులో మనవర్తి ఇచ్చి తీరాలని ప్రకటించటం లేదు. మతశాసనం ప్రకారం, కంట్రాక్టు ప్రకారం భర్త చెల్లించిన మొత్తం చాలకపోతేనే క్రిమినల్ కోర్టు మనవర్తి ఇప్పిస్తుంది.

3) విడాకులు పొందిన ముస్లిం స్త్రీ వ్యభిచార జీవితం గడుపుతుంటే ఆమెకు మనవర్తి ఇవ్వరాదని 125 సెక్షన్‌లో 4,5 క్లాజులు స్పష్టీకరిస్తున్నాయి. స్త్రీలు పురుషులపై ఆధారపడకూడదు అనే మాట నిజమే కాని వాస్తవాన్ని గుర్తించాలి కదా! ఆమెను నిరాధారిగా వొదిలి వేయడం ఏమంత న్యాయం?

4) మనవర్తి ఇవ్వాల్సొస్తుందనయినా భయపడి త్వరపడి విడాకులివ్వరు ముసల్మాను భర్తలు. ఈ సుప్రీంకోర్టు తీర్పు కొనసాగితే, అదీకాక విడాకులు తేలిగ్గా స్త్రీ పురుషులు పొందగలిగి వుండాలని, ఇష్టంలేని కాపురంలో ఇద్దర్నీ బంధించడం అన్యాయమని ప్రపంచమంతా ఘోషిస్తోంది. ముస్లిం పురుషుడు తలాక్ అనే పదాన్ని మూడుసార్లు వుచ్చరించి భార్యకు విడాకులివ్వవచ్చు. ఈ హక్కును తీసెయ్యటానికి ముస్లిం సాంప్రదాయ వాదులు అంగీకరిస్తారా ? అనేది మరో ప్రశ్న.

5) సుప్రీం కోర్టు తీర్పు శాసనానికి వక్రభాష్యం చెప్తుందనే మాట చాలా పొరపాటు. కాలాని కనుగుణంగా శాసనానికి భాష్యంచెప్పి శాసన లక్ష్యాన్ని సాధించటం సుప్రీంకోర్టు కర్తవ్యం.

షాబుద్దీన్ బిల్లు మతఛాందస వాదులకు బలాన్ని చేకూరుస్తుంది. ముస్లిం స్త్రీలకు తీరని ద్రోహం చేస్తుంది. మతశక్తుల విజృంభణకు సాయపడుతోంది. ఒకేఒక వ్యవహార సంహిత ప్రవేశపెట్టాలనే భారత రాజ్యాంగం 44 వ అధికరణంలో చెప్పిన దాన్ని కోసం ఏ ప్రయత్నమూ జరగలేదు. సర్వులకూ వర్తించే క్రిమినల్ ప్రొసీజర్ కోడు 125, 127 సెక్షన్‌లను ముస్లింలకు వర్తింప చేయకుండా షాబుద్దీన్ బిల్లు ఉపకరిస్తుంది. ఇది తిరోగమన ప్రయత్నం. విశ్వమానవ హక్కులను దృష్టిలో పెట్టుకుంటే ముస్లిం స్త్రీల యెడ జరిగే అన్యాయాన్ని ఎదుర్కొనక తప్పదు. అందువల్ల ప్రగతికాములైన స్త్రీపురుషులెల్లరూ ఈ బిల్లును వ్యతిరేకించటం అవశ్యకర్తవ్యం.

<u>ఈనాటి స్థితి :-</u> ఇపుడున్న ముస్లిం సమాజపు పరిస్థితిలో ఇస్లాం ధర్మశాస్త్రాల ప్రకారం ఇద్దతు కాలం వరకే మనవర్తి విడాకులివ్వబడిన భార్యకు లభిస్తుంది. ప్రత్యేకంగా మనవర్తిని గురించి పెండ్లినాడుకాని తరువాత కాని భర్తతో వేరే అగ్రిమెంటు వ్రాయించుకోగల సామాజిక చైతన్యం ముస్లిం స్త్రీలకు లేదు భర్త ఎంత ఆస్తిపరుడయినా క్రిమినలు ప్రొసీజరు కోడుప్రకారం వచ్చే భరణం నెలకు 500 రూపాయలకు మించదు. ముస్లిం స్త్రీల హక్కులు వర్ణనాతీతం. వాటిని వారు అధిగమించటానికి కృషి జరగటం లేదు. వారు అజ్ఞానాంతం హద్దులుదాటి ప్రవర్తించరాదు. ఖుర్‌ఆన్

ప్రకారం, ఆచారాల ప్రకారం జీవించాలి. అధిగమిస్తే కొరడా దెబ్బలు, ఎదురు తిరిగితే శిక్షలు, చిత్రహింసలు. అవార్కలిలాంటి సజీవ సమాధులు. మతం, పురుషుడు ఈ రెండూ ఆమె వ్యక్తిత్వాన్ని నమ్ము చేస్తున్నాయి. శక్తి సామర్థ్యాలను కుంచించి వేస్తున్నాయి. నఖ శిఖ పర్యంతం బురఖాతో కప్పి వేస్తున్నారామెను. నోరెత్తి ఏమాట అనరాదు; ఏ హక్కు కోరరాదు. ఏ పరపురుషునిముందూ కష్ట గాథలను వ్యక్త పరచరాదు. ఇక సాటి స్త్రీలతో చెప్పే అర్హత అసలే వనికిరాదు. సాటి వారితో పంథాలు పెట్టరాదు. ఏ మాత్రం తలఎత్తి తిరిగినా ఆమెను విధ్వంసం చేస్తారు. హతమారుస్తారు. అందువల్లి మత ప్రవచనాలు సైతం అమ్మల్లో తేవవేటి నగ్నసత్యం. ఏ కొద్ది మందో తప్ప స్త్రీలు సాక్షాత్ దున్నబడే భూమితో సమానంగా జీవిస్తున్నారు. కేవలం పిల్లల్ని కనడానికి, భర్త సంతృప్తికే ఆమె బ్రతకాలి.

—

6. దత్తు (ADOPTION)

అరబ్బు దేశంలో మహమ్మదులకు పూర్వం దత్తు ఉండేది. మహమ్మదు జయిద్‌ను దత్తు చేసుకున్నాడనే కధ ప్రచారంలో ఉంది. కాగా ఒకచోట ఖుర్‌ఆన్‌లో దత్తు కుమారుడు జారణ పుత్రుడు (జఘనం నుండి పుట్టినవాడు) కానేరడని మహమ్మదు చెప్పాడు.

"భార్యను తల్లి అంటే ఆమె అతనికి తల్లి కావటం లేదు. అలాగే నీవు ఎవరినైనా నీ కుమారులని చెప్పినా వారు నీ కుమారులు కానేరరు."
(సురా 33 : 4)

"జయ్యద్ తన భార్యకు విడాకులిచ్చినపుడు, మేము ఆమెను నీకు ఇచ్చినాము; ఎందుకంటే ఇక ముందు దత్తు కుమారుల భార్యలు - విడాకులివ్వబడినవారు - వివాహం చేసుకోవడానికి నిషిద్ధంకారని చెప్పడానికి అల్లాహ్ ఆజ్ఞ పాలింపబడవలెను." (33 : 37)

ఈ ఆయతు దైవదూత 'ప్రవక్త' ను ఉద్దేశించి చెప్పాడట. దీనిలో దత్తు కుమారుడు అనే పదం వాడబడింది. కనుక ఇస్లాం దత్తును ఆమోదించింది అని కొందరి వాదన.

ఏదైనా ఆచారంగా ముస్లిం సమాజంలో దత్తు లేదు ఈనాడు. పెంచుకుంటున్నారు. ప్రేమమీద ఆస్తులిస్తున్నారు అంతే. హిందువులలోలాగ దత్తత విధానం లేదు.

1972 లో రాజ్యసభలో దత్తత బిల్లు ప్రవేశ పెట్టబడింది. 1976 లో పార్లమెంటు సెలెక్టు కమిటీ సిఫారసు చేసింది. దాంతో సనాతన చాంధవ ముపల్మానులు విజృంభించి వ్యతిరేకించారు. ముస్లిం బాలబాలికలను ఇతర మతాలవారు దత్తు తీసుకొని వారివారి మతాల పద్ధతిలో పెంచుతారని, అది తమకు తీరని అపచారమని ప్రచారం చేశారు. బీదలుగా, అనాధలుగా ముస్లిం బాలబాలికలు ఆకలి బాధకు తాళజాలక చనిపోయినా ఫరవాలేదు కాని ఇతర మతాలవారు ఆ బాలబాలికలను పెంచుకోరాదు.

అసలు అభ్యంతరం అదికాదు. అన్ని మతాలవారికి వర్తించే దత్తత బిల్లు ఆమోదించబడితే మెల్లమెల్లగా మతపరమైన ధర్మశాస్త్రాల పాలన నశిస్తుందని విపరీతమైన భయం. ఈ సందర్భంలో ముస్లిం దేశాలతీరును పరిశీలించటం అవసరం. ట్యునీసియాలో దత్తు చెల్లుతుంది. అంటే ట్యునీసియా ఆధునిక ప్రపంచంలో భాగస్వామ్యం పొందుతున్నదన్నమాట. మరి భారత ముస్లింల స్థితియో ! ఎక్కడేసిన గొంగళి అక్కడే ఉన్నది.

1956 వరకు దేవదాసీలలో తప్ప తతిమ్మా హిందువులలో బాలికలను దత్తు చేసుకోవటానికి వీలులేదు. ఇప్పుడు శాసనం ఆ సౌకర్యం కలిగిస్తున్నది ముసల్మానులలో బాలురను గాని, బాలికలను గాని దత్తు చేసుకునే పద్ధతి లేదు. కనుక ఈ సందర్భంగా స్త్రీ పురుష వివక్ష ఉందని చెప్పలేము.

—(o)—

7. పిల్లల సంరక్షకత్వం (GUARDIAN SHIP)

పిల్లల సంరక్షకత్వం రెండు రకాలు: ఒకటి పిల్లల స్వాధీనానికి సంబంధించినది 'హిజ్నత్'. రెండవది పిల్లల ఆస్తులకు సంబంధించినది.

<u>పిల్లల పెంపకం విషయం (హ్నిజత్)</u> :- I) i) బాలుడు 7 సంవత్సరాల వయస్సునిండే వరకు, బాలిక వ్యక్తురాలయ్యే వరకు (వివాహిత అయినా లేక అవివాహిత అయినా) తల్లి, ఇతర స్త్రీ బంధుగుల అధీనంలో ఉంటారు. ఈ దిగువ వరుసక్రమం ప్రకారం పోషణ బాధ్యతను స్వీకరించేవారు. ఉంటారు.

1] తల్లి 2] తల్లి తల్లి 3] తండ్రి తల్లి 4] సోదరి 5] సోదరి కుమార్తె 6] పినతల్లులు, పెదతల్లులు 7] మేనత్తలు 8] తల్లి దండ్రుల మేనత్తలు.

వీరు లేక పోతే

1] తండ్రి 2] తండ్రి తండ్రి 3] సోదరుడు 4] తండ్రి కుమారుడు (సవతి సోదరుడు) 5] సోదరుని కుమారుడు 6] సవతి సోదరుని కుమారుడు 7] పెదతండ్రి, పినతండ్రి 8] తండ్రి సవతి సోదరుని కుమారుడు 8] తండ్రి సోదరుని కుమారుడు 10] తండ్రి సవతి సోదరుని కుమారుడు. తరువాత ఇతర బంధుగులు.

ii) బాలుడు 7 సంవత్సరములు దాటిన వాడయినప్పుడు, వ్యక్తురాలయిన అవివాహిత కుమార్తెకు పోషణ బాధ్యత పైనచెప్పిన తండ్రి, తండ్రి తాలూకు బంధుగులు.

iii) ఈడేరిన బాలిక వివాహిత అయితే భర్త ఆమె పోషణకర్త.

iv) అక్రమ సంతానం విషయంలో

7 ఏండ్లవరకు తల్లి 7 సంవత్సరాలు దాటిన బాల బాలికలకు మైనరు కోరిక ననుసరించి తల్లి దండ్రులలో ఎవరో ఒకరు.

II) పైన పేర్కొన్న గార్డియనులు ఎవరూ లేకపోతే కోర్టు నియమించిన వారు పెంపకపు బాధ్యత స్వీకరిస్తారు.

షియా 'లా':-

1. రెండేండ్లలోపు వయస్సుకల బాలుడు, ఏడేండ్ల లోపుగల బాలిక తల్లి అధీనంలో ఉంటుంది. ఆమె లేకపోతే తండ్రి. అతడూ లేక పోతే తండ్రి తండ్రి.

2. రెండు సంవత్సరాల వయస్సుదాటిన బాలునికి, ఏడు సంవత్స రాల వయస్సుకల బాలికకు పెంపకపు బాధ్యత, హక్కు తండ్రివి. అతడు లేకపోతే తండ్రి తండ్రివి. తరువాత కోర్టు నియామకం.

పైన పేర్కొనబడిన స్త్రీలు కొన్ని సందర్భాలలో పిల్లలను తమ అధీ నంలో ఉంచుకునే హక్కును కోల్పోతారు. అవి ఏమంటే:

1) తల్లి విడాకులు పొందిన తరువాత రెండో పెండ్లి చేసుకుంటే పిల్లలు తండ్రి అధీనంలోకి పోతారు.

2) పిల్లకు దగ్గరబంధువు కానివానిని, అంటే పిల్లను వివాహమాడరాని వర్గంలో లేనివానిని వివాహమాడితే.

3) పిల్ల పిల్లవాని తండ్రియొక్క నివాసగృహానికి దూరంగా ఆమె తన భర్తతో కాపురం ఉంటే.

4) ఆమె అవినీతికర జీవితం సాగిస్తుంటే, అంటే వ్యభిచారిణి అయితే.

5) ఆమె పిల్ల పిల్లవానిని గురించి తగు శ్రద్ధ జాగ్రత్త తీసుకోక పోతే.

మైనరు బాలిక ఈడేరక పోయినా లేక దాంపత్యజీవితం సాగించ టానికి అనువైన వయస్సును పొందక పోయినా భర్త సంరక్షకుడుగా ఉండ టానికి అంటే ఆమెను అధీనంలో ఉంచుకోటానికి అనర్హుడు. అపుడు ఆమె తల్లి అధీనంలో ఉండాలి. అలాగే బాలికను అధీనంలో ఉంచుకోటానికి హక్కున్న పురుషుడు ఆమెకు దగ్గర బంధువు కాకపోతే అంటే వివాహ నిషేధపు వర్గంలోనివాడు కాకపోతే అతడు ఆ హక్కును కోల్పోతాడు.

పిల్లల ఆస్తి విషయమై సంరక్షక కర్తలు :

వీరు మూడురకాలుగా ఉంటారు.

1) లా ప్రకారం సంరక్షకులు.
2) కోర్టుచే నియమింపబడినవారు.
3) వాస్తవానికి గార్డియనులు.

1. లా ప్రకారం సంరక్షకులు రెండు రకాలవారు.

ఎ) సహజ సంరక్షకులు.
బి) వీలునామాద్వారా నియమింపబడినవారు.

ఈ క్రింది వరుసక్రమంలో వారు బాలబాలికల ఆస్తికి లా ప్రకారం సంరక్షకులు.

1) తండ్రి
2) తండ్రి వీలునామాలో సంరక్షకునిగా పేర్కొనబడిన వ్యక్తి.
3) తండ్రి తండ్రి
4) తండ్రి తండ్రిచేత వీలునామాద్వారా సంరక్షకుడిగా నియమింపబడిన వ్యక్తి.

వీరు లేనప్పుడు కోర్టువారు మైనరు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని గార్డియనును నియమిస్తారు. ఇదంతా చదివినతరువాత గ్రహించే విషయాలు ఏమిటి : స్త్రీలు తమ సంతానపు ఆస్తికి సంరక్షకులుగా ఉండటానికి అసలు (కోర్టు నియమిస్తే తప్ప) వీలులేదు. చిన్నవయస్సులో ఉన్నపుడే పిల్లలను పెంచేనిమిత్తం, తమ ఆధీనంలో ఉంచుకోవచ్చును. తరువాత తండ్రుల అధీనంలో ఉంటారు పిల్లలు. అంటే నవమాసాలు గర్భానమోసి నానా కష్టాలుపడే కన్నతల్లికి చాకిరీ హక్కుతప్ప మరేమీలేదు. ఈ 'హిజానత్' ను గొప్పగా వర్ణిస్తూ ఇస్లాము మతాభిమానులు గ్రంథాలు వ్రాస్తున్నారు. (చూడుడు "The Woman" by M. H. KIDWA; Light & Life Publishers 1978.) ఇంతకన్నా పచ్చిమోసం మరొకటిలేదు. స్త్రీలను చిన్నచూపు చూసే క్రీ.శ. 7వ శతాబ్దపు పరిస్థితులు ఈనాడులేవు.

ప్రపంచం మారుతున్నది. అయినా ఆ ధర్మసూత్రాలే ఉత్కృష్టాలని వాదించటం అజ్ఞానం అన్నా కావాలి, అంధవిశ్వాస ఫలితమన్నా కావాలి, లేక పచ్చిదగా అన్నా అయి ఉండాలి. ఒకటి మాత్రం సత్యం. ఏదో ఒకటి కాకపోదు. కన్నతల్లి బిడ్డలఆస్తికి సంరక్షకురాలు కాదు. వారికి గార్డియనుగా అంతకన్నా పనికిరాదు. ఇది ఇస్లాంలో తల్లికిచ్చిన స్థానం!!!

ముస్లిం దేశాలు ఉత్తర ఆఫ్రికానుండి సింగపూరు ఇండోనీషియా దాకా ఉన్నాయి. ఈజిప్టు, సిరియా, లెబనాన్, జోర్డాన్, ఇరాక్, ఇరాన్‌లలో స్త్రీలు వివాహం కాకముందు, అయిన తర్వాతకూడా. ఉద్యోగాలు చేస్తున్నారు. ఈజిప్టు, లెబనాన్, ఇరాన్‌లలో ఉద్యోగాలుచేసే స్త్రీల సంఖ్య పెరిగింది. వ్యాపార సంస్థలకు అధిపతులుగా ఉన్నారు. పత్రికా రచయితలుగా ఉన్నారు. ఇరాక్‌లో ఒక స్త్రీ మంత్రిగా ఉన్నది. బంగ్లాదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన అవామీలీగ్‌కు ముజిబుర్ రహమాన్ కుమార్తె నాయకత్వం వహిస్తున్నారు. పాకిస్తానులో పెద్ద ప్రతిపక్షమైన పీపుల్సు పార్టీకి భుట్టో భార్య, కూతురు నాయకత్వం వహిస్తున్నారు. ఈనాడు ఇరాన్‌లో ఖుమేనీతో గెరిల్లాలుగా అనేకమంది స్త్రీలు పోరాడుతున్నారు. అనేక దేశాల పార్లమెంట్లలో సభ్యులుగా ఉన్నారు. అవి అన్నీ వదిలివేయండి. మరొక రకంగా ఆలోచిద్దాం. ఇజ్రాయిల్ దేశానికి ప్రధానమంత్రిగా గోల్డుమియర్ పనిచేసింది. శ్రీలంకకు బండారునాయకే ముఖ్యమంత్రిగా వ్యవహరించింది. 1966నుండి (మధ్యలో 3ఏండ్లు తప్ప) ఇండియాలో ఇందిరాగాంధీ ప్రధాన మంత్రి పదవి నిర్వహిస్తున్నది. నాలుగేండ్లనుండి బ్రిటనుకు ప్రధానమంత్రిగా అధికారం చలాయిస్తున్నది మార్గరెట్ థాచర్. వాదన కోసం అనుకుందాం కాసేపు. వీరంతా ఇస్లాం మతాన్ని స్వీకరించారనుకోండి. వీరు తమ కుమారులకు, కుమార్తెలకు గార్డియన్లుగా ఉండే అర్హత కోల్పోవాలన్నమాట. అహా! ఇస్లాం మత మౌఢ్యమా, ఎన్ని వెర్రితలలు వేస్తున్నావు! ఇస్లామేతరుల సంగతి వదలివేయండి. మనదేశంలో ఎంతోమంది ముస్లింవనితలు గొప్పగొప్ప చదువులు చదివి, ఉన్నత డిగ్రీలు సంపాదించి, ఉన్నతోన్నత పదవులను నిర్వహిస్తున్నారు ప్రభుత్వ కార్యాలయాలలో, విశ్వవిద్యాలయాలలో. అటువంటివారుకూడ తమపిల్లల ఆస్తికి,

కొంచెం ఎదిగిన పిల్లలకు సంరక్షకులుగా ఉండరాదంటుంది ఇస్లాం. మార్చరాదు ధర్మసూత్రాన్ని అంటారు పురుషాధిక్యత నిలబెట్టాలనిచూచే మౌల్వీలు, ఉలేమాలు. ప్రపంచం శరవేగంతో పరుగెడుతున్నా వెనక్కు వెనక్కు జరిగే ఈ ముస్లిం సమాజాన్ని ఎలా సంస్కరించాలి ? ఏం చేయాలి ? జిజ్ఞాసువులకు ఇది తీరని ప్రశ్న. స్వేచ్ఛా కాముకులకు ఇది ఎడతెగని సవాలు. ఇది ముస్లిం స్త్రీల వ్యక్తిత్వానికే గొడ్డలిపెట్టు. తాము పురుషుల భోగ్యవస్తువులుగా, ఇంటికీ, పిల్లలకు వెట్టిచాకిరిచేసే పనిముట్లుగా మాత్రమే చలామణీ అగుట శోచనీయం కాదా ? ఖుర్‌ఆన్‌లో, షరియా చట్టంలో కూడా స్త్రీల అణచివేతకు ఇలా ఎన్నో మరెన్నో దాఖలాలు తెలిశాయి కదా ! ఇక స్త్రీలు తమ బంధ విముక్తికి వారే ప్రయత్నించక తప్పదు.

8. వారసత్వం

మహమ్మదు ఇస్లాం మతాన్ని స్థాపించకముందు ముస్లింలు బాలికలను చంపేవారు. ఖురాన్ "అన్‌నహ్ల" అనే పేరుగల సురాతో 57-60 ఆయతులలో ఇలా ఉంది.

"వీరితో ఎవరికైనా కూతురుపుట్టిన శుభవార్తను అందిస్తే అతని ముఖాన్ని నల్లనిఛాయలు ఆవరిస్తాయి. ఆతడు లోలోన కుమిలిపోతాడు. ఈ దుర్వార్త తరువాత ఎవరికైనా ఎలా ముఖం చూపాలని, అతడు మనుషులకు నక్కి తిరుగుతూ ఉంటాడు. అవమానాన్ని భరిస్తూ కూతుర్ని ఉంచుకోవాలా లేక ఆమెను మట్టిలో పాతిపెట్టాలా? అని ఆలోచిస్తాడు-చూడండి! వీరు దైవం విషయంలో చేసే తీర్పులు ఎంత దుర్మార్గమైనవో!"

ఆడపిల్లలను చంపేసే ఆచారం ఉన్నది. దానిని 'హరాము' చేశాడు మహమ్మదు.

అంతటితో ఆగలేదు. వారసత్వం విషయంలో స్త్రీలకు ఆయన గొప్ప మేలుచేశాడు అవాడు.

ఒక పురుషుడు చనిపోయాడనుకోండి. అతని ఆస్తి పంపిణీని గురించి అనేక రకాలుగా ధర్మసూత్రాలను చెప్పాడు. ముఖ్యమైనవి మనకు గమనార్హాలు.

నిశ్చితమైన భాగాన్ని పొందేవారిని 'భాగస్థులు' (Sharers) అని పేర్కొన్నాడు.

మిగతావారిని రెండు రకాలుగా విభజించాడు. 1) మిగతాది పుచ్చుకునేవారు 2) దూరపు బంధువులు.

నిర్ణీతమయినవన వాటాలు పొందేవారిలో కొందరు:-

1. ఎ) కుమారునికాని కుమార్తెకాని ఉన్నా లేక కుమారునికి, కుమారుని కుమారునికి బాలబాలికలు ఉన్నా భార్యకు $\frac{1}{8}$ వంతు. అలాంటివారు

లేనపుడు భార్యకు $\frac{1}{4}$ వంతు. అనేకమంది భార్యలుంటే పై పరిస్థితులను బట్టి వారందరికి కలిసి $\frac{1}{8}$ లేక $\frac{1}{4}$ వంతు.

ఒక స్త్రీ చనిపోయింది అనుకోండి. భర్తవాటా ఎంతో పరిశీలిద్దాం. కుమారుడుగాని కుమార్తెగాని ఉన్నా లేక కుమారుడు, మనుమడు వీళ్ళ సంతానం ఉన్నా భర్తకు $\frac{1}{4}$ వాటా.

అలాకాక పై చెప్పినవారు లేకపోతే భర్తకు $\frac{1}{2}$ వాటా. ఇది సున్నీలకు వర్తించే ధర్మసూత్రం. షియా ధర్మసూత్రం ప్రకారం వాటాలు మారవు. కాగా చనిపోయిన మనిషి సంతానం, వారి సంతానం ఉంటే భర్తకు $\frac{1}{4}$ వాటా. వారు లేకపోతే $\frac{1}{2}$ వాటా.

అలాగే

చనిపోయిన పురుషుడికి సంతానం, సంతానానికి సంతానం ఉంటే భార్యకు $\frac{1}{8}$ అలాంటి వారు లేకపోతే $\frac{1}{4}$.

అనేకమంది భార్యలున్నా అందరికీకలిపి $\frac{1}{8}$వాటా, లేక $\frac{1}{4}$ వాటాయే. ఇందులో గమనించదగిన తేడా ఏమంటే—

సంతానం వారి సంతానం ఉంటే భార్యకు $\frac{1}{8}$ వంతు భర్త ఆస్తిలో. అలాంటి సంతానం లేకపోతే భార్యకు $\frac{1}{4}$ వంతు భర్త ఆస్తిలో.

మరి భార్యకు భర్త ఆస్తిలోనో సంతానం, వారిసంతానం ఉంటే $\frac{1}{4}$ వంతు భార్య ఆస్తిలో.

అలాంటి సంతానం లేకపోతే $\frac{1}{2}$ వంతు భార్య ఆస్తిలో. అంటే భర్త ఆస్తిలో భార్యకువచ్చే వాటా భార్య ఆస్తిలో భర్త వాటాలో సగం అన్నమాట. మరోరకంగా చెప్పాలంటే భర్తవాటా $= 2 \times$ భార్యవాటా.

2. <u>కూతుళ్ళు, కుమారులు.</u>

1) కుమారుడు లేనపుడు ఒక కూతురుఉంటే ఆమెకు $\frac{1}{2}$ వంతు కూతుళ్ళుఉంటే అందరికీ కలిపి $\frac{2}{3}$ వంతు.

2) కుమారుడు లేక కుమారులు ఉంటే వారితో కలిసి ఖచ్చితమైన వాటాలు రావలసినవి తీసివేసి మిగతా ఆస్తిని పంచుకుంటారు కుమార్తెలు.

ఈ సూత్రం హనాఫీ, షియా శాఖలకు రెంటికీ వర్తిస్తుంది. ఇక కుమార్తెలు కుమారులు ఎలా పంచుకుంటారో చూద్దాము.

ఒక ముసల్మాను పురుషుడు చనిపోయాడు అనుకుందాము. అతనికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అపుడు భార్యకు $\frac{1}{8}$ వంతు మిగతాది $1 - \frac{1}{8} = \frac{7}{8}$

ఇందులో కుమారునికి $\frac{2}{3} \times \frac{7}{8} = \frac{7}{12}$; కుమార్తెకు $\frac{1}{3} \times \frac{7}{8} = \frac{7}{24}$
అంటే కుమారునికి కుమార్తెకన్నా రెట్టింపు వాటా.

ఒక కుమారుడు = ఇద్దరు కుమార్తెలు (వాటాల విషయంగా). అంటే ఒక పురుషుడు = ఇద్దరు స్త్రీలతో సమానం.

ఇదే సూత్రం అన్న తమ్ముళ్ళు, అక్క చెల్లెళ్ళకూ వర్తిస్తుంది. కుమారుని కుమారులకు, కుమారుని కూతుళ్ళకూ వర్తిస్తుంది.

మొత్తంమీద తేలిందేమంటే ఒక్క తల్లితండ్రి విషయంలో తప్ప (అదయినా చనిపోయిన వ్యక్తికి సంతానం, కుమారునికి సంతానం ఉంటే) వాటాల విషయంలో వివక్షలేదు. ఇద్దరికీ $\frac{1}{6}$ వంతు వస్తుంది.

కాగా, చనిపోయిన వ్యక్తికి సంతానం, కుమారునికి సంతానం లేకపోతే తల్లికి $\frac{1}{3}$ వంతు మాత్రమే వస్తుంది. (దానికి కొన్ని షరతులు ఉన్నాయనుకోండి.)

చనిపోయిన వ్యక్తికి సంతానం, కుమారుని సంతానం లేకపోతే తండ్రి వాటాదారుల (Sharers) వాటా పోను మిగతాదానికి ఇతరులతో కలిపి పంచుకునే హక్కు పొందుతాడు.

ఉ॥ ఒకవ్యక్తి చనిపోయాడు అని భావిద్దాము. అతనికి భార్య, తల్లి, తండ్రి ఉన్నారు. అంటే సంతానం లేదు.

భార్యకు $\frac{1}{4}$.

అప్పుడు భార్యకు $\frac{1}{4}$, తల్లికి $\frac{1}{3} \times (1 - \frac{1}{4}) = \frac{1}{3} \times \frac{3}{4} = \frac{1}{4}$; తండ్రికి $1 - (\frac{1}{4} + \frac{1}{4}) = 1 - \frac{1}{2} = \frac{1}{2}$ అంటే తల్లికన్నా ఎక్కువే తండ్రికి వస్తుంది.

లేనపుడు భార్యకు $\frac{1}{4}$ వంతు. అనేకమంది భార్యలుంటే పై పరిస్థితులను బట్టి వారందరికి కలిసి $\frac{1}{8}$ లేక $\frac{1}{4}$ వంతు.

ఒక స్త్రీ చనిపోయింది అనుకోండి. భర్తవాటా ఎంతో పరిశీలిద్దాం. కుమారుడుగాని కుమార్తెగాని ఉన్నా లేక కుమారుడు, మనుమడు వీళ్ళ సంతానం ఉన్నా భర్తకు $\frac{1}{4}$ వాటా.

అలాకాక పై చెప్పినవారు లేకపోతే భర్తకు $\frac{1}{2}$ వాటా. ఇది సున్నీలకు వర్తించే ధర్మసూత్రం. షియా ధర్మసూత్రం ప్రకారం వాటాలు మారవు. కాగా చనిపోయిన మనిషి సంతానం, వారి సంతానం ఉంటే భర్తకు $\frac{1}{4}$ వాటా. వారు లేకపోతే $\frac{1}{2}$ వాటా.

అలాగే

చనిపోయిన పురుషుడికి సంతానం, సంతానానికి సంతానం ఉంటే భార్యకు $\frac{1}{8}$ అలాంటి వారు లేకపోతే $\frac{1}{4}$.

అనేకమంది భార్యలున్నా అందరికీకలిపి $\frac{1}{8}$వాటా, లేక $\frac{1}{4}$ వాటాయే. ఇందులో గమనించదగిన తేడా ఏమంటే—

సంతానం వారి సంతానం ఉంటే భార్యకు $\frac{1}{8}$ వంతు భర్త ఆస్తిలో. అలాంటి సంతానం లేకపోతే భార్యకు $\frac{1}{4}$ వంతు భర్త ఆస్తిలో.

మరి భార్యకు భర్త ఆస్తిలోనో సంతానం, వారిసంతానం ఉంటే $\frac{1}{4}$ వంతు భార్య ఆస్తిలో.

అలాంటి సంతానం లేకపోతే $\frac{1}{2}$ వంతు భార్య ఆస్తిలో. అంటే భర్త ఆస్తిలో భార్యకువచ్చే వాటా భార్య ఆస్తిలో భర్త వాటాలో సగం అన్నమాట. మరోరకంగా చెప్పాలంటే భర్తవాటా $= 2 \times$ భార్యవాటా.

2. కూతుళ్ళు, కుమారులు.

1) కుమారుడు లేనపుడు ఒక కూతురుఉంటే ఆమెకు $\frac{1}{2}$ వంతు కూతుళ్ళుఉంటే అందరికీ కలిపి $\frac{2}{3}$ వంతు.

2) కుమారుడు లేక కుమారులు ఉంటే వారితో కలిసి ఖచ్చితమైన వాటాలు [illegible] మిగతా ఆస్తిని పంచుకుంటారు కుమార్తెలు. [illegible] $\frac{1}{2}$ [illegible]

ఈ సూత్రం హనాఫీ, షియా శాఖలకు రెంటికీ వర్తిస్తుంది. ఇక కుమార్తెలు కుమారులు ఎలా పంచుకుంటారో చూద్దాము.

ఒక ముసల్మాను పురుషుడు చనిపోయాడు అనుకుందాము. అతనికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అపుడు భార్యకు $\frac{1}{8}$ వంతు మిగతాది $1 - \frac{1}{8} = \frac{7}{8}$

ఇందులో కుమారునికి $\frac{2}{3} \times \frac{7}{8} = \frac{7}{12}$; కుమార్తెకు $\frac{1}{3} \times \frac{7}{8} = \frac{7}{24}$
అంటే కుమారునికి కుమార్తెకన్న రెట్టింపు వాటా.

ఒక కుమారుడు = ఇద్దరు కుమార్తెలు (వాటాల విషయంగా). అంటే ఒక పురుషుడు = ఇద్దరు స్త్రీలతో సమానం.

ఇదే సూత్రం అన్న తమ్ముళ్ళు, అక్క చెల్లెళ్ళకూ వర్తిస్తుంది. కుమారుని కుమారులకు, కుమారుని కూతుళ్ళకూ వర్తిస్తుంది.

మొత్తంమీద తేలిందేమంటే ఒక్క తల్లితండ్రి విషయంలో తప్ప (అదయినా చనిపోయిన వ్యక్తికి సంతానం, కుమారునికి సంతానం ఉంటే) వాటాల విషయంలో వివక్షలేదు. ఇద్దరికీ $\frac{1}{6}$ వంతు వస్తుంది.

కాగా, చనిపోయిన వ్యక్తికి సంతానం, కుమారునికి సంతానం లేకపోతే తల్లికి $\frac{1}{3}$ వంతు మాత్రమే వస్తుంది. (దానికి కొన్ని షరతులు ఉన్నాయనుకోండి.)

చనిపోయిన వ్యక్తికి సంతానం, కుమారుని సంతానం లేకపోతే తండ్రి వాటాదారుల (Sharers) వాటా పోను మిగతాదానికి ఇతరులతో కలిపి పంచుకునే హక్కు పొందుతాడు.

ఉ॥ ఒకవ్యక్తి చనిపోయాడు అని భావిద్దాము. అతనికి భార్య, తల్లి, తండ్రి ఉన్నారు. అంటే సంతానం లేదు.

భార్యకు $\frac{1}{4}$.

అప్పుడు భార్యకు $\frac{1}{4}$, తల్లికి $\frac{1}{3} \times (1 - \frac{1}{4}) = \frac{1}{3} \times \frac{3}{4} = \frac{1}{4}$; తండ్రికి $1 - (\frac{1}{4} + \frac{1}{4}) = 1 - \frac{1}{2} = \frac{1}{2}$ అంటే తల్లికన్నా ఎక్కువే తండ్రికి వస్తుంది.

అలాకాక తల్లి తండ్రిమాత్రమే అతనికి వున్నప్పుడు భార్యలు లేరు, సంతానం లేదు, అప్పుడు తల్లికి $\frac{1}{3}$ వంతు.

మిగతాది తండ్రికి అంటే $1 - \frac{1}{3} = \frac{2}{3}$ వంతు.

ఇలా సర్వేసర్వత్రా పురుషుడు ఇద్దరు స్త్రీలతో సమానము అనే సూత్రం (పై చెప్పిన ఒక్క సందర్భంలో తప్ప) వర్తిస్తుంది.

"పురుషుని భాగం ఇద్దరు స్త్రీల భాగానికి సమానం" (ఖుర్ఆన్ 4:11) ఇదే వైఖరిని మహమ్మదు దస్తావేజులపై సాక్షిసంతకాల విషయంతో కూడ ప్రదర్శించాడు. దస్తావేజుపై ఇద్దరుపురుషులు సాక్షిసంతకం చేయాలట. లేకపోతే ఒక పురుషుడు మరియు ఇద్దరు స్త్రీలు దస్కతు చేయాలట. ఇలాంటి వ్యత్యాసాలు కోకొల్లలుగా మనకు దర్శన మిస్తూనేవుంటాయి.

"ఇద్దరు పురుషులను దానికి సాక్షులుగా పెట్టుకోవాలి. ఇద్దరు పురుషులు లభించని పక్షంలో, ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు సాక్షులుగా ఉండాలి. ఎందుకంటే వారిలో ఒకామె మరచిపోతే, రెండవ స్త్రీ ఆమెకు జ్ఞాపకం చేస్తుంది." (ఖుర్ఆన్ 2 : 282)

ఇంతకుపూర్వం చెప్పినట్లు స్త్రీలకు వాటాలు ఏర్పరిచాడు మహమ్మదు.

"తల్లిదండ్రులు, దగ్గర బంధువులు విడిచివెళ్ళిన ఆస్తిలో స్త్రీలకుకూడ భాగంఉంది - అది తక్కువైనాసరే, లేక ఎక్కువైనా సరే." (ఖుర్ఆన్ 4:7)

ప్రశ్న అల్లా ఏమంటే 7వ శతాబ్దిలో మహమ్మదు ఏర్పరచిన సూత్రం (పురుషుని వాటా ఇద్దరు స్త్రీల వాటాతో సమానం అనేది) ఇరవయ్యో శతాబ్దంలో అనుసరించాలా అనేది. ఇది చర్చనీయాంశం కాదా ! తేడాలను నేడు ఆమోదించగలమా ! కనుక మార్పు అనివార్యం అనక తప్పదు. ఇది స్త్రీ పురుష వివక్ష అనటంలో సందేహంలేదు. దీని విపరీతపరిణామం ఇటీవల పాకిస్తాన్‌లో కన్పడుతున్నది. పాకిస్తాన్ ఇటీవల (జియా నియంత అయినతరువాత) ముసల్మాను రాజ్యాంగాం చలామణీ అవుతున్నది. అందులో షరియత్ 'లా' అంటే ముసల్మాను ధర్మశాస్త్రం అమలుపరచాలనే ప్రయత్నం సాగుతున్నది. ఆ ధర్మశాస్త్రం క్రూరమూ, అన్యాయము కూడాను. దొంగ తనంచేస్తే చేతులు తెగనరకాలి. హత్యకుబదులు హత్య. నిందితుని ప్రాణాన్ని

త్రీయుమని కోరేహక్కు హతుడి బంధుగులకు ఉంటుంది. వ్యభిచారిణికీ వ్యభిచార పురుషుడికి నూరు కొరడాదెబ్బలు. పవిత్ర స్త్రీపై వ్యభిచార నిందారోపణ చేసి సాక్ష్యం తేలేని వ్యక్తికి ఎనభై కొరడా దెబ్బలు. మచ్చుకు ఇవి కొన్ని మాత్రమే. ఇది మధ్యయుగపు ధర్మశాస్త్రం. ఇపుడు దీనిని అమలు జరిపి న్యాయస్థానాలలో పని జరిగే తీరును కూడా నిర్ణయిస్తారట. ఒక పురుషుడి సాక్ష్యం ఇద్దరు స్త్రీల సాక్ష్యంతో సమానమని ఇటీవల శాసనం చేస్తామన్నారు పాకిస్తానులో. దాంతో సనాతన స్త్రీలు సైతం ఆందోళనలో పాల్గొన్నారు. ప్రభుత్వం దుర్మార్గంగా ఆ ఊరేగింపుపై లాఠీఛార్జీ చేసింది. ఇది ఆ దేశంలో ఎంతో అలజడికి దారితీస్తున్నది. మత ధర్మాల ప్రకారం ప్రజా జీవితాన్ని, లౌకిక వ్యవహారాలను శాసించే రోజులు గతించాయని ఎంత త్వరగా పాలకులు, మతాధిపతులు గ్రహిస్తే అంతమంచిది అందరికీ.

—(౦)—

9. వేర్పాటు (SEGREGATION)

ముసల్మాను సమాజంలో ఉన్న పరదాపద్ధతి ఆధునికుల విమర్శలకు గురి అయింది. దానినే తమ ప్రత్యేకతగా, విశిష్టతగా సనాతన ముసల్మానులు పేర్కొంటున్నారు. పలురకాల వాదనలతో సమర్థిస్తున్నారు. ఆ పద్ధతిని, ఆ ఆచారాన్ని దూషించినా, భూషించినా విషయం సంపూర్ణంగా తెలిసికొని దానిని గురించి, దాని మంచి చెడ్డల గురించి, దానిని కొనసాగనివ్వాలా లేక అంతం చెయాలా అనే దాని విషయమై - ఒక నిర్ణయానికి రావడం అవసరమవుతోంది. అందుకు ఎంతో విషయ పరిశీలన, సామాజిక అవగాహన, చారిత్రిక దృష్టి, ధర్మశాస్త్ర పరిజ్ఞానం, వివేచనా దృక్పథం మనకు కావాలి.

మనం మున్ముందుగా కొంత చరిత్రను అధ్యయనం చేయాలి. కందమూలాలను తిని జీవితం వెళ్ళపుచ్చుకునే రోజుల్లో, విత్తనాలు వెదజల్లి తద్వారా పెరిగిన పైరును కోసికొని భుక్తి గడుపుకునే కాలంలో స్త్రీకి పురుషునితో సమాన హోదా ఉండేది. ఆనాడు దేవతలు ముఖ్యంగా స్త్రీమూర్తులు. గ్రీసులో, రోములో, మనభారతదేశంలో స్త్రీదేవతల దేవాలయాలు ఉండేవి. స్త్రీలే పూజారిణులుగా ఉండేవారు. ప్రవక్తలుగా, న్యాయాధిపతులుగాకూడ ఉండేవారు. ఈజిప్టులో, బాబిలోనియాలో, ఫొనోషియాలో స్త్రీలకు మతపరంగా చాలప్రాముఖ్యత ఉండేది. సింధు నాగరికతలో 'అమ్మ తల్లి'కి పూజలుజరిగేవి. ఈనాడది గ్రామదేవతపూజగా దక్షిణాదిన మనకు దర్శనమిస్తున్నది.తరువాత కాలంలో పరిస్థితిమారింది. సమాజంలో ఉత్పత్తి విధానాలు మారినాయి. పురుషులకు ప్రాధాన్యత వచ్చింది. దాంతో పూజచెయ్యటం, బోధించటం, చదువు చెప్పటం, ఉపదేశం చెయ్యటం పురుషులు మాత్రమే చేయదగు పనులుగా కేటాయింపు చేసుకున్నారు పురుషులు. తరువాత దేవుళ్ళంతా పురుషులే. ప్రవక్తలంతా పురుషులే. మతకర్తలంతా మగవారే. మోషే (MOSES),మహావీరుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తు, మహమ్మదు అంతాపురుషులే. ప్రజాజీవితాన్ని పాలించింది, శాసించింది, నడిపింది ఆనాడు వారే. సాధారణంగా క్రొత్తమతాలు ఆవిర్భవించినపుడు స్త్రీలకు ప్రవేశం ఉంటుంది;

పరిగణన ఉంటుంది. తరువాత అది పోతుంది. యూదుల దేవాలయాలలో మొదట్లో స్త్రీలు పూజలు చేసేవారు. క్రీస్తు నాటికి ఆయనకు అనేకమంది స్త్రీ అనుయాయులు ఏర్పడ్డారు. అలాగే మహమ్మదు భార్య ఖదీజా, కుమార్తె ఫతిమా ఆయన మత వ్యాప్తి విషయంలో ఎంతో కృషిచేశారు. మతాలు నిలద్రొక్కుకున్న తరువాత స్త్రీలు గృహిణులుగా మిగిలిపోయారు. హిందూ దేశంలోకూడ అదే జరిగింది. వేదకాలంలో స్త్రీలకు ఉన్న మతపరమైన అధికారం, హోదా తరువాత మృగ్యమయింది. దీనికీ, రాజకీయాలలో జరిగేదానికీ పోలికవుంది. జాతీయ విముక్తి పోరాటాలలో ముఖ్యంగా ఆఫ్రికాలో పెక్కు దేశాలలో స్త్రీలు పాల్గొన్నారు. విజయం లభించిన తరువాత వాళ్ళను వంట ఇళ్ళకు పొమ్మన్నారు. ఇంకొక విషయం సన్యాసం గౌరవప్రదం కావడం మొదలైన తర్వాత స్త్రీని వ్యామోహ వస్తువుగా, పతన హేతువుగా నిర్ణయించి ఆమె స్థానాన్ని మరీ దిగజార్చారు. ఇది ఆదిమ మానవ సంస్కృతి ఫలితంగా జరిగిన మార్పు. అలా స్త్రీల పతనానికి మతాలు, సిద్ధాంతాలు, ధర్మశాస్త్రాలు, పురుషాధిపత్యం అన్నీ కలిసి పని చేశాయి.

స్త్రీలను గురించిన ఈ వేర్పాటు పద్ధతి భారతదేశంలో ముసల్మానుల దండయాత్రలు సంభవించిన తరువాత ఉద్భవించిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అది సరికాదు. అంతకుముందే ఈ వేర్పాటు పద్ధతి హిందువులలో కూడా వ్యాప్తిలో ఉంది. దాని రూపాలు వేరు కావచ్చును; కాని మౌలిక సూత్రం ఒకటే. దానికి ఉదాహరణలు చాలా ఉన్నాయి. వస్తువుల ఉత్పత్తి విధానంలో స్త్రీకి ప్రముఖపాత్ర లేనప్పుడు ఆమె ఇంటిలో ఉండటం జరుగుతుంది. అప్పుడామె చేయగల కార్యం సంతానోత్పత్తి మాత్రమే. ఆ బాధ్యతను ఆమె నిర్వహించడం ఆమె కర్తవ్యం అయింది. అందులోను పురుషాధిక్యతగల సమాజం మెచ్చే పద్ధతిలో సంతానాన్ని పొందాలి ఆమె. అంటే ఆమె మగశిశువులను కంటే ఆమెకు మెప్పు లభించేది. పురుషసంతాన ప్రాముఖ్యతను గురించి ఆమెకు చిన్నప్పటినుండి పాటలు నూరిపోస్తారు తల్లిదండ్రులూ, బంధుగులూను. ఆమె సంతానం తన సంతానమేనని రూఢిపరచటానికి స్త్రీని తతిమ్మా పురుషుల నుండి వీలయినంత దూరంగా ఉంచటం ప్రారంభించాడు భర్త. దాంతో

ప్రారంభం అయింది వేర్పాటు పద్ధతి. పురుషులంతా ఏనాడో ఒకనాడు భర్తలు అవుతారు కనుక మొత్తం పురుషజాతి ఈ వైఖరిని అవలంబించింది. వారి చెప్పుచేతలలో ఉన్న సమాజం దానిని నియమంగా, ధర్మంగా మార్చింది. ఇలా జరిగింది హిందువులలో కూడ. ఇదే సంభవించింది ముసల్మాను సమాజంలో.

తెగలమధ్య మానవ సమాజంలో పోరాటాలు, యుద్ధాలు సాగినపుడు ఒక గుంపు మరోగుంపును చంపేవారు. శత్రుసంహారం పరిజ్ఞాపాటవాలకు నిదర్శనంగా వీరోచితకార్యంగా చిత్రించబడింది ప్రజల మనఃఫలకాలలో. తరువాత మార్పు క్రమంగావచ్చింది. చేతికిచిక్కిన శత్రువును చంపేదాని కన్నా, తన పెంపుడు జంతువులాగే పెంచితే వారివల్ల చాకిరీ చేయించు కుంటే ఉపయోగకరమని గ్రహించింది మానవాళి. దాంతో బానిస విధానం పుట్టింది. స్త్రీలను యుద్ధంలో బందీలుగా తీసుకునేవారు. కొన్నికొన్ని పోరాటాలలో స్త్రీలు కూడా పాల్గొనేవారు; కాని కొన్నికొన్ని యుద్ధాలలో స్త్రీలు పాల్గొనకపోయినా ఓడిపోయిన వారి స్త్రీలను చెరపట్టేవారు. అంటే భర్త బానిస అయితే అతని భార్య కూడా బానిస అయ్యేది. ఇక పిల్లల సంగతి చెప్పనక్కరలేదు. అందమైన స్త్రీలు -శత్రువుల బృందంలోని వారు- చేజిక్కితే వారిని వీరులు తమ లైంగిక అవసరాలకు వాడుకోవటం ప్రారంభ మయింది. కొందరు వారిని ఉంపుడుగత్తెలుగా స్వీకరించటం కూడా జరిగింది. మరి ఇలా శత్రుకూటమికి చెందిన స్త్రీలను బందీలుగా, బానిసలుగా అసమ్మతిమీద లైంగిక వ్యాపారానికి సాధనాలుగా వాడుతున్నపుడు వారికి సంచార స్వాతంత్ర్యం ఏ వీరుడు ఇచ్చి తనకు ముప్పు తెచ్చుకుంటాడు? దాంతో అతడు వారి సంచార స్వాతంత్ర్యాలను అరికట్టాడు. అదే జరిగింది అన్ని సమాజాలలో ఆ దశలో. మొదట్లో తన తెగలోనిస్త్రీలను బానిస స్త్రీలకు కాపలాదార్లుగా, పెత్తందార్లుగా నియమించారు పురుషులు. అలా కొన్నాళ్ళు సాగింది. ఈలోగా ఉంపుడుకత్తె స్థాయిని చేరుకున్న బానిసస్త్రీ తన బానిసత్వాన్ని వదిలించుకోటానికి ప్రయత్నించి అందుకోసమై పురుషుని వలతో వేసుకొనేది. అంతటితో ఊరుకోక ఆమె అసలు తెగలోని భార్యతో పోటీపడక తప్పలేదు. అప్పుడు కుటుంబంలోని ఆధిక్యతకోసం, తగాదాలు, కలతలు, మనస్పర్ధలు మొదలయినాయి. ఇది అశాంతికి దారితీసింది.

దీనిని భరించలేని పురుషుడు అణచడానికి ప్రయత్నించాడు; కాని విఫలు డయినాడు. అప్పుడు అందరు స్త్రీలపై పురుషుడు ఆంక్షలు విధించాడు. వారికి నియమాలు ఏర్పరచాడు. వినయం, క్షమ, లజ్జ ఆమెకు విశేష లక్షణాలుగా ఉండాలన్నాడు. కుటుంబంలో స్త్రీలలో అంతస్తులు ఏర్పరచాడు. అత్త, ఆడుబిడ్డల అధికారం కోడళ్ళపై నెలకొల్పబడింది. కుమార్తెలపై తల్లి అధికారం సుస్థాపిత మయిందప్పుడు. ఇది ఒక్కసారిగా అమాంతంగా జరిగిన పనికాదు. సమాజ పరిణామ క్రమంలో సాగిన అనేక చర్యల పర్యవసానం. దాంతో కుటుంబంలో ఒకరకమయిన శాంతి ఏర్పడింది. కుటుంబం మొత్తానికి అతడే మకుటంలేని రాజు. అతడి తరఫున కుటుంబంలో శాంతి భద్రతలను నెలకొల్పుతారు తల్లులూ, అత్తలూ, మేనత్తలూ వగయిరాలందరూ. చక్కని నిచ్చెనమెట్ల సమాజాన్ని నిర్మించి విశ్రాంతి తీసుకున్నాడు పురుషుడు. ఈ నియమాలను తలదాల్చింది స్త్రీ సమాజం. పురుషుడు విధించిన ఆంక్షలను సంతోషంగా స్వీకరించటం అలవర్చుకుందప్పటి నుండి. అతడు మంచివని ప్రకటించిన సద్గుణాలను పొందటానికి తహతహలాడింది; అంటే పురుషుడు శాసించిన విలువలను తమవిగా చేసుకుంది. అపుడు తాము పురుషుల క్రింద బానిస బ్రతుకు సాగిస్తున్నామనే స్పృహకూడ వారికి కలుగలేదు. తాము జీవించే విధానమే ఉత్కృష్టమని ప్రచారంచేసుకుంటూ పాతివ్రత్య ధర్మాన్ని, సతీసచ్చరిత్రను సాధించటానికి అహర్నిశం కృషిచేసింది. ఈ స్థితి వచ్చినపుడు పురుషుడు స్త్రీపై సంపూర్ణ విజయం సాధించినట్లు అయింది. ఇక ఆమెను కాపలా కాయవలసిన అగత్యం అతనికి తప్పిపోయింది. ఇల్లువదలి బయటి ప్రపంచంలోకి పొమ్మని ఆ పురుషుడే ఆమెను కోరినా, చివరకు ఆదేశించినా ఆమె అంగీకరించలేక ఇంటిపట్టునే ఉంటాననే స్థితికొచ్చింది. గృహిణీ ధర్మమే ఉత్తమమని మనసారా వాదించి నమ్మింది. పురుషుడు తన అవసరాల కోసం ఏ మాటలయితే ఆమెకు చెప్పాడో ఆ మాటలనే ఆమె వల్లించింది. అది ఆమె పురుషుని ఎగతాళి చేయటానికి చేసే పనికాదు. త్రికరణశుద్ధిగా సాగించే కార్యక్రమం. అచంచల విశ్వాసంతో కూపస్థ మండూకంలా నాలుగు గోడలమధ్య, ఇతర పురుషుల దృష్టిపడని చోట, ఇతర పురుషులతో మాటామంతీ కూడ అవసరం లేనిచోట భద్రంగా ఇష్టపూర్వకంగా ఆమె కాలక్షేపం చేస్తుంది.

స్త్రీల వేర్పాటు విధానపు క్రమానుగత పరిణామాన్ని అసలు సంపూర్ణంగా అవగాహన చేసుకోటానికి ముమ్ముందుగా దీని రూపాలనుకూడ కొంత అధ్యయనం చేయాలి. కొన్నింటిని గురించి తెలుసుకోవటం మనకు అవశ్య కర్తవ్యం.

1) ఇంటిలో వేర్పాటు స్త్రీలు నివసించే భాగం, పురుషులు నివసించే భాగం.

2) గృహంలో కూడ స్త్రీ తన పురుష బంధుగులు మామ, బావ, మరిది, కుమారుడు, అన్న, తమ్ముడు మొదలయిన వారియెదుట నడయాడే తీరులో తేడాలు గమనార్హాలు.

3) ఇల్లుదాటి ఆమె వెళ్ళవలసి వస్తే వెళ్ళతగిన ప్రదేశాలు వేరుగా వుంటాయి.

4) ఇల్లుదాటి ఆమె వెడలినప్పుడు ఆమె వేషధారణ, ఆమెకుతోడు అనివార్యం అయింది.

5) పరపురుషులు తన పురుష బంధువుల కోసం వచ్చినపుడు ఆమె కాని, వచ్చినవారు కాని సంచరింపవలసిన పద్ధతి-తలుపు చాటునుండి సమాధానం చెప్పటం వగైరాలు.

6) ఆమె చేపట్టదగు వృత్తులు - నర్సింగు, టైపింగు, టీచింగు, గృహాలంకరణ, హోమ్ సైన్సు లాంటివి కొన్ని మాత్రమే.

7) ఆమె అంతస్తు, హోదా - పురుషుని హోదాతో పోల్చితే చాలా తేడాలుంటాయి. ఇలా ఎన్నో మరెన్నో చెప్పవచ్చు.

ఇక్కడ మనం ముఖ్యంగా మరొక విషయాన్ని విస్మరించరాదు. భారతదేశం లాంటి దేశాలు పేద దేశాలు. వ్యవసాయం ప్రధాన భూమిక వహిస్తున్నది. పురుషుడు వ్యవసాయంలో స్త్రీ తోడ్పాటును ఆశిస్తాడు. దాంట్లో పని విభజన మొదలవుతుందామేరకు. నాగలి చేతబూని పొలం దున్నుతాడు పురుషుడు. స్త్రీ మాత్రం కలుపు తీస్తుంది, నాట్లు వేస్తుంది, విత్తనాలు చల్లుతుంది, పైరుకోత కోస్తుంది; గడ్డిమోపులు ఇంటికి తెస్తుంది,

ధాన్యం తూర్పార పట్టటంలో సాయంచేస్తుంది. ఇలా వ్యవసాయం సాగే అన్ని దశలలోనూ - ఇంచు మించుగా - ఆమె ప్రమేయం ఉంటుంది. ఆమె శ్రమచేస్తుంది. అలాంటి పరిస్థితిలో బీద స్త్రీలను ఇళ్ళలోనే ఉండ మనటం పురుషుడికే నష్టదాయకం. కనుక తనతోపాటు పొలానికి రమ్మంటాడు. ఒకనాడు పశుసంపద తక్కువగా ఉన్న చైనాలో ఆమెచేత కాడి లాగించాడు పొలంలో పురుషుడు. అలాంటప్పుడు వారికి ఘోషా పెట్టటం కష్ట మవుతుంది. ఇంటిలో నుంచి బయటికి రాకూడదని, పరాయి పురుషుల దృష్టి వారికి సోకరాదని, పర పురుషులతో సంభాషించ రాదని ఆంక్షలు పెట్టడం అసౌకర్యం అవుతుంది. కనుక బీద స్త్రీలలో, ఖచ్చితంగా చెప్పాలంటే పొలాల్లో శారీరక శ్రమచేసే స్త్రీలలో స్త్రీల పేర్పాటు పద్ధతి నశించింది; కాని ఇక్కడ విచిత్ర పరిణామం సంభవించింది. కుటుంబానికి కాస్త ఆస్తి, వనరులు ఏర్పడగానే పురుషుడికి తన గౌరవం (ఇజ్జత్) జ్ఞాపకమొచ్చింది. తన వంశమర్యాద గుర్తుకువచ్చింది. వెంటనే తన కుటుంబంలో స్త్రీలకు పరదాపద్ధతులు ప్రవేశపెట్టారు; స్త్రీలు ఈ పరిణామాన్ని ఆహ్వానించారు. వాళ్ళకు బండ చాకిరీ తప్పుతుందని వారు సంతోషించారు కాని దరిమిలా వారికి కలిగే ప్రమాదాన్ని వారు గుర్తించలేక పోయారు. దూరదృష్టి లేనివారు ఎప్పుడూ ఇలాగే చిక్కులలో పడతారు కదా! అదే సంభవించింది స్త్రీల పరంగా. శారీరక శ్రమ చేయకుండా పరదాలో ఉండటమే మహాద్భుతంగా పరిగణించడం సాగించారు స్త్రీలు. అప్పుడు సమాజంలో బీదవారు ధనవంతులను అనుకరించాలని ప్రయత్నించారు. కుల వ్యవస్థ అమలులో ఉన్న సమాజంలో తక్కువ కులాలని చెప్పబడే వారిలోని వారు పై కులాలుగా పేర్కొనబడే వారి అలవాట్లను, సంప్రదాయాలను, జీవితరీతులను అలవర్చుకోవాలని తాపత్రయపడ్డారు. దీనినే ఎస్. శ్రీనివాసన్ అనే పండితుడు 'సంస్కృతీకరణ' (Sanskritization) అంటాడు. దీనికి ఉదాహరణ మరో రంగులో కూడ చూడవచ్చును. 'బ్రాహ్మణ' కులంలో వారికి భగవంతునిపై భక్తి శ్రద్ధలు తగ్గి పూజా పునస్కారాలను తగ్గించు కుంటుంటే 'శూద్ర' కులంలోనివారు వాటిని పెంచుకుంటున్నారు. దళితులపై అత్యాచారాలు ఈనాడు శ్రామిక వర్గాలకు చెందిన 'శూద్ర' కులాల వారు చేయడం గమనార్హం.

పల్లె ప్రాంతాలలో బీద ముసల్మాను స్త్రీలు పరదాను 'పూర్తిగా' పాటించలేరు. కాని బస్తీలలో, నగరాలలో అదిబాగా చోటు చేసుకున్నది. చిన్నచిన్న దుకాణాదారులు, వృత్తులవల్ల జీవించేవారు మొదలగు మధ్య తరగతిలో ఆర్థికంగా తక్కువస్థాయి వారు బస్తీలలో దీనిని సంపూర్ణంగా పాటిస్తున్నారు. వారికి విద్యాగంధం తక్కువ. వారే మతగురువుల అడుగు జాడలలో పయనించేది. మతగురువుల కుటుంబాలలో ఈ పద్ధతి మహా కట్టు దిట్టంగా అనుసరింపబడుతోంది. కాగా ధనవంతులు మధ్య తరగతిలో ఆర్థికంగా పైస్థాయికి చెంది - డాక్టర్లుగా, ఉపాధ్యాయినులుగా, అధ్యాపకులుగా వగయిరా ఉద్యోగాలు-చేస్తున్న స్త్రీలు పరదాను పాటించటం లేదు. ముస్లిం సమాజం వారిని ఏమీ అనదు. వారిని శాసించ ప్రయత్నించదు. తతిమ్మా వారిపై బుసకొట్టుంది. ఇదొక విచిత్రి గాథ.

ఇక పరదా తీవ్రతను పరిశీలించాలంటే మనదేశంలో వింధ్యకు ఉత్తరాన ఉన్న ప్రాంతాన్ని ముఖ్యంగా తీసుకోవాలి. ఉత్తరాదిన ఉన్న ఉధృతం దక్షిణాదిన లేదు. ఒక్క హైదరాబాదు నగరంలోను, తెలంగాణ ప్రాంతంలోని బస్తీలలోను కొట్టవచ్చినట్లు కన్పడుతుంది. దీనికి చారిత్రక కారణాలు ఉన్నాయి. ముసల్మాను రాజ్యం దక్షిణాదిన అంతగా విస్తరించ లేదు. అడపాదడపా వారి సామ్రాజ్యంలో ఆ ప్రాంతంలో కొన్ని భాగాలు చేరినా, అవి అలా ఎక్కువ కాలం ఉండలేదు. ముసల్మాను రాజ్యం ఒక్క హైదరాబాదు సంస్థాన ప్రాంతంలో తప్ప ప్రవేశించలేదు.

ఈ ఆచార విస్తరణ, వ్యాప్తి వీటిని గమనించిన తరువాత ఈ ఆచారం యొక్క పద్ధతులు, రీతులు ఎలా ఉన్నాయో తెలుసుకునే ముందు ఈ విషయమై ఖురాన్‌లో చెప్పబడినది చూడటం చాలా అవసరం కనుక పరిశీలిద్దాం.

"ముందుగా నీవు వచ్చేవనని ప్రకటించి, ఇంటిలోని వారికి శాంతి కలగాలని దేవునికోరి తరువాత పరుల ఇంటిలోనికి ప్రవేశించుము."

(సురా 24 ఆయత్ 27)

"ఇంట్లో ఎవరూ లేకపోతే అనుమతి లభించేవరకు ఇంట్లోకి రావద్దని చెప్పటం జరిగితే వెళ్ళిపో. అది నీకు శ్రేయస్కరం. అల్లాకు తెలుసు నీవు ఏమిచేస్తున్నావో." (సురా 24 ఆయత్ 28)

"విశ్వాసులయిన స్త్రీల చూపులను క్రిందికి దించమని చెప్పేది; వినయంగా ఉండమని శాసించేది. పైకి కన్పించతగిన అలంకారాలను మాత్రమే ప్రదర్శించమని చెప్పవలెను. స్త్రీలు తమ వక్షస్థలాల పై ఆచ్ఛాదనలు వేసుకోవలెను. తమ అలంకారాలను భర్తలు, తండ్రులు, భర్త తండ్రులు (మామలు), కుమారులు, భర్త కుమారులు, సోదరులు, సోదరుల కుమారులు, సోదరీల కుమారులు. పై చెప్పబడిన వారి భార్యలు, బానిసలు నపుంసకులైన పురుష పరిచారకులు, స్త్రీ యొక్క నగ్నత్వం తెలియని పిల్లలు వీరికితప్ప ఇతరుల యెదుట ప్రదర్శించరాదు. నేలపై పాదతాడనం చేయవద్దు; అలాచేస్తే పాదాలను దాచిపెట్టి అలంకారాలు బయటపడతాయి ...." (సురా 24: ఆయత్ 30)

"సంతానం కనే వయస్సుదాటిన స్త్రీలు - వివాహమాడే అవకాశము, ఆశలేని పరిస్థితులలో - తమ అలంకారాలను బహిర్గతం చేయని విధముగా తాము కప్పుకునే పై వస్త్రాలను ధరించుకున్నా పాపంలేదు. అయినా కప్పుకున్న వస్త్రమును త్యజించకుండుట ఆమెకు మేలు ...."

(సురా 24: ఆయత్ 60)

"ప్రవక్త భార్యలను ఏమైనా అడగదలిస్తే, తెర అవతలనుండి అడగండి. అది మీ హృదయాలకు ప్రవక్త భార్యల హృదయాలకుమంచిది." (సురా 33, ఆయత్ 53)

"తమ తండ్రులతో, కుమారులతో, సోదరులతో, సోదర కుమారులతో, అక్కచెల్లెళ్ళ కుమారులతో, పై చెప్పినవారి స్త్రీలతో, బానిసలతో భార్యలుగా ఉన్న స్త్రీలు స్వేచ్ఛగా ప్రసంగించటం పాపం కాదు."

(సురా 33 ఆయత్ 55)

"(ఇంటినుండి) బయటికి వెళ్ళేటప్పుడు తాము కప్పుకునే వస్త్రమును బాగా దగ్గరకు లాక్కోమని మీ భార్యలకు, కుమార్తెలకు, విశ్వాసులైన స్త్రీలకు చెప్పవలసినది. అది శ్రేయస్కరం. ఎందుకంటే వారిని గుర్తుపట్టని నిమిత్తమున్నా, వారికి చీకాకు కలుగజేయకుండాను.

(సురా 33: ఆయత్ 59)

ప్రవక్త ఆచారాలు ఇతరులకు ఆమోదయోగ్యాలు. ఆయన మాటలు శిరోధార్యాలు. కనుక ఈ క్రింది అంశాలు మనకు స్పష్టమవుతున్నాయి.

1) కుటుంబంలోని దగ్గర బంధువులకు తప్ప ఇతరులకు ఆమె అలంకారాలను చూపరాదు. ఆ బంధువులను పేర్కొనడం జరిగింది.

2) పురుషులు, స్త్రీలు క్రిందికిచూస్తూ మాట్లాడవలెనే కాని చూపులు కలిపి మాట్లాడరాదు.

3) స్త్రీలు తమ వక్షస్థలాలను కప్పుకోవలెను.

4) వివాహిత స్త్రీ స్వేచ్ఛగా మాట్లాడదగు బంధువర్గపు పురుషులను జాబితాగా చెప్పబడింది.

5) వివాహిత స్త్రీతో పరపురుషుడు మాట్లాడవలసివస్తే తెర అవతల నుండి మాట్లాడవలెను.

6) పిలుపుకు జవాబు లేకపోయినా, తిరిగి పొమ్మన్నా, పరాయి పురుషుడు ఇంటిలో అడుగు పెట్టరాదు.

7) స్త్రీ ఇల్లువీడి బయటికి వెళ్ళవలసివస్తే తన దుస్తులచుట్టూ పెద్ద వస్త్రమును - ఇతరులు తనను స్త్రీగా గుర్తించగలిగే లాగున్నా, తనను చీకాకు పరచకుండానూ దగ్గరగా కప్పుకోవలెను.

పరపురుషులు ఆమెను చూడరాదు. అందుచేత ఇంటిలో పురుషులు తిరిగేభాగానికి, స్త్రీలు తిరిగే భాగానికిమధ్య దట్టమైన తెర అవసరమయింది.

ముఖ్య బంధువుల దగ్గర దుస్తులపై కప్పుకునే వస్త్రము లేక అంగరఖా లేకుండా ఆమె తిరుగవచ్చును. మరీ దగ్గర బంధువులతో ఆమె మాట్లాడ వచ్చును. ఈ ప్రకారముగా ఇంటిలో జనానా (స్త్రీలుండు చోటు), మర్దనా (పురుషులు తిరుగాడ తగిన ప్రదేశము), తెర, బురఖా అవతరించాయి. ఇస్లాంమతం పుట్టిన అరేబియాదేశం ఎడారిప్రదేశం కనుక, బురఖా అవసరమయి ఉండవచ్చునని జామిలాబ్రిజ్ భూషణ్ అనే రచయిత్రి ఊహ. అది సరికాదేమో. అలాగయితే పురుషులకు స్త్రీలపై విధించిన ఇతర అంక్షలు లేవుకదా? అన్నింటిని, అన్ని అంక్షలను కలిపి సమన్వయ దృష్టితో అవగాహన చేసుకోవాలి. పోనీ, భారతదేశ ఆచారముల నుండి ముస్లిం సమాజానికి పరదాపద్ధతి పట్టువడినదని ఊహిద్దామా? పరదాకు ఆధారాలు ఖురాన్‌లో ఉన్నాయి. దీనినిబట్టి పరదాపద్ధతి ఇస్లాం మతంలోకి భారతదేశ ఆచారాలనుండి చొచ్చుకొని పోలేదని తెల్పుతుంది.

ఉత్తర ప్రదేశ్‌లో ముస్లిం స్త్రీలను గురించి శ్రీమతి జారివాభట్టీ వ్రాసిన వ్యాసంలో గోషా పద్ధతిని గురించి కొంత వివరణఉంది. ఆ ప్రాంతంలో ముస్లిం రెండు తెగలు. 1. అషాఫ్రులు 2. అషాఫ్రిపేతరులు. అషాఫ్రులు నాలుగు కులాలవారు. i సయ్యదులు, షేకులు, మొగలాయిలు, పఠానులు. ఇది వారి వరుసక్రమం. వీరంతా విదేశాలనుండి భారతదేశానికి వచ్చినవారు. అషాఫ్రేతరులు భారతదేశ వాసులుగా ఉంటూ ఇస్లాంమత స్వీకారం చేసినవారు. స్త్రీలయెడ వీరిరువురి వైఖరులు వేరువేరుగా ఉన్నాయి.

ముున్ముందుగా ఇస్లాం అరేబియాలో సంస్కరణోద్యమంగా వచ్చిందని గ్రహించాలి. భారతదేశంలోకి వచ్చేటప్పటికి - ముఖ్యంగా ఉత్తర భారత దేశంలోకి వచ్చేటప్పుడు - విదేశాలనుండి వచ్చిన మహమ్మదీయుల వెంట ఇస్లాం మతం వచ్చింది. అంతేకాని అప్పటి మనదేశంలోని ప్రజా జీవితం సంస్కరణ కోరేస్థితితో ఉంటే, ఆ పని చేయటానికి రాలేదు. ఈ ముఖ్యమైన తేడాను మనం గుర్తుంచుకోవాలి.

అషాఫ్ కుటుంబంలో స్త్రీయొక్క విశిష్టస్థానం నిర్దేశింపబడినది. భార్యగా, తల్లిగా ఆమె తన విధ్యుక్తధర్మాన్ని నెరవేర్చాలి. కన్యాత్వమును కాపాడుకొనుట, అందము, మార్దవము, వినయం, ఆత్మత్యాగం, సౌకుమార్యం, స్పందించే శక్తి, కుటుంబం యెడ గౌరవము ఇవి ఆమె మంచి గుణాలు. ఆమె తన పాత్రను పోషించటానికి ఉపకరిస్తాయి. పుట్టినప్పటి నుండి ఆమెను వివాహానికి మాతృత్వానికి తయారుచేస్తారు. ప్రేమను గురించి పాటలుపాడతారు కాని, అది ఆచరణలో నిషేధం. ఆమె పుట్టింటిలో "అమానత్" (పరాయి మనిషి) లేక 'పరాయిధన్' (ఇతరుల ఆస్తి). ఇప్పటికి ఆడపిల్లపుట్టి విచారగ్రస్తు అవుతున్నారు. కారణం - ఆమెమీద ఎక్కువ ఖర్చు పెట్టాలిట; ఆమెను రక్షించాలట. "నాలుగు రోజులుఉండి పోయే అతిథి" అని ఆమెను అభివర్ణిస్తారు.

స్త్రీని పురుషులు చూస్తే వారు ఆకర్షితులవుతారు. పురుషుడు సంయమనం (కంట్రోలు) చూపనక్కరలేదు. తమను రక్షించుకునే బాధ్యత స్త్రీల పైన ఉంటే. ఒక స్త్రీ దుర్మార్గంగా ప్రవర్తిస్తే ఆ తప్పు స్త్రీదే. పురుషులకు

శిక్షలేదు. ఇన్ని ఆంక్షలతో ఉన్న జీవితాన్ని సహజంగా స్త్రీలు ఆమోదించ లేరు. కనుకనే శిక్షణకావాలి. తండ్రికి, సోదరునికి, మామకు, భర్తకు అంటే పురుషుల పెత్తనానికి ఆమె లొంగివుండాలి. వధువు అత్తింటికి పోయేటప్పుడు పాడే పాటలలో "తండ్రీ! మేము మీ ఆవులము. నీవు మమ్మల్ని ఏ గాటికి కట్టివేస్తే అక్కడే ఉంటాము" అని ఉంది.

అషార్ఫేతరులు పరదా పాటించరు. పరదా గౌరవానికి చిహ్నం. కనుక వారిని తక్కువ గౌరవం కలవారినిగా చూస్తారు. వాళ్ళు భార్యలుగా, తల్లులుగా ఉంటూనే రోజూ శ్రమ చేస్తారు పురుషులతోపాటు. వాళ్ళుకూడా పురుషులకు లోబడి ఉండాల్సిందే.

ముస్లిం స్త్రీల పరదాయొక్క తీరుతెన్నును మూడు రకాలుగా ఉంటాయియనీ, అవి :

1) మగ బంధువులతో సంచరించే తీరు.

2) స్త్రీలు వేరు, పురుషులు వేరుగా ఉండటం.

3) ఆమె బయటికిపోవటానికి అనువైన ప్రదేశాలు, కాని ప్రదేశాల నిర్దేశన.

అనీ భావిస్తే అపుడు ధరించే పరదా వేరుగా వుంటుంది. హిందువులలో కూడ 1. 3 రకాల పరదా ఉన్న విషయాన్ని మరచిపోరాదు.

హిందువులు మేలిముసుగును (గుంగుట్) వాడతారని మనం చూస్తున్నాం. హిందువులలో బురఖా (పూర్తి ముసుగు) లేదు. ముసల్మానులలో ప్రత్యేకతగా బురఖాను (పూర్తిముసుగు) పేర్కొనవచ్చు. బురాఖా వేసుకొన్న స్త్రీయొక్క పాదాలు, ముంజేతులు, కన్నులు మాత్రం కనపడతాయి. కొంతమంది వేసుకునే బురఖాలో చూడటానికి ఆ బురఖాకు కళ్ళ ఎదుట రెండు కంతలుంటాయి. ముక్కును కప్పటానికి వేరేవస్త్రం ఉంటుంది. రాత్రివేళ బురఖా సంగతి తెలియని బాలుడో బాలికయో, పూర్తి బురఖాలో ఉన్న వ్యక్తినిచూస్తే దయ్యమో, భూతమో అని భయపడగల అవకాశం ఉన్నది.

'వస్త్రాలో ఉన్న భారత స్త్రీలు కూపస్థ మండూకాలు' అనే పేరుతో పెట్రీషియాజెఫ్రీ అనే వనిత ఢిల్లీ నిజాముద్దీన్ దర్గావద్ద ఉండే ముసల్మానుల స్త్రీలను గురించి పరిశోధన చేశారు. దర్గాను పరిరక్షించేవారు, దర్గాలో

ప్రార్థనాదులు చేసేవారు పురుషులు. వారికి ముస్లిం సమాజంలో ఉన్నత స్థానం ఉంది - వారు సయ్యదులు. 'ప్రవక్త' కుమార్తె సంతతి వారమని వారు చెప్పుకుంటారు. వారు ఇతర ముసల్మానులతో వియ్యమందరు. మత రక్షకులుగా వారికి చాల బాధ్యత ఉన్నదని వారు భావిస్తారు. వారి స్త్రీలూ అంతే. బురఖా ఇంకోరకం కూడా అమల్లోవుంది. గల్ఫ్ దేశాల్లో కొందరు స్త్రీలు పూర్తి బురఖా వేసుకొనుటే కాక ముక్కులపై తోలుపట్టాలు నల్లరంగువి కూడా ధరించే ఆచారంవుంది.

నిజాముద్దీన్ గ్రామంలో పీర్‌జాదా వంశంవారు వంశానికి ప్రాధాన్యత ఇస్తారు. పగలు బయటికిరారు. మశీదులోకి వారికి ప్రవేశంలేదు. దర్గాలో ఉత్సవం చూడటానికి వారికి అనువైన ప్రదేశం ఉండదు. బయటికివెళ్తే పూర్తి బురఖా వేసుకొని వెళ్తారు. ఇంట్లో మామ, బావ (భర్త సోదరుడు) వగయిరాలు తమ ఎదుటకు వస్తే దుప్పటాతో వక్షస్థలం కప్పుకుంటారు. భర్తకు పిల్లల్ని కనడమే భార్య విధ్యుక్త ధర్మంగా భావిస్తారు. పర పురుషులతో ఏ విధంగా మాటామంతీ ఉండదు. ఇప్పటికి పగలు ఇల్లు వెడలని ముసలమ్మలు ఆ ఊరిలో ఉన్నారట. ఇంట్లో వృద్ధస్త్రీల పెత్తనం సాగుతున్నది కనుక ఆచారాన్ని రక్షించాలనే తాపత్రియం ముసలమ్మలలో ఎక్కువగా ఉంటున్నదని ఒక సర్వేలో తేలింది. జనానా, మర్దానా- రెండూ ప్రతిఇంట్లో ఉంటాయి. మరీ బీదవాడైతే వాకిట్లో మంచమేసుకొని కూర్చుని తనకోసం వచ్చిపోయే పురుషులతో వీధిలోనే మాట్లాడతాడు ఇంటి తాలుకు యజమాని అయిన పురుషుడు.

ఈ బురఖాను ధరించటంవల్ల స్త్రీకి చాల అసౌకర్యం.

1) మత ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం కూడ తక్కువ.

2) నడకలో చికాకు.

3) శరీరానికి గాలి ఆడక చెమటపట్టి ఇబ్బంది పడటం.

4) దారి సరిగా తెలియక, ఎక్కవలసిన బస్సు, రైలు సరిగా గమనించలేక ఇతరులు మోసంచేస్తారేమోనని భయం.

5) కంటిచూపుకు అడ్డంకి.

6) గాలి, వెలుతురుల లేమివలన టి. బి. లాంటి వ్యాధులు సోకే ప్రమాదం. కంటి ఆస్పత్రికివచ్చే స్త్రీ రోగులలో పెక్కుమంది ముసల్మానులు.

ఇవన్నీ తెలుసు ముసల్మాను పురుషులకు. అయినా భారతదేశంలో ముసల్మాను పురుషులు బురఖా విషయంలో ఇంకా పట్టుదల చూపుతూనే ఉన్నారు. నాగరికతా ప్రభావం వారికి సోకింది. అధునాతన యంత్రాలు, వాహనాలు అన్నీ వారు వాడుతూనేవున్నారు. మోటారు సైకిలు వెనుక సీటుపై తన భార్యను కూర్చోపెట్టుకొని ముస్లిం పురుషుడు వెళ్తూండే దృశ్యం సర్వసామాన్యం. కాని ఆమె పూర్తిగా బురఖాలో ఉంటుంది. ముంజేతులు, పాదాలు మాత్రం కన్పడుతుంటాయి. మూటకట్టిన ప్రాణి అనిమాత్రం తెలుస్తుంది. ఈ దృశ్యం 20వ శతాబ్దపు నాగరికత, దాని వెన్వెంటవచ్చే ఆధునికతకూ బురఖా రూపంలో ఉన్న మధ్యయుగ పూర్వపు సంస్కృతికీగల వైరుధ్యాన్ని మన దృష్టికి తెస్తుంది.

కాలం మారుతున్నది. ముసల్మాను స్త్రీలూ మారుతున్నారు. కాని ఆ సమాజపు ఉక్కుచట్రాల పరిధిని దాటలేకుండా ఉన్నారు. ఉన్న వ్యవస్థలోనే సౌకర్యాలు కోరుతున్నారు. పర్దానుంచి బయటపడాలనే ఆకాంక్ష మాత్రం పెరుగుతూ ఉన్నది. బజారుకు, మార్కెట్టుకు తరచుగా స్త్రీలు వెళ్ళవలసిన స్థితి కలగటంతో, అనేక వ్యవహారాలు బ్యాంకులకు పోయి రావడం, దుకాణాలలో కొనుగోలుచేయడం, ప్రభుత్వం సమకూర్చే రైళ్ళు, బస్సులు ఒంటరిగా ఎక్కవలసి ఉండటం, చదువు సాగించటం, ఇతర మతాల స్త్రీల స్థితిని చూచి తెలుసుకోవడం ఇవన్నీ ముస్లిం స్త్రీలలో మార్పు వైపుకు - అంటే పర్దా తిరస్కృతికి - వారిని సుముఖులను చేస్తున్నాయి. కాని ఇటీవల పెరుగుతున్న మత చాంధసం వారిని అటకాయింపు చేస్తున్నది. ఇటీవల జాల్నాలో ముస్లిం స్త్రీలు సినిమాకు వెళ్తే మతగురువులు ఆంక్షలు విధించారు. రౌడీమూక వాటిని అమలుపరచటానికి ప్రయత్నించింది. 'ఇస్లాం మతరక్షణ' పేరుతో అంధ విశ్వాసం పోషింపబడుతున్నది.

పరదాలో ఉన్న మౌలికసూత్రం స్త్రీ ప్రపంచం వేరు, పురుష ప్రపంచం వేరు అనేది. ఎవరి విధ్యుక్త ధర్మాలు వారివి. సంతానాన్ని

కనడం, భర్తను సంతోషపెట్టటం స్త్రీ కర్తవ్యం. సంపాదించటం, భార్యను పోషించి ఆమెతో సుఖించడం పురుషుని విధి. అల్లాహ్‌కు దాసులుగా ఉండటం ఇద్దరి విధి. ఇదిసనాతన భాష్యం. దీనికి ప్రతినిధిగా మౌల్వీ మౌదూది ఉంటున్నారు. మత దృష్టిలో స్త్రీ పురుషులు సమానులు, కాని వారి ప్రవృత్తులు వ్యాపారాలు వేరువేరు (EQUABLE BUT DIFFERENT) గా ఉండాలట. ఖురాను 'ప్రవచనాలను' తుచ తప్పకుండ అమలు పర్చాలట. స్త్రీల శరీరం పిల్లలను పెంచడానికి ఉద్దేశించబడింది. శారీరకంగా, మానసికంగా స్త్రీ పురుష విభేదాలు ఉన్నాయి. ప్రకృతి స్త్రీలకు కేటాయించిన స్థానాన్ని వారు స్వీకరించాలి. స్త్రీలకు ప్రకృతి నిర్దేశించిన రంగాలతో వారు విజయం, గౌరవం, అభ్యుదయం పొందాలి. గులాబీ, మల్లె ఎలా వేరువేరు పూలో అలాగే స్త్రీ పురుషులు వేరువేరు మనుష్యులు. ఇది పాతవారి భాష్యం. అమీర్ అలీ మొదలైన సంస్కరణ వాదులు ఖుర్‌ఆన్ షరీఫ్ కు భాష్యం చెప్పే తీరును వివరించారు. ' ఖుర్ ' ఆన్ ' లోని సార్వకాలిక సత్యాలను మాత్రమే అనుసరించాలంటున్నారు.

<u>ముస్లిం రాజ్యాలలో పర్దా</u> :- ఇరానులో ముసుగు తొలగించాలని 1935లో శాసనం వచ్చింది. షా ప్రభుత్వము పతనమై ఖుమేనీ రాజ్యంవచ్చాక మరలా ప్రవేశపెట్టాలని ప్రయత్నం జరుగుతున్నది. ఛద్ర (CLOAK) పూర్తిగా శరీరాన్ని కప్పేదుప్పటి – వాడాలని ప్రభుత్వ శాసనానికి వ్యతిరేకంగా ఊరేగింపు జరిగింది. పదివేలమంది స్త్రీలు పాల్గొన్నారు. మత రక్షణ పేరుతో స్త్రీలను అణచివేయాలనే ఖుమేని వర్గపు యువకులు ఊరేగింపును విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నం చేశారు. చాలావరకు కృతకృత్యు లయ్యారు. తరువాత కొలది రోజులకే అభ్యుదయ భావాలుకల యువకుల సాయంతో మరలా మహిళలు ఊరేగారు. ఈసారి కొట్లాటకు దడిసి మత శక్తులు విజృంభించలేదు. మున్ముందు ఏమవుతుందో !

ఇండోనేషియాలో పర్దాపద్ధతి లేదు. పాకిస్తాన్‌లో ఉంది. విద్యావంతులైన స్త్రీలు పరదాను తిరస్కరిస్తున్నారు. బంగ్లాదేశ్ 1971 దాకా పాకిస్తానులో భాగం. అచ్చట ఇంకా పర్దాఉంది. టర్కీలో పరదాను కెమాల్ అటాటర్క్ తీసివేయించాడు. ఈజిప్టులో పరదాపద్ధతి క్షీణిస్తోంది. ఆఫ్గనిస్తానులో 1959 నుండి ముసుగు ధరించటాన్ని నిషేధించారు.

కొందరు అభ్యుదయవాదులు ఖురానుకు ఇలా భాష్యం చెప్తున్నారు. ఇంటిలో స్త్రీ పురుషులకు వేరువేరు భాగాలు ఆమోదించాడు మహమ్మదు. కాని, ఈనాడు వాడే బురఖాను ఆయన ఎక్కడా ప్రస్తావించలేదు. ఆయన చెప్పిందల్లా స్త్రీని తన అలంకారాలను దాచుకోమన్నాడు. వక్షోజాలు, నడుము, పొత్తికడుపు, జఘన ప్రదేశం, పిరుదులు, పిక్కలు ఆమె అలంకారాలు. కనుక వాటిని ఆమె దుప్పటితో కప్పుకోవచ్చు. జుత్తు అలంకార విశేషమని సనాతనులవాదన. కాదని సంస్కరణ వాదుల తర్కము. ముఖాన్ని కప్పుకోవలసినదని మహమ్మదు ఎక్కడా చెప్పలేదని వీరి అభిప్రాయం. మరి ప్రవక్తల భార్యల విషయం ప్రస్తావించి తెర ఇవతలినుండి పర పురుషులు వారితో మాట్లాడాలని ఆయన శాసించాడు కదా! అని సనాతనులు ప్రశ్నిస్తారు. దానికి సమాధానం ఏమంటే ప్రవక్తకు వర్తించేవి అన్నీ అందరికీ వర్తించవు; వర్తించాలని ప్రవక్త ఉద్దేశించలేదు. ఉదాహరణకు:

1) ప్రవక్త భార్యలను ఆయన మరణానంతరం ఎవరూ వివాహమాడరాదు. (సురా ౩౩ ఆయత్ ౫౩) కాని వితంతువును వివాహం చేసుకోమన్నాడు. అనాధలను ఆదరించమన్నాడు. ఆమాటకు వస్తే ఆయనే పదిమంది వితంతువులను వివాహమాడాడు.

2) ఏ ముసల్మాను పురుషుడూ ఏక కాలంలో నలుగురు భార్యల కన్నా ఎక్కువమంది భార్యలను కలిగి ఉండరాదు. మరి ఆయన ఏక కాలంలో పదిమంది భార్యలను కలిగి ఉన్నాడు. రాజాధ్యినేతగా స్త్రీల రక్షకుడిగా అతనికి ఆ అనుమతి లభించిందని ఖుర్‌ఆన్‌ను ఆంగ్లంలోకి తర్జుమా చేసిన ఒక్‌థాల్ వ్యాఖ్య. కనుక ప్రవక్తకు అల్లాహ్ అనుగ్రహించినవి అందరికీ వర్తించవు. అందుచేత పరపురుషులు స్త్రీలతో మాట్లాడరాదనే నియమం లేదు. ఎవరితో ధారాళంగా మాట్లాడవచ్చునో చెప్పారేకాని, పరాయి వారందరితో మాట్లాడవద్దని చెప్పలేదని మరో వ్యాఖ్యానం. ఇరవయ్యో శతాబ్దంలో మానవ విలువలకు నూతనార్థాలు చెప్పవలసిన ఈ తరుణంలో ఖుర్‌ఆన్‌కు బలవంతపు భాష్యం ద్వారా ప్రగతిని సాధించాలని ప్రయత్నించటం వెర్రితనమేమో! మరి కాదనగలమా!

మొదట్లో ఖుర్‌ఆన్‌కు భాష్యం చెప్పినవారు పర్షియా దేశపు వాసులు కనుక, ఆ దేశపు భావాలు ఇస్లాంలోకి వచ్చాయని లెవీ లాంటి పండితులు

ప్రతిపాదించినా, స్త్రీలను వేరుగా ఉంచటం, పడకటింటికీ వంట ఇంటికీ పరిమితం చేయటం ఆగ్నేయ ఆసియా ప్రాంతాల లక్షణమని తృప్తిపడినా లాభంలేదు. ఖుర్ఆన్‌లోని స్పష్టమైన వచనాలు ఆ మతానుయాయులను ఎంతగా ప్రభావితం చేశాయో, ఎంతగా వారిని నడిపిస్తున్నాయో మున్ముందు ఎంతగా వారి జీవితాలను శాసిస్తాయో మనకు చరిత్ర చెపుతున్నది. భావాల బలాన్ని విస్మరించి వ్యవస్థల ప్రభావాలవల్లనే పరిణామం సాగుతున్నదని భావించే 'అధునాతన' పండితమ్మన్యులు పరదా ముసల్మాను వ్యవస్థ ప్రత్యేకత కాదని ప్రకటించవచ్చు. తమకు అంతకుముందు ఏర్పడిన అభిప్రాయాల సమర్ధనకు ఆరాటపడవచ్చును. కాని భావాలు ఎంతగా జీవితాలను మారుస్తాయో ఇస్లాం మతం పూర్తిగా, తిరుగులేని విధంగా రుజువు చేసింది.

సమాజంలో సగం మందిగా ఉన్న స్త్రీలను-చివరకు మసీదులో సమష్టి ప్రార్థనకు కూడా రానివ్వకుండా-సంచార స్వాతంత్ర్యాన్ని అరికట్టటంవల్ల ముసల్మాను సమాజమే నష్టపోతున్నది. మనదేశంలో ప్రక్క ప్రక్కన పెరుగుతున్న హిందూ, క్రైస్తవసమాజాల ప్రగతి, ముసల్మాను సమాజపు చైతన్యరాహిత్యం కళ్ళకు కట్టినట్లు కనపడుతున్నాయి. వాటిని వివరంగా, స్థూలంగా వచ్చే అధ్యాయంలో తెలుసుకుందాం.

10. విద్య

ఇస్లాం మతంలో జ్ఞానసముపార్జనకు ప్రాధాన్యత ఉన్నమాట వాస్తవమే అయినా కొంతకాలానికి అది ముస్లిం సమాజంలో స్తంభించిపోయింది. జ్ఞానం అంటే మతపరమైన జ్ఞానం అనే భావం ప్రబలింది గత మూడు నాలుగు వందల ఏండ్లనుంచీ. దాంతో మతబోధకు ఉన్న ప్రాముఖ్యత మరి దేనికీ లేకపోయింది. బాలబాలికలకు మసీదులలో ఏర్పరచే మదరసాలలో 5 సంవత్సరాల విద్య గరపడం జరిగేది. తరువాత బాలురు వృత్తి విద్యలు మాత్రం అవైనా చాలా తక్కువస్థాయిలో నేర్చుకోవడం జరిగేది. బాలికలు ఇంట్లో ఉండి ఇంటిపనులు అలవర్చుకుంటూ వివాహయోగ్యత సంపాదించుకునేవారు. గృహిణీ ధర్మానికి అనుత్తమయ్యేవారు.

"ఆడపిల్లలను అజ్ఞానంలో ఉంచి చంపేవారు నష్టపడతారు" (6:14) ఖుర్ఆన్ వాక్యం. బాలికలను చంపటమనే ఆచారాన్ని నిరసించే సందర్భంలో చెప్పబడినా జ్ఞానం విషయం వచ్చింది కనుక మహమ్మదు జ్ఞానానికిచ్చిన విలువ ఇచ్చాడని విదితమవుతుంది.

మతగురువులు నడిపే పాఠశాలలలో ఖుర్ఆన్‌ను అరబ్బీ భాషలో వల్లెవేయించేవారు. బ్రాహ్మణులు వేదాలను అర్థం తెలియకుండా తిరగా బోర్లా బట్టీపెట్టినట్లు ఖుర్ఆన్ విషయంగాను అలాగే జరిగేది.

" మొగల్ సామ్రాట్టు అక్బర్ నిరక్షరాస్యుడు కదా అతనికి ఏంలోటు వచ్చింది? అని ప్రశ్న వేస్తూ మొగల్ రాజ్య పతనానంతరం ముస్లింలను పెద్దగా చదవనీయలేదు మతగురువులు. ఇలా అంటే ముస్లింలలో పండితులు, విద్వాంసులు, కవులు, కళాకారులు లేరనికాదు. వారికి మతగురువుల వల్ల పెద్దగా ప్రోత్సాహం ఉండేది కాదని భావం. మొగలాయీల కాలంలో ఉన్నత కుటుంబాలలోని, ధనిక కుటుంబాలలోని స్త్రీలకు విద్యాబుద్ధులు చెప్పించేవారు. విదుషీమణులైన విధవలు ఉపాధ్యాయ వృత్తి చేపట్టి బాలికలకు విద్యాబోధ చేసేవారు. మతబోధ, నీతిబోధ సాగేది వారి పరిపాలనలో.

శారీరక శ్రమచేస్తూ పొలాల్లో పనిచేసే స్త్రీలకు, ఇతరత్రా పనులు చేసే స్త్రీలకు చదువు శూన్యం. అందువల్ల ముస్లిం సమాజంతో

ఒకవైపు కవయిత్రులూ, రచయిత్రులూ, విదుషీమణులూ కన్పిస్తే మరో వైపు బహుసంఖ్యాకులు అజ్ఞానాంధకారంలో మునిగితేలటం కనపడేది.

భారతదేశానికి ఇంగ్లీషువారు వచ్చిన తరువాత తమ సామ్రాజ్యాన్ని ధ్వంసం చేశారని ముస్లింలకు ఇంగ్లీషువారిమీద, వారి భాషా సంస్కృతుల మీద విపరీతమైన కోపం ఏర్పడింది. దాంతో వారిదగ్గర నౌకరీకి తయారు కాలేదు ముస్లింలు. వారి భాషా సంస్కృతులను అధ్యయనం చేయుటానికి నిరాకరించారు. అలా మరీ వెనుకబడి పోయింది ముస్లిం సమాజం యావత్తు విద్యాపరంగా. విద్యలో ముస్లింలు తదితర మతస్తులకన్నా ఎంతగా వెనుకబడి పోయారో విదితమవుతుంది. పురుషులే వెనుకబడి ఉంటే ఇక స్త్రీలస్థితి మరి చెప్పనక్కరలేదు కదా!

వారి విద్యలేమికి కారణాలు అనేకంగా వున్నాయి.

1) స్త్రీలు గృహనిర్వహణకు, సంతానోత్పత్తికి మాత్రమే ఉద్దేశించబడిన వారుగా భావించుట.

2) బాల్యవివాహాలు మెండుగా ఉన్నందువల్ల, పదేండ్లు నిండే వరకు-అసగా ఈడేరే వయస్సు సమీపిస్తున్న దనంగానే-చదువు మాన్పించేవారు.

3) పెళ్ళి అయిన తరువాత ఆమె సంచార స్వాతంత్ర్యం పై ఆంక్షలు ఏర్పడడంతో అక్షరజ్ఞానసముపార్జనకు ఆటంకాలు ఎక్కువయినాయి.

4) చదివిన కొద్ది చదువూ మతపరమైనది కావటం, ఇతరత్రా తదవకాశానికి అవకాశాలు సన్నగిల్లటం, ప్రపంచజ్ఞానం సంపాదించుకోవటానికి ఇలువదలి వెళ్ళలేకపోవటం, అన్నీ తెలిసినా ఆధునిక విద్యయొక్క ప్రాముఖ్యత తెలియకపోవటం. ఇవన్నీ కలిసి అడ్డుపడ్డాయి ఆడపిల్ల విద్యావిషయాలకు.

ఇటీవల స్త్రీ విద్య అవసరాన్ని గుర్తిస్తున్నారు ముస్లిం పురుషులు కూడ. కాని ఈ చదువు చాలా తక్కువస్థాయిలో ఆగిపోతున్నది. ప్రస్తుతం హైస్కూళ్లు దాటిపోవటంలేదు. స్థూలంగా గమనిస్తే అయినా స్త్రీలకు విద్యపై క్రమేణా కొంత ఆసక్తి పెరుగుతున్నది. కారణాలు:-

1) ఇతర మతాలకు చెందిన బాలికలు, యువతుల చదువును గమనించటం వల్ల.

2) ఇతర మతాలకు చెందిన యువతులు ఉద్యోగాలు చేస్తుండటం చూడటం వల్ల.

3) రేడియోల ద్వారా, టెలివిజను ద్వారా కలుగుతున్న ప్రపంచ జ్ఞాన ప్రభావం మరొక కారణమయింది.

4) మార్కెట్టులో వస్తువులు కొనాలన్నా, బ్యాంకులలో వ్యవహారాలు చూచుకోవాలన్నా, లేక బస్సులపై బోర్డులను చదివి అవి ఏ ప్రాంతానికి పోతయో తెలుసుకోవాలన్నా చదువు అవసరమని గ్రహించటం మరో ముఖ్య కారణమని చెప్పాలి. ఇలా కాలానుగతిగా చదువుపై ఆసక్తిని పెంచుకుంటున్న ముస్లిం స్త్రీలు తమ సంతానానికి విద్య గరిపించటానికి సిద్ధపడుతున్నారు. అయితే ఈ మార్పు ఎక్కువగా మధ్యతరగతి స్త్రీలకు మాత్రమే పరిమితమవుతున్నది. అయినా వైఖరిలో ఈ మార్పు శుభ సూచకం క్రిందనే లెక్క. అధ్యాపకులుగా, డాక్టర్లుగా, ఉపాధ్యాయినులుగా దర్శనమిస్తున్నారు భారత ముస్లిం మహిళలు. కాని తదితర మతాల స్త్రీలతో పోల్చిచూస్తే ఈ విషయంలో వారి విద్య, అభ్యుదయం బహుస్వల్పం అనకతప్పదు.

విదేశాలలోని - అంటే ముసల్మానులు అధిక సంఖ్యాకులుగా ఉన్న దేశాలలోని - స్త్రీల పురోగతిని గమనించి అయినా మనదేశ ముస్లిం స్త్రీలు ముందడుగు వేయకుండుట శోచనీయం. టర్కీలో 1923 నుండి విద్యా వ్యాప్తి జరిగింది. 1960 ప్రాంతంలో విశ్వవిద్యాలయాల్లో ఆరవ వంతు మంది స్త్రీలు. ఇండోనేషియాలో ప్రాథమిక పాఠశాలనుండి విశ్వవిద్యాలయం వరకు స్త్రీలు పురుషులు సహ విద్యనభ్యసిస్తున్నారు. పాకిస్తానులో విశ్వవిద్యాలయాల్లో ముస్లిం స్త్రీలు గణనీయంగా విద్యాసముపార్జన చేస్తున్నారు. కమ్యూనిస్టు దేశాలైన సోవియట్ రష్యా, చైనా లాంటి దేశాల్లో ముస్లింలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతాల్లో కూడా స్త్రీలు అన్నిస్థాయిలలో పురుషులతో సమదీటుగా చదువుతున్నారు. ముసల్మాను సంస్కృతి పరిరక్షణపేర స్త్రీని వీలయినంత వరకు ఇంటికీ, భర్త సేవకూ పరిమితం చేయటానికి ముస్లిం మత గురువులు ఇప్పటికీ శాయశక్తులా కృషి చేస్తున్నారు.

11. కుటుంబ నియంత్రణ

సామాజికంగా స్త్రీ కుంటుపడటానికి ఆర్థిక రాజకీయ కారణాలు అటుంచి ముఖ్యంగా విద్యలేమి ఆమెను కుంగదీస్తున్నది. విద్యయెడ స్త్రీ వైఖరి ఆమె విద్యలేమికి కారణభూతమవుతున్న మాట వాస్తవం. కాని మరొక అంశం ఆమెకి విద్యా సముపార్జనకు అటంకంగా ఉంటోంది. చదువుకోటానికి ఆమెకు తీరికలేకున్నది. చిన్నతనంలో పెద్దలు బడిమాన్పించి, తరువాత పెళ్ళిచేసి కాపురానికి పంపితే ఆమె ఇంటిపనితో సతమతమవటమే కాక సంతానంతో కొట్టుమిట్టాడవలసిన పరిస్థితి కలుగుతున్నది. పదునైదవ ఏటనుండీ నలుబదియైదు, ఏబది సంవత్సరాలు వచ్చేవరకు ఆమెకు సంతాన ప్రాప్తి యోగ్యత ఉంటుంది. విద్యాబుద్ధులులేని కొందరు పురుషులకు ఇతర వ్యాసంగాలు, వినోదాలు లేకపోవటంతో భార్యలతో లైంగిక సాంగత్యమే వినోదకాలక్షేపంగా మిగిలిపోయింది. సంతాన నిరోధ పద్ధతులు తెలియనినాడు, తెలిసినా అవినీతి బాహ్యాలని అనుసరించనినాడు బహు సంతానంతో భార్యాభర్తలు ఉక్కిరిబిక్కిరి కాకతప్పదు. అదే భారతదేశంలో జరుగుతూవస్తున్నది. ఇటీవల 1949 నుండి కొన్ని స్వచ్ఛంద సంస్థలూ, 1960 నుండి ప్రభుత్వమూ కుటుంబనియంత్రణ ప్రబోధం చేపట్టటంతో, ఇటీవల పది సంవత్సరాలనుండి సంతాన నిరోధక శస్త్రచికిత్సలకు ప్రభుత్వం దోహదం చెయ్యటంతో ఈ సందర్భంగా కొంత ప్రగతి కనిపిస్తున్నది. జననాల రేటు, పూర్వం వెయ్యికి నలభై మంది పుడితే నేడు 32 మంది పుడుతున్నారని తేలింది. జనాభా పెరుగుదల రేటుకూడా 24% నుంచి నేడు 22%కు తగ్గాయి.

అయితే భారతదేశ ముసల్మాను జనాభా పెరిగింది గత పదేళ్ళలో. ఇదిచూచి హిందూ రాజకీయనాయకులు భయపడుతున్నారు. ఆ రాజకీయాల పరిస్థితికి అటుంచి ఈ పెరుగుదల ఏమి సూచిస్తున్నది అనేది ఆలోచించాలి. పూర్వంకన్నా ముసల్మాను స్త్రీ-పురుషులు కుటుంబనియంత్రణ యెడ సుముఖత చూపుతున్నారు మొ తంమీద గమనిస్తే ముసల్మానులు దానిని ఆదరించటం లేదని, అనుసరించటం లేదని తేలింది. కుటుంబాలను పరిమితం చేసుకున్నవారు ముసల్మానులలో ధనవంతులలోనూ, అందులోనూ

ఆంగ్ల విద్యా సంస్కృతీ పరిచయం వున్నవారిలో మాత్రమే కనిపిస్తున్నది. మత గురువులలోను, వారి మాటలను శిరోధార్యాలుగా ఎంచే బహుజన ముసల్మానులలోను దీనియెడ ఆసక్తి లేకపోగా వ్యతిరేకత కూడా ఉన్నది. ముస్లిం కుటుంబాలలో అయిదార్గురు సంతానం లేని కుటుంబం అరుదుగా కన్పిస్తున్నది. ఈ పరిస్థితిలో పిల్లలను కనటంలో - పెంచటంలో నిమగ్నమవుతున్న ముస్లిం మహిళకు జ్ఞాన సముపార్జనకు సమయం ఎక్కడనుండి లభిస్తుంది ? ఆర్థికంగా అవకాశాలు ఎలా లభ్యమవుతాయి ? ఇది ఈ దృష్ట్యా చాల పెద్ద సమస్యగా తయారయ్యింది.

కుటుంబ నియంత్రణపట్ల ఈనాటి ముసల్మాను వైఖరికి మతపరంగా ఏమయినా ఆధారాలున్నాయా అని పరిశీలించడం సబబు. ఖుర్ ఆన్‌లో దీని విషయం లేదు; ఉండటానికి అస్కారం లేదు. ఆ కాలపు స్థితిగతులు వేరు. బీదరికానికి భయపడి పిల్లలను చంపవద్దన్న మహమ్మదు కుటుంబ నియంత్రణకు వ్యతిరేకియని సనాతనులు వాదిస్తున్నారు. తన ఆరోగ్యానికి భంగం కలగనంతవరకు భర్తకు లైంగిక సౌంగత్యాన్ని అందించవలసిన బాధ్యత భార్యకు ఉంది కనుక, బహు సంతానవతి అయితే ఆమె ఆరోగ్యం దెబ్బతింటుంది కనుక, మహమ్మదు బోధించిన మతం కుటుంబనియంత్రణకు వ్యతిరేకం కాదని ఆధునికుల వాదన. అదీగాక పిల్లల పెంపకం విషయం, శ్రేయస్సు విషయం ఖురాను నొక్కిచెప్పింది. కుటుంబనియంత్రణకు ఇది అనుకూలమయిన అంశమని కొందరు సంస్కరణవాదుల భావం.

[హజ్రత్ జబీర్ ప్రవక్త స్నేహితుడు. ఆయన జన్మ నిగ్రహాన్ని పాటించాడు. ప్రవక్త తెలిసి ఊరుకున్నాడని చదివాము. దీనిని బట్టి మహమ్మదు జన్మ నిగ్రహం ఎడ విముఖుడు కాదని ఒక వాదం బయలు దేరింది. 17వ శతాబ్దంలో ఔరంగజేబు ఉత్తరువు ప్రకారం తయారయిన "ఫత్వా ఆలంగిరీ" లో భార్యా భర్తల పరస్పర సమ్మతితో జన్మ నిగ్రహాన్ని సాధించవచ్చును. ముస్లిం న్యాయ శాస్త్రవేత్తలయిన ఇమామ్ అబూ జాఫర్ తహావీ, మరియు షా అబ్దుల్ అజీజ్ స్త్రీ ఆరోగ్య రక్షణకోసమే కాకుండా, కుటుంబాన్ని అదుపులో ఉంచే నిమిత్తంకూడ గర్భధారణ జరిగిన 120 రోజులలోగా గర్భవిచ్ఛిత్తి జరుగవచ్చునని అంగీకరించారు. పిండాన్ని గురించి ఖుర్ఆన్ 13వ సురా 8వ ఆయత్తులో ఆ ప్రస్తావన ఉంది. హజ్రత్

అలీ తబీబ్ ప్రవక్త అల్లుడు. ఏడవదశ వచ్చేవరకు - అనగా గర్భధారణ అయిన తరువాత 5వ నెల సగంవడే వరకు పిండానికి ప్రాణం లేనట్లు లెక్కని చెప్పాడు. హనాఫీశాఖ మతసూత్రం ప్రకారం 120 రోజులలోపల గర్భ విచ్ఛిత్తి చేయువచ్చును.

టర్కీ, మలేసియా, ఇరాక్, ట్యునీసియా కుటుంబనియంత్రణను బలపరుస్తున్నాయి. తతిమ్మా దేశ ప్రభుత్వాలు కొన్ని వ్యతిరేకిస్తున్నాయి. కొన్ని ఆసక్తి చూపటంలేదు.]

ఇస్లాం మత గురువు మఫ్తీ కుటుంబనియంత్రణ పాపహేతువు కాదనీ, కాని దంపతులను బలవంతంగా ఆచరించమని బోధించరాదనీ చెప్పినట్లు ఆధారాలున్నాయి. కొన్ని దేశాలలో మత గురువులు కాలానుగుణంగా మత సూత్రాల భాష్యం మారాలని తలచి కుటుంబ నియంత్రణకు అనుకూలంగా ఫత్వాలను జారీచేశారు. ఇది ఆఫ్రికా ఖండంలోని ముస్లిం దేశాలలో జరిగింది. కాని మన దేశంలోని ముస్లిం మతగురువులు, రాజకీయ నాయకులు కుటుంబ నియంత్రణను వ్యతిరేకించటం శోచనీయం. వారందరూ పురుషులు కావడం, పురుషాధిక్య సమాజాన్ని ఆమోదించేవారు కావడం గమనార్హం. ఏమయినా ఈ సందర్భంగా ముస్లిం వనిత తదితర మతాల స్త్రీలకన్నా చాల వెనుకబడి ఉంది. అందువల్ల ఆమే ఎక్కువగా కష్టనష్టాలకు గురి అవుతున్న విషయం నగ్నసత్యం. కనుక ఆ స్త్రీలకు కనువిప్పు కలగాలి. ఈ అధ్యాయం చివర చేర్చబడిన పట్టికను పరిశీలిస్తే ముసల్మాను స్త్రీల వైఖరి, ఆచరణ వగయిరాలు సుస్పష్టమవుతాయి.

పట్టిక

1961-71 లో	హిందూ జనాభా పెరుగుదల రేటు	23.7%
,,	ముసల్మాను జనాభా ,,	33.8%

నిరక్షరాస్యులలో 100కి 76మంది కుటుంబనియంత్రణ అక్కరలేదంటున్నారు.
,, 100కి 85మంది కుటుంబనియంత్రణను అమలుపరచటంలేదు.
హైస్కూలు, కాలేజీ చదువుతున్న స్త్రీలలో 100కి 70మంది ఆచరించటంలేదు.
100కి 61 మంది పిల్లలు భగవత్ప్రసాదమని నమ్ముతున్నారు.

12. ఆర్థిక స్థాయి

1) ఖుర్‌ఆన్ సూత్రాల ప్రకారం స్త్రీలను పోషించవలసిన బాధ్యత పురుషునిది. భర్త భార్యను పోషించాలి. ఏదో ఒక వృత్తిచేసి సంపాదించవలసిన బాధ్యత ఆమెకు లేదు. గ్రామాలలో బీదలైన ముసల్మాను స్త్రీలు, బస్తీలలో బీదలైన స్త్రీలు శరీర కష్టంతో సంపాదిస్తున్నారు. వారి సంపాదనవల్ల లాభం వస్తున్నంత కాలం పురుష పుంగవులు వారించటంలేదు. పల్లెటూళ్ళలో పొలాలలో పనిచేయనిస్తారు. బస్తీలలో ఇళ్ళలో పనిచేయనిస్తారు. కుట్టుపని, అగ్గిపుల్లలకు మందు పెట్టటం, లేసులల్లటం లాంటి పనులు చేస్తున్నారు స్త్రీలు. కాని స్త్రీల సంపాదనను పురుషుడు కాజేస్తున్నాడు. ఇది అనుభవైక సత్యం. ఈ దోపిడిని అన్ని వర్గాలవారు, అన్ని మతాలవాళ్లూ జరుపుతున్నదే.

సర్వసామాన్యంగా పురుషులే సంపాదించేవారు. స్త్రీకి ఆస్తిహక్కు ఉంది. అయినా ఆమె పరదా పాటించటంవల్ల నాలుగు గోడలమధ్య ఉండిపోయి ప్రపంచ జ్ఞానం లేనిదవుతున్నది. కనుక తన ఆస్తియొక్క క్రయ విక్రయాదుల విషయంగా ఆమె పురుషునిపై ఆధారపడవలసి వస్తున్నది. అందువల్ల ఆమె పురుషాధిక్యతను అధిగమించలేని స్థితి ఏర్పడింది.

కేరళలో జరిగిన ఒక సర్వేలో 100కి 68 మంది ముసల్మాను స్త్రీలు కుటుంబాన్ని పోషించవలసిన బాధ్యత పురుషునిదేనని ఘంటాపథంగా చెప్పారు.

ఆస్తి ఉన్నంత మాత్రాన ముస్లింమహిళ పరిస్థితి మెరుగు కావటం లేదు. ఎంతో అక్షరాస్యత ఉన్న కేరళ రాష్ట్రంలో పిల్లల చదువు, వృత్తి, వివాహం లాంటి విషయాల్లో భార్యలతో అసలే సంప్రదించబడని స్త్రీలు 100కి 16 మంది.

అప్పుడప్పుడు సంప్రదించబడే స్త్రీలు 100కి 34 మంది.
తరచుగా అడగబడేవారు 100కి 38 మంది.
ఎప్పుడూ సంప్రదించబడేవారు 100కి 12 మంది.

కుటుంబఖర్చు, ఆస్తులు, దుస్తులు వస్తువుల కొనుగోలు (ఆస్తి ఉన్న స్త్రీలను కూడా) విషయాలలో ఎప్పుడూ సంప్రదించబడని వారు 11%. అప్పుడప్పుడూ అడిగేవారు 12%. తరచుగా 51%. ఎప్పుడూ అడగనివారు 26%.

ఇవి కేరళ లెక్కలే. దేశంలో ఇతరప్రాంతాలలో పరిస్థితి ఇంతకన్నా చాలా అధ్వాన్నంగా ఉంటుందని వేరే చెప్పాల్సిన పనిలేదు. తండ్రి ఆస్తిలో కుమార్తెలకు వాటా ఉన్నా, ఆడపిల్లలు అనేకమంది అన్నదమ్ములకు అనుకూలంగా తమ వాటాలను వదులుకుంటారు. పుట్టింటిమీద అభిమానం ఒకచెంపా, అన్నదమ్ముల ఆప్యాయత పోగొట్టుకోకూడదనే మనస్తత్త్వం మరోచెంపా అలా వారిని ప్రోద్బలపరుస్తాయి. అదీగాక భర్త ఇంటిలో కాపురం కత్తిమీద సాములాంటిదికదా! ఏనాడు భర్త తలాక్ అని వెళ్ళగొట్టాడో అనే భయం వారిని పీడిస్తూనేవుంది. ఆనాడు తల దాచుకోడానికి చోటు కావాలికదా! తరకాభాగం పంచుకుంటే అన్నదమ్ములు ఆ పరిస్థితులలో పుట్టింటికి రానీయరేమోనని ఆందోళన కూడ కొంత ఆమెను కలవరపరుస్తుంది. అదీగాక చుట్టూ ఉన్న హిందూ సమాజంలో తండ్రి ఆస్తిలో కొడుకులంటే కుమార్తెకు 1956 సంవత్సరం వరకూ వాటాలేదు. ఇవన్నీ ఆమె వాటాను ఆమె 'బుద్ధిపూర్వకంగా' వదులుకునేటట్లు చేశాయి.

సామాజికంగా ఆమెకు సమానహోదా లేనంతకాలం, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు ఆమె నోచుకోనంత కాలం ఆస్తి సంపాదన, ధనం ఆమెకు ఎక్కువగా ఉపకరించటం లేదు. ఈ దిగువ లెక్కలుచూస్తే పరిస్థితి బోధపడుతుంది.

కేరళలో జరిగిన సర్వే ప్రకారం:-

100కి 77 మంది స్త్రీలు సినిమాలకు పోరు.

100కి 40 మంది పురుషులు కుటుంబ విషయాలలో స్త్రీని సంప్రదించ నక్కరలేదని అన్నారు.

ఎంతమంది పిల్లల్ని కనాలనే విషయం భర్తే నిర్ణయిస్తాడని అనేక మంది చెప్పారు. 100కి 57 మంది పురుషులు కుటుంబ నియంత్రణకు పూర్తి వ్యతిరేకత చెప్పారని తేల్చారు. తమ భార్యలు ఇంటా బయట పని చెయ్యనక్కరలేదని 100కి 67 మంది పురుషులు చెప్పారు.

100కి 92 మంది స్త్రీలు ఇంటి వెలుపల పని చెయ్యటంలేదని కూడా పురుషులు చెప్తున్నారు.

100కి 80 మంది పురుషులు స్త్రీలకు ముసుగు ఉండాలన్నారు. స్త్రీలు ఇతర స్త్రీలతో కలసి దుకాణాలకు వెళ్ళరాదని 100కి 65 మంది పురుషుల అభిప్రాయం. 100కి 81 మంది భార్యలను సినిమాలకు తీసుకొనివెళ్ళరు. స్త్రీ పురుషులకు సమాన హోదా పనికిరాదని 7 % పురుషులు భావ ప్రకటన చేశారు. మశీదులకు పోవద్దని ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా చెప్పలేదు. ఒకప్పుడు స్త్రీలు మశీదులకువెళ్ళి ప్రార్థన చేసేవారట. ఇప్పుడు స్త్రీలు మసీదులకు పోరాదు ; పోవటంలేదు. 100కి 59 మంది పురుషులు స్త్రీలు మశీదులకు పోరాదని అంటున్నారు. స్త్రీలు ఇల్లుదాటి వెళ్ళరాదని నిరక్షరాస్యులయిన స్త్రీలలో 77 % ప్రకటించారు. కాలేజీలో చదువు సాగించిన మహిళలలో 42% స్త్రీలు ఇల్లుదాటి వెళ్ళరాదని నొక్కి వక్కాణిస్తున్నారు. ఇది ఎంత ఘోరమో గమనించండి.

సామాజికంగా ఇన్ని ఇక్కట్లకు, ఇబ్బందులకు, ఆంక్షలకు లోనయిన స్త్రీ ఆర్థికస్తోమత ఉన్నంత మాత్రాన తన పరిస్థితిని బాగుచేసుకోలేక పోవడంలో ఆశ్చర్యంలేదు. సామాజిక భద్రత, వ్యక్తిస్వేచ్ఛ, స్త్రీ పురుష సమానత్వం లేనంతకాలం స్త్రీలకు విముక్తిలేదు. ఆస్తులు, చట్టాలు, ఆర్థి కొన్నులు వారిని రక్షించలేవు. ఎందరు స్త్రీలు కోర్టులో ప్రజలముందు నిలబడి విడాకులు కోరగలరు? తమ ఆస్తి హక్కులకై కేసులు పెట్టుకోగల స్తోమతవున్న మహిళలెందరు? తమ భర్తలు చిత్రహింసలు పెడుతున్నారని, కొట్టి, తిట్టి చంపుతున్నారని పిటీషన్లు పెట్టుకోగల ధీర వనితలున్నారా? ఆలోచించండి. కడివెడు కన్నీళ్ళను, గంపెడు కష్టాలను గుండెలనిండా దాచుకొని పైకి నవ్వుతూ, కేరింతలు కొడుతూ భర్తలకు స్వాగతమిచ్చే నారీ మణులున్న దేశం మనది. మతాలు వేరైనా, ఆచారాలు భిన్నమైనా మహిళల యెడ క్రూరభావాలలో మార్పులేదు. ఆ క్రూరత్వాన్ని, ద్వేషాన్ని శాంతంతో సహనంతో, చిరునవ్వుతో పరిగ్రహించే పద్ధతిలో ఆమె మనస్సు, నడవడికా కండిషను చేయబడినై. ఆ రీతిలోనే ఆమె జీవిస్తోంది.

—(o)—

13. రాజకీయరంగం

రాజకీయంగా హక్కులు స్త్రీలందరికీ 1919 ఇండియా చట్టం, 1935 ఇండియాచట్టం, 1950 భారతరాజ్యాంగం ప్రకారంవచ్చిన ట్లే ముస్లిం మహిళ లకూవచ్చాయి. కాని తదితర మతాల స్త్రీలు వాటివల్ల అతిస్వల్పమే కావచ్చు ఆమకోండి కొంతయినా లాభించారు. ముస్లిం వనితల విషయంలో అభివృద్ధి ఈ రంగంలో మృగ్యమని చెప్పవచ్చు.

ఓటింగులో ముస్లిం స్త్రీలు విరివిగా పాల్గొంటున్నారు. పత్రికలలో బురఖాలు ధరించిన స్త్రీలు వోటు వేయడం చిత్రాలుగా ప్రకటిస్తున్నారు దానినిబట్టి వారిలో రాజకీయ చైతన్యం వెల్లివిరుస్తున్నదని ఎవరైనా తలపోస్తే అంతకన్నా పొరపాటు మరొకటి వుండదు. కేరళలో ఒక సర్వే ప్రకారం నిరక్షరాస్యులలో 100కి 90 మంది స్త్రీలు భర్త ఆజ్ఞను పాటించి అతడు నిర్ణయించిన అభ్యర్థికి వోటు వేస్తున్నారని తేలింది. అసలు 100కి 79 మంది స్త్రీలు వోటువేశారు. రాజకీయాలు స్త్రీలకు అవసరమని 56% స్త్రీలు అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో చురుకుగా తాము పాల్గొనుట అనవసర మనే భావం 61% స్త్రీలు వెలిబుచ్చారు.

ఆర్థికవ్యవస్థ రాజకీయాలను నిర్ణయిస్తుందనేవారు, సామాజిక వ్యవస్థ కీలకపాత్ర వహిస్తుందనేవారు వాదోపవాదాలు చేస్తున్నారు కదా! ముస్లిం సమాజ పరిశీలన సునిశితంగా సాగిస్తే ఈ రెండు వాదాలు సర్వదా సత్యాలు కావని తేలుతుంది. ప్రవక్త మత విషయికంగా స్త్రీ పురుషుల సమానత్వాన్ని అంగీకరించాడు. భారత రాజ్యాంగం సిద్ధాంతరీత్యా సమానత్వాన్ని అన్ని రంగాలలోనూ సుస్థిరం చేసింది. కాని రాజకీయాలలో స్త్రీల ప్రమేయం తక్కువ. 500 పై చిలుకు సభ్యులున్న లోక్‌సభలో 18 మంది సభ్యులు మాత్రం స్త్రీలు. అందులో ముస్లిం వనితలు ఒక్కరు. సకృత్తుగా ఏదో ఒక పురపాలక సంఘానికో, జిల్లా పరిషత్తుకో నామినేటెడు సభ్యురాలుగా ఒకరో ఇద్దరో ముస్లిం మహిళలు దర్శనమిస్తారు. అంతే. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను వాడుకోలేకుండా ఉన్నారు అందరు స్త్రీలునూ.

అందులో ముఖ్యంగా ముస్లిం స్త్రీలు మరీవెనుకబడి ఉన్నారు. ఏ ముస్లిం స్త్రీ అయినా పొరపాటున శాసనసభ్యురాలో, మంత్రియో అయినారంటే ఆమె ప్రముఖ రాజకీయవేత్తకు తల్లియో, భార్యయో, సోదరియో అవటమే కారణము. హక్కుగా ఆ స్థితిని పొందిన ముస్లిం వనితలు అసలు వున్నారా అనిపిస్తోంది. అసలు రాజకీయాలంటే అవి పురుషులకు మాత్రమేనని, తమకు వాటితో నిమిత్తంలేదనే భావం స్త్రీలలో ప్రబలంగా వుంది. విద్యావంతులు, ధనవంతులైన స్త్రీలుకూడా వాటి జోలికిపోరు. వున్న కొద్దిమంది అయినా శాసన నిర్మాణాలలో, ప్రజాహిత నిర్మాణ కార్యక్రమాల నిర్ణయాలలో ప్రముఖపాత్ర వహించగలగడం లేదు.

14. ముగింపు

ఈనాటి ముస్లిం సమాజంలో స్త్రీల ప్రతిపత్తిని సరిగా అంచనావేసే ముందు ఒక సైద్ధాంతిక సమస్యకు సమాధానం చెప్పుకోవలసి ఉంది. మహమ్మదు స్త్రీలకు సమానహోదా ప్రసాదించాడా లేదా అనేదే ఆ ప్రశ్న.

"స్త్రీ పురుషులను సమదృష్టితో చూచాడు మహమ్మదు" అంటాడు ప్రఖ్యాత న్యాయ శాస్త్రవేత్త అమర్ అలీ.

"స్త్రీకి తక్కువ స్థానం ఇచ్చాడు ప్రవక్త" అని విలియం మ్యూర్ భావన. "ఆమెను భర్తకు బానిసగా నిర్ణయించాడు మహమ్మద్" అని అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు ఇడాల్ఫ్ కౌహిల్. ఇందులో విలియంమ్యూర్ ఆలోచనే సరియైనట్లు తోస్తున్నది.

బురఖా ఎందుకు వచ్చిందనే అంశం మీద విభిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ప్రవక్త భార్య అనుమానాస్పద పరిస్థితుల్లో తన ఆభరణాన్ని పోగొట్టుకుంటే బురఖా పెట్టాడని డి.బి. మాక్డొనాల్డు (Development of Muslim Theology, Jurisprudence and constitutional Theory) అంటాడు. ఆ కాలంలో విశృంఖలత్వం సాగుతున్నందున బురఖాను ఏర్పాటు చేశాడని అమర్ అలీ ఊహ. "అసంఖ్యాకులైన పురుషులు మత ప్రకారం సంపూర్ణ మానవులయినారు. కానీ నల్గురు స్త్రీలు మాత్రమే సంపూర్ణత్వాన్ని సాధించారు" అని మహమ్మదు అన్నాడని హదిత్ అంటాడు. దీనినిబట్టి బురఖా ఉండడం అవసరమని పర్షియాలో ప్రచారం సాగింది. మొదట్లో ఖురాన్‌కు భాష్యం చెప్పిన మతగురువులు పర్షియా దేశస్థులు, టర్కీ దేశస్థులు. వారు స్త్రీ ఇంటినుండి బైటికిరావటాన్ని నిషేధించారు. కొంతమంది ఇలా వాదిస్తున్నారు 'స్త్రీలను ఇళ్ళకు పరిమితంచేయ్యమని, బయటకు రానివ్వవద్దని ప్రవక్త చెప్పలేదు.కాగా తమ శరీరాలను కప్పుకోమన్నాడు. అదయినా సభ్యతకోసం, స్త్రీలు అవమానాలపాలు కాకుండావుండే నిమిత్తమేనని. జుట్టూ, ముఖమూ కనబడరాదన్నాడు. దీనికి రెండు భాష్యాలు వచ్చాయి. ముఖమూ, తల కప్పవలెనని మొదటిది, నుదుటే మాత్రమే కప్పాలని రెండవది. మహమ్మదు భార్య ఆయేషా, అతని కుమార్తె ఫాతిమా, మనుమరాలు జైనాబ్ సదిమంది

లోకి వచ్చేవారు. బురఖావల్ల ఆనాడు బహుభర్తృత్వం నశించిందని చెప్పవచ్చును.

స్త్రీల ప్రతిపత్తిని కొంత మెరుగుపర్చాడు మహమ్మదు. కాని వారికి సమానహోదా ఇవ్వలేక పోయాడు. ఈనాటికీ అది అనుభవంలో సిద్ధించలేదు. ఆనాడు అతనికి ఆ పరిస్థితుల్లో ఎలా సాధ్యమవుతుంది? మతానికి, పురుష భోగానికి ఇచ్చిన ప్రాముఖ్యత స్త్రీలకివ్వలేదు ప్రవక్త.

ముస్లిం స్త్రీలు మహోన్నతమైన స్వేచ్ఛను అనుభవించారని, వారు కవయిత్రులుగా, పండితులుగా, వీర నారీమణులుగా, పరిపాలనా సామర్థ్యం కలవారుగా భాసిల్లారని ఆ మతాభిమానులు చెప్తున్నారు. ఇంగ్లీషులో గ్రంథాలు కూడ రాస్తున్నారు. అలాంటి స్త్రీల పేర్లు ఉటంకిస్తున్నారు. మత వ్యాప్తికోసం జరిగిన ఉహద్ యుద్ధంలో బీబీఇస్మా వీరోచితంగా పోరాడింది. రెండవ కాలిఫ్ ఉమర్ కాలంలో లైలా-బింత్-ఇ-అబ్దులా అనే ఆమె మదీనా మార్కెటును తన చెప్పుచేతల్లో ఉంచుకోగల్గింది. మూడవ కాలిఫ్ ఉస్మాన్ ఎన్నికలలో ఫతీమా-ఇ-బింత్-ఇ-ఖయస్ చురుకుగా పాల్గొన్నది. ఉమ్మల్, మోమెనిన్, అయేషా సిద్దీకా, బీబీ ఫతీమా జహరా, జైనాబ్ బింత్-ఇ-అబీసల్మా ముస్లిం న్యాయ శాస్త్రవేత్తలు. ప్రవక్త పెంపుడు సోదరి షీమా పెద్ద కవయిత్రి. చాంద్‌బీబీ అక్బర్ సైన్యాలను ఎదిరించి పోరాడిన రాణి. నూర్జహాను (1605-30) జహంగీరు భార్య-భర్తను రక్షించుకుని సామ్రాజ్యాన్ని పరిరక్షించుకున్నది. గులోబదాన్ బీగం (హుమాయూన్ సోదరి) హుమాయూన్ జీవితచరిత్ర వ్రాసింది. షాజహాను కుమార్తె జహనారా ప్రసిద్ధ కవయిత్రి. ఈనాడు ఎందరో కవయిత్రులూ, గాయనిలు, విదూషీమణులు ఎందరో ఉన్నారు. ఇలా ఎంతగానో జాబితా రాయవచ్చును. కాని ఒక్క విషయం మరచిపోరాదు. వీరు ఉన్నత వర్గాల నుండి వచ్చిన స్త్రీలు. అదీగాక ఎక్కువమంది ముసల్మాను స్త్రీలు అజ్ఞానంలో పడిఉన్నారనే నగ్నసత్యాన్ని కాదనవు ఈ విశేష ప్రస్తావనలు. ఏ ఒకరిద్దరో అన్ని కాలాల్లో, అన్ని సమాజాల్లో వుంటారు. అది ప్రగతికాదు. స్త్రీ జాతి విముక్తి అంతకన్నాకాదు. 99% గురించి ఆలోచించాలి.

ఈనాటి ముస్లిం సమాజంలో స్త్రీల పరిస్థితిని సునిశితంగా పరిశీలిద్దాం. ఈనాడు 'లా' ప్రకారం విద్య పొందడానికి ముస్లిం స్త్రీకి హక్కు ఉంది.

కాని సామాజిక ఆర్థిక స్థితిగతులు ఆమెకు అనుకూలంగా లేవు. ఆమెకు ఆ అవకాశాలు ఏ కొద్దిమందికో తప్ప అబ్బేలేవు. స్త్రీలు తమ ఇచ్ఛవచ్చిన వృత్తులను చేపట్టటానికి భారత రాజ్యాంగం హక్కును ప్రసాదిస్తున్నది. కాని భర్త, కుటుంబం సాధారణంగా అంగీకరించరు. నిర్ణాయకశక్తి భర్తకు ఉంటున్నది. ముస్లిం సమాజం మధ్యయుగాలకు పూర్వపు సంస్కృతిని అంటిపెట్టుకొని ఉంటున్నది. కాలగతిని అనుసరించి మారటంలేదు. ఆనాటి సమాజంలో స్త్రీ భర్త చెప్పుచేతల్లో ఉండే పనికత్తె. ఆమె బానిస స్థితి నుండి వెలికివస్తున్న జీవి. వివాహం విషయంలో ఆమెకు లాంఛన ప్రాయంగా భర్తను ఎన్నుకునే హక్కు ఉంది ; కాని ఆచారాల ప్రభావం వల్ల అంతకు క్రితం తను చూడని పురుషుని ఆమె వివాహ మాడవలసి వస్తోంది. మనిషినే చూడనప్పుడు ఎన్నిక ప్రసక్తి ఎక్కడ? వివాహవ్యవస్థలో స్త్రీ స్థానం ద్వితీయ శ్రేణిది. కుటుంబ విషయాల్లో చివరిమాట భర్తదే అయినా ఆమెకు స్వాతంత్ర్యం కొంతమేరకు ఉంటున్నది. కీలక విషయాలలో ఆమె మరల అప్రధానపాత్ర వహిస్తున్నదనే మాట సత్యమే. విడాకులు, మనవర్తిలాంటి విషయాలలో ఆమె అనేక కష్టనష్టాలకు లోనవుతున్నది. ‘ఎంతమంది సంతానాన్ని కనాలి’ అనే విషయంలో ఆమెకు చాల పరిమితమయిన స్వేచ్ఛ ఉంది; ఇంచుమించుగా లేనట్లే. తన సంతానంయొక్క సంరక్షకత్వం విషయంలో ఆమె నిరాదరణ చెయ్యబడింది; ఆమె అన్యాయానికి లోనయినది. ఆమె ఆస్తిమీద, ఆమె సంపాదనమీద ఆమెకు ధర్మశాస్త్ర ప్రకారం హక్కులున్నాయి. కాని అవి ఆచరణలో మృగ్యమయ్యాయి. వారసత్వ సందర్భంగా ఆమెయెడ వివక్ష ఉంది. సమాజం యొక్క సామాజిక, సాంస్కృతిక, రాజకీయరంగాలలో ముస్లిం స్త్రీకి కీలక స్థానం లేకపోగా ప్రవేశంలేదు. కనీసం ఆమె మశీదులో ప్రార్థనకు కూడా పోవడానికి నోచుకోలేదు. ఆర్థిక రంగంలోకూడ - గతిలేక, విధిలేక పొలాలలో, కుటీర పరిశ్రమల రంగంలో ఇళ్ళలో పని చేయనిస్తున్నాడు పురుషుడు. వ్యాపారాలకు, పరిశ్రమలకు ఆమె అధిపతిగా ఉండటంలేదు ; కనీసం ముఖ్య కార్యనిర్వాహక హోదాలో ఉద్యోగం చెయ్యటంలేదు. ‘లా’ ప్రకారం ఆమెకు సంచార స్వాతంత్ర్యం ఉంది. ధర్మశాస్త్ర ప్రకారం అది పరిమితమయింది. ఆచారం ప్రకారం ఇంకా మృగ్యమయింది. వేషభాషల్లో ఆమె. వివక్షకు లోనవుతోంది. ఆమె బురఖా ధరించికాని ఇంటిబయటికి వెళ్ళరాదు

భర్తతో, మామతో, తండ్రితో మాట్లాడేటప్పుడు మంద స్వరంతో మెల్లగా మాట్లాడాలి. వినయం ఆమెలో మూర్తీభవించాలి. చూపులు కలిపి ఆమె పురుషులతో ప్రసంగించరాదు. ఎవరితో ధారాళంగా మాట్లాడాలో ఎవరితో ముభావంగా జవాబు చెప్పాలో అంతా ఆమెకు నిర్దేశించబడివుంది. పురుషుడికి ఆ ఆంక్షలులేవు. ఇస్లాం శాస్త్రం ప్రకారం పురుషునికి దత్తు చేసుకునే అధికారంలేదు. స్త్రీల విషయం ఇక చెప్పనవసరంలేదు. ఈ విషయంలో ఆమె స్త్రీపురుష వివక్షకు లోనుకావటంలేదని ఘంటాపథంగా చెప్పవచ్చును. ముసల్మాను సమాజంలో ద్వంద్వనీతి చలామణీ అవుతున్నది. పురుషుడు ఏక కాలంలో నలుగురు స్త్రీలను భార్యలుగా కలిగి ఉండవచ్చును. ఆమె మాత్రం ఏక భర్తృకగా ఉండాలి. ఇలా ఎన్నో, మరెన్నో పేర్కొనవచ్చును. వివాహమాడటానికి గాని, అవివాహితగా ఉండటానికి గాని ఆమెకు లా ప్రకారం హక్కువుంది. కాని ముసల్మాను సమాజంలో పెండ్లికాని స్త్రీ అరుదుగా కన్పిస్తుంది. పెండ్లి విధిగా ఆచారం ప్రకారం జరగాలి. ఆమె జన్మకు చరితార్థం సంతానలబ్ధి పొందటం, పురుషుని సుఖపెట్టటం. ఇస్లాంలో సన్యాసానికి చోటులేదు; బ్రహ్మ చర్యానికి ప్రాశస్త్యం లేదు. కనుక వివాహం అవశ్యం అనుసరణీయమయింది. స్త్రీ అవివాహితగా తల్లి అయితే ఆమె వ్యభిచారానికి పాల్పడినట్లు లెక్క. ఇస్లాందృష్టిలో అది మహా నేరం. దానికి శిక్ష ఘోరంగా వుంటుంది. కొరడా దెబ్బలతో కాని, రాళ్ళతో కాని కొట్టి చంపుతారు. మొత్తంమీద ముస్లిం సమాజం స్త్రీని చిన్నచూపు చూస్తున్నదనేది నగ్నసత్యం. తిరగబడినా, హక్కులడిగినా, ఉద్యమాలు స్థాపించినా వారి పరిస్థితి దుర్భరమవుతుంది.

ఈ దుర్భర శోచనీయ పరిస్థితినుండి ముసల్మాను మహిళకు విముక్తి లేదా? అనే సంశయం పలువురు అభ్యుదయ వాదులలో కలగడం సహజం. ఇస్లాంమతం 'పవిత్ర' గ్రంథమైన ఖుర్‌ఆన్‌పై ఆధారపడటంవల్ల, అది దైవ వాక్కుగా విశ్వసింపబడటం వల్ల, దానిలో మత ధర్మాలూ, లౌకికసూత్రాలూ రెండూ పెనవేసుకుని ఉండటంవల్ల సమస్య మరీ క్లిష్టమవుతున్నది. అలాగన్నందున పరిష్కార మార్గంలేదని కాదు. పరిష్కారం ఉన్నది. దాని రూపురేఖల విషయంగా, దాని గుణాత్మక లక్షణాలపై భేదాభిప్రాయాలుండవచ్చును; దృక్పథాలలో తేడాలుండవచ్చు. ఉన్నాయి.

కూడాను. అసలు సమస్య ఎన్ని చిక్కులతో ముడిపడి వుంటుందో, సంస్కరణ అంతకన్నా క్లిష్టంగా వుంటుంది.

పరిష్కార మార్గాలు :- సామాజికమార్పు అనివార్యం అనక తప్పదు. దేశ, కాల, పాత్రలను బట్టి అవి మార్పుచెందుతాయి. కాల గమనం పై విశ్వాసంఉంచి ముస్లిం సమాజంలో ఒక రాజరామమోహన్‌రాయ్ పుట్టక పోతాడా అనే గంపెడాశతో వేచియుండడం ఒక విధమైన ఆలోచన.

2) అలాంటి అవకాశంచాల తక్కువగా ఉందని గ్రహించి ఇతర మార్గాలద్వారా సమాజసంస్కరణకు పూనుకోవడం మరో విధమైన అవగాహన.

రెండవ పద్ధతిని అవలంభించదలిస్తే ఏమిచేయాలి ?

i) ఖుర్ ఆన్‌కు, సున్నాకు భాష్యాలు దేశ కాల మాన పరిస్థితులకు అనుగుణంగా చెప్పటం. అమర్‌అలీ అన్నట్లు ఖుర్ ఆన్‌లోని సార్వకాలిక సత్యాలను వెలికితీసి వాటిని స్వీకరించి తతిమ్మావాటిని పరిహరించటం. ఈ మార్గాన్ని అనుసరించమంటారు ప్రఖ్యాత కవిశ్రేష్ఠులు ఇక్బాల్ కూడా. కాగా ఇది ప్రమాదకరమైనదని. భాష్యం పేరుతో అనవసరమైన వ్యర్థమైన వివాదాలలో ఇరుక్కుపోవడం సంభవిస్తుంది. ఇపుడున్న పరిస్థితులలో నూతన భాష్యాన్ని విద్య బహు స్వల్పంగా ఉన్న ఈ ముస్లిం సమాజంచేత అంగీకరింపచేయుటం కష్టతరమైన కార్యం.

ii) ఇస్లాం ధర్మశాస్త్రాలలోని లౌకిక వ్యవహార సంబంధమైన వాటిని ఏర్చికూర్చి వాటికి ప్రత్యామ్నాయంగా భారత ప్రజలందరికీ వర్తించే ఒకే ఒక వ్యవహార సంహితను (Common Civil Code) ను ప్రభుత్వం రూపొందించి ముస్లిం సమాజానికి కూడా వర్తింపచేయుటం. ఇప్పటికే శిక్షా, శాస్త్ర సందర్భంగా, నేర సంబంధమైన కేసుల విచారణ విషయంగా స్మృతులు ఉన్నాయి. అవి భారతదేశంలో సర్వులకూ వర్తిస్తున్నాయి. అంటే ముసల్మానులను ఆ స్మృతుల పరిధినుండి మినహాయించ లేదన్న మాట. ఉదాహరణకు దొంగతనంచేసిన హిందూ గూండాకు, ముసల్మాను గూండాకు ఇద్దరికీ ఒకేరకమైన శిక్ష. ఇద్దరి కేసులూ ఒక పద్ధతిలోనే విచారింపబడతాయి. అలాంటప్పుడు వివాహం, విడాకులు, మనవర్తి, పిల్లల

సంరక్షతకత్వం, వారసత్వం, ఇత్యాది ప్రాపంచిక విషయాలలో మతాన్ని బట్టి వివక్ష వుండవలసిన అవసరంలేదు. ఇలాంటి శాసనం రావటానికి తగిన వాతావరణాన్ని సృష్టించాలి.

iii) ఈ రెండు విధానాలూ అననుసరణీయమని తలిస్తే ఒకటే ఒక విధానం ఉన్నది. అదేమంటే ముస్లిం ధర్మశాస్త్రం విధించిన నియమాలను కొద్దికొద్దిగా, ముక్కలు ముక్కలుగా, అధ్యాయాలు అధ్యాయాలుగా పార్లమెంటుద్వారా సవరణ చేసుకుంటూ పోవడం. ఈ సందర్భంలో ట్యూనీసియా, టర్కీ, పాకిస్తాను, ఇరాక్ లాంటి పురోగామిగా ఉన్న ముస్లిం మెజారిటీ రాజ్యాల అనుభవాన్నుండి గుణపాఠాలు సమకూర్చుకుని ముందుకు సాగిపోవడం. మరో పద్ధతిని అవలంభిస్తే ముసల్మాను సమాజాన్ని సంస్కరించదలచేవారు అచ్చంగా తమ స్వశక్తిమీద ఆధారపడవలసి ఉంటుంది. ముస్లిం సమాజంలో మౌల్వీలు, ఉలేమాల ప్రభావం జాస్తిగా ఉంది. వారు ప్రతిఘాతక శక్తికి మద్దతుదారులు. వారిది వెనుకచూపు. వారిది స్వప్రయోజనతత్వం (Vested Interest). సంస్కరణాభిలాషుల సంఖ్య బహుస్వల్పం; వారి వనరులు అల్పాతి అల్పం. కనుక ఈ పద్ధతి ఆమోదయోగ్యం కాదేమో!

రెండవమార్గం అవలంభిస్తే, అందరికీ వర్తించే ఒకేఒక వ్యవహార సంహిత కావాలని ఆందోళనచేస్తే, అన్ని మతాల ప్రజలలోని సంస్కరణవాదులేకాక, ఇతర ప్రగతిశీల దేశాల ప్రజాభిప్రాయమూ, ఆధునిక నాగరికతా సంస్కృతీ ప్రభావాలు అన్నింటి కన్న మిన్న మానవజాతిలో సగభాగమైన స్త్రీ శక్తి సంఘటిత రూపమూ ఆ ఉద్యమానికి అండగా ఉంటాయి; బలాన్ని ఇస్తాయి.

<u>ఇంతకూ పిల్లికి గంట కట్టెదెవరు? అనేది మరో ప్రశ్న.</u>

ఇస్లాం మతంలో స్త్రీలకు జరుగుతున్నంత అన్యాయం మరెవ్వరికీ జరగటంలేదు. కనుక స్త్రీలే ఈ ఉద్యమానికి నాంది ప్రస్తావన చెయ్యాలి; నాయకత్వం వహించాలి.

ముస్లిం స్త్రీలలో ప్రగతిశీలురైన స్త్రీలు,

ఇతర మతాలకు చెందిన అభ్యుదయ కాముకులైన స్త్రీలు,

ఏ మతాలకు చెందని పురోగామి దృక్పథంకల మహిళలు,

ముస్లింలు అత్యధికంగా ఉన్న రాజ్యాలలోని స్త్రీలు

ప్రపంచంలోని ఇతర రాజ్యాలలోని అతివలు, ప్రగతి కాముకులైన స్త్రీలు వీరంతా ఒకేఒక వ్యవహార సంహిత కావాలని ఐక్య కంఠంతో ఎలుగెత్తి చాటాలి. వారికి సమాజాభ్యుదయాన్ని కాంక్షించే పురుషులందరూ మద్దతు ఇవ్వాలి. ఐక్యరాజ్య సమితిలాంటి సంస్థలు తమ అండదండలను ఈ ఉద్యమానికి అందించాలి. అపుడే ఇది ఫలిస్తుంది.

కొంతమందికి మనస్సులలో ఒక సందేహం పొడసూపవచ్చును "ఇలాంటి ఉద్యమలక్ష్యం ఇస్లాం మత విధ్వంసనమా?" అని అనుమానం ఉదయించవచ్చును. కాని అలాంటి ఆలోచన ఈ డిమాండులో భావగర్భితంగా కూడ లేదని చెప్పక తప్పదు. కావాలనుకుంటే ముస్లింలు తాము నమ్మిన మతానుసారం దేవుడు ఒక్కడే అని విశ్వసించవచ్చును; వారు

ఐదువేళల నమాజు చేయవచ్చును; ముఖ్యమైన - ఆచారం రంజాన్ నెలలో ఉపవాసవ్రతం చేపట్టవచ్చును.

వారు తమ సంపదలో కొంత పేదలకు, అనాథలకు పంచి ఇవ్వడానికి ఎవరికీ అభ్యంతరం ఉండదు.

ఇంకా మక్కాకుయాత్ర సాగించవచ్చును. వీటిని గురించి ఎవరి ఇష్టం వారిది. ఇలా ముసల్మానులు తమ మతాన్ని అనుసరించవచ్చును. ఇస్లాం యొక్క ప్రధాన సూత్రాలకు అనుగుణంగా సంచరించవచ్చును. వాటి ఆచరణకు స్త్రీ విముక్తికి ముడిపెట్టరాదు. "ఒకేఒక వ్యవహారసంహితను బలపరిచే వారు హేతువాదులు, నాస్తికులు కదా! వారికి మతదృష్టి పరివడదు కదా! అలాంటివారి కోర్కెను బలపరచటం ఎలా?" అనే సంశయం కలుగవచ్చును. పై చెప్పిన మాటలు అంతవరకు నిజమే వాదనకోసం వారు దుష్టులేనని భావిద్దాము. కాని మంచివనిని మనకు ఇష్టం లేనివారు చెప్పినంత మాత్రాన వ్యతిరేకిస్తామా? కలరాకు టీకాలు వేయిస్తావని బ్రిటిషు ప్రభుత్వాం ముందుకు

వస్తే కాదన్నామా? ఇలా ఎన్నో ఉపమానాలు చెప్పవచ్చును. వరదలవల్ల, అగ్ని ప్రమాదాలవల్ల బాధితుడయిన అన్నార్తులకు ఆహారం పంచు లతో మనకు ఇతరత్రా అయిష్టులయిన వారు అందిస్తే తీసుకోవద్దని వారికి సలహాలు చెప్పగలమా? ఇస్లాం మతపు ఉక్కు పాదాల క్రింద అణగారి పోతున్న ముస్లిం స్త్రీ జాతి ఇలాంటి సైద్ధాంతిక, అతార్కిక ప్రశ్నలను లేవదీసి సమస్యను గందరగోళ పరచుకోదు. న్యాయమైన తన ఉద్యమానికి సహాయం ఏ మూలనుండి వచ్చినా స్వీకరిస్తుంది సాదరంగా; సంతోషంతో.

ఒకేఒక వ్యవహారసంహిత అనగానే మైనారిటీవర్గాల నాయకులుగా చలా మణి అయ్యేవారు 'మైనారిటీవర్గ ప్రజల ధర్మశాస్త్రాన్ని (Personal Law) అంటే హిందూ ధర్మశాస్త్రాన్ని తమపై రుద్దబోతారని, ఇస్లాంమతం ప్రమాదంలో పడబోతున్నదని' గగ్గోలు పెట్టి అరుస్తారు. ఈ నివాదం వచ్చి మోసం; బూటకం. దగాతో కూడిన పని. ఒకేఒక వ్యవహార సంహితను ఆశించేవారు, దానికోసం ప్రచారం చేసేవారు, దానికోసం అహరహం శ్రమించేవారు హిందూ ధర్మశాస్త్రాన్ని భూషించారు. హిందూ ధర్మశాస్త్రం లోని లోపాలు వారికి తెలుసు; వాటినీ వారు సర్వదా ప్రేలెత్తి చూపుతూ విమర్శిస్తూనే ఉన్నారు. ఐక్యరాజ్య సమితి ఆమోదించిన విశ్వమానవ హక్కుల ప్రకటన (Declartion of Universal Human Rights) ప్రాతి పదికగా సర్వులకూ వర్తించే వ్యవహార సంహిత రూపొందాలని కోరుకుందాం. అన్ని దేశాలు, అన్ని జాతులు, వివిధ సంస్కృతులున్న ప్రాంతాలు వీటి అనుభవాలనుండి నేర్చుకుని, వాటి సారాన్ని గ్రహించి స్త్రీ పురుష వివక్షకు తావులేని, స్త్రీ జాతికి అన్యాయం చేయని, స్త్రీ ప్రపంచాన్ని కించపరచని శాసనం కోసం శ్రమిద్దాం. మహిళాభ్యుదయాన్ని కాంక్షించి, స్త్రీల శ్రేయస్సుకు దోహదంచేసే సంహిత కోసం నిరంతర ఆందోళన సాగిద్దాము. అదొక్కటే ముస్లిం స్త్రీలకు విముక్తి విధానం.

స్త్రీ పురుష సమానత్వం కోసం జరిగే ప్రతిపోరాటం ముస్లిం మహిళ ల లోజాగృతినికల్గిస్తుంది. బురఖాను తీసివేయటం, మసీదులలో ప్రార్థనలకు హాజరవటం, స్త్రీలలో విద్యా వ్యాప్తి - బాలికలకు విద్య, వయోజన విద్య, అనియత విద్యలాంటి వాటిద్వారా - పరిమిత సంతానం ఇలాంటి చిన్న

విషయాలతో ముసల్మాన స్త్రీలు తమ విముక్తి ఉద్యమాన్ని ప్రారంభిస్తే కొండల పై జాలువారిన జలధారలు, కాలవ పిల్లకాల్వలై, వాగులై, ఉపనదులై నదులై మహానదులుగా పరిణమించినట్లు తమ విముక్తి మహోద్యమంగా రూపొందుతుంది. విద్యావంతులయిన ముస్లిం మహిళలు అందుకు పూనుకోవాలి. అప్పుడే ముసల్మాన స్త్రీలకు విముక్తి కలిగి విజయం లభిస్తుంది.

15. పరిశీలించిన గ్రంథాలు

1. ఖుర్ఆన్ (తెలుగు) — తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 500 002.

2. GLORIOUS KORAN
   TRANSLATED BY PICKTHAL : Mentor Religious Classic.

3. TOWARDS EQUALITY Govt. of INDIA Publication 1974.

4. MAHOMEDAN LAW
   MULLA —

5. MAHAMEDAN LAW
   BABU RAM VERMA — Law Book Co.

6. FROGS IN A WELL
   PATRICIA JEFFREY — VIKAS. 1979, (Indian Women ih Purdah)

7. WOMEN OF THE WORLD
   SHAH ABDUL QAYYHM — Women in Egypt, a case study.

8. MARRIAGE AND FAMILY IN INDIA
   K.M.KAPADIA — Oxford University Press 1958.

9. THE STATUS OF MUSLIM WOMAN IN INDIA. 1976.
   Dr. M. INDU MENON

10. MUSLIM WOMEN
    ZAMILA BRIJBHUSHAN — Vikas, 1980.

11. WOMEN IN CONTEMPORARY
    INDIA & SOUTH EAST ASIA
    (Women and Religion by Ursula King)
    (Muslim women in U. P. by Zarina Bhatt)
    MANOHAR 1980.

12. THE WOMAN
    SHAIK M.H. KIDWAI — Light & Life 1978.

13. ఇస్లామ్ దర్శనము — తెలుగు అకాడమీ, హైదరాబాద్ 1971.

క్రైస్తవం : స్త్రీలు

ఈ గ్రంధంలో

నివేదిక	1
పూర్వరంగం	9
1. పరిశుద్ధ గ్రంధం	16
2. స్త్రీ హోదా	21
3. సెక్స్	39
4. బ్రహ్మచర్యం	50
5 జారత్వం	58
6. వివాహం	68
7, విడాకులు, మనవర్తి, పునర్వివాహం	78
8. హింస	87
9. పడుపు వృత్తి	95
10. కుటుంబనియంత్రణం : గర్భస్రావం	99
11. ఆస్తి హక్కు : వారసత్వం	103
12. విద్య, రాజకీయాలు	106
13. క్రైస్తవం స్త్రీలకు మేలుచేసిందా?	108

నివేదిక

స్త్రీ చేసిన తప్పిదం వల్లనే ఈ ప్రపంచంలోని చెడంతా పుట్టిందని బైబిలు నిర్వచించింది. కనుకనే క్రైస్తవ మతస్థులు స్త్రీలను వేటాడిన కథలు వర్ణనాతీతం. 1854లో ఫిలడల్ఫియాలో స్త్రీల హక్కుల మహాసభలో (ఉమెన్ రైట్స్ కన్వెన్షన్) "స్త్రీలకు ఆత్మలున్నాయని రుజువుచెయ్యాలి" అని సవాల్‌చేస్తూ అనేకమంది అరుస్తూ, సభలో కేకలువేస్తూ సభను చెల్లాచెదరు చేశారు. ఒకనాడు అమెరికాలో, యింగ్లాండులో స్త్రీలను పశువులలాగా అయిదు డాలర్ల నుండి వందల డాలర్ల వరకు అమ్మకం జరిగేది. క్రైస్తవ మతంలో స్త్రీలను గురించి వివిధ అభిప్రాయాలు. నిర్వచనాలు చాలా వున్నాయి. కనుక చిత్తశుద్ధితో పరిశీలించటం న్యాయమూ, సమంజసం కూడాను.

బైబిలు పాతనిబంధనలో స్త్రీలను పరిచారికలతో, పెంపుడు జంతువులతో సమానంగా నిర్దేశించారు. చర్చికి క్రీస్తు ఎలా యజమానియో భర్త భార్యకు అలా యజమాని. స్త్రీ ఉపాధ్యాయిని కావటంగాని, దురాక్రమణ ద్వారా భర్తమీద అధికారాన్ని చలాయించటం గాని నేను అంగీకరించను అన్నాడు పౌలు. "భర్తకు మీరు విధేయులుగా వుండండి" అని హెచ్చరించాడు పేతురు. స్త్రీలతో సంపర్కం తగదని బోధించాడు అరిస్టాటిల్. కారణం గ్రీకు నగరాలు చాలా చిన్నవి. జనం పెరిగితే తమ

హోదా తగ్గుతుందని భావించివుండవచ్చు. నగర స్త్రీలందరిని ఉమ్మడిగా వుంచి అందులో తెలివి, అందం కలవారిని ఎన్నుకొని ఉత్తములను కనమని ప్లేటో ఆదేశించాడు. రోమన్ సామ్రాజ్యంలో భర్త భార్యకు గార్డియన్‌గా వుండేవాడు. విడాకుల హక్కు పురుషులకే వుండేది. పోపు నుండి అనుమతి లేనిదే విడాకులకు అవకాశమే లేదు. పెండ్లిచేసేటప్పుడు ఈ దాంపత్యం నిలుస్తుందా, లేదా అని మత గురువు ఆలోచించడు కదా! వధువుకి 20 వరుడికి 70 సం॥రాలు వున్నా పట్టించుకోడు. కాని పెళ్ళి అయ్యాక ఆ బంధం చెడిపోవటానికి అంగీకరించప్పుడు ఆ వివాహం స్త్రీకి బానిసత్వం కాదా? ఆలోచించండి. స్త్రీలలో విధేయత వుంటుందనే ఆశ నాకు లేదు. నేను పెళ్ళాడతలిస్తే రాతిలోంచి విధేయతగల స్త్రీని సృష్టిస్తా" నన్నాడు ప్రొటెస్టెంటు మత నిర్మాత సెయింటు లూథర్. "స్త్రీత్వం అంటే కొనసాగుతూన్న శైశవమే" (బుద్ధి పెరగదని భావం) అన్నాడు ఆగస్టు కామ్ "నీవు మానవాళి వినాశానికి కారణభూతం, ఓ మహిళా! నీవు దుఃఖిస్తూ పిచ్చిదానిలా తిరగాలి" అన్నాడు టెర్ట్యూలియన్. "స్త్రీని స్పృశించకుండుట పురుషునికి శ్రేయస్సు; కన్యకు పెళ్ళిచేయని వాడు శ్రేష్టుడు" అన్నాడు యూదు జాతీయత నుండి క్రీస్తు మతాన్ని వెలికితీసి వ్యాప్తికి తోడ్పడిన పౌల్. "ఆమె అపరిశుద్ధ, ఆమెవల్లనే ప్రపంచంలోకి పాపం ప్రవేశించింది. కనుక దూరంగా వుంచుము" అని అతడు బోధ చేశాడు. భర్తకు భార్య సాంగత్యాన్ని ఎప్పుడుపడితే అప్పుడు కోరే హక్కు వున్నదన్నాడు స్టోప్స్ ఈ భావాలు క్రైస్తవానికే పరిమితి కాదు. యూదు మతంలో, గ్రీసు దేశంలో, ఈజిప్టు, బాబిలోనియా, ఇండియాలలో కూడా వుండేవి. కొద్ది మార్పులతో యిప్పటికీ అమల్లో లేక పోలేదని మనకు తెలుసు.

మతాలలో ముఖ్యమైనవి క్రైస్తవం, ఇస్లాం, హైందవం, వాటి ప్రామాణిక గ్రంథాలు బైబిలు, ఖుర్ఆన్, భగవద్గీతలు, ముస్లిం, క్రైస్తవ మతాలు ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తిచెంది వున్నాయి. ప్రపంచ జనాభాలో సుమారు ఆరోవంతు క్రైస్తవులున్నట్లు తెలుస్తోంది. ధరిదాపు ప్రపంచ

భాషలన్నింట్లోకి బైబిలు తర్జుమా చెయ్యబడింది. దాని ప్రచారానికి సాహిత్యం, ధనం, సాధనసంపత్తి అన్నీ సమకూరి వున్నాయి. వాడ వాడలా చర్చిలు విరివిగా వెలిశాయి సెయింట్ పీటర్, నాటర్ డామ్ లాంటి చర్చిలు అద్భుతంగా కన్నులకు మిరిమిట్లు గొలుపుతూ వుంటాయి. ధనం కోట్ల సంఖ్యలో వుంటుంది. క్రైస్తవ మిషనరీలు మతప్రచారం, సేవా కార్యక్రమాలు రెండూ భారీఎత్తున జరుపుతూ వుంటారు. ముఖ్యంగా పాఠశాలలు, ఆస్పత్రులు, శరణాలయాలు సమర్థవంతంగా నడుపుతున్నారు! ప్రజాసేవ కొరకు బిడ్డల్ని సమర్పిస్తారు. వారు నన్స్‌గా ఫాదర్స్‌గా జీవితాంతం త్యాగాలు చేస్తారు.

అసలు మతావిర్భావానికి మూలం మానవత. అంటే మొదట్లో మానవ సంక్షేమం కొరకే మతాలు ఆవిర్భవించాయట వాటి ఆచరణను నియంత్రణ చేయటానికి కొన్ని సిద్ధాంతాలు నిర్మించుకున్నారు. వాటినే భగవత్ సందేశాలుగా, ఆదేశాలుగా సూత్రీకరించడం జరిగింది. అవి మానవాళికి మహితోక్తులుగా పేర్కొన్నారు. తదుపరి కొన్ని ఆంక్షలు, విధి, నిషేధాలు రూపుదిద్దారు. వాటిని పాటించనివారిని పాషండులని, అన్యులని, కాఫిర్లని దూషించేవారు. అంతేకాదు అలాంటివారిని మత సంరక్షణార్థమై హతమార్చినా తప్పులేదని, అది పవిత్రమని భావించారు. అంటే ఏ వ్యక్తి స్వేచ్ఛకై, విశ్వమానవ సంక్షేమానికై మతావిర్భావం జరిగిందో ఆ వ్యక్తి మతానికి కొరముట్టు చేయబడ్డాడు. క్రమంగా మత సిద్ధాంతాలకు మానవుడు దాసోహం కాక తప్పలేదు. అలా మత సంరక్షణ కొరకు వ్యక్తి స్వేచ్ఛ వమ్ముచేయబడ్డది. తన ఆనందం, తన సుఖ సంతోషాలకుకాక మత ధర్మాల సంరక్షణార్థమే మనిషి బ్రతకాలని శాసించటం జరిగింది. తద్వారా మా మతం గొప్పదంటే మాది అద్వితీయమంటూ వాదోపవాదాలు చెలరేగాయి, క్రమక్రమంగా మత ద్వేషాలు పెచ్చుపెరిగి మారణహోమానికి దారితీశాయి. మనిషికి – మనిషికి మధ్య అడ్డుగోడలు, హెచ్చుతగ్గులు, ఈర్ష్యాసూయలు పెచ్చుపెరిగాయి. చివరి

దశలో మత అసహనం వెర్రితలలువేసి రక్తపాతానికి దారితీసింది. మానవత్వం నశించి రాక్షసత్వానికి బాటలుసృష్టించి ముందడుగు వేసింది. అలా మత అసహనం పరాకాష్టకు చేరుకుంది.

అసలు సామాజిక వ్యవస్థలు మానవ నిర్మితాలు. అలాగే భావ వ్యవస్థలు మానవ సృజనాత్మకాలు. కాగా మానవ పరిణామ దశను బట్టి సామాజిక వ్యవస్థలూ, భావసౌధాలు వుంటాయి. అలాగే మత భావన భావ వ్యవస్థలో ఒక భాగమనేది నగ్నసత్యం. కనుక మతానుసరణ ప్రాతిపదికగా గల సంఘ నిర్మాణం సామాజిక వ్యవస్థా పరిణామంలో ఒక ప్రక్రియ. అలా సామాజిక నీతిని నిర్దేశించిన మతం స్త్రీ పురుష సంబంధాన్ని, స్త్రీ హోదాను, సమాజంలో ఆమె పాత్రను కూడా విస్మరించలేదు. ప్రతి మతం స్త్రీ ధర్మాలను ప్రత్యేకంగా నిర్వచించింది; స్త్రీ ప్రతిపత్తిని నిర్దేశించింది. కనుక మతాన్ని, మత భావనను గురించి అధ్యయనం చేసేటప్పుడు గతాన్ని, వర్తమానాన్ని పరిశీలించాలి. అంతేకాదు భవిష్యత్తును గురించిన స్ఫూర్తి కూడా చాలా అవసరం.

నా దృష్టిలో హిందూమతం, ఇస్లాంమతం లాంటిదే క్రైస్తవంకూడా. క్రైస్తవులు గణనీయమైన సంఖ్యలో వున్నారు. వారి మత సూక్తులు రెండువేల సం॥ నాటివి. వారి ఆచారాలు, సాంప్రదాయాలూ 16వ శతాబ్దం నాటివి. వారి శాసనాలు 19వ శతాబ్దంనాటివి. వారి వివాహం, విడాకులు వగైరాల గురించిన విధులు బ్రిటిష్‌వారి హయాంలో తయారుచేయబడ్డవి. అయితే బ్రిటన్‌లో ఆనాటి శాసనాలు ఈనాడు మార్పుచెంది అధునికీకరణలోకి అడుగుపెట్టాయి. కాని భారతదేశంలోని క్రైస్తవ మతంలో యింకా స్తబ్దత చోటుచేసుకునేవుంది.

ఇది పరమాణు యుగం శాస్త్రీయవిజ్ఞానం విశ్వవీధుల్లో శరవేగంతో పరుగిడుతోంది. కాని శాస్త్రీయ దృక్పథం లోపిస్తుంది. శాస్త్రీయ దృక్పథాన్ని (SCIENTIFIC VIEW) మానవజీవితవిధానంలో, ఆచరణలో

విస్మరిస్తున్నారు. ప్రపంచం మారుతున్నది. కాని మత సంబంధమైన ఆలోచనల్లో, వాటిని ఆధారంగా చేసుకొని ఉన్న శాసనాలలో మార్పు రాకపోవటం శోచనీయం.

ఈ దేశంలో ఎన్నో మతాలు పుట్టాయి. మరెందరోమతప్రవక్తలు ఉద్భవించారు మత సంస్కరణోద్యమాలు విరివిగా వెల్లివిరిశాయి. కాని స్త్రీలపట్ల దోపిడి, వివక్ష, లొంగుబాటులాంటి ముఖ్య విషయాలను మార్చడానికి ఏ మతమూ, ఏనాడూ చొరవ తీసుకోలేదు. ఏ ప్రవక్తా వాటిని ప్రతిఘటించిన సంఘటనలూ లేవు. సంస్కరించిన ఉద్యమాలూ అంతకన్నా లేవు. స్త్రీలు సైతం ఖారీయెత్తున పోరాడిన సందర్భాలూ లేవు; ఐక్యతగా ఏక కంఠంతో మహిళలు ఎదురొడ్డి నిలిచినట్లు చరిత్రలో ఆధారాలూ లేవు.

మతదృష్టిలో 'సమాజం' అంటే పురుషులేనని, వారి అవసరాల కొరకు మాత్రమే స్త్రీ సృష్టింపబడ్డదనే భావం ప్రబలంగా వుంది. అందుకే ఆడవానికి ఆజన్మాంతం సంరక్షకత్వం ప్రతిపాదించాడు మనువు. భర్త కొట్టినా, తిట్టినా, చంపినా అతడే ప్రత్యక్ష దైవమంటుంది హిందూ ధర్మ శాస్త్రం. స్త్రీలు నరకానికి సింహద్వారమన్నాడు శంకరాచార్యుడు. ఆడది పాపగర్భం నుండి జన్మించిందంటుంది భగవద్గీత. అలా లొంగుబాటు చూపడమే పాతివ్రత్యమంటూ ఆమెకు బ్రహ్మాండంగా "బ్రెయిన్ వాష్" చేయబడ్డది. స్త్రీని దున్నే పొలంగా పేర్కొని దానిపై సర్వాధికారాలు దున్నేవాడివేనని ఖుర్ఆన్ ప్రతిపాదించింది. స్త్రీని పాపాలకు మూల కారణమైన "ఈవ్"గా ప్రచారం చేసింది క్రైస్తవం. పురుష పతనానికి కారణం ఆడదేనని ఈనాటికీ బైబిలు ఉపదిస్తూనే వుంది. అసలు మత ప్రవక్తలు, ధర్మశాస్త్రజ్ఞులు, శాసనకర్తలు అందరూ పురుషులేననేది గమనించాలి. కారణమేదయినాగాని మతాలన్నీ స్త్రీని కించపరుస్తున్నాయనేది చేదునిజం. ఇది జరిగిపోయిన విషయం. ఇప్పుడు జరగాల్సింది వ్యక్తులుగా స్త్రీలు తమకున్న మానవహక్కులను అనుభవించటం; చట్టాలలోనూ,

సాంఘికాచారాలలోనూ వున్న లోపాలను సరిదిద్దటం, ఇదంతా ముందుగా జరగాలి. విద్య, ఉద్యోగం, వివాహం, ఆస్తిహక్కు. ప్రజా ప్రాతినిధ్యం లాంటివాటికై ఉద్యమాలు నడపడం స్వేచ్ఛ సమానత్వాలకై పోరాటాలు సలపడం జరగాలి. ఏ కార్యసాధనైనా కేవలం పురుషద్వేషం, మత ద్వేషాలతో జరగదని గ్రహించడం చాలా ముఖ్యం. సంస్కరణల ద్వారా మాత్రమే సాధించగలమని నమ్మటం చాలా అవసరం. అందుకు ముందుగా స్త్రీలు అజ్ఞానం నుండి విడివడి విజ్ఞానవంతులు కావాలి. తగిన దక్షత, చొరవ, నిజాయితీ (కమిట్‌మెంటు) ముందుచూపు, ధైర్యము, ఆత్మవిశ్వాసం స్త్రీలలో రావాలి.

ఈనాడు సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికా రంగాలలో మార్పు అనివార్యమయింది. అలాగే మతవ్యవస్థలో కూడా సంస్కరణ తప్పనిసరి ఎందుకయిందో తెలియాలంటే వాస్తవ విషయాలను గమనించాలి. వాటి దుష్ఫలితాలను గమనించాలి. అందుకు ముందుగా మనం మతపరమైన సిద్ధాంతాలను, ఆచారాలను, సాంప్రదాయాలను, మత ధర్మ శాసనాలను అధ్యయనం చేయాలి. తదుపరి మాత్రమే వాటిని పరిష్కరించగలం. మతమనేది మానవ స్వేచ్ఛకు, విశ్వమానవ కళ్యాణానికి నాందికావాలి కాని సగభాగమైన స్త్రీల స్వేచ్ఛను, సమానత్వాన్ని వమ్ము చేయడం అనుచితం, అసమంజసం. అందువల్ల సమాజంలో ఒక వర్గంలో అన్యాయాన్ని ఎత్తిచూపే బాధ్యత ప్రతివ్యక్తికీ వుంది. ముఖ్యంగా మహిళాభ్యుదయాన్ని వాంఛించేవారికి అవశ్యకర్తవ్యం కనుక ఈ పుస్తకం వ్రాయటం జరిగింది.

నేను అవిశ్వాసినిని, ఏ మతంపైనా నాకు నమ్మకంలేదు. మతాన్ని నిరశించటమంటే మానవ విలువల్ని నిరశించటం కానేకాదు. మతంలో మంచి సూత్రాలులేవా ? అంటే, వున్నాయి, ఉండబట్టే మతాలు మనగల్గుతున్నాయి. అవి మత పరంపర మాత్రమే కానక్కరలేదు. మానవ విలువల వారసత్వం కూడా కావచ్చు నేను హేతువాది నయినంత

మాత్రాన న్యాయాన్ని, నీతిని, ధర్మాన్ని కాలరాస్తానుకోవడం భ్రమ. సామాజిక స్పృహ, స్త్రీ విముక్తిపై ఎనలేని విలువ వుండబట్టే ఇలాంటి ప్రయత్నానికి సారధ్యం వహించడం జరిగింది. ఒకరకంగా ఇది కొందరిని బాధించవచ్చు; కొందరిలో ద్వేషభావాన్ని కలిగించవచ్చు మరి కొందరిని ఆలోచింపచేయవచ్చు లేక చైతన్యాన్ని కలుగజేయవచ్చు; మార్పు కు పురికొల్పవచ్చు. అవి వారి వారి అభిరుచులను బట్టి, భావాలను బట్టి వుంటుంది. నేను నమ్మినదాన్ని, నా దృష్టికి తోచినదాన్ని, నిష్కల్మషంగా, నిర్మొహమాటంగా చిత్రించాను. ఆ మాటకొస్తే నేను హిందూ మతాన్ని హిందూ ధర్మశాస్త్రాలను విమర్శించినంతగా మరే శాస్త్రాలను నిరశించి వుండకపోవచ్చు. హైందవ స్త్రీలు అనే పుస్తకంకాక పది వ్యాస సంకలనాలు హిందూయిజాన్ని విమర్శిస్తూ వ్రాశాను. 'ఇస్లాం : స్త్రీలు', 'క్రైస్తవం : స్త్రీలు' కూడా సవిమర్శనాత్మకంగా వ్రాశానేగాని కువిమర్శ చేయలేదు. నేను ప్రత్యేకంగా క్రైస్తవంపై ద్వేషభావంతో ఈ రచన చేయలేదు. అన్ని మతాలలోని స్త్రీలు నాకు తోబుట్టువులనే భావంతోనే స్త్రీ విమోచనకై కృషి చేస్తున్నాను. వారి సంక్షేమమే నా సంతోషం. మతం మహిళను బంది చేసిందని. ఆమెకు విముక్తి కావాలనేదే నా ఆరాటం. ఏ రచన చేసినా, ఏ ఉద్యమం నడిపినా, మరే సంఘం స్థాపించినా అదే నా లక్ష్యం. నా జీవిత ధ్యేయం. అందువల్లే మహిళా వికాసం కోసమే నా కాలము, శ్రమ, శక్తి, ధనము వినియోగించడం జరుగుతోంది. నా భావాల్ని వ్యతిరేకించేవాళ్ళను నేను శత్రువులుగా పరిగణించను. మనకు భావ స్వాతంత్ర్యం వున్నది.- దానికి పదును పెట్టుకునే స్వేచ్ఛ వుంది. భావ విప్లవం మానవ స్వేచ్ఛకు పునాదులు. సాహిత్యాన్నిగాని, సిద్ధాంతాలను గాని, సాంఘిక కట్టుబాట్లను కాని విమర్శించే హక్కు ప్రతి వ్యక్తికీ వుంది. అది ప్రజాస్వామిక పాలనలో మొదటి మెట్టు. వ్యవస్థలో మార్పుకోసం జరిగే కృషిలో విమర్శ ప్రముఖస్థానం ఆక్రమించుకున్నది. విమర్శ, ఆత్మవిమర్శ అభ్యుదయ సాధనాలు. కనుకనే స్త్రీ స్వేచ్ఛాపరంగా క్రైస్తవ మతాన్ని పరిశీలించడం జరిగింది.

ఒక్క విషయం మాత్రం మనవిచేస్తున్నాను. దరిదాపు గ్రంథమంతా బైబిలు ఆధారంతోనూ, కొటేషన్లతోనూ రచింపబడ్డదే. నా కల్పితం ఏమీలేదు. మేధావులయిన కొందరి పరిశోధనలనుండి కొన్ని వాక్యాలు మాత్రం స్వీకరించడం జరిగింది. విషయాన్ని బహిర్గతం చేయడంవల్ల కొంత న్యాయం జరుగుతుందని అలాంటి రచన చేశాను. నూటికి నూరుపాళ్ళు సప్రమాణమయిన విషయాలే యిందులో వున్నాయి. సత్యాన్ని పాఠకులకు అందించాలనే తపనే కాని వారిని మోసపుచ్చాలనిగాని, క్రైస్తవాన్ని నిందించాలనిగాని ఈ రచనకు పూనుకోలేదు. నా ఈ మాటలు విశ్వసించమని పాఠకులను కోరుతున్నాను. ఇది ఎదురీత. తరతరాలుగా మనలో జీర్ణించిన భావాలకు విరుద్ధం. ఈ పరిణామ క్రమమువల్ల సమాజంలో కొంత మార్పువచ్చినా లేక ఏ వ్యక్తిలోనైనా జిజ్ఞాస కలిగినా నా శ్రమ ఫలించినట్లే. నా కదే పారితోషికం. రచనలోని విమర్శలను పాఠకులు అన్యథా తలచవద్దని సవినయంగా మనవిచేస్తున్నాను.

ఈ గ్రంథ రచనకు నాకు ఉత్సాహాన్నీ ఆసక్తినీ కలిగించిన నా జీవిత భాగస్వామి, అఖిలభారత హ్యూమనిష్టు సంఘ అధ్యక్షులు ఎం వి. రామమూర్తిగారికి నేనాజన్మాంతం రుణపడి వుంటాను.

ఈ గ్రంథ రచనలో నాకు తమ అమూల్య సలహాలను, సహకారాన్ని అందించిన నా సోదరతుల్యులు, మిత్రులు సి. హెచ్ రాజారెడ్డిగారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ పుస్తకానికి అట్టమీది బొమ్మను గీసి యిచ్చిన ఆర్టిస్టు జి. శివరాంగారికి నా కృతజ్ఞతలు. సెలవు.

రచయిత

మల్లాది సుబ్బమ్మ

పూర్వరంగం

మానవ జీవితాన్ని అత్యధికంగా ప్రభావితం చేసినవాటిలో మతం ముఖ్యమైనది. అది వ్యక్తి జీవితాన్ని, సామాజిక జీవనాన్ని శాసించింది. విధినిషేధాలను ఏర్పరచింది. నీతిని తన గర్భంలో ఇముడ్చుకుంది. ఆయా పరిస్థితులనుబట్టి విప్లవాత్మకంగాను, ప్రత్యాఘాతక శక్తిగాను వ్యవహరించింది. స్త్రీ పురుషుల సంబంధాల స్వరూపాన్ని నిర్ణయించింది. సమాజంలో మహిళల స్థానాన్ని, హోదాను తేల్చి చెప్పింది. కనుకనే స్త్రీ జనాభ్యుదయ వాదులు మతాన్ని అందులో స్త్రీ స్థానాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఏర్పడింది.

ఆదిమానవుడు ప్రకృతి శక్తుల విజృంభణను చూచి అబ్బురపడ్డాడు. వాన, పిడుగు, మెరుపు, పెనుగాలి వీటిని చూచి ఆశ్చర్యపడ్డాడు. తనకన్నా బలవంతులయిన మానవులు ఈ శక్తుల వెనుక వున్నారని తలపోశాడు. అలా వరుణుడు, ఇంద్రుడు, అగ్ని, వాయువు లాంటి దేవతలు అతని మనస్సుకు గోచరమయ్యారు. ప్రకృతి శక్తుల బాధనుండి తను తప్పుకోవాలంటే వారిని తృప్తిపరచాలనే భావం అతనికి కలిగింది. ఆనాటి తన సంపదను వారికి బలిగా సమర్పించాడు. ఆనాడు అతని ముఖ్యమైన సంపద తన సంతానము, తను మచ్చిక చేసిన జంతువులు. అలా నరబలి, జంతుబలి పొడసూపాయి.

దేవతలను సమాశ్వాసించటానికి చేసే బలులకు ఆనాటి సంఘపెద్దలు ఒక క్రమం ఏర్పరచారు; ప్రార్థనలతో ఆ దేవతలను ఆకట్టుకో జూచారు. తమ ఊహాశక్తిని వినియోగించి రసవంతమైన ప్రార్థనాగీతాలను పాడారు. అవే ఉత్తరోత్తరా మంత్రాలుగా తయారయినాయి. మంత్రాలు వల్లించే జాతి ఏర్పడింది. తెగలో బలవంతుడూ, వివేకవంతుడూ అయిన పురుషుడు మాంత్రికుడయ్యాడు. కాలం గడచిన కొద్దీ మంత్రానికి ప్రాముఖ్యత వచ్చింది. దేవతలు మంత్రాధీనులయ్యారు. ఇంద్రుణ్ణి గూర్చి మంత్రం చదివితే అతగాడు జరజరా కదిలి రావాల్సిందే "సహేంద్ర తక్షకాయ స్వాహా" అని సర్పయాగంలో ఋత్విక్కు ఉచ్చరిస్తే, తన సింహాసనాన్ని చుట్టుకున్న తక్షకుడితోసహా ఇంద్రుడు వచ్చి అగ్నిలో పడిపోవాల్సిందే. ఇది మంత్ర శాస్త్ర మహిమకు నిదర్శనం.

మంత్ర తంత్రాలలో నమ్మకం మతం కన్నా ముందు పుట్టింది. మతంలో వున్న దేవుడు మంత్ర శాస్త్ర దశలో ఉనికి లేనివాడు. సర్వ స్వతంత్రుడై భక్తులకు వరాలిస్తూ ఇతరులను ఇబ్బంది పెడుతూ సంచరించే దేవుడు ఆనాడు లేడు. మంత్రశాస్త్ర పద్ధతి క్రతువులకూ, యాగాలకు ప్రాధాన్యత ఇస్తుంది. భారతదేశంలోని పూర్వ మీమాంస ఈ కోవకు చెందినది. మనిషిలో రెండు రకాల మనస్తత్వాలు ఉంటాయి. ఒకటి అహంభావ ప్రేరితం; రెండవది ఆత్మార్పణ భావ సమన్వితం. 'నేను మొనగాణ్ణి' అని భావించడం ఒక చెంపా, 'నేను ఎందుకూ కొరగానివాణ్ణి' అని తలపోయడం రెండోచెంపా అతని నడవడిలో బహిర్గత మవుతాయి. మొదటిది మంత్రశాస్త్రానికి (Magic) దారితీస్తే రెండవది సర్వశక్తి వంతుడయిన దేవుని సృజించి అతనికి దాసోహం అంటుంది. అలా రెండవ పద్ధతి ఆస్తికతకు దారి తీసింది.

ఒకసారి దేవుని ఉనికిని ఊహించిన తర్వాత అతని స్వభావాన్ని, లక్షణాలను వివరించటం మొదలు పెట్టాడు మానవుడు. దేవుని వర్ణించ డానికి అతని భాష చాలలేదు. అతని పాండిత్యం పరిమితమైపోయింది. మొదట్లో అతనిని సర్వలక్షణ సమన్వితుడనీ, సర్వశక్తిమంతుడనీ పొగిడాడు

మానవుడు. ఈ దశలో దేవుడికి ఆగ్రహానుగ్రహాలను ఆపాదించాడు. ఆ తర్వాత దేవుడు అనిర్వాచ్యుడు, అగమ్యగోచరుడు అయినాడు. దేవుడంటే ఇలా వుంటాడని చెప్పలేని స్థితి సంభవించింది. నిరాకారుడు, నిర్గుణుడు, నిరంజనుడు అని చెప్పడం జరిగింది. అందువల్ల సగుణంలో నుండి నిర్గుణంలోకి మారాడు దేవుడు. ఇది ఆస్తికతలో పరమోత్కృష్టమైన దశ.

సర్వలక్షణోపేతుడయిన దేవునికి మానవుడి లాగానే ప్రేమాభిమానాలు ఈర్ష్యా ద్వేషాలు వున్నాయని తెలుసుకున్నాం. ఈ వివరణ వివేకవంతులయిన మానవులకు నచ్చక నిర్గుణ పరబ్రహ్మను ఊహించారు. కాని ఆ భావన కూడా జిజ్ఞాసువులను తృప్తిపరచలేదు. అందువల్ల కర్మ సిద్ధాంతం మళ్ళీ పుంజుకుంది.

'చనిపోయిన తన పూర్వులు మరి ఉనికి కలిగిలేరు' - అనే భావాన్ని మానవుడు భరించలేకపోయినాడు. నిన్నటిదాకా తనను కని పెంచిన తల్లిదండ్రులు తనకు విద్యాబుద్ధులు గరిపిన తాత ముత్తాతలు చనిపోగానే లేకుండా పోయినారని అనుకోవడం మనిషికి కష్టమయింది. వారు మరో లోకంలో వున్నట్లు చిత్రించుకున్నాడు. వారి పోషణ భారాన్ని కూడా తను స్వీకరించాడు. మాసికాలు, తద్దినాలు పెట్టి ఆహారాన్ని వారికి బట్వాడా చేద్దామనుకున్నాడు. కాని ఎంత కాలం ఆ పితరులు ఆ లోకంలో వుండగలుగుతారు? కనుక యమధర్మరాజును, చిత్రగుప్తుణ్ణి వూహించి స్వర్గనరకాదులు సృష్టించాడు. పుణ్యం చేసినవారు స్వర్గానికి పోతారు. పాపం చేసినవారు నరకానికి పోతారు. తన జీవితంలో మనిషి చేసే పుణ్యానికి పాపానికి పరిమితులుంటాయిగదా! పుణ్య పాపాల ఫలాన్ని అనుభవించిన తర్వాత ఆ జీవి ఎక్కడుండాలి? ఏం చెయ్యాలి? మళ్ళీ పునర్జన్మ ఎత్తుతాడనే సిద్ధాంతం బయలు దేరింది. నూతన జన్మ ఉత్కృష్టమైనది కావచ్చు. లేక పాత జన్మ కన్నా నికృష్టమైనది కావచ్చు. ఆ జీవి యొక్క ప్రారబ్ధాన్ని బట్టి నిర్ణయమవుతుంది. అంటే పూర్వజన్మలో మంచి పనులు చేస్తే మంచిజన్మ, చెడ్డపనిచేస్తే నీచ జన్మ వస్తాయి. ఇదంతా ఒక నియమం ప్రకారం సాగిపోతుంది.

కర్మచక్రం కాలగమనంలో దొర్లిపోతుంటుంది. దీనిని ఆపగలవారు, మార్చగలవారు ఎవరూ లేరు. 'నిర్గుణ పరబ్రహ్మ అయిన భగవంతుడు కూడా ఈ విషయంలో శక్తిహీనుడే' అనే భావన మానవ మేధస్సులో మెరిసింది. భగవంతుడు సాక్షిమాత్రుడయినాడు. ఎందుకూ పనికిరాని సాక్షి ఉంటే ఏం, ఊడితే ఏమని భగవంతుణ్ణి తోసి రాజన్నారు. అలా నాస్తికత్వం మళ్ళీ పుంజుకుంది. ఇది స్థూలంగా మానవ భావ వికాస పరిణామ చరిత్ర.

అయా దేశకాల పరిస్థితులను బట్టి ఆయా సామాజిక జీవన విధానాన్ననుసరించి దేవుని స్వభావ లక్షణాలు నిర్ణయింప బడ్డాయి. ఒకదేశంలో మంత్ర శాస్త్రానికి అత్యధిక ప్రాముఖ్యత ఏర్పడితే, మరో దేశంలో ఆగ్రహానుగ్రహ సమర్థుడైన దేవునికి నీరాజనం పట్టడం జరిగింది. మరో చోట నిర్గుణ పరబ్రహ్మను భావించడం పరిపాటి అయింది. ఇలా నిర్దుష్టంగా, తేడాలు కలిగి మనకు చరిత్రలో కన్పించవు ఈ దశలు. ఒక్కొక్కప్పుడు ఇవన్నీ అనేక పాళ్ళల్లో కలిసి మానవ జీవితాన్ని నియంత్రణ చేస్తాయి. దేనిపాలు ఎక్కువో, తక్కువో అనేదాన్ని బట్టి స్థూలంగా ఆ సమాజంలోని ఆస్తిక భావానికి, మతానికి విలువకడతాం. ఉ॥ హిందూమతంగా చలామణి అవుతున్న బ్రాహ్మణ మతంలో మంత్ర శాస్త్రం, భక్తి, జ్ఞానం ఒకే కాలంలో, ఒకే దశలో చోటుచేసుకున్నాయి. ఇదంతా మానవ సంస్కృతి వారసత్వం.

పూజా పునస్కారాలకు తృప్తిపడి వరాలిచ్చే దేవుణ్ణి ఊహించే మతాలలో క్రైస్తవం, హిందూమతానికి తీసిపోదు. పుణ్యపాపాలను స్వర్గనరకాలను ఊహించిన మానవుడు పుణ్యం చేయాలని తాపత్రయ పడతాడు. అలా తన నడవడిని నియంత్రణ చేసుకుంటాడు. ఆ కృషి, ఫలితమే నీతి. అప్పుడు సమాజపరంగా కొన్ని ధర్మాలు అవసరమవుతాయి. అవి సామాజిక నీతిగా రూపొందుతాయి. దీనిని నిర్దేశించే ఋషులు, అమలు పర్చే రాజులు తయారవుతారు. ఈ రెండు తెగలవారు సమాజాన్ని రక్షించటానికి కంకణం కట్టుకున్నామంటారు. కాని వారు పెత్తందార్లుగా

మారిపోతారు. (ఒక్కొక్క దశలో ఇతుతెగలు చేసే పనిని ఒకరే చెయ్యటం జరుగుతుంది. అంటే రాజర్షులు రంగంలోకి వస్తారన్న మాట) ఇలా రుషిపుంగవులూ, రాజులు, అన్ని రకాల దౌర్జన్యాలతో సమాజాన్ని తమ చెప్పు చేతల్లో వుంచుకున్నారు. వర్ణవ్యవస్థను ఏర్పరచి నిచ్చెనమెట్ల సమాజాన్ని తయారుచేశారు. తమ సమాజం చుట్టూ ఎల్లలు గీశారు. తదితరులను ద్వేషించారు. వారిని 'అన్యులు' గా పరిగణించారు. తమ సంఘానికి ఒక దేవుణ్ణి సృష్టించుకున్నారు. పరాయి సంఘాల దేవుళ్ళను తిట్టిపోశారు. తమ దేవుని ఉత్కృష్టతను నెలకొల్పటానికి యుద్ధాలు చేశారు. అన్యులను తెగనరికారు; బానిసలుగా తెచ్చారు, స్త్రీలను చెరపట్టారు. ఇలాంటి సమాజం ఇంచుమించుగా అన్ని దేశాల్లోను ఎప్పుడో ఒకప్పుడు ఉన్నట్లు చరిత్రలో దాఖలాలున్నాయి.

క్రీస్తు ప్రచారం చేశాడనే భావసముదాయాన్ని క్రైస్తవం అంటున్నాం. అతడు యూదు వంశీయుడు. యూదుదేశంలో అంతకు ముందు వచ్చిన ప్రవక్తల బోధల ప్రభావం అతనిమీద పడింది. అతడు చనిపోయిన సుమారు వంద సంవత్సరాలకు క్రొత్త నిబంధన పుట్టింది. క్రీస్తుకు పూర్వపు యూదుదేశీయుల చరిత్ర పాతనిబంధనగా చలామణీ అయింది. ఈ రెండూ కలిసి పవిత్రగ్రంథంగా పేర్కొని బైబిలుగా ప్రసిద్ధికెక్కింది. తర్వాత మతప్రచారకులు, మఠాలు, పీఠాలు వెలిశాయి. 'పోపు' పుట్టాడు. ఏకైక మత సామ్రాట్టుగా పేదలను, ధనవంతులను, పండితులనూ, పామరులను స్త్రీలను, పురుషులను అందరినీ శాసించాడు. ఆ నిరంకుశత్వానికి విసిగిపోయిన రాజులు కొందరు ఎదురు తిరిగారు. 'ప్రొటెస్టెంటు' ఉద్యమానికి చేయూతనిచ్చారు. దాంతో ముఖ్యంగా రెండు శాఖలు అంటె సంప్రదాయ శాఖ, సంస్కరణ శాఖ ఉద్భవించాయి. కాలక్రమేణ విభిన్న శాఖలు, మఠాలు, చర్చిలు వెలిసినయి. ఈ విభిన్న శాఖల సంఖ్య హిందూమతంలోని కులాల సంఖ్యను మించిపోయింది.

సామాజిక నీతిని నిర్దేశించే మతం స్త్రీ పురుషుల సంబంధాన్ని, స్త్రీ హోదాను, సమాజంలో ఆమె పాత్రను విస్మరించలేదు; ఎంతో వివరంగా

నిర్ణయించింది. ఏ నాగరికతయినా, ఏ సంస్కృతినయినా విలువ కట్టాలంటే అది 'స్త్రీలయెడ ఎలాంటి వైఖరి ప్రదర్శించింది'. అనేది గీటు రాయి. దానిపై ఒరచి చూచి ఆ యా మతాల ప్రాశస్త్యాన్ని నిర్ణయిస్తాం.

ఒక మతాన్ని, దాని మతధర్మాలను, దాని సామాజిక నీతిని విమర్శించడం విభిన్న దృక్పథాలతో చేయవచ్చు. మతం దుష్ట వ్యవస్థ అని నిరూపించటానికి, లేక ఆనాటి మతం అలా చలామణి అయిందని చెప్పటానికి, లేక ఆనాటి మత ప్రబోధితమయిన సామాజిక నీతి ఈనాటికి ఉపకరించదని తెలియజెప్పటానికి మత సమీక్షకు ఉపక్రమించవచ్చు. ఒక్కొక్కప్పుడు పైజెప్పిన మూడు దృక్కోణాలనుండి ఏక కాలమందే పరిశీలించవచ్చు.

ప్రపంచంలో అనేకానేక సమాజాలలో మతం విలయతాండవం చేస్తున్నది కనుక దానిని గురించి పట్టించుకోవలసి వస్తుంది. వ్యాప్తిని తీసుకుంటే క్రైస్తవం అన్నిమతాలకు తలమానికంగా వుంది. బైబిలు భాషాంతరీకరణ జరిగినంతగా మరి ఏ ఇతర 'పవిత్ర' గ్రంథమూ తర్జుమా చేయబడలేదు. 1180 భాషలలోనికి తర్జుమా చేయబడి ఉంది. కొండ జాతులు, సంచార జాతులు, ఆటవిక జాతులు, సాగర ప్రాంతీయులు, వీరి అందరి భాషల్లో బైబిలు ప్రత్యక్షమవుతున్నది. ఆర్థికాభివృద్ధి చెందిన దేశాలలో ప్రాబల్యం సంపాదించుకుంది. క్రైస్తవ మత మఠాలకు లక్షల, కోట్ల డాలర్ల ఆస్తులు వున్నాయి. అవి బృహత్తర ఆర్థిక సంస్థలుగా నెలకొన్నాయి. కోట్లమంది ప్రజల జీవితాలను సరిదిద్దుతున్నాయి. కనుక వీటికి మూలమైన క్రైస్తవ మత సారాన్ని గ్రహించటం అవసరం.

"ఏ జాతి చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం"? అనే ప్రశ్నకు సమాజంలో 'స్త్రీజాతిపై జరిగే అత్యాచారం తప్ప' అనేది స్ఫురిస్తుంది. గత ఆరువేల సంవత్సరాలుగా స్త్రీలను హింసించడం, అణచివేయడం, చిన్నచూపు చూడటం జరుగుతున్నది. పురుషుని సొంత ఆస్తిగా, అతని ఆటబొమ్మగా, అతని బానిసగా, అతని సేవకురాలిగా ఇలా పురుషుడు

స్త్రీని అవమానించాడు. ఇవి కొన్ని సమాజాలలో వేరు వేరు దశలుగా మనకు దర్శనమిస్తే మరికొన్ని సమాజాలలో ఇవి అన్నీ గాని కొన్నిగాని మనకు గోచరమవుతాయి.

క్రైస్తవం ఒకనాటిది కాదు. దానికి మూడువేల సంవత్సరాల చరిత్ర ఉంది. పాత నిబంధనలో వ్యవస్థ కొత్త నిబంధన కాలంలో లేదు. ఆ మాటకువస్తే పాతనిబంధన అంతా ఒకనాటి చరిత్రకాదు అది యూదు జాతీయుల పూర్వచరిత్ర కనుక 'పవిత్ర' గ్రంథమైన బైబిలులో స్త్రీ యెడ వైఖరి మారుతూ వచ్చింది. ఈ అంశాన్ని మనసులో ఉంచుకొంటేనే సరిఅయిన అవగాహన వీలవుతుంది. ఇది సిసలయిన చారిత్రక దృక్పథం. ఈ దృష్టితో బైబిలును, క్రైస్తవ మత చరిత్రను విశ్లేషించ వలసి ఉంటుంది. దానికి ప్రయత్నమే ఈ చిన్న పొత్తం.

రిఫరెన్సు

1. అవతార మూర్తి : బిషప్ పుష్పనాథం (విజయవాడ)

1 పరిశుద్ధ గ్రంథం

ఒక మతాన్ని పరిశీలించేటపుడు, దాని చరిత్రను అధ్యయనం చేసే సందర్భంగా అనేక పద్ధతులను అవలంబించవచ్చు. ఆ మతంపుట్టిన దేశకాల పరిస్థితులను గమనించటం మొదటిపద్ధతి. అలాకాక ఆ మత 'ప్రవక్తల' సూక్తులను, వాటి కథలను క్షుణ్ణంగా తరచి చూడటం రెండవది. ఆ మతాచార్యుల ఆజ్ఞలను, ఆంక్షలను సమగ్రంగా పేర్కొని విశ్లేషించటం మూడవది. ఆ యా మతస్తుల సంప్రదాయాలను, ఆచారాలను వివరించటం నాలుగవది.

ఒక 'ప్రవక్త' ఉద్భవించిన తరువాత అతని సూక్తులు శిరోధార్యాలవుతాయి. దానికి అనేక భాష్యాలు వస్తాయి. భాష్య భేదాలనుబట్టి మత శాఖలు ఏర్పడతాయి. ఒక్కొక్క శాఖకు ఒకడు ఆద్యుడు అవుతాడు. ఆ శాఖను అనుసరించేవారికి ఒక మఠము, ఒక చర్చి, ఒక మతనాయకుడు క్రమంగా అస్తిత్వం పొందుతాయి. ఇలా శాఖోపశాఖలవుతుంది మతస్తుల లోకం. ఒక శాఖకూ మరొక శాఖకూ మధ్య విభేదాలుంటాయి. ఉదాహరణకు రోమన్ కాథలిక్ మత శాఖల్లో విడాకులకు అవకాశం లేదు. ప్రొటెస్టెంటు శాఖలో విడాకులు పుచ్చుకోవచ్చును. కనుక శాఖల వారీగా, ఆయా మతశాఖల పెద్దల ఆజ్ఞల పరంగా క్రైస్తవాన్ని పరిశీలించ

పూనడం పరిస్తుతం కానిసని. కాగా క్రైస్తవమతం అన్ని వర్గాలవారిలో, అన్ని ఖండాలవారిలో వ్యాప్తి చెందింది. ప్రతిదేశానికీ, ప్రాంతానికీ కొన్ని సంప్రదాయాలు, ఆచారాలు రూఢ్యమవుతాయి. ఒక్కొక్కప్పుడు అవి మతగ్రంథ ఆదేశాలకన్న మిన్నగా ప్రభావం కలిగి ఉంటాయి. కనుక వాటి పరంగా క్రైస్తవంపై దృష్టి సారించటం అంత మంచిదికాదు. మిగిలినది ఒకే ఒక విధానం. అది ఆ మతం యొక్క 'పవిత్ర' గ్రంథ పరిశీలనయే.

బైబిలు మొత్తం 'పవిత్ర' గ్రంథమైనపుడు పాతనిబంధన, క్రొత్త నిబంధన రెండూ మాననీయమవుతాయి. కాగా ఏసుక్రీస్తు పాత నిబంధనలో లేడు. పాత నిబంధనలోని దేవుడు యెహోవాకు క్రొత్త నిబంధనలోని దేవునికి స్వరూప స్వభావాలలో భేదమున్నది. అది సహజమైన పరిణామం. పాతనిబంధన కాలం వేరు. క్రొత్త నిబంధన కాలంవేరు. ఆనాటి సమాజం క్రీస్తునాటికి మారిపోయింది. కనుక దేవుడూ మారాడు. దేవుణ్ణి మార్చారు. పాతనిబంధన సూత్రాలను, క్రొత్త నిబంధన సూక్తులను సమన్వయం చేయపూనడం హాస్యాస్పదం. అంధ విశ్వాసంలో మునిగి తేలేవారికి ఆ సమస్య అసలే తారసిల్లదు. అయినా 'క్రైస్తవం స్త్రీల పరంగా ఏమి చెప్పింది?' అనే అంశాన్ని వితర్కించేటపుడు 'పవిత్ర' గ్రంథం యొక్క రెండు భాగాలను ఉటంకించక తప్పదు. కాకపోతే చారిత్రక దృష్టితో అర్థం చేసుకోవానికి ప్రయత్నించటం అవసరం.

అసలు ఏసుక్రీస్తుకు చరిత్రలో ఉనికియే లేదనేవారున్నారు. అతని గాథ కేవలం కల్పితమని వాదించేవారున్నారు. అంతేగాక అది ప్రాచ్య దేశాల పురాణ పురుషుల అనుకరణగా పుట్టిన కట్టుకథ అని నొక్కి వక్కాణించే వారున్నారు! ఏసుక్రీస్తు కథకూ భాగవత కృష్ణుని కథకూ ఉన్న సాదృశ్యాలను వెలికితీసే వారున్నారు.[1] ఏది ఏమైనా ఈనాటి బైబిలు క్రొత్తనిబంధన అనేక కోట్ల ప్రజానీకపు జీవితాలను ప్రభావితం చేస్తున్నదనేది సచ్చినిజం. కనుక క్రొత్తనిబంధనను త్రోసిరాజనలేం. అందుచేత ప్రధానంగా క్రొత్తనిబంధన ఆధారంగా ఈ పరిశోధన సాగుతుంది.

సామాన్యంగా పాత నిబంధనను చరిత్రగానో కనీసం ఇతిహాసంగానో పరిగణించవచ్చు. అప్పుడు దేశకాల పరిస్థితులు మారాయి కనుక పాత నిబంధనను పట్టించుకోనక్కరలేదు. పాతనిబంధన కూడా పరిశుద్ధ గ్రంథంలో భాగంగా పేర్కొనడం వల్లనే చిక్కువస్తున్నది. అదీగాక పాతనిబంధన సూత్రాలను బలపరుస్తూ క్రొత్త నిబంధనలో వాక్యాలున్నాయి.

"మోషేయు, ప్రవక్తలును (చెప్పిన మాటలు) వారు విననియెడల మృతులలోనుండి ఒకడు లేచినను వారు నమ్మరని అతనితో చెప్పెననెను". (లూకా 16 : 31) యేసు ఇట్లుచెప్పెను, "ధర్మశాస్త్రములనైనను ప్రవక్తల వచనములనైనను కొట్టి వేయువచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకేగాని కొట్టివేయుటకు నేను రాలేదు. ఆకాశమును భూమియు గతించి పోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు దానినుండి ఒక పొల్లయినను ఒక సున్నయయినను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. కాబట్టి ఈ యాజ్ఞలలో మిగుల అల్పమయిన యొకదానినైనను మీరి, మనుష్యులకు ఆలాగున చేయబోధించు వాడెవడో వాడుపరలోకరాజ్యములో మిగుల అల్పుడనబడును; అయితే వాటిని గైకొని బోధించు వాడెవడో వాడు పరలోక రాజ్యములో గొప్పవాడనబడును" (మత్తయి 5 : 17 - 19)

"ధర్మశాస్త్రములో ఒక పొల్లయినను తప్పిపోవుటకంటె ఆకాశమును భూమియు గతించి పోవుట సులభము" (లూకా 16 : 17)

"క్రీస్తు యేసునందుంచవలసిన విశ్వాసము ద్వారా రక్షణార్థమైన జ్ఞానము నీకు కల్గించుటకు శక్తిగల పరిశుద్ధ లేఖనములను బాల్యము నుండి నీ వెరుగుదువు గనుక, నీవు నేర్చుకొని రూఢియని తెలిసికొన్నవి ఎవరివల్ల నేర్చుకొంటివో ఆ సంగతి తెలిసికొని, వాటియందు నిలకడగా ఉండుము. దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశమువల్ల కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్షచేయుట యందును ప్రయోజన కరమై యున్నది" (2 తిమోతి 3 : 15 - 17)

"లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి.... అతడు నన్ను గూర్చి వ్రాసెను గనుక మీరు మోషేను నమ్మినట్లయిన నన్నును నమ్ముదురు....మీరతని లేఖనములను నమ్మనియెడల నా మాటలు ఏలాగు నమ్ముదురనెను" (యోహాను 5 : 39, 46, 47)

"అందుకాయన- అవివేకులారా, ప్రవక్తలు చెప్పిన మాటల నన్నిటిని నమ్మని మందమతులారా,....మోషేయు, సమస్త ప్రవక్తలును మొదలు కొని లేఖనములన్నిటిలో తన్ను గూర్చిన వచనముల భావము వారికి తెలిపెను" (లూకా 24 : 25, 27)

"అబ్రహాము శోధింపబడి విశ్వాసమును బట్టి ఇస్సాకును బలిగా అర్పించెను....విశ్వాసమును బట్టి ఏడు దినముల వరకు ప్రదక్షిణము చేయబడిన తరువాత ఎరికో గోడలు కూలెను. విశ్వాసమునుబట్టి రాహాబను వేశ్య వేగులవారిని సమాధానముగా చేర్చుకొని గనుక అవిధేయులతో పాటు నశింపక పోయెను." (హెబ్రీయులకు 11 : 17, 30, 31)

"మన పితరుడైన అబ్రహాము తన కుమారుడైన ఇస్సాకును బలిపీఠము మీద అర్పించినప్పుడు అతడు క్రియల వలన నీతిమంతుడని తీర్పు పొందలేదా? విశ్వాసము అతని క్రియలతో కూడి కార్యసిద్ధి కలుగ జేసెననియు క్రియల మూలముగా అతని విశ్వాసము పరిపూర్ణమయిన దనియు గ్రహించుచున్నావు కదా." (యాకోబు 2 : 21, 22)

ఈ వాక్యాలనుబట్టి పాతనిబంధనలోని ధర్మశాస్త్రాన్ని, లేఖనములను, కథలను ఏసుక్రీస్తు, అతని అనుచరులు నమ్మి వాటిని పవిత్రమయినవిగా భావించినట్లు తేలుతున్నది. అందుచేత సందర్భోచితంగా పాత నిబంధన వాక్యములను కూడా ఈ గ్రంథంలో ఉటంకించుట పొరపాటు కాదు.

బైబిలులో వ్యాఘాతాలు, అసంబద్ధాలు, అన్యాయాలు, అవినీతి అసభ్యత, అశ్లీలము మెండుగా ఉన్నవని ఆరోపణ చేస్తూ గ్రంథాలు వెలువడినాయి.[2] "ఈనాడు పాతనిబంధనను అనుసరిస్తే అతడు నేరస్తుడవుతాడు. క్రొత్త నిబంధన బోధలను తు. చ. తప్పకుండా పాటించిన వాడు మతిస్థిమితం పోగొట్టుకుంటాడు"[3] అని ఇంగర్ సాల్ వ్యాఖ్యానించాడు. క్రైస్తవమతం స్త్రీ హోదాను దిగజార్చిందని అతడే ఆరోపించాడు.[4] ఈ ఆరోపణలు ఎంతవరకు నిజమో ఈ గ్రంథంలో పరిశీలించవలసి యున్నది.

1 వ అధ్యాయం రిఫరెన్సులు

1. క్రీస్తు, క్రిష్ణ : ఎడమరుకు (ఆంగ్లంలో) ఇండియన్ ఎథియిస్టు పబ్లిషర్సు 1740 ఎ - 5ఏ, నయూవాలా, కరోల్‌బాగ్, న్యూఢిల్లి 110 005
2. బైబిలు హాండ్ బుక్ సం॥ జి. డబ్ల్యు. ఫూట్ & డబ్ల్యు. పి. బాల్ (ఆంగ్లంలో)
3. ఇంగర్‌సాల్ ఇమ్మార్టల్ ఇన్‌ఫిడల్ (ఆంగ్లంలో) సం॥ రోజర్ ఇ. గ్రీలీ ప్రొమిథియసు బుక్సు, బఫెలో, న్యూయార్కు 14215 (యు. ఎస్. ఎ)
4. "రోమ్ ఆర్ రీజన్" : (ఆంగ్లంలో) ఇంగర్‌సాల్ - పుట 46 పయనీర్ ప్రెస్, జి. డబ్ల్యు.ఫూట్ అండ్ కంపెనీ, లండను.

2 స్త్రీ హోదా

స్త్రీ విమోచన కార్యకర్తల వాదన ప్రకారం సమాజంలో స్త్రీల కష్టాలు పుట్టుకతోనే మొదలవుతున్నాయి. అది క్రైస్తవమత పరంగా ఎంతవరకు సత్యమో పరిశీలించటం అవశ్య కర్తవ్యం.

స్త్రీ పురుషుల జననం

సృష్టి క్రమము పాత నిబంధనలో ఆదికాండములో వివరించబడింది. మున్ముందుగా దేవుడు పురుషుని సృజించెను. "దేవుడైన యెహోవా నేల మంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను. దేవుడైన యెహోవా తూర్పున ఏదేనులో ఒక తోటవేసి తాను నిర్మించిన నరుని దానిలో ఉంచెను. వృక్షములను మొలిపించెను. మొదటి నరుని పేరు ఆదాము....అప్పుడు ఆదాము సమస్త పశువులకు, ఆకాశ పక్షులకు, భూ జంతువులకు పేర్లు పెట్టెను." - (ఆదికాండము 2 : 7 - 20) ఆదాము సాయంకొరకు పశు పక్ష్యాదులను దేవుడు సృజించెను. (ఆది 2 : 18, 19) కాని ఆదామునకు సాటియైన సహాయం లేకపోయెను. (ఆది 2 : 20) ఇక్కడే సృష్టిక్రమము వక్రించినది. మానవ పునరుత్పత్తి క్రమంలో స్త్రీదే పెద్దపాత్ర. అందువలనే పురాతన మతాలలో 'అమ్మతల్లి' కి పూజలు జరిగేవి. కాని యూదామతం క్రమాన్ని తలక్రిందులు చేసింది.

ఈ సందర్భంగా మరో అంశం గమనించదగినది నరునికి సావాసంగా-ఒంటరితనం పోగొట్టటానికి - జంతువులనూ పక్షులనూ సృష్టిచేశాడు దేవుడు. స్త్రీని సృష్టిచేయాలనే ఆలోచన ఆయనకు కలుగలేదు. యెహోవా క్రమబద్ధంగా ఆలోచించలేని వాడయినా కావాలి; లేక స్త్రీ కన్నా జంతువులు ముఖ్యమని ఆయన భావించి ఉండాలి. లేక యెహోవా పురుషుడైనందువల్ల ముమ్మొందుగా పురుషుని సృష్టిచేసి ఉండాలి. అదీ కాకపోతే ఆయనకు మతిమరపు అయినా కలిగి ఉండవచ్చును. ఏదైనా స్త్రీని జంతువుల తర్వాత సృష్టి చేయడంలో యెహోవా స్త్రీకి తక్కువస్థానం సంకల్పించాడని విదితమవుతుంది.

కధ అంటితో ఆగిపోలేదు. "అప్పుడు దేవుడైన యెహోవా ఆదాముకు గాఢనిద్ర కలుగజేసి అతడు నిద్రించినపుడు అతని ప్రక్కటెముకలలో ఒకదానిని తీసి ఆ చోటును మాంసముతో పూడ్చివేసెను. తరువాత దేవుడైన యెహోవా తాను ఆదామునుండి తీసిన ప్రక్కటెముకను స్త్రీనిగా నిర్మించి ఆమెను ఆదాము నొద్దకు తీసికొనివచ్చెను....ఇది నరునిలోనుండి తీయుబడెను గనుక నారి అనబడెను. (ఆది 2: 21 - 23). ఈ కథకు అర్థం ఇలా చెప్పుకోవాలి. నరునకు ప్రత్యేక అస్తిత్వం ఉన్నది. నారి నరునినుండి పుట్టినది. నరునిలో భాగం. కనుక నారికి ప్రత్యేక ఉనికి ఉండదు; వ్యక్తిత్వం ఉండటానికి అవకాశం లేదు. నరుడు అధికుడు, నారి అల్పురాలు. దీనికి సమాధానంగా క్రైస్తవమత ప్రచారకులు ఇలా జవాబు చెప్తున్నారు. నరుని తలనుండి కాని పాదములనుండి కాని దేవుడు వారిని సృష్టి చేయులేదు; నరుని ప్రక్కటెముకనుండి ఆమెను నిర్మించాడు. అందువలన దేవుడు స్త్రీ పురుషులను సమానస్థులుగా భావించాడు.[1] ఇది అసంబద్ధమైన వాదన. స్త్రీ పురుషులను వేరువేరుగా దేవుడైన యెహోవా ఎందుకు సృజించలేదో అర్థం కాకుండా ఉంది, ఏదో అర్థాలు చెప్పుకుని ఆత్మతృప్తి చెందడం, ఆత్మవంచన చేసుకోవడం ఆరోగ్య కరమైన లక్షణం కాదు.

యూదా విజ్ఞాన సర్వస్వంలో "భార్య ఆస్తిగా (పురుషుని) పరిగణింప బడెను" అనివ్రాసి ఉంది.[2] హెబ్రూ పురుషుడు ప్రతిదినమూ భగవంతుని ఇలా ప్రార్థిస్తాడు. "నన్ను స్త్రీగా సృష్టిచేయని నీకు నా వందనములు" హెబ్రూ స్త్రీ ఇలా ప్రణిరోణా ప్రార్థించాలి, "నీ ఇష్టము వచ్చిన విధంగా నన్ను నిర్మించిన ఓ దేవా[3] ....అవమానకరమైన పరిస్థితుల్లో జన్మించిన స్త్రీ సదా దేవునికి కృతజ్ఞత తెలుపుకోవాలి.

స్త్రీ పురుషుని కొరకే

స్త్రీని సృజించుటలో దేవుడైన యెహోవా ఒక ప్రయోజనాన్ని ఆశించెను. పురుషునికి ఆమె సహాయకర్త అగుటయే ఆ ప్రయోజనము. "పురుషుడైతే దేవుని పోలికయు మహిమయునై యున్నాడు గనుక తలమీద ముసుగు వేసికొనకూడదు గాని స్త్రీ పురుషుని మహిమయై యున్నది। ఏల యనగా స్త్రీ పురుషునిమండి కలిగెనే గాని పురుషుడు స్త్రీ నుండి కలుగలేదు। మరియు స్త్రీ పురుషుని కొరకేగాని పురుషుడు స్త్రీ కొరకు సృష్టింపబడలేదు.....మీలో మీరే యోచించుకొనుడి; స్త్రీ ముసుగు లేనిదై దేవుని ప్రార్థించుట తగునా?" (1 కొరింథీయులకు 11 : 7 – 9, 13– వక్కాణింపు రచయిత్రది)

ఇదే భావన క్రొత్త నిబంధనలో మరొకచోట కన్పడుతున్నది. స్త్రీ ప్రసవించినపుడు ఆమె గడియవచ్చెను గనుక ఆమె వేదన పడును; అయితే శిశువు పుట్టగానే లోకమందు నరుడొకడు పుట్టెనను సంతోషము చేత ఆమె ఆ వేదన మరల జ్ఞాపకము చేసికొన్నది. (యోహాను 16 ; 21 – వక్కాణింపు రచయితది)

స్త్రీ చేసిన మహాపాపం!

వీధులలో విశాలమైన గోడలమీద ప్రచారకులు వ్రాయించిన సూక్తులు కన్పిస్తాయి. "నీ పాపములను పోగొట్టుటకు ఏసు రక్తదానం చేసెను"

నీ పాపమునుండి రక్షింపబడుటకు యేసును ఆశ్రయింపుము. ఇలా ఎప్పటి కప్పుడు మానవుని 'నీవు జన్మతః పాపివి' అనే భావంతో హెచ్చరికలు అడుగడుగునా తారసిల్లుతవి. ఈ పాపం మనిషికి ఎలా అంటుకుంది? ఇది ఆతని ప్రారబ్ధమా లేక సంచితమా? ఇది ఏ మనిషి చేసిన పాపంకాదు. ఆదాము హవ్వల పాపం. అది దంపతుల పాపం. అది తరతరాలుగా యుగయుగాలుగా వారసత్వంగా వస్తున్న పాపం. దీనిని తొలగించు కోవాలంటే దేవుడైన యెహోవా కృపాపరం కావాలి. అది యేసును ఆశ్రయించటం ద్వారా మాత్రమే లభ్యం కాగలదు.

ఆదాము హవ్వలు చేసిన పాపమేమిటి? అందులో, వారిద్దరిలో ప్రధాన నేరస్తులెవరు? "తోట మధ్యనున్న చెట్టు ఫలములను గూర్చి దేవుడు - మీరు చావకుండునట్లు వాటిని ముట్టకూడదనియు చెప్పెనని సర్పముతో ఆమె (హవ్వ) అనెను." (ఆది 3 : 3) ఆ ఫలములను తినినను చావు రాదని సర్పము చెప్పగా "స్త్రీ ఆ వృక్షము ఆహారమునకు మంచిదియు, కన్నులకు అందమైనదియు, వివేకమిచ్చు రమ్య మైనదియునై యుండుట చూచినప్పుడు ఆమె దాని ఫలములలో కొన్ని తీసుకొని తిని తనతోబాటు తన భర్తకును ఇచ్చెను, అతడు కూడ తినెను. అప్పుడు వారిద్దరి కన్నులు తెరవబడెను." (ఆది 3 : 6, 7) తిన్నది జ్ఞానఫలం కలిగింది వివేకం. అయినా తప్పే. దేవుడు ఆదామును ప్రశ్నించగా అందుకు ఆదాము—"నాతో నుండుటకు నీవు నాకిచ్చిన స్త్రీయే ఆ వృక్షఫలములు కొన్ని నాకియ్యగా తింటిననెను." (ఆది 3 : 12) అది వాస్తవం కావచ్చును. కాని దేవుని మహిమన జన్మించిన ఆదాము వివేకం ఏమయినది? నింద హవ్వమీద మోపటం న్యాయమా? ఏదైనా దేవుని దృష్టిలో హవ్వ మూడు తప్పిదాలు చేసింది. దేవుని ఆజ్ఞను అతిక్రమించుట, సర్పముయొక్క మోసమునకు తలయొగ్గుట, పురుషుని ప్రలోభ పెట్టుటగా వాటిని పేర్కొనటం జరిగింది. దేవుడైన యెహోవా ఆగ్రహోదగ్రుడయినాడు. ఆమెకు శాపాలు పెట్టాడు. అవి ఇలా ఉన్నాయి:- "ఆయన స్త్రీతో నీ ప్రయాసమును, నీగర్భవేదనను మిగుల హెచ్చించెదను;

వేదనతో పిల్లలను కందువు; నీ భర్తయెడల నీకు వాంఛ కలుగును. అతడు నిన్ను ఏలునని చెప్పెను." (వక్కాణింపు రచయితది : ఆది 3 : 16)

అంతటితో ఆగలేదు దేవునికోపం. ఈ శాపఫలాన్ని ఇంకా తరతరాల వారు అనుభవించాలట! "నన్ను ద్వేషించు వారి విషయములో మూడు నాలుగు తరముల వరకు, తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించును...." (నిర్గమ కాండం 20 : 5) – హవ్వకు శాపం పెట్టినప్పుడు దేవుడు ఆదామును కూడ శపించెను. ఇదే భావం నిర్గమ 34 : 7, సంఖ్యా కాండము 27 : 2 – 8 వాక్యాలలోను ద్యోతకమవుతుంది. పురుషుని పాపం అతనిని పదితరాలవరకే వెన్నాడుతుంది. కాని స్త్రీకి ఇవ్వబడిన శాపం స్త్రీ జాతికి మొత్తానికి వర్తిస్తుంది.

స్త్రీ పురుషుని ఆస్తి

మోషే దేవుని యాజ్ఞలను వివరించి చెప్పెను. అవి "నరహత్య చేయకూడదు.....నీ పొరుగువాని ఇల్లు ఆశింపకూడదు. నీ పొరుగువాని భార్యనైనను, అతని దాసునైనను, అతని దాసినైనను, అతని యెద్దునైనను, అతని గాడిదనైనను, నీ పొరుగు వానిదగు దేనినైనను ఆశింప కూడదు అని చెప్పెను" (నిర్గమ 20 : 13 – 17) జాగ్రత్తగా పరిశీలించండి. ఇల్లు, పరిచారకులు, పరిచారికలు, ఎద్దులు, గాడిదలతోపాటు భార్యలను పేర్కొనడం జరిగింది. అంటే భార్యలు ప్రాణంలేని ఇళ్ళతోను, జీవం ఉన్న పశువులతోను, దాసదాసీజనంతోను సమానమన్నమాట. అంటే భార్య భర్తయొక్క వస్తువు లేక ఆస్తి.

సమాజంయొక్క తొలిరోజుల్లో కొన్ని శతాబ్దాలు స్త్రీ పురుషుని ఆస్తిగా పేర్కొనబడింది. తరువాత కొంతకాలానికి ఆమె అతని బానిస అయింది. తరువాత మరికొంతకాలానికి ద్వితీయశ్రేణి పౌరురాలయింది. ఇంకా పరిపూర్ణంగా స్త్రీ పురుషుల సమానత్వం సాధింపబడలేదు. మోషే కాలానికి ఆమె పురుషుని వస్తువని గ్రహించటం అవసరం.

స్త్రీలకు ఆత్మలున్నవా?

క్రీ. శ. 585 లో 59 మంది బిషప్పులు - అందరూ పురుషులే - స్త్రీలకు ఆత్మలున్నవా అనే అంశాన్ని తర్కించి వితర్కించి చివరకు ఒక్క వోటు మెజారిటీతో స్త్రీలకు ఆత్మలున్నాయని తేల్చారు.[4] రష్యాలో పీటర్ (1682 - 1725) అయ్యేవరకు స్త్రీలను జనాభా లెక్కలలో నమోదు చేసేవారు కాదు. అంటే వారు మానవులు కారనే భావం స్పష్టమవుతుంది.

స్త్రీలు అపరిశుద్ధులు

బహిష్టు అయిన స్త్రీ ఏడుదినములు కడగా ఉండవలెను. ఆమెను ముట్టువారందరు సాయంకాలం వరకు అపవిత్రులగుదురు. (లేవీయకాండము 15 : 19) "ఒక స్త్రీ కడగా ఉండుకాలమునకు ముందుగా ఆమె రక్తస్రావము ఇంకా అనేక దినములు స్రవించినను ఆమె కడగానుండు కాలమైన తరువాత స్రవించినను, ఆమె అపవిత్రత ఆమె కడగానుండు దినములలో వలెనే ఆ స్రావదినములన్నియు యుండును, ఆమె అపవిత్రురాలు." (లేవీ 15 : 25) "స్త్రీ గర్భవతియై మగపిల్లను కనిన యెడల ఆమె ఏడుదినములు పురిటాలై యుండవలెను." (లేవీ 12 : 2) "ఆమె ఆడుబిడ్డను కనినయెడల ఆమె తాను కడగా నుండునప్పటివలె రెండువారములు పురిటాలై యుండవలెను. (లేవీ 12 : 5 - వక్కాణింపు రచయితది) ఆమె తన రక్తశుద్ధికొరకు మగపిల్లవానిని కంటే ముప్పది మూడు దినములు, ఆడపిల్లను కంటే అరువది ఆరుదినములు కడగా ఉండవలెను. (లేవీ 12 : 4, 5) అంటే మగపిల్లవానిని కంటే (7 + 33) నలుబది దినములు, ఆడపిల్లను కంటే (66 + 14 = 80) ఎనుబది దినములు కడగా ఉండవలెను.

దీనినే గోరుచుట్టుపై రోకటిపోటుగా అభివర్ణించవచ్చును. ఈ అపరిశుద్ధ భావనయే పొరపాటు. అంతటితో ఆగక స్త్రీ పురుష విభేదము ఇందులో ప్రవేశపెట్టిరి యాజకులు. స్త్రీని ఎంత చిన్నచూపు చూచిందో పరిశుద్ధ గ్రంథం తేటతెల్లమగుచున్నది ఈ ఒక్క అంశం విషయంగానే.

స్త్రీలను గురించిన అభిప్రాయాలు

స్త్రీలను ఏహ్యభావంతో చూచేవారు. వారిని గురించి పురుషులకు హెచ్చరికలు చేసేవారు. స్త్రీలను దొంగలుగా ప్రవర్తించమని దేవుడు ఆజ్ఞాపించెను.

"ప్రతి స్త్రీయు తన పొరుగుదానిని తన యింటమందుదానిని వెండి నగలను, బంగారు నగలను వస్త్రములను ఇమ్మని అడిగి తీసుకొని మీరు వాటిని మీ కుమారులకును మీ కుమార్తెలకును ధరింపచేసి ఐగుప్తీయులను దోచుకొందురనెను'' (నిర్గమ 3 : 32)

"స్త్రీకి పుట్టినవాడు ఆయన దృష్టికి ఎట్లు శుద్ధుడు కాగలడు?'' (యోబు 25 : 4) గుణవతియైన భార్య దొరుకుట అరుదు. అట్టిది ముత్యము కంటే అమూల్యమయినది'' (సామెత 31 : 10)

''చాలునని పలుకనివి నాలుగు కలవు. అవేవనగా పాతాళం, కననిగర్భం, నీరుచాలును అనని భూమి, చాలును అనని అగ్ని'' (సామెత 30 : 16)

"(భూమి) మోయలేనివి నాలుగు కలవు. అవేవనగా రాజరికమునకు వచ్చిన దాసుడు, కడుపునిండ అన్నము కలిగిన మూర్ఖుడు, కంటకురాలై యుండి పెండ్లియైన స్త్రీ, యజమానురాలికి హక్కుదారురాలైన దాసి. (సామెత 30 : 21 - 23)

మరణముకంటెను ఎక్కువ దుఃఖము కలిగించునది ఒకటి. నాకు కనబడెను; అది వలల వంటిదై, ఉరులవంటి మనస్సును బంధకములవంటి చేతులును కలిగిన స్త్రీ; దేవుని దృష్టికి మంచివారైనవారు దానిని తప్పించుకుందురు గాని పాపాత్ములు దానివలన పట్టుబడుదురు." (ప్రసంగి 7:26)

"అయితే నేను తరచి చూచినను నాకు కనబడనిది ఒకటి యున్నది. అదేదనగా వెయ్యిమంది పురుషులలో నేనొకనిని చూచితిని గాని అంత

మంది స్త్రీలలో ఒకతెను చూడలేదు." (ప్రసంగి 7 : 28) భర్తపై తన ప్రభావం చూపబోయిన యెజెబెలును దేవుడు శిక్షించెను. (I రాజులు 21:23) కుక్కలు యెజెబెలు మాంసమును తినును (II రాజులు 9 - 36) ఇది స్త్రీ జాతికి బెదిరింపు. డెలీలాకథ సారాంశం స్త్రీలను నమ్మవద్దని (న్యాయాధిపతులు 16 : 1 - 31)

ఏసుక్రీస్తు దృష్టిలో మహిళ

పాత నిబంధనలో ఇలా ఉంటే కొత్త నిబంధన ఇంతకన్న మెరుగేమీ కాదు. అందులో ముఖ్యంగా స్త్రీలయెడ ఏసు ప్రవర్తన గమనార్హం. ఏసు బ్రహ్మచారి, స్త్రీలకు దూరంగా ఉండదలచేవాడు. అతడు ఇలా అన్నాడు. "ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసిన వాడగును." (మత్తయి 5 : 28)

"నీ కుడికన్ను నిన్ను అభ్యంతర పరచిన యెడల దానిపెరికి నీ యొద్దనుండి పారవేయుము." (మత్తయి 5 : 29)

కానా అను ఊరిలో ఒక వివాహం జరిగెను. ఏసు తల్లి అక్కడ ఉండెను. ఏసు అతని శిష్యులు అచటికి ఆహ్వానింపబడిరి. ద్రాక్షారసమయి పోయినదని ఏసు తల్లి చెప్పగా అతడు "అమ్మా, నాతో నీకేమి (పని) నా సమయమింకను రాలేదనెను" (యోహాను 2 : 4) ఇంగ్లీషు పాఠాన్ని (బైబిలు సొసైటీవారు ప్రచురించిన బైబిలులోనిదే) తెనిగిస్తే "ఓ మహిళా నాతో నీకేమిపని?" అని అర్థం వస్తుంది.

దీనినిబట్టి ఏసుకు స్త్రీలంటే విముఖత ఉన్నట్లు విశదమవుతుంది.

స్త్రీలయెడ ఏసుయొక్క పరుష సంభాషణకు మరికొన్ని ఉదాహరణలు :–

"ఆయన తల్లియు సహోదరులును ఆయన యొద్దకు వచ్చి, జనులు గుంపులుగా ఉండుటచేత ఆయన దగ్గరకు రాలేకపోయిరి." ఈ విషయం

ఏసుకు తెలియజేయుబడెను. అంత "దేవుని వాక్యం విని, దానిప్రకారం జరిగించువారే నా తల్లియు నా సహోదరులునని వారితో చెప్పెను" (లూకా 8 : 19 - 21)

ఈ సంఘటననే మత్తయి మరియొకరీతిలో చెప్పెను. "నా తల్లి ఎవరు? నా సహోదరులెవరు? అనిచెప్పి తన శిష్యులవైపు చెయ్యిచాపి - ఇదిగో నా తల్లియు, నా సహోదరులును; పరలోకమందున్న నా తండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడును, నా సహోదరియు, నా తల్లియుననెను." (మత్తయి 12 : 46 - 50)

సర్వసంగపరిత్యాగంచేసిన ఏసు సహోదరులను విస్మరించవచ్చును. కాని జన్మనిచ్చిన తల్లిని నిర్లక్ష్యంగా మాట్లాడి, నిరసించి పరలోకమందున్న తండ్రిని పొగడుట అనుచితం కాదా?

కనాను స్త్రీ యొకతె ఏసువద్దకు వచ్చి తనకుమార్తెకు పట్టిన దయ్యమును వదిలింపుమనెను....తరువాత ఆమె ఏసును ప్రార్థించెను "పిల్లల రొట్టెతీసి కుక్కపిల్లలకు వేయుట యుక్తముకాదని ఏసు చెప్పెను." (మత్తయి 15 : 22 - 28) ఇశ్రాయేలు ఇంటివారు చిన్నపిల్లలని తదితరులు కుక్కలని ఏసు అన్నాడని తలిస్తే అది ఏసు వ్యక్తిత్వానికి భంగకరం. అలా కాక కనాను స్త్రీని కుక్కతో పోల్చినాడని భావిస్తే స్త్రీలపై అతనికి ఉన్న 'వ్యాభవం' తేటతెల్లమువుతుంది. ఏదైనా స్త్రీ పట్ల అలాంటి దుష్ట అవమానాలను పరుషవచనాలను పలకడం అనుచితం.

పౌలు భావాలు

క్రైస్తవ మతస్థాపకునిగా పౌలును అభివర్ణించారు చరిత్రకారులు. అతడు ఏసుకన్న రెండాకులు ఎక్కువ చదివెను. గురువును మించి పోయెను. స్త్రీలయెడ ద్వేషాన్ని వెడలగ్రక్కెను. అధునికుల దృష్టితో ఇతడు స్త్రీ జాతికి శత్రువు. స్త్రీలు అనుసరించవలసిన ప్రవర్తన నియమాలను అతడు యిలా పేర్కొన్నాడు:-

"ప్రతి పురుషునికి శిరస్సు క్రీస్తుఅనియు, స్త్రీకి శిరస్సు పురుషుడనియు, క్రీస్తునకు శిరస్సు దేవుడనియు మీరు తెలిసికొనవలెనని కోరుచున్నాను'' (I కొరింథీయులకు 11 : 4) ఎందుకు చర్చిలో ఆమె ముసుగు వేసుకొనవలెనో ఆయన వివరించినాడు." పురుషుడైతే దేవుని పోలికయు మహిమయునై యున్నాడు గనుక తలమీద ముసుగు వేసికొనగూడదు గాని స్త్రీ పురుషుని మహిమయై యున్నది. ఏలయనగా స్త్రీ పురుషునినుండి కలిగెనే గాని పురుషుడు స్త్రీ నుండి కలుగలేదు. మరియు స్త్రీ పురుషునికొరకేగాని పురుషుడు స్త్రీ కొరకు సృష్టింపబడలేదు.'' (I కొరింథీ 11 ; 7 - 11)

చర్చిలలోని సమావేశములను గురించి చెప్తూ "స్త్రీలు సంఘములో మౌనముగా ఉండవలెను. వారు లోబడి యుండవలసినదేగాని మాటలాడుటకు వారికి సెలవు లేదు. ఈలాగు ధర్మశాస్త్రము చెప్పుచున్నది. ఇంట తమ భర్తల నడుగవలెను; సంఘంలో స్త్రీ మాట్లాడుట అవమానం (వక్కాణింపు రచయితది. (I కొరింథీ 14 : 34, 35) ఇంతచెప్పినా పౌలు తృప్తిపడలేదు. "మరియు స్త్రీలును అణుకువయు స్వస్థబుద్ధియు గలవారై యుండి, తగుమాత్రపు వస్త్రములచేతనేగాని జడలతోనైనను, బంగారముతోనైనను, ముత్యములతోనైనను, మిగుల వెలగల వస్త్రములతోనైనను అలంకరించుకొనక, దైవభక్తిగలవారమని చెప్పుకొను స్త్రీలకు తగినట్టుగా సత్‌క్రియలచేత తమ్మును అలంకరించుకొనవలెను. స్త్రీలు మౌనముగా ఉండి సంపూర్ణ విధేయతతో నేర్చుకొనవలెను. స్త్రీ మౌనముగా ఉండవలసినదేగాని, ఉపదేశించుటకైనను పురుషునిమీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను. ఆదామును తరువాత హవ్వయును నిర్మింపబడిరి కారా? మరియు ఆదాము మోసపరచబడలేదు కాని స్త్రీ మోసపరచబడి అపరాధములో పడెను. అయినను వారు స్వస్థబుద్ధికలిగి విశ్వాసప్రేమ పరిశుద్ధతలయందు నిలుకడగా ఉండినయెడల శిశుప్రసూతి ద్వారా

ఆమె రక్షింపబడును." (1 తిమోతి 2 : 9 - 15) ఇంతగా చెప్పినా స్త్రీ అర్థం చేసుకోదేమోనని భయపడ్డాడేమో పౌలు ఇలా ఖండగా, మొద్దుగా చెప్పాడు :-

"స్త్రీలారా, ప్రభువునకువలె మీ సొంత పురుషులకు లోబడియుండుడి। । క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు। సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలు కూడ ప్రతివిషయములోను తమ పురుషులకు లోబడవలెను. । (ఎఫెసీయులకు 5 : 22-24 వక్కాణింపు రచయితది.)

మతగురువుల సూక్తులు :-

టెర్ట్యూలియన్ (కార్తేజిలోని మతశాస్త్రజ్ఞుడు 160 - 230) ఇలా అన్నాడు.

"ఓ మహిళా! నీవుమానవాళిని నాశనంచేశావు దానినిమరచిపోవాలంటే నీవు పశ్చాత్తాపం పొందాలి. అందుకు చిహ్నంగా అశ్రుధారలు కారుస్తూ విషాదం గుండెనిండా నింపుకొని చినిగిన దుస్తులతో నడయాడుము..... నీవు నరకద్వారానివి.[5] "

"ఓ నారీ! సైతాను పరాసతి ఎదుర్కొనలేని మనిషిని (ఆదామును) నీవు ప్రక్కదారి పట్టించావు. నీ తప్పిదాన్ని సరిదిద్దటానికే మనుష్య కుమారుడు చనిపోవలసి వచ్చింది. ప్రభువుయొక్క తీర్పు నీ లైంగిక జాతిమీద (స్త్రీలందరిమీద) ఈనాటికీ నిలిచియున్నది. న్యాయస్థానం ముందు నీవు అనివార్యంగా ముద్దాయిగా నిలుచొని యున్నావు." ఆర్య ఆమ్బ్రోజు వాక్యాలు ఇంకా స్పష్టంగా ఉన్నాయి :-

"పాపమునకు ఆదామును చేరువచేసింది హవ్వమాత్రమే. హవ్వము ఆదాము పాపము చేయుమనలేదు. అందుకే ఎవరిచేత స్త్రీ పాపము చేయించిందో అతనిని (పురుషుని) ఆమె ప్రభువుగా యజమానిగా స్వీకరించటం న్యాయమూ, యుక్తియుక్తమూ కూడాను."[6]

యోహాను క్రిసోస్టమ్ (కాన్‌స్టాంటినోపులు 347 - 407) వాక్యం మరీ ఘోరం.

"అన్ని క్రూరమృగాలలోను స్త్రీని మించిన ప్రమాదకారి మరి ఇక లేదు "[7]

ఆర్యక్రిసోస్టమ్ అభిప్రాయం ప్రకారం "స్త్రీ అవసరమైన దుష్టత్వం, వాంఛనీయమైన విషాదకారణం, ప్రాణాంతకమైన ఆకర్షణ, అలంకరింపబడిన దుర్మార్గ ప్రవృత్తి."[8]

ఆర్యగ్రెగరీ థౌమాటుర్‌గస్ దృష్టిలో "ఒక పవిత్రుడైన పురుషుడు దొరకవచ్చును కాని పవిత్రురాలైన స్త్రీ దొరకనే దొరకదు."[9]

ప్రప్రథమ క్రైస్తవ సన్యాసి ఆన్‌థొనీ ఇలా సెలవిచ్చాడు తోటి సన్యాసులకు, "స్త్రీని చూచినపుడు మానవిని చూస్తున్నట్లు గాక సైతానును చూస్తున్నట్లు భావించుడి. ఆమె పలుకు సర్పపు బుసలాంటిది."[10]

ఆర్యథామస్ ఆక్వినాస్ నాటికి కొంత ఔదార్యం చూపారు స్త్రీ యెడ. ఆమెను అపరిపూర్ణ వ్యక్తిగా, లోపాలున్న పురుషప్రతిరూపంగా చిత్రించారు. క్రీ.శ. 578 నాటికి దైవ నైవేద్యాన్ని ఆమె వట్టిచేతులతో స్వీకరించరాదని ఆమెపై ఆంక్షలు పెట్టారు. రక్తస్రావమువలన ఆమె బహిష్టు సమయంలో ఉన్నపుడు ఆమె దైవప్రసాదానికి నోచుకోదట. ఆమెయొక్క సహజమైన క్రూరత్వాన్ని పారద్రోలటానికి ఆమెను చర్చిలో కీర్తనలను పాడనీయలేదు. కీచుగొంతుతో పాడటానికి పురుషనపుంసకులను తయారు చేసారు. స్త్రీలను యాజకత్వంలోనికి రానీయలేదు. 10 వ శతాబ్దం వరకు స్త్రీలు పురుషులతోపాటు కలసి, ఇంగ్లండులో, భోజనం చేయ వీలు పడలేదు. ఎనిమిదవ హేన్రీ శాసనం ప్రకారం వారు తక్కువస్థాయి జీవులు కనుక బైబిలును చదవరాదట.[11] ప్రొటెస్టెంటులు సనాతన శాఖవారికి తీసిపోలేదు. ప్రొటెస్టెంటు మతాన్ని స్థాపించిన మార్టిన్ లూథర్ పోప్‌కు ఎదురు తిరిగ దేగాని బైబిలును కాదనలేదు. బైబిలులోని ప్రతి అక్షరాన్ని

విలువగా భావించాడు. అందువలన స్త్రీలకు బాధలు ఎక్కువయినాయి. ప్రొటెస్టెంటు శాఖలోని తీవ్రవాదులయిన పవిత్ర జీవులశాఖ (Puritans) మరీ విడ్డూరంగా ప్రవర్తించింది. లూథర్ సహచరుడైన ఫిలిప్ మెలన్‌క్తాన్ ఎంత ఉదారంగా సెలవిచ్చాడో గమనించండి : "స్త్రీ పిల్లలను కంటూ బలహీన పడినా పరవాలేదు. పిల్లలను కంటూ (ఆమెను) చనిపోనివ్వండి."[12] స్త్రీలు పిల్లలను కనటానికే ఉన్నారని జాన్ కాల్విన్ అంటాడు. స్త్రీలకు రాజకీయ సమానత్వం అక్కరలేదన్నాడు. స్త్రీలకు వ్యతిరేకంగా జాన్ నాక్స్ పుస్తకం రాశాడు. ఇంగ్లండులో 1661 లో చర్చికి వచ్చే ప్రతి స్త్రీ తలపై ముసుగు వేసుకొని రావాలని శాసనం వచ్చింది. అది ఆనాటికి ప్రొటెస్టెంటు దేశమని మరిచిపోరాదు. 1867 లో న్యూయార్కులో ఆరోగ్యకేంద్రంలో తలలపై ముసుగులు లేవనే నెపంతో వైద్యాన్ని స్త్రీలకు అందివ్వ నిరాకరించారు.[13]

ఇక సారస్వతాన్ని పరిశీలిద్దాం.

భర్త అవమానాలను అన్యాయాలను స్త్రీ మౌనంగా సహించాలని రూసో హెచ్చరించాడు. స్త్రీ పురుషుని ప్రతిరూపమని భావ ప్రకటన చేశాడు జాన్‌వెబ్‌స్టరు. స్త్రీ జంతువని, అందులోనూ ఉన్నతశ్రేణి జంతువు కాదని బర్క్ 'అమూల్య' అభిప్రాయాన్ని వెలువరించాడు. స్త్రీ పురుషునికి లొంగి ఉండుట దైవశాసనమన్నాడు మిల్టన్ కవి. లార్డ్‌టెన్నిసన్ కవి వరేణ్యుని దృష్టిలో స్త్రీ పురుషునికొరకు సృజింపబడినదట. ఒక జర్మను సామెత ఇలాంటి భావాలను కుదించి చెప్పింది. "స్త్రీ రూపం దేవదూతది; హృదయం సర్పానిది; మనస్సు గార్దభానిది"[14] ఇలా రాసుకుంటే పోతే దస్తాలు దస్తాల కాగితాలు చాలవు. మచ్చుకివి చాలును. క్రైస్తవ మతగురువుల, మతాచార్యుల, ప్రచారకుల, కవి పుంగవుల భావాలు తెలుసుకోవటానికి.

స్త్రీలు దుర్మార్గులు; పాపాన్ని ప్రోత్సహించువారు

ఇతర దేవతలను పూజించువారిని వ్యభిచారం చేయు స్త్రీలతో పోల్చారు :-

"వేరొక దేవునికి నమస్కారం చేయవద్దు....ఆ దేశపు నివాసులతో నిబంధన చేసుకొనకుండ జాగ్రత్త పడుము. వారు ఇతరుల దేవతలతో వ్యభిచరించి...." (నిర్గమ 34 : 14 - 16)

యెరూషలేము నగరవాసులు ఇతర దేవతలను కొలిచినారట. ఆ నగరాన్ని వ్యభిచరించే స్త్రీతో పోల్చి, వర్ణించి దేవుడైన యెహోవా ఆ నగర వాసులను తిట్టెను (యెహెజ్కేలు 16 : 3; 16 : 7 - 43).

దావీదు కీర్తనలో ఇలా ఉంది :-

"నేను పాపములో పుట్టినవాడను పాపములోనే నా తల్లి నన్ను గర్భము ధరించెను." (కీర్తన 51:5 వక్కాణింపు రచయితది) తనుపాపియైనచో తల్లిని నిందించుట ఏమి ధర్మం? అంటే ఎలాగో అలాగు స్త్రీని నిందించటమే వారి కర్తవ్యం.

బానిసత్వం

స్త్రీలకు వ్యక్తిత్వం లేదు. వారి ఇష్టాఇష్టాలతో పనిలేదు. స్త్రీలు నాలుగు విధాలుగా బానిసలగుదురు. యుద్ధములో శత్రుపురుషులకు దొరికినవారు. "పురుష సంయోగం ఎరుగని ప్రతి ఆడపిల్లను మీ నిమిత్తము బ్రతుకనీయుడి. (సంఖ్యాకాండము 31 : 18) యుద్ధములో దొరికిన "స్త్రీలను, చిన్నవారిని, పశువులను, ఆ పురములో నున్నది యావత్తును, దానికొల్ల సొమ్మంతటిని నీవు తీసికొనవచ్చును." (ద్వితీయోపదేశకాండము 20:13-17) "నీవు నీ శత్రువులతో యుద్ధము చేయబోవునప్పుడు నీ దేవుడైన యెహోవా నీ చేతికి వారిని అప్పగించిన తరువాత వారిని చెరపట్టి ఆ చెరపట్టబడిన వారిలో రూపవతియైన దానిని చూచి ఆమెను మోహించి ఆమెను పెండ్లి చేసుకొన మనస్సయి నీ యింట ఆమెను చేర్చుకొనిన తరువాత.... తరువాత నీవు ఆమెయొద్దకు పోయి ఆమెను పెండ్లి చేసికొనవచ్చును. ఆమె నీకు భార్యయగును। నీవు ఆమెవలన సంతుష్టి నొందనియెడల

ఆమె మనస్సు వచ్చినచోటికి ఆమెను సాగనంపవలెను....." (ద్వితీయో 21 : 10 - 14) ఎంది అయిన ఆమెకు ఇష్టమో అయిష్టమో కమగొవ వలసిన పనిలేదు. ఆమెఅతనిని మోహించనవసరంలేదు. ఆమె సంతుష్టి పరిసక్తిలేదు. అంతా ఏకపక్షంగా పురుషవరంగానే నడుస్తుంది కథ.

తండ్రి తన కుమార్తెను దాసిగా అమ్మవచ్చును. "ఒకడు తన కుమార్తెను దాసిగా అమ్మినయెడల దాసులైన పురుషులు వెళ్ళిపోవునట్లు అది వెళ్ళిపోగూడదు." (నిర్గమ 21 : 7)

ఆమెభర్త ఆమెను దాసిగా తన రుణదాతలకు అమ్మవచ్చును." నా అప్పుల వారిలో ఎవరికి మిమ్ములను అమ్మివేసితిని?" (యెషయా 50:1)

దానిని ప్రధానము చేసికొనిన దృష్టికి అది యిష్టురాలు కానియెడల అది విడిపింప బడునట్లు అవకాశము నియ్యవలెను; దానిని వంచించినందున అన్యజనులకు దానిని అమ్ముటకు వానికి అధికారము లేదు." (నిర్గమ 21:8)

బానిసత్వమును గురించిన న్యాయవిధులు ఇలా ఉన్నాయి.

"నీవు హెబ్రీయుడైన దాసుని కొనిన యెడల వాడు ఆరుసంవత్స రములు దాసుడై యుండి యేడవ సంవత్సరమున ఏమియు ఇయ్యకయే నిన్ను విడిచి స్వతంత్రుడగును." (నిర్గమ 21 : 2)

"వాని యజమానుడు వానికి భార్యనిచ్చిన తరువాత ఆమె వాని వలన కుమారులనైనను కుమార్తెలనైనను కనినయెడల ఆ భార్యయు ఆమె పిల్లలును ఆమె యజమానుని సొత్తగుదురు కాని వాడు ఒంటిగానే పోవలెను." (నిర్గమ 21 : 4)

పురుషునికి ఆరుసంవత్సరములకు విముక్తి. స్త్రీకి దాస్యంనుండి విముక్తి లేనేలేదు. ఇది క్రైస్తవం స్త్రీకి (తొలినాటి క్రైస్తవం) ప్రసాదించిన వరం!

స్త్రీయొక్క ప్రతిపత్తి

ఒక స్త్రీ బాల్యమున తనతండ్రి ఇంటనుండి ఒట్టువేసికొనినను లేక మ్రొక్కుబడి చేసినను ఆమెతండ్రి ఆక్షేపించినచో ఆ ఒట్టు చెల్లనక్కర లేదు. మ్రొక్కుబడి చెల్లింపనవసరంలేదు. (సంఖ్యా కాండము 30:3-4) అంటే దేవునికి మ్రొక్కుబడి చెల్లించుటకు కూడ ఆమెకు హక్కులేదు. అట్లే వివాహమైన తదుపరి తండ్రి స్థానంలో భర్త నిలుచును. భర్త ఆక్షేపించిన మ్రొక్కుబడి చెల్లదు. అతడు తెలిసికొని అతడు ఊరకుండిన పక్షములో మాత్రమే చెల్లుబాటగును. (సంఖ్యా 30 : 7 - 16)

కుమార్తెను బలియిమ్చుటకు తండ్రికి హక్కుకలదు. దేవుడైన యెహోవాకు తను ఇచ్చిన వాగ్దానమును నెరవేర్చుకొనుటకై యెఫ్తా తన కుమార్తెను దహనబలి ఇచ్చెను. (న్యాయాధిపతులు 11 : 30 - 32, 11 : 34 - 39)

ఒకడు తన ఉపపత్నితో వచ్చి గిబియా అను ప్రదేశములో ఒకని యింట బసచేసెను అంత ఆ పట్టణవాసులు ఆ ఆగంతకునితో కాముక క్రీడ జరపదలచి ఆ గృహస్థు ఇంటికి రాగా అతడు అలాంటి పనిచేయు వద్దని బ్రతిమాలి అతిధి ఉపపత్నిని, తన కుమార్తెను నీచపర్చుకోమని అభ్యర్థించెను. (న్యాయాధిపతులు 19 : 1 - 24) తండ్రికి ఎంత హక్కున్నదో గమనించుడు. తన కుమార్తెను చెరచుటకు ఇతరులకు ఆమెను ఇచ్చుటకు హక్కుకలదు.

ఈ కథలోని అతిధి తన ఉపపత్నిని ఇంటిమీదకు వచ్చిన జనం యొక్క కామానికి ఆమెను బలిచేసెను. "వారు ఆమెను కూడి ఉదయం వరకు ఆ రాత్రి అంతయు ఆమెను చెరపుచుండిరి." (న్యాయాధిపతులు 19 : 25) తరువాత అతడు తన ఉపపత్నిని కత్తితో నరికెను. (న్యాయాధిపతులు 19 : 26 - 30)

ఉపపత్నులపై పురుషునికి కల అధికారం ఈ గాథవలన తెలియు చున్నది. బోయజురూత్‌ను కొనుగోలు చేసెను. (రూతు 4 : 10) తండ్రి తన కుమార్తెను తన దాసునకు ఇవ్వవచ్చెను. "అట్లు షేషాను తన కుమార్తెను దాసుడైన యర్హాకు ఇచ్చెను. అది అతనికి అత్తయిని కనెను." (1 దినవృత్తాంతములు 2 : 34, 35) చూడండి తండ్రికి తన కుమార్తెపై ఎంతటి సర్వం సహాధికారములున్నవో!

ఇదంతా చదివితే ఏమితోస్తుంది. స్త్రీని ప్రాణముకల వస్తువుగా చూస్తున్నారని తేలుతుంది. పాత క్రొత్త నిబంధనలను పలువదిమంది క్రీ. పూ 1500 సం॥ నుండి క్రీ. శ 96 వరకు సుమారు పదునారువందల సంవత్సరాలు రాసిరి. రచయితలు వివిధ ఉద్యోగులు. వీరిలో కొందరు రాజులు, యాజకులు, న్యాయాధిపతులు, గొఱ్ఱెల కాపరులు, జాలరులు, గాయకులు, ప్రవక్తలు, బోధకులు, వైద్యులు, ధనవంతులు, బీదలు, దేశాలు కట్టువారునై యుండిరి.[15] ఆచారములు మారి యుంటవి. కాని ఒక ఆచారము మారలేను. అది స్త్రీల అణచివేత. స్త్రీలను చిన్నచూపు చూడటం. స్త్రీలను నరకద్వారాలుగా వర్ణించి భయపడటం. ఈ వాటికి వారిని అవమానించటం.

భారత రాజ్యాంగం 1950 లో అమలులోకి వచ్చింది. స్త్రీ పురుషవివక్ష నిషేధింపబడినది. కాని స్త్రీలను అన్యాయంచేసే, వివక్షగా చూసేశాసనాలు ఇంకా అమలులో ఉన్నాయి. క్రైస్తవస్త్రీలు ఎందరో విద్యావంతులయినారు. పెద్ద పెద్దచదువులు చదివారు, ఉన్నతోన్నత ఉద్యోగాలను చేస్తున్నారనేవిషయం గమనార్హం. అధిక వేతనాలను సంపాదించుకొంటున్నారు. కాని పురుషుని పెత్తనాన్ని అధికారాన్ని కాదనటంలేదు. దేశంలోని తదితర వాతావరణమూ అలాగే వుంది. హిందూమత, మహమ్మదీయమత ధర్మశాస్త్రాలూ, వాటి ప్రాతిపదికపై ఏర్పడిన శాసనాలు క్రైస్తవ బోధనలకు ఆచారాలకు భిన్నంగా లేవు. ప్రతి మతమూ స్త్రీని అణచివేసింది. ఆమె హక్కులను

కాలిరాచింది. కనుక భారతదేశ వాతావరణం క్రైస్తవ స్త్రీలకు చేయూతను ఇవ్వలేదు. 'ఎప్పటికయినా మంచి మార్పు రాకపోతుందా' అని ఆశించటం పొరపాటు కాదు; ఆశ్చర్యం అంతకన్నా కాదు.

2 వ అధ్యాయం : రిఫరెన్సులు

1. అవతారమూర్తి : బిషప్ పుష్పనాథం పుట : 3 ఇండియన్ క్రిస్టియన్ క్రుసేడ్ ఇండియా (విజయవాడ)
2. 'ఉమెన్ అండ్ ఏథియిజం' : మాడలిన్ ముర్రే ఓహెయిరీ (పుట 4) (ఇంగ్లంలో) అమెరికన్ ఎథియిస్టుప్రెస్ పోస్టు బాక్స్ 2117 ఆస్టిన్ టి. ఎక్స్ 78768 (యు. ఎస్. ఎ)
3. ,, పుటలు 4, 5
4. 'ఉమెన్ ఇన్ పాస్ట్, ప్రెజంట్ అండ్ ఫ్యూచర్' : ఆగస్ట్ బెబెల్
5. ,,
6 'ఉమెన్ అండ్ ఎథియిజం'
7. ,,
8. 'ఉమెన్ అండ్ క్రిస్టియానిటీ' : ఛాప్‌మన్ కోహెన్.
9. ,,
10. 'ఉమెన్ అండ్ ఎథియిజం'
11. ,,
12. ,, పుట 16
13. ,, పుట 16
14 ,, పుట 17
15. 'అవతారమూర్తి' పుట 352

3 సెక్స్

మానవ జీవితంలో సెక్స్ ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తున్నది. మానవునికి జంతువారసత్వం ఉంది. కాగా అతడు బుద్ధిజీవి. కనుక జంతు వారసత్వంగా వచ్చిన సహజాతాలు, వాసనలూ అతనికి ఉంటాయి. తన ప్రత్యేకతయైన మేధోసంబంధమైన ఆనందంకోసం అన్వేషణా ఉంటుంది. అయితే శరీర ధర్మమైన సెక్స్‌ను నిరాదరించ వీలులేదు. ఆకలి, నిద్ర, సెక్స్‌పరమైన సంభోగం మానవజీవికి శరీర ధర్మాలు. వాటిని తోసిరాజని మానవజీవి సుసంపన్నమైన జీవితాన్ని గడపలేడు. ఈ పచ్చి నిజాన్ని అంగీకరించని వారు తమ జీవితాలను దుఃఖ భూయిష్ఠం చేసుకుంటారు.

స్త్రీ పురుషులు కలిసి మానవజాతిగా పరిగణింపబడుతున్నారు. స్త్రీ, పురుషుడు ఇద్దరు కలసి ఒక జంట అవుతారు. ఆ జంట జీవితంలోనే సుఖమూ, సంతోషమూ ఇమిడి ఉన్నాయి. అయితే కలసి జీవించటంలో ఇష్టాయిష్టాలు చోటుచేసుకుంటాయి. ఇద్దరికీ ఇష్టమైతేనే ఆ జంట జీవితం సుఖప్రదం అవుతుంది. వారి దాంపత్య జీవితం ఇరువురి సమ్మతిపైన ఆధారపడి ఇరువురికీ సంతుష్టిని ఇవ్వాలి. అలాకాక అది ఏకపక్షమయి బలవంతంపైన, హింసాదౌర్జన్యాలపైన నిర్మించబడితే అది వారిరువురిలో ఏ ఒకరికో మాత్రం సంతృప్తిని ఇవ్వగలుగుతుంది. ఆమాటకువస్తే

ఆ ఒక్కరి తృప్తి కూడా దోషభూయిష్టమూ, అసంపూర్ణమూ అవుతుంది. క్రైస్తవమత ఆవిర్భావానికి ముందున్న సమాజాలను పరికిస్తే ఆనాడు స్త్రీలను సెక్సును గురించి - ఏవో కొన్ని పొరపాట్లు తప్ప - దురభిప్రాయం లేనట్లు తెలుస్తుంది.

భారతదేశంలో ఋగ్వేదకాలపు ఋషులు సెక్సును పరిహసించలేదు; పరిహరించలేదు. ఆనందముగా జీవితం గడిపారు ఆనాటి స్త్రీలు ఉన్న అవకాశాలతో. అలాగే గ్రీకు, రోమను నాగరికతలలో సెక్సుపై ఏహ్యభావం లేదు. చివరకు యూదా మతంలో కూడా సెక్సును ఎబ్బెట్టుగా చూడలేదు.

లైంగిక సాన్నిహిత్యం కోసం, లైంగిక తృప్తి కోసం ఆరాటపడటం స్త్రీ పురుషులిద్దరికీ సామాన్యంగా ఉండే లక్షణం. స్త్రీకిమాత్రమే కామతృష్ణ ఉంటుందనుకోవటం పొరపాటు. అలాగే పురుషునికి ఒక్కనికే కామసంకల్పం ఉంటుందనుకోవటం భ్రమ. ఇద్దరూ మానవజాతికి చెందినవారే. ఇరువురికీ కామభావనలు ఉంటాయి. కనుక సెక్సు అనుభవాన్ని ఇద్దరూ ఆశిస్తారు. ఈ అంశాలను విస్మరిస్తే మానవ స్వభావాన్ని అందులో ముఖ్యంగా స్త్రీ స్వభావాన్ని ఆకళింపు చేసుకోలేదన్న మాట. ఇదంతా ఆధునిక విజ్ఞానం మనకు అందించిన సమాచార ఫలితమైన జ్ఞానం.

నాగరికత పెరిగినకొలదీ సెక్సు అనుభవాన్ని పొందే రీతులపై కొంత అదుపు ఏర్పడింది. స్వైరవిహారం మానవులకు తృప్తిని ఇవ్వదనే అంశాన్ని గ్రహించటం జరిగింది. నియమాలూ, నిబంధనలూ సమాజంలో ఏర్పడ్డాయి. శాశ్వత బంధము కొరకు తాపత్రయం హెచ్చింది. శాశ్వతమంటే తాత్కాలికం కానిది అని అర్థం చెప్పుకోవాలి.

బంధంలో ఉన్న స్త్రీ పురుషుల స్వేచ్ఛపై అదుపు, నియంత్రణ, పరిమితులుంటాయని గ్రహించటం కష్టంకాదు. మరింత సుఖంకోసం ఇతోధికమైన ఆనందాన్ని ఆశించి కొద్దిపాటి స్థాయిలో స్వేచ్ఛను కోల్పోవ

టానికి మానవవ్యక్తులు ఉద్యుక్తులవుతారు. అలాంటి పరిస్థితిలో వివాహ వ్యవస్థ ఉద్భవించింది. దాంపత్య సంబంధంలో ఎవరిది పై చేయి అయితే వారు తమకు అనుకూలంగా నియమాలను ఏర్పరుస్తారు. విధినిషేధాలను నెలకొల్పుతారు. వివాహ వ్యవస్థ రూపొందేనాటికి పురుషుడు పెత్తందారీ తనాన్ని స్వీకరించాడు. స్త్రీకి ఎలాంటి సెక్సు జీవితం అవసరమో, ఎలాంటి సెక్సు అనుభవాన్ని ఆమె కోరవచ్చునో, ఎవరితో ఆమె సెక్సు పరంగా సంభోగం చేయవచ్చునో, ఈ సందర్భంగా ఆమె ఎవరి అదుపాజ్ఞలలో ఉండాలో వీటినన్నింటినీ పురుషుడు నిర్ణయించాడు. ఆమెను సంప్రదించ లేదు. ఆమె ఇష్టాయిష్టాల ప్రసక్తి అతనికి అనవసరం. అతడు పెత్తందారు. అతని మాటకు తిరుగులేదు. శాసించదలచాడు; శాసించాడు విధేయురాలుగా అణగి మణగి ఉండి స్త్రీ అతని ఆజ్ఞలను శిరసావహించవలసినదే. అలా అతని ఆధిపత్యాన్ని అంగీకరించి దాసోహమన్న స్త్రీని పొగిడాడు. 'పతివ్రత' అనే బిరుదు ఇచ్చాడు. 'గుణవంతురాలు' అని నామకరణం చేశాడు. ఈ భావాలను ఆమె తన పరంపరాన కీర్తింపచేసుకునేటట్లు ఆమెకు బోధచేశాడు. అందుకై ధర్మశాస్త్రాలను రూపొందించాడు. వాటిని ఆమె తలపై రుద్దాడు. అవి ఉత్కృష్టమయినవని ఆమెచేత నమ్మించాడు. ఆమె మెదడులో తనకు అనుకూలమైన 'ధర్మబద్ధమైన' భావాలను ప్రవేశపెట్టాడు. దాంతో అతనికంటె ఎక్కువగా ఆమె వాటిని అంటిపెట్టుకొని ఉండటం సంభవించింది. ఆమె పూర్వాచార పరాయణురాలయింది. ఆమె వలననే 'ధర్మం' రక్షింప బడుతుందని పురుషుడు మరల పొగిడాడు. నిజమేనని నమ్మిన స్త్రీ మరింత కట్టుదిట్టంగా తనచుట్టూ బంధాలను బిగించుకుంది. ఈ స్థితిని చూచి ఎంతో సంతోషించాడు పురుషుడు. తను మాత్రం విశృంఖల ప్రవర్తన సాగిస్తున్నాడు. ఇదే 'పతివ్రతా ధర్మం' అనుకొన్న స్త్రీ సహించి ఊరుకున్నది; ఇష్టపూర్వకంగా బలపరుస్తోంది కూడా. అంతటితో ఆగితే గొప్పేమిటి? తనే పురుషుని తృప్తికోసం స్త్రీలను సమకూర్చింది. వ్యభిచారిణుల ఇండ్లకు అతనిని సగౌరవంగా తీసుకొనివెళ్ళింది. బహు భార్యాత్వాన్ని ఆమోదించింది. సవతులను సహించింది. భర్త ఉప

పత్నులను ఉంచుకుంటే ఉపేక్షించింది. ఈనాడు స్త్రీ తన వ్యక్తిత్వాన్ని స్థిరపరచుకోదలిస్తే, తన కోరికలను వెల్లడిస్తే, తన ఆసక్తులను బహిర్గతం చేస్తే ముక్కుమీద వేలేసుకుంటున్నారు మతస్తులు. 'ధర్మ' క్షయం అవుతున్నదని గగ్గోలు పెడ్తున్నారు. అసలు విషయం తమ ఆధిపత్య భవనపు గోడలు కూలిపోతున్నాయనే బాధ మాత్రమే.

ఇదే విషయాన్ని మరో దృక్కోణం నుండి గమనించవచ్చు. ప్రాచీన కాలంలో యంత్రాలు పెద్దగా లేవు. ఉన్న కొద్ది సంఖ్య కలవీ బండగా మొద్దుగా ఉండేవి. ఎక్కువగా మానవశ్రమ వినియోగాన్ని కోరేవి. అలాంటి పరిస్థితిలో కండబలానికి విలువరావటం సహజం. నాగలితో వ్యవసాయం ప్రారంభించినపుడు ఈ స్థితి సంభవించింది. వేటాడి మృగాలను చంపుకొని మాంసభోజనం చేసే రోజుల్లో, పశుపాలన చేసే దశలో, చెట్లకు కాచే ఫలాలను కోసుకొని ఆరగించే కాలంలో, కంద మూలాదుల భక్షణవల్ల శరీరాలను పోషించుకునే నాడు, భూమిపై విత్తనాలను వెదజల్లి పంటవస్తే దానిని కోసుకొని బ్రతికిన నాడు స్త్రీ యొక్క హోదా పురుషుని హోదాకు తీసిపోలేదు. కాయకూరలను ధాన్యాలను సంపాదించినవాడు, విత్తనాల ఎదవేతద్వారా పంటలు పండించిన కాలంలో నిజానికి ఆమే పురుషుడికి కూడా అన్న ప్రదానం చేసింది. జన్మ నిగ్రహ సాధనాలు అంతగా తెలియని, అందుబాటులోలేని పరిస్థితిలో ఆమెకు సంతాన సంఖ్యపై అదుపు పెట్టుకోవడం సాధ్యపడలేదు. తరుచుగా సంతానం కల్గటం వల్ల, ప్రసవకాలంలో బండపనులు చేయలేక పోవటంవల్ల, పసి పిల్లలకు పాలివ్వవలసి రావడంవల్ల ఆమె ఎక్కువకాలం గుహలోనో ఇంటి వద్దనో గడపవలసి వచ్చింది. దాంతో పురుషుడికి అవకాశం వచ్చింది. ఆమెను ఇంట్లో ఉండమనీ, ఇంటిపనులు చేయమని శాసించాడు. బయట పనులలో తనకు సాయం చెయ్యమనికూడా ఆజ్ఞాపించాడు. దాంతో శ్రామిక స్త్రీకి రెండు పనులు నెత్తిన పడ్డాయి. ఇంటిపని, ఇంటి బయటపని రెండూ ఆమె చేసి తీరాలి. కాగా ఇంటిపని మాత్రము ఆవిడే చేయాలట. ఆమె అందుకే పుట్టిందని ఆమెను నమ్మించాడు. తద్వారా ఆమె మాత్రమే

చేసే ఇంటిపనికి విలువలేకుండా చేశాడు. ఆమెను తనపై ఆధారపడి బ్రతికే జీవిగా మార్చాడు.

ఈ పరిణామంలో యూదాజాతి వారు ఎలాంటి పాత్ర నిర్వహించారు? తరువాత క్రైస్తవం ఎలాంటి దృక్పథాన్ని ప్రదర్శించింది? ఇవి ప్రస్తుత విచారణీయాంశాలు యూదాజాతి దృక్పథంలో సెక్సు అపరిశుద్ధం కాదు. వారు పెండ్లిని కించపరచలేదు. బ్రహ్మచారులైన పూజారులు లేరు. కొంతమేరకు కుటుంబ జీవితంలో భద్రత, ఆప్యాయత ఉండేవి. తరువాత వచ్చిన క్రైస్తవంతో మొదటి మూటిని వ్యతిరేకించటం జరిగింది. పెండ్లిని నిరసించింది క్రైస్తవం. సెక్సును అపరిశుద్ధం చేసింది. బ్రహ్మచారులను పూజారులను చేసింది. కన్యకు ఏసు పుట్టాడనే కథలేదు. తరువాత ఏసును దేవుని కుమారుని చేయదలచి ఆ కథ సృష్టించారు.

ప్రాచీన సమాజాలలో స్త్రీ ఋతుస్రావం అంటే అపవిత్రమనే భావన ఉండేది. అందువల్లనే ఋతుస్రావపు రోజుల్లో ఆమెను కడగా ఉంచేవారు. ఇప్పటికీ ఈ ఆచారం హిందూ సమాజంలో ప్రబలంగా ఉన్నదనే విషయం విస్మరించరాదు. ఆమెను పూజా కార్యక్రమాలలో పాల్గొననిచ్చే వారుకాదు. ఆమెను తాకటం తప్పు అనే భావన చోటుచేసుకుంది. ఇవన్నీ కూడా ఆచారాలుగా ఉన్నట్లు పాతనిబంధనలో ఆధారాలున్నాయి. ఋతుస్రావం జరిగేటప్పుడు ఆమె కడగా ఉండాలి.[2] స్రావము కలిగిన పురుషుడుఅపవిత్రుడు.[3] వీర్యస్ఖలనము అపవిత్రము. "ఒకనికివీర్యస్ఖలన మైనయెడల వాడు సర్వాంగ స్నానము చేసికొని సాయంకాలము వరకు అపవిత్రుడై యుండును."[4] కడగా నున్న స్త్రీతో సంభోగించరాదు. "అపవిత్రత వలన స్త్రీ కడగా ఉండునప్పుడు ఆమె మానాచ్ఛాదనమును తీయుటకు ఆమెను సమీపింపకూడదు."[5] (లేవీయకాండము 18 : 19)

"కడగా నున్న స్త్రీతో శయనించి ఆమె మానాచ్ఛాదనమును తీసిన వాడు ఆమె రక్తధారాచ్ఛాదనమును తీసెను; ఆమె తనరక్తధారాచ్ఛాదనమును తీసివేసెను; వారి ప్రజలలో నుండి వారిద్దరిని కొట్టివేయవలెను."[6] (లేవీ 20 : 18)

స్త్రీ ప్రసవిస్తే ఆమె అపవిత్రురాలు. ఆ సందర్భంగా ఆమెపై అనేక కట్టుబాట్లు విధించారు.[7] స్త్రీ యొక్క బహిష్టును గురించిన భావాలను ఆధునిక వైద్యశాస్త్రం సమర్థించటంలేదు. ఆధునిక భావాలు కల క్రైస్తవులు కూడా వాటిని బలపరచరు. కాని ఈ పురాతన మూఢ అభిప్రాయాలు చోటుచేసుకున్న గ్రంథాన్ని పరిశుద్ధ గ్రంథమని గౌరవించటం ఇంకా మానలేదు. ఇది స్వవచన వ్యాఘాతము.

సెక్స్ అనుభవాన్ని గురించి మరోమాట. పురుషునివలె స్త్రీ సెక్స్ పరంగా అనుభవించరాదు. "స్త్రీ శయనమువలె పురుషశయనము కూడదు."[8] (లేవీ 18 : 22) దీనికి రెండురకాలుగా అర్థము చెప్పవచ్చును. స్త్రీ పురుషాయితం చేయరాదని ఒకటి. పురుషుడు పైకొని స్త్రీ క్రిందనుండి చేసుకునే సంభోగ బంధాన్ని 'మిషనరీ పొజిషన్' అని పిలవడం కద్దు. ఆఫ్రికాఖండానికి వెళ్ళిన వివాహిత మిషనరీలు ఆ బంధాన్ని మాత్రమే వాడటం వల్ల ఆఫ్రికా ఖండవాసులు దానికి ఆ పేరు పెట్టారు. కనుక సనాతన క్రైస్తవ ఆచారము ఈ భాష్యాన్ని సమర్థిస్తున్నది. అలాకాక పురుషుడు మరియొక పురుషునితో రమించరాదనేది రెండవ అర్థం. ఈ రెంటిని హేయంగా చిత్రించింది పాత నిబంధన. మొదటి అర్థంలో తీసుకుంటే సెక్స్ అనుభవంలో ఆనందం పొందే అవకాశాన్ని స్త్రీ పురుషులకు కరువుచేసి పురుషాధిక్యతను నిలబెట్టున్నది పాత నిబంధన అని తెలుతుంది.

పురుషుని వలన కాక స్త్రీ పరిశుద్ధాత్మవలన కూడా గర్భవతికా వచ్చును అని ఆనాటి నమ్మకం. అలా కాకపోతే ఏసును దేవుని కుమారుని చేయదలచి క్రి. శ 70 లో వ్రాసిన వాక్యాలను ప్రజలు నమ్మియుండేవారు కాదు. "ఏసుక్రీస్తు జనన విధమెట్లనగా, ఆయన తల్లియైన మరియ యోసేపునకు ప్రధానము చేయబడిన తరువాత వారేకము కాక మునుపు ఆమె పరిశుద్ధాత్మవలన గర్భవతిగా ఉండెను"[9] (మత్తయి 1 : 18) ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మవలన కలిగినది.[10] (మత్తయి 1:20)

అంతకు క్రీతమే ప్రవక్త చెప్పినాడట "ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును. ఆయనకు ఇమ్మానుయేలని పేరు పెట్టుదురు." "ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకు తోడని అర్థము" (మత్తయి 1 : 22, 23)[11]

దేవదూత గబ్రియేలు మరియ వద్దకు దేవునిచేత పంపబడెనట. అతడు ఆమెతో ఇలా చెప్పెనట. "నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అని పేరు పెట్టుదువు...." ఆమె ఇలా అన్నదట: "నేను పురుషుని ఎరుగని దానినే; ఇది ఎలాగు జరుగును." దానికి దూత సమాధానము చెప్పెను "సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును."[12] (లూకా 1 : 26 - 35) గొడ్రాలిగా ఎంచబడిన జెకర్యా భార్య ఎలీసబెతువకు దేవదూత దయవలన కుమారుడు కలిగెను.[13] (లూకా 1 : 7, 13) పురుషుని ఇంద్రియము స్త్రీ శోణితముల వలన మాత్రమే శిశువు ఏర్పడునని ఆధునిక శాస్త్రజ్ఞానము మనకు తెలుపుచున్నది. కాని ఆనాడు అట్లుకాక సెక్సును గురించిన అపోహలు చాల వ్యాప్తిలో ఉన్నాయి పరిశుద్ధాత్మలు, దేవదూతలు సంతానాన్ని అనుగ్రహించేవారని నమ్మేవారు. ఈనాడు కూడా అలాంటి నమ్మకకు ఆదరణ కలగటం శోచనీయం.

గర్భవతియైన స్త్రీకి శుద్ధిస్నానము (Baptism) చేయించవచ్చునా అనే అనుమానము అగస్టీన్‌కు వచ్చి పోప్ గ్రెగరీకి ఉత్తరము వ్రాయుగా ఆయన క్రీశ 597 లో 'చేయవచ్చు' అని సమాధానము రాశాడు.[14]

ఆర్యజెరోము రజస్వల అయిన స్త్రీలను స్నానం చెయ్యవద్దన్నాడు. ఎందుకంటే "వారు నగ్నంగా తమను జూచి సిగ్గుపడాలి"[15]

ఈ అధ్యాయం ముగించేముందు ఒక విషయాన్ని స్పష్టం చేయాలి. జ్ఞానఫలాన్ని తినమని ఆదామును ప్రోత్సహించిన హవ్వ 'దుష్టురాలు' జ్ఞానఫలం తినడంవల్ల వారికి వివేకము ఉదయించింది. తద్వారా తాము దిగంబరులుగా ఉన్నామని గ్రహించారు సిగ్గుపడ్డారు తర్వాత ఏక

శరీరులయ్యారు. ఒకరిని గురించిన జ్ఞానం మరొకరికి కలిగింది. ఆదాము హవ్వను కూడెను. ఆమె గర్భవతి అయ్యెను. ఈ కథ ఆదికాండములో చెప్పబడినది కదా! స్త్రీని దేవుడు శపించుట ఎందుకు? వివేకం తెచ్చుకున్నందుకా? లేక సెక్స్ పరిజ్ఞానం కలిగించుకున్నందుకా? మరి హవ్వను సృష్టించింది ఆదాముకు తోడుగా ఉండుటకే కదా! ఈ కథలో అంతర్గర్భితంగా ఉన్న అంశమేమంటే శరీర వాంఛ మంచిది కాదని. "ఆయన స్త్రీతో నీ ప్రయాసమును నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను; వేదనతో పిల్లలను కందువు; నీ భర్త యెడల నీకు వాంఛ కలుగును; అతడు నిన్ను ఏలునని చెప్పెను."[16]

(వక్కాణింపు రచయితది. ఆదికాండము 3 : 16)

ఇదంతా దేవుడు హవ్వకు ఇచ్చిన శాపములో భాగం. మున్ముందు దేవుడు సర్పమును శపించెను. తరువాత హవ్వ వంతు వచ్చినది. చివరకు ఆదాముకు శాపం పెట్టెను. అంటే స్త్రీకి పురుష సాంగత్యంపై వాంఛ చెడ్డదని భావమేకదా! ఇది సెక్స్ పరంగా ప్రకటింపబడి అమలులోకి వచ్చిన దురభిప్రాయం. ఇలాంటిఅభిప్రాయం పురుషాధిక్యతకు దారితీసింది. లేక అంతకు క్రితం ఏర్పడిన పురుషాధిక్యతను ఇది బలపరిచిందా? ఏదైనను ఈ భావాలకు పురుషాధిక్యతకు సన్నిహిత సంబంధం ఉన్నది.

క్రైస్తవమతం సెక్సు పరంగా స్త్రీలను ఘోరంగా దోపిడీ చేసింది. దోపిడీ (Exploitation) విధానాలు అనేకం. ఇతరులతో సంభోగించ వద్దని ఆంక్షలు, పురుషులు ఉంపుడుగత్తెలను కలిగి ఉండటానికి అవకాశం, బహుభార్యాత్వం, యుద్ధంలో చెరపట్టబడిన స్త్రీలను చెరచటం, స్త్రీలకు మాత్రమే కన్యాత్వాన్ని నియమంగా ఏర్పరచడం, వారికి పతివ్రతా తత్వాన్ని నూరిపోయడం, స్త్రీలపట్ల లైంగికంగా వివక్ష, సెక్స్ పరంగా స్త్రీల యిష్టాయిష్టాలకు విలువ ఇవ్వకపోవడం ఇవన్నీ పైన ఉటంకించిన సెక్స్ పరమైన ఊహల అభిప్రాయాల ఫలితాలే.[17]

స్త్రీ క్షేత్రము. పురుషుడు విత్తనం వేయువాడు. పొలంలో విత్తనాలు వెదజల్లి మొక్కలను, పైరును పెంచినట్లుగా పురుషుడు అనేక క్షేత్రములను

కలిగియుండవచ్చును. ఈ భావం బహుభార్యాత్వానికి దారితీసింది. ఆ ఆచారానికి బలము చేకూర్చింది. వదుపవృత్తికి అంతదండలను అందించింది. ఉపపత్నులను అనేకమందిని కలిగియుండుటకు పురుషునికి వీలుకల్పించింది. పురుషుని వ్యభిచరించుటకు హక్కుకలవాడ్డిగా తయారు చేసింది.

స్త్రీకి ఋతు స్రావము కలుగుతుంది కనుక ఆమెను అపవిత్రురాలిగా చిత్రించి, ఆమెను మతవిహిత పూజారులను ండి బహిష్కరించి, దేవాలయాలలో పూజారి వదవికి ఆమెను అనర్హురాలినిచేసి, ఆ అనర్హతను ఇతర జీవితరంగాలకు వ్యాప్తిచేసి ఆమెను ప్రాణమున్న బొమ్మగా పురుషుడు వాడుకున్నాడు. స్త్రీని బలహీన ఘటంగా అభివర్ణించారు. "అటువలెనే పురుషులారా, జీవమను కృపావరములో మీ భార్యలు మీతో వారైయున్నారని యెరిగి, యెక్కువ బలహీన ఘటమని భార్యను సన్మానించి మీ ప్రార్థనలకు అభ్యంతరము కలుగకుండునట్లు, జ్ఞానము చొప్పున వారితో కాపురము చేయుడి.[18] (వక్కాణింపు రచయితది. 1 పేతురు 3 : 7) ఈ వాక్యముయొక్క అర్థము విషయమై ఏమైన అనుమాన మున్నచో ఈ వాక్యమును గమనించిన భ్రమలు తొలగిపోవును. ఇది స్త్రీలను ఉద్దేశించి చెప్పబడినది. "ఆ ప్రకారము శారా అబ్రహామును యజమానుడని పిలుచుచు అతనికి లోబడి యుండెను. మీరును యోగ్యముగా నడుచుకొనుచు ఏ భయమునకు బెదరక యున్నయెడల ఆమెకు పిల్లలగుదురు.[19] (1 పేతురు 3 : 6)

శారా తన భర్త అయిన అబ్రహామునకు ఎట్లు లోబడియుండెనో గమనింతము. అబ్రహాము ఐగుప్తదేశములో నివసించుటకు అక్కడకు వెళ్ళెను. తన భార్య చక్కనిదగుటవలన తనను ఎవరయినా చంపెదరని అబ్రహాము భయపడి ఆమె తన సహోదరియని తను చెప్పునట్లును ఆమె అంగీకరించునట్లును ఆమెను ఒప్పించెను. "ఆ స్త్రీ ఫరోయింటికి తేబడెను

అతడామెనుబట్టి అబ్రహామునకు మేలుచేసెను; అందువలన అతనికి గొఱ్ఱెలు, గొడ్లు, మగ గాడిదలు, దాసులు, పనికత్తెలు, ఆడుగాడిదలు, ఒంటెలు ఇయ్యబడెను."[20] (ఆది 13 : 15, 16) ఫరో శారయిని భార్యగా చేసుకొన దలచెను. కాని యెహోవా అతనిని బోధించెను. అంటే యొకని భార్యగా ఉండుటకు అబ్రహాము కోరికపై శారయి అంగీకరించెను అనేది ఈ కథలో తాత్పర్యం. ఈ కథలోని శారయియే శారా.[21] (ఆది 17 : 15) మరియొక సంఘటన. అబ్రహాము గెరారులో కొన్నాళ్ళు ఉండెను. అప్పుడు అబ్రాహాము తన భార్యయైన శారాను గూర్చి తన చెల్లెలని చెప్పెను. అంత గెరారు రాజు అబీమెలెకు ఆమెను తనయింట చేర్చుకొనెను. ఆమె కూడ (తనభర్త) తన అన్నయనెను. తరువాత యెహోవా కలుగజేసు కున్నాడు. కొంతకథ జరిగినది.[22] (ఆది 20 : 1 - 14) అంటే భర్త తనను ఇంకొక పురుషునికి అర్పించి అతడు ఆమెను కూడుటకు అవకాశము కల్పించినను సమ్మతించి ఊరకుండుట శారా పద్ధతి. ఆ విధానాన్ని అనుసరించాలట స్త్రీలు. ఇలా మూఢభావాలను ప్రచారం చేసిన పాత నిబంధనను పట్టుకొని వ్రేలాడడము ఎంత సమంజసమో స్త్రీలు యోచింతురు గాక. సెక్సు విషయమై అనాగరిక బర్బర భావాలను పాతనిబంధన భక్తుల నెత్తిన రుద్దుతున్నదని స్త్రీలు గుర్తించడం అవశ్యము జరగాలి.

3 వ అధ్యాయం : రిఫరెన్సులు

1. 'ది పొజిషన్ ఆఫ్ వుమెన్' అధ్యాయం 16, పుట - 114. ('ఆనెస్టు టుమాన్' : మార్గరెట్ నైట్).
2. పాతనిబంధన : లేవీయ కాండము 15 : 19 - 33
3. ,, ,, 15 : 1 - 15
4. ,, ,, 15 : 17 - 18
5. ,, ,, 18 : 19
6. ,, ,, 20 : 18
7. ,, ,, 12 : 1 - 8
8. ,, ,, 18 : 22
9. క్రొత్త నిబంధన మత్తయి 1 : 18
10 ,, ,, 1 : 20
11. ,, ,, 1 : 22, 23
12. ,, లూకా 1 : 26 - 35
13 ,, లూకా (1 : 7, 13)
14. 'కాంట్రివర్సీ' : హెక్టర్ హాటన్
15. ,, ,,
16 ఆదికాండము 3 : 16
17 "స్త్రీలు : నాస్తికత్వం" మాడలిన్ ఓహెయిర్.
18. 1 పేతురు 3 : 7
19. 1 పేతురు 3 : 6
20 ఆది 13 : 15, 16
21. ఆది 17 : 15
22. ఆది 20 : 1 - 14

4 బ్రహ్మచర్యము

సంప్రదాయ యూదామతము బ్రహ్మచర్యాన్ని నిషేధించలేదు. స్త్రీ పురుషుల సాహచర్యాన్ని ఆదేశించింది. సుఖపడి జనాభివృద్ధి కావించుకో మన్నది. కాని క్రైస్తవం యూదా మతంలోని మంచిని వదలి చెడును మాత్రం చేపట్టింది. వేశ్యావృత్తిని అవసరమైన చెడుగా అంగీకరించింది. వివాహాన్ని బ్రహ్మచర్యం కన్న తక్కువ స్థాయిలో ఉంచింది. పితృస్వామ్య వ్యవస్థలో సహజంగా ఉండే స్త్రీల అణచివేతను కొనసాగించింది.[1] యూదులలో 'ఎస్సీన్' అనే ఒక శాఖవారున్నారు. వారు తమకు ప్రత్యేకంగా దేవునితో ఒక నిబంధన ఉన్నదని విశ్వసించేవారు. వారు బ్రహ్మచర్యాన్ని పాటించి దానిని అమలుపరచ జూచేవారు. వారిని గురించిన సమాచారము 'మృతసముద్రగ్రంధం' (Dead Sea Scrolls) లభ్యమయిన తరువాత బాగా దొరికింది. వీరిది సైనిక పద్ధతి నిర్మాణం. వారు యుద్ధకాలములో ఎలా సంచరించాలో ఇలా వివరింపబడినది.[2] "నీ సేన శత్రువులతో యుద్ధము చేయునప్పుడు ఏదు షాక్కార్యము చేయకుండ జాగ్రత్తపడవలెను. రాత్రి జరిగిన దానివలన మైలపడినవాడు పాళెము వెలుపలికి వెళ్ళిపోవలెను. అతడు పాళెములో చేరకూడదు. సాయంకాలము అతడు నీళ్ళతో స్నానము చేసి సూర్యుడు అస్తమించిన తరువాత పాళెములో చేరవచ్చును....."

(ద్వితీయోపదేశకాండము 23 : 9 - 13)[3] స్త్రీతో సంభోగించుట వల్ల పురుషుడు అపవిత్రుడగును. సాయంకాలము వరకు అలాగే ఉండును. అపుడు స్నానము చేసిన శుద్ధియగును.[4] (లేవీ 15 : 18) అపవిత్రత అసలే రాకుండుటకుగాను ఎస్సీనులు స్త్రీతో లైంగిక సంబంధం వద్దనుకొనిరి.

పాత నిబంధనలో యిర్మీయా (జెరిమియా) అనే యాజకుడు బ్రహ్మచర్యాన్ని పాటించినట్లున్నది. అతని వివర్తనపై ఖండనయెక్కడా కన్పించదు. బహుశః ఆనాటికి వ్యక్తులు బ్రహ్మచారులుగాను సాధువులుగాను ఉండవచ్చునేమో.[5] బాప్తిసము ప్రకటించిన యోహాను బ్రహ్మచారి. ఏసుక్రీస్తు బ్రహ్మచారి. బ్రహ్మచర్యాన్ని గురించి ఏసు వాక్యాలను గమనించవలసియున్నది. పెండ్లి చేసికొనుట యుక్తముకాదని శిష్యులు చెప్పగా ఏసు ఇలా సమాధానము యిచ్చెను. "అందుకాయన అనుగ్రహము నొందినవారు తప్ప మరి ఎవరును ఈ మాటను అంగీకరింపనేరరు. తల్లి గర్భమునుండి నపుంసకులుగా పుట్టినవారు గలరు, మనుష్యులవలన నపుంసకులుగా చేయబడిన నపుంసకులును గలరు, పరలోక రాజ్యము నిమిత్తం తమ్మును తామే నపుంసకులనుగా చేసికొనిన నపుంసకులును గలరు. (ఈ మాటను) అంగీకరింపగలవాడు అంగీకరించునుగాక అని వారితో చెప్పెను."[6] (మత్తయి 19 : 11, 12) అంటే ఏసు తన శిష్యులందరినీ బ్రహ్మచారులను కావలసినదిగా కోరినట్లు కన్పించదు. కాగా దేవుని రాజ్యమును ప్రవేశించుటకు బ్రహ్మచర్యము మంచిదని ఆయన చెప్పెను. "ఆయన దేవుని రాజ్యము నిమిత్తమై యింటినైనను, భార్యనైనను, అన్నదమ్ములనైనను, తల్లిదండ్రులనైనను, పిల్లలనైనను విడిచిపెట్టిన వాడెవడును, ఇహమందును, చాలరెట్లును పరమందు చాలరెట్లును పరమందు నిత్యజీవమును పొందక పోడని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనెను."[7] (లూకా 18 : 29, 30)

పౌలు ఈ విషయంలో ఏసును మించిపోయెను. "స్త్రీలను ముట్టకుండుట పురుషునికి మేలు. అయినను జారత్వములు జరుగుచున్నందున

ప్రతివానికి సొంత భార్య యుండవలెను. ప్రతి స్త్రీకి సొంత భర్త యుండవలెను. భర్త భార్యకును అలాగుననే భార్య భర్తకును వారివారి ధర్మములు నడుపబడవలెను. భర్తకేగాని భార్యకు తనదేహము పై అధికారము లేదు. అలాగుననే భార్యకేగాని భర్తకు తన దేహముపై అధికారము లేదు..... మనుష్యులందరు నావలె నుండగోరుచున్నాను."[8] (1 కొరింధీయులకు 7 : 1 - 7 వక్కాణింపు రచయితది) పౌలు బ్రహ్మచారి. తనవలెనే ఇతరులను ఉండమంటున్నాడు. అంటే బ్రహ్మచర్య ప్రాశస్త్యాన్ని ఉగ్గడిస్తున్నాడన్న మాట. బ్రహ్మచర్యమును పొగుడుతూ మరొకచోట మరొక సందర్భంలో పౌలు ఇలా అన్నాడు. "మీరు చింతలేనివారై యుండవలెనని కోరుచున్నాను పెండ్లి కానివాడు ప్రభువును ఏలాగు సంతోషపెట్టగలనని ప్రభువు విషయమైన కార్యములను గురించి చింతించుచున్నాడు. అటువలెనే పెండ్లి అయినవాడు భార్యను ఏలాగు సంతోషపెట్ట గలనని లోకవిషయమైన వాటిని గూర్చి చింతించుచున్నాడు. అటువలెనే పెండ్లికాని స్త్రీయు కన్యకు కన్యకయు తాము శరీరమందున్న ఆత్మయందును పవిత్రురాండ్రయి యుండుట వలన ప్రభువు విషయమైన కార్యములను గూర్చి చింతించు చుందురు గాని పెండ్లి యయినది భర్తను ఏలాగు సంతోషపెట్టగలనని లోకవిషయమైన వాటిని గూర్చి చింతించుచున్నది. (వక్కాణింపు రచయితది."[9] (1 కొరింధీయులకు 7 : 32 - 34)

ఇట్లు అవివాహితులకు మాత్రము ప్రభువు సేవ చేయుటకు అవకాశమున్నదని పౌలు చెప్పి కాముక ఆకర్షణను నిందించెను. "నేను చెప్పునదేమనగా ఆత్మాను సారముగా నడుచుకొనుడి, అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్పారు. శరీరము ఆత్మకును విరోధముగా అపేక్షించును. ఇవి ఒకదానికొకటి వ్యతిరేకముగా ఉన్నవి గనుక మీరేవి చేయనిచ్ఛయింతురో వాటిని చేయకుందురు."[10] (గలతీయులకు 5 : 16, 17) ఇంకా స్పష్టముగా చెప్పినాడు పౌలు.

"శరీర కార్యములు స్పష్టమై యున్నవి; అవేవనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వం, విగ్రహారాధన, వ్యభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి వీటినిగూర్చి నేను మునుపు చెప్పిన ప్రకారము ఇట్టివానిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నా ననెను.[11] (వక్కాణింపు రచయితది. గలతీయులకు 5 : 19 - 21) "మనము ఆత్మననుసరించి జీవించువారమైతిమా ఆత్మను అనుసరించి క్రమంగా నడుచుకొందము."[12] (గలతీయులకు 5 : 25)

ఇలా బ్రహ్మచర్యాన్ని విపరీతంగా పౌలు పొగిడి వివాహము దేవుని సేవకు ప్రతిబంధమని సెలవిచ్చియున్నాడు. తనవలె అవివాహితుడుగా ఉండిపొమ్మని హితవు చెప్పినాడు. స్త్రీలను తాకవద్దని ఆదేశించాడు. దేవుని ప్రేమలో మునిగిపొమ్మని జనులకు బుద్ధిగరిపాడు. "దేహము జారత్వము నిమిత్తము కాదుగాని, ప్రభునిమిత్తమే. ప్రభువు దేహము నిమిత్తమే."[13] (I కొరింథీయులకు 6 : 13, 14) "కావున భూమి మీద నున్న మీ అవయవములను, అనగా జారత్వమును, అపవిత్రతను, కామాతురతను, దురాశను విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపివేయుండి."[14] (వక్కాణింపు రచయితది : కొలస్సయులకు 3 : 5)

"మీలో ప్రతివాడును, దేవుని ఎరుగని అన్యజనులవలె కామాభిలాష యందుగాక, పరిశుద్ధత యందును, ఘనత యందును తన ఘటమును ఎట్లు కాపాడుకొనవలెనో అది యెరిగి యుండుటయే దేవుని చిత్తం."[15] (I థెస్సలొనీయులకు 4 : 4, 5. వక్కాణింపు రచయితది.)

ఇలా కామాభిలాషను అణగద్రొక్కవలెనని పౌలు బోధించెను.

ఇలాంటి బోధనలవల్ల తరువాత వచ్చిన మతగురువులుగా మఠాధిపతులూ బ్రహ్మచారులుగా ఉండటం సాగించారు. ఇది రోమన్ కాథలిక్ శాఖలో ఇప్పటికీ మిగిలియున్న ఆచారము. ఇంద్రియ నిగ్రహం చేయుటకు సాధనాలుగా బ్రహ్మచారిణులైన దైవభక్తులను మతగురువులు (వారందరూ పురుషులే) ఆధ్యాత్మిక భార్యలనుగా చేసికొనిరి. అది ఆచరణ సాధ్యం కాక అనేక అనర్థాలకు, వ్యభిచారానికి దారితీసెను.[16] మధ్యయుగంలో సామాన్య ప్రజానీకపు స్త్రీలను వివాహంనాటి తొలిరేయి అనుభవించే హక్కును భూస్వాములు తమకు తామే ప్రకటించుకున్నారు. ఆ రోజుల్లో మఠాలకు వేలకొలదీ ఎకరాల భూమి ఉండేది. కనుక మఠం భూస్వామి అయినది. మఠాధికారి భూస్వామి అయినాడు. మఠాధిపతులు కూడా ఈ దుర్మార్గపు హక్కును వినియోగించుకున్నారు. ఆమీన్స్ (Ameins) బిషప్ అలా సంచరించిన వారిలో ప్రముఖుడు. ఈ ఆచారము పదిహేనవ శతాబ్దం ప్రారంభంవరకూ సాగింది.[17]

ఓరిగన్, (క్రీశ 263 - 340) అనే మతశాస్త్రవేత్త, పెళ్ళి అపరిశుద్ధమూ అపవిత్రమూ అని చెప్పి తన మర్మాంగయాలను కోసుకున్నాడు. అగస్టిన్ (క్రీశ 354 - 430) "బ్రహ్మచర్యం పాటించేవారు స్వర్గంలో మణుల్లా ప్రకాశిస్తారు. వారి తల్లిదండ్రులు కాంతిలేని నక్షత్రాలుగా ఉంటారు." అన్నాడు ఆర్య జెరోము భాష్యం ప్రకారం 'బాగా పిల్లల్ని కనండి, జనాభాను పెంచుకోండి' అనే ఉపదేశము (పాతనిబంధనది) క్రైస్తవులకు వర్తించదు."[18] ఇలాంటి బోధవల్ల బ్రహ్మచర్యానికి సుముఖమైన వాతావరణం ఏర్పడింది. పోప్ 7 వ గ్రెగరీ మతగురువులు విధిగా బ్రహ్మచారులుగా ఉండాలని శాసించాడు. అంతకు క్రితం బ్రహ్మచర్యం యెడల ప్రజలలో నెలకొనియున్న సద్భావంవల్ల ఇలాంటి ఆజ్ఞను పోప్ జారీ చేసినా ఎవరూ అసమ్మతి తెలుపలేదు.[19]

ఇంతకూ బ్రహ్మచర్యానికీ స్త్రీల అణచివేతకూ సంబంధం ఏమిటి? పురుష వీర్యం శక్తివంతమైనది కనుక దానిని దుర్వినియోగం చేయరాదని

భావం. అలా బ్రహ్మచర్యం ప్రశస్తం. స్త్రీలు అపవిత్రులు కనుక వారిని తాకరాదు; వారితో సంపర్కం పనికిరాదు. ఇది స్త్రీలను ద్వేషించ టానికి, పురుషాధిక్యతకు దారి తీసింది. స్త్రీలలో దోషభావాలను వెదజల్లింది. కామం చెడ్డది కనుక, స్త్రీలతో సంపర్కం వల్లనే కామతృప్తి కలుగుతుంది కనుక, పవిత్రులను చెడగొట్టే వారినిగా స్త్రీలను చిత్రిస్తే ఆ మాటలను స్త్రీలు అమాయకంగా విశ్వసించి తమ ఉనికే దోషభూయిష్టమనే అభిప్రా యానికి వచ్చారు. ఒకవైపు పురుషాధిక్యతా భావానికి, మరొకవైపు స్త్రీలలో న్యూనతా భావానికి ఈ వైఖరి ప్రోది చేసింది.

ఇప్పటికీ రోమన్ కాథలిక్ శాఖకు చెందిన ఫాదరీలు, కన్యలు (Nuns) పెద్దసంఖ్యలో ఉన్నారు. మతిస్థిమితం పోగొట్టుకోకుండా జీవించటానికి నానాయాతనలూ పడుతున్నారు. ఇరువది నాల్గుగంటలలో పదునెనిమిది లేక పందొమ్మిది గంటల కాలం ఎడతెగని, ఊపిరాడని పనులలో నిమగ్నమయి సహజమయిన కామవాసనను అధిగమించటానికి నానా పాట్లు పడుతున్నారు.

ఆడపిల్లలకు వరకట్నం ఇచ్చి పెండ్లి చేయాలని తల్లిదండ్రులు చిన్నతనంలోనే తమ కుమార్తెలను మఠాలకు కన్యలుగా పంపుతున్నారు. వారిలో కొందరు మఠజీవితం తమకు ఇష్టం కాకపోయినా బయటికి రావటానికి ఇష్టంలేక మఠాలలో కుమిలిపోతూ మగ్గిపోతున్నారు. 1752 లో పారిస్ నగరానికి దగ్గరగా ఉన్న 'లాంగ్ ఛాంప్స్' అనే ప్రదేశంలోని 'కన్యల నివాసం' (Nunn Ery) నుండి తనకు విముక్తి కలిగించవలసిన దని 'మార్గ్యూరెట్ డెలమారె' అనే కన్య కోర్టుకు దరఖాస్తు చేసుకుంటే కోర్టు త్రోసిపుచ్చింది. ఆమె కాన్వెంటులో శేషజీవితాన్ని అయిష్టంగా గడపవలసి వచ్చింది. ఈ సంఘటన ఆధారంగా ఫ్రెంచి విప్లవానికి ఆలోచనా బీజాలను నాటిన విజ్ఞాన సర్వస్వ రచయితలలో ఒకడైన డిడిరో కథరాశాడు. ఆ కథను ప్రాతిపదికగా తీసుకొని 1966 లో సినిమా తీశారు మతగురువులూ, భక్తులూ కొందరు మునిగిపట్లు గగ్గోలు పెట్టారు. చివరకు రోమన్ కాథలిక్ క్రైస్తవానికి తలఒగ్గి ప్రభుత్వం వారు నియమించిన

సెన్సారు బోర్డు 'కన్య' (The nun) అనే ఆ సినిమాపై నిషేధపుటుత్తరువు జారీ చేసింది. అంతటితో ఆగక ఆనాటి ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షుడు డీగాల్ రేడియోలో, టీ. వి. లో ఈసినిమా ప్రస్తావన రాకూడదని శాసించాడు. బ్రహ్మచర్యాన్ని గురించిన దురవగాహన 1966 లో కూడా ప్రభుత్వంపై ఎలా పెత్తనం చేయగల్గిందీ మనకు తెలుస్తుంది ఈ సంఘటనవల్ల.

మతయుద్ధాలు మూడువందల సంవత్సరాలు జరిగితే ఆ యుద్ధాలలో పాల్గొన్న భార్యలను వదలి వెళ్ళిపోయారు. ఇదంతా ఆధ్యాత్మిక భావ ప్రభావ ఫలితం.

ఆధ్యాత్మిక ప్రేమకు రూపకల్పన చేశారు. ఏసు తల్లిని ఆ భావనకు ఆరాధ్యదైవం చేశారు. ఆమె యోసేపునకు భార్యగా ఆరాధింపబడుట లేదు. కన్యాత్వపు శుచి చెడని ఏసుతల్లిగా ఆమెను ప్రార్థిస్తున్నారు. ఆమెకు కామంలేదు. ఆమెలో స్త్రీత్వలక్షణాలులేవు. లైంగిక ఆకర్షణని ఆమె ముఖ సౌందర్యంతో ముగ్ధులవుతున్నారు క్రైస్తవ భక్తులు. ఇలా ఆత్మవంచన చేసుకుంటూ సహజ ప్రవృత్తులను అణచుకో ప్రయత్నిస్తూ, సతమతమవుతూ, కృత్రిమ జీవితాన్ని సాగిస్తున్నారు బ్రహ్మచారులైన మతగురువులు. పూర్వం ఒక మఠంలోని తటాకపు స్థలాన్ని త్రవ్వితే ఆరువేల శిశువుల కళేబరాలు కనపడ్డాయి. ఈనాడు అలాంటి ఘోరాలులేవు కాని బ్రహ్మచారులైన స్త్రీ పురుషుల బాధలు ఇంతింత కాదు.

బ్రహ్మచర్యాన్ని, సన్యాసాన్ని పొగిడింది క్రైస్తవం మాత్రమే కాదు. బౌద్ధకాలానికి పూర్వమే భారతదేశంలో వేలసంఖ్యలో సన్యాసు లుండేవారు. బౌద్ధంలో, జైనంలో సన్యాసానికి విలువ హెచ్చింది. నిన్న మొన్నటివరకూ బ్రహ్మచర్యాన్ని గురించి మహాత్మాగాంధీ లాంటివారు దాని ప్రాశస్త్యాన్ని కొనియాడారు.

స్త్రీలయెడ ద్వేషాన్ని, వారికంటే పురుషులు అధికులనే భావాన్ని ఈ బ్రహ్మచర్య భావం నొక్కిపెట్టి పెంచి పోషించింది. జీవితాన్ని దుఃఖభాజనం చేసింది; చేస్తున్నది.

4 వ అధ్యాయం : రిఫరెన్సులు

1. 'హ్యూమనిస్టు విప్లవం' : అధ్యాయం 9 "మానవవాదం : సెక్స్" : హెక్టర్ హాటన్
2. పుట 75, 12 వ అధ్యాయం, 'సెక్స్ అండ్ బైబిలు' : గెరాల్డు లారూవి, హ్రొమీథియస్ బుక్స్, న్యూయార్కు, (యు. ఎస్. ఏ.)
3. పాతనిబంధన ద్వితీయోపదేశకాండము 23 : 9 - 13
4. లేవీయకాండము 15 : 18
5. 'సెక్స్ అండ్ బైబిలు' 12 వ అధ్యాయం పుట 76
6. మత్తయి 19 : 11, 12
7. లూకా 18 : 29, 30
8. I కొరింధీయులకు 7 : 1 - 7
9. I కొరింధీయులకు 7 : 32 - 34
10. గలతీయులకు 5 : 16, 17,
11. గలతీయులకు 5 : 19 - 21
12. గలతీయులకు 5 ; 25
13. I కొరింధీయులకు 6 : 13, 14
14. కొలస్సయులకు 3 : 5
15. I థెస్సలొనీకయులకు 4 : 4, 5
16. 'హ్యూమనిజం : సెక్స్' అధ్యాయం 9 'హ్యూమనిస్టు రివల్యూషన్' హెక్టర్ హాటన్
17. వుమెన్ : ఎథియిజం (పుట 13)
18. "వుమెన్ ఇన్ పాస్ట్, ప్రజెంట్ అండ్ ఫ్యూచర్" ఆగస్టు బెబెల్.
19. 'వుమెన్ అండ్ ఎథియిజం' పుట - 12

5 జారత్వం

ఒకనాటి సమాజంలో పెళ్ళిళ్ళులేవు. స్త్రీ పురుషులు వావి వరుసలు లేకుండా సెక్స్ జీవితం సాగిస్తుండేవారు. తరువాత గుంపు పెళ్ళిళ్ళు, జంటవివాహాలు వచ్చాయి. అప్పుడప్పుడే వివాహ వ్యవస్థ రూపొందుతున్నది. ఏ పురుషుడు ఏ స్త్రీతో సంగమించవచ్చునో లేదో నియమాలు ఏర్పడసాగాయి. ఆ నియమాలకు భిన్నంగా స్త్రీ పురుషులు ఏర్పర్చుకున్న సంబంధాలను జారత్వంగా చిత్రించి నిందార్హం చేశారు సంఘపెద్దలు. వివాహబంధాన్ని గట్టిచేయపూనారు. వివాహం వెలుపల లైంగిక సంబంధాలను నిషేధించారు. దానిని వ్యభిచారమని నిందించారు.

తన తండ్రి భార్యతో శయనించినచో వారిద్దరికి మరణశిక్ష విధింపవలెను.[1] ఒకడు తన కోడలితో శయనించిన యెడల వారిద్దరికిని మరణశిక్ష విధింపవలెను.[2] ఒకడు స్త్రీని, ఆమె తల్లిని పెండ్లాడిన వానిని అగ్నితో కాల్చవలెను.[3] ఒకడు తన సహోదరిని అనగా తన తండ్రి కుమార్తెనే గాని తల్లి కుమార్తెనేగాని చేర్చుకొనిన వారికి మరణశిక్ష[4] తల్లి సహోదరిని, తండ్రి సహోదరిని, పెత్తల్లినిగాని, పినతల్లిని గాని కూడుట పాపము.

సహోదరుని భార్యను చేర్చుకొనుట హేయము. దానికి శాపము పెట్టాడు భగవంతుడు.[5] ఇవన్నీ క్రీస్తుకు పూర్వం లేవీయకాండములోని నిబంధనలు.

ఒకడు మగనాలితో శయనించుచుండగా కనబడినయెడల వారిద్దరు అనగా ఆ స్త్రీతో శయనించిన పురుషుడును ఆ స్త్రీయు చంపబడవలెను.[6] కన్యకయైన చిన్నది ప్రధానము చేయబడిన తరువాత ఒకడు ఊరిలో ఆమెను కలిసికొని ఆమెతో శయనించినయెడల వారిరువురిని రాళ్ళతో చావగొట్టవలెను.[7]

ప్రధానము చేయబడిన చిన్నదానిని పొలములో ఒకడు బలిమిని కలసినయెడల ఆ మనుష్యుడు చావవలెను.[8] ప్రధానము చేయబడని కన్యను పట్టుకొని ఒకడు ఆమెతో శయనించినయెడల దాని తండ్రికి ఏబది వెండి రూకలు ఇచ్చి ఆమెను పెండ్లిచేసుకొనవలెను.[9] ఇది ఒకనాటి భారత హిందూ సమాజంలోని పైశాచిక వివాహమును పోలియున్నది.

జారత్వమును గురించి క్రొత్త నిబంధనలో చెప్పబడిన వాక్యములను పరిశీలిద్దాం.

"కాబట్టి అన్యజనులలోనుండి దేవునివైపు తిరుగుచున్న వారిని మనము కష్టపెట్టక విగ్రహ సంబంధమైన అపవిత్రతను, జారత్వమును గొంతుపిసికి చంపిన దానిని, రక్తమును, విసర్జించుటకు వారికి పత్రిక వ్రాసిపంపవలెను."[10] (వక్కాణింపు రచయితది.) "జారత్వమును విసర్జింప వలెను."[11]

"అయితే విశ్వసించిన అన్యజనుల గురించి - వారు విగ్రహములకు అర్పించిన వాటి, రక్తమును గొంతుపిసికి చంపిన దానిని జారత్వమును మానవలెనని నిర్ణయించి వారికి వ్రాసియున్నామని వారికిచెప్పెను."[12]

పౌలు కొరింథీయులకు ఇలా వ్రాసెను -

"మీలో జారత్వమున్నదని వదంతి కలదు. ఒకడు తన తండ్రి భార్యనుంచుకొన్నాడట. అట్టిజారత్వము అన్యజనులనైనను జరగదు."[13]
"జారులతో సాంగత్యం చేయవద్దని నా పత్రికలో మీకు వ్రాసియుంటిని."[14]

"దేహము జారత్వము నిమిత్తముకాదు ప్రభువు నిమిత్తమే."[15]

"జారత్వమునకు దూరముగా పారిపోవుడి."[16]

పౌలు ఎఫెసీయులకు వ్రాస్తూ "మీలో జారత్వమేగాని యేవిధమైన అపవిత్రతయేగాని, లోభత్వమేగాని వీటి పేరైనను ఎత్తకూడదు. ఇదే పరిశుద్ధులకు తగినది."[17]

పౌలు కొలసయ్యులకు వ్రాస్తూ ఇలా చెప్పినాడట -

"కావున భూమిమీదనున్న మీ అవయవములను, అనగా జారత్వమును, అపవిత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధన యైన ధనాపేక్షను చంపివేయుడి. వాటివలన దేవుని ఉగ్రత అవిధేయుల మీదికి వచ్చును."[18]

పౌలు థెస్సలొనీకయులకు ఇలా రాశాడు -

"మీరు పరిశుద్ధులగుటయే అనగా మీరు జారత్వమునకు దూరముగా ఉండుటయే దేవుని చిత్తము."[19]

వీటినిబట్టి పౌలు జారత్వ నిషేధంపై నొక్కి పెట్టినట్లు తోస్తున్నది.

పాతనిబంధనలో పేర్కొనబడిన దైవజనులు, ప్రవక్తలు పెక్కు అపభ్రంశ కార్యములు చేసినట్లు దాఖలాలు ఉన్నాయి : అబ్రహాము తన తండ్రి కుమార్తె అయిన శారాను వివాహమాడెను.[20] తన భార్యను వ్యాపార వస్తువుగా వాడెను.[21] ఆమెను అబీమెలెకు ఇచ్చెను.[22] యాకోబు లాబాను కుమార్తె లయాను, ఆమెచెల్లెలు రాహేలును పెండ్లి చేసికొనెను.[23]

"అబ్షాలోమునకు గుడారము వేయగా ఇశ్రాయేలీయులందరికి తెలియునట్లుగా అతడు తన తండ్రి ఉపపత్నులను కూడెను."[24]

వీటిని చెడ్డపనులకు దృష్టాంతములుగా చెప్పారని ఒక సమర్థన ఈ కాలపు క్రైస్తవ ప్రచారంలో కన్పడుతున్నది.[25] అది కొంతవరకు సత్యమే. కాని అట్టివారిని దైవజనులని పొగడుట వింతకదా!

జారత్వాన్ని, స్వైర విహారాన్ని ఎవరూ ప్రోత్సహించరు. కాని పరిత్యాగం లేక విడాకులు (Divorce) లేనిరోజులలో భర్త దుర్మార్గుడయినపుడు వ్యభిచరించిన స్త్రీకి మరణదండన విధించటం అటవికన్యాయం. జారత్వం విడాకులకు కారణభూతం కావచ్చు. కాని దానిని నేరంగా పరిగణించటం స్త్రీలపట్ల వివక్షగా చెప్పక తప్పదు.

వావి వరుసలు లేకుండా స్త్రీ పురుషులు సంపర్కం పెట్టుకునే కాలంలో, జన్మనిగ్రహసాధనాలు తెలియనందున స్త్రీ పురుషుల సంయోగ ఫలితంగా సంతానం కలిగే రోజుల్లో ఆరోగ్య సూత్రాలను మనస్సులో ఉంచుకొని సామాజిక శ్రేయస్సును కుటుంబశాంతిని లక్ష్యంగా పెట్టుకొని, ఇంకా రాజకీయ కారణాలను పురస్కరించుకొని జారత్వ నిషేధము తీవ్రంగా కొనసాగడం సహజమే. ఆ విషయాన్ని అర్థం చేసుకోగలం. కాని ఆనాటి సూత్రాలను యీ నాటికీ అమలు జరపలేము. అమలు జరపరాదు. దేశకాల పరిస్థితులు మారాయి. స్త్రీ పురుషుల కలయిక విధిగా సంతానోత్పత్తికి దారి తీయవలసినపనిలేదు. అలాంటి పరిస్థితుల్లో సామాజిక శ్రేయస్సుకు భంగం కానివిధంగా స్త్రీ పురుషుల వ్యక్తిగత అభిరుచులు ఆపేక్షల తీరునుబట్టి స్త్రీ పురుషసంబంధాలపై ఆంక్షలు పోవాలి. ఉదాహరణకు భార్య చెల్లెలును వివాహమాడటం జారత్వం క్రైస్తవ సంప్రదాయ ప్రకారం. హిందువులలో నిన్న మొన్నటివరకు ఒకనిభార్య సంతానవతియై చనిపోతే పిల్లల యోగక్షేమాలను చూడటానికి అంతకన్న తగినవ్యక్తి లేదనే భావంతో భార్య చెల్లెలిని ఆ పురుషునికి ఇచ్చి వివాహం చేయడం జరుగుతున్నది. ఏదినీతి? ఏది అవినీతి? ఏది జారత్వం? దీనికి నిర్వచనం ఏది?

5 వ అధ్యాయం : రిఫరెన్సులు

1.	లేవీయకాండము	20 : 11
2.	,,	20 : 12
3.	,,	20 : 14
4.	,,	20 : 17
5.	,,	20 : 19 – 21
6.	ద్వితీయోపదేశకాండం	22 : 22
7.	,,	22 : 23, 24
8.	,,	22 : 25
9.	,,	22 : 28, 29
10.	అపోస్తలుల కార్యములు	15 : 20
11.	,,	15 : 29
12.	,,	21 : 25
13.	I కొరింథియనులకు	5 : 1
14.	,,	5 : 9
15.	,,	6 : 13
16.	,,	6 : 18
17.	ఎఫెసీయులకు	5 : 3
18	కొలస్సయులకు	3 : 5
19	I థెస్సలొనీకయులకు	4 : 3
20.	ఆదికాండము	20 : 12
21.	,,	12 : 11 – 19
22.	,,	20 : 2 – 18
23.	ఆదికాండము	29 : 23 – 30
24.	II సమూయేలు	16 : 2

25. పుట 14 – క్రైస్తవ కుటుంబము (ఎడల్టు బైబిలు స్టడీస్)

6

వివాహం

స్త్రీ జీవితంలో వివాహవ్యవస్థ ప్రముఖపాత్ర వహిస్తోంది. అది పవిత్ర సంస్కారమని ఒక మతం అంటే మరొక మతం పవిత్రమైన ఒడంబడిక అని చెప్తున్నది. మానవ సమాజ పరిణామంలో ఒక దశలో యేర్పడిన వ్యవస్థ అని మరికొందరు ప్రకటిస్తున్నారు. ఇంతకూ ఈ వ్యవస్థ ఎందుకు ఉదయించినట్లు? లేక ఎందుకు రూపొందింపబడినట్లు? వివాహంయొక్క ఉద్దేశ్యాలు ఏమిటి? దీనిద్వారా ఏం సాధించదలచారు? క్రీ. పూ. 1500 ఏళ్ళనాటి లక్ష్యమూ ఈనాటి లక్ష్యమూ ఒకటేనా? ఒక్క క్రైస్తవమతంలోనే 3500 ఏళ్ళలో లక్ష్యాలలో, ఆదర్శాలలో మార్పురాలేదా? రావటం అనివార్యమూ, అభిలషణీయమూ కాదా? ఇలా ఎన్నో మరెన్నో ప్రశ్నలు.

పురుషుడి పెత్తనం సమాజంలో పెరుగుతున్న కొలదీ తనకు కలిగిన సంతానం ఎవరో నిర్ధారణగా తెలియటానికి అతడు ఆవేదన పడ్డాడు. అందువలననే 'ఈ స్త్రీ నా భార్య' అని ప్రకటించుకోవటానికి సిద్ధపడ్డాడు. ఆమె ఇతరులతో సంపర్కము పెట్టుకోవటం పాపమని చెప్పి అలాంటి సంబంధాన్ని నిషేధించాడు. సాధారణంగా దేవుళ్ళు, ప్రవక్తలు, దైవజనులు,

మఠాధిపతులు, మఠాధికారులు అందరూ పురుషులే. వారికి స్త్రీలబాధలు సమస్యలూ తెలియవు. తెలిసినా స్త్రీలను గురించి పట్టించుకోవలసిన అవసరం వారికి అంతగా లేదు. మోషే, ఏసు పురుషులే. కనుకనే వారుచేసిన కట్టడులు పురుషులకు అనుకూలముగా ఉంటాయి; ఉన్నాయి.

యూదాజాతి వివాహాన్ని సుఖానికి సాధనంగా ఊహించుకుంది. లైంగికానందాన్ని నిరసించలేదు. సంతానాభివృద్ధిని ఆశించింది. పురుషుడు స్త్రీ సాహచర్యాన్ని అభిలషించాడు. దానికోసం అతడు అనేక పద్ధతులను అన్వేషించాడు. తనకు మాత్రమే సొంతంగా ఉండేలా పత్నులను, ఉపపత్నులను చేపట్టాడు. ఇలా తనకు హాయి, తృప్తి కలిగేలా జీవితం వెళ్ళబుచ్చుతున్నాడు.

మొదట్లో యెహోవా ఆదామును సృజించెను. అతనితోడుకై తరువాత హవ్వను సృజించెను.[1] ఇస్సాకునకు అబ్రహాము పెండ్లి చేయ తలచి తగిన కన్యను వెదకుటకై దాసుని పంపెను. దేవుడు తన దూతను ముందుగా పంపి నీకు సహాయపడును అని అబ్రహాము చెప్పెను. ఆ దాసుడు వెళ్ళి అబ్రహాము స్వదేశస్థులయిన అతని వంశస్థుల పిల్లను వెదకవలసి యుండెను. రిబ్కాను కనుగొనెను. ఆమెను తీసికొని వచ్చెను. ఆమె ఇస్సాకును చూచి ముసుగు వేసుకొనెను. ఇస్సాకు రిబ్కాను పరిగ్రహించెను. ఆమె అతనికి భార్య అయెను. అతడు ఆమెను ప్రేమించెను.[2] ఈ కథలో దేవునిపాత్ర ఎక్కువ. రిబ్కావద్దకు దాసునికి దేవుడే దారిచూపెను. యుద్ధంలో దొరికిన స్త్రీలను వివాహమాడుట మూడవపద్ధతి. యాబేష్గిలాదు నివాసులపై దాడిచేసి పురుషసంయోగం వెరుగని నాలుగువందలమంది స్త్రీలను చెరపట్టి బెన్యామీయులకు ఇచ్చి పెండ్లి చేసిరి.[3] ఒక స్త్రీ ప్రధానము కాని కన్య అయినచో ఆమెను బలాత్కరించి తరువాత ఆమెకు భర్త యగుట నాల్గవ విధానం.[4] ఒకస్త్రీని ఒక పురుషుడు ఆశించినచో ఆమె భర్తను చంపి ఆమె విధవరాలు కాగా ఆమె అంగలార్పుకాలము పూర్తి అయిన తరువాత ఆమెను వివాహమాడుట

అయిదవ పద్ధతి. దావీదు అటులచేసెను.[5] కన్యను తండ్రివద్దనుండి కొనుగోలు చేయవచ్చును[6] ఒక స్త్రీ భర్త సంతానం లేక చనిపోతే అతని సోదరుడు ఆమెను పెళ్ళి చేసికొని పరిగ్రహించవలెను. లేనియెడల ఆమె అతనిని బహిరంగముగా అవమానపరచవచ్చును.[7] ఈ పద్ధతిద్వారా కూడ పురుషునికి భార్యలు లభించగలరు. పండుగల సందర్భంగా చేరిన కన్యలను బలవంతముగా ఎత్తుకొనిపోవుట మరియొక పద్ధతి.[8] ఇది హిందూ వివాహ విధానమయిన రాక్షస వివాహమునకు ప్రతిరూపము.

కన్యాత్వము

వివాహమాడగానే 'పురుషులబాధ' ఆనాడు అంతరించలేదు. ఆనాటి సెక్స్ పరిజ్ఞానం స్వల్పమగుటవల్ల స్త్రీ యొక్క కన్నెపొరకు ప్రాధాన్యత ఇచ్చారు పురుషులు. వారి భార్యలు పెండ్లినాటికి కన్యలుగా ఉండవలెనట. కన్యలక్షణాలను కలిగియుండాలట. అంటే పెళ్ళినాటికి ఆ స్త్రీ యొక్క కన్నెపొర చెదరి యుండరాదట. ఆధునిక శరీరశాస్త్రజ్ఞానం ప్రకారము శీలవంతురాలయిన కన్యకకు అయినను కన్నెపొర చెదరి యుండవచ్చును. దానికి కారణాలు అనేకం. కాని పూర్వీకులు తమకు తెలిసిన కొద్దిపాటి జ్ఞానానికి విలువను ఇచ్చి కన్నెపొర విషయమై పట్టుదల వహించారు. ఆమె తన కన్యాత్వమును రుజువు చేసుకోవలెనట. అట్లు రుజువు చేసు కొనని యెడల ఆమె ఊరివారు ఆమెను రాళ్ళతో చావగొట్టవలెనట. కన్యాత్వములేదని ఆరోపించిన భర్త తన వాదనను సమర్థించుకొనకపోతే - అంటే ఆ చిన్నదాని తండ్రి కన్యాత్వమునకు గురుతులున్న బట్టను పరచినచో - భర్తకు నూరు వెండిరూకలు అపరాధం వేసేవారు. ఆ పైకము ఆమె తండ్రికి ఇవ్వవలెను.[9] అంటే స్త్రీ దేహమూ, ఆమె కన్యాత్వమూ భర్తసొత్తు అన్నమాట.

వ్యభిచారము

ఒకడు మగనాలితో శయనించినచో ఆ పురుషుడు, స్త్రీయు చంప బడవలెను.[10] ప్రధానము చేయబడిన కన్యతో ఒకడు శయనించినయెడల ఆమెను, ఆ పురుషుని రాళ్ళతో చావగొట్టవలెను.[11]

తండ్రికి కుమార్తెలపైగల హక్కు

తండ్రులు కుమార్తెలను తమ బాకీలు తీర్చుకునే నిమిత్తం విక్రయించ వచ్చును. తమకు ఇష్టము వచ్చిన వారికి ఇచ్చి వివాహం చేయవచ్చును. అంతేకాక కుమార్తెలను మూకజనం యొక్క కామ తృప్తికి బలిచేయ పూనవచ్చును.[12] తండ్రి తన కుమార్తెను నీచపరచుటకు ఇతరపురుషులకు ఇవ్వవచ్చును.[13]

సంతానం కొరకు

సంతానాభివృద్ధిపై పూర్వపు సమాజాలు అన్నీ నొక్కిపెట్టాయి. దాని తీవ్రతను గమనించాలంటే ఈ గాథను గమనించాలి. లోతు తన కుమార్తెలతో ఒక గుహలోనుండెను. ఆ కుమార్తెలకు లోకధర్మం ప్రకారం వివాహమయ్యే అవకాశము లేకపోయెను. "మన తండ్రి ముసలివాడు. సర్వలోక మర్యాద చొప్పున మనతో పోవుటకు లోకములో ఏ పురుషుడును లేడు. మన తండ్రికి ద్రాక్షరసము త్రాగించి అతనితో శయనించిన మన తండ్రివలన సంతానము కలుగజేసికొందము రమ్మని" అక్క చెల్లెలితో చెప్పెను. చెల్లెలు సమ్మతించెను. వారు అట్లు చేసిరి.[14]

బహుభార్యాత్వం, ఉంపుడుగత్తెలు

బహుభార్యాత్వం ప్రబలింది ఆనాడు. సొలొమోను ఏడువందల మంది రాజకుమార్తెలైన భార్యలును, మూడువందలమంది ఉపపత్నులును

కలిగి యుండిరి.[15] "గిద్యోనుకు అనేకమంది భార్యలున్నందున కడుపున కనిన డెబ్బదిమంది కుమారులు అతనికి కలరు. షెకెములోనున్న అతని ఉపపత్నియు అతనికి ఒక కుమారుని కనగా...."[16] దావీదునకు అనేకమంది భార్యలు ఉపపత్నులు కలరు.[17] దావీదుతో నాతాను యెహోవా మాటలుగా చెప్పినాడు. "నీ యజమానుని స్త్రీలను నీ కౌగిట చేర్చి...."[18] దావీదు యొక్క పదిమంది ఉపపత్నుల కథ ఉంపుడు కత్తెల ఉనికిని ధృవపరుస్తుంది.[19] పెక్కుమంది స్త్రీలు రాజాంతఃపురములో ఉండుటను గూర్చి ఎస్తేరులో చెప్పబడియున్నది.[20] యెహోవా అజ్ఞను తెలియ జేయునప్పుడు ప్రేమింపబడు భార్యను గురించి, ద్వేషింపబడు భార్యను గురించి చెప్పెను. అంటే బహుభార్యాత్వం ఉన్నదని రుజువవుతున్నది.[21]

స్త్రీలు అనేకమంది భర్తలను కలిగియుండరాదు. మిండగాళ్ళను కలిగి ఉండరాదు. పురుషులు పెక్కుమంది భార్యలను, ఉపపత్నులను కలిగి యుండవచ్చును. భర్తలయెడ ద్రోహంగా ప్రవర్తించే భార్యలకు పరీక్షలు, శిక్షలు ఏర్పాటు. "యాజకుడు మంటికుండతో పరిశుద్ధమైన నీళ్ళు తీసికొనవలెను. నేలమీదనున్న ధూళిని కొంచెము తీసుకొని ఆ నీళ్ళలో వేయవలెను." చేదునీళ్ళను ఆమెచే త్రాగించుము. 'నీవు అపవిత్రురాలవయినచో నీ పడుముపడును నీ కడుపు ఉబ్బును' అనిచెప్పెను. ఆమె దోషి అయినచో ఆమె కడుపు ఉబ్బును.[22] ఇచట నేలమీద ధూళిని అని చెప్పినపుడు పశువులు వదలిన మలమూత్రముతో కూడిన ధూళి అని వారి కుటుంబ జీవన పరశిని పట్టి తెలుతున్నది. ఇట్టి అవహ్యకరమైన పరీక్షలచేత స్త్రీలను బాధించిరి. మలమూత్రములతో కూడిన నీరును త్రాగిన ఎవరికైనను కడుపు ఉబ్బకమానదు కదా! స్త్రీ పురుషుని వస్తువు. కనుక అతడు ఆమెను అలా హింసించవచ్చును అనాడు; అలా హింసించాడు.

భర్త సుఖం కోసం, సంతానంకోసం భార్యలు తమ పనికత్తెలను భర్తవద్దకు పంపేవారు. అబ్రహాముభార్య శారా అట్లుచేసెను.[22 (a)] రాహేలు

భర్తను ఒప్పించి తన దాసియైన బిల్హాను సంతానము నిమిత్తం యాకోబు వద్దకు పంపెను.[23] ఇట్లు ఉంపుడుగత్తెలతోనే కాక భార్యల దాసీలతో సాంగత్యం నెరపేవారు ఆనాడు.

భార్యల విధులు

ఘనురాలుగాని, అల్పురాలుగాని, స్త్రీలందరు తమ పురుషులను సన్మానించుదురు[24] ప్రతి పురుషుడు తన ఇంటికి అధికారిగా ఉండవలెను[25] అంతఃపుర స్త్రీలకు కాపలా కాయుటకు నపుంసకులుండెడివారు[26] సుబుద్ధి కల భార్య యెహోవాయొక్క దానము[27] గుణవతియైన భార్య దొరుకుట అరుదు. అట్టిది ముత్యముకంటెను అమూల్యమైనది.[28] గుణవతియగుభార్య చేయుపనుల జాబితా సామెతలు 31 అధ్యాయములో చెప్పబడినది[29] పని చేయకుండ ఆమె భోజనం చేయుదట. తన వ్యాపారలాభము అనుభవముచే తెలిసికొనునట. రాత్రివేళ ఆమె దీపము ఆరిపోదట. తాను కూడ బెట్టిన ద్రవ్యము పెట్టి ద్రాక్షతోట నాటించును. చేతులతో బలముగా పనిచేయును. అంటే ఆమె బండచాకిరీ చేయాలి. పొదుపరిగా ఉండాలి. పైకం కూడబెట్టాలి. తన ఇంటివారికి భోజనం పెట్టాలి. ఇలా ఆమెకు తీరిక లేకుండా విధులను నిర్ణయించారు ఆ కాలంలో.

క్రొత్తనిబంధన

ఆయినను జారత్వములు జరుగుచున్నందున 'ప్రతివానికి సొంత భార్య యుండవలెను'. 'ప్రతి స్త్రీకి సొంత భర్త యుండవలెనని' పౌలు చెప్పియున్నాడు[30] పౌలు భావనను జాగ్రత్తగా గమనించవలెను. వివాహం ఆనంద ప్రాప్తికోసం, జీవిత సంపూర్ణత్వం కోసం కాదు. కేవలం జారత్వ నివారణార్థమే. "నా వలె నుండుట మేలని పెండ్లికాని వారితోను, విధవరాండ్రతోను చెప్పుచున్నాను. అయితే మనస్సు నిలుప లేనియెడల పెండ్లి చేసుకొనవచ్చును. కామతప్తులగుటకంటె పెండ్లి చేసికొనుట మేలు."[31]

భార్యాభర్తల సంబంధాన్ని గురించి పౌలు ఎఫెసీయులకు రాసిన పత్రములో పేర్కొనియున్నాడు. "స్త్రీలారా ప్రభువునకువలె మీ సొంత పురుషులకు లోబడియుండుడి. క్రీస్తు సంఘమునకు శిరస్సై యుండు లాగున పురుషుడు భార్యకు శిరస్సయి యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు. సంఘము క్రీస్తునకు లోబడినట్లుగా భార్యలు కూడ ప్రతివిషయములోను తమ పురుషులకు లోబడవలెను. పురుషులారా మీరూ మీ భార్యలను ప్రేమించుడి.........మెట్టుకు మీలో ప్రతి పురుషుడును తన భార్యను ప్రేమింపవలెను, భార్యయైతే తన భర్తయందు భయము కలిగియుండునట్లు చూచుకొనవలెను.[32] (వక్కాణింపు రచయితది.)

"ఆ అబద్ధికులు, వాతవేయబడిన మనస్సాక్షి కలవారై వివాహము నిషేధించుచు....దేవుడు సృజించిన ఆహార వస్తువులను కొన్నిటిని తినుట మానవలెనని చెప్పుదురు. దేవుడు సృజించిన ప్రతి వస్తువును మంచిది. కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పుచ్చుకొనినయెడల ఏదియు నిషేధింపతగినది కాదు."[33] అని పౌలు తిమోతికి వ్రాసిన మొదటి పత్రికలో ఉంది. "దేవుడు పవిత్రము చేసినవాటిని దేనిని నీవు నిషిద్ధమైనవాటిగా ఎంచవద్దు" అని చెప్పబడి యుండుటవలన వివాహము పవిత్రమైనదిగా ఎంచవలెను.[34] వివాహము క్రొత్తనిబంధనలో నిషేధించలేదు కాని బ్రహ్మచర్యాన్ని ఉత్తమమైనదిగా పొగిడారు. పైగా ఏసు, పౌలుల ఉదాహరణలు వివాహాన్ని నిందించకపోయినా ప్రోత్సహించలేదు. వివాహం బలహీనులకు ఇవ్వబడిన అవకాశమని ఆర్యజెరోమ్ (క్రీశ. 420) ప్రకటించాడు. వివాహం కన్నా బ్రహ్మచర్యం మెరుగని యాంబ్రోజ్ (క్రీశ. 397) అభిప్రాయ పడ్డాడు.

ప్రొటెస్టెంటు శాఖలో బ్రహ్మచర్యాన్ని విధిగా చెప్పలేదు. కాని వివాహంలోని లైంగిక పవిత్రతను కాపాడాలన్నారు. 'వివాహంమనవాళ్ళకు దేవుడిచ్చినవరం. వ్యభిచారాన్ని తప్పించడానికి పెండ్లిమందు. కాని

ఇంద్రియలోలురు పోర్లాడే పందుల కొట్టంకాదు వివాహం' అని మార్టిన్ లూథర్ సెలవిచ్చాడు.[35] "స్త్రీ పురుషుల మధ్య న్యాయసంబంధమైన సంబంధం పిల్లలకోసమే. సుఖంకోసం కాదు. పిల్లలను కనడం కాక సుఖమే ఆశయమైతే వారి చర్యకు వారు దుఃఖించాలి.'' ఇది పోప్ గ్రెగరి (క్రీశ. 597) ఉవాచ.[36] 'చర్చి పెండ్లిని ఇష్టపూర్వకంగా అంగీకరించ లేదు. అందువలన దానిని అనంగీకారమైనదిగా, అసహ్యంగా చిత్రించారు' అన్నాడు బెరట్రాండ్ రసెల్.[37] "మానవ ప్రాణం సరఫరా చేయబడే స్త్రీ పురుషుల చర్యలు న్యాయసమ్మతం. అవి ఉదాత్తమైనవీ, తగినవీ. స్త్రీ పురుషుల సంకల్పాలతో నిమిత్తం లేకుండా అవి ఫలవ్రసం కాకపోయినా అవి న్యాయసమ్మతం కాకపోవు. ఎందుకంటే ఇద్దరి సంయోగాన్ని పటిష్టం చేసేవి కనుక." అని పోప్ పాల్ భావప్రకటన చేశారు.[38] అంటే స్త్రీ పురుష సంయోగం న్యాయసమ్మతం అనేదాకా వచ్చింది క్రైస్తవం.

వచ్చిన చిక్కల్లా క్రైస్తవమత ప్రచార గ్రంథాలలో వివాహం సాహచర్యం నిమిత్తమని, కుటుంబస్థాపన కోసమని, లైంగిక తృప్తికొరకని చెప్పి[39] వాటిని బైబిలు వాక్యాలతో సమర్ధించ పూనటం. అది హాస్యాస్పదం. ఆదికాండంలోని ఆదాము హవ్వల కథనుండి సాహచర్యసూత్రాన్ని వెలికితీయ ప్రయత్నించటం అక్రమం. యెహోవా ఆదాముకు ఇవ్వదలచినది కేవలము సావాసమే. సర్పంయొక్క ప్రోత్సాహంవల్ల జ్ఞానోదయమయి వారిరువురు కూడిరి. ఆదాము అవ్వల దాంపత్యజీవితాన్ని - సెక్స్ పరంగా - యెహోవా సంకల్పించలేదు. 'పవిత్రులకు అన్నియు పవిత్రములు కనుక లైంగిక ప్రేమ పవిత్రమని' చెప్పుట పదాలకున్న అర్థాన్ని మరీ పొడిగించటం అవుతుంది. కుటుంబ ప్రతిష్టాపనకన్న దైవశక్తికే ప్రాముఖ్యతను ఇచ్చింది క్రైస్తవము. భార్యాభర్తలిద్దరూ కలసి దైవప్రార్థన చేయవలెనని సూచింపబడింది. "దేహము ప్రభువు నిమిత్తమే''[40] "అది పరిశుద్ధాత్మకు ఆలయం"[41] "పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్ములను బతిమాలుచున్నాను''[42] మరోచోట "మీ ఆత్మయు,

జీవమును శరీరమును, మన ప్రభువైన ఏసుక్రీస్తు రాకడ యందు నిందారహితముగాను సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడునుగాక.[43] ఆధునిక జ్ఞాన భాండాగారంనుండి నేర్చుకొనవలసినవి తెలుసుకోకుండా ప్రాచీన గ్రంథాలకు భాష్యాలు చెప్పుకుంటూ పోతే ఆత్మవంచనకు బలియై పోగల ప్రమాదమున్నది

స్త్రీ పురుషునికి లోబడి యుండాలని పౌలు శాసించాడు. ఈ మాట యీనాటి స్త్రీలకు అయిష్టంగా ఉంటుందని క్రైస్తవమత ప్రచారకులకు తెలుసు. కాని పౌలు వాక్యాన్ని కాదనలేరు. చివరకు మనస్సును సమాధానపరచుకొని యిలా వ్రాస్తున్నారు. "అలా లొంగియుండుట నేటి ఆచారం కాకపోయినను అది దైవశాసనం,"[44] ఈ ఆదేశాన్ని లేక హితవును ఎంతమంది ఆధునిక స్త్రీలు - ఆలోచిస్తే - ఆమోదించగలరో!

పౌలు శరీరమును వేశ్యయొక్క అవయువముగా చేయవద్దన్నాడు[45] పురుషులను ఉద్దేశించి "వేశ్యతో కలిసినవాడు దానితో ఏక దేహమై యున్నాడని మీరెరుగరా" అన్నాడు.[46] "మనుష్యుడు చేయు ప్రతి పాపమును దేహమునకు వెలుపల ఉన్నదిగాని జారత్వం చేయువాడు తన సొంత శరీరమునకు హానికరంగా పాపం చేయుచున్నాడు."[47]

గ్రీకు సనాతన చర్చి అధిపతి ఎథెనాగోరస్ "ఈ ప్రపంచంలోనికి పిల్లలను తేవటానికే మనలో ప్రతి ఒక్కరం భార్యను స్వీకరిస్తున్నాం. క్షేత్రంలో విత్తం నాటి పైరుకోసం నిరీక్షించు రైతువంటివారము మనం" అనిచెప్పి వివాహంయొక్క ఉద్దేశ్యం సంతానప్రాప్తి మాత్రమేనని 1948 లో చెప్పగలిగాడు.[48] ఇలా సంతానాన్ని కనడానికి ప్రాముఖ్యత ఇచ్చారు.

1958 లో మతగురువుల సభలో 'సంతానం పొందడం ప్రాథమిక కర్తవ్యం' అనేదానిని తోసిపుచ్చారు. "వాళ్ళ (స్త్రీ పురుషుల) ప్రేమను గాఢతరం చేసేది, సంబంధాన్ని గట్టిచేసేది, వాళ్ళ శారీరక మానసిక

ఉద్రిక్తతను తగ్గించేది, వాళ్ళ వ్యక్తిగత వికాసానికి, ఐక్యతకు దోహదం చేసేది, అలాంటి సంభోగం కుటుంబం మొత్తానికి లాభదాయకం" అనేదాకా వచ్చారు కొంతరు క్రైస్తవులు. 'లేడీ ఛాటర్లీస్ లవర్' అనే పుస్తకాన్ని నిషేధించిన కేసులో ముద్దాయి తరఫున వూల్‌విచ్ బిషప్ రాబిన్ సన ఉత్తరసాక్ష్యం చెప్పాడు. "ప్రేమించు నీ యిష్టంవచ్చిన పని చెయ్యి" అన్న అగస్టిన్ వాక్యానికి ఉదార భాష్యం చెప్పాడు. "దేనినీ దాని స్వరూపాన్ని బట్టి చెడుగా నిర్ణయించలేము. పెండ్లికి పూర్వం లైంగిక సంబంధాలు గాని, విడాకులుకాని వాటంతట అవి తప్పుకావు. పాపంకాదు. 100 కి 99 కేసులలో అది నిజం కావచ్చు. కాని అంతర్గత కారణాలవల్ల మాత్రం కాదు. అంతర్గతంగా చెడు ఏమంటే ప్రేమలేకపోవడమే" అని చెప్పాడు రాబిన్‌సన్.[49] ఈ భావాలు కలవారిని తీవ్రవాద (Radical) క్రైస్తవులనవచ్చు. ఏదైనా మౌలికమైన వాక్యాలు విరుద్ధంగా ఉంటే ఉదార భాష్యాలు చెప్పుకుని తృప్తిపడటం ప్రమాదకరధోరణి అవుతుంది.

క్రైస్తవుల వివాహాలలో జరిగే ప్రమాణాలను గుర్తించటం అవసరం. 'నేను నిన్ను ప్రేమించి, గౌరవించి, నీకు విధేయురాలుగా ఉంటాను' అని వధువు అంటుంది. 'నేను నిన్ను ప్రేమిస్తాను, నాదిగా భావించు కుంటాను' అని వరుడు అంటాడు. ఆధునిక క్రైస్తవ ప్రచారక గ్రంథాల్లో సంబంధాన్ని ఇలా చిత్రించారు.

	భర్త	భార్య
హోదా	అధికారి, యజమాని	విధేయురాలు
బాధ్యత	ప్రేమించుట, తనదిగా భావించుట, పోషించుట	గౌరవించి, పూజ్యభావం ప్రదర్శించుట
మౌలికలక్షణం	ఏకత్వం	ఏకత్వం[50]

వ్యభిచారము ఇప్పటికీ నింద్యమే. అట్లమట పహేతుకమే. స్త్రీ యొక్క శరీరము భర్తది అనే క్రైస్తవ భావనవల్ల కాక స్త్రీ పురుషుల పరస్పర విశ్వాసానికి అఘాతమనే భావంతో దానిని ఖండిస్తున్నాం. ఖండించాలి.

పాత నిబంధన కాలములో సంతానం లేకుండా ఏ పురుషుడైనా చనిపోతే అతనిభార్య అతని సహోదరుని వివాహమాడి సంతానం పొంద వచ్చును. ఈ ఆచారం క్రీస్తు నాటికి ఉంది. అందువలన సద్దూకయ్యులు కొందరు దానివిషయమై చిక్కుప్రశ్న వేసి ఏసును ఇబ్బంది పెట్టజూచిరి. దానికి డొంకతిరుగుడు సమాధానం చెప్పి ఏసు తప్పించుకొనెను. ఏదైనను ఈ ఆచారము తరువాత నశింపు అయినది.[51] దీనినే నియోగం అనే పేరుతో హిందూ యిజంలోకూడా మనువు ప్రతిపాదించాడు అనాడు.

భారత క్రైస్తవ సమాజంలో వివాహానికి పూర్వం కన్యాత్వ రక్షణ చేసుకోవాలనే ఉద్బోధ సాగుతున్నది. ప్రధానమయిన తరువాత కూడ స్త్రీ పురుషులు ఆకర్షణీయమైన లైంగిక చర్యలకు గడంగరాదని హితవు చెప్పబడుచున్నది. దానికి ఆధారముగా "ప్రతి దానికి సమయము కలదు. ఆకాశముక్రింద ప్రతి ప్రయత్నమునకు సమయము కలదు. పుట్టుటకు చచ్చుటకు,........కౌగిలించుటకు కౌగిలించుట మనుటకు ....యుద్ధము చేయుటకు సమాధానపడుటకు"[52] ఇలాంటి హితవు క్రైస్తవ మత ప్రచార గ్రంథాలలో ఉంటున్నది.[53] క్రైస్తవ సమాజాలు మారుతున్నాయి. వివాహపూర్వ కన్యాత్వంపై బ్రిటను అమెరికాలలో అంత శ్రద్ధలేదు. ఏదైనను దీనిపై అభిప్రాయం దేశ కాల పాత్రనుబట్టి ఒరులకు నష్టమూ, ఇబ్బందీ కలుగరాదనే సూత్రాన్ని బట్టి ఉంటుంది; ఉండాలి.

క్రైస్తవ వివాహం తతిమ్మా మత వివాహాలకంటే ఉత్కృష్టమయిన దేమీ కాదు. తతిమ్మా మతవివాహాలవలె ఇందులోనూ పురుషాధిక్యతా భావం ప్రబలంగా ఉంది. సంతాన ప్రాప్తిమీద, దైవపూజమీద నొక్కు కన్పడుతున్నది. స్త్రీ పురుషుల మధ్య పరస్పర విశ్వాసం, సన్నిహితత్వం,

మేధోపరమైన, ఉద్వేగ పరమైన సంయోగం, లైంగికానందం వీటికి ప్రాధాన్యత తక్కువగా కన్పట్టుతున్నది. వివాహమాడటం, సంతానం కనడం, కాపురం చేయటం సర్వమూ దేవుని కొరకే. పరలోక ప్రాప్తి కోసమే. ఈ భావం ఐహికానందాన్ని వమ్ము చేస్తున్నది. భార్యాభర్తలను యెహోవాకు బలి చేస్తున్నది.

రోమను సామ్రాజ్యకాలంలో వివాహం మూడు రకాలుగా జరిగేది. పదిమంది సాక్షుల ఎదుట మతగురువుచేత పెళ్ళి, స్త్రీ పురుషునితో ఒక సంవత్సరం కాపురంచేస్తే పెళ్ళి అయినట్లు లెక్కగా ఒకర్ని ఒకరు డబ్బిచ్చి కొనుగోలు చేయటం ద్వారా వివాహాలు జరిగేవి. యూదా జాతివారిల్లో తండ్రి నియమించిన వరుని వధువు విధిగా వివాహమాడాలి. వివాహం మతకర్మయుతమైంది. సాధువులసంఖ్య పెరిగింది. మరోవైపు వ్యభిచారం సాగింది. స్త్రీలు క్రైస్తవాన్ని స్వీకరించారు. స్త్రీలు పాల్గొనకుండా ప్రపంచం మొత్తంమీద ఏ ఉద్యమమూ సాగలేదు. అనేకమంది స్త్రీలు రాజులను క్రైస్తవంలోకి మార్చడానికి రాణులు సాయపడ్డారు. హంగ్‌రీలో మున్ముందుగా క్రైస్తవాన్ని స్వీకరించారు. కాని స్త్రీలు సంపాదించుకున్నదేమిటి? పురుషాధిక్యత, హింస, అనుమానాలు. పెళ్ళిని చర్చి చేపట్టింది. పెళ్ళిళ్ళలో స్త్రీలకు దాస్యాన్ని చేకూర్చింది.

ఈనాడు క్రైస్తవ వివాహాలు భారత క్రైస్తవ వివాహ శాసనం (1872) క్రింద జరుగుతున్నాయి. వధూవరులలో ఏ ఒకరు కాని ఇద్దరు కాని క్రైస్తవులయితే వారి వివాహం ఈ శాసనం క్రింద జరుపవచ్చును. వివాహాన్ని చేయటానికి ఐదుగురు అధికారులై యున్నారు. ఏదో ఒక చర్చిలో మతగురువు, స్కాట్లండ్ చర్చిలో మతగురువు, ఈ శాసనంక్రింద నియమింపబడిన వివాహాల అధికారి, భారత క్రైస్తవుల మధ్య వివాహాలకు సర్టిఫికెట్లు ఇవ్వడానికి ప్రభుత్వాధికారాన్ని పొందినవారు ఈ 5 గురిలో ఎవరైనా పెండ్లి జరిపించవచ్చును. రాష్ట్ర ప్రభుత్వము ఏ క్రైస్తవుని అయినా వివాహాల రిజిష్ట్రారుగా నియమించవచ్చును. జిల్లాలో ఒకే వివాహాల రిజిష్ట్రారు ఉండి అతని పదవి ఖాళీగా ఉన్నా లేక అతడు

అస్వస్థుడుగా ఉన్నా జిల్లా మెజిస్ట్రేటు వివాహాల రిజిష్ట్రారుగా వ్యవహరించవచ్చును. సాధారణంగా వివాహం ఉదయం ఆరుగంటలనుండి సాయంత్రం ఏడుగంటలలోపున జరుపవలెను. సాధారణంగా ఇంగ్లండు చర్చి మతగురువు ఆవరణలోనే వివాహం జరుపవలెను. ఒక నెలరోజులు వధూవరులలో ఒకరు ఒక ప్రదేశంలో కాపురమున్నచో తమ వివాహానికి నోటీసు ఇవ్వగలరు. అది ప్రకటింపబడుతుంది. వధూవరులలో ఎవరైనా మైనరైనచో వారి తండ్రి లేక సంరక్షకుని సమ్మతి కావలెను. శాసనం యొక్క 5 లేక 6 వ భాగం క్రింద కాక ఇతరత్రా జరిగే వివాహాలలో వధూవరులలో ఏ ఒకరైనగాని ఇద్దరైనగాని క్రైస్తవమతస్థులై యుండాలి. 6 వ భాగం క్రింద వివాహమాడదలిస్తే వరునికి 21 సంవత్సరాలు నిండాలి. ఇద్దరు సాక్ష్యులఎదుట, దేవునిపేర, ఏసుక్రీస్తు పేరవారు ప్రమాణాలు చెయ్యాలి. పెండ్లి నాటికి వధూవరులలో ప్రతి ఒక్కరికి భార్యగాని భర్తగాని బ్రతికి యుండరాదు. 6 వ భాగం క్రింద వివాహం చేసుకునే వధూవరులు ఇరువురు క్రైస్తవులై యుండవలెను. ఈ శాసనం పురాతనమైనది. దీనిని మార్పుచేయవలసి యున్నది. 'లా' కమిషన్ మార్పులు సిఫారసు చేసినది. కాని ఇంతవరకు తత్సంబంధమైన కృషి ఏమీ జరుగలేదు.

6 వ అధ్యాయం : రిఫరెన్సులు

1. ఆదికాండము	2 : 18
2. ఆదికాండము	24 : 3 - 65
3. న్యాయాధిపతులు	21 : 10 - 14
4. ద్వితీయోపదేశ కాండము	22 : 28, 29
5. II సమూయేలు	11 - 2 - 27
6. నిర్గమ కాండము	21 : 7, 8, 9
7. ద్వితీయోపదేశ కాండము	25 : 5 - 10
8. న్యాయాధిపతులు	21 : 19 - 24
9 ద్వితీయోపదేశకాండము	22 : 13 - 21
10. ,, ,,	22 : 22
11. ,, ,,	22 : 23, 24
12. ఆదికాండము	19 : 1 - 8
13. న్యాయాధిపతులు	19 : 23 - 25
14. ఆదికాండము	19 : 30 - 38
15. I రాజులు	11 : 3
16. న్యాయాధిపతులు	8 : 30, 31
17. II సమూయేలు	5 : 13
18. II సమూయేలు	12 : 8
19. ,, ,,	20 : 3
20. ఎస్తేరు	2 : 2, 12 - 14, 17
21. ద్వితీయోపదేశకాండము -	21 : 15
22. సంఖ్యాకాండము	5 : 21, 22, 27
22. (a) ఆదికాండము	16 : 1 - 6
23. ,,	30 : 1 - 5
24. ఎస్తేరు	1 : 20
25. ఎస్తేరు	1 : 22

26. ఎస్తేరు 2 : 3
27. సామెతలు 19 : 14
28. ,, 31 : 10
29. ,, 31 : 13 – 31
30. 1 కొరింథీయులకు 7 : 2
31. ,, ,, 7 : 8, 9
32. ఎఫెసీయులకు 5 : 22 – 33
33. తిమోతికి 4 : 3 – 5
34. అపోస్తలుల కార్యములు 10 : 15
35. 'కాంట్రవర్సీ' : హెక్టర్ హాటన
36. ,,
37. ,,
38. ,,
39. సెక్స్, లా అండ్ మ్యారేజి
40. 1 కొరింథీ – 6 : 13
41. 1 కొరింథీ 6 : 20
42. రోమా 12 : 1
43. 1 థెస్సలొనీకయులకు 5 : 23
44. సెక్స్, లా అండ్ మ్యారేజి పుట 49
45. 1 కొరింథీ – 6 : 15, 17
46. ,, 6 : 16
47. ,, 6 : 18
48. వుమెన్ అండ్ ఎథియిజం పుట 15
49. కాంట్రవర్సీ : హెక్టర్ హాటన్ – ఈ పుస్తకంలో 'చరిత్రలో క్రైస్తవం' అనే అధ్యాయం.
50 క్రిస్టియన్ ఫామిలీ, 3 వ అధ్యాయం – ఎడల్ఫు బైబిలు ష్లడిప్.
51. లూకా 20 : 27 – 40
52. ప్రసంగి 3 : 1 – 8
53. "సెక్స్, లా అండ్ మ్యారేజి"

7

విడాకులు, మనవర్తి, పునర్వివాహం

ఎవరి హోదాతోను నిమిత్తం లేకుండా అందరూ చేరవచ్చునని చెప్పటం వల్ల క్రైస్తవం రోములో పెరుగనారంభించింది. రోమను శాసనాలు కుటుంబాలను గురించి ఆలోచించాయి. కాగా ఒక్క రోమన్ చక్రవర్తి జష్టినియన్ మాత్రం ఇలా అన్నాడు. "పెళ్ళి ప్రేమమీద ఆధారపడుతుంది కనుక ప్రేమ ఎగిరిపోతే పెళ్ళి రద్దుకావాలి." ప్రొటెస్టెంటు మతం వచ్చేవరకు మళ్ళీ ఇలాంటి అభిప్రాయం వినపడలేదు.

కొన్ని శతాబ్దాలు పోయిన తరువాత కాని పెళ్ళిని క్రైస్తవమతం పట్టించుకోలేదు. తరువాత పెళ్ళి ప్రమాణాలను చేయించే బాధ్యతను చర్చి స్వీకరించింది. విశ్వాసం అనే భావాన్ని జోడించింది. దాంతో పెళ్ళిని రద్దు చేయటానికి వీలులేని స్థితి కలిగింది. ఆర్య అగస్టీన్ వల్ల పెళ్ళి ఒప్పుదల కాకుండా పవిత్ర సంస్కారపు స్థాయికి చేరింది. ముందు లౌకిక వివాహాలు జరిగేవి. తరువాత చర్చి ఆమోద ముద్ర వేసేది. క్రీశ. 907 నాటికి 'పెళ్ళిని రద్దు చేయరాదు' అనేభావం గట్టిపడింది. 11 వ శతాబ్దం నాటికి పెళ్ళి సప్త పవిత్ర కర్మలలో ఒకటయింది.

కేథలిక దృష్టి ప్రకారం పెళ్ళి పిల్లలను కనడానికి, మానవ జీవితాన్ని పవిత్రం చేసుకోవడానికి ఉద్దేశింపబడినది. భగవంతుని సన్నిధిలో పెళ్ళి జరగాలి.

వివాహాలు దేవునిచేత నిర్ణయింపబడతాయనే భావన ఉన్నందున విడాకులను మానవమాత్రులు రద్దు చేసే ప్రశ్న లేదు. చనిపోయిన తర్వాత స్వర్గంలో ఒకవ్యక్తి అనేకమంది భార్యలను కాని భర్తలనుకానీ కలిసే అవకాశం, తద్వారా కల్గే చికాకు లేకుండా చేయటానికి విడాకులను కాదన్నారు.

రిఫర్మేషను కాలంవరకు పశ్చిమ యూరపు మత భావనాలకిగిందనే ఉంది. పెండ్లి విషయంలో లూథర్ కాల్వినీలు దేశరాజ్యాల అధికారాన్ని బలపరిచారు. మరణం మాత్రమే వివాహాన్ని రద్దుచేయుగలదనే అభిప్రాయాన్ని త్రోసిరాజన్నారు ప్రొటెస్టెంటులు, వివాహాన్ని పవిత్ర సంస్కారంగా పరిగణించటం మానివేశారు. అందువల్ల పెండ్లి, విడాకులు అనే వాటిపై వ్యక్తిగత దృష్టి సారించారు. దంపతులలో ఒకరు వ్యభిచరిస్తే విడాకులు పొందడానికి అది కారణంగా అంగీకరించబడింది. ఇంగ్లండు రాజు ఎనిమిదవ హెబ్రీ తన భార్య కాథరీనును వదలివేయాలనుకుంటే పోపు సమ్మతించకపోతే ఇంగ్లండులో ప్రొటెస్టెంటు మతశాఖ ఉద్భవించింది.

1563 లో ట్రెంట్‌లో మతగురువుల సమావేశం జరిగింది. మత గురువుల ఆధ్వర్యంలో జరిగే వివాహాన్ని మాత్రమే చర్చి గుర్తిస్తుందని తీర్మానించారు. ఫ్రెంచి విప్లవం జరిగేవరకు వివాహం మత తంతులోనే సాగింది. 1792 లో ఉదారమైన విడాకుల భావనం వచ్చింది. వ్యక్తి తన భవిష్యత్తును తనే నిర్మించుకోవాలనే భావనకు అనుగుణంగా విడాకులు పొందే పద్ధతి కావాలన్నారు. చర్చికి ప్రభుత్వానికి మధ్య పోటీ వచ్చింది. మత తంతు ముందుగా జరిగే ఆ పెండ్లి చెల్లదనేదాకా వచ్చింది మార్పు.

క్రైస్తవ సంస్కారవాదులు వివాహంలో స్నేహానికి విలువ ఇచ్చారు. బ్రహ్మచర్యం కన్నా గృహస్థాశ్రమం గొప్పదని ప్రకటించారు. పౌలు భావానికి విరుద్ధంగా వీరు సంచరించారు.

ప్రొటెస్టెంట్లలో తీవ్రవాదులయిన ప్యూరిటనులు కొన్నిసంవత్సరాలు ఇంగ్లండులో బలపడ్డారు. సంస్కారవాదులు భావాలను త్రోసిరాజన్నారు. మత తంతుకు ప్రాధాన్యత ఇవ్వసాగారు. దేవునివల్ల విశ్వాసం ప్రథమ స్థానం అలంకరించింది. సమష్టి ప్రయోజనాలకోసం వ్యక్తిత్వ వాంఛను చంపుకోవటం మంచిదని ప్రచారం జరిగింది. ప్యూరిటన్ల దృష్టిలో పెండ్లి అందరికీ సంబంధించిన విషయం. అందరూ ఆ సంస్కారానికి లోను కావలసిందే.

12 వ శతాబ్దంలో వ్యాప్తి చెందిన అమలిన శృంగార భావన 19 వ శతాబ్దంలోని రొమాంటిక్ ఉద్యమంగా రూపొందింది. 12 వ శతాబ్దంలో వివాహ బంధానికి వెలుపలి ఉన్నవ్యక్తితో లైంగిక సంబంధం నింద్యం కనుక ప్రేమ సాఫల్యత అసాధ్యంగా కన్పడింది. ఉద్వేగం, విశ్వాసం ఈ రెంటిమధ్య వివాహ స్వభావము కొట్టుమిట్టాడింది.[1] వివాహ బంధంలో ఉద్వేగం, విశ్వాసం నశిస్తే విడాకులు తప్పనిసరి అయిన స్థితి వచ్చింది. ఇది వివాహముయొక్క విడాకులయొక్క, పరిణామచరిత్ర.

పాతనిబంధన కాలంలో పురుషుడు స్త్రీకి పరిత్యాగ పత్రం రాసి యిచ్చి తనయింటనుండి ఆమెను పంపివేసేవాడు. ఆమెయందు మానభంగ సూచన కన్పడితే అలా చేయవచ్చు. తరువాత ఆమె మరల వేరొక పురుషుని వివాహమాడవచ్చు. రెండవ పురుషుడు చనిపోయిన యెడల ఆమెను మొదటిపురుషుడు తిరిగి వివాహమాడరాదు.[2] (ద్వితీయోపదేశకాండము 24 : 1 - 4)

పురుషుడు పరిత్యాగ పత్రము వ్రాసి యిచ్చినపుడు భార్యకు మనవర్తి విషయమై నిబంధనలు లేవు. స్త్రీ పురుషునికి విడాకులివ్వ వీలు లేదు. పురుషుడు మాత్రము భార్యను తేలికగా వదలించుకొనవచ్చును. పురుషుడు యుద్ధములో చెరపట్టి తెచ్చిన స్త్రీని ఆమె తన తల్లిదండ్రులను గూర్చి ఒక నెలరోజులు ప్రలాపం చేసిన తరువాత అతడు ఆమెను వివాహ మాడవచ్చును. "నీవు ఆమెవలన సంతుష్టి పొందనియెడల ఆమె మనస్సు వచ్చినచోటికి సాగనంపవలెను గాని నీవు ఆమెను ఎంతమాత్రము వెండికి అమ్మకూడదు.[3] (ద్వితీయోపదేశకాండము 21 : 10 - 14) అబ్రహాము తన భార్య అయిన శారా యొక్క దాసి హాగరుతో సంభోగించగా ఆమెకు సంతానం కలిగెను. తరువాత హాగరును వెళ్ళగొట్టుమని శారా కోరెను. ఆమె కోరికను మన్నించి "కాబట్టి తెల్లవారినప్పుడు అబ్రహాము లేచి ఆహారమును నీళ్ళతిత్తిని తీసికొని ఆ పిల్లవానితో కూడ హాగరునకు అప్పగించి ఆమె భుజముమీద పెట్టి ఆమెను పంపివేసెను."[4] (ఆదికాండము 21 : 8 - 14) అన్యదేశ స్త్రీలను ఇశ్రాయేలీయులు పెండ్లి చేసుకొనగా వారిని విసర్జించమని యాజకుడైన ఎజ్రా దేవుని పేరుతో ఇశ్రాయేలీయులకు ఆదేశించెను. వారు అట్లుచేసిరి.[5] (ఎజ్రా 10 : 2 - 17) అన్యస్త్రీలను ఇశ్రాయేలీయులు వివాహమాడితే పవిత్రతను కాపాడే నిమిత్తం వారిని వదలి పెట్టమని నెహెమ్యా వారికి ఆజ్ఞయిచ్చెను.[6] (నెహెమ్యా 13 : 23 - 30)

క్రొత్తనిబంధన

'తన భార్యను విడనాడు వాడు ఆమెకు పరిత్యాగ పత్రిక యివ్వవలెనని చెప్పబడియున్నది కదా; నేను మీతో చెప్పునదేమనగా — వ్యభిచార కారణమును బట్టిగాక, తన భార్యను విడనాడు ప్రతివాడును ఆమెను వ్యభిచారిణిగా చేయుచున్నాడు; విడనాడబడిన దానిని పెండ్లాడువాడు వ్యభిచరించుచున్నాడు."[7] (మత్తయి 5 : 31, 32)

"తన భార్యను విడనాడి మరియొకతెను పెండ్లి చేసుకొనువాడు తాను విడనాడిన ఆమె విషయమై వ్యభిచరించిన వాడగును. మరియు స్త్రీ తన పురుషుని విడనాడి మరియొకనిని వివాహం చేసుకొనిన యెడల ఆమె వ్యభిచరించునదగునని (ఏసు) వారితో చెప్పెను."[8]

పరిసయ్యులు ఏసును శోధింపవలెనని అనేక ప్రశ్నలు వేసిరి. పరిత్యాగ పత్రికను వ్రాసియిచ్చి భార్యను విడినాడుమని మోషే ఎందుకు చెప్పెనని వారు ప్రశ్నించిరి. "ఆయన (దేవుడు) - సృజించినవాడు ఆదినుండి వారిని పురుషునిగాను స్త్రీనిగాను సృజించెననియు।- ఇందు నిమిత్తము పురుషుడు తల్లిదండ్రులను విడిచి తన భార్యను హత్తుకొనును, వారిద్దరును ఏక శరీరముగా ఉన్నారు గనుక దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరుపరచకూడదని చెప్పెను. । అందుకు వారు - అలాగైతే పరిత్యాగ పత్రికనిచ్చి ఆమెను విడనాడుమని మోషే యెందుకు అజ్ఞాపించెనని వారాయనను అడుగగా । ఆయన - మీ హృదయ కాఠిన్యమును బట్టి మీ భార్యలను విడనాడ మోషే సెలవిచ్చెను, గాని ఆదినుండి అలాగు జరుగలేదు । మరియు వ్యభిచారము నిమిత్తమే తప్ప తన భార్యను విడనాడి మరియొకతెను పెండ్లి చేసికొనువాడు వ్యభిచారం చేయు చున్నాడనియు, విడనాడిన దానిని పెండ్లి చేసుకొనువాడు వ్యభిచారం చేయుచున్నాడనియు మీతో చెప్పుచున్నానని వారితో ననెను।."[9] (మత్తయి 19 : 5 - 9)

"వివాహము అన్నివిషయములలో ఘనమైనదిగాను పానుపు నిష్కల్మషమైనదిగాను ఉండవలెను. వేశ్యాసంగులకును, వ్యభిచారులకును, దేవుడు తీర్పు చెప్పును"[10] (హెబ్రీయులకు 13 : 4) దీనిని బట్టి వివాహ బంధాన్ని తేలికగా తీసిపారవేయురాదని అర్థం తెలుతున్నది.

అవిశ్వాసితో విశ్వాసికి పొత్తుకుదరదు.[11] కనుక అవిశ్వాస స్త్రీలను వివాహమాడవద్దని ఈనాటి క్రైస్తవ ప్రచారము. పాతనిబంధనలో

చెప్పబడిన 'అన్యస్త్రీల విడనాడుము' అనే వాక్యాన్ని పొడిగించటమే ఇది. కాగా అవిశ్వాసులను విడనాడుమని చెప్పిన వాక్యము కాజాలదు.

విడాకులకోసం స్త్రీలు చేసిన పోరాటాల ఫలితంగా ఐరోపా, అమెరికాలలో విడాకులు పూర్వంకన్న తేలికగా - అంటే వ్యభిచారం ఒక్కటే కాక ఇతర కారణాలకు కూడా లభిస్తున్నాయి. మనస్సులు కలవలేదనేది కూడ కారణభూతంగా నిర్ణయించారు విడాకులివ్వటానికి.

భారతదేశ పరిస్థితి వేరు. బ్రిటిషువారిచే పరిపాలింపబడిన దేశం కనుక ఆలాటి బ్రిటిషు ఆచారాలను అనుసరించి విడాకుల చట్టము రూపొందించింది. అది భారత విడాకుల చట్టము (Indian Divorct Act 1869 - 1869 లోని కేంద్రపు నాలుగవ శాసనం) అని పిలువబడుచున్నది. అది ఎంతో పురాతనమయినది. ఈలోగా బ్రిటిషువారు తమ స్వంత దేశములో తమ శాసనాలను ఎంతో సరళంగా, ఉదారంగా మార్చుకున్నారు. కాని 1947 లో వారు వెళ్ళిపోయే వరకు దీనిని మార్చటానికి వారు పూనుకోలేదు. 1950 లో భారతదేశ రాజ్యాంగం అమలులోకి వచ్చింది. మౌలికహక్కులు అందులో పొందుపరచబడినాయి. 1869 శాసనపు నిబంధనలు మౌలికహక్కులకు వ్యతిరేకంగా ఉన్నాయి. అయినా ఇంతవరకు ఆ శాసనం మార్పుకాలేదు. అల్పసంఖ్యాకుల మత ధర్మ శాసనాలను వారి సమ్మతి లేకుండా మార్చరాదనే పొరపాటు అభిప్రాయంతో స్వదేశ ప్రభుత్వాలు కూడా దీని సవరణ విషయమై పట్టించుకోవటం లేదు. వివాహం లౌకిక ధర్మమయినపుడు దానిని మతధర్మ శాసనాలకు ఎందుకు బలిచేయాలో అర్థం కావడంలేదు. ఇటీవల భారతదేశపు సుప్రీంకోర్టు ఈ శాసనం పాతదని, బూజుపట్టినదని, కాలం చెల్లినదని అభిప్రాయ ప్రకటన చేసింది. 'ప్రగతిశీలమైన ప్రభుత్వం మాది' అని చెప్పుకునే వారు ఇలా ఉపేక్షించటం క్షంతవ్యం కాదు.

1869 విడాకుల శాసనంలో లోపాలు

(1) ఇరుపార్టీలతో ఎవరో ఒకరు క్రైస్తవమతానికి చెంది ఉండాలి ఈ క్లాజు విషయంలో ఇంకా స్పష్టత ఉండాలి. ప్రత్యేక వివాహ శాసనం క్రింద వివాహితులు కాని వారికి చెల్లుతుంది అని వ్రాయాలి.

(2) స్త్రీ పురుష వివక్ష ఉంది. భార్య వ్యభిచరించినదనే కారణాన భర్త విడాకులు కోరవచ్చును. కాని భార్యకు ఇబ్బందులు అధికం. ఆమెకు విడాకులు కావాలంటే ఆమె రెండు కారణాలను సూచించి రుజువు చేయాలి;

(I) భర్త మతం మార్చుకొని మరొక స్త్రీని వివాహమాడుట;

(II) వ్యభిచారమే కాక దగ్గర బంధువులతో వ్యభిచారం;

(III) వ్యభిచారము + ద్వితీయ వివాహము;

(IV) మరొక స్త్రీతో వివాహము + వ్యభిచారము;

(V) స్త్రీని చెరచుట, ఏకలింగ సంపర్కము, లేక జంతువుతో లైంగిక సంపర్కం;

(VI) వ్యభిచారము + భార్యయెడ క్రూరమైన నడవడి;

(VII) వ్యభిచారము + సహేతుకమైన కారణము లేకుండా రెండు సంవత్సరాలు భార్యను విడనాడుట.

(3) విడాకులకోసం దరఖాస్తు జిల్లా జడ్జి కోర్టులో పెట్టుకోవలెను. సబ్ కోర్టులో అయితే మంచిది.

(4) జిల్లా జడ్జి ఉత్తరవును హైకోర్టు ధృవపరిస్తేనే అది చెల్లుతుంది. ఇది ఆలస్యానికి కారణ భూతమవుతుంది.

(5) హైకోర్టులో ఇద్దరు న్యాయమూర్తులు ధర్మాసనంలో కూర్చొని తీర్పు చెప్పాలి. ఇది అంత త్వరగా జరుగదు.

(6) కాపురమునకు రమ్మనమనే ఉత్తరువును పొంది, ఆ ఉత్తరువును ఆమోదించి లోబడని వ్యక్తిపై ఆస్తి జప్తువేయుటద్వారా అమలు జరుపుటకు హక్కు ఉన్నది. ఈ బలవంతం ఆధునిక న్యాయ సూత్రాలకు విరుద్ధము.

(7) భార్యతో వ్యభిచరించిన వానినుండి భర్త నష్టపరిహారం పొంద వచ్చును. భార్య దేహం భర్తది అనే ఆటవిక సూత్రఫలితమది. ఇలా ఎన్నో ఇతర లోపాలు కూడా ఉన్నాయి ఈ శాసనంలో.[12]

పునర్వివాహము

ఈనాడు విడాకులు పొందిన క్రైస్తవ స్త్రీ పురుషులు మరల వివాహ మాడవచ్చును.

భర్త చనిపోయినపుడు స్త్రీ మరల వివాహమాడవచ్చును. పాత నిబంధన రూతు కథలో ఇది ద్యోతక మవుతుంది. అంతేగాక క్రొత్త నిబంధనలో ఇలా ఉంది. "మనుష్యుడు బ్రతికినంతకాలమే ధర్మశాస్త్ర మతనిమీద ప్రభుత్వము చేయుచున్నదని మీకు తెలియదా? ధర్మశాస్త్రము ఎరిగిన మీతో మాటలాడుచున్నాను। భర్త గల స్త్రీ బ్రతికి యున్నంత వరకే ధర్మశాస్త్రం వలన అతనికి బద్ధురాలుగాని, భర్త చనిపోయినయెడల భర్త విషయమైన ధర్మశాస్త్రమునుండి ఆమె విడుదల పొందును। కాబట్టి భర్త బ్రదికియుండగా వేరొక పురుషుని చేరినయెడల వ్యభిచారిణి యనబడును గాని, భర్త చనిపోయినయెడల ఆమె ధర్మశాస్త్రమునుండి విడుదల పొందెను గనుక వేరొక పురుషుని వివాహం చేసికొనినను వ్యభిచారిణి కాకపోవును।"[13] ఈ సందర్భంగా విధవా వివాహానికి సమ్మతించిన క్రైస్తవం హిందూమతం కన్న మెరుగు. బ్రిటీషువారి ధర్మమా యని హిందూ విధవల పునర్వివాహ శాసనం (1856) వచ్చు వరకు హిందూ విధవలకు పునర్వివాహపు హక్కు లేదు. నిండు జీవితాన్ని వైధవ్యంలో గడపవలసిందే.

విడాకుల విషయంలో క్రైస్తవ సంఘం చాల వెనుకబడి వున్నది. ప్రత్యేక వివాహ శాసనం (Special Marriage Act 1954), పార్సీ వివాహము మరియు విడాకులచట్టం (The parsi Marriage and divorce Act 1936), హిందూ వివాహ శాసనం (Hindu Marriage Act 1955) చాల ముందడుగు వేసినయి. ఆ మాటకువస్తే ముసల్మానుల శాసనం (The dissolotion of Muslim Marriage Act VII of 1939) కూడ క్రైస్తవులకు వర్తించే భారత విడాకుల చట్టం (1869) కన్న ఎంతో మెరుగగా ఉంది

7 వ అధ్యాయం : రిఫరెన్సులు

1. 'న్యూవెడ్డింగు' ఖోరెన్ అరిసయిన్ (Khoren Arisain)	
2. ద్వితీయోపదేశకాండము	24 : 1 - 4
3 " "	21 : 10 - 14
4. ఆదికాండము	21 : 8 - 14
5. ఎజ్రా	10 : 2 - 17
6. నెహెమ్యా	13 : 23 - 30
7. మత్తయి	5 : 31, 32
8. మార్కు	10 : 11, 12
9. మత్తయి	19 : 5 - 9
10. హెబ్రీయులకు	13 : 4
11. II కొరింధీ	6 : 14
12. Indian Divorce Act	1869
13. రోమా	7 : 1 - 4

8 హింస

క్రైస్తవమతం స్త్రీలయెడ చాలహింసాత్మకంగా వ్యవహరించింది. హింస పలురకాలుగా ఉంటుంది. శారీరక హింస, మానసిక హింస, న్యూనత పరిచే హింస ఇలా ఎన్నో విధాలుగా మనిషిని హింసించవచ్చును. బలవంతంగా అణచివేత కూడా హింసక్రిందికే వస్తుంది. ఆమెను వస్తువుగా చూడటం కూడా హింసయే.

పాతనిబంధన కాలంలో స్త్రీని చెరచిన వారికి - ఆమె ప్రధానం కాని కన్య అయితే - ఆమెను ఇచ్చి పెండ్లి చేస్తారు. ప్రధానము చేయుబడిన స్త్రీతో, మగనాలితో సంగమించిన పురుషునకు మరణదండన విధిస్తుంది మత శాసనం. అంటే స్త్రీ ఒకరి ఆస్తి అయినప్పుడు దానిని తాకరాదు. అలాకాక ప్రధానంకాని కన్య అయినప్పుడు ఆమె అందరిసొత్తూ అనే భావం గోచరమవుతున్నది. ఆమెను వ్యక్తిగా చూడలేని గుడ్డితనం ఇది.

భార్య భర్త కోరికను ఏనాడు పాన్పుపై తీర్చకపోతే ఆనాడు ఆమెను అతడు జైలులో పెట్టించగలిగేవాడు. అంతేకాక ఆమె ఏ తప్పిదం అతని దృష్టిలో - చేసినా ఆమెను దండించే అధికారం ఉంది. కాగా ఆమెను దెబ్బలు కొట్టటానికి వాడే కర్ర మందము వ్రేలి మందాన్ని

మించరాదట. ఎంతటి ఔదార్యం! ఆమె దెబ్బలుతింటూ ఆమెను బాధిస్తున్న బెత్తాన్ని ముద్దు పెట్టుకోవాలట. చర్చిలలో ఇలాంటి బోధలు చేశారు. 14:7 లో బెర్నార్డిన్ అనే మతాధికారి స్త్రీలపై దయపూని ప్రతి చిన్న కారణానికి ఆమెను కొట్టరాదన్నాడు. మధ్యయుగంలో స్త్రీలపై జరిగిన హింసాకాండ ఇంతింత కాదు.

స్త్రీలను అచ్చంగా మంత్రగత్తెలనే కారణం మీదనే తగలవెయ్యలేదు. ఇతర కారణాలు కూడా ఉన్నాయి. మతగురువుకు ఎదురు చెప్పడం, దొంగతనం చేయుటం, వ్యభిచారం లేక పడుపువృత్తి సాగించటం, తన దేహాన్ని తను మర్దన చేసుకొని సుఖం పొందటం, తిట్టటం, ఘనపెట్టటం, వెలిచవి వల్ల సంతానాన్ని కనడం ఇవన్నీ స్త్రీలను మంటలో కాల్చడానికి సాకులు. పురుషులు మత సిద్ధాంతాన్ని నమ్మకపోతే వారిని గొంతులు నులిమి చంపేవారు. అదే అట్టివారు స్త్రీలయితే తగలేశావారు. 'మత రక్షణార్థం' జరిపిన హింసాకాండ (Inquisition) లో స్త్రీలు 10 వేలమంది చనిపోతే పురుషుడు ఒక్కడు చనిపోయాడు. ఈ దామాషా గమనింప తగినది. ఆనాడు లౌకిక శాసనాలు లేవని, అన్నీ మతధర్మ శాసనాలేనని గుర్తుంచుకోవాలి.

స్త్రీని పశువులాగ నడుముకు త్రాడుకట్టి బజారుకు తెచ్చి అమ్మేవారు. అలాంటి సంఘటన చివరిసారిగా 1883 లో ఇంగ్లండులో జరిగినట్లు చరిత్ర చెప్తున్నది.[1] మంత్రగత్తెలని అనుమానించిన స్త్రీ పురుషులను ఆనాడు అధికసంఖ్యలో చంపారు. అందులో ఎక్కువగా మతగురువుల ఆగ్రహానికి గురియైనది స్త్రీలే. "శకునము చెప్పువానిని బ్రదుకనియ్యకూడదు"[2] అసౌకర్యమైన శీతోష్ణ స్థితిని కల్పించినందుకు మంత్రికత్తెలను శిక్షించమని క్రీశ. 1437, 1445 లలో పోప్ యూజెని IV అజ్ఞలను జారీ చేశాడు. క్రీశ. 1484 లో పోప్ ఇన్నొసెంట్ VIII మంత్రగాండ్లను, మంత్రకత్తెలను ఎలా హింసించాలో వివరిస్తూ ఆదేశాలు ఇచ్చాడు. ఆ హింసలో వేల సంఖ్యలో స్త్రీ పురుషులు ప్రాణాలు కోల్పోయారు. జూలియస్ II,

ఏడ్రియన్ VI అనే మతాధిపతులు అలాంటి ఉత్తరువులను జారీ చేశారు. ఎన్ని వేలమంది లక్షలమంది చనిపోయినారనే విషయంపై అంటే లెక్కలను గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. ఇంగ్లండు, జర్మనీ ఫ్రాన్సులలోనే మంత్రగాండ్రను పేరుపెట్టి లక్షలమందిని చంపారు. క్రీశ. 1484 నుండి క్రీశ. 1800 వరకు గల కాలంలో 90 లక్షల 'మంత్రగాండ్ర' ప్రాణాలు తీశారు. అందులో ఎక్కువమంది స్త్రీలు క్రీశ. 1515 నుండి క్రీశ. 1547 లోగా ఒక్క ఫ్రాన్సు దేశంలోనే లక్షమంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇతరత్రా బాధపడిన వారి లెక్క కోట్లలో ఉంటుంది. మార్టిన్ లూథర్ అన్నాడు "నాకు మంత్రగత్తెలపై జాలిలేదు. నేను వారివందరిని మంటలలో హతమారుస్తాను." స్కాట్లండులో సంస్కర్తయైన జాన్‌నాక్స్ తలుచుకుంటే మంత్రకత్తె దహనాన్ని ఆపగలిగేవాడు, కాని ఆయన కిమిన్నాస్తి అని ఊరకున్నాడు. అమెరికాలో జరిగిన 'మంత్రికత్తెల' దహనాలన్నీ ప్రొటెస్టెంటుల ఆధ్వర్యంలోనే జరిగాయి. మెసాచ్యూట్స్, మేరీలాండ్, న్యూజర్సీ, వర్జీనియా రాష్ట్రాలలో 'మంత్రకత్తె' గా ఉండటం నేరం. న్యూ యార్క్, వర్జీనియా, డెలావేర్ రాష్ట్రాలలో వాళ్ళకు శిక్ష మరణదండన.[3]

మరికొన్ని పాతనిబంధన వాక్యాలను చూద్దాము. "పురుషుని యందేమి స్త్రీ యందేమి కర్ణపిశాచియైనను, సోదెయైనను ఉండినయెడల వారికి మరణశిక్ష విధింపవలెను, వారిని రాళ్ళతో కొట్టవలెను. తమ శిక్షకు తామే కారకులు.[4] (లేవీయ కాండము 20 : 27)

"సమూయేలు మృతి నొందగా ఇశ్రాయేలీయులు అతని గురించి విలాపము చేసి రామా అను అతని పట్టణములో అతని పాతిపెట్టి యుండిరి. మరియు సౌలు కర్ణపిశాచము గలవారిని, చిల్లంగివారిని దేశములోనుండి వెళ్ళగొట్టి యుండెను."[5] పరిశుద్ధ గ్రంథమైన బైబిలు పాతనిబంధనలో ఇలా వ్రాసియున్నపుడు దానిని తుచ తప్పకుండా పాటించే క్రైస్తవమత

హింస

ఆవేశపరులు స్త్రీలను, మంత్రికత్తెలను మంటలలో కాల్చి చంపటం ఆశ్చర్య పడతగిన విషయం కాదు.

యుద్ధంలో పట్టుబడిన గర్భవతులైన స్త్రీలను ఎలా చూచారు దైవజనుడు ఎలీషా చెప్పినమాటలు : "ఇశ్రాయేలు వారిగట్టి స్థలములను నీవు కాల్చివేయుదువు....వారి పిల్లలను నేలకు వేసికొట్టి చంపుదువు. వారి గర్భిణులు కడుపులను చంపివేయుదువు. ..."[6]

"యూదారాజైన ఉజ్జియా యేలుబడిలో ముప్పదితొమ్మిదవ సంవత్సర మందు యాబేషు కుమారుడైన షల్లూము ఏల నారంభించి షోమ్రోనులో నెలదినములు ఏలెను. షల్లూము చేసిన ఇతర కార్యములు. తిప్సహు పట్టణము వారు తమ గుమ్మములు తీయలేదు గనుక....దాని చేరువ గ్రామము లన్నిటిని కొల్లపెట్టి అచ్చట గర్భిణులందరి గర్భములను చించెను"[7] (వక్కాణింపు రచయితది)

యెహోవా ఇట్లు చెప్పెను "ఎఫ్రాయిము దోషము నావద్ద ఉంచబడి యున్నది.....షోమ్రోను తన దేవునిమీద తిరుగుబాటు చేసెను గనుక అది శిక్షనొందును, జనులు కత్తిపాలగుదురు, వారిపిల్లలు రాళ్ళకు వేసి కొట్ట బడుదురు. గర్భిణీ స్త్రీల కడుపులు చీల్చబడును."[8] (వక్కాణింపు రచయితది)

ఇది ఇశ్రాయేలు వారుకాని మరొక తెగవారు కాని చేసినపనికాదు. దేవుడు యిచ్చిన శాపము. దేవుడు ఇలాంటి శాపం ఇచ్చాడంటే ఇలాంటి ఆచారం అమలులో ఉండి ఉండాలి. తమ రూపాననే దేవుళ్ళను సృష్టి స్తారు ప్రజలు. కనుక యథాప్రజా తథా రాజా అన్నట్లు ప్రజల ఆచారాలనే దేవుడు తన శాపాలుగా మారుస్తున్నాడు.

అమ్మోనీయులు "తమ సరిహద్దులను మరి విశాలము చేయదలచి గిలాదులోని గర్భిణీస్త్రీల కడుపులను చీల్చిరి." యెహోవా వారిని శిక్షింతుననెను.[9]

దావీదు రబ్బాకువచ్చి వారి రాజు తలమీద ఉన్న కిరీటమును తీసివేసెను.....దానియందున్న జనులను అతడు వెలుపలికి కొనిపోయి, వారితో కొందరిని రంపములతో కోయించెను, కొందరిని ఇనుపదంతెలతో చీరించెను. కొందరిని గొడ్డళ్ళతో నరికించెను.[10] ఈ జనులలో స్త్రీలు ఉండకపోరు. లేకపోతే పట్టణములోని పురుషులని స్పష్టంగా చెప్పి యుండేవారు.

యెహోవా మోషేకు చెప్పినమాటలను మోషే ప్రజలకు చెప్పెను. "మీరు మిద్యానీయులమీదికి పోయి మిద్యానీయులకు యెహోవా విధించిన ప్రతిదండన చేయునట్లు.....చంపిరి. అప్పుడు ఇశ్రాయేలీయులు మిద్యాను స్త్రీలను వారి చిన్నపిల్లలను చెరపట్టుకొని.....మిద్యానీయుల ఆస్తియావత్తును తీసికొనిరి."[11] మోషే సేనా నాయకులతో యిట్లనెను "కాబట్టి మీరు పిల్లలలో ప్రతి మగవానిని పురుష సంయోగమెరిగిన ప్రతిస్త్రీని చంపుడి।"[12] ఇది పవిత్రయుద్ధంలో చేయబడిన పవిత్ర విధ్వంసం!

స్త్రీలపట్ల దేవుడైన యెహోవాకు ఎలాంటి అభిప్రాయం ఉన్నదో ఆయన శాపవచనములద్వారా తెలుస్తుంది. యెహోవాకు ఏ పురుషుని మీదనైనను ఆగ్రహం వస్తే ఆయన ఆ పురుషుని భార్యలకు అసహ్యకరమైన నిందాభాయిష్టమైన స్థితిని సంకల్పిస్తూ శపించాడు.

యెహోవా దావీదును శపించిన వైనము. "నీ యింటివారి మూలముననే నేను నీకు అపాయము పుట్టింతును, నీవు చూచుచుండగా నేను నీ భార్యలను తీసి నీ చేరువ వానికప్పగించెదను. పగటియందు వాడు వారితో శయనించును. నీవు ఈ కార్యము రహస్యముగా చేసితివి గాని ఇశ్రాయేలీయులందరు చూచుచుండగా పగటియందే నేను చెప్పిన దానిని చేయుంతునని అనెను."[13]

"నేను నేడు నీ కాజ్ఞాపించు ఆయన సమస్తమైన ఆజ్ఞలను కట్టడులను నీవు అనుసరించి నడుచుకొనవలెనని నీ దేవుడైన యెహోవా సెలవిచ్చిన మాట విననియెడల ఈ శాపములన్నియు నీకు సంభవించును" శాపములు వరుసగా పెక్కింటిని పేర్కొనడం జరిగింది. అందులో ఒకటి "స్త్రీని ప్రధానము చేసుకొందువు కాని వేరొకడు ఆమెను కూడును."[14]

"సైన్యముల కధిపతియగు యెహోవా ఈలాగు సెలవిచ్చు చున్నాడు.....ఏమియు మిగులకుండ, వారి యిండ్లను, వారి పొలములను, వారి భార్యలను ఇతరులను అప్పగింపబడుదురు;[15] యెహోవా శాపము - "వారు యెహోవా వాక్యమును నిరాకరించినవారు, వారికి ఏపాటి జ్ఞానము కలదు? గనుక వారి భార్యలను అన్యులకు అప్పగింతును, వాటిని జయించు వారికి వారి పొలములను అప్పగించును."[16] (వక్కాణింపు రచయితది)

"ఆమోజు కుమారుడైన యెషయాకు బబులోను గూర్చి ప్రత్యక్షమైన దేవోక్తి. .... యెహోవాయును, అయన కోధము తీర్చు ఆయుధములు వచ్చుచున్నారు. యెహోవా దినము వచ్చుచున్నది ఘోషించుడి.....వారి యిండ్లు దోచుకొనబడును, వారి భార్యలు చెరుపబడుదురు.[17] (వక్కాణింపు రచయితది)

యెహోవావాక్కు జెకర్యాకు సెలవిచ్చినది. "ఇదిగో యెహోవా దినము వచ్చుచున్నది. అందు మీ యొద్ద దోచబడిన సొమ్ము పట్టణము లోనే విభాగింపబడును. । ఏలయనగా యెరూషలేము మీద యుద్ధం చేయుటకు నేను అన్యజనులందరిని సమాకూర్చ బోవుచున్నాను; పట్టణము పట్టబడును । ఇండ్లు కొల్లపెట్టబడును. స్త్రీలు చెరుపబడుదురు....."[18] (వక్కాణింపు రచయితది)

జెకర్యా తరువాత యెహోవా వాక్కు మలాకీ ద్వారా పలుకబడినది. తరువాత క్రొత్త నిబంధన వస్తుంది. అంటే జెకర్యా నాటికి ఇంచుమించుగా

ఏసు పుట్టిరోజులు వస్తున్నాయన్నమాట. సుమారు 15 వందల సంవత్స
రాలు దేవునిగా చలామణీ అయిన యెహోవా సంస్కారం ఇది. అదంతా
ఆయన తప్పుకాదు. ఆయన జనుల భావనను బట్టియే ఆయన రూపు
రేఖలు, గుణగణాలు, స్వభావాదులు ఉంటాయి. ఆనాడు యూదాజాతి
ఈనాటి కన్న తక్కువస్థాయి నాగరికత, సంస్కృతి కలిగి ఉన్నది.
కనుకనే వారికాభావాలు. ఇండ్లను, పొలములను, స్త్రీలను ఒకే వరుసలో
చెప్పుకొని వచ్చేవారు. అంటే ఆ మూడూ పురుషుల ఆస్తులు. కనుకనే
కోపము వచ్చినపుడు ఎదుటివాని ఆస్తిని ధ్వంసం చేసే శైశవభావం
యెహోవాకు కల్గింది అందువలననే 'నీ స్త్రీలను చెరుస్తారు; నీ ఎదుటనే
నీ స్త్రీలతో ఇతరులు శయనిస్తారు; నీ స్త్రీలను చంపుతారు. అనే వాక్యాలు
ఆయన నోట దొర్లుతాయి. యెహోవా పాతనిబంధన కాలపు దేవుడు,
ఈ కాలపు వారి దేవుడు కాదంటే తగవులేదు. అలా కాక పాత నిబంధనను
'పరిశుద్ధగ్రంథం' అని యెహోవాను ఈ నాటికీ ఏ నాటికీ దేవుడంటే చిక్కు
వస్తున్నది. ఇవన్నీ ఒకరి మనస్సు నొప్పించాలని వ్రాసే మాటలు కావు.
క్రైస్తవ సోదరులను ఆలోచింప చేయటానికి లిఖించబడిన మాటలు.

యోబు ఇలా ఒట్టు పెట్టుకుంటాడు. "నేను పరస్త్రీని మోహించిన యెడల....నా భార్య వేరొకని తిరుగలిని విసరును గాక. ఇతరులు ఆమెను కూడుదురు గాక."[19](వక్కాణింపు రచయితది) దేవుడైన యెహోవా యోబూ, తదితర ప్రజలూ అందరూ ఒకే సంస్కృతిస్థాయికి చెందిన వారు.

8 వ అధ్యాయం : రిఫరెన్సులు

1. 'వుమెన్ అండ్ ఎథియిజం'	పుటలు	13, 14
2. నిర్గమ కాండము		22 : 18
3 'వుమెన్ అండ్ ఎథియిజం'	పుట	14
4. లేవీయ కాండము		20 : 27
5. I సమూయేలు		28 : 3
6. II రాజులు		8 : 12
7. II రాజులు		15 : 13 - 16
8. హోషేయ		13 : 12, 16
9. ఆమోసు		1 : 13
10 I దినవృత్తాంతములు		20 : 2, 3
11. సంఖ్యాకాండము		31 : 1 - 12
12. ,,		31 : 17
13. II సమూయేలు		12 : 11, 12
14. ద్వితీయోపదేశకాండం		28 : 15, 30
15. యిర్మీయా		6 : 9, 12
16. యిర్మీయా		8 : 9, 10
17. యెషయా		13 : 1, 5, 16
18. జెకర్యా		14 : 1, 2
19. యోబు		31 : 9, 10

9 పడుపువృత్తి

పడుపువృత్తి విషయమై క్రైస్తవంలో ద్వంద్వ వైఖరి కనపడు తున్నది. ప్రవచనాలలో వేశ్యావృత్తి ఖండన, ఆచారంలో ఆమోదం రెండూ దర్శన మిస్తాయి.

పాతనిబంధన

అబ్రహాము తన భార్య శారాను తన చెల్లెలని ఐగుప్తురాజు ఫరోకు అప్పగించుట అతనివద్ద బహుమతులు పొందుట.[1] అలాగే అబ్రహాము శారాను గెరా రాజుకు ఇదే విధముగా చెల్లెలని చెప్పి అప్పగించెను.[2] స్త్రీలు పురుషుడికి లోబడి యుండవలెననే సూక్తిని జ్ఞాపకముంచుకుంటే భార్య విధేయతను అవకాశముగా తీసికొని అబ్రహాము ఆమెను వేశ్యా స్థాయికి తెచ్చెనని తెలుతున్నది.

"ఇశ్రాయేలు కుమార్తెలలో ఎవరూ వేశ్యగా ఉండరాదు."[3]

వేశ్యలను నిరసించినా తమ మనుష్యులను దాచిపెట్టిన వేశ్యను రక్షించటం జరిగింది. ఆమెను చంపలేదు. ఆమె పేరు రోహాబు.[4]

ఏసు వేశ్యల పట్ల సానుభూతి చూపించినట్లు నిదర్శనాలు కలవు. ఇద్దరు కుమారులు తండ్రి చెప్పిన పని చేయకపోయిరి. అంత "సుంకరులును, వేశ్యలును మీకంటే ముందుగా దేవుని రాజ్యములో ప్రవేశించుదురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను."[5]

ఏసు సుంకరులతోను పాపులతోను, కూర్చుండెను.[6]

ఏసు పాదములను పాపాత్మురాలైన ఒక స్త్రీ కడిగెను.[7]

సమరయ స్త్రీతో (పెనిమిటి లేనిది) మాటలాడెను.[8]

పడుపు వృత్తిని మతాధికారులు పోషించారు. మతగురువులు వేశ్యలను ఉంచుకొనేవారు. ఫ్రాన్సులో వారి పతిత జీవితాన్ని బొకాసియో కథలలో చిత్రించాడు. పితృస్వామ్య సమాజంలో పడుపువృత్తి విధిగా ఉంటుంది. భారతదేశంలో హిందూజాతి దానికొరకు ఒక కులాన్నే సృష్టించింది. స్త్రీ పురుషుల మధ్య అసమానత వల్ల ఇది ఏర్పడుతుంది. ప్రాచీన నాగరికతలలో స్త్రీ ఒక వస్తువు. ఆమె ఆస్తి కాగా వేశ్య సమాజపు ఉమ్మడి ఆస్తి. కనుక ఆమెను పొందగోరువారు ప్రతిఒక్కరూ పైకం చెల్లించాలి ఆమె పొందుకోసం. క్రైస్తవ మతం పడుపు వృత్తిని గుర్తించింది. అగస్టిన్ దృష్టిలో అది "శాసన సమ్మతమైన అవినీతి" అవసరమైన చెడు క్రీ.శ. 589 లో టోలెడోలో జరిగిన మతగురువుల సమావేశంలో ఈ క్రింది నియమాన్ని ఏర్పరిచారు. "ఏ మతగురువైనా స్త్రీతో సంబంధం పెట్టుకుంటే ఆ స్త్రీని న్యాయాధికారి అమ్మివేసి వచ్చిన ధనాన్ని బీదలకు పంచాలి."[9]

క్రీ.శ. 1022 పెన్‌పియాలో జరిగిన సమావేశంలో బెనిడిట్ చెప్పిన మాట ఇది. "మతగురువుకు పుట్టిన పిల్లలను బానిసలుగా అమ్మివేయాలి. వారిని మతగురువు పిల్లలుగా గుర్తించరాదు."[9]

చర్చి కాంపౌండ్‌లో చెరువును జోప్‌గ్రెగరీ త్రవ్విస్తే 6 వేల శిశువుల శిరస్సులు దొరికాయి అవన్నీ మతగురువుల సంతానపు అస్థిపంజరాల భాగాలు.[9]

మతగురువు జారత్వం చేస్తే స్త్రీకి, పిల్లలకు శిక్ష ఎందుకో?

నైతికంగా వడుపువృత్తి సంపూర్ణంగా చెడ్డది. (1) వేశ్య తన వ్యక్తిత్వాన్ని కోలుపోతుంది. (2) ఆమె దోపిడీ చేయబడుతుంది (3) ఆమె బాధ్యతాయుత జీవితం గడపలేదు. (4) ఆమె క్లయింట్లు ఆమెకు పైకం చెల్లించి తమ బాధ్యత తీరిందని భావిస్తున్నారు. ఈమె పతనానికి వారే కారకులు. "ఎక్కువ చెడును లేకుండా నివారించడానికి కొన్ని చెడులను భగవంతుడు ఉండనిచ్చాడు. అదే సూత్రం మానవ సమాజానికి వర్తిస్తుంది" అన్నాడు అక్వినాస్ (Aquinos) 'స్త్రీని వస్తువుగా చూచి ఆమెను బానిసగా చేయుడమో లేక తనను వస్తువుగా భావించుకొని తను బానిసత్వంలోకి పోవడమో పురుషుడు చేస్తున్నాడు' అనేది సార్త్ర్ అభిప్రాయం. మనిషిని వస్తువుగా భావించినపుడు వ్యభిచార స్వభావం ఆ సంబంధంలో ఏర్పడుతుంది. ఇది ప్రేమపై ఆధారపడే సంబంధానికి వ్యతిరేకం. సమానులమధ్య నే ప్రేమసాధ్యం. వేశ్యాజీవితంలో ప్రేమకు తావులేదు. ఎట్టి పరిస్థితిలోనూ వడుపువృత్తిని ప్రోత్సహించరాదు. క్రైస్తవం దానిని పెంచి పోషించింది. ఇతర మతాలూ అలాగే చేస్తున్నాయి. పురుషాధిక్య సమాజం అంతరిస్తే తప్ప వడుపువృత్తి పోదు. 'స్త్రీ భర్తకు విధేయురాలిగా ఉండవలెను, పురుషుడు కుటుంబానికి యజమాని' అని వస్పష్టంగా చెప్పే క్రైస్తవం వడుపువృత్తి నాశనానికి దోహదం చేయజాలదు.

9 వ అధ్యాయం : రిఫరెన్సులు

1. ఆదికాండము 12 : 11 - 16
2. ,, 20 : 1 - 2
3. ద్వితీయోపదేశకాండము 23 : 17
4. యెహోషువా 6 : 17, 25
5. మత్తయి 21 : 31, 32
6. మార్కు 2 : 15, 16
7. లూకా 7 : 37, 39, 47
8. యోహాను 4 : 18
9. 'ఉమెన్స్ ఈరా' లో 'క్రైస్తవం : స్త్రీలు' అనే వ్యాసం తే 27 - 7 - 82

10

కుటుంబ నియంత్రణ : గర్భస్రావం

నిన్న మొన్నటి వరకు క్రైస్తవం కుటుంబ నియంత్రణకు వ్యతిరేకం. యూదాజాతి సాంస్కృతిక వారసత్వ ఫలితం అది. జనాభాను పెంచుకోవలసినదని ఆ కాలంలో ఇచ్చిన ఆదేశాన్ని ఈనాటికీ అనుసరించపూనటం అవివేకం. సంతానాన్ని కనే ప్రయత్నంలో స్త్రీ బలహీనురాలయినా సరే, చనిపోయినాసరే పరవాలేదన్నారు మతగురువులు. వివాహంయొక్క లక్ష్యం సంతానసాధన అయినప్పుడు అలాంటి వైఖరిని కలిగి ఉండటం ఆశ్చర్యం కాదు. వివాహం స్త్రీ పురుషుల ప్రేమమయ జీవితానికి, మేధోయుత సన్నిహితత్వానికి, రెండు వ్యక్తిత్వాల సమ్మిశ్రమానికి, శారీరకానందానుభూతికి ఉద్దేశింప బడిందని భావిస్తే మరో రకపు ఆలోచనలు ఉద్భవిస్తాయి. అలాకాక దైవపూజకు సామకూల పడటానికి, వంశాన్ని నిలపడానికి మాత్రమేనని భావించిన నాడు ఇలాంటి పొరపాటు అభిప్రాయాలు చోటుచేసుకొనక తప్పదు.

జన్మనిగ్రహ సాధనాలను గురించి ఛార్లెస్ బ్రాడ్‌లా, అనీబిసెంటులు పుస్తకం అచ్చువేయించి ప్రచారం చేస్తే వారి ప్రయత్నాలకు అడ్డు తగిలారు మతగురువులు. వారిని ప్రభుత్వం చేత బాధింపచేసారు.

కాలం మారింది. ప్రొటెస్టెంటు శాఖ పూర్తిగా జన్మనిగ్రహ సాధనాల వాడుకకు అనుకూలంగా తయారయ్యింది. రోమన్ కాథలిక్ శాఖవారు కూడా కుటుంబనియంత్రణానికి సుముఖులైనారు. కాని జన్మనిగ్రహ సాధనాల వాడకానికి వారు వ్యతిరేకులు. జన్మనిగ్రహానికి సహజమైన పద్ధతులను అవలంబించాలని వారి వాదన. ఈ మధ్య ఈ విషయాన్ని పరిశీలించటానికి పోప్ ఒక కమిటీని నియమించారు. కాని ఆశలు నిరాశలయినాయి. పాతపాటనే తిరిగి పాడారు రోమను కాథలిక్కులు. ఇపుడు పోప్ అను యాయులకు పచ్చివెలగకాయ గొంతున పడ్డట్లయింది. ఒకవైపున పోప్ ఆదేశం మరియొకవైపున వివేచనాయుతమైన తమస్వంత ఆలోచన. ఇపుడు చాలమంది ఆందోళనతో కొట్టుమిట్టాడుతున్నారు. మానసిక సంఘర్షణకు లోనవుతున్నారు.

గర్భస్రావం

దీనివిషయంలో రోమన్ కాథలిక్ శాఖవారు మరీ బలవత్తరంగా వ్యతిరేకత ప్రదర్శిస్తున్నారు. గర్భంలో నెలకొన్న పిండానికి తల్లికి గర్భిణీ అయిన నెలరోజులనుండి ప్రాణం ఉంటుందని, గర్భస్రావం చేస్తే అది జీవహత్యగా, భ్రూణహత్యగా పరిగణింపబడాలని వారి వాదం. అంతటితో ఆగరు వారు పిండానికి ఆత్మ ఉందట. గర్భస్రావం జరిగితే ఆ ఆత్మ గతేమిటని ప్రశ్నిస్తున్నారు! వీరిది ద్వందనీతి. ఎన్నో యుద్ధాలను, ప్రపంచయుద్ధాలను బలపరిచారు. సైనికులుగా చేరి పోరాడమని చర్చిలలో ఉపన్యాసాలిచ్చారు. మరి ఆనాడు వీరికి ప్రజల ఆత్మల విషయం పట్టలేదు. యుద్ధంలో చంపడాన్ని, చావడాన్ని సనాతన క్రైస్తవం నిషేధించలేదు. 'జీవంయెడ గౌరవము' నే సూత్రాన్ని పిండానికి, ప్రేతాలకు మాత్రమే వర్తింప చేస్తున్నారు మతస్థులు. బీదరికం, వ్యాధి వీటివల్ల చనిపోయే శిశువులు జీవాలకు గౌరవంలేదు వారి దృష్టిలో. తల్లి శోచనీయ స్థితితో వారికి సంబంధం లేదు. వారిది పురుష ప్రాధాన్యతను పెంపొందించె మతం కదా!

గర్భస్రావం ఎందుకు?

1. ఆమె విషయం ఏ మాత్రం పట్టించుకొనని పురుషుని సాంగత్యం వల్ల కలిగే గర్భాన్ని వదిలించుకోవటానికి,

2. తాగిన మైకంలో పొందిన సాంగత్యం వల్ల కలిగే సంతానాన్ని ఆమె కోరడానికి ఆమె గర్వం అడ్డువస్తుంది.

3. తను తెలివితక్కువగా ప్రేమించిన పురుషుని సంసర్గం వల్ల గర్భం వస్తే ఆ శిశువును వదిలించుకోవటం,

4. తనపై అత్యాచారము జరిగితే గర్భం వస్తే ఆ సంతానాన్ని కనడం ఇష్టంలేక,

5. మరో పిల్లనో, పిల్లవానినో ప్రసవించటానికి ఆమె శారీరక మానసిక పరిస్థితి అనుమతించకపోవుట,

6. దోషభావం, ఆదుర్దా, భయం వీటిబరువుమ నవమాసాలు మోయ లేక పోవడం, ఇంకా యిలాంటి పరిస్థితిలో స్త్రీ గర్భస్రావాన్ని ఆశిస్తుంది.

సామభూతితో ఈ పరిస్థితిని అర్థం చేసుకోరు సనాతన క్రైస్తవులు.

ఏసుక్రీస్తు తల్లి మేరిమాతను గౌరవిస్తారు ఆమెకు అనాదిపాపం (original sin) బాధించదట. మరో స్త్రీ కన్యగా అ టీ అవివాహితగా ఉండి మాత అయితే ఈ సనాతన సంప్రదాయ క్రైస్తవులు నిరసిస్తారు.

గర్భస్రావం ఇటీవల జనాదరణ పొందడానికి వృత్తిచేసే స్త్రీలు, శాసనాలయెడ భయం, భక్తి లేని యువతరం, ఈనాటి ఫిల్ములు కారణాలట. అలా చెప్పి దుయ్యబట్టడం పరిపాటి అయింది. మతపరమైన పిడివాదం, మూఢవిశ్వాసం వీటికన్న కరుణకు స్థానమిస్తారు మతస్థులు. న్యాయదృష్టి ఎగిరిపోయింది.

గర్భస్థ శిశువును నవమాసాలు మోసేది స్త్రీ. అది ఆమె సొత్తు. ప్రసవమయి తల్లి దేహంనుండి బయలు వెడలేవరకు పిండంపై హక్కు తల్లిదే. అది ఆమె శరీరంలో భాగం. అశేషంగా సంతానం కనమని, సమాజాన్ని, ప్రపంచాన్ని దుఃఖభూయిష్టం చెయ్యమని, తన జీవితాన్ని దుఃఖభాజనం చేసుకోమని స్త్రీని బలవంతం చేయటానికి ఎవరికీ - ఆ మాటకువస్తే భర్తకుకూడా - హక్కులేదు.

సనాతన క్రైస్తవుల దృష్టిలో నీతి అంటే లైంగిక నీతిమాత్రమే. సంతానానికీ, దేవునికీ, మాత్రమే ప్రాముఖ్యత. అసలు మనుషులు - అంటే తల్లిదండ్రుల విషయం వారికి పట్టదు. సమాజంలో వనరులు లేకపోవటం లేక తగ్గిపోవటం వారికి ఆసక్తిలేని అంశం. తల్లిదండ్రుల ఆర్థిక స్థితి, మానసిక పరిస్థితి వారికనవసరం. ఇలా అర్థరహితమైన తప్పుడు అవగాహనతో అనుయాయుల జీవితాలను బాధాకరం చేస్తున్నది సనాతన క్రైస్తవం.

భారత దేశంలో గర్భస్రావాన్ని కొన్ని సందర్భాలలో చట్టసమ్మతం చేసారు. ఈనాడు అది తేలిక అయింది. అయినా సనాతన క్రైస్తవులు తమ వైఖరిని మార్చుకోవటం లేదు. ఇది చాల శోచనీయం.

11 ఆస్తిహక్కు : వారసత్వం

భార్యాభర్తలు ఏక శరీరులు. అదియును గాక భార్య భర్తకు లోబడి యుండవలెను. భార్య భర్త ఆస్తి. కనుక భార్య ఆస్తి కూడా భర్తదే. ఇదీ క్రైస్తవుల ఆలోచనా సరళి. 1870 లో ఇంగ్లండులో వివాహిత స్త్రీల ఆస్తిహక్కు చట్టము వచ్చేవరకు వివాహం కాగానే స్త్రీ యొక్క ఆస్తి భర్తకు చెందేది. భారతదేశంలో ఇలాంటి శాసనం 1874 లో వచ్చింది.

క్రైస్తవ వివాహిత స్త్రీ ఆస్తిపైన, దానివల్ల వచ్చే ఆదాయంమీద, ఆమె సంపాదనమీద భర్తదే హక్కు. ఫ్రాన్సులో రెండుదశాబ్దాల క్రితం వరకు భార్య ఫ్యాక్టరీలో పనిచేస్తుంటే ఆమె జీతాన్ని భర్తకు ఇచ్చేవారు; అతడు వసూలు చేసుకునేవాడు. ఈ పద్ధతిని మాన్పించటానికి మహిళలు ఎన్నో పోరాటాలు చేశారు. చివరకు విజయం పొందారు.

వారసత్వం

ఒక పురుషుడు చనిపోతే అతని ఆస్తి కుమారులకు చెందేది. ఒకడు కుమారులు లేకుండా చనిపోయెను. అంత కుమార్తెలు తమకు వారసత్వం

రావలెనని మోషియెదుట చెప్పిరి. మోషే వారికనుకూలముగా యెహోవాకు మనవిచేసెను అంత యెహోవా అనుగ్రహించెను. "ఒకడు కుమారుడు లేక మృతి నొందినయెడల మీరు వాని భూస్వాస్థ్యమును వాని కుమార్తెలకు అందజేయవలెను. వానికి కుమార్తెలు లేనియెడల వాని అన్నదమ్ములకు వాని స్వాస్థ్యము ఇయ్యవలెను. వానికి అన్నదమ్ములు లేనియెడల వాని భూస్వాస్థ్యమును వాని తండ్రి అన్నదమ్ములకు ఇయ్యవలెను. వాని తండ్రికి అన్నదమ్ములు లేనియెడల వానికి సమీపమైన జ్ఞాతికి వాని స్వాస్థ్యము ఇయ్యవలెను;" (సంఖ్యాకాండము 27 : 5 - 11)

యెహోవా తరువాత ఇలా సవరణ చేసెను.

"వారు (కుమార్తెలు) తమకు ఇష్టులైనవారిని పెండ్లి చేసికొనవలెను. ఇశ్రాయేలీయుల స్వాస్థ్యము ఒక గోత్రములోనుండి వేరొక గోత్రములోనికి పోకూడదు.....ఇశ్రాయేలీయుల గోత్రములలో స్వాస్థ్యము గల ప్రతి కుమార్తెయు తన తండ్రి గోత్రవంశములోనే పెండ్లి చేసికొనవలెను..... అట్లు సెలోపెహాదు కుమార్తెలు తమ తండ్రి సహోదరుల కుమారులను పెండ్లి చేసికొనిరి.....వారి స్వాస్థ్యము వారి తండ్రి గోత్రములోనే నిలిచెను." (సంఖ్యాకాండము 36 : 6 - 12)

దీనిని బట్టి పురుషాధిక్యత తేటతెల్లమవుతున్నది. భార్యకు వాటా లేదు. కుమార్తెలకు ఇచ్చిన వాటా షరతులతో కూడియున్నది. భారత వారసత్వ చట్టము (1925) భారత క్రైస్తవులకు వర్తిస్తుంది. వాటి నిబంధనలు ఇలా ఉన్నాయి. ఒక పురుషుడు తన విధవను, కుమారులను కుమార్తెలను వదలి చనిపోతే విధవకు మూడవవంతు వస్తుంది. అతని సంతానానికి మూడింట రెండువంతులు వారసత్వంగా వస్తుంది. నిస్సంతుగాను విధవను తతిమ్మా సమీపబంధువులను వదలి వెళ్ళితే సగము ఆస్తి

భార్యకు వస్తుంది. మిగతాది సమీపబంధువులకు పోతుంది. సమీప బంధువులు లేకపోతే మొత్తం ఆస్తి చనిపోయిన అతని భార్యకు వస్తుంది. (సె 33) చనిపోయిన అతని ఆస్తి మొత్తం 5 వేల రూపాయిలకు మించకపోతే, అతని సంతానం లేకపోతే మొత్తం ఆమెకే వస్తుంది. ఆస్తి విలువ 5 వేలకు మించితే ఆమెకు 5 వేల వరకు యిచ్చి మిగతాదానిని ఆమెయు సమీపబందుగులు చెరిసగము తీసికొనవలెను. (సె 33 ఎ) ఈ చివరి రెండు నిబంధనలు పూర్తి ఆస్తికి వీలు రాయకుండా చనిపోతే తప్ప భారత క్రైస్తవులకు వర్తించవు. కుమారులకు కుమార్తెలకు మధ్య వివక్షలేదు. కాగా భార్యయెడ చిన్నచూపు ప్రస్ఫుటంగా కన్పిస్తోంది. ఈ 1925 శాసనంలో కూడ ఏమయినను క్రైస్తవమత ప్రభావము పోదు కదా!

12 విద్య, రాజకీయాలు

ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవమతం బలంగా ఉన్నచోట స్త్రీలను విద్యకు దూరంగా ఉంచారు. ఉదాహరణకు క్రీ. శ. 16, 17 శతాబ్దాలలో ఆమెకు కుట్టు, సంగీతం, చిత్రలేఖనం నేర్పేవారు. ధనవంతులయితే ఒక ప్రత్యేక సంగీత వాయిద్యంపై పాడటంలో శిక్షణ యిచ్చేవారు. శ్రామిక కుటుంబాలస్త్రీలు ఇండ్లలోను, పొలాల్లోను బండచాకిరీ చేసేవారు. ఇంగ్లండులో ప్రప్రథమ లేడీ డాక్టరు 1849 లో వైద్య వృత్తిలో ప్రవేశించింది.

ప్రప్రథమంగా స్త్రీలకు వోటుహక్కు న్యూజిలాండులో 1893 లో వచ్చింది. ఇంగ్లండులో స్త్రీలందరికి వోటుహక్కు 1928 లో వచ్చింది. 1791 లో మెరీ ఒలింపీడ గాజెస్ అనే ఆమె 'స్త్రీల హక్కుల ప్రకటన వ్రాసింది. ఇంగ్లండులో మేరీ వూల్‌ష్టన్ క్రాఫ్ట్ 1792 లో స్త్రీల హక్కులను సమర్థిస్తూ వ్రాసింది. 1800 లో అమెరికా సంయుక్త రాష్ట్రాలలో స్త్రీల హక్కులను సమర్థిస్తూ మొదటి సభ జరిగింది.

మొదట్లో స్త్రీలు వోటుచేయడానికి లేదు. పౌరహక్కులు లేవు. ఎవడైనా ఏ స్త్రీ నయినా చెరిచినా ఆమె అతనిపై వ్యాజ్యం జరుపుటకు లేదు. ఆ హక్కు ఆమె తండ్రికే. స్త్రీలు వీలునామా వ్రాయడానికి అవకాశం

లేదు. న్యాయస్థానాలలో సాక్ష్యం చెప్పటానికి హక్కులేదు. విడాకులు వీలులేదు. పిల్లలు ఆమె భర్త సంతానం క్రింద లెక్క. అతని పేరు వారికి సంక్రమిస్తుంది. ఆమెకూడా ఫలానివారి భార్య అని పిలవబడేది. ఆమెకు బ్యాంకులో ఖాతాపెట్టుకోవటానికి సౌకర్యంలేదు. కంట్రాక్టుల పై ఆమె దస్కతు చేయరాదు. శిశువుకన్నా ఆమెస్థాయి కనాకష్టంగా ఉండేది.

వివాహిత స్త్రీకి తన ఆస్తిపై హక్కు మిసిసిపీ రాష్ట్రంలో 1839 తో వస్తే, న్యూయార్కు వగైరా రాష్ట్రాలలో 1848 లో వచ్చింది. ఇంగ్లండులో 1870 లో ఆ హక్కును ఆమెకు ప్రసాదించారు. భర్త ఆస్తిలో, అమెరికాలో మూడవవంతు మాత్రం భార్యకు వచ్చేది.

అమెరికాలో జరిగిన మొదటి ఎన్నికలలో ఒక్క స్త్రీ కూడ వోటు చేయలేదు. రాజ్యాన్ని నిర్మించిన రాజ్యాంగ సభలో ఒక్క స్త్రీ కూడ లేదు.

ఇప్పటికీ ప్రపంచ జనాభాలోని నిరక్షరాస్యులలో మూడింట రెండు వంతుల మంది స్త్రీలు. ప్రసవకాలంలో స్త్రీ 100 కి 50 మంది స్త్రీలకు శిక్షితులైన వైద్యుల, నర్సుల సహాయం లేదు. ఇప్పటికీ పురుషునికి చెల్లించే వేతనంలో స్త్రీకి సగం లేక నాలుగువంతులలో 3 వంతులు మాత్రమే ముట్టుతున్నది. స్త్రీలు ప్రపంచ జనాభాలో సగం ఉన్నారు. పనిగంటలలో వారివంతు మూడింట రెండు వంతులు. వారి వరుమానము ప్రపంచ ఆదాయంలో పదింట ఒకవంతు. ఇవన్నీ 1980 నాటిలెక్కలు. అభివృద్ధి చెందిన అమెరికా, రష్యాలలో కూడ స్త్రీలు రాజకీయార్థిక రంగాలలో కీలక స్థానాలలో లేరు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్నది కనుక ఈ పరిస్థితులకు క్రైస్తవమతం చాలవరకు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

13 క్రైస్తవం స్త్రీలకు మేలు చేసిందా ?

అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని సెయింట్ పాల్(మిన్నిసోట) లో 1973 లో లూథరన్ మతగురువుల సమావేశం జరిగింది. అందులో ఒక మత శాస్త్రజ్ఞురాలు డాక్టర్ రోజమరీ రూథర్ అనే ఆమె ఉపన్యసించడం తటస్థించింది. ఆమె బహు మర్యాదగా, అయితే నిశ్చయంగా తన అభిప్రాయాలను ఇలా వ్యక్తం చేసింది.

"క్రైస్తవంయొక్క తొలిరోజులల్లో మతగురువుల కాలంనుండి స్త్రీలను కేవలం శరీరంగాను అందులోనూ మెదడులేని శరీరంగాను చూచారు." "పాపానికి ప్రతీకలుగా" స్త్రీని చిత్రించారు. ఆధ్యాత్మికంగా అధికుడైన పురుషుడు స్త్రీపై పెత్తనం సాగించటానికి పూనుకున్నాడు. ఆమెను సంతానోత్పత్తి సాధనంగానో లేక కామదాహ నివారణకు ఔషధం గానో వాడారు.

తొలి క్రైస్తవపు మతగురువులు, మధ్యయుగపు మతశాస్త్రజ్ఞులూ, ఇరుతెగలవారూ "పురుషునికి ఆధ్యాత్మిక సహవాసం కావాలంటే మరియొక పురుషుని వలననే కలుగుతుందని" తలపోశారు.

"19 వ శతాబ్దంలో కాని, ఈనాడు కాని స్త్రీ విమోచన ఉద్యమాన్ని ప్రతిఘటించేవారు క్రైస్తవమత గురువులే. అలా ఉద్యమంపై దెబ్బ తీయడానికి, స్త్రీని సంప్రదాయం శాసించే స్థానానికి నెట్టడానికి, బైబిలు వాక్యాలను, పౌలు బోధనలను సాధనాలుగా వాడుతున్నారు."

జాతుల మధ్య వైషమ్యం ఎలా వచ్చిందనే సమస్యను చర్చిస్తూ-

"లింగభేదం వల్ల వచ్చిన వేర్పాటు, వివక్ష అన్నింటికన్న పురాతనమైనది. ఆధిపత్యం యొక్క ప్రతిరూపము లైంగిక వివక్షపై ఆధారపడి ఏర్పడింది. అణచివేయబడిన ప్రజానీకం - శ్రామికులు, రైతులు, గోధుమ వర్ణపుచర్మం కలవారు, అందరూ చైతన్యం లేనివారట. ఇంద్రియాలకు అధీనులుగా జీవితాలు గడుపుతున్నారట. వివేచనలేని జనమట. కేవలం దేహంగా బ్రతుకుతున్నారట. అంటే 'స్త్రీత్వ లక్షణాలని' మనము వేటినైతే పేర్కొంటున్నామో వాటిని అన్నింటిని కలిగి యున్నారట. పెత్తనం సాగించే వర్గం, హేతుబద్ధంగా ఆలోచిస్తుందట, చైతన్యంతో తొణికిసలాడుతుందట. స్వతంత్రంగా ఆలోచించి నిర్ణయాలు చేయగల సత్తా కలిగి యుందట. అంటే 'పురుష లక్షణాలని మనము వేటినైతే పిలుస్తామో వాటి నన్నింటిని పొంది యుంటుందట."

"స్త్రీకి అందము ఉన్నదని, దానికి జీవోత్పత్తి కార్యక్రమంలో ప్రధానపాత్ర ఉన్నదని తెలియని రోజుల్లో అరిస్టాటిల్ స్త్రీలు సంతానోత్పత్తి ప్రక్రియలో చైతన్య రహితమైన పాత్ర నిర్వహిస్తున్నారని, కేవలం పురుష సృజనాత్మక శక్తికి ధారావాహికలుగా ఉన్నారని చెప్పాడు. ఆ భావాన్ని నిన్న మొన్నటి వరకు ఆమోదించారు."

రోమన్ కాథలిక్ చర్చిని గురించి, ఇంకా తన స్నేహితులు కొంత మందిని గురించి ఆమె ప్రసంగిస్తూ ఇలా చెప్పిండి,

"పురుష వాసన కల పదాలను మార్చి భాషకు ఎంతో మేలు చేకూర్చాము. 'రాణులకు రాణి, స్త్రీలలో ఉన్నత స్త్రీ' అని పాటలు

పొడితే ఎలా ఉంటుందో ఊహించండి. పురుషాధిపత్యాన్ని సూచించే పాత పదాలతో కూడినది ఎంత మధ్యయుగపు భాషయో ప్రజలు ఒక్క సారిగా గ్రహించారు."

అదే వారంలో బోస్టన్ కాలేజీలో మతశాస్త్ర ఆచార్యులుగా ఉన్న డా॥ మేరీ డేలీ 1973 నోబెల్ మహా సభలో పాల్గొని ఆమె ప్రసంగించింది. స్త్రీ విమోచన విషయంగా క్రైస్తవ రూపం సామాన్యంగా భావించేది కాదని వాదించింది.

"క్రైస్తవంలో స్త్రీల స్థితినీ, కెట్టజాతిలోని స్త్రీల స్థితిని పోల్చి తరచి చూడండి....క్రైస్తవం పితృసామ్యమతం. పితృస్వామ్యాన్ని నిలబెట్టటానికి కృషి చేసింది. పురుష దేవుడు, పురుష ఏసులో దైవంయొక్క అవతారం, దుష్టత్వానికి ప్రతిరూపంగా స్త్రీని చిత్రించడం, పురుషాధిపత్యాన్ని పొగిడే మత ప్రామాణిక గ్రంథాలు, స్త్రీ యొక్క అనుభవాన్ని తృణీకరించటం, వీటిద్వారా క్రైస్తవంలో స్త్రీ యొక్క స్థానాన్ని దిగజార్చారు.స్త్రీ పురుష వివక్ష సక్రమమని వాదించే సమాజం అలాంటి మతాన్ని సృజించింది. ఆ మతం అలాంటి సమాజాన్ని తిరిగి సృజిస్తున్నది.''

వీరిరువురు హార్వర్డు మతధర్మ కళాశాలలో అధ్యాపకులు కాబోతున్న వారు. వీరు ఇంత స్పష్టంగా, నిర్ద్వంద్వంగా కుండ బద్దలుకొట్టినట్లు ఈ విషయాలను చెప్పడం ముదావహం. తమాషా ఏమంటే ఈ వాస్తవాలను ఇంత సునిశిత పరిశీలనను రోమన్ కాథలిక్ స్త్రీ చేయడం. "స్త్రీలను మానవవ్యక్తుల స్థానాన్నుండి దిగజార్చిన ఘనత క్రైస్తవ మతానిది.'' అని డా॥ డేలీ చెప్పారు. కాని ఆ మత ధర్మశాస్త్రంలోనే తను కనుగొన్న వ్యాధికి విరుగుడు ఉందని ఆమె విశ్వసించటం విడ్డూరం. క్రైస్తవ మతసార లైంగిక విభజనా సిద్ధాంతానికి వ్యతిరేకం; జీవచైతన్య స్రవంతికి వ్యతిరేకం; స్త్రీలపట్ల శత్రుత్వం కలది. దానిని మార్చాలంటే ఆ దృక్పథాన్ని పొంత్రోలాలి. పురుషులకన్నా స్త్రీలు ఈ విషయంలో శ్రద్ధవహించాలని మాడలీన్ ఓహెయిర్ (U.S A) అభిప్రాయం వెలిబుచ్చింది.[1]

క్రైస్తవం స్త్రీలకు ఏమి ఒనగూర్చించి? అనేప్రశ్న వేసుకొని 'పురుషుడకి స్త్రీని బానిసను చేసింది' అని సమాధానం చెప్పుకున్నాడు అగస్టు బెబేల్.[2]

స్త్రీకి ఆత్మ ఉన్నదా లేదా అని విచారణ చేసేదాకా వెళ్ళారు క్రైస్తవ మతగురువులు. చివరకు మతసంబంధమైన 1895 మెథాడిస్టు మహాసభలో స్త్రీలను పాల్గొననివ్వలేదు.[3]

'స్త్రీత్వం కొనసాగించబడిన శైశవం' అనేదాకా ఆగస్టు కామ్టే వెళ్ళాడు.[4]

"నేను పెళ్ళి చేసుకోదలిస్తే రాతిలోనుంచి విధేయుత కల స్త్రీని సృష్టిస్తాను. ఎందుకంటే స్త్రీలలో విధేయత ఉంటుందనే ఆశ నాకులేదు" అని ప్రొటెస్టెండు మతశాఖకు స్థాపకుడయిన లూథర్ అన్నాడు.[5]

"ప్రపంచంలో నైతికాభివృద్ధికి క్రైస్తవమతం, క్రైస్తవ చర్చి ప్రధాన శత్రువులు" అని సుప్రసిద్ధ తత్వవేత్త బెర్ట్రాండ్ రసెల్ అభిప్రాయ ప్రకటన చేశారు.[6]

"ప్రపంచంలోని బాధలన్నీ భార్యలు, తల్లులు, కుమార్తెలు భరించారు."[7]

"తమ హక్కుల పత్రంగా స్త్రీ బైబిలును పరిగణించినంత కాలం ఆమె పురుషునికి బానిసగా ఉంటుంది. బైబిలును స్త్రీ రాయలేదు. దాంట్లో ఆమెను అవమానించడం, సిగ్గుపరచటం తప్ప మరేమీలేదు. ఆమె పురుషుని ఆస్తిగా పరిగణింపబడింది." అని సుప్రసిద్ధ స్వేచ్ఛా భావుకుడు రాబర్ట్ ఇంగర్ సాల్ (అమెరికా) చెప్పాడు.[8]

"క్రీ. శ. మొదటి శతాబ్దంలో క్రైస్తవ సాహిత్యంలో స్త్రీ పట్ల చూపినంత నీచభావన మరే ప్రపంచ సాహిత్యంలోనూ కనపడదు. తొలి శతాబ్దాల్లో బీజాలు వేసి పెంచిన స్త్రీలపట్ల చులకన భావం ఇంత అభివృది

జరిగినా క్రైస్తవుల మనస్సులలోనుండి తొలగిపోలేదు.''[9] అని ఛాప్‌మాన్ కోహెన్ వ్రాశాడు

"హిట్లర్ కాలంవరకు లూథరన్ చర్చిలు సామాజిక న్యాయంకోసం పోరాడలేదు. చర్చి పూజావిధానంలో హిట్లర్ జోక్యం కలుగజేసుకున్నపుడే లూథరన్ చర్చిలు ఎదురు తిరిగాయి."[10] అని హెక్టర్ హాటన్ అభిప్రాయం వెలిబుచ్చాడు.

'రోమను సామ్రాజ్యంలో తాము అనుభవించిన ఆస్తి హక్కును తిరిగి పొందడానికి స్త్రీలకు 2 వేల సంవత్సరాలు పట్టింది. క్రైస్తవ శాసనాల వల్లనే ఆమె ఆస్తి హక్కును పోగొట్టుకున్నది.''[11] అని వాగ్వాద నిపుణత గల ప్రఖ్యాత మార్గరెట్ నైట్ అన్నారు.

"యూదులు, క్రైస్తవులు ఇలా ప్రశ్నించుకోవలసి యున్నది. 20 వ శతాబ్దపు చివరిలో జీవిస్తున్న మనకు బైబిలు (సెక్స్ విషయమై) చెప్పే విషయాలు ప్రాముఖ్యత కలిగి ఉన్నాయా? వాటికి ఈనాడు అర్థం ఉన్నదా?....2, 3 వేల యేండ్లనాడు జీవించిన యూదాజాతి వారికి, క్రైస్తవులకు ఈనాడు మానవ దేహంపై పరిశోధనలు చేస్తున్నవారికన్న ఎక్కువ తెలుసునని భావించడానికి ఏది నన్ను ప్రోద్బలం చేస్తున్నది?" అని బైబిలులోని సెక్స్‌పై పరిశోధన చేసిన గేరాల్డ్ లారుఎ అంటున్నారు.[12]

"బైబిలు అనేక స్వభావాలు, లక్షణాలు కలిగి ఉంది. అనేకులు దానిని వ్రాశారు. కొంతమంది పేర్లు మనకు తెలిశాయి. మరికొంతమంది పేర్లు తెలియవు. దానిలో కవిత్వం, చరిత్ర, పుక్కిటిపురాణాలు, అభూత కల్పనలు, తత్వము, నీతి, భవిష్యద్దర్శనం, సామెతలు, మూఢవిశ్వాసాలు అన్నీ ఉన్నాయి. మంచీ, చెడూ, సుందరమూ, అసహ్యకరమూ, బర్బరత్వమూ, మార్దవమూ, అన్నీ అద్భుతంగా దాని పుటలలో కలగాపులగం అయినాయి. అవి చాల పెద్దపుస్తకం. అందుకని దానిని విమర్శించకుండా చదువుతారు. దానికి విషయదర్పణం లేదు. అందుకే

ఈ పుస్తకాన్ని తయారుచేసాము. ఇది స్వేచ్ఛాభావులకే కాక సత్యాన్వేషణాసక్తి కల క్రైస్తవులకు కూడా ఉపకరిస్తుంది" అని బైబిల్ హాండ్ బుక్ 1900 'ఎడిషన్' కు ఉపోద్ఘాతంలో జి. డబ్ల్యూ ఫూట్ వ్రాశాడు.[13]

ఈ పుస్తకం 1885 లో వ్రాయబడినది. దీనిలో బైబిలులోని వ్యాఘాతాలు, అసబద్ధాలు, ఘోర అన్యాయాలు, ఫలించని జోస్యాలు, అవినీతి వాక్యాలు, అసత్య ప్రకటనలు, అశ్లీల పదాలు అన్నీ వర్గీకరణ చేసి పేర్కొనబడ్డాయి. ఈ పుస్తకం చదివితే క్రైస్తవంలో స్త్రీలస్థానం ఎంత ఘోరమో తెలుస్తుంది.

'నేను ఎందుకు క్రైస్తవుడిని కాదు' అని బెర్ట్రాండ్ రసెల్ 1927 లో ఇచ్చిన ఉపన్యాసంలో ఇలా అన్నాడు. "ఏసు యొక్క నైతిక శీలంలో ఒకలోపం ఉన్నది. ఆయనకు నరకంలో నమ్మకమున్నది. శాశ్వత శిక్షగా నరకానికి పోతారని శాపాలు పెట్టేవాడు. తన బోధనలను వినని వారిని ఎంతో ద్వేషంతో కోపంతో నిందించిన సంఘటనలు ఉన్నాయి. సోక్రటీసు తన వాదనను అంగీకరించని వారిని ఎంతో మర్యాదగా చూచేవాడు.........సువార్తలలో "ఓ సర్పాల్లారా!" అనే సంబోధన కన్పడుతుంది......పరిశుద్ధాత్మకు వ్యతిరేకంగా ఎవరు ప్రసంగిస్తే వారు ఈ లోకంలో గాని పరలోకంలో గాని క్షమించబడరు. అనే వాక్యం ప్రపంచంలో ఎంతో దుఃఖాన్ని, బాధను సృష్టించింది."[14]

ఆయన ఇంకా ఇలా అన్నారు.

"క్రైస్తవమతాన్ని ప్రజలు పూర్తిగా నమ్మి ఆచరించిన రోజుల్లో, విశ్వాసయుగాలుగా అభివర్ణించబడిన కాలంలో సంశయాత్ములను క్రూర హింసల పాల్జేయడం జరిగింది; అనేకమంది స్త్రీలను మంత్రకత్తెలని పేరు పెట్టి తగలేశారు; అనేక వర్గాల ప్రజలపై అన్నిరకాల క్రూరత్వ హింస ప్రదర్శింపబడినాయి."[15] (వక్కాణింపు రచయితది)

"మీ చుట్టూ ప్రపంచాన్ని ఒకసారి కలయచూడండి. మానవత్వ ఉద్వేగంలో మెరుగుదలను, శిక్షాస్మృతిలో అభివృద్ధిని, యుద్ధప్రమాదాన్ని తగ్గించే ప్రయత్నాన్ని, రంగుజాతులను సరిగా చూడటాన్ని, బానిసత్వ నిర్మూలనను, నైతిక ప్రగతిని వీటన్నింటిలో ఏ మాత్రం కృషి, ఏ చిన్న అడుగు వేసినా సంఘటితమైన మతాలు వ్యతిరేకిస్తూ వచ్చాయి, క్రైస్తవ మతమూ, దాని సంఘటిత చర్చిలు, ప్రపంచంలో నైతికాభివృద్ధికి ప్రధాన శత్రువులని నేను ఆలోచనా పూర్వకంగా ప్రకటిస్తున్నాను"[16]

ఇది అషామాషీగా చెప్పినమాట కాదు. ఒక పండితుడు, ఒక మేధావి, ఒక తత్వవేత్త, మానవాభ్యుదయంకోసం అహరహాలు శ్రమించిన మహావ్యక్తి, మారణాయుధాల వ్యాప్తిని అరికట్టే ప్రయత్నంలో 85 వ ఏట కారాగారానికి వెళ్ళటానికి సాహసించిన మనీషి మానవవాది రసెల్ పలికిన వాక్యాలు.

క్రైస్తవ మతాన్ని పొగుడుతూ తన గ్రంథంలో వ్రాసిన కెన్నెత్ బార్నెస్ ఇలా అంగీకరించక తప్పలేదు. "క్రైస్తవం సెక్స్‌ను అశ్లీలం నుండి నైతిక పతనం నుండి రక్షించింది.....కాని ఒక విషయం ఇప్పుడే అంగీకరించక తప్పదు. దేనిని గురించి క్రైస్తవ చర్చి వ్యాకులపడి పోరాడిందో దానిని గురించి చర్చి భయపడసాగింది. చర్చి సభ్యులు సెక్సులో ఉన్న మౌలిక తత్వాన్ని అపనమ్మకంతో చూచారు. దానిని చూచి భయోత్పాతం చెందారు. అందువల్ల సెక్స్‌కు వారు సక్రమ స్థానం ఇవ్వలేకపోయారు సరిగా సెక్స్‌ను వాడుకోలేకపోయారు."[17] సెక్సును చూచి భయపడే వ్యక్తులు, భయపడే మతం స్త్రీని అసహ్యించుకొని, ద్వేషించక తప్పదు కదా!

ఇటీవల మరోవాదం తలెత్తుతున్నది. క్రైస్తవ మతంలో జరిగిన క్రూరహింసలూ, అన్యాయాలు నిసలైన క్రైస్తవులు అసహ్యించుకునేవి. అసలైన క్రైస్తవం వేరే ఉంది. వారు ఇలా అంటారు :- "కొన్ని శాఖలలో, కొన్ని దశలలో క్రైస్తవ చర్చియొక్క చర్యలు క్రైస్తవ

మతానికి (సిసలైన క్రైస్తవానికి) తగినట్లుగా లేవనేది సంపూర్ణ సత్యం. క్రైస్తవచర్చిలో సభ్యులముగా చిత్రించుకునే మాబోటివారము చాలమందికి వాటి విషయం తెలుసును; వాటిని తీవ్రంగా విమర్శిస్తున్నాం.

తమ భయాన్ని, క్రౌర్యాన్ని, నైచ్యాన్ని పోగొట్టుకోలేక, వాటికి నివారణోపాయాలను కనుగొనలేక, మానసిక రుగ్మతతో బాధపడి దానిని వైపరీత్యంగా చేసుకొని, ద్వేషాన్ని, ఇతరులను హింసించే మనస్తత్వాన్ని ప్రదర్శించి ఇతరులకు బాధ, వ్యధ కలిగించిన వారి చర్యలవల్ల మతం తీవ్రంగా దెబ్బతిన్నది. వారు క్రైస్తవాన్ని తల్లకిందులు చేశారు. నేను 'ఇన్క్విజిషన్' ను (మతశాసనాలను సందేహించిన వారిని శిక్షించుట) గురించి, కాథలిక్, ప్రొటెస్టెంటు, కాల్వినిస్ట్ ఘోర దుర్మార్గాలను గురించి మాత్రమే మాట్లాడటం లేదు. సుసంపన్న జీవితాన్ని తిరస్కరించే ప్యూరిటన్ నీతి బోధకులను గురించి కూడా ఆలోచిస్తున్నాము."[18]

ఇలా క్రైస్తవ మతావలంబులమని బాహాటంగా చెప్పుకునే వారే క్రైస్తవ చర్చి చేసిన చర్యలకు సిగ్గుపడుతున్నారు. కాని అసలు ప్రశ్న యేమంటే సెక్సును అసహ్యించుకున్నవారు ('మతాన్ని అపభ్రంశం చేసిన వారు') ఏ మౌలిక సూత్రం నుండి వారి సిద్ధాంతాలను వెలికి తీశారో ఆ మౌలిక సూత్రాన్ని అంటే స్త్రీ పురుషుల అసమానతను ఈనయా క్రైస్తవులు (పరిశుద్ధ క్రైస్తవులు) కాదనడంలేదు. ఇక్కడే ఉంది అసలు పరీక్ష.

"బానిసత్వము నుండి విమోచన, స్త్రీ స్వేచ్ఛ, ఫ్యాక్టరీలో కార్మికుల స్థితిగతుల మెరుగుదల వీటికోసం గత శతాబ్దిలో ప్రజలు పోరాటాలు సాగించారు. వాటికి క్రైస్తవ చర్చి ఏ మాత్రము సాయపడలేదు."[19] అనే అభిప్రాయాన్ని మార్గరెట్ నైటు వెలిబుచ్చింది.

ఆమెయే ఇలాకూడ అంది :

"క్రీస్తు బ్రహ్మచారి. లైంగిక ప్రేమ దేవునికి అయిష్టమని ఆయన భావించాడు.....పౌలులో ఈ వైఖరి మరింత తీవ్రరూపం దాల్చింది.

ఈ వైఖరివల్ల క్రైస్తవంలో మానసిక వైపరీత్యాన్ని, తనను కష్టపెట్టుకునే స్వభావాన్ని ప్రవేశపెట్టింది."[20]

వాస్తవాలు ఇలా ఉన్నా బిషప్ పుష్పనాథంగారు తమ పుస్తకం 'అవతారమూర్తి' లో ఇలా వ్రాస్తున్నారు: "ఓసారి ఈ గ్రంధరాజాన్ని విప్పి చదివినవారు విడువలేరు"[21] నిజమే! దాంట్లో స్త్రీకి జరిగిన అన్యాయాన్ని ఒకసారి గమనిస్తే ఇంకెన్ని ఘోరాలు జరిగాయో తెలిసికోవటానికి చదవాలి కదా!

"ఏ కుటుంబమైతే ఈ గ్రంధం నియమాలను అనుసరించునో ఆ కుటుంబం అన్నివిధాల అభివృద్ధి పొందుతుంది."[22] అవును. పాత నిబంధనను అనుసరిస్తే నేరస్తుడవుతాడని క్రొత్త నిబంధన నియమాలను పాటిస్తే మానసిక వైపరీత్యాలకు లోనవుతాడని బెర్ట్రాండ్ రసెల్ చెప్పిన మాట గుర్తుకు వస్తుంది.

ఇంత పట్టుపలగా విషయాన్ని అధ్యయనం చేసిన తరువాత కాస్త హాస్య సన్నివేశాలు ఉండాలి. లేకపోతే జీవితం దుర్భరమవుతుంది. విన్నారా లేక చదివారా? "ఛార్లెస్ డార్విన్ తన అత్యదశలో బైబిలును రాజగ్రంధమని పిలిచాడు."[23] "నికిటాకృశ్చేవ్ 'ఏసుక్రీస్తు నా రక్షకుడు' అని చెప్పినాడు."[24] మావో జన కుమారులు చనిపోవుట తన చర్యలకు కఠిన శిక్షయని' చెప్పాడు."[25] ఇవన్నీ బిషప్ పుష్పనాథంగారి రాతలు సుమా! ఇలా వచ్చి అబద్ధాలు రాయటం మతస్తులకు అలవాటే. ఇది మామూలు పద్ధతియే విశ్వాసులకు. ఇది వారి ప్రచార సరళి!

స్త్రీ విమోచన కార్యకర్తలు క్రైస్తవమత శాస్త్రంలో ముక్తికోసం అన్వేషించటం వృధా.[26] మానవశాస్త్రాన్ని, చరిత్రనూ, మానసిక శాస్త్రాన్ని, సామాజిక శాస్త్రాన్ని, నీతిశాస్త్రాన్ని అధ్యయనం చేసి వివేచన పెరచుకొని సత్యాన్వేషణాదృష్టి, తోటిమానవులయెడ సానుభూతి కరుణలు, జ్ఞానమూ వీటిని సంతరించుకొని భావవిప్లవానికి కృషి చేస్తూ స్త్రీలు పురోగమించిననాడే అంటే ఆ ప్రయత్నంలో క్రైస్తవ మతపు మౌలిక భావనయైన పురుషాధిపత్యాన్ని పితృస్వామ్యాన్ని, మహిళలు తిరస్కరించిన నాడే స్త్రీలకు విముక్తి, స్వేచ్ఛ లభిస్తాయి.

13 వ అధ్యాయం : రిఫరెన్సులు

1 స్త్రీ విమోచన నాస్తికత్వం (వుమెన్ అండ్ ఎథియిజం) మాడలీన్ ఓ హెయిర్ : పుటలు 34, 71

2. 'వుమెన్ ఇన్ ది పాస్ట్, ప్రెజెంట్, అండ్ ఫ్యూచర్' : ఆగస్టు బెబెల్.

3. 'క్రైస్తవం : స్త్రీలు' ఛాప్‌మన్ కోహెన్

4. 'స్టేటస్ ఆఫ్ ఉమన్' (వాట్ హ్యూమనిజం ఈజ్ ఎబౌట్ : కిట్ మౌఎట్

5. ,,

6. ,,

7. పుట 107 కొటేషన్సు గ్రంథం రాబర్ట్ ఇంగర్‌సాల్ సంకలనం రోజర్ శ్రీలీ

8. పుట 108 ,,

9. పుట 11 క్రిష్టియానిటీ అండ్ ఎథిక్స్ : చాప్‌మన్ కోహెన్

10. 'చరిత్రలో క్రైస్తవం' ('కాంట్రవర్సీ' : హెక్టర్ హాటన్)

11. 'పొజిషన్ ఆఫ్ వుమెన్' (అనెస్టు ఉమాన్ : మార్గరెట్ నైట్)

12. పుట 12 'సెక్స్ అండ్ బైబిలు' : గెరాల్డ్ లారూఏ (అమెరికా)

13. పుట V ఉపోద్ఘాతం 'బైబిలు హాండ్ బుక్' సంకలనం : జి. డబ్ల్యూ ఫూట్ (1961)

14. వై ఐయామ్ నాట్ ఎ క్రిష్టియన్ : బెర్‌ట్రాండు రసెల్ (అన్ విన్ బుక్స్ 1967) పుట 22

15. పుట 24 ,,

16. పుట 24, 25 ,,

17 పుటలు 102, 103, 'హి అండ్ షి'. కెన్నెత్ సి బార్నెస్
(పైన్‌గ్విన్ పుస్తకం 1963)

18 పుట 194 ,,

19. పుట 7 'క్రిస్టియానిటీ ది డెబిట్ అకౌంటు'
మార్గరెట్ నైట్

20. పుటలు 6, 7 ,,

21. పుట 353 'అవతారమూర్తి బిషప్'
పుష్పనాధం.

22 పుట 353 ,,

23 పుట 353 ,,

24. పుట 354 ,,

25. పుట 354 ,,

26. 'వుమెన్ అండ్ ఎధియిజం' పుట 21

పరిశీలించిన గ్రంధాలు

1. A Bill of sexual Rights & Responsibilities.
2. Sex Laws in England.
3. Humanism & Women. Kit Mouat.
4. Bringing up Children in a Humantist Home. Lady Fleming
5. 'Status of women' Chapter in 'What Humanism is about' Kit Mouat.
6. Humanist frame. 'Love in a Humanist frame' by Morton M Hunt.
7. Pioneers of Social Change by E. Royston pike.
8. The Humanist Revolution. Hector Hawton
9. Mao's Sayings
10. The Invisible woman 14/7/80 on the eve of UN Conference.
11. Bible Old Testament.
12. Bible New Testament.
13. Women and Christianity. Chopman CoLen.
14. Women & Atheism. The Ultimate Liberation. Madalyn Murray O' Hair.
15. Christianity & Debit Account. Margaret Knight.
16. Sex and Bible — Gerald Larue (1983)
17. Avataramurty — Bishop Pushpanadham.
18. The Christian Family. Adult Bible Studies (1976) Christian Education Department of the Evangelical Fellowship of India.
19. 'Inger Soll Immortal Infidel' Edited By Roger E. Greely (1977)
20. Christianity and Ethics. Chapman Cohen

21. How the Bible puts women in her place by Marril Holste. (American Atheist Vol 25 No. 2 Feb 1983) P O. Box. 2117. Austin Texas (USA)
22. Sex, Love & Marriage.
23. The Position of women - Chapter XVI : "Honest to man' by Margaret Knight
24. 'He and She' — Kenneth C. Barness.
25. 'Christianity in History' — in Hector Hawton. 'Controversey'
26. Humanism & Sex — Chapter 9 in 'The Humanist Revolution' by Hector Hawton.
27. Women in Past, Present and Future. August Bebel.
28. The new wedding : Khoren Arisian
29. Why I am not a Christian : Bertrend Russel. (Indian Secular Society)
30. Christ and Chrishna : Edamaruku (Indian Atheist Publishers).
31. Rome or Reason : R. G. Ingersoll
32. 'The Bible Hand book' Edited by G. W. Foote & W. P. Ball (The Pioneer press) London.
33. Indian Divorce Act 1869.
34. Indian Christian Marriage Act.
35. The Married Women's Property Act.